NPROTOTYPE

హిందూయుగము

భారత రాజకీయ సంస్కృతిక చరిత్ర



ü

NPR01G421

హిందూ యుగము

(భారత రాజకీయ సంస్కృతిక చరిత్ర)

గ్రంథకర్త
సాహిత్య సుధాకర
శ్రీ తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులు
ఎం. ఏ. (సంస్కృతం) ఎం. ఏ. (చరిత్ర. సంస్కృతి)
లెక్చరర్ : సి. యస్. ఆర్. యస్. కాలేజి. ఒంగోలు.

కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామస్థులు,
చిగురుపాటి బుచ్చిగాందర్భ గారు,
డా॥ చంద్రశేఖర్ గారు
బహూకరించిన పుస్తకం

కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్
గ్రంథ ప్రకాశకులు : : రాజమహేంద్రవరము

112

సర్వస్వామ్యము ఆ
గ్రంథప్రకాశకులవి
ప్రథమసంస్కరణ
26 జనవరి 1958
అచ్చు: రాజేశ్వరి ప్రెస్
రాజమహేంద్రవరం

934
S, 105 — 2 (1)
8855

మూల్యం 8 రూపాయలు

*

నా సహపాఠి మిత్రుడు, విద్యాశాఖామాత్యుడు

మాన్యశ్రీ బలుసు ప్రభాకర పట్టాభిరామారావుగారికి

ఆదరానురాగములతో అంకితము

*

సంపాదకీయం

భారతదేశ చరిత్ర—రాజకీయ, సంస్కృతిక, సాంఘిక చరిత్ర సంబంధించిన కొన్ని గ్రంధాలు వెలువరించాలని మేము చాలాకాలం నుంచీ ఉద్దేశిస్తోన్నాము. దాని ఫలితమే ఈ " హిందూయుగం " యీవిధంగానే భారతదేశ రాజకీయ, సంస్కృతిక చరిత్ర కొన్ని సంపుటాలలో వరసగా వెలువరించుటకు సంకల్పించాము. తెలుగులో ఇలాంటి ప్రయత్నం జరగడం ఇదే మొదలు, ఈ మా ఉద్దేశాన్ని విన్నదే, తడువుగా మిత్రులు శ్రీ తల్లావజ్ఝల కృత్తివాస తీర్థులుగారు, తమకు ఇతరత్రా కార్యక్రమాలు ఎన్ని వున్నప్పటికీ, ఈ హిందూ యుగాన్ని రచన కావించి యిచ్చినందుకు కృతజ్ఞులం. మిగతా చరిత్ర విషయంకూడా పరిశోధించి త్వరలోనే రచన చేసి ప్రచురణ కందచేస్తారని ఆశిస్తోన్నాము.

పోతే ఈమా ప్రయత్న ఫలితాన్ని తేల్చవలసింది పఠితలోకం. ప్రోత్సహించవలసినది గ్రంధాలయాలు, విద్యాలయాలదీని. ఈ ద్వివిధ వర్గాలనుంచి మాకు ప్రోత్సాహం, సహకారం పుష్కలంగానే లభిస్తాయని తత్ ద్వారా ఈ బృహత్ ప్రయత్నం పరిపూర్ణంగా సాధించగలమని ఆశిస్తున్నాము.

ఇట్లు,

ప్రకాశకులు.

రెండు మాటలు

ప్రాచీన భారతేతిహాస సంస్కృతులంటే నాకు గాఢాభిమానం. కాశీలో హిందూ విశ్వవిద్యాలయంలోనూ, మద్రాసు విశ్వవిద్యాలయంలోనూ, వేటపాలెంలో సారస్వత నికేతనంలోనూ ముద్రిత ముద్రిత గ్రంధజాలం పరిశీలించి, సాధ్యమైనంతవరకూ ప్రమాణ బద్ధంగా రచన చేసినాను. ప్రతి భారతీయుడు భారతీయ విజ్ఞానాన్ని గ్రహించవలసిన ఆవశ్యకత వున్నది. అంచరికీ అందుబాటులో వుండే తీరులో సరళశైలి అవలంబించినాను. ఈ "హిందూ యుగం" లో ముద్రారాక్షసాలు అనివార్యమైనాయి. ద్వితీయ ముద్రణలో స్ఖాలిత్యాలు సవరించుకోవలసి వుంటుంది. నా మిత్రులూ సహపాఠులైన మాన్యశ్రీ బలుసు పట్టాభిరామారావుగారికీ ఇతిహాస గ్రంధాన్ని అంకితము చేస్తున్నాను. వారందుకు అంగీకరించినందుకు నా కృతజ్ఞత. ఈ పుస్తకరచనకు కారకులు కాళహస్తి తమ్మారావు అండ్ సన్సు వారికి నాసంతోషం ప్రకటించు కొంటున్నాను. ఇలాగే ప్రాచీనేతిహాస సంస్కృతులకు సంబంధించిన పుస్తకాలు, ప్రతిమా శిల్పాది గ్రంధాలనేకం ప్రచురించాలనే వారి కృతసంకల్పం సాహసో పేతమైనదీ ప్రశంసమైనదనిన్నీ నిస్సందేహంగా చెప్పవచ్చును.

పి. యస్. ఆర్. శర్మ
కళాశాల, ఒంగోలు

తల్లావజ్ఝుల కృత్తివాసతీర్థులు,
ఇతిహాస సంస్కృతశాఖ.

విషయ సూచిక

హిందూయుగము

నెం	విషయం	పుట
1.	భారతేతిహాసానికి ఆధారాలు	1
2.	పురాతత్త్వము	5
3.	చరిత్ర-భూగోళ ప్రభావము	8
4.	చరిత్రకు పూర్వం	13
5.	జాతులు-సంస్కృతి	14
6.	ద్రావిడార్య సమన్వయము	20
7.	సప్తసింధు నాగరకత	23
8.	పట్టణము	27
9.	సాంఘిక జీవితము	30
10.	వృత్తులు	33
11.	సింధులోయలో మతము	36
12.	సింధులోయలో చిత్రలిపి	38
13.	ఆర్య సమస్య	42
14.	ఆర్యుల స్థావరాలు	52
15.	పరీక్షితుని సింహాసనారోహణంవరకూ సాంప్రదాయక చరిత్ర	61
16.	కృష్ణచరిత్ర	79
17.	మహాభారతయుద్ధము	83
18.	పరీక్షితుని సింహాసనారోహణం	88
19.	భారతయుద్ధానంతర రాజ్యాలు	93
20.	ఋగ్వేద సంహితాకాలము	97
21.	ఋగ్వేద సంహితాకాలంలో సాంఘికస్థితి	106

22.	ఆనంతర సంహితాకాలము	121
23.	బ్రాహ్మణములు సాహిత్యము	124
24.	మతము తత్త్వము	126
25.	సామవేద యజుర్వేద సంహితాబ్రాహ్మణాలు	128
26.	సాంఘికస్థితిగతులు	132
27.	రాజనీతి	141
28.	ఉపనిషత్పూర్వకాలము	148
29.	ఉపనిషత్తులు — సూత్రములు	153
30.	సాంఘికస్థితి	160

మౌర్యయుగము

31.	సామ్రాజ్యము — ఏకత్వము	175
32.	షోడషమహాజనపదాలు	178
33.	మగధసామ్రాజ్యోదయము	186
34.	నందులు	197
35.	వైదేశిక దండయాత్రలు	201
36.	అలెగ్జాండరు దండయాత్ర	203
37.	యవనదండయాత్ర — సింహావలోకనం	211
38.	చంద్రగుప్తుడు — మౌర్యసామ్రాజ్యము	213
39.	పరిపాలనావిధానం — వికేంద్రీకరణం	221
40.	బిందుసారుడు	225
41.	అశోకుడు	228
42.	పదునాలుగు శిలాలేఖనాలలోని సారము	242
43.	మౌర్యసామ్రాజ్యపతనం	246
44.	మాళవికాగ్నిమిత్రంవల్ల తెలియవచ్చే చరిత్ర	247
45.	భారతదేశంలో యవనులు	252
46.	బాక్ట్రియన్ గ్రీకులు	259
47.	శకపహ్లవులు	262
48.	కొత్త పకుటుంబాలు	268
49.	కుషాణులు	269

50.	కనిష్కుడు	272
51.	కుషాణుల తరువాత గణరాజ్యాలు	278
52.	పశ్చిమభారతదేశానశకక్షత్రపులు	280
53.	రుద్రదమనుడు	285
54.	ఆంధ్రశాతవాహనులు	288
55.	శాతవాహనోదయము	292
56.	ఆంధ్రులు—ఆరంభవికాశములు	294
57.	కళింగములోచేది (మహామేఘవాహనవంశం)	306
58.	శాతవాహనుల అనంతరం దక్షిణాపథరాజ్యాలు	309
59.	ఇక్ష్వాకులు	311
60.	సంస్కృతభాష—వాఙ్మయము	318
61.	మతము—తత్త్వము	332
62.	బౌద్ధమతచరిత్ర	336
63.	శిల్పము	341
64.	దక్షిణద్వారము	353

గుప్తయుగము

65.	గుప్తయుగము	370
66.	దక్షిణాపథ రాజకీయచరిత్ర	397
67.	విష్ణుకుండిన రాజవంశము	405
68.	వాకాటకులు	414
69.	కదంబులు	417
70.	త్రైకూటకవంశము	418
71.	రాష్ట్రకూటులు	462

హిందూ మహాయుగం
రాజకీయ సంస్కృతీ చరిత్ర

భారతేతిహాసానికి ఆధారాలు

మానవునికి విజ్ఞానం వికాసం కలిగించే గ్రంథజాలం భారత దేశంలో అపారంగావుంది. సాహిత్యం, లలితకళలు, శాస్త్ర గ్రంథాలు అపరిమితంగావున్నా, వైదికయుగంలో చారిత్రక గ్రంథాలు లేవని చెప్పవలసివస్తుంది. చారిత్రకదృష్టి ప్రాచీనులలో లేదని చెప్పకతప్పదు.

అద్భుత సాహిత్య సృష్టి చేసిన కవులు దూరదృష్టి కలవారు. చారిత్రకదృష్టి కొంతవరకు వున్నదనడానికి వైదిక గ్రంథాలే చాలు. ఈ వైదిక వాఙ్మయంలో ఉపదేష్టలైన వారిపేర్లు పొందుపరచబడినవి. జైన బౌద్ధమత గ్రంథాల్లో కూడా గురువుల నామములు ఉల్లేఖింపబడినవి. ఈ చారిత్రక దృష్టి రాజకీయరంగంలోకూడా కనబడుతుంది. వైదిక సాహిత్యంలో రాజులనూ, నాయకులనూ గేయచ్ఛందో రూపంలో చేసిన స్తవములు కనబడుచున్నవి. క్రీ. శ. సప్తమ శతాబ్దిలో హ్యూయాన్‌సాంగ్ తన గ్రంథంలో భారత

దేశంలో ప్రతిరాష్ట్రంలో శుభాశుభ వృత్తాంతాలూ, సంఘటనలూ పొందుపరిచేనిమిత్తం ప్రత్యేకంగా ఉద్యోగి వుండేవాడని ప్రాసినాడు. ప్రాచీన దానశాసనాలు శైశీ యతులూ రాజకుటుంబాల చరిత్రనూ వంశావళినీ విశదీక రిస్తున్నవి.

ప్రాచీనులలో చారిత్రక దృక్పథంలేదనీ, ఇతిహాసిక గ్రంథాలు లేవనడం సమంజసంకాదు. ప్రత్యేకంగా చారిత్రక గ్రంథాలు లేకపోయినా సాహిత్యాది గ్రంథసముదాయాన్ని పరిశీలిస్తే చారిత్రకాధారాలు లభ్యమౌతున్నవి. పురాణాల్లో భారతాది గ్రంథాల్లో వంశచరిత్రలెన్నో లభిస్తున్నవి. ప్రతి వంశానికీ మూలపురుషుడు మానవాతీతుడై ఉంటాడు. పురాణాన్ని మొత్తంమీద ఇతిహాసమనే చెప్పవలసి ఉంటుంది.

ఇతిహాసవేత్తలు పురాణాలనూ, బౌద్ధసాహిత్యాన్నీ పోల్చి పరిశీలించగా క్రీ. పూ. ఆరవ శతాబ్దినాటి రాజ వంశావళులు కొంచెమించుమించుగా ఒకేతీరుగా ఉన్నని. మొదట పురాణాలు పుక్కిటి పురాణాలని అన్నవారు పురాణాల్లో ఉల్లేఖింపబడిన రాజవంశ చరిత్రలు సరియైనవనీ నిర్ధారణచేశారు. మహాభారతంలో వర్ణితమయిన కురుపాండవ యుద్ధం క్రీస్తుపూర్వం 1500-1000 మధ్యలో జరిగివుంటుందని విజ్ఞులమతం. భారతేతిహాసానికి మహాభారత యుద్ధకాలం ముఖ్యాధారంగా చరిత్రవేత్తలు తలచినారు. భారతయుద్ధ కాలానికి పూర్వంనాటి రాజవంశావళులను గురించి పర్జీటర్

పండితుడు పరిశీలించి రాజకీయ చరిత్రను స్థూలంగా నిర్మించి నాడు. ఆయనరచన పరమప్రమాణంగా తీసికోడానికి వీలు లేదు. అయితే అంతకన్న పరిశోధన గాఢంగాచేసి స్ఫుటంగా రాజకీయచరిత్ర ఎవరూ రచన చేయకపోవడంవల్ల పర్షీటరునే కొంతవరకు ప్రమాణంగా తీసికోకతప్పదు. క్రీ. పూ. 6 వ శతాబ్దికి మనము వెళ్ళినప్పుడు స్పష్టమైన ఇతిహాసం లభ్య మవుతుంది. క్రీ. పూ. 6 వ శతాబ్దికి పూర్వచరిత్ర తెలిసికో డానికి పురాణాలు ఎక్కువగా మనకు తోడ్పడుతున్నవి. పురాణాల్లో జైన బౌద్ధ వాఙ్మయాల్లో, వ్యాకరణ గ్రంథాల్లో అంశాలను తులనాత్మకంగా పరిశీలించి సరియైన చరిత్రను గ్రహించగలము. పురాణోక్త విషయాలు సరియైనవి అవునో కావో నిరూపణ చేయడానికి జైన బౌద్ధ గ్రంథాలు బాగా ఉపకరిస్తవి.

గుప్తకాలీన చరిత్రను అవగతము చేసికోడానికి సాహిత్యము, జీవితచరిత్రలు, కైఫీయతులవంటివి ఉపయోగ పడతవి.

అదృష్టవశాన కొన్ని రచనలు చరిత్రకు ఆధారా లవుతున్నవి. సంస్కృత గద్యనిర్మాణ ధురీణుడైన బాణ భట్టు రచించిన హర్షచరితము ప్రసిద్ధము. కవీశ్వరులైన వాక్పతి, బిల్హణులు "గౌడవహో", "విక్రమాంకదేవ చరిత్ర" లలో యశోవర్మ, చాళుక్య విక్రమాదిత్యుల విజయ పరంపరలను వర్ణించినారు. జయసింహుని "కుమార

పాలచరితము", హేమచంద్రుని "ద్వ్యాశ్రయకావ్యము", నయచంద్రుని "హమ్మీరకావ్యము", పద్మగుప్తుని "నవ సాహసాంకచరిత్ర", భల్లాలసేనుని "భోజ ప్రబంధము", చంద్ బర్ డాయీ "పృథ్వీరాజ చరిత్రము" రాజుల జీవిత చరిత్రలకు సంబంధించినవై చరిత్రకు చాలా ఉపయోగ పడుతున్నవి. ఈ గ్రంథాల్లో రాజప్రశంస బహుళంగావున్నా చారిత్రక విషయాలు చాలావున్నవి.

స్థానిక చరిత్రలలో కల్హణ కవికృత "రాజతరంగిణి" ప్రసిద్ధము. కాశ్మీరచరిత్ర ఇందులో వర్ణితమైనది. ఈ రచనకు ఆధారాలు నీలపురాణము, శాసనాలు, ప్రశస్తులూ అని కవే పేర్కొన్నాడు. అయితే కల్హణునికూడా పరమప్రమాణంగా స్వీకరించడానికి వీలుండదు. ప్రాచీనచరిత్ర అనగా క్రీ. శ. సప్తమ శతాబ్దికి పూర్వచరిత్ర సరిగా లేదు. క్రీ. శ. సప్తమ శతాబ్ది తరువాత కాశ్మీరచరిత్ర అవగతం చేసికోడానికి "రాజతరంగిణి" ఉపకరిస్తుంది. కల్హణునిపద్ధతిలో జోనరాజు రచన చేసినాడు. సోమేశ్వరుని "కీర్తికౌముది", అరి సింహుని "సుకృత సంకీర్తనము", మేరుతుంగుని "ప్రబంధ చింతామణి", రాజశేఖరుని "ప్రబంధకోశము", వస్తుపాల తేజపాల ప్రశస్తులలో ఉదయప్రభుని "సుకృతి కీర్తి కల్లోలిని" లో, బాలచంద్రుని "వసంత విలాసము" లో ఘూర్జరచరిత్ర ఉల్లేఖింపబడింది. నంశావళులవల్ల నేపాల చరిత్ర లభ్యమవుతున్నది.

పురాతత్త్వము

కేవలము సాహిత్యాధారాలమీద సమగ్రచరిత్ర లభ్యము కాదు. ప్రాచీన చరిత్రకు నాణెములు, శాసనములు, స్థూపాదులు చాలా సహాయకారులు. శాసనాలలోని బ్రహ్మ లిపిని చదివి చరిత్రకు మహోపకారము చేసినాడు ప్రిన్‌సెప్ పండితుడు. ఆయనవల్లనే భారతదేశంలో పురాతత్త్వశాఖ ఏర్పాటయింది. పరిశోధనలు కొనసాగినవి. అలెగ్జాండర్ కన్నింగ్‌హాం పండితుడు భారతీయ నాణెములనుగురించి చేసిన పరిశోధనలవల్ల చరిత్రం సమగ్రంగా లభ్యమవు తున్నది. కర్జన్ ప్రభువు సంస్కృతి విషయంలో శ్రద్ధాళువు కావడంవల్ల పురాతత్త్వశాఖకు ప్రోద్బలంయిచ్చి ప్రాచీన వస్తుసంచయాన్ని భద్రపరిచే ఏర్పాట్లు చేయించినాడు. డాక్టర్ మార్షలు పండితుని పరిశోధనల ఫలితంగా సప్త సింధు లోయలోని ద్రావిడ నాగరకత తెలియవచ్చింది. డాక్టర్ స్పూనర్ మహోదయుని గవేషణాఫలితంగా మౌర్య కాలీన ఇతిహాసం తెలియవచ్చింది. పాటలీపుత్రంలో 20 ఏళ్ళు ఆయన తవ్వకాలుసాగించి కఠోరపరిశ్రమ చేసినందువల్ల ప్రాచీనమైన పాటలీపుత్రనగరం మనకు గోచరమైనది. తక్ష శిలాప్రాంతంలో స్థూపాలు, నాణెములు, శిల్పఖండాలు చాలాలభ్యమై చరిత్ర రచనకు దోహదం ఇచ్చినవి. మధ్య భారతంలోని సాంచీప్రాంతమును మార్షలు పరిశోధన చేసి నాడు. తూర్పు తుర్కిస్థానంలో భారతీయ నాగరకతను

గూర్చి ఆర్. ఎల్. స్టీన్ చేసిన పరిశోధనలు అద్భుతాలు. ప్రాచీనచరిత్ర సమగ్రంగా గ్రహించేందుకు పురాతత్త్వము ముఖ్యము.

యాత్రికుల రచనలు పురాతన భారతేతిహాసానికి వైదేశికుల రచనలు ఉపయోగకరం. యవనులలో హెరొడోటస్ మెగస్తనీసుల గ్రంథాలు అమూల్యములైనా కొన్నిదోషాలు లేకపోలేదు. ఆ రచయితలు వైదేశికులు కావడమూ, మన ఆచారవ్యవహార సంప్రదాయాలు సమగ్రంగా గ్రహించేందుకు మనభాష వారికి రాకపోవడము లోపము. లోపాలున్నప్పటికీ వైదేశిక యాత్రికులు భారతదేశ పర్యటనంచేసి స్వయంగాచూచి తెలిసికొన్నవి గ్రంథస్థముచేసి భారతేతిహాసానికి మహోపకారము చేసినారు. ముఖ్యంగా ప్రాచీన భూగోళ వృత్తాంతానికి సంబంధించిన "పెరిప్లస్ ఆఫ్ ది ఇరిత్రెయన్ సీ" అమూల్యమైనది. పెరిప్లస్ అనే యవనుడు భారతదేశ సముద్రతీర సంచారంచేసి క్రీ. శ. 40 లో ఆనాటి నౌకాశ్రయాలు, వర్తక వ్యాపారాలనుగూర్చి వ్రాసినాడు. క్రీ. శ. రెండవశతాబ్దములో టాలెమీ శాస్త్రీయపద్ధతిలో పురాతన భారతీయ భూగోళశాస్త్ర రచన కావించినాడు. క్రీ. శ. ప్రథమ శతాబ్దములో ప్లినీ వనజంతు ధాతువర్గాల విషయం రచనచేసినాడు. ఈ వైదేశికుల యాత్రాగ్రంథాలు మెక్‌కండిల్ పండితుడు ఆంగ్లానువాదము చేసినాడు.

భారతదేశానికివచ్చిన చీనాయాత్రికులు గ్రంథరచన చేసినారు. క్రీ. శ. 5 వ శతాబ్దములో ఫాహియాన్, క్రీ. శ. 7 వ శతాబ్దంలో హ్యుయాన్ సాంగ్, ఇత్ సింగుల రచనల వల్ల భారతదేశములో బౌద్ధధర్మమూ, ప్రజాజీవితమూ కొంతవరకు తెలుస్తవి. ఈ యాత్రికులు ముగ్గురూ కొన్ని సంవత్సరాలపాటు మనదేశంలో సంచారంచేసి పాళీ సంస్కృత ప్రాకృతాది భాషలునేర్చి, బౌద్ధధర్మం సాకల్యంగాగ్రహించి గ్రంథరచన చేసినారు. హ్యుయాన్ సాంగ్ హర్షవర్ధనుడూ, అతని సమకాలికులనుగురించి తత్కాలీన రాజకీయ సాంఘిక స్థితిగతులనుగూర్చి రమణీయంగా వ్రాసినాడు. బౌద్ధధర్మం విపులంగా అవగాహన చేసికోడానికి చీనాయాత్రికుల రచనలు చదవడం అవసరం. వారిది బౌద్ధమతైకదృష్టి. అందుచేత భారతదేశచరిత్ర వారిగ్రంథాల్లో బహుముఖాలుగా గ్రహించలేము. క్రీ. శ. 8 వ శతాబ్దంనుంచీ మనదేశం అరబ్బులను ఆకర్షించింది. అరబ్బీవ్యాపారులు నావికులు మనకోస్తాకు రావడం, క్రమేణా సింధుప్రాంతం జయించడమూ సంభవించింది. మహమ్మద్ గజనీకి సమకాలికుడయిన ఆల్బరునీ ఆనాటిచరిత్ర లిఖించినాడు. అతడు భారతీయ విజ్ఞానాన్ని సంస్కృతభాషనేర్చి గ్రంథరచన చేసినాడు. దర్శనశాస్త్రాల్లో పాండిత్యం అలవరచుకొన్నాడు. సాహిత్యం మథించినాడు. స్వయంగా తాను చూచినదానికన్న, పుస్తకజన్య జ్ఞానంవల్ల గ్రంథము చేసినాడు. ఆ పుస్తకంలో ఉన్నలోటు ఒక్కటే.

రాజకీయ స్థితిగతులనుగూర్చి ఆయన ఉల్లేఖించకపోవడంచేత ఆ గ్రంథం సంపూర్ణంగా చరిత్రకాదు.

క్రీ. శ. 13 వ నాటి ముసల్మానుల పరిపాలనా విశేషాలు "తబఖాత్ ఏనాసిరీ" వల్ల గ్రహించవచ్చును. "తర్ఖ ఫిరూజ్‌షాహీ", "గుల్‌షాన్ ఏ ఇబ్రాహీమీ" (ఫెరిష్టారచన), "అయిన్ ఏ అక్బరీ", "అక్బర్‌నామా", "తబఖాత్ ఏ అక్బారీ", "ముంతఖబ్ ఉత్ తవారిఖ్" అనే చారిత్రక రచనలవల్ల మహమ్మదీయ, మొగలాయీల చరిత్ర విదితమవుతున్నది. మొగలాయీ చక్రవర్తుల స్వీయ చరిత్రలు మొగలాయీల చరిత్రకు మిక్కిలి ఉపయోగకరం. సాహిత్య గంథాలు, పురాతత్త్వ పరిశోధనలూ, వైదేశికుల రచనలూ కైఫీయతులూ సమగ్ర భారతచరిత్ర నిర్మాణమునకు ఉపకరించినవి.

చరిత్ర - భూగోళ ప్రభావము

<u>ప్రాంతీయత</u> ప్రపంచములో అనేక దేశాలవలెనే మన దేశచరిత్ర మీద భూగోళ ప్రభావమున్నది. భారతదేశంలో రకరకాల నైసర్గిక స్వరూపాలున్నవి. మనదేశము రష్యాను తీసివేయగా శేషించిన ఐరోపాఖండమంత విస్తీర్ణముకలది, భిన్నమైన నైసర్గిక స్వరూపముతోపాటు విభిన్నమైన శీతోష్ణస్థితులున్నవి. ఈ కారణాలవల్ల అనేక ప్రకృతి మండలాలతోపాటు మానవుల్లో ప్రాంతీయ స్వభావము, ప్రాంతీయ రాజకీయాలు, ప్రాంతీయ సంస్కృతులు కనవస్తున్నవి.

ప్రాంతీయత వున్నప్పటికీ, భిన్నత్వ మున్నప్పటికీ సాంస్కృతికంగా రాజకీయంగా ఏకత్వాన్ని మనవారు విస్మరించలేదు.

హిమాలయాలు గిరిసముద్రాది నైసర్గిక ప్రకృతివల్ల యావ ద్భారతదేశానికీ రక్షణ సమకూడినది. మనదేశానికి ఉత్తరాన హిమాలయాలు పెట్టనికోటలై ఉత్తరాసియానుంచి వీచే చలిగాలులను ఆపుతున్నవి. ఋుతుపవనాలను నిరోధించి వర్షపాతం కలుగచేస్తున్నవి. హిమాలయ పర్వతశ్రేణిలో హిమనదాలవల్ల గంగా సింధు బ్రహ్మపుత్రాది జీవనదు లుద్భవించినవి. అవి భారతదేశాన్ని సస్యశ్యామలంచేసి మానవకోటికి జీవనాధారమై భారతీయ నాగరకతకు కారణ మైనవి.

మండలాలు మనదేశాన్ని నైసర్గికంగా ఉత్తరభారతము, దక్కను పీఠభూమి, ద్వీపకల్పానికి ఇరువైపులా తీరప్రాంత మైదానములుగా విభజన చేయవచ్చును. ఈ నైసర్గిక మండలాల్లో ప్రత్యేక రాజకీయ సంస్కృతులు ఉద్భవమవుతూ వచ్చినవి. రాజకీయ చరిత్రలో ఈ మండలాలన్నింటినీ ఏక చ్ఛత్రంకిందికి తీసికొనివచ్చిన రాజవంశాలు లేకపోలేదు.

సంస్కృతి ఈ మండలాల్లో సంస్కృతి విశిష్టమైనది కాక పోయినా ఒకమండలానికీ మరొకమండలానికీ సంస్కృతిలో సాదృశ్యం కనవస్తుంది. వింధ్య ఉత్తరభాగంలో ఆర్యుల

నాగరకతా ప్రభావము నెలకొని ఆర్యేతర చిహ్నాలన్నింటినీ తుడిచివేసింది. దక్కనులోను, దక్షిణాపథంలో ప్రాక్ పశ్చిమ తీరాల్లో ఆర్యేతర భాషలున్నవి ఇప్పటికీ. ఆర్యేతరాచారాలు ఇప్పటికీ ఉన్నవి. అయితే దాక్షిణాత్య భాషల్లో ఆర్యభాషా శబ్దజాలము అమితంగా ఉన్నది. ఆర్యుల మతసాంఘిక భావాలు దక్షిణాపథంలో అనార్యతను పోగొట్టినవి.

దక్కనులో గోదావరి, కృష్ణ, కావేరీప్రాంతాల్లో యుగయుగాలనుంచీ మానవుడు ప్రత్యేక వ్యక్తిత్వము నిలుపు కొంటూ వచ్చినాడు. దానికి హేతువు నైసర్గిక మండలాలు.

<u>ప్రకృతి - అవరోధం</u> భారతదేశంలో రాజకీయంగా ఏకత్వభావన లేదనే సామాన్యదృష్టి ఉన్నది. ఈ దేశము అతివిశాలమై విభిన్న ప్రకృతి మండలాలతో కూడిఉండడంవల్ల ఏకత్వాన్ని సాధించడం ఎంత అసాధ్యమో తెలిసికోవచ్చును. విశాల రాజ్యాల్లో ప్రభుత్వం సుప్రతిష్ఠితంచేయడం బహుకష్టం. నైసర్గిక ప్రకృతి కలిగించే అవరోధాలను తొలగించడానికి నవీన శాస్త్రవిజ్ఞానం ప్రాచీనకాలంలో లేదు. ఉదాహరణకు చూడండి. రాజధానీనగరానికీ రాష్ట్రాలకూ గమనాగమన సౌకర్యాలు చాలతక్కువ. ఇప్పటివలె అతివేగంగా వార్తలు ప్రసారం కావడానికి ఏ రేడియోలూలేవు. రాష్ట్రాలలో పాలకులు కేంద్రప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ విప్లవం తెచ్చినా రాజధానికి కబురు త్వరగా చేరదు. ఇటువంటి నైసర్గిక ప్రకృతివల్ల అవరోధం ఏర్పడడంచేత సామ్రాజ్యాలు ఎక్కువ

కాలం మనలేవు, మౌర్యసామ్రాజ్యపు మనుగడ 137 సంవత్సరాలు మాత్రమే.

సామ్రాజ్యతృష్ణ భారతదేశం అతివిశాలం కావడంవల్లనూ, అన్య ప్రపంచముతో ఎక్కువ సంపర్కం లేకపోవడంవల్లనూ మన చక్రవర్తుల సామ్రాజ్యతృష్ణ దేశపు సరిహద్దులు దాటిపోలేదు. మౌర్యచంద్రగుప్త, సముద్రగుప్తాదుల రాజ్యకాంక్ష భారత సీమలు అతిక్రమించలేదు. అయితే రాజేంద్రచోళునివంటి చక్రవర్తి సముద్రంతరించి దేశాంతరంలో నిజప్రాభవం నెలకొల్పినాడు. ఇటువంటి తారాక్రమం ఎక్కువ చూపలేము.

భారతదేశపు తీరరేఖ ఎక్కువగా ఉండడంవల్ల వాణిజ్యానికి వీలుకలిగింది. నదీముఖద్వారముల సమీపంలో నౌకాశ్రయాలున్నవి. వర్తకానికీ రాకపోకలకూ దేవు పట్టణాలూ నదులూ ఉపకరిస్తున్నవి.

వాణిజ్యము వలసకు ప్రోద్బలమిచ్చింది. ప్రాగ్దేశాల్లో వలసలు చాలా ఏర్పడినవి. చోళులు సాహసించి భారత భూమినివిడిచి సముద్రాలుదాటి వలసలు సంపాదించినాడు.

వలస సంస్కృతీ వ్యాప్తికి మాతృదేశంలో జనసంఖ్య హెచ్చుకావడంవల్ల వత్తిడి తగ్గించడానికి ప్రభువులు వలసరాజ్యాలు సంపాదించలేదు. కేవల రాజ్యతృష్ణవల్లనూ సంపాదించలేదు. తమసంస్కృతిని దేశాంతరాలలో వ్యాప్తంచేయడానికి వలసలు అవసరమైనవి. అంతేకాని ఆర్థికంగా వలసలలో

ప్రజలను దోపిడీచేయవలెననే అభిప్రాయం ఆనాటి భారతీయ చక్రవర్తులకు లేదు.

ఎందుకువోటమి భారతదేశంలో అమగుపెట్టిన వైదేశికుల ధాటికి మనవారు పరాజితులయ్యేవారు. సామాన్యంగా అందరూ అనుకోడం ఏకత్వం లేకపోవడంచేత మనవారు వైదేశికులను ఎదుర్కొనలేక పోయేవారని. బాహ్యప్రపంచంతో సంబంధం తక్కువకావడంవల్ల భారతీయులకు వైదేశికుల యుద్ధతంత్రం సైనికవ్యూహారచనలు, నవీనయుద్ధపరికరాలు ఎటువంటివో తెలియవు. బాబరు మనదేశంలో చొరబడినప్పుడు మనవారికి నవీన మారణాయుధ ప్రయోగ చాకచక్యం తెలియదు. ఇటువంటి అజ్ఞానానికి కారణం కేవలం ప్రబలమైన నైసర్గిక ప్రకృతివల్ల భారతీయులలో యేర్పడిన ఏకాంత స్వభావమే కాదు. భారతప్రభువులు స్వదేశంవిడిచి విదేశాలు జయించాలనే వాంఛ లేకపోవడముకూడా ఒకకారణమే. తమలో తాము పోరాటాలు చేసికోడమేకాని దేశాంతర ఖండాన్తరాలలో ఏమి జరుగుతున్నదో వారికి తెలిసికోవలెననే కోరిక లేకపోయింది.

సంకుచితత్వం నైసర్గిక ప్రకృతి భారతీయ దృక్పథాన్ని సంకుచితము చేసిందేకాని వైదేశికుల ధాటిని అరికట్టలేకపోయింది. అన్యదేశీయులు భారతదేశంలో ప్రవేశించి భారతీయులవలెనే సంకుచితదృష్టి కలవారవ్రుతూ వచ్చినారు.

ఏకత్వం భారతీయుల్లో ఏకత్వము ఇటీవల ప్రబలిన భావమని పలువురు భావిస్తున్నారు. అది సత్యదూరము. ప్రాచీన కాలంలో భారతవర్షమనే *వ్యవహారంవుండేది. సాంస్కృతిక మయిన ఏకత్వముకూడా అశోకునికాలంలో గోచరిస్తుంది. ఆయన శాసనాలు లభ్యమవ్వతున్న ప్రదేశాలు ఏకభాష, ఏకలిపి ప్రజల వ్యవహారంలో క్రీ. పూ. మూడోశతాబ్దంలో ఉన్నట్టు ♦ బుజువు చేస్తున్నవి.

నెహ్రూ పండితుని వైదేశిక రాజనీతివల్ల నవీన భారతీయదృష్టి విశాలమై మానవతాపూర్ణమై సార్వజనీన మవుతున్నది. ఈ రాజకీయ దృక్పథము అశోకుని ఉన్నత రాజకీయ ధార్మికదృష్టిని మనకు జ్ఞప్తికి తెస్తున్నది.

చరిత్రకు పూర్వం

భారతదేశంలోకూడా అత్యంత ప్రాచీన మానవ నివాసా లున్నవని శాస్త్రవేత్తలు అంగీకరించినారు. తొల్లింటి మాన వునికథ చరిత్రకన్న మానవశాస్త్రానికి (Anthropology) సంబంధించినది. ఆదిమానవచరిత్ర అన్నిదావుల్లో ప్రపం చంలో ఒకతీరుగానే వుంటుంది. అయితే కొద్దిపాటి ప్రాంతీ యతకూడా వుంటుంది. చాలాకాలం గడిచిన తదుపరి మానవుడు పశువృక్షములమీద ఆధారపడినాడు. అతనికి

---

* విష్ణుపురాణం ii—3.1

♦ Vedic Age - Editer మున్షీ Vol I పుట 105, 106.

అగ్గిరాజేయడం తెలియదు. ప్రాచీన పాషాణయుగంలో మానవుడు స్ఫాటిక శిలాశకలాలను చెక్కి సుత్తెగానూ, కోయడానికీ చెక్కడానికి ఉపయోగపడే సాధనాలు చేసి కొన్నాడు. ఈ శిలాసాధనాలు నదిలోయల్లోనూ, పర్వత పార్శ్వములమీదనూ, చెంగల్పట్టు జిల్లాలోనూ లభ్య మవుతున్నవి.

తరువాతదశలో మానవుడు సువర్ణంతప్ప మిగత లోహాలు ఉపయోగించడం నేర్చినాడు. నూతన పాషాణ యుగంలో దైనం దినోపయోగానికి రాతితో సాధనాలు బాగాచేయడం నేర్చినాడు. ఈ నవీన పాషాణ యుగంనాటి మానవుని అభ్యుదయ చిహ్నాలు రకరకాలు అపరిమితంగా గోచరిస్తున్నవి. బళ్ళారిజిల్లాలో శిలాసాధనాలు ఎన్నో లభించినవి.

మానవుడు వ్యవసాయం నేర్వడంతో నాగరకుడైనాడు. యంత్రం ఉపయోగించడంనేర్చి అతిగా నాగరకుడైనాడు.

జాతులు - సంస్కృతి

భాష మనదేశంలో ప్రాచీన మానవుని అస్థిశేషాలు చరిత్రకు పూర్వం చరిత్రారంభమునాటివి లభ్యముకానందువల్ల ప్రాచీన జాతుల గమనాగమనాలు గ్రహించడం సులభంకాదు. ప్రస్తుతస్థితినిబట్టి ప్రాచీన మానవజాతిని ఊహచేయడానికి వీలున్నది. జాతి భాషకు పర్యాయపదముకాదు. అయితే

ఒక ప్రదేశంలో ఒక భాష మానవుల వ్యవహారంలో ఉన్న దంటే ఆ భాష వారి సంస్కారాన్ని చరిత్రకు పూర్వం తెలియచేస్తుంది. అయితే ప్రజాసంస్కృతిని తెలియచేసేది ప్రధానంగా భాషమాత్రమేకాదు.

మానవశాస్త్రం - మానవులు మానవజాతుల్లో శారీరక నిర్మాణ మునుబట్టి భేదం కనబడుతుంది. భారతీయ ప్రజలను మాన వాస్తి నిర్మాణ శాస్త్రరీత్యా సప్తవిధాలుగా విభజన చేయ వచ్చును. మంగోలీయ, హైందవార్య, ద్రావిడ, మంగోలీయ ద్రావిడ, ఆర్యద్రావిడ, శకద్రావిడ, తురుష్క- పారసీక మానవులని వేరువేరుగా చెప్పవచ్చును. హట్టన్ పండితుడు జాతి, భాష, సంస్కృతిబట్టి వేరొకరీతిగా మానవులను విభజించినాడు. ఆయనమతాన్నిబట్టి భారత దేశానికి ప్రాచీన మానవులు అన్యదేశాలనుండి వచ్చారని.

1. నెగ్రిటోలు :—వీరత్యంత ప్రాచీన మానవులు. ఆఫ్రికానుంచి వచ్చినారు. వీరిశిరసు చిన్నది. ప్రస్తుతము అండమాన్ ద్వీపంలో మలయా, అస్సాంప్రాంతాల్లో వీరు కనపడతారు.

2. ప్రోటో ఆస్ట్రలాయిడులు :—కృష్ణవర్ణులు, దీర్ఘ శిరము కలవారు. మధ్యధరా సముద్రానికి తూర్పునగల ప్రదేశం (అనగా ప్రస్తుత పాలస్తీనా) నుంచి వచ్చినవారు.

3. ప్రాచీన మధ్యధరా ప్రాంతీయులు :—దీర్ఘశిరము కలవారు. నాజూకయినవారు.

4. నాగరక మధ్యధరా ప్రాంతీయులు :—వీరిశిరమూ దీర్ఘము. నాజూకయినవారు. వీరే భారతదేశంలో ద్రావిడులు.

5. అర్మినోయిమలు :—వీరిశిరము చిన్నది. బహుశ నాగరకులయిన మధ్యధరావాసుల సంతతివారు.

6. ఆల్పైన్ :—వీరిశిరము చిన్నది. అవయవములు నాజూకయినవి. వీరు గుజరాతు, బంగాళములోనివారు. వైదికార్యులకన్న పూర్వము వచ్చినవారు. ఆర్యభాష మాట్లాడేవారు,

7. మంగోలీయులు :—వీరిశిరము చిన్నది. భారత దేశపు తూర్పు ఉత్తరసీమల్లో కనబడతారు.

8. వైదికార్యులు (లేదా) నార్డికులు:-వీరిలోనాజూకు తనం కనబడుతుంది. వీరిశిరము దీర్ఘము. వైదిక సంస్కృత భాష మాట్లాడేవారు.

ఇటీవల డాక్టర్ గుహా మహాశయుని సిద్ధాంతప్రకారం ఆరే ప్రధాన మానవజాతులు. తొమ్మిది అవాంతరజాతులు.

1. నెగ్రిటోలు.
2. ప్రోటో ఆస్ట్రలాయిడ్.
3. (ఎ) మంగోలీయులు (పొడుగైనతల, విశాలమైననుదురు.)
   (బి) తైర్విష్టప మంగోలీయులు.
4. మధ్యధరావాసులు
   1. ప్రాచీన మధ్యధరావాసులు
   2. మధ్యధరావాసులు
   3. ప్రాగ్దేశీయులు

5. పశ్చిమ ఖండవాసులు (వీరిశిరము చిన్నది.)

(ఎ) ఆల్పినోయిడులు.

(బి) దినారికులు.

(సి) ఆర్మీనియనులు.

6. నార్డికులు.

<u>నెగ్రిటోలు</u> ఈ జాతులలో నెగ్రిటోలు భారతదేశంలో క్షీణించి క్రమేణా వారి అనంతరంవచ్చిన ప్రోటోఆస్ట్రలాయిడులలో కలిసిపోయినారు. వీరిసంస్కృతి వారిఅనంతరం ప్రబలిన జాతుల్లో లేశమాత్రం కనబడుతుంది. ఆర్యభాషలో ద్రావిడ భాషలద్వారా వృక్షవసవర్గ సంబంధమైన కొన్ని పదాలు మాత్రము నెగ్రిట్ భాషాశబ్దాలు వచ్చిచేరినవి.

<u>ప్రోటోఆస్ట్రిలాయిడులు</u> నెగ్రిటోల అనంతరం ప్రోటోఆస్ట్రిలాయిడులు భారతీయ జనబాహుళ్యములో ముఖ్యమైనవారైనారు. పశ్చిమమునుంచి తూర్పుదిశగా వీరు వెళ్లినట్లు కనబడుతుంది. వీరికీ నెగ్రిటోలకూ నుంగోలీయులకూ సంపర్కం కలిగింది. పర్వతసోపానములమీద వరిపండించడం, కుండలుచేయడం మతంలో వర్గభావన, ప్రోటోఆస్ట్రిలాయిడుల సంస్కృతి. వీరిభాష ఆస్ట్రనీషియన్. కోలులేదాముండాభాషా కుటుంబానికి చెందినవి. ఇంతో ఆర్యభాషలలోని ఆస్ట్రిక్ పదాల వల్ల అతిప్రాచీనకాలంలో హైందవార్యులకూ ఆస్ట్రిలాయిడులకూ సంబంధమున్నట్లు గ్రహించవచ్చును. ఆస్ట్రిక్‌శబ్దాలు ఆర్యభాషలుమాట్లాడే ఆర్యులకు ఆదిలో తెలియదు. కొంత

కాలానికి ఆర్యులు పారసీకం భారతదేశం ప్రవేశించిన తరువాతనే యవలు గోధుమలు తెలిసికొన్నారు. ఆస్ట్రిక్ భాషామూలమునైన శబ్దాలు కదళీ నారికేళ తాంబూలాదులు ఆర్యభాషల్లో వచ్చిచేరినవి. ఆస్ట్రలాయిడులతో సంపర్కము వల్ల ఆర్యులు వరిపండించడము, కొన్ని కూరగాయలు వేయడము, చెరుకునుండి చక్కెరతీయడం, ఉల్లిపాయ చింతపండునూ ఉపయోగించడం, మరణానంతరం ఆత్మ యొక్క దేహాంతరప్రాప్తి, నూలువస్త్రాలనేత, ఏనుగులను పోషించడం తెలిసికొన్నారు.

మతాచారాలు కొన్ని చిత్రమైన మతాచారాలు ఆస్ట్రలాయిడుల నుండి వచ్చినవి. దృష్టిదోషం తొలగించడానికి దిష్టితీయడం మనసమాజంలో ఇప్పటికీవున్నది. **(Taboo)** నిషేధముఅనేది వారివల్లనే వచ్చింది. ప్రోటోఆస్ట్రలాయిడులు ఇండోనీషియాలో వలసపోవడంవల్ల వారిసంస్కృతి వ్యాప్తమైంది. కొన్ని పౌరాణిక మతవిశ్వాసాదులుకూడా ద్వీపాంతరాల్లో వ్యాపించినవి. పోలినీషియావారి ప్రపంచసృష్టిని గురించిన భావాలకూ, ఋగ్వేదయ నాసాదాసీయ సూక్తములోని సృష్టినిగూర్చిన భావాలకూ సామ్యము కనబడుతున్నదని వీబర్, బార్తు పండితులు పరిశోధన చేశారు. ప్రోటో ఆస్ట్రలాయిడులే భారతీయాది వాసులలో అధికసంఖ్యాకులని వారి అస్థినిర్మాణాన్నిబట్టి మానవశాస్త్రజ్ఞులు **(Anthropologists)** తేల్చినారు.

పౌరాణిక హిందూమతంలో ఆస్ట్రిక్కుల భావాలు కొన్ని కనబడతవి. ఉదాహరణకు చూడండి. అండమునుండి బ్రహ్మాండభావన, కూర్మావతారము, పాతాళములో నాగులు మొదలైన భావాలు. శిలను దేవతాప్రతీకముగా చేసేపద్ధతి కూడా ఆస్ట్రిక్కులవల్ల వచ్చినదే. ద్రావిడులు ప్రతీకోపాసనకు చిలవలూ పలవలూ చేర్చినారు. నాగపూజకూ కూర్మము, కపిరూపదైవము. గణపతి పూజలకూ ప్రోటోఆస్ట్రలాయిడులే కారణము.

నిషాదులు - ఆస్ట్రిక్కులు ఈ ఆస్ట్రలాయిడులే భారతభూమిలో ఎక్కువమేర ఆక్రమించినారు. గంగా సింధు లోయలలో ఆర్యులు నిషాధులని అనబడే ఆస్ట్రలాయిడులతో ఘర్షణ పడినారు. వారిదేహచ్ఛాయ, కారునలుపు. నారిరంగు, ముక్కులనూ చూచి ఆర్యులు వేళాకోళం చేసేవారు. రమారమి క్రీ. పూ. 1500 — 600 క్రీస్తు పూర్వకాలములో నిషాదులు ఆర్యభాషలో సంభాషణ నేర్చుకొన్నారు. ఉత్తరాపథంలోనూ దక్షిణాపథంలోనూ ప్రదేశనామములు ఆస్ట్రిక్ భాషామూలము కలవి. కొర్కాణం చూడండి. 'గంగా' శబ్దానికి సామాన్యార్థము 'నది' దక్షిణ చీనాభాషలో 'కాంగ్' ఇండోచీనాభాషలో 'ఖాంగ్' మన 'గంగ' శబ్దాలకు ఆస్ట్రిక్ భాషామూలము. దీనివల్ల ఉత్తర దక్షిణ భారతదేశంలో ఆస్ట్రిక్కులనే నిషాదుల స్థావరాలున్నట్లు తెలిసికోవచ్చును. ఉత్తర భారతదేశంలో పంజాబు, ఉత్తర

గంగానదిలోయలోనూ ద్రావిడులు ఆస్ట్రిక్కులూ ఇరుగు పొరుగై ఉండేవారు. ద్రావిడ ప్రభావం వారిమీద ఎక్కువగా ఉండేది. క్రమంగా ఈ ద్రావిడ ప్రభావం జాతీయ సాంస్కృతిక సామరస్యానికి దోహదమిచ్చింది.

ద్రావిడార్య సమన్వయము

చిత్రలిపి - ద్రావిడమా ? సింధునదీప్రాంతములో మొహెంజదరో హరప్పా నగరనిర్మాతలు ద్రావిడులనీ, వారిభాష ద్రావిడ భాషఅనీ హీరాసు పండితుని మతము. సింధులోయలో లభ్యమైన ముద్రికలపై నున్న చిత్రలిపిని ప్రాచీన తమిళలిపిగా హీరాసు దొరగారు చదవ యత్నించినాము. ఇంతవరకూ ముద్రలపైనున్న లిపిని సరిగా చదివినవారు లేరు. మొహెంజదరోలోని చిత్రలిపి బ్రాహ్మీలిపికి మూలరూపమై ఉండవచ్చునని ఆధునిక విద్వాంసులమతము. అది ద్రావిడభాష అనిగాని ఆర్యభాషఅనిగాని నిష్కర్షగా ప్రస్తుతం చెప్పలేము. మొహెంజదరోవాసులమతము శాక్తేయమని అక్కడ లభ్యమైన ముద్రలవల్ల ఫలకాలవల్ల తెలియవచ్చినది. వారు పశుపతినీ, జగన్మాతనూ ఆరాధన చేసేవారు. కాళిని జగన్మాతగా ఉపాసించేవారు. యోగసాధన చేసేవారు.

తమిళము భాషా శాస్త్రజ్ఞులు తమిళ, ద్రవిడ శబ్దాలకు మూల రూపము సహేతుకముగా ద్రమిళ, ద్రమిడ అవుతవి. చిన్నాసియాలో మధ్యధరావాసుల శిలాలేఖనాలలో తాము

త్రమిళులమని వాసికొన్నారు. ఈ మధ్యధరాప్రాంతీయులు 'క్రీట్' ద్వీపవాసులనీ, వారు 'టగ్మిలైలు' అని హెరొడోటస్ అనే ప్రసిద్ధ చరిత్రకారుడు వాసినాడు. దీనివల్ల ద్రావిడభాషలు మాట్లాడేవారిలో కనీసం కొందరయినా తూర్పు మధ్యధరాప్రాంతమునుండి వచ్చివుంటారని ఎస్. కె. ఛటర్జీగారి అభిప్రాయము. ప్రాచీన తమిళ భాషాశబ్దాలనుబట్టి క్రీ. శ. 1856 లో కాల్డ్వెల్‌దొర ఆర్యులకు పూర్వంఉన్న ద్రావిడ నాగరకతనుగురించి తనగ్రంథంలో వాసినాడు. పి. టి. శ్రీనివాస అయ్యంగారు ప్రాచీన తమిళ శబ్దజాలం పరిశోధించి పురాతన తమిళుల విశిష్టమైన ఆర్య సంస్కృతి సంపర్కములేని సంస్కారమునుగూర్చి గ్రంథము రచించినారు.

<u>దాసదస్యు శబ్దాలు</u> ఆర్యులు భారతదేశంలో దాసలేక దస్యులను నిషాదులనూ మొదటిసారిగా చూచినారు. దాసశబ్దమే ఇరానీ భాషలో దహ్యు అనగా 'దేశ' మని అర్థము. మనదేశంలో దాసదస్యు శబ్దార్థాలు క్రమంగా మారిపోయినవి. ఆర్యులతో దాసదస్యులు ఘర్షణపడినారు. ఆర్యులు వారిని దాస్యములో బానిసలనుచేయగా దాసదస్యు శబ్దాలకు బానిస, చోరుడు అనేఅర్థాలు సంక్రమించినవి.

<u>ఆగమ నిగమములు</u> హిందూమత ధర్మాన్ని ఆగమ నిగమము లనే విభాగం చేయవచ్చును. నిగమము కేవ లార్యధర్మము. ఇది వైదికము. వైదిక కర్మకాండలో హోమము ముఖ్యము. ఈ వైదికధర్మానికిపూర్వం ఆగమధర్మం ఉండేది. ఆగ

మీములు తాంత్రికయోగ పౌరాణిక ధర్మమును ప్రతిపాదిస్తవి. ఆగమములో పూజప్రధానము. 'పూజ' అనే శబ్దంకూడా ఆర్యేతరమయిన ద్రావిడ శబ్దభవము. 'పూ' అనగా పుష్పము. 'గె' లేదా 'జె' అనే ధాతువుకలిసి 'పూజ' అనే పద ముత్పన్నమైంది. కార్పెంటియర్ పండితుడు పూజశబ్దము 'పుసు' అనే ద్రావిడ ధాతువునుండి వచ్చినదని చెప్పినాడు. 'పుసు' అనగా పూయుట అని అర్థము. పూజలో చందనముకానీ రక్తంకానీ విగ్రహానికి పూయడంకద్దు. ఈ పూజాపద్ధతి నిజానికి ద్రావిడముకూడా కాదు. ఇది ప్రోటోఆస్ట్రలాయిడులవల్ల సంక్రమించింది.

<u>సమన్వయం వ్యాసుడు</u> ప్రస్తుతం వ్యవహారంలోవున్న హిందూ ధర్మంలో ఆర్య ఆర్యేతర ద్రావిడ కర్మకాండలు ఓత ప్రోతంగా పెనవేసుకొనిపోయినవి. ఆర్య ఆర్యేతర భావ సమన్వయానికి తొలిసారి వ్యాసుడు మహాభారతభాగమైన భగవద్గీతలో ప్రయత్నించి కృతకృత్యుడైనాడు.

<u>మార్పులు</u> ఆర్య ఆర్యేతర ధర్మ సమన్వయంవల్ల ఆర్యమతంలో మార్పువచ్చింది. ఆర్యదేవతలయిన ఇంద్రాగ్నులు వరుణ సోమసూర్యులు, ఉషస్సు, పూష, పర్జన్యాదులు అప్రధానులైనారు. ఆర్యులు సగుణోపాసన అవలంబించి ఉమా మహేశ్వరులను, శ్రీవిష్ణువులను, జగన్మాతను అర్చన చేయసాగినారు.

<u>ద్రావిడము</u> మొహెంజదరో హరప్పా నగరాల్లో శివశక్త్యుపాసన వుండేది. ఈ ఉపాసన ద్రావిడులలో ఉండేది. కనక మొహెంజదరో వాసులుకూడా ద్రావిడులై ఉంటారు. ద్రావిడులూ లేదా ప్రోటో ఆస్ట్రలాయిడులుకూడా శివప్రతీకాన్ని అర్చించేవారు.

<u>హనుమాన్</u> ద్రావిడుల ఆరాధ్యదైవము ఆంజనేయులు. ద్రావిడ భాషలో 'అన్ మంతి' అంటారు. దీనికి సంస్కృతరూపము 'హనుమంతుడు' ద్రావిడ హనుమంతుని ఆర్యులు తెలిసికొని వేదంలో వృషాకపి ఋక్కులో చేర్చుకొన్నారు. ఈ రీతిగా ద్రావిడార్య సంస్కృతీ సమన్వయం జరుగుతూ వచ్చింది.

సప్తసింధు నాగరకత

వేదకాలానికిపూర్వం వైదిక నాగరకతకంటె విలక్షణమైన *నాగరకత సప్తసింధు ప్రాంతములో మొహెంజదరో, చున్హుదరో, హరప్పా మొదలైనతావుల్లో కానవచ్చింది. పురాతత్త్వ పరిశోధనలమూలంగా అక్కడ నాగరకత, సంస్కృతీ క్రీ. పూ. 3000 నాటివని తేలినది. భారతదేశంలో అత్యంత ప్రాచీన నాగరకత విశిష్ట లక్షణాలలో విలసిల్లి సుమేరు, అక్కడ్, బాబిలోన్, అహిగుప్త, అసీరియా నాగరకతలతో సరితూగగలిగింది.

---

* ఇటీవల కథియవాడ్, గుజరాత్ ప్రాంతాల్లో పురాతత్త్వ పరిశోధనవల్ల సప్తసింధు నాగరకత వ్యాప్తమైనదని తెలుస్తున్నది.

సింధు నాగరకతలో ప్రత్యేకత గోచరించినప్పటికీ అన్యనాగరకతా సంస్కృతులతో సంబంధమున్నది. సింధు నదిలోయలో (రాగి, ఇత్తడి పాషాణమునకు సంబంధించిన) **Chalcolithic** యుగము కావడంవల్ల ఇలమ్, మెసపొటేమియా, సుమేరు నాగరకతలకూ మొహెంజదరో నాగరకతకూ పోలికలున్నవి.

సింధునది లోయలో ఏడు పట్టణాలు వరదలవల్ల శిథిలమయిపోయినవి. వేయిసంవత్సరాలలో పట్టణాలు జన సంకీర్ణములై రమారమి క్రీ. పూ. 3250—2750 లో తిరిగి తలలెత్తినవి. ఈ కాలనిర్ణయానికి ఆధారాలు అక్కడ లభ్యమైన ప్రాచీన వస్తుసంచయమే. సింధుప్రాంతంలో దొరికిన ఫలకాలు, ముద్రలవంటివి మెసపొటేమియాలో లభ్యము కావడంవల్ల హరప్పా సంస్కృతి క్రీ. పూ. 2800 నాటిదని డాక్టర్ గడ్ కాలనిర్ణయము సూచించినారు. డాక్టర్ ఫేబ్రి మతాన్నిబట్టి మొహెంజదరోలో ప్రధానమైన సంస్కృతి క్రీ. పూ. 2800—2500 అంతరంలో ఉంటుందని ఘటకలశం మీదనున్న సుమేరియ బాబిలోనియ శాసనంవల్ల నిర్ణయం జరిగింది. లభ్యమైన వస్తువులనుబట్టి అన్యనాగరకతలతోపోల్చి మొహెంజదరో హరప్పాలలోని ప్రధాన సంస్కృతి క్రీ. పూ. 2800—2500 ల అంతరంలోవని విజ్ఞులు విశదం చేసినారు.

ఈ సింధు నాగరకతకు కారకులెవరు? కారకులెవరో తెలిసికోడానికి గ్రంథాధారాలులేవు. మానవాస్థికలు, కపాలములు నగర

శిధిలాల్లో దొరకడంవల్ల వాటిని ఆధారంచేసి సింధులోయలో కనీసం నాలుగుజాతులు అనగా ప్రోటో ఆస్ట్రలాయిడ్, మధ్యధరా, ఆల్పినోయిడ్, మంగోలీయులు ఉండేవారని తెలియవచ్చినది. అయితే ప్రధానమైనవారు మధ్యధరా ప్రాంతంనుండి వచ్చినవారు. అంతేకాక సింధుప్రాంతంలో జాతిసాంకర్యం ఎక్కువగా ఉండేది. అక్కడివాళ్ళకే అన్య ప్రాంతీయులకూ విశేషంగా సంపర్కం ఉండేది.

మానవశాస్త్రం (Anthropology) మూర్తి శిల్ప ఖండాలనుబట్టి నాగరకతకు కారకులెవరో నిర్ణయంచేయడం అసాధ్యం. పురాతత్త్వవేత్తలు సింధుప్రాంతీయ నాగరకతకు ఆర్యులో, ద్రావిడులో బ్రాహుయీలో సుమేరియులో, ఋగ్వేదంలో నిపుణులనబడే వర్తకులో, అసుర్బాత్యవాహిక నాగరికులో కారకులని మతభేదం తెలియచేసినారు. ఏకాభిప్రాయానికి ఎవరూ రాలేకపోయినారు.

ప్రముఖులైన చాలమంది పండితులు సప్తసింధు నాగరకత ద్రావిడులదేనని నిష్కర్ష చేసినారు. అయితే అంత్యక్రియాకలాపాలనుబట్టి సప్తసింధువాసులు ద్రావిడులనడానికి వీలులేదు. దక్షిణ భారతదేశంలో శవసంస్కారాలనుబట్టి మొహంజెదరోలో నాగరకతాచిహ్నము లున్నవనడానికీ వీలులేదు. వారు బ్రాహుయీ భాష మాట్లాడేవారని చెప్పడానికి వీలులేదు. పోసీ సుమేరియనుల దేహలక్షణాలనుబట్టి సింధువాసులు ఆర్యులో అనార్యులో నిర్ణ

యించడానికి సుమేరియను జాతిలక్షణాలు స్పష్టంగా మనకు తెలియవు. పోనీ ఋగ్వేదంలోని పణులు లేదా వ్రాత్య వాహిక అసుర దానవనాగాదులు మొహెంజదరో వాసులన డానికి తగినంత ఆధారాలులేవు.

వైదికార్యులే ఈ నాగరతకు కారణభూతులని నిర్ణయం చేయడానికి ఆధారాలు చాలవు. డాక్టరు మార్షలు పండితుని సిద్ధాంతరీత్యా ఆర్యావతరణము భారత దేశంలో క్రీ. పూ. 1500 లో జరిగింది. అనగా సింధునాగరకతా సంబంధమైన తుదిచిహ్నములుకూడా అదృశ్యమైనతరువాత వేయి సంవత్సరాలకు వైదిక నాగరకత ఆరంభమైనదన్నమాట. అయితే స్వామి శంకరానందవంటి విజ్ఞులు సప్తసింధు సంస్కృతి ఋగ్వేద సంస్కృతేనని సిద్ధాంతము చేసినారు.

మొహెంజదరో నాగరకతకూ వైదిక నాగరకతకూ సంబంధము లేదనడానికి పండితులుచూపిన కొన్ని ఉపపత్తులున్నవి. వైదికార్యులు మొహెంజదరో నాటిశైవాన్ని వేదంలో చేర్చుకొన్నారు. సింధులోయలో అశ్వములులేవనీ, విగ్రహాలు దొరికినవనీ మార్షలు వ్రాసినాడు. కాని డాక్టర్ మెకే ఒక నమూనాబొమ్మను అశ్వమేననీ, మొహెంజదరోలో అట్టడుగునేలపొరలో కళ్లెములూ జీనులూ దొరకడం వల్ల సింధువాసులకు అశ్వములుండేవని నిర్ణయించాడు. వైదికమతములోను ప్రతీకాలు విగ్రహాలు మానవ పశురూపాలుకావు. బహుశ ఋగ్వేదము, సింధు ప్రాంతీయ

సంస్కృతియొక్క ప్రథమదశను వ్యక్తము చేయవచ్చును. వారు శివలింగమును అర్చించేవారు. ఋగ్వేదకాలంలో శైవం స్వీకరించడంతో లింగార్చన తప్పనిసరియై ఉండవచ్చును. తదనంతరం అనార్య సంపర్కంవల్ల వైదికధర్మం విస్తృతమైంది. లింగపూజ తాంత్రికాచారాలు బహుళంగా ఆర్యధర్మంలో ఇమిడిపోయినవి. సింధులోయలో ఇదేరీతిగా ఆర్య అనార్య సంపర్కం కలిగేసరికి అక్కడివారు జగన్మాతనూ పశుపతినీ ఆరాధన చేయసాగినారు. మొత్తంమీద వైదిక అవైదిక సంస్కృతీ సమన్వయం సామరస్యం సంభవించిందని నిష్కర్ష చేయవచ్చును.

మరికొందరు పండితులు వైదిక నాగరకతే సప్తసింధు నాగరకతగా ప్రాచీనమైనదని భావిస్తున్నారు. రంగపూర్‌లో ఇటీవల జరుగుతున్న పురాతత్త్వ పరిశోధనలనుబట్టి డాక్టర్ రామచంద్రన్ మొహెంజదరో నాగరకత ఋగ్వేదానికి సంబంధించినదని చెప్పినాము. సరియైన ఉపపత్తులు గోచరించినప్పుడు మార్షలు వాదము తొలగిపోవచ్చును,

పట్టణము

హరప్పా, మొహెంజదరో పట్టణ శిధిరాలలో లభ్యమైన పురాతన వస్తువులనల్ల, శిధిలశేషాలవల్ల రమారమి క్రీ. పూ. 3000 వత్సరాలకింకట విలసిల్లిన నాగరకతా వైభవము మనము కొంతవరకు భావన చేయగలము.

పట్టణనిర్మాణం మొహెంజదరో పట్టణ నిర్మాణ కౌశలము, పురపారిశుధ్యము చూపరులకు ఆశ్చర్యము కలుగజేస్తున్నవి. ప్రాచీనుల నిర్మాణనైపుణి సునిభక్త పట్టణపథాలవల్ల విశద మవుతున్నది. పురము చతుర్భ్రస, దీర్ఘచతుర్భ్రస మార్గములచే విభాజితమైనది. సామాన్యముగా వీధులు తొమ్మిది అడుగుల నుంచి ముప్పదినాలుగు అడుగులదాకా వెడల్పుంటవి. మార్గములు వక్రములుకాక ఋజులేఖల్లో తీర్చిదిద్దినట్లుంటవి. పురవాసుల ఉపయోగనిమిత్తం ప్రతిసంచుకూ ఒక కూప ముంటుంది. ప్రతిగృహానికి ఒకనూయి, స్నానశాల ఉంటవి. పురపారిశుధ్యంకోసం మురికినీరు పోవడానికి చక్కని ఏర్పాట్లు చేసినారు. ఆ శిధిరాల్లో విపణివీధులు, వర్తకస్థానాలు, కార్మికవసతులు, ధనికుల ప్రాసాద మందిరాలు మనము గుర్తించగలము.

రసికులుకారు నగర నిర్మాణములో కేవల వాస్తుశిల్పముకన్న సుఖజీవనార్థము వీలుగా వసతులు ఏర్పాటు చేసికొన్నారు సప్తసింధువాసులు. వారిలో శిల్పదృష్టికన్న ప్రయోజనా పేక్ష అధికం. వారు సౌందర్యోపాసకులు కాకపోవడంచేత సుమేరియా ప్రాంతంలోవలె వస్తులాకృతిగల స్తంభాలు, శిల్పవిన్యాస సమంచితమైన ద్వారములుకాని, గోడలో సగభాగము కనపడే అర్ధవర్తులాకార స్తంభశ్రేణికాని, మహోన్నత సమాధులుకాని, దేవమందిరాలుకాని సింధు లోయలో కనపడవు. జీవితం సుఖంగా పొదుపుగా నేర్పుగా

గడుపుకోవలెననేదృష్టి వారిలో ముఖ్యము కనక వారు రసికులుకారు.

గృహకుడ్యాలకూ, సోపానములకూ, స్నానకోష్టములకూ మురికినీరు పోయేతూములకూ పంపుఇటుకను ఉపయోగించేవారు. ఇటుకలు దీర్ఘ చతురస్రాకారముగా ఉంటవి. ఇటుకను తయారుచేసే బట్టీలు శిధిలాల్లో గోచరించినవి. మన్నూసున్నమూ అతకడానికి ఇటుకవాడకముండేది. మురికి కాలవలు గట్టిగా కట్టడానికి సున్నపురాయిని లోహసంబంధ మయిన సున్నమునూ వాడేవారు. ఇటుకలను కలపడంలో పంచినేర్పు చూపినారు.

<u>నిర్మాణాలు</u> తవ్వి ఉద్ధరించిన మందిరనిర్మాణాలను మూడు భాగాలు చేయవచ్చును. 1. వసతిగృహాలు, 2. ప్రాసాదాలు, 3. ప్రజానీకంకోసం ఏర్పాటుచేసిన స్నానవసతులు. నవీన కాలంలో సముద్రతీరస్థమయిన హోటలువలె విశాల స్నాన వసతి చూడతగినది. కేవలం స్నానంచేసే ప్రదేశము 89 అడుగులపొడవు, 25 అడుగులవెడల్పు, 8 అడుగుల లోతున వుంటుంది. ఈ స్నానవాటికకు రెండువైపులా ఉన్నతమైన వేదికలున్నవి. స్నానానంతరం సోపానములెక్కి వేదికమీదికి వెళ్ళవచ్చును. స్నానవాటికకుచుట్టూ వరండాలున్నవి. స్నానానికి రావడానికి ఆరుమార్గాలున్నవి. ఈ నిర్మాణం కేవలం స్నానసౌకర్యంకోసంకాక ఏతీర్థవిధులు నిర్వర్తించుకొనే నిమిత్తమో ఏర్పాటైవుండవచ్చునని కొందరిమతం.

పురనిర్మాణములో కౌశలము, చక్కగా నీటిసరఫరా, అద్భుతమైన పారిశుద్ధ్య విధానమునుబట్టి పురపాలన బాగాఉండేదని చెప్పవచ్చును. అక్కడక్కడ స్తంభాలనుబట్టి అవి వీధుల్లో దీపికా స్తంభాలై ఉంటవని చెప్పవచ్చును.

సాంఘిక జీవితము

సాంకర్యం మొహెంజదరో చేరడానికి జలమార్గాలు సౌకర్యం ఉండడంచేత దేశదేశాంతరాలనుండి వివిధజాతులవారు వచ్చేవారు. ప్రోటోఆస్ట్రలాయిడులు, మధ్యధరాప్రాంతీయులు, మంగోలీయులు, ఆల్పినోయిడులు కలిసిమెలిసి ఉండడంచేత జాతిసాంకర్యం సంభవించింది. శిల్పఖండాలు కూడా ఈ విషయాన్ని తెలియజేస్తున్నవి.

పంటలు ప్రదేశం నదీమాతృకలవల్ల తృణకాష్ఠ జలసమృద్ధమై గమనాగమనాలకూ, కృషివాణిజ్యాలకూ సావకాశం వున్న ప్పుడు మొహెంజరోవంటి పట్టణాలుద్భవిస్తవి. సింధు ప్రాంతములో గోధుమలు, బార్లీ వ్యవసాయపు పంటలు. జంతువుల అస్థిశేషాలు కొంతకాలినవి. గృహావరణాల్లో కినబడడంవల్ల మత్స్య కూర్మాదులమాంసము సింధువాసులు భుజించేవారని గ్రహించవచ్చును.

మృగాలు శిధిలాల్లో మూపురంగుల వృషభం, గొర్రె, ఏనుగు, పంది, ఒంటెల అస్థికలు దొరికినవి. ముద్రలమీద మూపురం గల వృషభరాజ చిహ్నాలు ఎక్కువగా కనబడుతున్నవి.

సుద్దతోచేయబడిన నమూనా ఆటబొమ్మలవల్ల వృషభము, వ్యాఘ్రము, వానరము, శ్వానము, భల్లూకము, మేషము వంటి జంతువులు వుండేవని తెలిసికోవచ్చును.

దుస్తులు సప్తసింధువాసుల దుస్తులు లభ్యమైన ఆటవస్తువులను బట్టి చెప్పవచ్చును. ఎడమభుజముమీదుగా శాలువవంటి ఉత్తరీయము కప్పుకొనేవారు. కుడిభుజము నగ్నముగా వుంటుంది. కటినుండి ధోవతి కట్టుకొనేవారు. స్త్రీ పురుషుల వస్త్రధారణలో భేదము కనపడదు. నూలు ఉన్ని వస్త్రాలు ఉపయోగించేవారు.

కేశసంస్కారం కేశసంస్కారంలో చాలారీతులు కనబడతవి. పురుషులు కురులు దువ్వుకొనేపద్ధతి ఆటబొమ్మలవల్ల తెలుస్తుంది. మేలిముసుగులవల్ల, కేశాలంకరణాలవల్ల స్త్రీల కేశ సంస్కారవిధానం బాగా కనపడదు. ఈ కాలంలోవలె ఆనాడుకూడా స్త్రీలు పాపిడితీసికొని కురులు దువ్వుకొని జడల్లుకొని జడచివర దూముడి వేసుకొనేవారు. పురుషులకు దీర్ఘమైన కేశపాశం ఉండేది. మధ్యపాపిడి తీసికొని జుట్టు వెనుకకు దువ్వుకొని ముడివేసుకొనేవారు. కొద్దిపాటి జుట్టున్న పురుషుడు నాడా తలకు కట్టుకోడమో, జుట్టు చెదరకుండా వుండేందుకు పిన్నులు పెట్టుకోడం కద్దు. జుట్టుకు కట్టుకొనే నాడాలు బంగారంతోనో రజతతామ్రాలతోనో చేయబడినవి. పురుషులు చిన్నగడ్డాలు పెంచుకొని మీసము పూర్తిగా తీసివేసేవారు. కొందరు చిన్నమీసము వుంచేవారు.

అలంకరణం అలంకారంమీద మోజుకొద్దీ స్త్రీ పురుషులు యాభరణాలు ధరించేవారు. విలువైన కురువింద రత్నాలు, గరుడ పచ్చలు, కెంపులు, గోమేధిక పుష్యరాగాలు వుపయోగించేవారు. స్త్రీలు బంగారు వెండి రాగితో చేసిన చంద్రవంకలు శిరోపార్శ్వాన పెట్టుకొనేవారు. నుదుట భాషికమువంటి స్వర్ణమయమో రజతమయమో అయిన నాడా కట్టుకొనేవారు. చెవులకు కమ్మలు, నాసికలకు బులాకీలు, కంఠాలకు గైరవేయకాలు, వేళ్ళకు ఉంగరాలు, చేతులకు వెండి బంగారు వలయాలు, కటిసీమల మేఖలలు, పాదాలకు మంజీరాలు పెట్టుకొనేవారు. అలంకార నిర్మాణములో నైపుణి కానవస్తున్నది. పురుషులు ముఖ్యంగా భాషికాలవంటి నాడాలు, కంఠహారాలు, గైరవేయకాలు అంగుళీయకాలు, దండకడియాలు పెట్టుకొనేవారు. అందచందాలమీద వారికి మక్కువ ఎక్కువ. ఆహార్యకానికి కావలసిన ప్రసాధన వస్తువులను పెట్టుకొనే మంజూషలు కనబడినవి. ఈ మంజూషలు దంతము లోహము లేదా శిలతోనో తయారుచేసేవారు. కళ్ళకు కాటుక, ముఖాన పత్ర రచన, అంగరాగముకాని చేసికొనేవారు, నున్నాదనకోలలో పెదవులకు రంగువేసుకొనే శలాకలు దొరికినవి. అలంకార వస్తువులు పెట్టుకొనే బల్లలు ప్రత్యేకంగా స్త్రీలకోసం ఏర్పాటైనవి. కాంస్యనిర్మిత దర్పణాలు దంతపు దువ్వెన్నలు దొరికినవి.

బొమ్మలు పిల్లలాడుకొనే ఆటసామగిలో మృచ్ఛకటికలు, కుండేళ్ళ గమనార్థాలు. ఆనాటి వాహనాలు ఆటవస్తువుల వల్ల తెలిసికోవచ్చును. సుద్దమట్టితో చేయబడిన నమూనా బొమ్మలలో స్త్రీపురుష మృగాలు ముఖ్యములు. సామాన్యంగా ప్రయాణాలు వృషభ శకటాలమీదనే చేసేవారు.

లబ్ధమైన వస్తువుల్లో శిలాజిత్తు, హరిణశృంగాలు, పులికొమ్ములు, ప్రవాళము, నింబపత్రాలు ఔషధాల కుపయోగపడేవి. వీనివల్ల ఆయుర్వేదచికిత్స ఆనాడు వ్యాప్తిలోవుండేదని ఊహించవచ్చును.

వర్గాలు ప్రజానీకంలో నాలుగువర్ణాలుండేవి. చదువునేర్చిన వారు, యోధులు, వర్తకులు, శిల్పకార్మికులు. ఈ వర్ణ తారతమ్యం వైదికకాలంనాటి చతుర్వర్ణానికి కొంతవరకు సరిపోతుంది.

సంబంధాలు మొహెంజదరో వాసులకు బాహ్యప్రపంచంతో సంబంధం చాలావుండేది. సుమేరు, అహిగుప్త, క్రీటు దేశాలతో వ్యాపార సంబంధాలుండేవి. మొహెంజదరో సింధుదేశ మధ్యస్థమైన రేవుగావుండి ఉర్, కిష్, అహిగుప్త దేశాలతో వాణిజ్యం నెరపేది.

వృత్తులు

ప్రయోజనాపేక్ష రామణీయక దృష్టికన్న ప్రయోజనాపేక్ష శిల్పులలో అధికంగా కనబడుతుంది. సామాన్య గృహ

నిర్మాణంలోగాని, ప్రాసాద మందిర నిర్మాణంలోగాని అలం కృతి కనబడదు. ఘటకలశాలమీది చిత్రాలైనా సామాన్య మైనవే. ఫలకాలమీద, ముద్రలమీద కొంతవరకు కళా వినాణమున్నది. మట్టిబొమ్మలలో స్త్రీమూర్తులు ప్రధాన ములు. మూర్తులు అర్ధనగ్నముగా ఉంటవి. కటిసీనులపై మేఖలలుంటవి. ముద్రికలపై దీర్ఘశృంగాలుగల వృషభాలు వాస్తవికంగా ఉన్నవి. కాంస్య నిర్మితమైన నర్తకీమూర్తి రమణీయము. ఆమెహస్తము లతిదీర్ఘములు. మూర్తిశిల్పంలో ప్రమాణాలు సరిగాలేవు. భంగిమమాత్రము బాగున్నది. పాదన్యాసం లయానుగుణంగావుంది.

నటరాజు విగ్రహాలలలో మానవమూర్తుల లక్షణాలు గమ నార్హాలు. వీటిలో కపోలాస్థికలు ప్రముఖంగా ఉంటవి. కంఠాలు దృఢంగా పొట్టిగా వుంటవి. నేత్రాలు ప్రక్కకువాలి లోతుగా ఉంటవి. శిరస్సులు పొడుగు పొట్టి మధ్యమ ప్రమాణమున్నవి. హరప్పాలో దొరికిన రెండుమూర్తులు ప్రాచీన భారతీయ కళాచరిత్రలో విశిష్టములు. లలితకళా సమీక్షాదక్షులు వాటి స్వచ్ఛసాకళ్యాన్ని, భావాన్ని ప్రశంసచేసినారు. ఒకమూర్తి నటువు. భంగిమ లోగతి పూర్ణంగావుంది. బహుశ ఆ మూర్తి నటరాజ శివుడు కావచ్చును.

సింధులోయలలో కదుళ్ళు లభ్యంకావడంవల్ల నూలు నేత కుటీర పరిశ్రమగా ఉండేదని గ్రహించవచ్చును. నూలు

ఉన్నివస్త్రాలునేయడం వారి జీవనాధారం. ముతకరకం దూది దొరికేది.

ముద్రలు ముద్రలు ముద్రికలు చాలాదొరికినవి. ఇవి చతురంగా నిడుపువాటుగా ఉంటవి. వీటిమీద వృషభ చిహ్నాలకూ శాసనాలకూ సంబంధమున్నట్లు తోచదు. కొన్నింటిమీద స్వస్తిక చిహ్నము కనవస్తున్నది. ఈ ముద్రలపై విశేషంగా మృగాలే వుండడంచేత పశువులను సింధువాసులు ఆరాధించే వారనీ, వీటికి మత్రప్రాధాన్యంవుందనీ ఒకమతం. మృగాలకు రెండుకొమ్ములులేవు. ఏకశృంగమున్న వృషభాలే చిత్రింప బడినవి. ఈముద్రలను నాణెములుగా ఉపయోగించేవారేమో చెప్పలేము. శాసనాలు ముద్రలపై ఉండడంవల్ల నాణెములని అనడానికి వీలులేదు.

సప్తసింధులోయలో ఉపయోగించిన బంగారము అనంతపురం జిల్లానుంచి, మైసూరులోని కోలారునుంచీ వచ్చి ఉంటుంది. వెండి ఆఫ్ఘనిస్తాన్, ఆర్మీనియా, పారశీకము నుండివచ్చేవి. సీసము అజ్మీరునుండి సరఫరా అయివుండ వచ్చును.

ఆభరణాలకు అపరిమితంగా ఆలిచిప్పలు గవ్వలు ఉపయోగపడేవి. భారతీయ సముద్రతీరమునుంచీ పారశీక అఖాతంనుంచీ గవ్వలు దొరికేవి.

ఒకప్పుడు డెల్టా: అడవి యేనుగులు పంజాబు సింధుదేశాల్లో ఉండేవి. అందుచేత పంజాబు సింధుదేశాలు ఇప్పటినకై

బెట్టగావుండక సస్యశ్యామలమై గంగానది డెల్టావలె ఉండి ఉండవచ్చునని విజ్ఞులూహిస్తున్నారు.

సింధులోయలో మతము

ధర్మము అధిష్ఠానముగాలేనిదే నాగరకతా సంస్కృతులు నిలవలేవు. భారత భూమిలో ఏ సంస్కృతి ఉద్భవించినా ధర్మము ప్రాతిపదికగా ఉంటూనేవుంది. అయితే సింధు లోయలో మతధర్మాన్ని వ్యక్తంచేసే వ్యవస్థకానీ, దేవాలయాలుకానీ, పూజావేదికలుకానీ కనపడలేదు. ముద్రలు, ఫలకాలు పాషాణ విగ్రహాలను ఆధారంగా చేసికొని మొహెంజదరో హరప్పాలలో మతము ఏరీతిగా ఉండేదో గ్రహించవచ్చును.

తాంత్రికం ప్రపంచములో చాలాదేశాల్లో జగన్మాతను ఆరాధన చేయడం ఉండేది. అదేతీరుగా సప్తసింధు ప్రాంతంలోనూ జగజ్జననిని ఉపాసించేవారు. అమ్మ, అంబ, కాళి, కరాళి అనే నామాంతరాలతో జగజ్జననీ స్వరూపాలను మట్టిబొమ్మలలో చూడవచ్చును. సృష్టికి కారణభూతమైన సగుణ రూపాన్ని ఈశ్వరునిగానో ఈశ్వరిగానో భావన చేయవచ్చును.

దేవతాప్రీతికై పశువులను వధించేవారు ఈ కాలంలో కూడా శాక్తేయ వామాచారంలో పశుబలులు ఉంటూనే ఉన్నవి. పశుబలులేకాక నరబలులుకూడా మొహెంజదరోలో ఉండేవని అనడానికి తగిన ఆధారంవుంది.

శాక్తేయం లభ్యమైన పాషాణ ప్రతిమలనుబట్టి శైవం వ్యాప్తిలో ఉండేదని చెప్పవచ్చును. శివమూర్తి భేదాలు మూడు కన బడతవి. 1. త్రిముఖరూపుడు, 2. పశుపతి, 3. యోగీశ్వరుడు లేదా మహాయోగి. త్రిముఖ పశుపతి స్వరూపాలు ఫలకాల మీద గోచరిస్తవి. మరొక ఫలకమునీద శివుడు పద్మాసనుడై నాసాగ్ర వీక్షణంతో ఉండడంచేత మహా యోగిగా పరిగణించాలి. శైవాన్ని సప్తసింధు వాసులనుంచి హైందవార్యులు స్వీకరించి ఋగ్వేదంలో చేర్చుకొన్నారని కొందరిమతం. ఇటీవలి పరిశోధనలవల్ల రెండుముద్రికలు దొరకినవి. ఒకదానిలో శివుడు త్రిముఖుడు. ఉన్నతముకాని వేదికపై ఆసీనుడై నాడు. రెండవముద్రికపై శివుని ముఖ పార్శ్వములు కనబడతవి. ఏకముఖుడతడు. ఈ ఫలకాలమీద శివశీర్షమునుండి లతాపుష్పములు పత్రములు కనబడుతున్నవి. దీనినిబట్టి శివుణ్ణి సృష్టిసంకేతముగా ఊహించవచ్చును.

లింగము మొహెంజదారోవాసులు శివుణ్ణి విగ్రహరూపంలోనే కాకుండా లింగరూపములో ఆరాధన చేసేవారు. లింగరూప సంకేతము సృష్టికారణము. లింగరూపభావన జుగుప్స కలిగించికాబోలు హైందవార్యులు ఋగ్వేద సంహితలో ఆర్యేతరమయిన అర్చనా విధానాన్ని హేళన చేశారని తోస్తుంది.

లింగరూప ప్రతీకంతోపాటు యోనిరూపమయిన పానవట్టములుకూడా సింధుప్రాంతములో దొరికినవి. లింగము

నకు అధిష్ఠానము యోని. లింగము శివుడు. యోని శక్తి. లింగయోనుల యోగంవల్ల సృష్టి. యోనిరూప పాషాణములు దొరకడంచేతనే లింగార్చన వ్యాప్తిలో ఉండేదని తేలింది. అగ్నినీ జలాన్నీ వృక్షాలనూ సప్తసింధువాసులు పూజించేవారు. ప్రజాబాహుళ్యంకోసం ఏర్పాటయిన స్నాన వసతి కేవలం స్నానంకోసంకాక జలదేవతను అర్చనచేయడం కోసమని కొందరి అభిప్రాయం. స్నానానికేకాక అది తీర్థ విధులకు నిర్మితమై ఉండవచ్చును.

కొన్ని ముద్రికలమీద స్వస్తికచిహ్నము, చక్ర సంకేతములున్నవి. ఈ సంకేతములు సూర్యసంబంధమైనవి కనుక సూర్యారాధనకూడా ఆకాలంలో ఉండిఉండవచ్చును. ఒకఫలకమమీద దేవత ఆసీనురాలైనది. ఆమె సమీపాన భక్తుడు కూర్చున్నాడు. ఆ దేవతాశిరాన పడగవిప్పిన సర్ప మున్నది. బహుశ నాగారాధనంకూడా సింధుప్రాంతంలో ఉండిఉండవచ్చును.

సింధులోయలో చిత్రలిపి

సప్తసింధులోయలో ప్రజలేభాషలో వ్యవహరించేవారో తెలియదు, లిపిని చిత్రలిపిగా కొందరు పండితులు భావించి నారు. మత్స్యములు మానవులు పక్షులను రాయవలసినప్పుడు వాటిని తెలియచేసే బొమ్మలే గీసేవారు. అయితే అన్నింటికీ బొమ్మలేగీయక సాంకేతికాలు వాడినాగు. అక్షరరూపంలో

అభివృద్ధి కనబడదు. మొదట ఏస్థితిలో లిపి ఉపయోగ పడినదో ఆదశలోనే ఉన్నదికాని మార్పులురాలేదు.

మొహెంజదరోలిపికీ సుమేలియా, ఇలంలిపులకూ కొంతవరకూ పోలికలున్నవి. అంతేగాని అహిగుప్తదేశము లోని 'హీరోగ్లిఫ్సు' అనే చిత్రలిపికీ, చైనాలో చిత్రలిపికీ, సప్తసింధులోయలోని చితలిపికీ పరస్పర సంబంధములేదు. సింధులోయలో చిత్రలిపి భారతదేశంలో ఉద్భవించినదే.

1. హీరాసు పండితుని ద్రావిడ సిద్ధాంతము రెవరెండ్ హెచ్. హీరాసు గారు మరికొందరు విద్వాంసుల మతాన్నిబట్టి సప్తసింధు నాగరకత ఆర్యేతరమైనదనీ అనగా ద్రావిడమనీ తేలింది. హీరాసు మొహెంజదరో ఫలకాలమీది శాసనాలను ఎడమ నుండి కుడివైపుకు పఠించి తమిళభాషగా నిర్ణయించినాడు. క్రీ. పూ. 4000 నాటికి తమిళభాష ప్రజల వ్యవహారములో లేకపోవడంవల్ల, అందుకు తగిన ఆధారాలు లేకపోవడంచేత మొహెంజదరోలిపి తమిళము కావడానికి వీలులేదు.

2. సుమేరియ లేదా అహిగుప్తీయ సిద్ధాంతము ఐ. ఏ. వాడెల్ తన "Indo Sumerian Seals Deciphered" అన్న గ్రంథములో మొహెంజదరోలిపి సుమేరియను లిపినుండి వచ్చినదని నిర్ణయించినాడు. భారతీయ విద్వాంసుడు డాక్టర్ ప్రాణనాథ్ సుమేరియ సిద్ధాంతమే అంగీకరించినాడు. పశ్చిమాసియా, అహిగుప్త, క్రీట్ దేశాల్లోఉన్న చిత్రలిపికీ మొహెంజదరో

లిపికీ పోలికలున్నమాట నిజము. భారతీయులకూ పశ్చి మాసియావాసులకూ వ్యాపారరీత్యా సంబంధాలున్నమాట వాస్తవము. అందుచేత మొహెంజదరోలిపికీ సుమేరీయలిపికీ పోలికలుండవచ్చును. అయితే ఎవరు ఎవరిదగ్గర నేర్చు కొన్నారు? ఎవరు లిపికి మూలకారకులు? అనేవిషయం నిర్ణయంకావాలి. మెసపొటేమియా చరిత్రనుబట్టి వారి సంప్ర దాయాలనుబట్టి సుమేరియా నాగరకతకు కారకులైనవారు అన్యదేశాలనుండి వచ్చినారని తెలియవస్తున్నది. అందుచేత సుమేరియాలో చిత్రలిపి ఉద్భవించలేదు. అది సెమిటిక్ లిపి నుండి రాలేదు. అది భారతీయ లిపినుండి ఉద్భవించిందే.

3. భారతీయ సిద్ధాంతము సింధు ప్రాంతీయలిపి అక్కడే ఉద్భ వించింది. అసురులు, పణులు అనే *వర్తకులవల్ల దేశాంత రాలలో వ్యాప్తమైంది.

ఈ మొహెంజదరో లిపికి కారకులెవరు? ఈ క్రింది కారణాలవల్ల మొహెంజదరో లిపికి కారకులెవరో నిర్ణయించవచ్చును.

1. ప్రాచీన అహిగుప్త నాగరకతకు కారకులైనవారు పశ్చిమాసియానుండి అహిగుప్త దేశానికి తరలివెళ్ళినారు. ♦

---

* కె. యన్. దీక్షిత్‌గారి Pre-historic Civilization of the Indus Valley పుట 46.

♦ Maspeor గారి Down of Civilization పుట 45.

2. ప్రాచీనకాలంలో సముద్రాలు తరించి వాణిజ్యం చేయడంలో ప్రసిద్ధికెక్కిన ఫినీషియనులు సంస్కృతీ వ్యాపకులై పశ్చిమాసియా సముద్రతీరస్థమైన టైర్ నగరంలో వలస యేర్పాటు చేసికొన్నారని గ్రీకు * రచయితలవల్ల విశదమవుతున్నది.

3. సుమేరియనులుకూడా అన్యప్రాంతాలనుండి • సముద్రాలుదాటి సుమేరియాలో ప్రవేశించినారు.

4. పురాణేతిహాసాల్లోని ప్రాచీన చారిత్రక సంప్రదాయాన్నిబట్టి ఆర్యులు భారతదేశపు వాయవ్యసీమలనుండి తరిలి ఉత్తరంగా పశ్చిమంగా వెళ్ళినారట. $

పైన చెప్పబడినదాన్నిబట్టి ఆర్యులో లేదా వారి దాయాదులయిన అసురులో సప్తసింధు ప్రాంతీయ లిపిని సృజించి పశ్చిమాసియాకు, అహిగుప్తదేశానికీ తీసికొని వెళ్ళినారని చెప్పడం అసంభవంకాదు. తదుపరి ఆ లిపినుండి ఆ యా దేశీయలిపులు పరిణమించినవి.

సరిగా లిపినిశోధించి ఇంతవరకూ ఏపండితుడూ చదవ లేదు. లోగడ చదివి వ్యాఖ్యానించినవారు చేసిన నిర్ణయాలు అసంగతాలై పోయినవి. సింధుప్రాంతానికీ సుమేరు, ఇలమ్

---

* హెరొడోటసు 11-44.

• C. L. Wolley గారి " The Sumerians " 189 పుట.

$ F. E. Pargiter రాసిన " Ancient Indian Historical Traditions " XXV.

దేశాలకూ వర్తకసంబంధాలుండేవికనుక రెండుభాషలున్న ఏశాసనమో దొరికితే మొహెంజదరోలోని చిత్రలిపిని అర్థం చేసికోవచ్చును. దానివల్ల అది ద్రావిడభాషకు సంబంధించిందో, ఆర్యభాషకు సంబంధించిందో గ్రహించవీలవుతుంది.

ఆర్య సమస్య

<u>హైందవార్యులు - వారినివాసస్థానము</u> గ్రీకు, లాటిన్, గోథిక్, కెల్టిక్, సంస్కృతము, అవేస్తభాషల్లో పోలికలు చాలాఉండడంచేత ఈ భాషలన్నీ ఒకేకుటుంబానికి సంబంధించినవనీ, మూలభాష ఆదిలోఉండవలెననీ, అది ఇండోయూరపియను లేదా ఇండో జర్మానిక్ భాషనీ, భాషలన్నింటిలోగల సారూప్య వైరూప్యములు తెలిసికోడానికి 'తులనాత్మక' భాషా తత్త్వశాస్త్రమునకు (**Comparative Philology**) పండితులు పునాదులు వేసినారు. ఆర్యసమస్యనుగురించి మాక్స్‌ముల్లర్ పండితుడు ఆర్యశబ్దము జాతిపరమైనదికాదు, అది కేవలము భాషనే తెలియజేస్తుందని ధృవపరచినాడు. ఆయన సిద్ధాంతాన్ని సంపూర్ణంగా పండితలోకం అంగీకరించలేదు. పెఁక అనే పండితుడు భాషకూ - జాతికీ తాదాత్మ్యం ఉద్ఘాటించి మాక్స్‌ముల్లర్ సిద్ధాంతానికి భిన్నమైన పంథాతొక్కినాడు. మొత్తంమీద గతశతాబ్దములో భాషాసమస్య విషయములో రెండు మతభేదాలుద్భవించినవి. భాష మానవుడిలో ప్రకృతి సిద్ధమైన లక్షణమా లేక ఆర్జితలక్షణమాఅని సమస్య. ఆధునిక

కాలంలో మాక్స్‌ముల్లర్ మతానికి ప్రాబల్యం వచ్చింది. భాషావ్యవస్థ మానవజాతివల్ల నిర్ణీతము కాకపోయినప్పటికీ పరిమితమైన సాంఘికవ్యవస్థ ఏర్పడడానికి భాష ప్రోద్బలమవుతుంది. నిజానికి మొదట ప్రతి సహజమైన భాష పరిమిత మానవజాతి మధ్యలో ఉంటుంది. ఏ మానవకూటంలో ప్రాచీన ఇండోయూరపియను భాషపుట్టిందో అది కొంత కాలానికి అన్యభాషకు స్థానమిచ్చి వైదొలిగిపోవచ్చును. అతి ప్రాచీనమయిన పరిమిత మానవకూటము ఎక్కడడుండేదో తెలిసికోవలెనంటే మానవశాస్త్ర (Anthropology) సహాయము కావాలి. మానవశాస్త్రరీత్యా మానవకూటాన్ని గుర్తించిన అనంతరం వానిడునికి భూగోళశాస్త్రరీత్యా కనుక్కోవాలి. ప్రాచీన మానవనివాసం తెలిసికోగలిగితే ఆ తావునే ఇండోయూరపీయభాష ఉద్భవించిందని గ్రహించవచ్చును.

ఇండోయూరపీయ భాషానుడికారము ఏ ప్రాంతములో వ్యాప్తిలోఉన్నదో తెలిసికోవలెనంటే అది యూరపుఖండంలోనేగాని ఆసియాలోకాదు. తద్భాషానుడీకార వ్యాప్తిగల ప్రదేశం ఇండోయూరపీయుల నివాసాన్ని సూచిస్తుంది. తులనాత్మకంగా భాషా తత్త్వశాస్త్ర సహాయంతో ఇండోయూరపీయ మూలభాషకు అతిచేరువగాడున్న భాష, సంస్కృతంకన్న లిథూనియనుభాష అవుతుంది.

ప్రతీరుగా యోచనచేసినప్పుడు భారతభూమి ఆర్యుల ఆదినివాసం కానడానికి వీలుండదు. ఆర్యులు మనదేశీయులే

కాని ఎక్కడనుంచో ఊడిపడలేదనిచెప్పే పండితులసంఖ్య స్వల్పము.

ఆదినుంచీ ఆర్యులు భారతదేశవాసులే అనే సిద్ధాంతం చేసినవారిలో మహామహోపాధ్యాయ గంగానాథఝూగా రొకరు. బ్రహ్మర్షి దేశమువారి ఆదినివాసమని వ్రాసినారు. డి. యస్. త్రివేది దృష్టినిబట్టి ఆర్యులు ముల్తానులో దేవికా నదీ ప్రాంతీయులు. యల్. డి. కల్లా మతాన్నిబట్టి కాశ్మీర హిమాలయప్రాంతాలు ఆర్యనివాసాలు. ఈ సిద్ధాంతాన్ని బలపరిచేవారివాదము విస్తారంగా శ్రీ కె. యమ్. మున్షిగారి **" Glory that was Gurjaradesa "** గ్రంథములోఉన్నది.

ఉత్తర దక్షిణాపథాల్లో ఆర్యేతరభాషలు మాట్లాడే ప్రజానీకంఉన్నారన్న ఒక్కవిషయం గమనిస్తే భారతదేశం ఆర్యుల ఆదినివాసమనేవాదం అసంగతమని అర్థంచేసికోవచ్చును. సంస్కృతభాషలో మూర్ధన్యములు (Cerebral Sounds) ఆస్ట్రిక్ ద్రావిడభాషా ప్రభావంవల్ల ప్రవేశించినవి. ఈ ప్రభావం ఆర్యావతరణం జరిగినప్పుడు సంభవమైంది.

మొహెంజదరోప్రాంతం ఆర్యనివాసమనీ, వారిభాష సంస్కృతమో లేదా సంస్కృతసమమో అనడానికి ఆధారం కనపడదు.

భారతేతరదేశాల్లో ఆర్యజాతి ఆర్యభాష, సప్తసింధు ప్రాంత సంస్కృతికి పూర్వం ఉన్నవని నిర్ణయంచేయడానికి ఆధారాలులేవు. మొహెంజదరోల్లో లభ్యమయిన ఫలకాల

మీది లిపి సరిగాపఠించి వ్యాఖ్యానించ గలిగినప్పుడు క్లిష్ట సమస్యలు పరిష్కారమవుతవి.

భారతదేశంలో అత్యంత ప్రాచీన సంస్కృతి సప్త సింధులోయలోదేనని ఎందుకు పరిగణించాలి ? ఋగ్వేదీయ సంస్కృతి మొహెంజదరో సంస్కృతికన్న ప్రాచీనముకాదా? ఈ ప్రశ్నలకు సమాధానము ఋగ్వేదకాలనిర్ణయం జరిగినప్పుడు లభిస్తుంది.

కేవల భాషాదృష్టితో పరిశీలించినప్పుడు ప్రస్తుత రూపంలోవున్న ఋగ్వేదసంహిత క్రీ. పూ. 1000 సంవత్సరాలకన్న ప్రాచీనంకాదని పరిశోధకులమతం. అవేస్తభాష లోని గాథలకన్న ఋక్సంహిత ప్రాచీనముకాదు. అవేస్త వైదిక సంస్కృతభాషల్లో విశేషభేదం కనబడకపోవడంవల్ల రెండుభాషలూ సమకాలీనములవుతవి, కాని మొహెంజదరో సంస్కృతి క్రీ. పూ. 2500 నాటిది.

ఆర్యుల భారతేతరనివాస నిర్ణయానికి ఇండోఇరానీయుల జాడలు గమనించవలసివుంటుంది. క్రీ. పూ. 1400 నాటి బొఘాజ్‌కోయ్ శాసనంలో, హిట్టైట్ మితన్నీరాజులు ఏర్పరచుకొన్న. సంధికి సాక్షులుగా నలుగురు వైదిక దేవతలు మిత్రావరుణేంద్రనాసత్యులు ఉల్లేఖింపబడినారు. ఈ దేవతా శబ్దాలు ఇండోయూరపీయ భాషాకుటుంబానికి సంబంధించిన ఇండోఇరానీ భాషాస్వరూపాన్ని స్పుటంగా తెలియ జేస్తున్నవి. ఇంతమాత్రాన ఇండోఇరానీయభాష, వైదిక

సంస్కృత భాషానియమాన్నే స్వీకరించిందనీ కేవలం అనగూడదు. హిత్తైట్ భాషలో రథక్రీడకు సంబంధించిన సంఖ్యావాచకాలైన ఐక, తేర, పంజ, సత్తశబ్దాలు బొఘూజ్‌కోయ్ శాసనంలోనే కనబడతవి. ఆ శబ్దాలు ఇండోఆర్య లేదా ఇరానీయ భాషాస్వరూపం ఏర్పడనప్పుడు అతి ప్రాచీనమైన ఇండోఇరానీయ భాషాశబ్దాలు. అయితే కేవలం ఈ బొఘూజ్‌కోయ్ శాసనమేకాక ప్రాచీన ఇండోఇరానీయుల జీవభాష తెలిసికోడానికి మరికొన్ని ఆధారాలున్నవి. అహిగుప్త దేశంలో ఏల్ అమర్నాలో బాబిలోనియా దేశపు ఉలిఆకారపు లిపివల్ల ఇండోఇరానీయ భాషవలెవుండే వంశనామములు కనబడినవి. కపడోషియా సిరియాలోని శాసనాధారాలవల్ల ప్రాచీన అవేస్త వైదిక సంస్కృత భాషలకన్న ప్రాచీనతమమైన ఇండోఇరానీయభాష క్రీ. పూ. 1400 నాటికి ఉండేదని నిస్సంశయంగా చెప్పవచ్చును.

మేయర్ పండితుడు చారిత్రకాధారాలపై ఇండోఇరానీయులు తూర్పుగా పంజాబులో వ్యాపించినారనీ, పశ్చిమంగా కొందరు పామీరు ప్రాంతంనుంచి మెసపొటేమియా తరిలివెళ్ళినారనీ సిద్ధాంతము చేసినాడు. కాని ఆ ప్రాంతంలో ఆ తెగలు కనపడవు. ఇండోఇరానీయులు పశ్చిమానికి స్వస్థానం విడిచి వెళ్లిపోయినప్పుడే భారతదేశంలో వైదిక సంస్కృతి ఆరంభమైంది. మితన్ని (మెసపొటేమియా, సిరియా, పాలస్తీనా) లో క్రీ. పూ. 2000 నాటికి ఆర్యరాజు

లుండేవారని అద్భుతమైన ఉపపత్తులు చూపినాడు మేయర్ విద్వాంసుడు. ఈ సిద్ధాంతంతో ఓల్డెన్‌బర్గు, కీత్, ఫ్రెడరిక్ పండితులు ఏకీభవించినారు. విల్ హెల్మ్, బ్రాండ్‌న్‌స్టెట్ పండితుడు ఇండోఇరానీయుల ఆదినివాసము పామీరు ప్రాంతమో, రష్యాలోని తుర్కీ-స్థానమో కావచ్చునని చెప్పినాడు. క్రీ. పూ. 2000 కిందట ఆర్యులు నిజనివాసం విడిచివెళ్లినారు. క్రీ. పూ. 1500 నాటికి ఇండో ఆర్యులు పూర్తిగా భారతీయులుకాగా వైదికసంస్కృతి ఆరంభమైంది.

అతి ప్రాచీనమైన ఇండోయూరపీయ మానవకూటాలయిన హిత్తైటులు ఇండోఇరానీయులు క్రీ. పూ. 2000 నాడు కపడోషియాలోను, మధ్యాసియాలోను ఉండిఉండడంచేత ఈ రెండు తెగలవారి స్వస్థానాలు కపడోషియా మధ్యాసియాలకు సమీపంలోనే ఉండవచ్చునని ఊహచేయవచ్చును. ఏతావతా తేలినవిషయం భారతదేశంకానీ మధ్యాసియాకానీ పశ్చిమయూరపుకానీ ఇండోయూరపీయుల ఆదిమనివాసం కావడానికి వీలులేదు.

ఆసియా ఖండాంతరమైన ఇండోయూరపీయ భాష లలోచేరిన తుఖారియన్ భాషావిషయం ఆలోచిస్తే ఆర్య నివాస పరిష్కారం కావచ్చును. Hirt పండితుడుచేసిన సిద్ధాంతరీత్యా ఇండోయూరపీయులు విడిపోయేముందు విష్ట్యులానదికి ఉభయతీరాల్లో నివసించేవారట. ఇలా చెప్పడానికి కారణం సెంటంభాషలు విష్ట్యులానదికి పశ్చిమాన,

శాతంభాషలు నదికి తూర్పునఉన్నవని ఇండోయూరపీయ భాషావిభజనము, తూర్పుతుర్కిస్థానంలో సెంటంభాషయిన తుఖారియన్ ఉన్నదని తెలిసికొని, దానికీ ఇండోయూరపీయ భాషకూగల సంబంధాన్ని, తొలినుడికారాస్ని బెన్వినిస్టే మహాశయుడు పరిశోధన చేయడంవల్ల హర్టుసిద్ధాంతం వీగి పోయింది. బెన్విస్టే మతరీత్యా తుఖారియన్ భాష హిత్తైటు భాషలెనే విశిష్టమైనది. సెంటం శాతం అనే భాషా విభజనకు పూర్వమే విష్ణులానదికి తూర్పున తుఖారియను భాష మానవ వ్యవహారంలో వుండేది.

ఐరోపాలో ఇండోయూరపీయ భాషాకుటుంబానికి చెందిన లిథూనియన్ భాష అత్యంత ప్రాచీనమని నిస్సందేహంగా చెప్పనచ్చును. సెంటం శాతం అనే భాషావిభజనకు పూర్వమే ఇండోయూరపీయతెగ లిథూనియాలో ప్రవేశించింది ఆ దేశము అరణ్యమయము కావడమువల్ల జాతీయ జీవితములో అభ్యుదయరేఖ గోచరించదు. చెప్పదగిన అద్భుత పరిణామాలూ సంఘటనలూలేవు. అందుచేత లిథూనియాకూ ఇతర ప్రపంచానికీ అనగా ఇతరభాషలతో సంబంధము లేక పోవడంవల్ల మారిభాష వికాసంచెందక ప్రాచీనస్థితిలోనే నిలిచింది. ఈ లిథూనియా భాషాశబ్దాలు ఫిన్లాండుకు చెందిన ఫినిష్భాషలో ఎక్కువగాఉన్నవి. స్లావులభాషలో లిథూనీయశబ్దాలు కొద్దిగాఉన్నవి. దీనినిబట్టి లిథూనీయభాష ప్రాధ్యశలో చరిత్రకుపూర్వం వ్యాప్తిపొంది, స్లావులను

ఫిన్‌లాండ్ దేశీయులనూ బహుశ వేరుచేసి ఉండవచ్చును. ఈ అభిమతాన్ని హార్ట్ పండితుడు చెప్పినాడు.

అత్యంత ప్రాచీనభాషగా ప్రసిద్ధమయిన గ్రీకుభాషను గ్రీకులు ఆదిలో మాట్లాడేవారుకారు. క్రీ. పూ. 1200 నాటికి అనగా మైసీనియ నాగరకత క్షీణమవుతున్నప్పుడు **Achaians** గ్రీసులో గ్రీకుభాష మాట్లాడడం ఆరంభించారు. కాబట్టి ఇండోయూరపీయ భాషమాట్లాడే తెగలు తొలిసారి క్రీ. పూ. 1200 నాటి గ్రీసులో ప్రవేశించారన్నమాట. అయితే ఈ తెగలు ఏ ప్రాంతంనుంచి గ్రీసుకువచ్చాయో చెప్పడానికి తగిన ఆధారాలులేవు.

అందుచేత అతి ప్రాచీనములయిన లిథూనీయ, గ్రీకు భాషలు (ఇండోయూరపీయభాషలు) పల్లె ఆర్యనివాసం యూరపుఖండంలోనని చెప్పడానికి వీలుకలగలేదు.

భాషాదృష్టితో తదితర ఇండోయూరపీయ భాషా కుటుంబానికి చెందిన భాషలనుగురించి ఆర్యసమస్యా పరిష్కారం నిమిత్తం వివరించి ప్రయోజనంలేదు. ప్రయోజనం లేకపోయినా కొందరు ఆర్యులనివాసం జర్మనీకానీ, దానిసమీపములోవున్న దేశమైనా కావచ్చునని సిద్ధాంతం చేయసాహసించారు. ఈ ఊహ చేసినవాడు 'పెంక' అనే పండితుడు. సిద్ధాంతం చేయడమంటే మోజుకొద్దీ స్కాండినేవియా ఆర్యనివాసమని వ్రాసినాడు.

ఆధునికులు పెంకేమతాన్ని తోసివేసి భాషా శాస్త్ర ధారాలమీద ఆర్యనివాస నిర్ణయవిధానంమాని, పురాతత్త్వ పరిశోధనలో దిగినారు. తత్ఫలితంగా దక్షిణాసియా ఆర్యుల తొలినివాసమనీ అక్కడనుండి పశ్చిమదిశగా చాలామేర వ్యాపించారనీ నెహ్రింగ్ ప్రభృతులు వాసినారు.

ఇటీవల ఆర్యసమస్యను ఐరోపీయ విద్వాంసులు జాతి సమస్యతో ముడిపెట్టినారు. భాషాతత్త్వశాస్త్ర, పురాతత్త్వ ములవల్ల ఆర్యనివాస నిర్ణయంచేయలేక జాతులకు సంబంధించిన మానవశాస్త్రాన్ని **(Racial Anthropology)** ఆధారం చేసికొని పరిశోధన చేస్తున్నారు. తళతళలాడేజుట్టు ఇండో యూరపీయుల ముఖ్యలక్షణంగా భావించి, జర్మనీదేశము ఇండోయూరపీయుల ఆదినివాసంగా తేల్చినారు కొందరు. ఎఱసి తళతళలాడే కేశపాశము ముఖ్యలక్షణమయితే బ్రాహ్మణులకూ అలాంటి కేశమే ఉండెవలెనని పతంజలి మహర్షి మహాభాష్యములో చెప్పినాము. ఎఱని జుట్టున్న బ్రాహ్మణులు భారతదేశంలో ఉన్నప్పుడు భారతదేశంకూడా ఇండోయూరపీయ నివాసంగా ఈ జాతివాదులైన పండితులు చెప్పరేమి?

బ్రాన్‌డెన్‌స్టీన్ సిద్ధాంతం 'అర్థవిపరిణామ' రీత్యా **(Semantic method)** బ్రాన్‌డెన్‌స్టీన్ భాషాతత్త్వవేత్త, భాషాశాస్త్ర సంబంధమయిన 'అర్థవిపరిణామ' శాస్త్రాధారంగా **(Semantics)** ఆర్యనివాస నిర్ణయంచేయాలని నూతన పరిశోధనా

పథము తొక్కినాము. అతి ప్రాచీనులైన ఇండోయూరపీయుల సాంస్కృతిక పరిణామమూ, చరిత్రకుపూర్వం వారిస్థావరాలనూ తెలిసికోడానికి ఇండోయూరపీయ భాషాశబ్దాల అర్థ విపరిణామంవల్ల **(Indo European Semanticology)** ఆ యా పదజాలంలో ప్రజల స్థితిగతులను గ్రహించే అవకాశం చాలాఉంది. దుహితృ శబ్దానికి మొదట పాలుతీసేపిల్ల అనిఅర్థం. గోదోహననిమిత్తం ఇంట్లో కుమార్తెను కన్యను నియోగించే అలవాటు ఉండేది. క్రమేణ ఆ శబ్దార్థము కుమారి అని స్థిరమైంది. ఈ విశేషార్థం సాంఘిక పరిస్థితుల వల్ల సంక్రమించింది. ఈ అర్థవిపరిణామమును **Semantics** అంటారు. ఇండోయూరపీయ భాషలన్నింటినీచేర్చి శబ్దార్థ విపరిణామమూ, తదర్థానికి కారణభూతమైన మతసాంఘిక రాజకీయ పరిస్థితులను ఆయన శోధించినాము. ఈ రీతిగా గవేషణ చేసినతరువాత ఆయన చెప్పినదిది:—ఇరానీయుడు ఇండోయూరపీయులనుండి చీలిపోయిన మొట్టమొదటి తెగ. ఈ మానవకూటం స్వస్థానం విడిచివెళ్ళినతరువాత మిగత ఇండోయూరపీయు తెగలు కొంతకాలం కలిసిమెలిసి ఉండేవి. ఇండోఇరానీయులు చీలిపోయి తరిలివెళ్ళిన తదుపరి ఇండోయూరపీయులను ఆనంతర ఇండోయూరపీయులనీ తెగలు చీలకపూర్వం ఏకకూటంగా ఉన్నప్పుడు ఆది ఇండోయూరపీయులనీ ప్రొటోజెన్స్టిక్ పేర్లుపెట్టినాము. ఆయన అభిమత రీత్యా ఆది ఇండోయూరపీయ పదాలవల్ల వారి తొల్లింటి

నివాసం పర్వతపాదమూలమనీ, బహుశ యూరలు కొండలకు దక్షిణంగా పశ్చిమోత్తరదిశలోఉన్న ఖర్గీజ్ అన్‌స్టెప్పీలు అనగా సమశీతల పచ్చికబీళ్ళని తేల్చినారు. దక్షిణరష్యా ఆర్యుల ఆదివాసమని ఏతావతా ఆధునిక విద్వాంసుల నిర్ణయం.

ఆర్యుల స్థావరాలు

ఋగ్వేద సంహితలో స్థావరాలేర్పరచుకొన్న ఆర్యుల కూటాలు చాలా కనబడతవి. తెగలన్నింటినీ పాలించే శాసకులుండేవారు. ఋగ్వేదములో దశరాజుల యుద్ధము చారిత్రకంగా ముఖ్యమైనది. ఆ యుద్ధంలో ప్రముఖులయిన కూటనాయకులు, నృపులు పాల్గొన్నారు. ఆ కాలంలో ప్రసిద్ధమైన భరతాన్వయం యమునా సరస్వతీ ప్రసవంతుల మధ్య ప్రాంతంలో ఉండేది. వారిప్రభువు సుదాసుడనేవాడు విశ్వామిత్రుని నాయకత్వాన ఏర్పడిన సమిష్టికూటాన్ని ఎదుర్కొన్నాడు. విశ్వామిత్రపక్షంలో చేరినవారు పూరు, యదు, తుర్వస, అణు, ద్రుహ్యులనే అయిదు కూటాల వారునూ అలిన, పక్థ, భలానస, శివ, విషాణినులనే మరో అయిదు అప్రసిద్ధ వంశీయులూ ఈ కూటాలవారితోనే కాక సుదాసుడు మూడు అనార్యకూటములయిన అజ, శిగ్రు, యక్షులను ఎదిరించినాడు.

భరతులకూటానికి యుద్ధతంత్రనైపుణికలదు. అందు చేత వారు పశ్చిమాన ఆర్యులనూ, ప్రాగ్దిశ అనార్యులనూ జయించినారు.

భరతులతో కలిసిమెలిసి శత్రువులతో యుద్ధాలు సాగించిన త్రిత్సులనే కూటముగా ప్రసిద్ధము. వీరిలో దివో దాసుడనేరాజు మహావిజేత. దివోదాసుకు పూరు, యదు, తూర్వాసులను ఒకవైపుజయించి మరోవైపు దాసరాజైన శంబరుణ్ణి, పణులనూ జయించినాడు.

పూరులు ఋగ్వేదములో అనుగ్రహ్య, దుర్వాస, యదుకూటా లతోపాటు వీరు పేర్కొనబడినారు. భరతులవల్ల వీరు పరాజితులైనా ఋగ్వేదములో ప్రసిద్ధులు. పూరుప్రభులైన పురుకుత్సుడు సుదాసునికి సమకాలికుడు.

కురులు ఋగ్వేదములో ప్రత్యేకంగా 'కురు' కులనామము కనపడదు. ఆనంతర సంహితాకాలంలో త్రిత్సు, భరత, పూరుకూటాలు ఏకమై కురుకూటం ఏర్పడింది. కురుశ్రవణుడు ఈ తెగకు రాజు.

కృవులు వీరప్రసిద్ధులు. సింధు అసిక్నీ నదీపాంతీయులు. వీరికి కులంతో సంబంధం ఉండేది.

కృంజయులు త్రిత్సులతో మైత్రి నెరపిన మరొక తెగ. వీరు పూరుల మిత్రులై భరతులతో పోరాటంచేసినారు.

మత్స్యులు పౌరాణికయుగంలో మధురకు పశ్చిమానఉండేవారు.

అజులు, శిగ్రులు, యక్షులు ప్రాగ్దేశీయులు, అనార్యులు, పక్తులు, భాలానసులు, విషాణినులు భారతసీమలోని తెగలు.

చేదితెగ వింధ్యాయమునలమధ్య నివసించేవారు. పౌరాణిక యుగవాఙ్మయంలో చేదులు యదుకులోద్భవులుగా గణింప బడినారు.

ఉసీనరులు వీరు 'మధ్యదేశ' వాసులని ఐతరేయ బ్రాహ్మణంలో ఉన్నది.

గాంధారీయులు పశ్చిమోత్తర భారతదేశీయులు. వారివృత్తి గొఱ్ఱెలపెంపకమూ, ఉన్నితీయడమున్ను.

పారావతులు యమునాతీరవాసులు.

కీకటులు యాస్క-మతంలో వీరనార్యులు. మాగధులు.

పణులు ఆర్యులకు శత్రువులు. దాసదస్యులతోపాటు వీరు ఋగ్వేదములో కనబడుతున్నారు. పణులు దేవతారాధకులు కారు. పురోహితులను గౌరవించేవారుకారు. అమిత స్వార్థపరులు. వీరివాక్కు- పరుషము. వీరికి గోధనము ఎక్కువగా ఉండేది. రాక్షసులవలె క్రూరకార్యములు చేసేవారనీ, ఇతరుల గోవులను హరించేవారనీ ఋగ్వేదములో ఉన్నది. పణులు వణిజులై ఉంటారు. విజ్ఞులు వీరిని అనార్యులని భావించినారు. బహుశ సముద్ర వాణిజ్యము చేసేవారై ఉంటారు. ఆ కారణంచేతనే ఆర్యసంస్కృతి పశ్చిమదేశాలకు వ్యాప్తమైనదని చెప్పవలసివస్తుంది.

దస్యులు వీరనార్యులుగా ఆర్యశత్రువులుగా ఋగ్వేదములో కనబడుతున్నారు, కోటలుకట్టుకొన్న పట్టణాల్లో వీరినివాసం.

కొన్నాళ్ళకు తెగలుగా చీలిపోయినారు. దాసదస్యులు కృష్ణ వర్ణులు. అనాసులు. నాసికలు ఉన్నప్పటికే చదునుగాఉంటవి. వీరిది దోషవాక్కు. దస్యశబ్దమువలె 'దాస' శబ్దము నిందా గర్భితంకాదు. బ్రహ్మణాలకాలం నచ్చేసరికి దాసులకు బానిసలనేఅర్థం రూఢమైపోయింది. సరస్వతీ నదీప్రాంతీయులు వీరని కొందరిమతం. దాసకూటాలు, కీరాటులు, కీకటులు, చండాలురు, పర్ణకులు, సిమ్యులు గంగానదీప్రాంతంలో నివసించి భరతులతో పోరాడినారు.

దస్యులకు కర్మాధికారంలేదు. భక్తితాత్పర్యం లేని వారు. యాగాదులు వీరికికిట్టవు. నియమాలులేనివారు.

అసురులు ఆర్యులకు శత్రువులు. ఆర్య అసుర శత్రుత్వం ఋగ్వేద కాలానంతరం బయలుదేరింది. స్లైక్కోనోవ్ పండితమతంలో వీరు మాన్యులుకారు. బెనర్జీ పండితుని దృష్టిలో వీరసీరియావాసులు. వీరే సప్తసింధునాగరకతకు కారకులు. శతపథ బ్రాహ్మణాన్నిబట్టి మగధలో అసురులు స్థావరాలుండేవి.

రక్షులు తొల్లింటి వైదికవాఙ్మయంలో రక్షులు రక్కసులని వేదానుక్రమణికలో ఉన్నది. ఏతెగవారూకారు.

పిశాచులు ఏతెగవారూకారు. సూత్రకాలములో ఒకకూటమైనారు.

ఆనంతర సంహితా బ్రాహ్మణోపనిషత్కాలంలో ఋగ్వేదములో పేర్కొనబడిన ప్రాచీనకూటాలు నామ రూపాలు లేకుండాపోయినవి. కొన్ని తెగలు అన్యకూటాలతో కలిసిపోయినారు. కొత్తతెగ లుద్భవించినవి. ఋక్సంహితా కాలంనాటి పంజాబులోని పూరు, అను, ద్రుహ్య, యదు, తూర్వాసులనే ప్రసిద్ధకూటాలు బ్రాహ్మణోపనిషత్కాలంలో అప్రధానాలైపోయినవి. పూరు భరత వంశీయులు కురులతో కలిసిపోయినారు. ఈకాలములో పాంచాలురు ప్రసిద్ధులైనారు. ప్రత్యేకంగా భరతాన్వయానికి కూటంగా ప్రతిష్ఠ తగ్గిపోయింది. అయితే భరతవంశప్రభువుల యశస్సు పోలేదు. గంగాయమునాతీరాల్లో వా రశ్వమేధాలు చేసినారు. కాశీ వాసులనూ సాత్వతులనూ ఓడించినారు.

<u>కురులు</u> ఉశీనరులతోపాటు కురులుకూడా మధ్యదేశం ఆక్రమించినారు. కురురాజయిన *పరీక్షితునిరాజ్యం తృణకాష్ఠ జలసమృద్ధంగా ఉండేదట. ఈ కురురాజ్యము ప్రస్తుతమున్న స్థానేశ్వరం. ఢిల్లీ గంగానదీమండల మధ్యదేశములతో సరిపోతుంది.

<u>పాంచాలురు</u> కురుమిత్రులు వీరు. శతపథబ్రాహ్మణాన్నిబట్టి వీరి పూర్వనామము కృవులు. కురుపాంచాలురు కలిసిమెలిసిఉన్న కూటాలు. పాంచాల నరపతిఅయిన ప్రావాహణ జైనలి

---

* అథర్వణవేదము 20_127 ; 7_19.

ఉపనిషత్కాలంలోవాడు. బ్రాహ్మణాలకాలంలో కురుపాంచాలురు సమైక్యత పొందుటవల్ల రెండుకూటాలకూ పాలకుడొకడే. కురుపాంచాలప్రదేశాలలో ప్రభువులందరికీ ప్రాతస్మరణీయులుగా ఉండేవారు. రాజసూయాది అధ్వరాలు ప్రసంసనీయంగా ఆచరించేవారు. రమణీయమైన వాక్కు-వినవలెననివుంటే కురుపాంచాలాల్లోనే వినవలెననే ప్రశంస సంహితా బ్రాహ్మణాలలో ఉన్నది.

పీతహవులు సుదాసునకు సమకాలికకూటము.

వాసఉసీనరులు గోపథ బ్రాహ్మణకాలానికి వాసఉసీనరులు కలిసిపోయినారు. కాశీ విదేహకూటాలవారి పూర్వులు ఉసీనరులు. వాసులు కొంతకాలానికి వత్సులై కౌశాంబిని రాజధానిగా చేసికొన్నారు.

శిబులు ఉసీనరులతో వీరికి సంబంధం ఉన్నది. ఇరావతీ చంద్రభాగానదీ మధ్యప్రాంతవాసులు.

మత్స్యులు బ్రహ్మర్షి దేశవాసులు. సాళ్వులతో సంబంధం ఉండేది వీరికి.

ఇక్ష్వాకులు ఇక్ష్వాకశబ్దము ఋగ్వేదములో దశమమండలములో ఒకేసారి కనబడుతుంది. ఇక్ష్వాకు శబ్దము రాజకుమారుణ్ణి సూచిస్తున్నది. శతపథ బ్రాహ్మణంవల్ల పురుకుత్సుడు ఇక్ష్వాకు వంశీయుడు. ఇక్ష్వాకులు కురువంశాంతర్గతులు. ఒకప్పుడు సరస్వతీ నదీప్రాంతవాసులు. క్రమంగా వారు అయోధ్యావాసులూ ప్రాగ్దేశీయులైనారు. ఆంధ్ర ఇక్ష్వాకుల

శాఖ అయోధ్యలోని ఇక్ష్వాకులకూ సంబంధం వుండ వచ్చును.

కోసల విదేహులు తొలిసారి వీరు శతపథంలో కనబడతారు. ఆర్యసంస్కృతికి వ్యాప్తికి కారణభూతులు. కోసల విదేహులు కలిసిమెలిసినారు. కురు పాంచాలురకూ కోసల విదేహులకూ వైరంఉండేది. కురుపాంచాలాల్లో ఉన్న బ్రాహ్మణధర్మము కోసలంలో తక్కువ. విదేహులలో జనకరాజు ఉపనిషద్వాదాలను ప్రోత్సహించడంవల్ల స్వయంగా దార్శనికుడు కావడం చేత విఖ్యాతుడైనాడు.

కాశి కాశీ, కోసల విదేహులతోపాటు బ్రాహ్మణాలకాలం లోనే వాసికెక్కింది. కాశీ విదేహులకు సన్నిహితత్వంఉండేది.

మాగధులు లేక వ్రాత్యులు బ్రాహ్మణోపనిషత్కాలంలో మాగధులుద్భవించినారు. ఆదినుంచీ మాగధులను శ్రోత్రియులు చిన్నచూపు చూస్తూనే వచ్చినారు. అథర్వణవేదంలో (15_2. 1-4) వ్రాత్యసూక్తమున్నది. వేదాలన్నింటికీ భాష్యం రచించిన సాయణాచార్యులవారు వ్రాత్యసూక్తాన్ని విడిచిపెట్టినారు. ఈ సూక్తమువల్ల మాగధులే వ్రాత్యులని తెలుస్తుంది. మగధను దక్షిణబీహార్ అంటారు ప్రస్తుతం. పురుషమేధంలో యజ్ఞ పశువులకింద మాగధులను చేర్చింది యజుర్వేదం. జిమ్మర్ విద్వాంసుని మతంలో మాగధశబ్దం మార్య క్షత్రియ సాంకర్యంవల్ల ప్రతిలోమని సూచిస్తుంది.

మాగధుడు మగధనివాసి. అంతేకాని ప్రతిలోమ వివాహం వల్ల పుట్టినవాడుకాడు. వేదానుక్రమణికరీత్యా మగధ గాంధర్వవిద్యకు ప్రసిద్ధి. కనుక మాగధుడు గాయకకులానికి సంబంధించినవాడనీ, ప్రతిలోమ వివాహంవల్ల జన్మించిన శూద్రవర్ణుడనీ, మధ్యమయుగంలో స్మృతికారులు కట్టుకథ అల్లినారు. ఋక్ సంహితాకాలంనుంచీ వ్రాత్యులంటే చిన్న చూపు చూడడానికి కారణం వారు బ్రాహ్మణమత ధర్మానుష్ఠానం చేసేవారుకారు. రాత్, విట్నీ, బ్లూంఫీల్డు పండితులు వ్రాత్యులను అనార్యులని ఉల్లేఖించినారు. సూత్రాలనుబట్టి వ్రాత్యులు ఆర్యులేఅయినా బ్రాహ్మణ కర్మానుష్ఠానం వేదచోదితమైంది. ఆచరించనివారు కనుక అగ్రజాతిలో చేరలేదు. మొదట సరస్వతీ ప్రసవంతికి పశ్చిమాన దేశదిమ్మరులయిన వ్రాత్యులు మగధలో స్థావరం ఏర్పరచుకొన్నారు.

సాత్వంతులు శతపథంవల్ల సాత్వంతులు భరతరాజుచేతుల్లో పరాజితులయినట్లున్నది. వీరు గంగా యమునా తీరవాసులు, కురురాజ్యానికి పొరుగున ఉన్నవారు.

విదర్భ ప్రస్తుతపు బీరారు. రాజధానిగా కుండినఉండేది.

నిషధ విదర్భ సమీపంలోఉంది. నలుడు పాలించినాడు. నిషధకూ నిషాదులకూ సంబంధములేదు.

బాహికులు పశ్చిమ పంజాబు వాసులని శతపథం చెబుతుంది.

ఉత్తరకురు ఉత్తరమ్రదవాసులు హిమాలయములవెనుక ఉండేవారు. ఐతరేయములో ఉత్తరకురుల ప్రస్తివస్తుంది. వీరు కశ్మీరవాసులనడం సమంజసం. బౌద్ధయుగంలో వీరు చీనాబ్ రావి నదులమధ్య ఉండేవారు.

ముజావంతులు హిమాలయ పర్వతవాసులు.

గాంధారులు బ్రాహ్మణములకాలంలో గాంధారం వేదాదివిద్యలకు ప్రసిద్ధము. ఐతరేయంవల్ల గాంధారులుకూడా వైదికార్యులు.

కేకులు బహుశ పాంచాలురలో ఒకశాఖ.

కేకయులు శతపథం, ఛాందోగ్యోప నిషత్తులవల్ల అశ్వపతి కేకయరాజు, మహావిద్వాంసుడు. బ్రాహ్మణాలకాలంలో వీరు సింధువితస్తా ప్రవంతీమధ్య భాగవాసులు.

కాంభోజులు యాస్కుని వచనాన్నిబట్టి వీరు మాట్లాడేది అనార్య భాష. దానికి కారణము పారశీక భాషాప్రభావం కావచ్చును. వేదోపాధ్యాయులకీ ప్రాంతం ప్రసిద్ధం. సింధునదికి పశ్చిమోత్తరాన వీరినివాసం. నిజానికి కాంభోజీయులు వైదికార్యులే.

ఆంధ్రులు ఐతరేయాన్నిబట్టి ఆంధ్రులు, పుండ్రులు, శబరులు, పులిందులు, మూతిబులూ దస్యులు. మహాభారతరీత్యా ఆంధ్రులు శబరపులిందులు దక్షినులో తెగలు. మొదట కృష్ణా గోదావరీనదుల మధ్యభాగంలో నివసించేవారు. ఆదిలో ప్రాకృతం తరువాత ఆంధ్రమూ మాట్లాడుతున్నారు.

పుండ్రులు బిహారువాసులు. వీరిరాజధాని పౌండ్రవర్ధనము.

శబరులు టాలెమీ మతాన్నిబట్టి విశాఖమండలంలో ఏజన్సీ కొండలలో వుండేసవరలు శబరులు.

పులిందులు అశోకునికాలంలో ఆంధ్రులతోపాటు వీరు వసించే వారు. మహాభారతాన్నిబట్టి వీరినివాసం భిల్సాకు ఆగ్నేయ భాగము.

మూతిబులు లేదా ముషికులు లేక మూచిపులు హైదరాబాదులో ముసీనదీ ప్రాంతీయులు. ఇది రాయ్‌చౌదరీ అభిప్రాయం.

విషాదులు వీరు ప్రత్యేకకూటానికి చెందినవారుకారు. ఆర్యుల ప్రాపకంలోవున్న అనార్యులు. స్మృతికారమతాన్నిబట్టి బ్రాహ్మణజనకునికీ శూద్రమాతకూ జన్మించినవారు. పురాణములనుబట్టి వింధ్య సాత్పూరాపర్వత సమీపస్థులు.

దీనివల్ల ఆర్యులు క్రమంగా బ్రాహ్మణోపనిషత్ కాలానికి తూర్పుగా, దక్షిణోత్తరాలుగా వ్యాపించారని గ్రహించవచ్చును. ఆర్యప్రభావం ఆర్యావర్తంలో అంతటా ఉండేది.

పరీక్షితుని సింహాసనారోహణంవరకూ
సాంప్రదాయిక చరిత్ర

సాంప్రదాయిక చరిత్రకు కాలనిర్ణయము చేయడానికి మహా భారత యుద్ధకాలము చాలాముఖ్యము. దీనివల్ల పౌరాణిక

రాజవంశాల కాలాన్ని నిర్ణయంచేయ సాధ్యమవుతుంది. మహాభారతయుద్ధము ఏనాడుజరిగిందో పరిశీలన చేయవలసి ఉంటుంది.

రెండవపులకేశి చెక్కించిన ఐహోలు శాసనాన్నిబట్టి భారతసంగ్రామం క్రీ. పూ. 3102 లో జరిగింది. అది కలి యుగారంభమని ఆర్యభట్టమతం. వృద్ధగర్గ, వరాహమిహిర కల్హణులు కలియుగానంతరం 653 సంవత్సరములకిందట భారత యుద్ధం జరిగిందని గ్రహసినారు. అనగా క్రీ. పూ. 2449 అన్నమాట. ఇవి భిన్నమతాలుగా ఉన్నవి. వీటికి అంతగా ప్రమాణమివ్వలేము.

పార్జిటరు పండితుడు పౌరాణిక సంప్రదాయాన్ని పరిశీలించి జనమేయ పౌత్రుడైన అధిసీమ కృష్ణునికీ మహాపద్మ నందుని సింహాసనారోహణానికీ మధ్యకాలంలో అనగా క్రీ. పూ. 950 భారత యుద్ధకాలమని నిర్ణయము చేసినాము. మహాపద్మని సింహాసనారోహణము క్రీ. పూ. 882 లో జరిగింది.

పార్జిటరు సిద్ధాంతాన్ని పురాణములూ మహా భారతమూ అంగీకరించవు. పరీక్షితుని జననము మహాపద్మ నందుని సింహాసనా రోహణమునకూ మధ్య 1015 వత్సరాల వ్యవధి వుండడంచేత భారతయుద్ధకాలం (1015 + 382) క్రీ. పూ. 1397 కావచ్చును. దీనినిబట్టి రమారమి క్రీ. పూ.

1400 భారత సంగ్రామకాలమనీ లేదా క్రీ. పూ. 1000 గానీ గ్రహించవచ్చును.

మహాభారతకాలంనుంచి వెనక్కు లెక్కవేసుకొంటూ 95 తరాలు వెళ్ళగా, క్రీ. పూ. 3110 నాటివాడు వైవస్వత మనువు. ఒక్కొక్కతరం 18 ఏళ్ళ దామాషా లెక్కవేస్తే, 95 తరాలకూ 95 × 18, దానికి భారతకాలం క్రీ. పూ. 1400 కలపగా క్రీ. పూ. 3110 లో వైవస్వతమనువు పరిపాలనారంభమవుతుంది. శతపథ బ్రాహ్మణవచనప్రకారం జల ప్రళయము వచ్చినప్పుడు మనువు మానవాళిని సంరక్షించినట్లు కనబడుతుంది. ప్రాచీనయుగంలో భూమండలాన్ని సంక్షోభింప జేసిన జలప్రళయం అతి ప్రాచీనచరిత్రకు నాంది. మెసపొటేమియాలో ఆ ప్రళయం క్రీ. పూ. 3100 లలో సంభవించినట్లు కనబడుతున్నది.

<u>వైవస్వతమనువు</u> క్రీ. పూ. 3100—3102 లో జలప్రళయం సంభవించింది. అదే కలియుగారంభము. సాంప్రదాయిక చరిత్రలో మనువు ఆదిప్రభువు.

మానవకోటిని ఉద్భవింపజేసిన మూలపురుషుడు మనువు. పురాణాల్లో చెప్పబడిన రాజవంశావళులన్నింటికీ మనువు మూలపురుషుడు. పార్జిటరు పరిశోధననుబట్టి మనువు కుమార్తెపేర్లు :-ఇక్ష్వాకువు, నాభాగుడు, ధృష్టుడు, శర్యాతి, నరిష్యన్తుడు, ప్రాంశువు, నాభానేదిష్టుడు, కరుషుడు, పృష

ధరుమ. వీరిలో నలువురే రాజవంశములకు మూలపురుషులయినారు. ఇక్ష్వాకుని రాజధాని అయోధ్య. అతనిసుతుమ వికుక్షి. ఇది సూర్యవంశము. నాభాగునివంశము గంగానదీ మధ్యమండలాన్ని పాలించింది. ధృష్టునివంశం వాహ్లీకాన్ని ఏలింది. వీరిలో వర్ణవ్యవస్థ యేర్పడకపోవడంచేత కొందరు బ్రాహ్మణులు, కొందరు క్షత్రియులు, వైశ్యులుగా ఉండేవారు. శర్యాతివంశము ఆనర్తమనే ఘూర్జరదేశాన్ని ఏలింది. నరిష్యన్త ప్రాంశులవంశాలు తెలియవు. నాభానేదిష్టుమ వైశాల రాజవంశ స్థాపకుమ. రాజధాని వైశాలి. కరూషుని వల్ల కారూషరాజవంశం ఉద్భవించింది. శోణాశ్వదికి తూర్పు దెస వీరు పాలించినారు. పృషధరుమ రాజుకాలేదు.

ఇలను బుధుమ పెళ్ళాడగా. దంపతులకు పురూరవుమ పుట్టినాడు. ఇది చంద్రవంశము. ఐలులనుండి కాన్యకుబ్జ యాదవ (హైహవ, అంధక, వృష్ణి), దుర్వాస, ద్రుహ్య, ఆణవపాంచాల బృహద్రథ చేదివంశా లుద్భవించినవి.

కరుష నాభాగ ధృష్ట నరిష్యన్త ప్రాంశు పృషధర రాజవంశాలు చంద్రవంశీయులైన పురూరవ నహుష యయాతులవల్ల నశించిపోయినవి. పురూరవ వంశీయులు విజేతలూ పాలకులయినారు.

యయాతి క్రీ. పూ. 3000—2750 ఐలపురూరవుమ చంద్ర వంశానికి మూలపురుషుడు. సప్తద్వీపాలు జయించి అత

దశ్వమేధాలు చేసినట్లు పురాణాలవల్ల తెలుస్తుంది. ఊర్వశీ పురూరవగాథ ప్రసిద్ధము. పురూరవుని తరువాత ఆయువు రాజైనాడు. ఇతడు కాన్యకుబ్జ వంశస్థాపకుడు. ఇతనికి అయిదుగురు కుమారులు. పెద్దవాడు నహుషుడు రాజైనాడు. రెండోవాడు కాశీకి రాజైనాడు. నహుషుని పతనగాథ లోక విదితం. నహుషుని అనంతరం యయాతిరాజై మధ్యదేశాన్ని కాన్యకుబ్జాన్ని జయించినాడు. దేవయానీ యయాతుల ప్రతిలోమ వివాహం మహాభారతంలో ప్రసిద్ధం. యయాతి పుత్రులు యదు తూర్వాసులు. యయాతికీ శర్మిష్ఠకూ అను ద్రుహ్యాపూరులు జన్మించినారు. యయాతి రాజ్యాన్ని అయిదుగురికీ పంచివేసినాడు. పూరుడు ప్రతిష్ఠానం రాజధానిగా చేసికొని మధ్యదేశాన్ని, గంగాయమునా నదీ మధ్యమండలాన్ని పాలించినాడు. ఈ వంశం పూరువంశమనీ, పౌరవంశమనీ వాసికెక్కింది.

ఐలురు ప్రతిష్ఠాన యాదవ, తూర్వాస, ఆనవ, ద్రుహ్య, కాన్యకుబ్జ కాశీరాజ్యాలు స్థాపించారు. పూరుడు కనిష్ఠుడయినా రాజ్యార్హుడు కావడానికి కారణం తండ్రికి విధేయుడు. పూరుని అనంతరం జనమేజయుడు రాజ్యానికి వచ్చినాడు.

యయాతి జ్యేష్ఠపుత్రుడు యదువు. యదువు యాదవ వంశ మూలపురుషుడు. యాదవవంశం చీలిపోగా యాదవ హైహయశాఖ లేర్పడినవి.

సూర్యవంశము మనువు కుమార్తెవల్ల వృద్ధిచెందిన రాజవంశాలలో అయోధ్యకు సంబంధించిన సూర్యవంశాంతర్గతమైన విదేహ వైశాలశార్యాతమవంశాలు ప్రసిద్ధాలు. మనువుకు జ్యేష్ఠపుత్రుడు ఇక్ష్వాకుడు. అతడయోధ్యకు ఆదిరాజు. ఆయన నూర్గురుకుమార్తెలలో వికుక్షి నిమి దండులు ప్రసిద్ధులు. వికుక్షికుమారుడు పురంజయుడు. ఇతనికి కాకుత్స బిరుద నామమున్నది. ఇతడు శ్రావస్తి నిర్మాత. ఇతని పౌత్రుడు కువలాశ్వుడు అసురులను జయించి ఆర్యసంస్కృతి వ్యాపింప జేసినాడు. ఇతని ఎనిమిదవతరంవాడు రెండవ యువనాశ్వుడు. ఆయనసుతుడు మాంధాత.

ఇతర సూర్యవంశశాఖలు ఇక్ష్వాకుని పుత్రుడైన నిమివల్ల విదేహ రాజవంశం ఉద్భవించింది. ఇతని రాజధాని మిథిల. నిమి కుమారునిపేరు మిథి. జనకరాజు విదేహ ప్రభువుల్లో మేటి. నాభానేదిష్టునివల్ల వైశాల రాజవంశం ఉద్భవమయింది. మనుపుత్రుడైన శర్యాతివల్ల శార్యాతవంశం వచ్చింది.

మాంధాత క్రీ. పూ. 2750—2752. సూర్యవంశము. ఇక్ష్వాకు వంశ మూలకారకుడైన యువనాశ్వుని పుత్రుడు మాంధాత. ఇతడు సమ్రాట్. శతాశ్వమేధములు రాజసూయములు చేసినవాడు. దానశౌండుడు. ఇతని సుతులు పురుకుత్స, అంబరీష ముచికుందులు. ఇతనిసోదరి కావేరి. ఆమె జహ్నుని పెళ్ళాడినది. మాంధాత పౌరవ కాన్యకుబ్జ రాజ్యాలాక్రమించి ద్రుహ్యులను అణవులను హైహయయుల్ని జయించినాడు.

మాంధాత పుత్రుడు పురుకుత్సుడు. ఇతనికాలంలో నర్మదా వరకూ ఆర్యసంస్కృతి వ్యాపించింది. హైహయప్రభువు మహిష్మంతుడు ముచికుందుని పారిపాత్ర అనేనగరం వశం చేసికొని దానికి మాహిష్మతి అనేపేరుంచినారు. పురుకుత్సుని అనంతరం అయోధ్యారాజ్యం అస్తమించింది. తరువాత చంద్రవంశశాఖలు వన్నె కెక్కినవి.

పరశురాముడు క్రీ. పూ. 2550—2350. భృగువంశీయుడు పరశురాముడు. ఆనర్తము (నేటి గుజరాతు) లో వసించువాడు. శార్యాతులపాలన ముగిసినతరువాత హైహయులు భృగువంశీయులు పశ్చిమ భారతదేశాక్రమణచేసి అధికారం చలాయించారు. పరశురాముడు వైశాలి, విదేహము, కాశి, కన్యాకుబ్జము, అయోధ్యరాజ్యాలను ఏకంచేసి హైహయులను ఓడించినాడు. "ఈ మహా భార్గవవీరుడితో పురాణకర్తలు తదితరనాయకులకు సంబంధంచూపి, చరిత్రను తలకిందుచేసి పరశురాముణ్ణి చిరంజీవుడనే సిద్ధాంతాన్ని సృజించినారు."

హైహయులు పురుకుత్సుని మరణానంతరం అయోధ్య అస్తమించగా హైహయశాఖగా యాదవులు విజృంభించి ఉత్తరముగా తూర్పుగా విస్తరించినారు. సహస్రార్జునుడు కర్కోటక నాగులతో సమరము సలిపినాడు. అప్పటికే నాగులు ఆనర్తం జయించి నర్మదా ముఖద్వారందాకా ఆక్రమించినారు. అర్జునుడు నాగులను జయించి అశ్వమేధాలు చేసినాడు.

అర్జునుని తన పరిపాలనాంతంలో జమదగ్నితో పరశురాముడితో వైరంవచ్చింది. అర్జునుడాదర్శప్రభువైనప్పటికీ భార్గవులాయనను దుర్మార్గునిగా చిత్రించినారు.

సహస్రార్జునగాథ కరందికర్ పండితుడు కొత్తఫక్కీలో ఈగాథను వ్యాఖ్యానించినాడు. ఆయన సిద్ధాంతరీత్యా భృగువులు ప్రాక్ పశ్చిమదేశాలమధ్య సముద్రవాణిజ్యం చేసినవారు. భారతదేశపు పశ్చిమతీరాన వారివంశంలో ఉండేది. భృగువులు వైదేశికుల ప్రతినిధులై సముద్రవ్యాపారంచేయడం అర్జునునికి ఎంతమాత్రం ఇష్టంలేదు. వాణిజ్యం ఆర్యరాష్ట్రాధికారంలో ఉండవలెనుకాని పాశ్చాత్యుల వశంకాగూడదని అతనిపట్టుదల. అర్జునుడు నౌకానిర్మాణం విరివిగాచేసి తీరం యావత్తూ హస్తగతం చేసికొనేసమయంలో అతనివల్ల పరాజితులయిన కర్కోటక నాగుడైన రావణాదులు అర్జునుణ్ణి ఓడించాలని ఎత్తులువేసినారు. అర్జునుడు భృగువులవల్ల రావలసిన సొమ్ముకోసం వాళ్ళను వత్తిడిచేయగా, పరశురాముడు నాయకుడై అతన్నివధించి హైహయప్రాభవాన్ని నాశనంచేసి, నర్మదాప్రాంతంలో క్షత్రియులను పురుగును ఏరినట్టిఏరి రూపుమాపినాడు. ఇదే 21 సార్లు క్షత్రియనాశనం చేయడమన్నమాట. పరశురాముడు శూర్పారకమనే రేవు పట్టణంనెలకొల్పి సముద్రవ్యాపార కేంద్రంగా చేసినాడు. ఉత్తరాపథములో ఆర్యుల చేతుల్లోఉన్న వాణిజ్యం దక్షిణాపథ ద్రావిడుల హస్తగతమయ్యేటట్లు చేసినాడు.

పురాణాదులనుబట్టి హైహాయులు అయిదు కూటాల వారైనారు. అనగా వీతిహోత్రులు, శార్యాతులు, భోజులు, అవంతులు, కుండికరులు, సమిష్టిగా తాళజంఘులు. వీతి హోత్ర తుండీకరులు వింధ్యప్రాంతంలోనూ, శార్యాతులు పశ్చిమభారతంలోనూ, భోజులు అరావళీ ప్రాంతంలోనూ, మాళవంలో అవంతులు స్థిరపడినారు. వీరంతాకలిసి మధ్య దేశాన్ని కాన్యకుబ్జ కాశీరాజ్యాలను ఆక్రమించారు. భార్గవ ప్రాభవంతో హైహాయులు క్షీణించిపోయినారు. వారిప్రభువు బ్రాహ్మణుడైనాడు.

మాంధాత పురుకుత్సుల అనంతరం అయోధ్య రాజ్యాన్ని హైహాయులు శక యవన కాంభోడ పారద పహ్లవుల సహకారంతో దాడిచేశారు. అయోధ్యాపాలకుల్లో సగరుడు భార్గవుల సాహాయ్యంతో రాజ్యం నిలవబెట్టుకొన్నాడు. హైహాయులు ఎన్నోరాజ్యాలు ఆక్రమించదలచి చివరకు భార్గవపరాక్రమాగ్నికి శలభములైనారు.

చంద్రవంశాలు - యాదవులు విదర్భపాలకులు, అయోధ్యాధిపతి అయిన సగరుని సమకాలికులు. సగరుని ఆధిపత్యం ఆర్యావర్తంలో అంగీకరించి, హైహయరాజ్యంమీద యాదవులు విజృంభించినారు. విదర్భరాజవంశం మూడుశాఖలైంది. క్రథ లేదా భీముడు ప్రధానశాఖకూ, కైశికుడు చేంది వంశానికీ స్థాపకులైనారు. చివరరాజు లోమపాదుడు.

అణవులు అణవ రాజ్యస్థాపకుడు తితిక్షువు. సగరసమకాలికుడైన బలిచక్రవర్తి అణవరాజ్యం విస్తరింపజేసి అయిదుగురు కుమార్తెలకు అంగ వంగ కళింగ పుండ్ర సుహ్మ రాష్ట్రాలు పంచియిచ్చాడు.

కాన్యకుబ్జము జమదగ్నికి బంధువైన విశ్వామిత్రరాజు పరశురాము డేర్పరచిన సంయుక్త ప్రతిఘటనకు తోడ్పడినాడు. శకుంతలా జనకుడైన విశ్వామిత్రుడు, శ్రీరామునికి సమకాలికుడైన విశ్వామిత్రుడు, హరిశ్చంద్రునికి సమకాలికుడైన విశ్వామిత్రుఎూ వేరువేరు. విశ్వామిత్రరాజు కొంతకాలం పాలించి వసిష్ఠునివల్ల పరాభవంపొంది రాజ్యంత్యజించినాడు. అజీగర్తుని కుమారుడైన శునశ్శేఫుని యజ్ఞపశువుకాకుండా చేసినాడు. విశ్వామిత్రసుతులు దేవరాతుని నాయకత్వం ధిక్కరించినారు. విశ్వామిత్రుడు కుమార్తెను శపించినాడు మ్లేచ్ఛులై పోవలసిందని. ఆమ్లేచ్ఛులే అనగా సనాతనత్వాన్ని ధిక్కరించినవారే ఆంధ్రులు పుండ్రులు శబరులు.

కాశి దివోదాసపుత్రుడైన ప్రతర్దనుడు, అతనికుమారుడు వత్సుడూ రాజ్యం విస్తృతంచేసి కౌశాంబికి చుట్టుపక్కల వుండే వత్సరాజ్యాన్ని కలుపుకొన్నాడు. వత్సపుత్రుడు అలర్కుడు రాక్షస హస్తగతమయిన వారణాసిని ఆక్రమించి కాశీ రాజధానిగ చేసికొన్నాడు.

రామచంద్రుడు క్రీ. పూ. 2350—1950. రామచంద్రయుగము సుమారు నాలుగునందల సంవత్సరాలు.

సూర్యవంశం సగరపౌత్రుడైన అంశుమంతుని కాలంలో అయోధ్య వాసికెక్కింది. అతని అనంతరం భగీరథుడు రాజైనాడు. షోడశచక్రవర్తులలో ఇతడొకడు. గంగాజలాన్ని భూమినీదికి అవతరింపజేసి తాతముత్తాతలను తరింపజేసినాడు. దీనికి ఇలా అర్థము చెప్పవచ్చును. అతడు శివారాధకుడు. గంగారాధన సగరునితో ఆరంభమైంది. హిమాలయముల నుండి కాలువలు తవ్వించినాడు. అతని తరువాత మూడో తరంలో అంబరీషునికాలంలో అయోధ్య ఔన్నత్యానికి వచ్చింది. ఆయన భాగవతభక్తి, ద్వాదశీవ్రతగాథలూ కాల క్రమేణ కల్పించినారు. ఆయన తరువాత మూడోవాడు ఋతుపరుడూ ఆయనకుమారుడు సుదాసుడూ రాజులైనారు. సుదాసుని పుత్రుడు కల్మాషపాదుడు. కల్మాషునికి సంతానం లేకపోవడంవల్ల వసిష్ఠునివల్ల కుమారుణ్ణి పొందినాడు. కల్మాష పాదునికాలంలో అయోధ్య క్షీణదశయైఉండగా భారత పాంచాలులు విజృంభించినారు. ఆరుతరాలయినతరువాత ఖట్వాంగుడనే ద్వితీయ దిలీపుడు అసురులను జయించినాడు. అతని సుతుడు రఘువు. ఇక్ష్వాకువంశానికి రఘువంశనామం వచ్చింది. రఘువు భూమండలం జయించి విశ్వజిద్యాగంచేసి ఆదర్శప్రభువైనాడు. అతనికుమారుడు అజుడు. విదర్భ రాజ పుత్రిని ఇందుమతిని వివాహమాడినాడు. అజసుతుడు దశరథుడు. దశరథు డార్యసంస్కృతిని ఆర్యావర్తంలో వ్యాప్తి చేసినాడు.

రామచరిత యావన్మందికీ విదితమే. శ్రీరాముని సోదరులు భిన్నరాష్ట్రములు పాలించినారు. లక్ష్మణకుమారులు అంగద చంద్రకేతువులు కారపథం (హిమవత్పర్వత ప్రాంతం) పరిపాలించినారు. తల్లివల్ల భరతునికి కేకయరాజ్యం అంతేకాక ఉత్తరసింధుదేశం సంక్రమించినవి. భరత సుతులయిన తక్ష పుష్కరులు గాంధారం జయించి తక్షశిల పుష్కలావతులు స్థాపించినారు. రామసుతులు కుశలవులు. కుశుడు రాజ్యానికి వచ్చినాడు. లవుడు ఉత్తరకోసలం పాలించాడు. దానిరాజధాని శ్రావస్తి.

గాంధారంలో రెండు రాష్ట్రాలు క్రమేణ అంతరించిపోయినవి. శత్రుఘ్నపుత్రులిద్ధ్ర మధురనుండి భీమసాత్వతులు తరిమివేశాడు లక్ష్మణపుత్రుల విషయంగాని, లవుని రాజ్య విషయంగాని తరువాత తెలియదు. అయోధ్య రాజ్యప్రాభవనం తగ్గిపోగా పౌరవయాదవులు ప్రముఖులైనారు.

విదేహము సీతాదేవితండ్రి సీరధ్వజుడు ప్రసిద్ధుడు. సీరధ్వజ పుత్రికలు సీత ఊర్మిళలు. కుశధ్వజ పుత్రికలు మాండవి శ్రుతకీర్తులు. భరతశత్రుఘ్నుల పత్నులు.

చంద్రవంశం - పౌరవులు అయోధ్యపాలకుడైన సగరుని అనంతరం రెండుతరాలకు తుర్వాసరాజు మరుత్తుడు సంతానంలేక దుష్యంతుణ్ణి దత్తుచేసికొన్నాడు. అనగా తుర్వాసవంశం పౌరవవంశంలో కలిసిపోయిందన్నమాట. వంశప్రతిష్ఠకు

దుష్యంతుడు కారకుడైనాడు. అతడు విశ్వామిత్ర పుత్రికను శకుంతలను గాంధర్వవిధిగా వివాహము చేసికొన్నాడు. అతని కుమారుడు భరతుడు.

భరతునికి సర్వదమనుడని పేరు. గంగాయమునా తీరాల్లో యాగాలుచేసినాడు. చక్రవర్తి అయినాడు. ఇతని రాజ్యం సరస్వతీనదినుండి గంగదాకా విస్తరించింది. పౌరవ కులమునకు భరతుని కాలంనుంచీ భరతవంశం నామం వచ్చింది. మనదేశానికి భరతవర్ష మనేపేరు భరతునివల్లనే వచ్చింది. రాజధానిని హస్తినాపురికి మార్చినాడు. భరతుని తరువాత రాజ్యానికివచ్చిన హస్తినుడివల్ల హస్తినాపురి అనే పేరువచ్చింది. కుమార్ధనల్ల అసంతుష్టుడై భరతుడు వారిని చంపివేసినాడు. భరద్వాజపుత్రుడు వితథుడు భరతుని తరువాత రాజైనాడు. భరతుని అనంతరం ఐదోవారసుడు హస్తినుడు. అతనికి అజామీఢ ద్విమీఢులనే ఇరువురుపుత్రులు. ఇద్దరూ వేరైపోగా అజామీఢుడు హస్తిపురిలో ప్రధాన వంశస్థాపకుడైనాడు. రెండోవాడు అజామీఢ వంశకారకుడైనాడు. అజామీఢునిపుత్రులు బుక్ష నీల బృహదశ్వులు. తండ్రి చని పోయిన తరువాత బుక్షుడు హస్తిపురశాఖకు రాజైనాడు. ఈ శాఖ పౌరవవంశము. నీల బృహదశ్వులు పాంచాలవంశ స్థాపకులైనారు.

యాదవులు భీమరాజు విదర్భలో యాదవవంశీయుడు. అతని సోదరుడు కైశికుడు చేదివంశ మూలపురుషుడు. విదర్భ రాజుల్లో భీమరథుడు ప్రసిద్ధుడు. ఇతనిపుత్రి దమయంతి.

ఆణవులు ఆణవుల్లో లోమపాదుడు దశరథమిత్రుడు. మహాధానుష్కుడు. అతడు దశరథపుత్రికను శాంతను దత్తత చేసికొన్నాడు. శాంతను పెళ్ళాడినవాడు ఋష్యశృంగుడు. రోమపాదుని పౌత్రునివల్ల చంపనివల్ల అంగరాజధానిఅయిన చంపానగరం ఏర్పడింది.

కృష్ణుడు క్రీ. పూ. 1950—1400. ద్వాపర యుగారంభంలో శ్రీరామచంద్రుని పట్టాభిషేకం జరిగింది. ద్వాపరాంతంలో మహాభారతయుద్ధం జరిగింది. కలియుగారంభంలో పాంచాల పౌరవ యాదవ రాజవంశాలు మహోన్నతి పొందినవి. అయోధ్యాదిప్రాంతాల్లో రాజవంశాలు క్షీణదశలో ఉన్నవి.

పాంచాలము భీష్ముడు పాంచాలవారసుడైన పృషతునికి రాజ్యం ఇప్పించినాడు. పృషతుని కుమారుడయిన ద్రుపదుడు పాంచాలరాజ్యానికి వచ్చినాడు. ద్రోణుడు ఉత్తరపాంచాలము, ద్రుపదుడు దక్షిణపాంచాలాన్ని తీసికొన్నారు. సోమక సృంజయులనే పాంచాల రాజవంశీయులు ద్రుపదునితోకలిసి భారతయుద్ధంలో పాల్గొన్నట్టున్నది. భారత యుద్ధకాలంలో పాంచాలురు ప్రముఖులుగాఉన్నారు. ద్రుపద రాజపుత్రిని పాండవులు పెళ్ళాడినారు. వైవాహిక బాంధవ్యం వల్ల పాంచాలురు పాండవపక్షం వహించినారు.

పౌరవులు కురురాజు పౌరవుల్లో ధర్మబద్ధంగా పరిపాలన చేసినాడు. అతనివల్ల అతనివారసులకు కౌరవులని పేరు

వచ్చింది. పురాణాలనుబట్టి కురురాజపుత్రులు ముగ్గురు. పెద్దవాడు పరీక్షిత్తు, రెండవవాడు జహ్నుడు, కడసారివాడు సుధన్వుడు. పరీక్షితుని సుతుడు జనమేజయుడు. జహ్ను సుధన్వుల పుత్రులు శ్రుతసేన ఉగ్రసేన భీమసేనులు. జహ్ను తనయుడైన సురథుడు, అతనీవారసులవల్ల కురువంశం సాగినట్టు కనబడుతుంది. దీనివల్ల జనమేజయ వంశానికి రాజ్యప్రాప్తి లేకపోయిందన్నమాట. సుధన్వునివంశం రెండు శాఖలైంది చేది, మగధరాజ వంశాలుగా. ప్రధానమైన పౌరవ లేక కురువంశానికి వారసులు లేకపోవడంవల్ల బహు కాలం క్షీణించిపోగా ప్రతీపుడు సింహాసనారోహణంచేసి ఖ్యాతిపొందినాడు. ఆయనకుమార్తె దేవాపి బాహ్లీక శంతనులు. జ్యేష్ఠుడు కుష్ఠురోగి. అందువల్ల రాజ్యార్హత లేక పోయింది. బాహ్లీకుడు శంతనుడికి రాజ్యం ఇచ్చినాడు. శంతనుడు ప్రతీపుని అనంతరం రాజైనాడు. శంతనుడు గంగను పెళ్ళాడినాడు. ఆ దంపతులకు భీష్ముడు జన్మించి నాడు. ఆయన అసలుపేరు దేవవ్రతుడు. యావజ్జీవం బ్రహ్మ చర్యం సాగిస్తానని, తక్కిన సోదరులకు రాజ్యార్హత కలిగించి నాడు. అలాచేయడంవల్ల భీష్ముడితండ్రి సత్యవతిని వివాహం చేసికొనే సావకాశము కలిగింది. భీష్ముడు మహాయోధుడు రాజనీతివేత్త, ధర్మజ్ఞుడు. ఉగ్రాయుధుడు కౌరవులను ఎదు ర్కొని భీష్ముడివల్ల హతుడైనాడు. ఉగ్రాయుధునివల్ల రాజ్యం పోగొట్టుకొన్న పృషతునికి భీష్ముడు ఉత్తర పాంచాలంఇచ్చి రాజును చేసినాడు.

శంతనునికి సత్యవతీవల్ల చిత్రాంగద విచిత్రవీర్యు లుదయించినారు. చిత్రాంగదుడు చనిపోగా విచిత్రవీర్యుడు రాజైనాడు. అతడు నిస్సంతుకావడంవల్ల, దేవరన్యాయంగా వ్యాసునివల్ల ధృతరాష్ట్ర పాండులనే కుమార్ళను సంపా దించుకొన్నాడు. ధృతరాష్ట్రుడు జాత్యంధుడు కావడంచేత రాజ్యార్హత లేకపోయింది. పాండురాజు హస్తినాపుర ప్రభుడైనాడు. భీష్ముడు రాష్ట్రవ్యవహారాలు నడిపేవాడు. గాంధారివల్ల ధృతరాష్ట్రునికి నూర్గురు పుత్రులు పుట్టినారు. వారిలో దుర్యోధన దుశ్శాసనులు ముఖ్యులు. పాండురాజు కుంతిభోజుని కుమార్తెను కుంతిని, శల్యసోదరిని మాద్రిని వివాహము చేసికొన్నాడు. పాండురాజు దశార్ణాలను, మిథిలాప్రభువును, కాశి, సుహ్మ, పుండ్ర రాజ్యాలనూ జయించి రాజ్యం విస్తృతం చేసినాడు. హరిణరూపంలో వున్న ఋషిని తెలియక వేటాడి చంపినాడు. వెంటనే పాండురాజుకు శాపానుభవం కలిగింది. భార్యాసమేతుడై అడవులు పట్టినాడు. వనవాసంలో కుంతికి యుధిష్ఠిర భీమార్జునులు, మాద్రికి నకుల సహదేవులు జన్మించినారు. పాండురాజు చనిపోగా మాద్రి సహగమనంచేసింది. కుంతి కుమార్ళతో హస్తినకు చేరింది. ధృతరాష్ట్రుడు రాష్ట్రపాలన సాగించినాడు. యుధిష్ఠిరుణ్ణి యువరాజుగాచేసినాడు. ధృత రాష్ట్ర పాండవులుభయులూ కౌరవులయినా, ధృతరాష్ట్ర సుతులకే కౌరవులనీ, పాండుతనయులకు పాండవులనీ వంశ నామాలు రూఢమైనవి.

చేది, మగధరాజ వంశాలు సుధన్వుని నాలుగోతరంలో వసువు యాదవులను ఓడించి చేదిరాజ్య స్థాపకుడైనాడు. అతని రాజధాని శుక్తిమతీనగరం. వసువు చక్రవర్తిఅయినాడు. మగధకు పొరుగున తనరాజ్యం విస్తరింపచేసినాడు. అతడు తన అయిదుగురు కొడుకులకూ రాజ్యం పంచియివ్వగా మగధరాజ్యం పెద్దవాడైన బృహద్రథుని వాటాకువచ్చింది. కుశునికి కౌశాంబి, యదువుకు కరూషరాజ్యం, ప్రత్యగ్రహునికి చేది సంక్రమించినవి. కడసారి కుమారుడికి చేది రాజ్యసమీపంలోఉన్న మత్స్యరాజ్యం వచ్చిఉండవచ్చును.

బృహద్రథుడు మగధలో సుప్రతిష్ఠితుడై గిరివ్రజాన్ని రాజధానిగా చేసికొని నిజనామంతో వంశస్థాపకుడైనాడు. సాంపదాయిక చరిత్రలో బృహద్రథుని మగధరాజ్యం యశస్సును గడించింది. ఈ వంశీయులలో జరాసంధుడు బలశాలికావడంవల్ల మధురదాకా రాజ్యం విస్తరింపజేసినాడు. మధురాధిపతిఅయిన కంసుడు జరాసంధుని జామాత కావడం చేత, మామగారి ఆధిపత్యం అంగీకరించినాడు. కంసుడు జనకంటకుడైన కారణాన కృష్ణునివల్ల మరణించినాడు. కృష్ణుడు మధురరాజ్యానికి ఉగ్రసేనుని ప్రభువును చేసినాడు. దీనివల్ల జరాసంధుడగ్రుడై చాలాసార్లు కృష్ణునిమీదికి కత్తులుదూసినాడు. అతనినాటిని ఎదుర్కొగలిగినప్పటికీ యాదవులు ఒకుమ్మడిగా పశ్చిమతీరస్థమయిన ద్వారకకు

వెళ్ళి స్థిరపడినారు. పాండవ భీమసేనునివల్ల జరాసంధుడు మరణించినాడు. అతనిసుతుడు సహదేవుడుమాత్రం పాండవులలో చేరినాడు.

యాదవులు భీమసాత్వతుని విశాల యాదవరాజ్యం అతని నలుగురుకుమార్లకూ అనగా భజమాన, దేవావృధ, అంధక, వృష్ణులకు సంక్రమించింది. భజమానుడి వంశానికి నామ రూపాలులేవు. దేవవృధుని అనుయాయులు సాళ్వదేశంలోని మృత్తికావతమునకుచెందిన భోజులు. మధురాధిపుడైన అంధకునికి నలుగురు కుమార్లు. వాళ్ళలో కుకుర భజ మానులు ప్రసిద్ధులు. కుకురవంశములోనివాడు కంసుడు. భజమానుని సంతతివారు మధురాప్రాంతమేలినారు. వృష్ణికి నలుగురు సుతులు. జ్యేష్ఠనిష్ఠులు అనమిత్రులు, జ్యేష్ఠాను మిత్రుడికి నిఘ్నుడు, అతనికి ప్రసేన సత్రాజిత్తు లుదయించి నారు. కుకురరాజైన దేవకుని కుమార్తెఅయిన దేవకిని, మరో ఆరుగురు కన్యలనూ వసుదేవుడు వివాహం చేసికోగా అతనికి బలరామకృష్ణులు కలిగినారు. వసుదేవుని కుమార్తెను సుభద్రను అర్జునుడు పెళ్ళాడినాడు. అతనికి అభిమన్యు డుదయించినాడు, అభిమన్యుని కుమారుడు పరీక్షితుడు. పరీక్షితుడు హస్తినాపుర సింహాసనారోహణం చేసినాడు. మహాభారత యుద్ధానంతరం కుకురవంశీయులైన ఆహుకుని పుత్రులు దేవక ఉగ్రసేనులు. దేవకునికి నలుగురు కొడుకులు, ఏడుగురు కుమార్తెలు. కృష్ణుడు దేవకీతనయుడు. ఉగ్రసేనుడికి

తొమ్మండుగురు కొడుకులూ, అయిదుగురు కుమార్తెలు. కంసుడు జ్యేష్ఠుడు. తండ్రిని చెఱలోపెట్టి తాను రాజైనాడు. వసుదేవు డతనిమంత్రి. కంసుడు దేవకీసుతులను ఏడుగురినీ వధించినాడు. దేవకియొక్క అష్టమసంతానంవల్ల తనకు మరణం సంభవిస్తుందన్న అశరీరవాణివల్ల కంసుడు భీతిల్లినాడు. కృష్ణబలరాములు గోకుల బృందావనాల్లో పెరిగినారు. చివరకు కంసునిచేతుల్లోనే కంసుడు చనిపోయినాడు.

కృష్ణచరిత్ర

చారిత్రకంగా స్థూలీపులాకంగా కృష్ణుని జీవితం పరిశీలన చేదాము. అతడు మధురలో కారాగృహంలో జన్మించినాడు. వెంటనే పసివాణ్ణి గోకులానికి చేర్చినారు. నందయశోదలు అల్లారుముద్దుగా పెంచుకొంటున్నారు. యశోదాదేవి కుమార్తెను మధురలో కారాగారంలో దేవకీపక్కలో కృష్ణమూర్తినే ఉంచడం జరిగింది. ఆ పసిపిల్లను కంసుడు ఖండఖండాలుగా నరికినాడు. పసివాడైనా కృష్ణుడు అద్భుత శక్తులు చూపినాడు. గోకులంలో ఆతనిబాల్యం గడిచింది. అతనిచర్యలన్నీ పురాణాల్లో ఉల్లేఖింపబడినవి. అవన్నీ లీలలని పౌరాణికులు చెబుతారు. ఆ లీలలనే వానిలోకొన్ని జరిగినట్లుగా ఆధారాలున్నవి. కృష్ణజననమయిన కొన్నిసంవత్సరాలకు గోపకులు గోకులంలో తోడేళ్ళబాధవల్ల విడిచి బృందావనంలో స్థావరం ఏర్పరచుకొన్నారు. బృందావనంలో కృష్ణుడు కాళీయుడనే నాగజాతివారి అధిపతిని మర్దించి

తరిమివేసినాడు. నాగులు అతని అనుచరులుకూడా వెళ్ళిపోయినారు. అక్కడ ఇంద్రయజ్ఞంచేసే ఆచారం మాన్పించి ప్రకృత్యారాధనం ప్రవేశపెట్టినాడు కృష్ణుడు. కృష్ణుని అద్భుతసాహసాలూ యశస్సూ కంసునికి విదితమైనవి. కృష్ణవధకై కంసుడు మాయోపాయాలు చేసినాడు. తన ఆస్థానంలోఉన్న మల్లులతో పోరాటానికి రమ్మని కృష్ణబలరాములను ఆహ్వానించినాడు. అన్నదమ్ములిద్దరూ మల్లులను చిత్తుగా ఓడించి చంపివేసినారు. కృష్ణుడు కంసుణ్ణి వధించి, ఉగ్రసేనుణ్ణి మధురలో పట్టాభిషిక్తుని జేసినాడు. కృష్ణబలరాములు విద్యాభ్యాసానికి కాశీవెళ్ళినారు. జరాసంధుడు మధురపై దండయాత్రచేసినాడు. యాదవులు మధురవిడిచి ద్వారకలో స్థావరం ఏర్పరచుకొన్నారు.

మహాభారతగాథలో తొలిసారి కృష్ణుడు ద్రౌపదీ స్వయంవరంలో గోచరిస్తాడు. అతడు పాండవులకు సలహాలిస్తూ హితుడుగా స్నేహితుడై ఉన్నాడు. అతని చెల్లెలిని సుభద్రను అర్జునుడు వివాహమాడినాడు. అతని ఆదేశానుసారం భీముడు జరాసంధ మహారాజును వధించినాడు. పాండవులు రాజసూయంలో మొదట కృష్ణుణ్ణి పూజించినారు. చేదిరాజైన శిశుపాలుడు పట్టలేక కోపాటోపంతో కృష్ణుని నిందించినాడు. తత్ఫలితంగా కృష్ణునివల్ల అతడు మరణించినాడు. పాండవుల వనవాసానంతరం కౌరవపాండవుల సంధి నిమిత్తం కృష్ణుడు రాయబారిగా శాంతి నెలకొల్పాలని

ప్రయత్నించినాడు. కాని వృథా అయిపోయింది. మహాభారత యుద్ధంలో కృష్ణుడు అర్జున రథసారథిగా అన్నివిధాలా బాసటయైనాడు పాండవపక్షానికి. అతని సాహాయ్యంవల్లనే పాండవులు జయలక్ష్మి సనాధులైనారు.

యుధిష్ఠిరుడు సింహాసనారోహణం చేసిన తదుపరి కృష్ణుడు ద్వారకానగరం వెళ్ళినాడు. ఉత్తరాగర్భంలో మృతశిశువుగాఉన్న పరీక్షిత్తుణ్ణి పునరుజ్జీవిత్తుణ్ణిచేసి వంశము నిలిపినాడు. చివరసారి కృష్ణుడు పాండవులను అశ్వమేధ సమయంలో కలిసినాడు. అతని చరమ జీవితంలో యాదవుల్లో పరస్పరవిద్వేషం ప్రజ్వరిల్లింది. యాదవులందరూ గతించగా కృష్ణుడు హస్తినాపురినుంచి అర్జునుణ్ణి ఆహ్వానించి స్త్రీపురుషుల యోగక్షేమాలు చూడమనిచెప్పి తాను వనవాసానికి వెళ్ళినాడు. శేషించిన యాదవకుటుంబాలతో అర్జునుడు ద్వారకకు వెళ్ళినాడు. కృష్ణపౌత్రుడైన వజ్రుణ్ణి మధురలో పట్టాభిషిక్తుణ్ణిచేసినాడు. కృష్ణుడు ధ్యానసమాధిలో ఉండగా బోయవాడు మృగభ్రాంతివల్ల శరసంధానం చేసినాడు. ప్రాచీన భారతేతిహాసానికి మూలకందమై మహా మహోన్నతు డైన కృష్ణుడు శరీరం చాలించినాడు. కృష్ణుడు చారిత్రక పురుషుడనే విషయంలో విప్రతిపత్తిలేదు. కొందరు పౌరాణిక కృష్ణుడూ, గీతామృతం ప్రసాదించిన మహాభారతకృష్ణుడూ ఒకడేనని అంటున్నారు. వాసుదేవకృష్ణుణ్ణి అవతారాల్లోచేర్చి

భగవానుడని కొందరు పాతంజల మహాభాష్యానికి పూర్వం క్రీ. శ. 2 వ శతాబ్దములో భావించినారు. *

ఋణవులు మగధ జరాసంధుని యేలుబడిలో ఉండగా అంగ రాజుగా కౌరవమిత్రుడైన కర్ణుడు కొంతకాలం పరిపాలించి నాడు. దుర్యోధన పక్షపాతిగా ఉండటంవల్ల కర్ణుడు మహా శక్తిశాలి మహోన్నతుడైనా కొందరి మెప్పుపొందలేక పోయినాడు. కుంతి కన్యగాఉండగా సూర్యపరప్రసాదంవల్ల అతను జన్మించినాడు. అనంతరం సూతుని పెంపకంలో అతను పెద్దవాడు కావడంచేత తిరుచుగా అతడు అవమానితు డవుతూ వచ్చినాడు. అతని కొనేనుడు కావడంకూడా అవజ్ఞకు కారణం. అర్జునునితో శౌర్యంలోదీటయిన కర్ణుణి ఆలోకించి దుర్యోధనుడు అంగరాజును చేసినాడు. అతని శక్తిసామర్థ్యాలే అతని అవసానగీతం పాడినవి. కర్ణునిప్రతాపం మహోజ్వలం.

సూర్యవంశం రామచంద్రుని అనంతరం అయోధ్యలో నామ రూపాలుగల రాజులులేరు. రాముని కుమారుడు కుశుడు దక్షిణకోసలం పరిపాలించినాడు. దానికి రాజధాని కుశస్థలి. వింధ్యాద్రిదాకా ఆర్యసంస్కృతిని అతడు వ్యాప్తిచేసినట్లు కనబడుతున్నది. కుశుడు నాగజాతికన్యను వివాహంచేసికోడం

---

* భండార్కరుగారి "Vaishnavism, Saivism and Other religious sects" చూడు.

వల్ల ఆదినాసుల్లో ఆర్యసంస్కారం ప్రవేశించి ఉండవచ్చును. సూర్యవంశంలో బృహద్బలుడు చివరవాడు. కౌరవపక్షం వహించి భారతయుద్ధంలో పోరాడినాడు. అతడు అభిమన్యుని ప్రతాపాగ్నికి ఆహుతిఅయినాడు.

మహాభారతయుద్ధము

క్రీ. పూ. 1400. సామ్రాజ్యాధిపత్యానికి సంకేతంగా యుధిష్ఠిరుడు రాజసూయం చేసినాడు. అనంతరం దుర్యోధనుడు మయసభా చాతుర్యాన్ని ఆలోకిస్తున్నప్పుడే భారత యుద్ధబీజాలు పడినవి. పాండవాభ్యుదయం కౌరవులకు కన్నెర్ర కలిగించింది. దుర్యోధనుడు పాండవులను రాజ్య బహిష్కృతులను చేయవలెనని స్థిరసంకల్పం చేసినాడు. రాజధర్మమనే వ్యాజంమీద పాచికలాడడానికి పాండవుల్ని ఆహ్వానించినాడు. క్షాత్రధర్మానుసారంగా ఆహ్వానం అంగీకరించక తప్పలేదు. ద్యూతంలో సర్వస్వం పాండవులు కోల్పోయి చివరకు ద్రౌపదిని పణంగా పెట్టినారు. ఏర్పరచుకొన్న షరతులప్రకారం పాండవులు పన్నెండేళ్ళు వనవాసం, ఒకసంవత్సరం అజ్ఞాతవాసం చేయవలసివచ్చింది. అజ్ఞాతంగా పాండవులు మత్స్యరాజ్యంలో విరాటరాజుదగ్గర సేవచేస్తూ కౌరవశత్రువైన ఆరాజుకు ఆసరాగా ఉన్నారు. విరాటుడు కుమార్తెను ఉత్తరను అభిమన్యునికిచ్చి వివాహం చేసినాడు. యుద్ధం తప్పనిసరిగాభోచగా కౌరవ పాండవపక్షాలు సైన్య

సమీకరణ చేసికోవలసివచ్చింది. కృష్ణమూర్తి పాండవ పక్షపాతి అయినాడు. అతని సేనలు కౌరవపక్షంలో చేరి పోయినవి. శల్యుడు దుర్యోధనపక్షం వహించినాడు. కృష్ణుడు ఉభయపక్షాలమధ్య శాంతికై యత్నించినాడు. దుర్యోధనుడు సంధికి విముఖత్వంచూపి, నేల నాలుగు చెరగల్లో రవంతయినా పాండవులచేతికి దక్కనీయ తలచుకోలేదు.

భారతయుద్ధరంగం కురుక్షేత్రం. మహాభారతంలో కురు పాండవ పక్షాలలో ఏ యే రాజులు చేరినారో విపులంగా ఉంది. కౌరవులకు పదకొండు అక్షోహిణులసేన, పాండవులకు ఏడక్షోహిణులసేన యుద్ధసన్నద్ధమైంది. మగధ ప్రాంతంనుంచి జరాసంధుని సుతుడు సహదేవుడుమాత్రం పాండవపక్షపాతి. మగధకు తూర్పు విదేహ, అంగ, వంగ కళింగసేనలు కర్ణుని నాయకత్వాన కౌరవపక్షంలో చేరినవి. ప్రాగ్జ్యోతిషప్రభువైన భగదత్తుడుకూడా కౌరవపక్షమే. అందుచేత తూర్పుదిశ యావత్తూ కౌరవులకు అండ. మధ్యదేశంలో వత్స, కాశీ, చేది, కారూష, దశార్ణ పాంచాలములు పాండవపక్షంలో చేరినవి. కోసల బృహద్బలుడుమాత్రం కౌరవుల్లో చేరినాడు. యాదవులు రెండుపక్షాలుగా చీలినారు. బలరాముడు ఏపక్షములోనూచేరక నిర్లిప్తంగా ఉన్నాడు. పాండవ పక్షంలో వృష్ణి యాదవుల్లోని యుయుధాన సాత్యకులు చేరినారు. మాహిష్మతిరాజైన నీలుడు, అవంతి పాలకులైన విందానువిందులు, భోజాంధక వృష్ణులవంశంలోని కృతవర్మ,

విదర్భుడు, నిషాదుడు, సాళ్వుడు కౌరవులపక్షంలో చేరినారు. పాంచాలంలో సింధు సౌవీరాల్లో జయద్రథుడు, గాంధారంలో శకుని. త్రిగర్తాధిపుడు, సుశర్మ, కేకయ, ఋని, శల్య, వాహ్లీక, క్షుద్రక, మాళవ, శిబాయ, సుదక్షిణులు కౌరవపక్షం వహించినారు. అభిసారదేశం పాండవులకు సహాయంగా ఉన్నది. ఈ రీతిగా పాండవపక్షం పాంచాల, మత్స్య, చేది, కరూష, మగధ, కాశీరాజ్యాలూ, కొందరు యాదవులూ, కౌరవపక్షంలో భారతదేశానికి తూర్పుభాగము, వాయవ్య భాగము, కోసల, వత్స, సూరసేన, మాహిష్మతి, అవన్తి, సాళ్వ, మధ్యదేశం, ఘూర్జరులు చేరినవి. పాండవసేన మత్స్య రాజధానిఅయిన ఉపప్లావ్యమునకు సమీపంలో స్కంధావారాన్ని ఏర్పరించింది. కౌరవసేన హస్తిపురిదగ్గర సమాయత్తమైంది.

ధృపదపుత్రుడైన ధృష్టద్యుమ్నుడు పాండవులకు ముఖ్యసేనాని. కౌరవులకు భీష్ముడు సేనాధిపతి. మొదటి పది రోజులూ యుద్ధరంగంలో సైన్యాధిపత్యం భీష్మునిదే. శిఖండి అనే మాయా స్త్రీరూపంలోవుండి అర్జునుడు శరసంధానం చేసినాడు. స్త్రీరూపంలోవున్న శత్రువును ఎయ్యకూడదు భీష్ముడికి నచ్చకపోవడంచేత పదోనాడు రథపతితుడైనాడు. ద్రోణాచార్యుడు పదహేనవనాటిదాకా సర్వసేనానాయకుడు. పదమూడవనాడు అభిమన్యుడు, భీమసుతుడైన ఘటోత్కచుడు పదునాలుగోనాడు, పదిహేనోరోజున ద్రోణునివల్ల

ద్రుపద విరాటులూ హతులైనారు. పదిహేనవనాటి సంజవేళ తనకు మారుడయిన అశ్వత్థామ చనిపోయినాడన్న అసత్య వార్తవిని దుఃఖముచే నిరాయుధుడైవున్న ద్రోణుని దుష్ట ద్యుమ్నుడు వధించినాడు. ద్రోణుని అనంతరం కర్ణుడు సేనాధిపతిగా యుద్ధంనడిపినాడు. రెండురోజుల పోరాటంలో భీమసేనుడు దుశ్శాసనుని తొడలుచీల్చినాడు. కర్ణుడు అర్జునునితో పోరి వీరస్వర్గం అలంకరించినాడు. పద్దెనిమిదవనాడు శల్యసారథ్యం. అతన్ని ఆనాటిమధ్యాహ్నం యుధిష్ఠిరుడు వధించినాడు. సహదేవుడు వెంటనే శకునిని చంపివేసినాడు. కౌరవసేన మంటిపాలుకాగా దుర్యోధనుడు సరస్సులో దాగినాడు. భీముడతన్ని గదాయుద్ధానికి ఆహ్వానించినాడు. దుర్యోధనుని తొడలువిరిగి రక్తసిక్తమైపోయినవి. అతడు అశ్వత్థామను సేనాధ్యక్షుని చేసినాడు. కౌరవుల్లో శేషించిన కృపాచార్యుడు కృతవర్మలు అర్ధరాత్రి దొంగచాటుగా పాండవుల స్కంధావారంలోప్రవేశించి హతశేషులయిన పాండవరాజపుత్రులీన్ని, ద్రుపద్యుమ్నుణ్ణి నిద్రించినవాణ్ణి చంపినాడు. దుర్యోధన మరణానంతరం పుట్టంధువు ధృతరాష్ట్రునిమాత్రం మిగిలినాడు. పంచపాండవులు భారతయుద్ధంలో జయశ్రీ సనాధులైనారు.

ధృతరాష్ట్రుని పుత్రశత వినాశంతో కౌరవవంశం అంతరించగా యుధిష్ఠిరుడు మహీపాలుడై హస్తిపురాన్ని పాలించినాడు. వ్యాసభగవానుని ఆదేశానుసారం అతడు

దోషపరిహారార్థం అశ్వమేధం ఆచరించినాడు. కొన్నాళ్ళకు ధృతరాష్ట్రుడు గాంధారీసహితంగా వనవాసజీవితం గడిపి నాడు. ఆకస్మికంగా ప్రజ్వల్లిన దావాగ్నికి ఆహుతి అయినాడు. యుధిష్ఠిరునిపాలనం ఎంతోకాలం సాగలేదు. ఘూర్జరంలో యాదవులమధ్య అంతఃకలహాగ్ని రేగింది భారతయుద్ధానంతరం. కృష్ణమూర్తి ఇహలీల చాలించినాడు. శేషించిన యాదవకుటుంబ శ్రేయస్సుకై అర్జునుడు ద్వారకకు వెళ్ళి వస్తూవుండగా ఆభీరులు అతన్ని ఎదుర్కొని జయించి నారు. అర్జునుడు హస్తినపురికివెళ్ళి కృష్ణునిపౌత్రుడైన వజ్రుణ్ణి యాదవరాజుగా చేసినాడు. యుధిష్ఠిరుడు సింహాసన పరి త్యాగంచేసి, పరీక్షిత్తునికి పట్టాభిషేకంచేసి సోదరసమేతంగా వనవాసానికి వెళ్ళినాడు.

పరీక్షితుని సింహాసనారోహణం కలియుగారంభాన్ని. ద్వాపరయుగాంతాన్ని సూచిస్తుంది.

వైదికసాహిత్యంలో భారత యుద్ధప్రస క్తి లేకపోవడం వల్ల భారతయుద్ధం చారిత్రకంకాదని అనడానికి వీలులేదు. బ్రాహ్మణాలను సంతరించిన కర్మఠులకు రాజకీయ వివాద భూయిష్టమైన భారతయుద్ధవిషయం రుచించకపోవచ్చును. యుద్ధానంతరం కౌరవ పాండవభేదంలేకుండా కౌరవశబ్దమే ఉభయవంశాలనూ తెలియచేయడానికి ప్రయోగింపబడుతూ వచ్చింది. ప్రస్తుతం లభ్యమవుతున్న మహాభారతపాఠం ప్రాచీన మాతృక కాకపోయినా మూలకథమాత్రం క్రీ. పూ.

1400 నుంచి క్రీ. పూ. 1000 లోగా సంభవమై ఉండవచ్చును. ఆశ్వలాయన గృహ్యసూత్రాల్లోనూ (III 4.4), సాంఖ్యాయన శ్రౌత సూత్రాల్లోనూ (15—16) భారత యుద్ధప్రస్తి గోచరిస్తున్నది. భారతవీరులు వీరపూజార్హులైనట్లు పాణిని అష్టాధ్యాయిలో ఉల్లేఖించినాడు. వీటినిబట్టి మహాభారతం ప్రాచీనమైనదని స్పష్టమవుతున్నది.

పరీక్షితుని సింహాసనారోహణం

బృహద్రధ వంశం మహాభారత యుద్ధానంతరంవున్న రాజవంశాలు క్రమక్రమంగా మహానందుని మగధసామ్రాజ్యంలో లీనమైపోయినవి. ఈ రాజవంశావళి పురాణాల్లో కనబడుతున్నది. పురాణాలు మధ్యదేశానికీ అంగరాజ్యానికీ సంబంధించిన చరిత్రనే వివరిస్తున్నది.

పౌరవవంశం భారతయుద్ధానంతరం అర్జునపౌత్రుడైన పరీక్షిత్తుడు సింహాసనం అధిష్ఠించినాడు. అతని విజయపరంపరను అతని పాలనలో దేశసౌభాగ్యమునుగూర్చి అథర్వణవేదం చెబుతున్నది. పౌరాణిక సంప్రదాయాన్నిబట్టి సరస్వతీ నదినుండి గంగాప్రసంతివరకూ అతనిరాజ్యం వ్యాప్తమైంది.

ఒకనాడు పరీక్షిత్తు వనంలో దారితెలియక, వేటవల్ల అలసిపోయినాడు. ఇంతలో ఋషీశ్వరుణ్ణిచూచి తోవ అడిగినాడు. తపస్సులోవున్న యతి సమాధానం ఇవ్వలేదు. కోపోద్దీపితుడై పరీక్షిత్తు మృతసర్పాన్ని మునీంద్రుని

కింతంలోవేసి వెళ్లిపోయినాడు. ముసీంద్రుని కుమారుడు పరీక్షితుని శపించినాడు వారం తిరగకుండానే తక్షకుడనే నాగ రాజువల్ల చనిపోతాడని. రాజు ఎన్నో జాగ్రతలు తీసి కొన్నాడు. శాపప్రకారం పరీక్షిత్తు సర్పదష్టుడై గతించినాడు. దీనివల్ల చారిత్రక విషయం గ్రహించవచ్చును. గాంధారంలో నాగజాతివారు ప్రబలంగా ఉండేవారన్నమాట. పౌరవుల బలహీనతచూచి తక్షకుడనే నాగప్రభువు హస్తిపురిమీద దండయాత్రచేసి పరీక్షితుని సంహరించి ఉండవచ్చును.

పరీక్షితుని పుత్రుడు జనమేజయుడు రాజైనాడు. పితృమరణానికి సంతప్తుడై అతడు నాగజాతిని నిర్మూలించ వలెననే తక్షశిలమీద దండయాత్రచేసి నాగులను చంపినాడు. ఆస్తీకుడు నాగజాతి నశించడానికి అంగీకరించక పోవడంవల్ల జనమేజయుడు తగ్గిపోయినాడు. నాగజాతి వినాశనాన్ని సర్ప యాగమనే పౌరాణికగాథగా ప్రసిద్ధమైంది. జనమేజయుడుమహా శక్తి సమన్వితుడై కురురాజ్యం స్థిరంచేసికోగలిగినాడు. నాగ జాతిని నాశనం తదుపరి జనమేజయుడు కొంతకాలం తక్ష శిలను రాజధానిగా చేసికొన్నాడు. తక్షశిలలో జనమేజయునికి వైశంపాయనుడు భారతం వినిపించినాడు.

జనమేజయుని సోదరుడు కక్షసేనుడు. ఇంద్రప్రస్థంలో స్వతంత్రరాజ్యం స్థాపించి ఉండవచ్చును. హస్తిపురి పతనా నంతరం ఇంద్రప్రస్థంలో కురురాజ్య పరిపాలనసాగింది. కురు వంశశాఖ కౌశాంబికి తరలివెళ్లింది.

జనమేజయుని తరువాత అతనిసుతుడు శతనీకుడు రాజైనాడు. అతనిపుత్రుడు అశ్వమేధదత్తుడు. అతని కుమారుడు అధిసీమకృష్ణుడు రాజైనాడు. వైదికసాహిత్యంలో వీరి ప్రస్తికనబడదు. అధిసీమకృష్ణుని కాలంలో నైమిశారణ్యంలో ద్వాదశ వర్షయాగ సందర్భంలో గోమతీనదీతీరాన తొలిసారి పురాణాలన్నీ శ్రవణంచేయడం జరిగింది. శౌనకుడు ప్రధాన ఋత్విజుడు. ఆయన మహాభారత శ్రవణంచేసినాడు. సూతుని వల్ల పురాణాలు తక్కిన తరాలవారికి సంక్రమించినవి. భారత పాఠానికి సాంప్రదాయిక భాగాలు కొన్నికూర్చడం, గ్రంథ బాహుళ్యం చేయడం సంభవించింది. ద్వాదశవర్ష యాగా నంతరం పాలకులైన ప్రభువుల వృత్తాంతం మత్స్య, వాయు పురాణాలలో అధిసీమ కృష్ణునితరువాత భవిష్యత్ శాసకు లుగా ఉల్లేఖింపబడింది.

అధిసీమకృష్ణుని కుమారుడు నిచక్షుడు పరిపాలిస్తు న్నప్పుడు భారతదేశంలో మహోపద్రవాలు సంభవించినవి. హస్తినాపురి గంగానది వరదవల్ల శిథిలమైపోయింది. కురు వాసులు తిండిలేక వత్సభూమికివెళ్లి కౌశాంబిని రాజధానిగా చేసికొని స్థిరపడినారు.

కోసలీయులు పురాణాలలో ఇక్ష్వాకులయిన కోసలరాజులసంఖ్య 31 కనబడుతున్నది. మూలపురుషుడు బృహద్బలుడు. అతడు భారత సంగ్రామంలో మరణించినాడు. అతని ఆరోవారసుడు

అధిసీమకృష్ణునికి సమకాలికుడు. బౌద్ధగ్రంథాలవల్ల ఇక్ష్వాకు రాజవంశనామావళిలో శాక్యశుద్ధోదనుడు ఆయన సుతుడు సిద్ధార్థుడు, ఆయనపౌత్రుడు రాహులుడూ ప్రసేనజిత్తుకు పూర్వులు.

బౌద్ధగ్రంథాలనుబట్టి కోసలీయులు అయోధ్య మాత్రమేకాక సాకేతమునూ శ్రావస్తినీకూడా రాజధానులుగా చేసికొన్నట్లు తెలియవస్తున్నది. అయోధ్య అతి ప్రాచీన రాజధాని. దానితరువాత సాకేత శ్రావస్తీనగరాలు రాజధానులై ఉండవచ్చును. అయోధ్యనూ సాకేతాన్నీ ఒకేపట్టణంగా భావిస్తారు. బహుశ రెండునగరాలూ దగ్గర లోనివి. శ్రావస్తి ప్రస్తుతకాలంలోని సాహేత్ మాహేత్, రప్తినదీతీరంలో ఉత్తరానఉన్నది. బుద్ధుని కాలానికి అయోధ్యానగర ప్రాభవం అంతరించింది.

కోసల కాశీరాజ్యాలమధ్య వైరంవుంటూ వచ్చింది. ఆధిపత్యంకోసం పరస్పరం ఘర్షణపడేవారు. వైదికవాఙ్మయాన్నిబట్టి కాశీకోసలరాజ్యాలు సన్నిహితంగా ఒకేకూటముగా ఉండేవని తెలుస్తుంది. కాశీరాజ్యం అదిలో ఆధిపత్యం వహించినా కోసలీయుల అధికారమే చివరకు స్థిరపడింది.

మగద భారత యుద్ధకాలానికి బృహద్రథ రాజవంశము మగధను పాలిస్తూఉండేది. యుద్ధానికిపూర్వం జరాసంధుని పుత్రుడు సహదేవుడు పాండవకూటంలో చేరినాడు. భారత

యుద్ధంలో తనువు చాలించినాడు. అతని కుమారుడు సోమాధి గిరివ్రజ పట్టణములో రాజైనాడు. అతని తరువాత ఆరోవారసుడు సేనాజితుడు. అతడు అధిసీమ కృష్ణుడికీ దివాకరుడికీ సమకాలికుడు. సోమాధినుండి 21 వ రాజు రిపుంజయుడు. అతన్ని మంత్రి పులకుడు వధించి తనకుమారుడైన ప్రద్యోతుని రాజును చేసినాడు. సోమాధినుండి లెక్కించగా ఇరవై ఒకటవవాడు బృహద్రధ రాజవంశంలో కడసారివాడు. ప్రద్యోతవంశము 138 ఏళ్ళు నిలిచింది. శిశునాగుడనేరాజు ప్రద్యోతవంశం నిర్మూలనంచేసి కాశీలో కుమారుణ్ణి పాలకుణ్ణి చేసినాడు. అతనిరాజధాని రాజగృహం. పురాణములనుబట్టి శిశునాగుని తరువాత అయిదోవారసుడు బింబిసారుడు. అతనితరువాత అజాతశత్రువు రాజ్యానికి వచ్చినాడు. శిశునాగుడు స్థాపించినవంశమే శైశునాగవంశం.

పురాణములనుబట్టి బింబిసారుని వంశానికి శిశునాగుడు మూలపురుషుడు. బౌద్ధసాహిత్యాన్నిబట్టి ప్రద్యోతుని అనంతరము నాలుగయిదు తరాలతరువాత పాలించినవాడు శిశునాగుడు.

శిశునాగుడు బింబిసారుని అనంతరం వచ్చినవాడని పురాణాలు చెబుతున్నవి. శిశునాగునిరాజ్యంలో వారణాసి కూడా చేరివుండడం ఒకకారణం. బింబిసార అజాతశత్రువులు మగధ సామ్రాజ్యాధిపత్యాన్ని మొదట కాశీలో స్థాపించినారు. అవన్తి మగధరాజ్యాల మధ్యవైరం తొలిసారిగా

అజాతశత్రునిక్కాలంలో ఉప్పతిల్లింది. బింబిసారుని పాలనా కాలంలో అవన్తీ మగధలకు వైరంఉన్నట్లు కనబడదు. అందు చేత ప్రద్యోత వంశనిర్మూలనంచేసిన శిశునాగుడు బింబిసార అజాతశత్రువుల అనంతరం రావలసినవాడు. బింబిసార అజాత శత్రువులకు పూర్వకాలీనునిగా శిశునాగుని చేయవలెనంటే అతనిరాజధాని రాజగృహముకావడం కారణం కావచ్చును. పురాణములవల్ల పాటలీపుత్రమునకు ఉదయనుడు రాజధానికి మార్చినట్లు తెలుస్తున్నది. "మాలాలంకారవత్తు" అనే పాళీగ్రంథమునుబట్టి శిశునాగుని నాటినుంచి రాజగృహానికి రాజధానికి ఉండవలసినశోభ తరిగిపోయింది. బింబిసార అజాత శత్రువులనాటి రాజగృహ నగరవైభవం క్షీణించినతదుపరి శిశునాగుడు పరిపాలించాడన్నమాట. శిశునాగుడు మగధకు మహోపద్రవం కలగకుండా ఎమర్కొడానికి రాజగృహాన్ని రాజధానిగా చేసికొన్నాడు.

ఏతావతా తేలిన సారాంశం :—రిపుంజయుని హత్యానంతరం బృహద్రథ రాజవంశం క్షీణించడమూ, బింబిసారుడు మగధరాజ్య సింహాసనారోహణము చేయడమూ సంభవించినవి. మగధసామ్రాజ్యోన్నతి బింబిసారుడు స్థాపించినవాడైనాడు.

భారత యుద్ధానంతర రాజ్యాలు

మహాభారత యుద్ధానంతరం మగధ, కోసల, వత్సరాజ్యాలే కాక గ్రంథాధారాలవల్ల అన్యరాజ్యాల విషయం కొంతవరకు తెలుస్తున్నది.

పాంచాలరాజ్యం ఈ రాజ్యపాలకులు భారతయుద్ధకాలంనుంచి మగధచక్రవర్తిఅయిన మహాపద్మనందునిదాకా 27 మంది. పురాణాలవల్ల ఈ సంఖ్య తెలియవస్తున్నది. ఆ రాజులపేర్లు మాత్రం తెలియవు. పరిచక్ర కాంపిల్య అహిచ్ఛత్రనగరాలు పాంచాలములో ప్రసిద్ధములు.

శూరసేనము యమునాతీరస్థమైన మధుర శూరసేన రాజ్యమునకు రాజధాని. భారతయుద్ధానికిపూర్వం శూరసేనము యాదవుల పాలనలోది. యుద్ధానంతరం పురాణములవల్ల 23 రోజులు మహాపద్మనందుని కాలంవరకూ పాలించినట్లు తెలుస్తున్నది. రాజవంశావళీచరిత్ర పురాణాల్లో విశదంగాలేదు.

అవంతి శూరసేనరాజ్యానికి దక్షిణంగా అవన్తీరాజ్యం ఉండేది. అవన్తి నేటి మాళవము నిమాల్ ప్రాంతాలు. అవంతి నేటి ఉజ్జయిని. ఉజ్జయిని శిప్రా (క్షిప్రా) నదీతీరాన ఉన్నది. సాంస్కృతికంగా మహోజ్వలమైన ఈనగరప్రస క్తి పురాణాల్లో స్పష్టంగాకనబడదు. భారతయుద్ధానంతరం యదువంశీయులైన హైహాయులు అవంతీపాలకులు. పండితాభిప్రాయాన్నిబట్టి పురాణోక్తమైన వీతిహోత్రులు 21 మంది అవంతిని పాలించినారు. భారతయుద్ధకాలంలో పాలకులైన విందానువిందుల తరువాత అవంతీచరిత్ర తెలియరాదు. అయిదారు శతాబ్దాల తరువాత ప్రద్యోతులు అవంతిని పరిపాలించినారు.

విదేహరాజ్యం జనకుల వంశములో కృతి అనే బహులాశ్వ పుత్రుడు భారతయుద్ధకాలములో విదేహరాజు. జనక యాజ్ఞ

వల్క్యాల ఆధ్యాత్మికగోష్ఠి బృహదారణ్యకోపనిషత్తువల్ల విశదమవుతున్నది. జనకు లిద్దరు ముగ్గురుండడంవల్ల కాల నిర్ణయం చేయడం అసాధ్యం. మహాభారతాన్నిబట్టి జన మేజయునికాలంలో ఒకజనకుడు విదేహ రాజు. ఉదాలక పుత్రుడు శ్వేతకేతువు జనకుని ఆస్థానంలో ప్రముఖుడు. అతడు జనమేజయుని సర్పయాగానికి వెళ్లినవాడు. ఆధ్యాత్మిక విద్యారసికుడైన జనకచక్రవర్తి యాజ్ఞవల్క్యునికి కేకయ రాజైన అశ్వపతికి సమకాలికుడు. అయితే యాజ్ఞవల్క్యుని కాలముగాని అశ్వపతి కాలముగాని నిరూపించలేము. రాయ చౌదరి మతాన్నిబట్టి జనమేజయ పారీక్షితుని అనంతరం జనక రాజరి ఉండేవాడు. ఈ జనకుడు సీతాదేవికి జనక తుల్యుడు. భారతయుద్ధానంతరం ఆధ్యాత్మికవేత్తఅయిన జనకరాజు, యాజ్ఞవల్క్యమహర్షి ఉండిఉండవచ్చును. జనమే జయుని తరువాతరాజైన శతానీకుడు యాజ్ఞవల్క్యుని శిష్యుడుకావడంచేత జనకయాజ్ఞవల్క్యులు భారత సంగ్రా మానంతరకాలంలోవారు. ఉగ్రసేనుడు జనకుని నిజనామము కావచ్చును. విదేహము భారతీయ సంస్కృతికి ఆలవాలమై ఆధ్యాత్మికవిద్యకు ఆటపట్టుగా విలసిల్లింది. విదేహరాజుల్లో కడసారివాడు సీరధ్వజుడు కావడంచేత రాజరికం లోపించి ప్రజాతంత్రం ప్రభవించింది. విదేహరాజ్యంలోనే రాజకీయ విప్లవం ఉద్భవించి బుద్ధుని కాలానికే పూర్ణరూపం ధరించిన దని అనవచ్చును. బుద్ధునికాలంలో విదేహులు లిచ్ఛవులు

ఇతరగణములూ కలిసి 'వజ్జులు' అనేపేరుతో ప్రబలమైన ప్రజాతంత్ర సమాఖ్యను ఏర్పరచి మగధ సామ్రాజ్యాధిపత్యాన్ని ఎదురొక్కొన్నాడు. విదేహ పతనానికి కాశీరాజ్యం కారణభూతమైనది. ఆదినుంచీ కాశీ విదేహ రాజ్యాలవైరం ప్రసిద్ధం. కాశీలో విదేహవంశశాఖ సుస్థాపితమైంది. పురాణాలనుబట్టి 28 మంది రాజులు భారత యుద్ధానంతరం పరిపాలన చేశారని తెలుస్తున్నది.

కాశి ఇరుగుపొరుగురాజ్యాలు త్వరపడుతూ ఉండేవి కాశీ రాజ్యాన్ని ఆక్రమించాలని. కాశీ విదేహరాజ్యాలమధ్య, కాశీ, కోసల రాజ్యాలమధ్య వైరంఉండేదని లోగడరాశాను. పౌరవ, ఇక్ష్వాక, మగధ పాలకులు కాశీని తరతరాలు పాలించారు. బ్రహ్మదత్తుడనేవాడు బుద్ధునికాలంలో కాశీ రాజని బౌద్ధజాతక కథలలో ఉన్నది. అయితే ఈ బ్రహ్మదత్తుడు కల్పితవ్యక్తి.

అంగరాజ్యము మగధకు ప్రాగ్దిశలో అంగరాజ్యం ఉండేది. కౌశాంబిప్రభువైన ఉదయనుని కుమారుడైన శతానీకుడు అంగరాజ్యంమీద దండయాత్ర చేసినాడు. బింబిసారుడు తనతండ్రికి కలిగిన అవమానాన్ని సహించలేక జిగీషువైనాడు. అంతటితో అంగరాజ్యం స్వాతంత్ర్యం పోగొట్టుకొన్నది. మగధ సామ్రాజ్యంలో లీనమైపోయింది. బింబిసారుడు కుమారుడైన కుణిక అజాతశత్రువును అంగరాష్ట్ర పాలకునిగా చేసినాడు.

ఏతావతా మహాభారత యుద్ధానంతరం నాలుగు వందలు సంవత్సరాలుపాటు ఆర్యావర్తంలో సుప్రతిష్ఠితమైన ఏకచ్ఛత్రాధిపత్యం లేకపోయింది. రాజకీయంగా దేశ మంతకూ ఏకత్వాన్ని సాధించేనిమిత్తం ఏరాజ్యమూ ప్రయోగ మించలేకపోయింది.

ఋగ్వేద సంహితాకాలము

సాహిత్యము హైందవ యూరపీయ భాషలలో ఋగ్వేదం అత్యంత ప్రాచీనగంథం. ప్రాచీన విద్వాంసులు ఋగ్వేదాను క్రమణికలు సంతరించినారు. ఈ అనుక్రమణికలవల్ల ఋగ్వేదంలో ఋక్కులసంఖ్య, కవులు, దేవతలు, సూక్తాల్లోని ఋక్కుల ఛందస్సులూ స్పష్టంగా తెలియవచ్చినవి. సుమారు క్రీ. పూ. 600 సంవత్సరాలనాటికే ప్రతిఋక్కునూ, ప్రతి శబ్దాన్ని ప్రత్యక్షరాన్ని లెక్కించి పొందుపరిచినారు.

మాక్స్‌ముల్లర్ పండితుడు శౌనకుని వేదానుక్రమణి కనుబట్టి ఇచ్చిన వివరాలు చూడండి.

మండలములు	అనువాకములు		సూక్తములు
ప్రథమ మండలము	24	+	191
ద్వితీయ మండలము	4	+	43
తృతీయ మండలము	5	+	62
చతుర్థ మండలము	5	+	58
పంచమ మండలము	6	+	87

మండలములు	అనువాకములు	సూక్తములు
షష్ఠమ మండలము	6	+ 75
సప్తమ మండలము	6	+ 104
అష్టమ మండలము	10	+ 92 + 11 వాలఖిల్యసూక్తాలు
నవమ మండలము	7	+ 114
దశమ మండలము	12	+ 191
మొత్తము	85	+ 1017 + 11=1028

ఈ పది పుస్తకాలలో ఉన్నవి.

విషయానుక్రమణిక ప్రథమ మండలమును శతర్చినుల మండల మని అంటారు. నూటికన్న అధికంగా కవుల పట్టిక ఉన్నది. ఉన్నసూక్తాల్లో 44 ప్రత్యేకంగా ఇంద్రుణ్ణిగురించి, 43 అగ్నిని గూర్చి, 15 అశ్వినులవిషయం, 11 మరుత్తులకు సంబంధించినవి, 9 విశ్వదేవతాకములుగా, 4 ఉషస్సునకూ, 4 రిభులకూ, ద్యావాపృథివీ సూక్తాలు మూడున్నవి.

ద్వితీయ మండలములో 43 సూక్తాలున్నవి. 14 సూక్తాలు ఇంద్రదేవతాకములు, 2 కపింజల, 9 అగ్ని దేవతాకములు.

తృతీయ మండలములో 62 సూక్తాలున్నవి. విశ్వామిత్ర పోక్తములు కావచ్చును. లేదా అతని వంశీయులు చెప్పినవి కావచ్చును. సూక్తాలు రచించిన కవులలో తరుచుగా

వైరంఉండేది. "వసిష్ట విశ్వామిత్ర కుటుంబాలమధ్య వైరం వేదకాలంనుంచీ పౌరాణిక కాలములో ప్రముఖమై అనంతర కాలంలోకూడా ప్రసిద్ధమైంది."

చతుర్థ మండలములో 58 సూక్తములున్నవి. మొదటి 41 గోతమపుత్రుడైన వామదేవుడు రచించినాడని అంటు న్నారు. అలాగే తుది పదునాలుగునూ, 12 సూక్తాలు ఇంద్రదేవతాకములు, 11 అగ్నిదేవతాకములు.

పంచమ మండలములో 87 సూక్తాల్లో 21 అగ్ని దేవతాకములు, 11 మిత్రావరుణ సంబంధములు, 9 ఇంద్రా సంబంధములు, 9 మరుద్దేవతాకములు, 9 విశ్వేదేవతా సంబంధములు, 6 అశ్వినీదేవతాకములు.

షష్ఠమ మండలములో భరద్వాజర్షి రమారమి అన్ని బుక్కలనూ చెప్పినవాడు. మొత్తము సూక్తాలు 75. ఇంద్రునివి 21, అగ్నివి 13, పూషునివి 8, విశ్వదేవతా కములు 4.

సప్తమ మండలములోసి సూక్తాలను వసిష్ఠప్రోక్తము లని విద్వాంసులమతం. ఆయనకుమార్ళిద్దరూ మంత్రప్రోక్త లుగా ఉన్నారు. మొత్తం 104 సూక్తాల్లో ఇంద్రునివి 14, అగ్నివి 13, అశ్వినీ దేవతా సంబంధములు 8, ఉషోదేవతకు, విశ్వేదేవతకు చెరి 9, వరుణునికి 4, మంత్రాకములకు 1 ఉన్నవి.

అష్టమ మండలము బహుకర్తృకము. 92 సూక్తములున్నవి. 116 అనుబంధసూక్తాలున్నవి. ఇవి వాలఖిల్యప్రోక్తములు. 36 సూక్తాలు ఇంద్రుదేవతాకములు, అగ్నికి 116, 5 విశ్వేదేవతలవి, 3 మరుద్దేవతలకు సంబంధించినవి.

నవమ మండలములో 114 సూక్తాలున్నవి. 3 సూక్తాలుతప్ప తక్కినవన్నీ సోమదేవతాకములు. సోమరసాన్ని ఉన్నిలోనుంచి ప్రవహింపచేసి పరిశుద్ధిచేసే సమయములో సూక్తాలు గానము చేయవలసివుంటవి. పునరుక్తి ఎక్కువగా ఉంటుంది.

దశమ మండలములో 191 సూక్తములున్నవి. ఇంద్రునికి 34, అగ్నికి 25, విశ్వేదేవతలకు 22 ఇందులో పురుషసూక్తమున్నది. ఈ మండలములో లౌకిక సంస్కృతానికి దగ్గరగావుండే వైదిక సంస్కృత సూక్తములున్నవి.

వేదకర్తలైన కవులు మన ప్రాచీనుల విశ్వాసము వేదాలు పురుషకర్తృకాలుకావని అనగా అపౌరుషేయాలని. వారలా విశ్వసించినప్పటికీ సహేతుకంగా ఆలోచిస్తే కర్తలేనికార్యం ఉండదు కనుక వేదసాహిత్యానికి కర్తన్నారని చెప్పకతప్పదు. డాక్టర్ మూర్ మహోదయుడు వేదపరిశోధనచేసి వేదములు పౌరుషేయములని **Sanskrit Texts III-85** లో సిద్ధాంతం చేసినాడు. పౌరుషేయములని చెప్పడానికి ఋగ్వేదములో ఆధారములు * చూడవచ్చును.

---

* R. Veda I 47,2, 61,16. II 39.8. X 54.6. I 62.13. V 2.11. VII 15.4,31.11. VIII 43.2. R. T. H. గ్రిఫిత్ Rigvedic-Hymns. 2 Volumes.

సాహితీ వైదగ్ధ్యము వైదిక ఋక్కులలోని భాష సహజముగా సరళముగా సమాన భూయిష్ఠముకాకుండా ఉంటుంది. సమాసములున్నా అవి దీర్ఘములుకావు. ప్రాచీన యుగమునాటి *సాహిత్యమైనా ఛందోనైపుణ్యము, భాషపై అధికారము మనకు గోచరిస్తవి. కర్మాచరణలో తాత్పర్యము కలవాళ్ళు వైదికకవులు కనుక, ఋక్కులలో యాగప్రస్తి అధికంగా వస్తూఉంటుంది. నిత్యజీవితంలోని మతానుభవం వైదిక సాహిత్యంలో ప్రస్ఫుటమౌతున్నది. అగ్ని సోమదేవతాక సూక్తాలలోని కవిత ఆధ్యాత్మిక నిగూఢతవల్ల ప్రౌఢము. అలా అనడంచేత సూక్తాలలో కవితాసౌందర్యం లేదనికాదు. ప్రకృతికి సంబంధించిన దేవతలు ఉదాత్త మనోహర భావ చిత్రణకు ప్రోహదమిచ్చినవి. •ఉషస్సూక్తులు ప్రపంచ సాహితీ కిరీట కోటీరమణులుగా రామణీయకములు. వర్ణనా పాటవము ఇంద్రదేవతాక సూక్తాలలో చూడవచ్చును. ముఖ్యముగా ఇంద్రవృత్రాసురుల యుద్ధవర్ణనము కళ్ళకు కట్టినట్లుగా ఉంటుంది. మరుద్దేవతా సంబంధసూక్తాలలో ఘన గర్జితాలు; తటిల్లతాకాంతులు, జంఝామారుతార్భటిని వైదికకవులు అమ్మతంగా చిత్రించినారు. ● పర్జన్యసూక్తములో తుపాను భీభత్సము వర్ణితమైనది. వరుణదేవుని గూర్చిన

---

* Macdonell గారి Vedic Reader లో పీఠిక 28,29 పుటలు.
• I-113 వంటివి R. Veda.
● 5.83 R. Veda

సూక్తములు వైదికకవుల వేదనాతప్త హృదయమునుండి ఉదాత్త గంభీర్యంగా వ్యక్తమైనవి. రూపకసాదృశ్యమున్న వాక్యాలలో *నాటకీయ సన్నివేషములూ భాషా సౌందర్యమూ గోచరిస్తవి. పదోమండలంలో 34 లో జూద గాడి విలాపం చాలా జాలి కలిగిస్తుంది. (X-18) అంత్య క్రియా సంబంధసూక్తంలో మృతికి సంబంధించిన భావాలు గంభీరసౌందర్యంతో ఉన్నవి. కవితారీతిలో దార్శనికత పురుషసూక్తములో ఉన్నది. మొత్తంమీద ఋగ్వేదములో♦ భావావేశ తీవ్రతగల కవిత ఆస్వాదయోగ్యమవుతున్నది. అయినప్పటికీ వైదికకవులు ప్రణయఋక్కులు గానంచేశారని అనడానికి వీలులేదు. అధర్వణంలో వశీకరణమంత్రం కనపడు తుందేగాని ప్రణయగానంలేదు.

ఋగ్వేదములోని మతము . తత్త్వము ఋగ్వేదీయ మతములో ప్రధానముగా బహుదేవతా విశ్వాసము గోచరిస్తుంది. అనంతర సూక్తాల్లో కొన్నింటిలో అద్వైతభావము వ్యక్తమవుతున్నది. 'మాయ' 'రూప' శబ్దాలు వేదాంతార్థములోనే ప్రయుక్తమైనవి. ఋగ్వేదములో రూపమనగా ఆభాస అనే అర్థము. మాయాశబ్దార్థం వస్తుగత యాదార్థ్యం తెలుసుకోక, అన్యమైనదానిని ఆరోపించేశక్తిగా సంహితలోఉన్నది. ప్రాచీనమైన

---

* R. Veda X-10 వంటివి.

♦ Vedic Age మున్షీసంపాదన పుట 345.

బహుదేవతాస్తికత్వముతో ఆర్యుల విశ్వాసము ఆరంభమై ప్రకృతిక బహుదేవతాస్తిక విశ్వాసము, ఏకేశ్వరవాదములనే మజిలీలుగడిచి అద్వైతతత్వముగా పరిణమించింది. తత్త్వ చింత శాస్త్రీయంగా పరిఢవిల్లింది.

వైదికఋషులకు బహుళాస్తికవాదం రుచించక పోవడంవల్ల ఒకదేవతనూ మరొకదేవతనూ అభేదంగా భావన చేయడమో లేదా జంటలుగా దేవతలను ధ్యానించడమో సంభవించింది. బహుదేవతాబుద్ధి క్రమంగా ఆధ్యాత్మికమైన అద్వైతానికి దారితీసింది. దేవతలలో ఉదాత్తగుణాలు సర్వ సామాన్యంగా ఉంటే వాటిని ఏకైకవ్యక్తిగా సగుణరూపంగా భావన చేసినారు. ఈ భావనాపరిణతి నిరాకారాద్వైతవాదము లేదా నిర్గుణ బ్రహ్మవాదము.

ఏకేశ్వరవాదంలోనూ సగుణ బ్రహ్మవాదంలోనూ ఆర్యఋషుల అసంతృప్తి కనబడుతున్నది. ప్రథమమండలంలో వేసిన ప్రశ్నలు చూడండి. "ఈ జీవం, రక్తం, ఆత్మ ఈ విశ్వంలో ఎక్కడ? ఇది తెలిసికొన్న జ్ఞాతను ఎవరైనా ప్రశ్నించినారా? ఆదిసృష్టి చూచినవాడెవడు?" దీనికి సమాధానమున్నట్లు ఒకమంత్రంలో ఇలా వేదకవి చెప్పినాడు. సత్పదార్థము ఒక్కటేఅయినా విప్రులు ఇంద్రమిత్ర వరుణాగ్ని యమ మాతరిశ్వాదులుగా బహుధా వచిస్తున్నారు. విశ్వా ధారమైనదీ సత్పదార్థమే. ఇది స్త్రీకాదు పురుషుడూకాదు. అందుచేతనే ఆసత్పదార్థాన్ని ఒకసారి 'అతడు' అనీ 'అది'

అనీ తత్త్వవేత్తలు పలికినారు. జగత్తుయావత్తూ 'ఋత' మనే సత్యమువిూద ప్రతిష్ఠితమైంది. నైతికంగా విశ్వము మనడానికి ఈ 'ఋతము' అనగా నియమములేక క్రమము కారణము. యజ్ఞైకదృష్టిలో 'ఋతము' యజ్ఞకర్మగా ఋషులు భావన చేసినారు. ఈ 'ఋతము' నిర్గుణ నిరాకార సద్రూప అద్వైతానికి నాందిగా భావన చేయబడినది.

జగత్కారణమూ దాని స్వభావమునుగురించి వైదిక ద్రష్టలు యోచనచేయకపోలేదు. ఇది తాత్త్విక సమస్య అయినప్పటికీ కవులదృష్టిని ఆకర్షించింది. పదోమండలములో చూడండి. తపస్సువల్ల అనగా ఉష్ణమువల్ల ఋతసత్యా లుద్భవించినవట. అనంతరం రాత్రి, సముద్రము, సంవత్సర ములూ క్రమంగా వచ్చినవట. (X 72.2) లో అసత్తునుండి సత్పదార్థం ఉత్పన్నమైనదని ఉన్నది. పౌరాణిక దృష్టి ప్రకారం జగత్తు ఏదారుకర్మకారుని కార్యరూపంగానో భావనచేయడం సంభవించింది.

ఋగ్వేదీయ దశమ మండలములో ప్రశ్న బయలు దేరింది. "ఏ వృక్షిసంబంధమైన ధాతువునల్ల స్వర్గమూ పృథివీ నిర్మితమైనవి?" ఋగ్వేదము ఏకేశ్వరవాదమును ఉద్ఘాటించింది. హిరణ్యగర్భుడు విశ్వనాథ్యుడైన మహాజలము నుండి ఉత్థితుడైనాడు. జగత్తును నిత్యమై (ప్రధానము అని అనబడే) తత్పూర్వమందున్న వస్తువుచేత సృజించినాడు.

అయితే దశమ మండలంలో 129 లో నాసాదాసీయసూక్తం ఉదాత్తమైన అద్వైతస్థాయిలో ప్రపంచసృష్టిని వర్ణించింది.

దశమ మండలంలో మాయాశబ్దము ఆభాసగా ప్రయోగింపబడి ఆనంతర వేదాంతమును సూచిస్తున్నది. ఇలాసూచనాప్రాయంగా వేదాంతభావం ఋగ్వేదంలో ఉన్నప్పటికీ వాస్తవికతావాదాన్ని ద్యోతకం చేస్తుంది. కాని అద్వైతాదర్శవాదాన్ని కాదు. అయితే అసత్తునుండి సత్తు ఉత్పన్నమయినదంటే, అవ్యాకృతమైన మూలపదార్థమునుండి వ్యాకృతమైన సత్పదార్థం వచ్చినదన్నమాట.

ఆనంతర తత్త్వశాస్త్రంలోని పంచభూతాలకు మారుగ, ఋగ్వేదము ఒక్కజల్నాన్నే ప్రధాన మూల పదార్థంగా చెబుతుంది. దీనినుండి జగత్తు పరిణమించింది. దశమ మండలంలోని పురుషుని శరీరం ఈ మూలమైన ప్రధానమనబడే పదార్థము. ఈ పదార్థమునుండి విశ్వసృష్టి వచ్చింది. దేవతలు సృష్టికి నిమిత్తమాత్రులు. సృష్టికార్యం మహాయాగం. పురుషుడు ఆహుతి. సగుణరూపుడైన పురుషుడికీ జగత్తుకూ ఏకత్వమున్నది. పరతత్త్వమే పురుషుడైనాడు. అందుకే పురుషసూక్తం అంటున్నది. "పురుషుడి నుంచి విరాట్‌రూపం, విరాట్‌నుంచి మరల పురుషుడు ముద్భవించినాడు."

దృక్పథము ఆర్యఋషులు జీవితాన్ని ఆశాదృష్టితో ఆలోకించినారు. ఆముష్మికమైన తాత్త్వికచర్చలకన్న ఇహజీవితాన్ని

సరిదిద్దుకోమని సంహిత చెబుతున్నది. ఆముష్మికత్వం ఉపనిషత్తుల్లో ప్రస్ఫుటం. సంహితలోమాత్రం దీర్ఘాయువు, వ్యాధినిర్మూలనం, వీరసంతానం, ధనకనక వస్తువాహనాలు, శత్రుచ్ఛేదం, తృణకాష్ఠ జలసమృద్ధికోసం ఋషులు ధ్యానం చేసేవారు. వారిలో జీవిత నైరాశ్యం లేశమాత్రంకూడా గోచరించదు. జీవితం యదార్థమైనా, స్వప్నప్రాయమైనా, సద్వస్తులైనా, ఛాయఅయినా పూర్తిగా అనుభవించ వలసినదనే వారిమతం. జీవితం దుఃఖభూయిష్టం అనేవాదం కొంతకాలానికి బౌద్ధులవల్ల, వేదాంతులవల్ల వ్యాప్తమైనదే కాని, ఋగ్వేదములోమాత్రం నిరాశాదృష్టి కనపడదు. ప్రాకృతిక శక్తులను వీక్షించి తన్మయులైనా ఋషుల్లో ప్రయోజనాపేక్ష బహుళంగాఉంది.

ఋగ్వేద సంహితాకాలంలో సాంఘికస్థితి

గృహజీవనము సాంఘిక జీవితాధారం గృహం. తండ్రి గృహాధిపతి. పిల్లాజెల్లా తండ్రిమాట జవదాటకూడదు. ఋనత్రయుని కథవల్ల తలిదండ్రులు తమపిల్లలమీద ఎలా అధికారం చలాయించేవారో తెలుస్తుంది. తండ్రిగతిస్తే జ్యేష్ఠుడు ఇల్లూవాకిలీ చూచేవాడు. అతిథిసత్కారం గృహజీవనంలో ముఖ్యం. బ్రాహ్మణాల కాలంలో నిత్యకర్మానుష్ఠానంలో అనగా పంచమహాయజ్ఞాలలో అతిథిపూజను చేర్చినారు ఆర్య ఋషులు.

వర్ణవ్యవస్థ వర్ణవ్యవస్థ ప్రపంచంలో ఏదోరూపంలో ఉండనే ఉన్నది. శ్వేతజాతుల్లో వర్ణభేదం ఎక్కువ.

ఋగ్వేద సంహితాకాలంలో వర్ణవ్యత్యాసములేదని చెప్పవచ్చును. పురుషసూక్తాన్నిబట్టి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగువర్ణాలు బ్రహ్మనుండి ఉద్భవించాయని చెబుతున్నది. పురుషసూక్తంలో సూక్ష్మంగా వర్ణితమైన వర్ణవ్యవస్థ బ్రాహ్మణ గ్రంథకాలానికి సంకుచిత మైంది. జన్మవల్లనే భేదము వచ్చిందనే సిద్ధాంతము పాతుకు పోయింది.

పురుషసూక్తంలో వర్ణవ్యనస్థ వర్ణితమైంది కాబట్టి సంహితాకాలానికే వర్ణవ్యత్యాసము సంకుచితంగా ఉంనని అపోహ పడకూడదు. పురుషసూక్తం ఆదివేదకాలానికి సంబంధించిన రచనాభాగముకాదు. ఆర్యులు సప్తసింధు ప్రాంతం నుండి తూర్పుగా తరిలిపోయినప్పుడు, వర్ణవ్యవస్థ సంకుచితంగా ఏర్పడుతున్నప్పుడు పురుషసూక్తం ఋషిప్రోక్తమైంది. ఋగ్వేదంలో వర్ణశబ్దం దాసదస్యులకూ, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకూ భేదం సూచించడానికి ప్రయుక్తమైంది. రాజన్య వైశ్య శూద్రశబ్దాలు పురుషసూక్తంలోనే కనబడతవి. బ్రాహ్మణశబ్దం ఋగ్వేదంలో తరుచుగా కనబడదు. బ్రాహ్మణుడు కర్మకలాపాలాను నడిపించేవసిష్ఠుడని కొన్నిపంక్తులవల్ల తెలుస్తుంది. మేధావంతుడై, గుణగరిష్ఠుడై దైవికసంపత్తి

కలవాడు ఎవడయినా బ్రాహ్మణుడు కావచ్చునని కొన్ని వైదికభాగాలవల్ల తేటతెల్ల మవుతున్నది.

వర్ణవ్యవస్థలేని ఆదివేదకాలమునుంచి ఆనంతర వేద కాలందాకా పరిశీలిస్తే ఆర్యుల జీవితములో విశేషంగా మార్పులు వచ్చినవని గ్రహించవచ్చును. పంజాబునుండి ఆర్యులు ప్రాగ్దిశగా తరలివెళ్ళినాకు. దారిలో దాసదస్యులతో నిరంతర పోరాటం చేయవలసివచ్చింది. ఆర్యులు తమ కూటాన్ని బలిష్ఠము చేసికోవలసివచ్చి చిన్నచిన్న తెగలను కలుపుకోగా స్వల్ప కేంద్రీకృతరాజ్యాలు ఏర్పడినవి. చిన్న చిన్నకూటాలరాజులు బలశాలిఅయిన ప్రభువువల్ల రాజరికం కోల్పోయి సామంతులకన్న హీనస్థితికివచ్చినారు. దస్యులతో పోరాడేనిమిత్తం స్వరక్షణార్థం సైన్యసమీకరణ సర్వ కాలాల్లో కావలసివచ్చింది. ఈ సైన్యసమీకరణలో తెగ లలోనుంచి ఎన్నుకొన్నవారిని చేర్చుకొనేవారు. క్షత్రియు లీతీరుగా ఏర్పడినారు. ఇతర ఆర్యజనానీకము సైనిక విషయాల్లో జోక్యం పెట్టుకోక శాంతజీవనం గడుపుతూ సేద్యం, వాణిజ్యం, ప్రజలకు తెరువు చేసికొన్నారు. 'విశ' లేదా వైశ్యులనేవారు వ్యాపారులైనారు. ప్రత్యేకంగా పురోహితవర్గము ఏర్పడింది. ఆదివేదకాలంలో గృహస్థుడేకాక సామంతరాజులుకూడా స్వయంగా దేవతాప్రీతికై యాగ క్రియలు చేసికోగలవారు. సంహితానంతరకాలంలో బ్రాహ్మ ణములవల్ల కర్మకలాపము ప్రబలమై, సరళము కాకపోవడం

చేత అందరూ స్వయంగా యాగ శ్రౌతకర్మలు చేసికోలేక పోయినారు. అంతేకాక విస్తృతమవుతున్న రాజ్య రక్షణార్థము క్షత్రియవర్గము ప్రత్యేకముగా ఉండడంవల్ల, ఎవరి వృత్తులు వారే చేసికోడంవల్ల, మేనాపులు సాత్త్వికులూ అయినవారు యుద్ధసంఘర్షణల్లో కలుగజేసుకోక, వేదాది విద్యాలయందే నిష్ఠతో అచ్చులేనికాలంలో అక్షరమైనా పొరపాటు రానీయకుండా వైదిక వాఙ్మయాన్ని, సంప్రదాయాన్ని అధ్యయన అధ్యాపనాలుచేసి నిలవబెట్టి, ప్రాక్ ఇతిహాస కాలంనాటి భారతీయ సంస్కృతిని సుప్రతిష్ఠితంచేసి విస్తారమైన కర్మకలాపాన్ని నడిపించగలిగినారు. ప్రత్యేకంగా వారు పురోహితులనీ బ్రాహ్మణులనీ అనిపించుకొన్నారు.

దాస లేక దస్యులనబడేవారు ఆర్యులవల్ల పరాజితులై క్రమేణ శూద్రశబ్ద వాచ్యులైనారు. సంహితా బ్రాహ్మణాలలో శూద్రునికి ఎలాంటిస్థానం ఉండేదని ప్రశ్నవస్తుంది. తైత్తిరీయ సంహితనుబట్టి అతనికి వైదికయాగములు చేసే అర్హతలేదు. అతడు పాలకీలు మోసేవాడు. సంఘంలో అతన్ని చిన్నచూపు చూచేవారు. బ్రాహ్మణ ధర్మసూత్ర కాలంలో ఆర్య శూద్ర భేదము స్ఫుటమైనది. ధర్మ సూత్రాలు అతన్ని దస్యవర్ణుడనీ అనగా నల్లనివాడనిచెప్పి ఆర్యరాష్ట్రసీమకు ఆవలఉంచినవి. మధ్యదేశవాసం ఆర్యులు స్థిరపరచుకొన్నతరువాత వర్ణవ్యవస్థ సంకుచితమైంది. వర్ణ వ్యత్యాసం జన్మతః వచ్చినదనే సిద్ధాంతం ప్రబలమైంది.

పశ్చిమోత్తర భారతదేశంలో వర్ణధర్మం పాటించనివారిని 'వ్రాత్యులు' అని ఆర్యులు పేరుపెట్టినారు.

వర్ణవ్యవస్థను గురించి ధర్మశాస్త్ర, స్మృతికార, ధర్మశాస్త్ర వ్యాఖ్యాతల సిద్ధాంతాలు ఆ యా అధ్యాయాల్లో ఉల్లేఖిస్తాను.

వివాహము - స్త్రీకిగల స్థానము మానవ జీవితంలో ముఖ్యసంస్కారం వివాహం. రజస్వలలైన చాలాకాలానికి కన్యలకు వివాహం జరిగేది. అవివాహితలై వయస్సువచ్చిన కన్యలు ఇళ్ళల్లో పెరుగుతూ ఉన్నట్లు* సంహితలో కనబడుతుంది. పండుగలు వచ్చినప్పుడు కన్యలు ప్రేమికులను వశంచేసుకోడానికి వివిధాభరణాలు ధరించేవారు. ప్రేమికుడు ప్రియురాలిని చూడడానికి వచ్చి ఇంటిల్లిపాదినీ మాత్రప్రయోగంవల్ల నిద్రపోగొట్టడమూ, ప్రేయసీప్రియుల అన్యోన్యానురాగమూ గాంధర్వమూ వీటినిబట్టి విచారిస్తే ప్రౌఢావివాహాలు జరిగేవని చెప్పవచ్చును. పదోమండలంలో 85లో వర్ణితమైన వైవాహిక కాండనుబట్టి చూచినా ప్రౌఢావివాహాలు ఉండేవని చెప్పవచ్చును. అయితే ఇతర సంహితా బ్రాహ్మణాలు స్పష్టంగా వైవాహిక వయస్సునుగూర్చి చెప్పలేదు. వధువు స్వేచ్ఛగా వరుని ఎన్నుకోవచ్చును. అయితే దస్యువర్ణులతో ఆర్యులకు సంపర్కం సంభవించి నప్పటినుంచీ వరణంలో స్వేచ్ఛతగ్గి నియమాలు ఏర్పడినవి.

---

* R. veda I—117. 7; X—39, 3, 40. 5

కొన్నిసందర్భాలలో వరుడు కన్యాశుల్కం ఇచ్చి పెళ్ళిచేసికొనేవాడు. అంగవైకల్యంవల్ల వధువు వరుడికి కట్నం చెల్లించవలసివచ్చేది. * దశమమండలంలోని 85 సూక్తంవల్ల వివాహకాండ తెలుస్తున్నది. వరుడు వధూ గృహానికి తరలివెళ్ళేవాడు. ♦ వధువు సర్వాభరణ భూషితురాలై వివాహానికి సంసిద్ధురాలై వుండేది. గోవును వధించి గోమాంసంతో అతిథిసత్కారం చేసేవాడు. వరుడు వధువు పాణిని గ్రహించి అగ్నిప్రదక్షిణ చేయడంతో వివాహం ఆరంభం. ○ ఈ రెండుకర్మలూ వివాహావయవాలు. వరుడు వధువుకు భర్తయై ఆమెపాణిని గ్రహిస్తాడు. తరువాత అతడు వధువును స్వగృహానికి తీసికొనివెళ్ళడం ద్వారా (X 85–7, 8, 10) వధూవరుపరస్పర పారిశుధ్యం జరుగుతుంది. వైవాహికజీవితంలో సామరస్యం ఉండాలి. వధూవరులను పెద్దలు ఆశీర్వదిస్తారు; కుమార్తెలూ మనుమళ్ళనీ ఎత్తమని. నవోఢ గృహరాజ్యానికి రాణిఅవుతుంది. గృహిణి కావడంవల్ల భర్తతో సమంగా అగ్నికి ఆహుతివేస్తుంది, అగ్నికార్యం పూర్తిచేస్తుంది. భర్తకు వీలుకానప్పుడు గృహిణి శ్రౌతకర్మ వేదోక్తంగా నిర్వహిస్తుంది.

---

* ఋగ్వేదము VI 28–5 X 27–12

• Do X 17–1

○Do X 85. 36, 38

వివాహప్రయోజనం ఏమిటి? వివాహవ్యవస్థవల్ల మానవుడికి గృహయాజమాన్యం రావడం, దేవతాప్రీతికై యాగకర్మలు చేసే అధికారం కలగడం, సంతానోత్పత్తి ముఖ్యప్రయోజనాలు.*స్మృతికార నిబంధప్రకారం వివాహం, ధర్మసంపత్తికే ప్రజకూ రతికోసర్పడింది. పురుషసంతానాన్ని అపేక్షించే వారేకాని స్త్రీసంతానాన్నికాదు. కుమారుణ్ణి దత్తత చేసికొనే అధికారంఉండేది. అయితే దత్తతబుగ్వేద సంహితాకాలంనాడు అంగీకరించినా అత్యంతమూ ఇష్టము చూపలేదు ఆర్యులు.

మరిది అవివాహితుడై ఇంట్లోఉన్నప్పుడు 'నియోగ' పద్ధతిగా వితంతువు కుమారుణ్ణి కనవచ్చును. కుమారసంభవ మయ్యేదాకా ఈ నియోగవిధానానికి పరిమితి ఉన్నది. వితంతువుకు పునర్వివాహం విధించాలా లేక నియోగ పద్ధతేనా అన్నసమస్య వస్తుంది. దశమమండలంలో 40, 42 సూక్తాలను బట్టిచూస్తే వితంతు వివాహంకన్న నియోగాన్ని ఆర్యులంగీకరించారని చెప్పవలెను. ఈ పద్ధతి సర్వసామాన్యంగా సమాజంలో ఉండడంవల్ల వితంతు వివాహానికి అవసరం లేకపోయింది.

ఋగ్వేదము తత్కాలీన పరిస్థితులనుబట్టి బహుభార్యాత్వాన్ని అంగీకరిస్తున్నది. ♦ పురుషుడు ఒక స్త్రీనే వివాహం

---

* ఋగ్వే X 85. 36

♦ ఋగ్వే 1-62 11; 71-1; 104. 3; X 43. 1

చేసికోవడం సామాన్యంగా ఉండేది. బహుభార్యాత్వం అంగీకృతమయినా ఒక్కరాజన్యానికే వర్తిస్తుంది. బహు భర్తృత్వము మాత్రము వేదం అంగీకరించదు. అయితే 10 మండలంలో వైవాహిక సూక్తంలో ఏకభార్యాప్రసక్తి వచ్చినప్పుడు 'భర్తలు' అని బహువచనం ప్రయుక్తమైంది. ఇక్కడ బహుభర్తృత్వాన్ని వేదం అంగీకరించడంలేదు. అయితే పౌరాణికంగా వ్యాఖ్యానం చేసికోవలసి ఉంటుంది.

యువతీ యువకులమధ్య రహస్యప్రణయం ఆనాడు లేకపోలేదు. యత్కించిత్తు స్వేచ్ఛాచారం స్త్రీపురుషుల్లో ఉన్నప్పటికీ, సామాన్యంగా స్త్రీలలో నైతికోన్నతి నిలిచింది.

అవివాహితులయిన కన్యలసంరక్షణం తండ్రిది. వివాహితలైనప్పుడు వారికిభర్తలే అండ. స్త్రీలు కూపస్థనుండూ కాలు కాకుండా సమాజంలో జరిగే వేడుకల్లో, నాట్యాలలో, సంతర్పణాలలో పురుషులతో కలిసిమెలిసి వ్యవహరించేవారు.

విద్య హరిః ఓం అని ఉపనయనంతో విద్యారంభం. ఉపనయ మనే శబ్దానికి సంకేతార్థం గురుసాన్నిధ్యానికి అధ్యయ నార్థం శిష్యుణ్ణిచేర్చడం, అయితే ఉపనయనమనే ప్రథమోప దేశ సంస్కారం స్ఫుటంగా ఋగ్వేదసంహితలో కనపడదు. బ్రాహ్మణోపనిషత్కాలానికి ఉపనయనానికి విశేషప్రాము ఖ్యం వచ్చింది. ఉపనయన సంబంధమైన కర్మకలాపం యత్కించిత్ ఇండోఇరానీయులలోకూడా కనబడుతున్నది. మాండూకసూక్తంవల్ల విద్యావిషయం కొంత తెలుస్తుంది.

కప్పలు వర్షారంభంవల్ల సంతోషంగా బెకబెకమని చేసే శబ్దమేళ, గురువుదగ్గర వల్లించే శిష్యోపనసతో ఋగ్వేదకవి పోల్చినాడు. 7 మండలంలో 103 లో

'సంవత్సరం శశయానా, బ్రాహ్మణా వ్రత చారిణ:
వాచం, వర్జన్య, జిన్వితాం ప్రమండూకా, అవాదిషు:॥'

అనేఋక్కును చూడండి. గురువు బోధిస్తున్నప్పుడు వ్రాసుకోవడమనే పద్ధతిలేదు. శిష్యులలో ప్రతివిషయము కంఠస్థము కావలసినదే. విద్యార్థికి బ్రహ్మచారిఅనిపేరు. ఒక్కొక్కప్పుడు తండ్రి కుమారునికి విద్యాగురువు అయ్యేవాడు. గాయత్రీ మంత్రోపదేశంవల్ల, తదనుష్ఠానంవల్ల విద్యార్థికి బుద్ధిసూక్ష్మత పరిశుద్ధవర్తనంకలిగేవి. సవిత్రుపాసనవల్లధీపికాసంకలిగేది. గురూపదేశాన్ని ముఖతః బ్రహ్మచారి గ్రహించడమేనా లేక వ్రాసుకోడం అసలేలేదా అనేప్రశ్న బయలుదేరుతుంది. 'లిపి' అనేది ఆ కాలంలోలేదా ? డాక్టర్ బుహ్లర్ పండితుని మతప్రకారం భారతీయ వణిజులు పశ్చిమాసియాలోని ఉత్తర సెమిటిల్ లిపినుండి ఉద్భవించినలిపిని క్రీ. పూర్వం ఎనిమిదవశతాబ్దిలో నేర్చినారు. అత్యంతప్రాచీనమైన అశోకశాసనాల్లో బ్రాహ్మి లిపి భారతీయమైనదికాదనీ, మనం లిపిఎరుగమనీ దీని తాత్పర్యం. బుహ్లర్ వాదం అసంగతం. మొహెంజదరో ప్రత్నకాల్లో బయటపడిన చిత్రలిపినీ, బ్రాహ్మీలిపినీ పరిశీలిస్తే, బ్రాహ్మీలిపి మొహెంజదరోనాటి చిత్రలిపినుండి ఉద్భవించిందని స్పష్టమవుతున్నది. *

---

* ఆర్. బి. పాండేగారి Indian PaleOgraphy పుటలు 48-50 చూడు.

భారతీయులిపిని ఏదేశాలనుండి తెచ్చుకోలేదని నిర్ణయించిన మీదట, అది అత్యంత ప్రాచీనమైనదని మొహెంజదరో చిత్రలిపి బుజువు చేస్తున్నది. పాణిని అష్టాధ్యాయిలో లిపి, లిపికర, యవనానీ, గ్రంథ, స్ఫరిత శబ్దాలు ప్రయోగించడంవల్ల క్రీ. పూర్వం ఎనిమిదవ శతాబ్దిలో ఉన్నట్లు స్పష్టమవుతున్నది. 'లిపి' అనేశబ్దమే భారతీయులది కాదనీ, అది 'దిపి' అనేప్రాచీన పారసీకశబ్దానికి సంబంధించినదనీ చెప్పే బుహ్లర్ వాదం అసంగతం. లిపి సంస్కృతశబ్దభవమే.♦

వినోదాలు సోమరసము తీసేసందర్భంలో బ్రాహ్మణులు వికస్వర సుస్వరంలో వేదగానం చేసేవారు. సంగీతవాద్యాల్లో వీణా వాణ మృదంగాలు ఋగ్వేదములో ప్రసిద్ధి. స్త్రీపురుషులు నాట్యంచేసేవారు. నాటకీయ సన్నివేశం, ఉక్తిప్రత్యుక్తి భావోద్వేగాదులు సంవాదసూక్తాలలో కనబడడంచేత భారతీయ రూపకానికి ఋగ్వేదము మూలమవుతున్నది. వినోదాలలో రథక్రీడ చెప్పతగినది. అనేకచోట్ల ఋగ్వేదములో రథక్రీడకు సంబంధించిన ఉపమాన రూపకాలంకారములు కనబడుతున్నవి. పదవమండలంలో 34 సూక్తంలో జూదగాడి ప్రసక్తి గమనింపదగింది. జూదమంటే ఎంతసరదాగా ఉంటుందో ఎంత వినాశహేతువో జూదగాడిని చూస్తే జాలివేస్తుంది.

♦ శబ్ద. అమరకోశవ్యాఖ్య—లిపి లిఖిరుభేత్ర్యియమ్ - లిప్యతే. లిపి ఉపదేహే ఋక్కృష్యాదిభ్య ఇగుపధాత్కిత్. లిపిసౌత్రతేధాతుః ఇతిముకుటః

ఆహార పానీయాలు పాలు, వెన్న, నెయ్యి ముఖ్యమైన ఆహార పదార్థాలు. యవధాన్యం పిండిచేసి పాలలోనో వెన్నలోనో కలిపి రొట్టెలు చేసుకొనేవారు. శాకములు ఫలములు విరివిగా లభ్యమయ్యేవి. ఆర్యులు వృషభఅజమాంసం సామాన్యంగా తినేవారు. యాగసమయంలో మాంసాశనం చేసేవారు. అశ్వమేధ సందర్భంలో అశ్వమాంసం ఆరగించేవారు. గోవును 'అఘ్న్యా' అని అనడంవల్ల గోవధ సామాన్యంగా అంగీకరించరని స్పష్టం. సోమపానం యాగసమయంలో చేసేవారు. కవోష్ణగోదుగ్ధమును ఆప్యాయంగా తాగేవారు. సురాపానం కొందరికి అలవాటు.

ఓషధులు అశ్వినీ దేవతలు వ్యాధినిర్మూలన చేస్తారని ఆర్యుల విశ్వాసము. ఈ దేవతలు శస్త్రంలో సమర్థులు. ప్రత్యేకంగా ఓషధీసూక్తంలో వనౌషధులు రోగనిర్మూలనచేసే విషయం వస్తుంది. యుద్ధములో 'విశ్పాల' పాదము తెగినప్పుడు అయోమయపాదాన్ని తగిలించారట. ఇది ప్రాచీన శస్త్ర చికిత్సను తెలియచేస్తున్నది.

ఆర్థికస్థితి ఋగ్వేదకాలంలో ముఖ్యజీవనాధారం వ్యవసాయం. యవధాన్యం పండించేవారు. కృషికి గోమహిషములు అవసరం కనుక ఆర్యులసంపద పశువులనేచెప్పవలె. యాగం చేయించిన ఋత్విక్కు-కు గోదక్షిణనిచ్చేవారు. అనగా గోవు ధనమనే విషయం విశదమవుతున్నది. గోవుకు 'అఘ్న్యా' అనేశబ్దం ప్రయోగించడం చేత దాన్ని పవిత్రంగా చూచే

వారని, హింసకు అంగీకరించరనీ తెలుస్తుంది, ఇంతోఇరాన్నీయులకుకూడా గోవు పవిత్రమైనది. గోవులను అపహరించడంకద్దు. వాటి చెవుల మీద పచ్చలవంటి గుర్తులువేయడంవల్ల యజమాని తాలూకు గోవులను తెలుసుకోవచ్చును.

ఒకవస్తువునిచ్చి మరొకవస్తువు తీసుకోడం అనగా వినిమయం వ్యవహారంలో ఉండేది. గోవును నాణెముగా వినిమయం చేసేవారు. నిష్కమనే బంగారునాణెము చలామణీలో ఉండేది. ఆ నిష్కము గ్రైవేయకరూపంలో ఉండేది.* యుద్ధంలో ప్రాప్తమయిన శత్రుద్రవ్యం రాష్ట్రాదాయంలో ఒకభాగం. ఆద్రవ్యం గోవులూ గొఱ్ఱెలూ సామాన్యంగా.

రాజకీయ సంస్థలు ఋగ్వేదకాలంలో రాజరికం ఉండేది. రాజన్ శబ్దము తరుచుగా ఋక్సంహితలో కనబడుతున్నది. చిన్న చిన్న కూటాధిపతులను రాజులనేవారు. సుదాసుడనేవాణ్ణి ఓడించేనిమిత్తం పదిమంది కూటాధిపతులు ఏకమైనారు. ఒకొక్కప్పుడు రెండుకూటాలకూ ఒకడే అధిపతి ఉండేవాడు.

రాజ్యాలు వైశాల్యాన్నిబట్టి చిన్నవి. ఒకరాజ్యం ఒకమానవకూటమన్నమాట. సుదాస్ణ్ణి ఓడించేనిమిత్తం ఏర్పడిన రాజులకలయిక రాజకీయ సంయుక్తాపతిఘటన అవుతుందోకాదో చెప్పడానికి వీలులేదు. సమ్రాట్ అనే శబ్దం ఋగ్వేదంలో కనబడుతున్నది. అనగా చక్రవర్తిఅనీ

---

* ఋగ్వేదము V 19. 3

'విశ్వస్య భువనస్యరాజా' అనేభావాలు సంహితానంతర కాలానికి సంబంధించినవి. రాజు ప్రాచీన మానవకూటానికి కేవలం నాయకుడేకాక సమాజంలో మహోన్నతుడూ, ఇతరప్రజలకన్న విలక్షణుడనీ ఆనాటి వారిభావం.

ఏకరాజ్యం * అనే రాజరికం, వంశపారంపర్యంగా ఉన్నట్టు కనబడుతుంది. అయితే అవసరం వచ్చినప్పుడు (విశ:) ప్రజలు రాష్ట్రకూటానికి చెందినవారు రాజవంశీయుణ్ణి కాని రాజన్యులలో వాణ్ణికాని తగినరాజును ఎన్నుకొనేవారు. గెల్డనర్ , పండితమతంలో ప్రజలకు ఎన్నుకోగల సంపూర్ణాధికారంలేదనీ అది లాంఛనప్రాయమనీ విశదమవుతున్నది.

ఋగ్వేదకాలంలో పాలకసంస్థలయిన 'సభాసమితు'లు ప్రసిద్ధాలు. ప్రజల సమావేశమునులేదా సమావేశ మందిరమును 'సభ' అనేవారు. జూదగాళ్ళు పాచికలాడే తావు కూడా సభఅవుతుంది. జూదగాళ్ళను సభికులంటారు. బ్రాహ్మణులు ధనాఢ్యపోషకులు, ప్రభుత్వ్యవహారములు చర్చించేనిమిత్తం సమావిష్టులైనప్పుడు అనగా ప్రత్యేకంగా కొందరు విశిష్టులు కలిసి రాజ్యవ్యవహారాలు నిర్ణయించవలసినప్పుడు సభాశబ్దం ప్రయుక్తమవుతుంది. సాయణాచార్యుల మతాన్నిబట్టి బహుజననిర్ణయాన్ని సభాశబ్దం సూచిస్తుంది. సభనే 'నరిష్టా' అని ఆయన వ్యాఖ్యానం.

---

* ఋగ్వేదము I. 56. 2; IV 55. 6 X 136

† ఋగ్వే X 124. 8 ఋగ్వే X 173. 1—"విశస్త్వాసర్వావాంఛతు"

సమితి సమితి వైదికప్రజాసమితిగా ఋగ్వేదంలో కనబడు తున్నది. లడ్విగ్ మహాశయుని మతప్రకారం సమితిలో సామాన్యప్రజలేకాక బ్రాహ్మణరాజన్యులుకూడా ఉండేవారు. రాజకీయ వ్యవహార పరిష్కారంకోసం ఏర్పడినది సమితిగా గ్రహించవచ్చును. రాజు దానికి అధ్యక్షుడు. సమితికిగల అధికారములు మూడున్నవి. (1) రాజును ఎన్నుకోడం (2) అవసరం వచ్చినప్పుడు దేశబహిష్కృతుడయిన రాజును తిరిగి ఎన్నుకోడం ఉండేది. దీనినిబట్టి ఆలోచిస్తే సమితి రాజకీయాధికారవర్గంగా వ్యవహరిస్తుందని తెలుసుకోవచ్చును. (3) సమితి రాజ్యానికి సంబంధించిన మంత్రాలోచనలు చేసేది. ఋగ్వేదములోని 'సమానోమంత్రః సమితిః సమానీ, సమానం వ్రతం సహచిత్తమేషాం' అనే పంక్తుల వల్ల సమితిలక్ష్యాన్ని సాధించడానికి సామితేయులందరికి సమానమైన చిత్తము, ఏకాభిప్రాయం ఉండాలనేది స్పష్టమవు తున్నది. సభ్యులు ఏకనిర్ణయానికి రావాలంటే అందరూ సహనంతో వ్యవహరించకతప్పదు. రాజు యథేచ్ఛగా వ్యవహరించే వీలులేకుండా పురోహితుని గౌరవమూ అధికారమూ ఎక్కువగా ఉండేవి. యుద్ధసందర్భంలో శత్రు హానిలేకుండా పురోహితుడు ప్రార్థనలుచేసేవాడు. రాజు సమితికి తప్పనిసరిగా హాజరుకావాలి. అలా హాజరుకాకపోతే అతను ఋజుమార్గం తప్పినట్టు. అందుకే ఋగ్వేదం 'రాజాన సత్యాః సమితౌరియాన:' అంటుంది.

వలసలు ఏర్పాటు చేసికోవలసినప్పుడు ఆర్యులు తప్పని సరిగా ఆదివాసులయిన దాసదస్యులతో దీర్ఘపోరాటం చేయ వలసివచ్చింది. దస్యులు పరాజితులైనా వారిని ఆర్యులు తరిమివేసి నాశనం చేయలేదు. ఆర్యులు దస్యులతో వైవాహిక సంబంధాలు చేసుకొన్నారు. వర్ణాంతర వివాహాలవల్ల ఉత్పన్నమైన దాసులను ఋక్‌సంహితానంతర కాలంలో శూద్రులని పరిగణించి చాతుర్వర్ణ్యంలో ఆర్యులు చేర్చినారు. రాజధర్మాన్నిబట్టి ప్రజాసంరక్షణం అత్యంతా వశ్యకం. ప్రజారక్షణ చేస్తాడుకనుక అతనియెడల ప్రజలు విధేయులై 'బలి' అనేకానుక చెల్లించాలి. ఈ 'బలి' సంహితాకాలంలో కానుకేఅయినా ఆనంతరకాలంలో పన్నుగామారింది. బలిహృత్ అనే సమాసంవల్ల బలిని రాజుకు చెల్లించేవారని (ఋగ్వే VII 6. 5 10-173. 6) తెలుస్తున్నది. ప్రజలు పన్ను ఇష్టంగా ఇచ్చేవారో తప్పని సరిగా చెల్లించేవారోమాత్రం చెప్పలేము. శత్రుహానిలేకుండా ఒకమానవకూటాన్ని రాజు రక్షణచేస్తాడు. అందుచేత ప్రజలు ఇష్టంగానే కానుకలు ఆయనకు చెల్లించే వారన వచ్చును. రాజునకు భూమిమీద హక్కులేదు. అయినప్పటికీ దానధర్మాలు చేసేవాడని దానస్తుతులవల్ల తెలుస్తున్నది.

పాలనావిధానం ఋగ్వేదములోని 'పంచజనుల' నబడే వైది కార్యులు అనేక కూటాలుగా వేరుపడినారు. ఒక్కొక్క కూటం పాలనాసౌకర్యార్థం ఏర్పాటయినకూటం. ఈకూటంలో

సభ్యులను విశులని పిలుస్తారు. ఈకూటమే రాష్ట్రము. కొన్ని గ్రామాలుకలిస్తే ఒకకూటమవుతుంది. ప్రతిగ్రామము స్వయం సమృద్ధముగా ఉండేది. రాష్ట్రీయపాలనలో మొదటిమెట్టు గ్రామపాలనము. ప్రతిగ్రామరక్షణకూ కోటఉండేది.

గ్రామపాలనాధికారి గ్రామణి. అతడు గ్రామపాలనా వ్యవహారాలేకాక సైనికవ్యవహారాలూ గ్రామరక్షణమూ చూచేవాడు. సేనాని సేనాధిపతి. యుద్ధప్రసక్తి లేనప్పుడు గ్రామణికన్న ఎక్కువగా గ్రామబాధ్యతలు నిర్వహించేవాడు.

రాజుకు మంత్రాలోచన పురోహితుడిచ్చేవాడు. సైనికవ్యూహాది విషయాలపై సలహాఇచ్చేవాడు సేనాని. యాగాదివైదికకర్మ కలాపంనెరవేర్చే నిమిత్తం పురోహిత మండలిని యేర్పాటు చేసేవాడురాజు. రాష్ట్రాంతర వ్యవహారాల నిమిత్తం రాయబారులను ఏర్పాటుచేయడం జరిగేది. చారులు రహస్యంగా వృత్తాంతము రాజుకు తెలియ చేసేవారు.

ఆనంతర సంహితాకాలము

అధర్వణవేదము ఋగ్వేదము కేవలము శ్రౌతమంత్రపాఠము. అధర్వణము గృహ్యామంత్ర పాఠము. సోమరసము తీసేసమయాన, తత్కర్మకలాప సందర్భాన శ్రౌతమంత్రముల వినియోగం ఉంటుంది ఆధర్వణ మంత్రములకు సామాన్యుల గృహకర్మల సందర్భంలో వినియోగం ఉంటుంది. అధర్వణంలో

బ్రాహ్మణుడు సాంఘికంగా అధమస్థితిలోఉన్న వాళ్ళను ఉద్దేశించి ఆహ్వానిస్తాడు. బ్రాహ్మణునికి సాంఘికంగా అధికారాలు అవకాశాలూ అపరిమితంగా ఉండేవి.

జనపదాల్లో మూఢవిశ్వాసాలు ఎక్కువగా ఉన్న కాలంలో పురోహితుల మంత్రతంత్రాలు, ప్రయోగాలూ ఎక్కువైనవి. పాలకుడు పురోహితుని చేతుల్లో కీలుబొమ్మగా మారి, కొంచెము దగ్గు జ్వరంగాఉన్న, పీడకలలువచ్చినా మంత్రజపాలు చేయించుకొనేవాడు. * ప్రభువుకు మంత్ర ప్రయోగాది విషయాల్లోనే కాక, రాజకార్యాల్లోకూడా సలహాయిచ్చేవాడు పురోహితుడు. రకరకాల మంత్రప్రయోగాలు అథర్వణంలో ఉన్నవి. అభిచారిక ప్రయోగాలవల్ల శత్రుమరణమో, ఉచ్చాటనమో, స్తంభనమో, మోహనమో ప్రయోజనం. మానవుడు ఎంతనీచుడై పతితుడై భ్రష్టుడైపోతేగాని ఆభిచారిక ప్రయోగాలకు పూనుకోడు. ఈనీచప్రయోగాలు బ్రాహ్మణులేకాక అన్యవర్ణుల ఇరవయ్యో శతాబ్దంలో చేయడం చూస్తున్నాము. ఈ మంత్రతంత్రాల వల్ల మానవనాశనానికి ఉద్యమించే కిరాతకులను కొరత వేయడం ధర్మం. తాయెత్తులుకట్టుకొనే అలవాటు అథర్వణంలో కనబడుతుంది. ఈతాయెత్తులవల్ల భూతపిశాచాదులు దగ్గిరికి రావనినమ్మకము. యువతిని వశీకరణం చేసుకొనే మంత్రార్థం చూడండి. (అథర్వ 2-30) "వాయువు గడ్డిని

---

* అథర్వణవేదము 6-105; 4-5; 6-45

కదల్చినట్లు నీ మనస్సును చలింపచేస్తాను. అప్పుడు విడిచి పెట్టకుండా నన్నువాంఛిస్తావు. మనసులో ఉన్నది పైకిరానీ. పైనఉన్నది లోపలే ఉండనీ. ఓ మూలికా ! అందరి యువతుల మనస్సులనూ హరించు "

గోవును హరించినవాణ్ణి హతమార్చడానికి చేసే ప్రయోగమంత్రార్థం చూడండి.- * (అధర్వ 12_5)

"విప్రుని గోవును హరించి పీడించే క్షత్రియుని ప్రతాపమూ, అదృష్టమూ, తేజమూ తొలగిపోవాలి. శక్తిసామర్థ్యాలు, వాక్, ధీశక్తి, యశస్సు, భక్తిప్రపత్తి, రాజరికం, గౌరవం, ధనం అన్నీ క్షత్రియునికి లేకుండా పోవాలి. ఎందుకనగా విప్రుణ్ణి హింసపెట్టి అతని గోవును దొంగిలించాడు కనుక. ఓ గోదేవతా ! విప్రుణ్ణి హింసించిన క్రూరుణ్ణి, తుచ్ఛుణ్ణి, దైవభీతిలేనిపాపిని, నూనుమఃళ్ళుగల వజ్రాయుధంతో నిశిత మైన అంచులతో క్షత్రియుని బుజాలూ శిరస్సూ నరికివెయ్యి. వాడి తలవెంట్రుకలు పెరికివెయ్యి, వాడిచర్మం వొలిచివెయ్యి, నరాలుచీల్చివెయ్యి. వాడిశరీరంలో మాంసం ముక్కలు ముక్కలుగా నరుకు. వాడిఎముకలను పిండిచెయ్యి. కీళ్ళూ సంధులనూ విడగొట్టు. అగ్నిహోత్రుడు వాణ్ణి ఈపృథివినుండి పారదోలనీ, అగ్నివాయువులు కలిసి వాణ్ణి కాల్చివేయనీ, ఆకాశంలో సూర్యుడు వాణ్ణి తరిమి కాల్చిపారేయనీ "

ఉన్నతమైన దేశభక్తీ మాతృభక్తీ 12 మండలంలో భూమిసూక్తంలో గోచరిస్తున్నది.

---

* Bloom field"s edition, Atharva veda,

కుంతాపసూక్తంలో బహుశః కురువంశీయుడైన పరీక్షితునికాలంలో ప్రజలు సుఖంగా ఉన్నట్టు తెలుస్తుంది. సాహితీదృష్టితో చూస్తే కుంతాపసూక్తంలో సప్తమం జోలపాటవలె ఉంటుంది.

అథర్వణాన్నిబట్టి ఆలోచిస్తే బ్రాహ్మణాధిపత్యం నియంతృత్వ సదృశంగా ఉన్నదని తెలుస్తున్నది. ప్రజా సామాన్యంలో నైతికపతనం ఎక్కువైంది. క్షుద్రమంత్ర ప్రయోగాలమీద విశ్వాసం మితిమీరి పోయింది. ఇది ఆథర్వణ సామాజికస్థితి.

యజుర్వేదము సాహితీదృష్టితో చూడదగినప్పుడు వాజసనేయ సంహితాభాగం ఒక్కటేచాలు. వాజసనేయంలో శతరుద్రీయంలో (16 అధ్యాయం) భీషణమూర్తి అయిన రుద్రుణ్ణి ఆహ్వానిస్తాడు వైదికకవి; 31 అధ్యాయంలో పురుషమేధంలోని భాష, జాతిభేదాలు ఆనాటి సాంఘిక కల్లోలాన్ని తెలియజేస్తున్నవని వీబరు పండితునిమతం.

బ్రాహ్మణములు సాహిత్యము

వేదసంహితా భాగము తరువాత బ్రాహ్మణము. వేదముల తుదిభాగము ఉపనిషత్తులు.

బ్రాహ్మణముల ప్రయోజనం ఏమిటి? శ్రుతికీ కర్మకాండకూగల సంబంధాన్ని కర్మకలాపాల సాంకేతిక గూఢార్థమునూ బ్రాహ్మణాలు వివరిస్తవి. బ్రాహ్మణాలన్నీ

సాహిత్యశైలిలో ఉల్లేఖింపబడినవికావు. కర్మకాండను వ్యాఖ్యానంచేస్తూ ఆర్యఋషులు తమ అభిమతాన్ని శబ్ద శాస్త్ర, శబ్దోత్పత్తి పరిశీలనద్వారా, దార్శనికంగా నిలవ బెట్టుకోడం బ్రాహ్మణాలలో కనబడుతుంది. కర్మతుల వాదోపవాదాలు చిత్రవిచిత్రంగా కొన్నితావుల్లో నిస్సారంగా ఉంటవి. తార్కాణం చూడండి :- శ్రౌతసూత్రప్రకారం పాత్రను పూర్వంనుంచి పశ్చిమదిశకు అంగుళం జరపవలెనని ఉన్నది. దీనివివాద విచిత్రవివరణం. "పాత్రను పూర్వదిశ నుంచి పశ్చిమానికి జరపడానికి కారణం సూర్యుడు తూర్పు నుంచి పడమటకు కదలుతాడు కనుక. ఎవడైతే పాత్రను తూర్పునుంచి పడమటివైపుకు జరుపుతాడో, సూర్యునిలాగ అతడు స్వర్గమంతటినీ జయిస్తాడు. అంగుళమేపాత్ర ఎందుకు జరపాలి ? అంగుళం పాదంలో ద్వాదశాంశం కనక. పాదము పద్యపాదము. జగతీఛందోపాదంలో పన్నెండుమాత్రలుంటవి. అంగుళంపాత్రను జరిపినాడంటే, జగతీఛందస్సులో ద్వాద శాంశం అనగాఛందస్సు నడుపుతాడన్నమాట." ఇలాగ బ్రాహ్మణాలు వివరణచేస్తవి.

వేదసంహితలు కవితాత్మాయంగా కమనీయంగా ఉంటవి. బ్రాహ్మణాలు గద్యరూపంలో నిస్సారం. వేదములు ఋషుల దివ్యానుభూతివల్ల ప్రసృతమైతే బ్రాహ్మణాలు కృతకమై నేలనిడిచిన సాముగరిడీలవలెఉంటవి.

బ్రాహ్మణాలు విలసిల్లిన తరుణము భారతీయ సామాజిక దృష్ట్యాముఖ్యమైనది. దీనివివరణం తరువాత అధ్యాయంలో చూడండి.

ఆరణ్యకాలు బ్రాహ్మణాల అంత్యనిర్ణయంలేదా పిండితార్థమే ఆరణ్యకాలు. ఈ పిండితార్థం గోప్యంగా శిష్యులకుగురువు ఉపదేశించాలి. ఆయన అరణ్యాలలో శిష్యకోటికి ఉపదేశించే వాడు. ఉపదేశంపొందని వాళ్ళకురహస్యార్థం శ్రవణంచేసే అధికారంలేదు. అందుచేత బ్రాహ్మణాల తుదిభాగాలకు ఆరణ్యకాలని పేరువచ్చింది. ఆరణ్యకోపనిషత్తులు వేదాంత ములు కాలదృష్ట్యా విచారిస్తే వేదసంహితా భాగాల తరువాత వచ్చినవి ఆరణ్యకోపనిషత్తులు. అందుచేతకూడా వేదాంతము లనవచ్చును. లేదా శుశ్రూషానంతరం శ్రుతిలోని దార్శనిక రహస్యాన్ని తాత్త్విక గాంభీర్యాన్ని గురుముఖతః శిష్యుడు గ్రహించేవాడుకనుక ఆరణ్యకోపనిషత్తులు వేదాన్తములు. లేదా దైనందిన వేదాధ్యయనానంతరం మననం చేయవలసిన తుదిభాగంకనుక వేదాన్తము కావచ్చును. ఇలా వేదాన్తానికి భిన్నమైన అర్థాలు విజ్ఞులు తెలియచేసినారు.

మతము తత్త్వము

అథర్వవేదము ఋగ్వేద కాలానంతరం మతతత్త్వ పరిణామం పరిశీలించడానికి అథర్వవేదాన్ని మొదటతీసుకొందాము. ఋగ్యజుస్సామవేదాల్లో లేని ప్రాచీనమత భావాలు విశ్వాసాలు

అధర్వంలో పొందుపరుపబడినవి కనుక అధర్వణంలో మత తత్వాన్ని గురించి సవిూక్ష చేస్తాను.

అధర్వణవేదానికి అసలుపేరు 'అధర్వాంగిరసము' అనగా అధర్వము అంగిరసమనే రెండురకాల మంత్రసము దాయము. అధర్వంలో ముఖ్యమైనదన్నమాట. అధర్వ మంత్రాలు శ్రేయోదాయకాలు, ఆంగిరసమంత్రాలు అభి చారికమునకు సంబంధించినవి. సంహితల్లోవలె అధర్వణాలో కూడా ఇంద్రాగ్నివరుణాది స్తోత్రములున్నవి. అయితే ఇక్కడ దేవతారూపం ప్రస్ఫుటంగా వర్ణితంకాలేదు. భూతపిశాచాలను నాశనంచేసే నిమిత్తం మంత్రవేత్త దేవతాహ్వానం చేస్తాడు. ఉపనీషత్కాలికమయిన దార్శనిక పరిభాషలు అధర్వణంలో అక్కడక్కడా కనబడతవి.. ఔపనిషదికమైన సర్వాస్తికభావన అధర్వణంలో ప్రత్యక్షమవుతున్నది. దార్శనికపరిభాషఅయిన 'అసత్' అనేశబ్దము భూతప్రేత రాక్షస శత్రూచ్చాటన కోసం ప్రయుక్తమవుతున్నది.

మంత్ర ప్రయోగమూ భూతోచ్చాటనమూ పిశా చాదులను తృప్తిపరచడమూ అధర్వణంలో ముఖ్యంగా గోచరిస్తవి. ఈ ప్రయోగాదులు రెడ్ ఇండియనులలో తారార్తారు నీగ్రోమంగోలు మలయాజాతుల్లోనూ ఉన్నవి.

క్షుద్రప్రయోగాలేకాక ఉదాత్తదార్శనిక భావాలు అధర్వణంలో లేకపోలేదు. పరతత్వచింతన అధర్వణకాలంలో ప్రకృష్టంకాదు. దానికికారణం నిత్యనైమిత్తికాలలో, వ్యావ

హారిక ప్రయోజనాలలో నిమగ్నులై నవాళ్ళకు పరతత్త్వాంచ ప్రగాఢంగా ఎలాఉంటుంది? ఋగ్వేదంలో సృజనాత్మక భావనకూ ఉపనిషత్తులలో పరతత్త్వచింతకూ అంతరంలోగల తాత్త్వికపరిణామదశగా అథర్వణాన్ని భావించకూడదు. అయితే ఋగ్వేదీయ రుద్రునికీ, శ్వేతాశ్వతరోపనిషత్తులోని శైవానికీ మధ్యగల పరిణామం అథర్వణంలో కనవస్తుంది. కాలం సమస్త అస్తిత్వానికీ ప్రథమకారణంగా ఆర్యులు తలచినారు.

మతభావాలతో సమన్వితమైన ఉన్నతికవిత్వం ద్వాదశ మండలంలో భూమిసూక్తంలో గోచరిస్తున్నది.

ఆర్యఅనార్య సంపర్కం కలిగినతరువాత అనగా దాసదస్యుల మూఢమతవిశ్వాసాలు ఆర్యులు అథర్వంలో చేర్చకతప్పలేదు. ఆదిమానవుల మాంత్ర్యంవల్ల, విశ్వాసంవల్ల ఉదాత్త వైదికమతౌన్నత్యం తగ్గిపోయింది. మతంపేరుతో చిత్రపుగారడీలు, శాపాలు ప్రబలినవి. ఆత్మజ్ఞానం చాలావరకు లేదనవచ్చును.

సామవేద యజుర్వేద సంహితా బ్రాహ్మణాలు

యజు స్సామవేద ప్రపంచంలో మనము ప్రవేశిస్తే అక్కడ యాగహోమ సురభిళ వాతావరణం అనుభవించగలం. యాగమే సమస్తానికీ మిన్నగా ఎన్నబడినకాలమది. ఆనాటి మతతత్త్వాలు అవగాహన కావాలంటే యాగవిధానము తెలిసికోవలెను.

పేదవాడయినా భాగ్యశాలిఅయినా స్వగృహంలో గార్హస్థ్యమైన కర్మకలాపం నియమప్రకార ంజరుపుకోగలడు. ఈ కర్మకాండ సరళమై మహాయాగకాండకు ఆరంభదశగా అవుతూంది. స్వగృహంలో వేదోక్తంగా ఏకాగ్నికార్యం ఆచరిస్తాడు. పైనందినయజ్ఞం, నియమిత కాలాల్లో ఆచరించేవీ కూడా ఉన్నవి. అమావాస్య పూర్ణిమాదివసాల్లో ఆచరించే యజ్ఞాలున్నవి. ఇవిగాక దర్శపూర్ణమాసలు. గృహంలో నిరతాగ్నిహోత్రం పావిత్ర్యసూచకమై కుటుంబంలో జననం మొదలు మరణపర్యంతం జరిగే శుభాశుభ కర్మకలాపాలకు సాక్ష్యంగా ఉంటుంది. గేస్తుస్వయంగా అగ్నికార్యం ఆచరిస్తాడు కనుక అతడే వశిష్ఠులేదా హోతగాచెప్పవచ్చును. తనకు సాహాయ్యం కానలసినప్పుడు 'బ్రహ్మ'ను పిలుస్తాడు.

ఋగ్వేదకాలంలో కూడా సోమాది క్రతువులతోపాటు గార్హస్థ్య కర్మకలాపాలుకూడా వ్యవహారంలో ఉండేవి. అయితే ఆ గార్హస్థ్య కర్మకాండకు సౌష్ఠవ విధానం నిమిత్తం యజుస్సామాలు సంతరింపబడినవి. సరళమైన యాగకర్మ బ్రాహ్మణాలకాలంలో విరళమై కర్మకలాపజటిలమై పెరిగింది. యజమానుడు యాగం స్వయంగా చేసికోలేక పురోహితులను ఏర్పాటుచేసేవాడు. భూదక్షిణ లిచ్చేవాడు. ఈ కర్మకాండకు 'శ్రౌత' మనే పరిభాషవచ్చింది. అనగాశ్రుతులపై ఆధారపడి చేయబడేకర్మకనుక శ్రౌతమైంది. శ్రౌతవాఙ్మయమనగా సంహితా బ్రాహ్మణాలన్నమాట. గృహకర్మకాండను

గృహ్యాసూత్రాలు విధిస్తవి; వివరిస్తవి. ఇవిస్మృతిపై ఆధార పడినవి. కనుక వీటికి స్మార్తమనిపేరు. స్మార్తానికి వృద్ధాచారం ప్రమాణంగా తీసుకొంటారు.

చేయించే కర్మకాండనుబట్టి పురోహితులకు వేరేవేరే పేర్లు వచ్చినవి.

1-హోత్రి వైదిక దేవతలను స్తుతిచేసి, యాగానికి రమ్మని ఆహ్వానిస్తాడు. అతడు సోమయజ్ఞానికి సంబంధించిన కర్మకలాపానికి కావలసిన ఋక్కులను ఋగ్వేదంనుండితీసి సంపాదించి శాస్త్రనిర్మాత అవుతాడు. అంతటితోనేకాక స్వయంగా వేదగానంచేస్తాడు.

2-ఉద్గాత సామగానంచేసే పురోహితుడితడు. యాగారంభంలో సోమయజ్ఞకాలంలో వివిధ దశలలో సామగానంచేస్తాడు.

3-అధ్వర్యుడు ఛందోబద్ధమైన స్తుతులను, యజ్ఞసంబంధమైన గద్యమయమైన యజుస్సునూ అధ్యయనంచేస్తాడు.

4-బ్రహ్మ అనగా అగ్రపురోహితుడు. యాగవిధానంలో ప్రత్యవాయంలేకుండా కనిపెట్టిచూస్తాడు. అతడు చతుర్వేదాలలో ఆపాదపారగుడై ఉండాలి.

సంహితా బ్రాహ్మణాలలో మతం బాహిరంగా కర్మ జటిలమై కనబడుతుంది. అంతర్ముఖత్వంకన్న బాహ్యాచారం ప్రధానం. అయితే ఈ కర్మలన్నింటికీ అంతరార్థం ఉంటుంది. యజ్ఞవేదికా నిర్మాణంవల్ల విశ్వముయొక్క, పునర్నిర్మాణం ప్రజాపతిరూపంలో వ్యక్తమవుతున్నది. యాగహోమార్థం

కల్పితమయ్యే వేదికలో విశ్వాముయొక్క ఏకత్వస్థితులు ద్యోతమానమవుతవి.

ఋగ్వేద కాలంలోకూడా యజ్ఞకర్మాచరణం ప్రధానం గాని అంతర్ముఖత్వంకాదు. అపస్వరంలేకుండా వేదాధ్యయనం చేస్తేచాలు, కర్మలోపంలోనట్లే. , యాగమే సమస్తానికీ మిన్న కావడంవల్ల దేవతలుకూడా యజమానికి లొంగిపోవాలి. ఆహ్వానించినప్పుడల్లా దేవతలు హాజరుకావాలి. ఋగ్వేదకాలీన దేవతలలో కొందరు యజుస్సామముల నాటికి నామమాత్రు లైనారు. బ్రాహ్మణాలలో 'ప్రజాపతి' కి ప్రాముఖ్యం వచ్చింది. ప్రజాపతికన్న రుద్రుడు ప్రజాసీకానికి ఆరాధ్యు డైనాడు. రుద్రుడే శివుడు, మహాదేవుడునూ. ఇతడు ఆది వాసులకూ ఆరాధ్యుడే. రుద్రునితరువాత అన్నియాగాలకూ విష్ణువు ముఖ్యుడు. గంధర్వాప్సరసలకు నాగులకు దైవత్వం ఆరోపింపబడింది. ఏకాస్తికవాదం ప్రచారమవుతూ వచ్చింది. వేదం అపౌరుషేయంగా విశ్వాస బుద్ధిగలవాళ్ళు తలచినారు. వేదమే పరమప్రమాణంగా భావించినారు.

బ్రాహ్మణాలలో సృష్టిగాథలు అనేకమున్నవి. ఈ గాథల్లో దార్శనికభావం అనుస్యూతంగా ఉంటుంది. ప్రజాపతి జగత్కారణ రూపుడుగా ఒకసారి మరికొన్ని బ్రాహ్మణాలలో కార్యరూపుడుగానూ వర్ణితమైనాడు. సృష్టి యొక్క ఆరంభము ప్రధానజలమో, బ్రహ్మమో, అసత్తుగాని అవుతుంది. సంకల్పమే సర్వసృష్టికీ బీజము.

బ్రాహ్మణాలలో నీతిబోధ స్పష్టంగాఉంది. ధర్మాచరణం ప్రతివ్యక్తికీ విధింపబడింది. మానవుడు జన్మతః ఋణత్రయంతో పుట్టినాడు. దైవ, ఋషి పితృఋణములు ప్రతి మానవుడు తీర్చుకోవాలి. సర్వమేధమనే యాగకర్మలో ముక్తికోసం మానవుడు, సమస్తస్వార్థాన్ని పూర్ణాహుతి చేస్తాడు. బహిరంతర కర్మానుష్ఠానం జీవితానికి శ్రేయోదాయకం.

స్వర్గధామాన్ని సంహితాబ్రాహ్మణాలు విపులంగా వర్ణించినవి. భూలోకవాసులైన బంధువులిచ్చే తర్పణాలవల్ల చనిపోయినవాళ్ళు పుష్టిచెందుతారని అథర్వణకాలంలో ప్రజలవిశ్వాసం. నరకవర్ణన భయంకరముగా శతపథ జైమినీయ కౌషీతకి బ్రాహ్మణాలతో ఉన్నది;

ఆరణ్యకాలు ఆరణ్యకోపనిషత్తుల్లో కర్మానుష్ఠానం గౌణమై జ్ఞానప్రాప్తికి సాధనమవుతుంది. జ్ఞానం ప్రాప్యమవుతుంది. పరతత్వప్రాప్తికి కావలసిన ఉపాసనలు ఆరణ్యకాలో ఉన్నవి.

సాంఘిక స్థితిగతులు

గృహజీవనం కుటుంబం అవిభక్తమై ఉండేది. గృహాధికారం యావత్తూ తండ్రిదే. పుత్రులులేనప్పుడు దత్తతచేసికొనే సావకాశం ఉండేది. తండ్రిలేనప్పుడు గృహయాజమాన్యం అగ్రసోదరుడూ అతనిభార్య నిర్వహించేవారు.

వర్ణవ్యవస్థ సంకుచితమైంది. వర్ణాలలో అనేకమైన వ్యత్యాసాలు బయలుదేరినవి. కులధర్మం పరంపరాగతమైంది. తండ్రి

రథకారుడయితే కుమారుడూ రథనిర్మాణమే సామాన్యంగా అవలంబించేవాడు.

వివాహంలో కొన్ని నియమాలు ఏర్పడినవి. వరుడు సమానవర్ణంలో భిన్నగోత్రానికి చెందినకన్యనే వివాహం చేసికోవలెను. అగ్రవర్ణుడు అధమవర్ణానికి చెందినవారిని పెళ్ళి చేసికోవచ్చును. అంతేకాని శూద్రుడు ఆర్యస్త్రీని పెళ్ళి చేసికోరాదు. బ్రాహ్మణుడు క్షత్రియ వైశ్యకన్యల్ని పెళ్లాడవచ్చును. అనులోమవివాహం అంగీకార యోగ్యమయిందే కాని విలోమవివాహం కాలేదు.

వైశ్యులు తమవృత్తిపల్ల శూద్రులకు సన్నిహితులైనారు. రెండువర్ణాలకూ సంబంధం ఏర్పడగా వర్ణసాంకర్యం కలిగింది. అందుచేత ఆర్యవైశ్యులని శూద్రులనుండి వేరుగా చెప్పవలసి వచ్చింది. ఈ విషయం తైత్తిరీయ, కాఠక వాజసనేయ అథర్వసంహితలలో కనబడుతున్నది.

వర్ణవ్యత్యాసంవల్ల శూద్రునికి అధోగతి ఏర్పడింది. ఐతరేయ బ్రాహ్మణంలో అగ్రవర్ణాల ఆధిపత్యం స్పష్టంగా ఉంది. శూద్రుని 'యథాకామవధ్యుడ'ని అనడంవల్ల, సాంఘికంగా అతనిని హీనస్థితిలో ఉంచినట్లు తెలుస్తున్నది; అతనికి ఆస్తిహక్కులేవు, రాజన్యునికి ఉన్నట్లు. గ్రంథాల్లో తీవ్రమైన అభిమతాలు కనబడినా, ఎంతవరకు అవి క్రియారూపంలో ఉండేవోగట్టిగా చెప్పలేము.

విశులనబడే వైశ్యులు వ్యవసాయ వాణిజ్యపరిశ్రమలలో నిమగ్నులై రాజుకు 'బలి' అనేపన్ను చెల్లించేవారు. వైశ్యులస్థితికూడా సంఘంలో హీనంగానే ఉండేది.

క్షత్రియులకూ సామంతులకూ దేశరక్షణం విధ్యుక్త ధర్మం. యుద్ధకాలంలో ముఖ్యంగా వైశ్యులవల్ల రివిన్యూ, వస్తురూపంలో తీసుకొనేది ప్రభుత్వం. గ్రామణిగా క్షత్రియుడు నియోగింపబడేవాడు. ఆ ఉద్యోగం క్రమంగా వంశపారంపర్యమైనది.

బ్రాహ్మణుడు వర్ణాలన్నింటిలో అగ్రేసరుడు. రాజు కన్న అతడు ఘనుడని వాజసనేయ సంహితావచనం. (XX 1-21) శతపథ బ్రాహ్మణాన్నిబట్టి బ్రాహ్మణుడు క్షత్రియప్రభువుకు అధీనుడు. అయితే క్షత్రియునికి శక్తి సామర్థ్యాలు బ్రాహ్మణునివల్ల వచ్చినవని శతపథం చెబుతున్నది. (4-1. 4. 6) బ్రాహ్మణుడు సమాజంలో మేధాశీల సంపదలవల్ల అత్యున్నతస్థానంలో ఉండేవాడు.

వర్ణవ్యవస్థవల్ల వచ్చినపరిణామం అంటరానితనం. ఈ అస్పృశ్యత ఇంకా ఈ కాలానికి ఆరంభంకాలేదు.

వివాహం-స్త్రీకిగలస్థానం రజస్వలానంతర వివాహాలు సర్వసామాన్యంగా జరిగేవి. సగోత్ర వివాహాలను స్పష్టంగా నిషేధించకపోయినా, భిన్నగోత్ర వివాహాలు తరుచుగా జరిగేవి. శతపథ వచనాన్నిబట్టి తండ్రివైపుకానీ తల్లివైపుకానీ మూడునాలుగు

తరాలయినా కనీసం దాటితేనే వివాహం అంగీకారయోగ్యం అవుతుంది. వితంతు వివాహాన్ని * ఆర్యులు అంగీకరించారు.

బహుభార్యాత్వం వ్యవహారంలో ఉండేది. మనువుకు పదిమంది భార్యలుండినట్లు మైత్రాయణీయ వచనం. రాజైన వాడిహోదాకు కనీసం నలుగురు భార్యలుండాలి. భార్య లిద్దరున్నప్పుడు, పెద్దభార్య భర్తపక్కనే కూర్చొని మత సాంఘిక కర్మకలాపాలు నిర్వహించేది. అయితే యాజ్ఞవల్క్యుని భార్యలు సమానంగాహాక్కులు అనుభవించే వారి వలె కనపడుతున్నారు.

ఆర్య శూద్ర సంపర్కంవల్ల సంభవించిన సంకర సంతాన ప్రస్తి వాజసనేయ సంహితలో కనబడుతున్నది. కన్యలు రహస్య ప్రణయాలవల్ల సంతానవతులయ్యేవారు. సర్వసామాన్యంగా స్త్రీలలో నైతికపతనం చాలాతిక్కువ. విశృంఖలంగా స్త్రీపురుషులు వ్యవహరించడం ఏసమాజములో నైనా కాస్తోకూస్తో ఉండకుండా ఉండదు.

వరకట్నాల నిషేధం ఉండేది. అయినా వరశుల్కాలివ్వడం ఉండేది. ఆనంతరస్మృతుల్లో కనబడే వివాహభేదాలు బ్రాహ్మణార్యక కాలంలో ఏర్పడలేదు. నవోఢ గృహాలక్ష్మి కావడం, క్రమంగా ప్రియుని మన్ననకు పాత్రురాలు కావడం గృహిణీపదం కవితానుయయంగా ఋగ్వేదకవులు వర్ణించినారు. బ్రాహ్మణాలలో పత్నీశబ్దం భార్యకుపయోగిం

---

* అధర్వణవేదం (Bloom field)—శి మం.

చడంచేత, మతసాంఘిక విషయాలలో భర్తతో సమానత్వము పొందేదని గ్రహించవచ్చును. ఋగ్వేదకాలంలో స్త్రీకిగల సాంఘికోన్నతి బ్రాహ్మణాలకాలంలో తగ్గిపోయిందని * కాఠకసంహితవల్ల చెప్పవచ్చును.

శతపథ బ్రాహ్మణాన్నిబట్టి భార్యఅర్ధాంగి. దీనివల్ల భార్య ఎంతఆదరం, సమానప్రతిపత్తి పొందేదో ఊహించవచ్చును. ఆర్థికంగా రాజకీయంగా మాత్రం స్త్రీకి పురుషునితో సమాన ప్రతిపత్తిలేదు.

విద్య యాగము మహాసంస్థగా కర్మకలాప జటిలమై విపులమై తద్గ్రంథబాహుళ్యం అమితంకాగా అపారమైన వైదిక వాఙ్మయాన్ని భద్రము చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. వేద విద్యయే విద్యగా గణనీయమైంది. గురువు పాఠంచెబుతున్నప్పుడు శిష్యుడికి వ్రాసుకొనే అలవాటులేదు. వేద్యవిద్య యావత్తూ ముఖస్థముకావలసిందే. అదే విద్యాపారమ్యంగా తలచేవారు. ఋగ్వేదములో మాండూకసూక్తంవల్ల విద్యా పద్ధతి కొంతవరకు తెలుస్తున్నది. లేఖనం వైదికార్యులకు పరిపాటి అయినప్పటికీ విద్యావిధానంలో మాత్రంలేదు.

అథర్వణవేదం విద్యార్థిని బ్రహ్మచారిగా పేర్కొన్నది. బ్రహ్మచారి అనగా వేదవిద్యార్థి, ఉపయం అగ్నికార్యం నిమిత్తం సమిధలు ఏరితీసుకొని గురుసాన్నిధ్యానికి వస్తాడు శిష్యుడు. ఉపనయనకాలంలో గురువు శిష్యుడికి ప్రపథము

---

* అధ్యాయం 22 పుట 420

జ్ఞానోపదేశం చేస్తాడు. యజుర్వేద సంహితనుబట్టి గురు కులంలో దినదినం స్వాధ్యాయం జరుగుతూ ఉండేది. బ్రాహ్మణోత్తముడు విద్యార్థితకుగాను సంస్కారంకోసం శ్రౌతక్రియలాచరించేవాడు. క్షత్రియులు వేదవిద్యానిపుణులై చాలామంది ఉండేవారు. క్షత్రియప్రభువైన జనకరాజు వేదవిజ్ఞానసంపన్నుడనీ, ఆధ్యాత్మికానుభవంకలవాడనీ బృహదారణ్యకోపనిషత్తువల్ల గ్రహించవచ్చును. క్షత్రియులు వైశ్యులూ ఉపనయనం చేసుకొనేవారని ఊహచేయవచ్చును. శతపథం ఉపనయనమనే ప్రథమోపదేశ సంస్కారాన్ని విపులంగా వర్ణించింది. గృహ్యసూత్రాల్లోకూడా ఇదే ఉల్లేఖితమైంది.

తైత్తిరీయ, మైత్రాయణీయ సంహితా బ్రాహ్మణాల వల్ల స్త్రీలు లలితకళలు అభ్యసించేవారనీ, సామాజిక జీవితంలో ప్రముఖంగా ఉండేవారనీ తెలుస్తుంది.

విద్యావిధానంలో పఠనీయ విషయాలు గణితం, వ్యాకరణము, ఛందస్సు ముఖ్యములు. భాషాభ్యసనం అన్నింటికన్న ఆవశ్యకము. ప్రభుత్వం విద్యాసంస్థలను నిర్వహించలేదు. బ్రాహ్మణ గురువులు శిష్యులకు అన్నవస్త్రాలిచ్చి స్వగృహాల్లో విద్యాదానం చేసేవారు. శిష్యవర్గంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మాత్రమే ఉండేవారు. విద్యాపరిసమాప్తి కాగానే శిష్యుడు గురుదక్షిణ సమర్పించేవాడు. కేవలం చదువుసంధ్యలేకాక శిష్యుల శీలవర్తనాలు గురువులు సరిదిద్ది

తండ్రులెన్నుమించిన తండ్రులై వాత్సల్యంచూపి ఆదర్శ మూర్తులను చేయగలిగినారు. గురుశిష్య సంబంధము రాగ బంధమై యావజ్జీవం స్మరణీయమయ్యేది.

వేదవిద్యాసంస్థలు దేశమంతటా ఉండేవి. వాటిని చరణములనేవారు, వాజసనేయ సంహితవల్ల పదిహేను వేద విద్యాకేంద్రము లుండేవి, పరిషత్తులలో సాహితీదార్శనిక విషయాలనుగురించి వాదోపవాదాలు జరిగేవి. జనకునివంటి రాజర్షి సన్నిధిలో ఆధ్యాత్మిక విద్యారసికులుచేరి గోష్ఠి చేసేవారు.

వినోదాలు ఋగ్వేదములో అథర్వణములో జంత్రవాద్యముల పేర్లు చాలావస్తవి. సంగీతం జీవనోపాధిగా చేసికొనేవారు కొందరు. వాజసనేయంలో 'శైలూష' శబ్దం వస్తుంది. పురుషమేధంలో యజ్ఞపశువుగా అతన్ని పెరొకొన్నారు ఋషులు. శైలూషుడనగా నటుడు. ఈ కాలంలోనే నాటకారంభమని నిస్సంశయంగా చెప్పవచ్చును. ఋగ్వేదం లోని సంవాద సూక్తములు నాటక ప్రాచుర్యాభావాన్ని సూచిస్తవి.

క్రీడావినోదాల్లో రథక్రీడ ముఖ్యము. వాజపేయ యజ్ఞంలో రథక్రీడే ప్రధానం. అశ్వక్రీడకూడా వినోదమే. సామాన్యంగా చాలామంది పాచికలు ఆడేవారు.

ఆహారము అపూపము, తిలౌదనము, కరంభము, యవాగు శతపథ వాజసనేయాల్లో పేర్కొనబడినవి. మాంసాశనం సర్వసామాన్యం. అతిథి సత్కార సందర్భంలో అజవృష భాదుల మాంసం వండేవారు. గోమాంసంమాత్రం నిషేధింప బడింది. పాలతోచేసే పదార్థాలు ఆమిక్లా, దధి, నవనీతము, పాయసము పృషదాజ్య వాజినములు.

సురాపానాన్ని ఆర్యులు అంగీకరించలేదు. సురా పానం చేసినవాడికి ప్రాయశ్చిత్తంగా సౌత్రామణిక్రతువు విధింపబడింది. మధుపానం చేసేవారు గేస్తులు. బ్రాహ్మణాల కాలంలో సోమలత లభ్యంకావడంచేత దానిస్థానే పుటికా అరునాదులను ఉపయోగించేవారు.

వేషభాషలు వస్త్రధారణ :-(1) అధివాసము అనగా ఉత్తరీయం (2) వాసము (3) నీవి అనగా బట్ట (కట్టుబట్ట) కట్టుకోడానికి పూర్వం లంగోటీవలె కట్టుకొనేది. శతపథంవల్ల వేషధారణం తెలుస్తున్నది. తలపాగాను ఉష్ణీషం అంటారు. స్త్రీపురుషు లుష్ణీషం ధరించేవారు. చర్మవస్త్రాలుకూడా కట్టుకొనేవారు. బట్టలునేసే నేతవాళ్ళు నిపుణులుండేవారు.

కళ్ళకు కాటుక పెట్టుకోడానికి శలాకిని ఉపయోగించే వారు. ముత్యాలహారాలు మెడలో వేసుకొనేవారు. ప్రాశాశ మనేలద్దాన్ని ఉపయోగించేవారు. కర్ణాభరణంగా 'ప్రవర్త' నుపయోగించేవారు. వాత్యులు 'నిష్క' నే రజత కంఠహారం ధరించేవారు.

వైద్యవిజ్ఞానం అధర్వణంలో ఉల్లేఖింపబడిన వ్యాధుల్లో రాజయక్ష్మ ముఖ్యమైనది. రోగనిర్మూలనంకోసం మూలికలు ప్రక్రియలు పేర్కొనబడినవి. ఋతువుల సంధికాలంలో వ్యాధులు వస్తవనే సూక్ష్మపరిశీలన బ్రాహ్మణాలలో కన వస్తుంది.

ఆర్థికస్థితి శతపథంవల్ల ఆరుమొదలు ఇరవైనాలుగువరకు ఎద్దులనుకట్టి అరకతోలేవారని తెలుస్తున్నది. జంతుసంబంధమైన ఎరువులు చేలకు ప్రశస్తమని అధర్వణవచనం. శతపథ బ్రాహ్మణంలో వ్యవసాయపద్ధతులున్నవి. 1. దుక్కిదున్నడమూ, 2. చల్లడమూ, 3. కోయడమూ, 4. తూర్పార పట్టడమునూ యవలను శీతకాలంలోవేసి వేసవిలో కూడ్చేవారు. వరిని 'వ్రీహి' అంటారు. బార్లిని యవలంటారు. పంట తెగుళ్ళవల్ల పాడయ్యేది. అలా చేలకు తెగుళ్ళు పట్టకుండా గింజలు చల్లేటప్పుడు, కూడుపుల సమయంలోనూ వ్యవసాయదార్లు మంత్రాల సాహాయ్యం కోరేవారు.

వాణిజ్యం శ్రేణులకు అధిపతులు శ్రేష్ఠులు. వారు వడ్డీవ్యాపారం చేసి కోట్లకు పడగలెత్తేవారు. నాణెముల చలామణీకన్న వస్తువినిమయపద్ధతి ఉండేది. శతమాన మనబడే బంగారు నాణెం నూరుకర్షాపణాల బరువుండేది. గురువిందబరువుగల తూకాన్ని కృష్ణాలాంఅంటారు. నిష్కమనే బంగారునాణెం వ్యవహారంలో ఉండిఉండవచ్చును. అధర్వణంలో తృతీయ మండలంలో వాణిజ్య రక్షణ విషయంవస్తుంది.

సముద్రవ్యాపారం ఉండేదని ఐతరేయంవల్ల ఊహా సావకాశమున్నది.

వృత్తులు వృత్తులు సామాన్యంగా కుల్లకమాగతంగా ఉండేవి. చాతుర్వర్ణంలో చేరని పులాలెన్నింటినో వాజసనేయ సంహిత పురుష మేధానికితగిన యాగపశువులుగా పేర్కొన్నది.

రాజనీతి

రాజరికము ఆరంభము ఋగ్వేద సంహితలోనూ బ్రాహ్మణాల లోనూ రాజకీయ సిద్ధాంతములు దేవతల వ్యవహారాల్లో గోచరిస్తున్నవి. దేవతలకూ రాక్షసులకూ సామాన్యంగా పోరాటం ఉండేదికనుక రాక్షసధాటికి నిలవడానికి దేవతాసైకం సమావేశమై రాజును ఎన్నుకొనేది. ఇలా రాజరికం ప్రజా రక్షణకై సైనికతంత్రంలో ఉత్పన్నమై సర్వజనామోదం పొందడంవల్ల రాజుకుగల అధికారం సవ్యమై హేతుబద్ధమైంది. రాజ్యాధికారం బహుజనామోదం పొందవలెననే నియమము దేవతావ్యవహారాల్లో ఉన్నప్పటికీ అది మానవ వ్యవహారం గానే గ్రహించవచ్చును.

రాజరికం దేవాంశ సంభూతమనే సిద్ధాంతం సంహితా బ్రాహ్మణాల్లో కనబడుతుంది. *

రాజకీయ సిద్ధాంతా లుద్భవించడానికి కారణం ఏమిటనే ప్రశ్న సహజంగావస్తుంది. ఆర్యరాజ్యాలు ఋగ్వేద

---

* శతపథబ్రాహ్మణం [5.3.3.12]

సంహితాకాలానికి వైశాల్యంలోనూ జనసాంద్రతలోనూ స్వల్పములై ఉండేవి. బ్రాహ్మణోపనిషత్కాలానికి ఆరాజ్యాలు మానవకూటాలకన్న పెద్దరాజ్యాలు కావడంచేత రాజకీయ సమస్య లుద్భవిస్తవి. వైదిక వాఙ్మయాన్నిబట్టి ఋగ్వేద కాలీన మానవకూటాలు ఇరుగుపొరుగున ఉన్నవికలిసి బలిష్ఠమయ్యేవి. ఉదాహరణకు చూడండి. పురులు భారతులూ కలిసి కురురాజ్యమేర్పడింది. తుర్వాస కృవుల తెగలుకలిసి పాంచాలులైనారు.

చక్రవర్తి కావలెననే మహత్వాకాంక్ష గలవాడు జిగీషతో అశ్వమేధ రాజసూయ యాగాలుచేయడం పరిపాటిగా బ్రాహ్మణాలలో తార్కాణాలు కనబడతవి. చక్రవర్తికి సామ్రాజ్యకాంక్ష ఉండడంవల్ల ఇరుగుపొరుగున వున్న చిన్నచిన్న రాజ్యములను తనరాజ్యంలో కలుపుకొనడమో లేదా ఆధిపత్యం చలాయించడమో స్వభావసిద్ధం. అశ్వమేధం ఆచరించిన విజిగీషుల నామావళి శతపథంలోఉన్నది. రాజసూయంలో మత్రప్రాధాన్యంకన్న రాజకీయసిద్ధాంతమే ప్రముఖంగాఉంది. రాజసూయంలో కర్మకాండను పరిశీలిస్తే ఈ విషయము నిజమనితేలుతుంది. రాజు రాజోచిత వేషధారణచేస్తాడు. పురోహితులు యథాక్రమంగా అభిషేచనచేస్తారు. రాజు వ్యాఘ్రాజినంమీద చరణముంచుతాడు. వ్యాఘ్రపరాక్రమోపేతుడు కావలెనని సూచన. అతడు ధానుష్కుడై నలుదెసల నాలుగడుగులువేస్తాడు.

అనగా నలువైపులా జయించాడన్నమాట. లాంఛనంగా పాచికలాడుతాడు. అంతఃపూర్వం ఏర్పరచుకొన్న పద్ధతిగా అతడే ఆటలోగెల్చుకోడం విజేతకావడం సంభవిస్తుంది.

శతపథ, ఐతరేయ బ్రాహ్మణాలు పారంపర్యమైన రాజ్యాధికారాన్నిగురించి చెబుతున్నవి. కొన్ని రాజవంశాలను పరిశీలిస్తే 'దశపురుషాంత'రాల పారంపర్యం కనబడుతుంది. అయితే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రభువును ఎన్నుకోడం ఉండేది. ఎవరీ ప్రజలనే ప్రశ్నవస్తుంది. ఎన్నుకొనేవారు ప్రజలందరూకారు. రాజన్యులైనవాళ్లు, కులీనులైనవాళ్లునూత్రమే రాజును ఎన్నుకొనే హక్కున్నట్లు గ్రహించవచ్చును. ఈ ఎన్నిక విషయాన్నిగురించి అథర్వణవేదంలో* ఉన్నది. అవసర పరిస్థితుల్లో పాలకుడసమర్థుడైనప్పుడు ప్రజలకు రాజవంశీయుణ్ణి ఎన్నుకొనే అధికారం •ఉన్నదని నిస్సంశయంగా చెప్పాలి.

రాజ్యపాలనలో ప్రజలప్రసక్తి ఉండేదని చెప్పడానికి అథర్వణంలో తృతీయ మండలం నాలుగవ సూక్తంవల్ల తెలుస్తున్నది. రాజ్యాభిషేక సందర్భములో రాజు సభాముఖమున వాగ్దానము చేసేనాడు. *ప్రజాభీష్టమునకు విరుద్ధ

---

* అథర్వణం (Bloom field ప్రతి) I-9, III-4, IV-22 గెల్డనర్ మతాన్నిబట్టి రాజును ఎన్నుకొనే విషయంలో ప్రజామోదం లాంఛనప్రాయమని.

• అథర్వణం 17—353.

* జయస్వాలుగారి Hindu Polity II పుటను 27—28.

ముగా తాను ప్రవర్తించినప్పుడు తాను పోగుచేసుకొన్న పుణ్యము పోగొట్టుకొంటానని రాజు పలుకుతాడు. అతడు ప్రజాభీష్టాన్ని వ్యతిరేకించడమో, పురోహితుని అభీష్టాన్ని తిరస్కరించడమో అధర్వణ పంక్తులవల్ల విశదము కావ డములేదు.

రాజ్యపాలనలో ప్రజానీకానికి హక్కున్నదని చెప్ప డానికి తార్కాణాలు లేకపోలేదు. రాజుకు రాజ్యాభిషేకం చేసే హక్కు ప్రజలకు ఎలావున్నదో అలాగే దుర్మార్గ ప్రభువును రాజ్యబహిష్కృతుణ్ణి చేయడానికి, నిర్వాసిత ప్రభువును రాజ్యార్హుని చేయడానికికూడా అధికారం కలదు. దుష్టప్రభువునుదండించే యాగవిధానం నిర్ణయించింది తాండ్య బ్రాహ్మణం. దశపురుషాంతరాలనుంచి ఏలుబడిలోవున్న రాజ్యంనుంచి నిరంకుశుడైన పామశాయనరాజును శ్యంజ యులు వెళ్ళగొట్టివేస్తారు.

సభాసమితులు రాజ్యవ్యవహారాలలో జోక్యం కలి గించుకోడమేకాక రాజును వ్యక్తిగతంగా పరామర్శించే అధికారంలో ఉండేవి. అందుచేతనే రాజు ఇలా ప్రార్థిస్తాడు. "సభాసమితులు ప్రజాపతి కుమార్తెలు. ఇవి నాకు సహాయం చేయాలి" అని. ఎంత దేవాంశ సంభూతుడైనా, ఎన్ని పురుషాంతరాలనుంచి ఏలుబడిచేస్తున్నా, రాజుకు పరిపాలనాధి కారం ప్రజాదత్తమని వెల్లడి అవుతున్నది. రాజరికం సభాసమితులనే ప్రజాసంస్థలూ ద్వైవికమైనవనీ రెండూ

సమానఫాయాల్లో ఆదరాన్ని పొందినవనీ శతపథబ్రాహ్మణం చెబుతున్నది:

ప్రజాసంస్థల్ని వ్యతిరేకించిన ప్రభువు రాజ్యపాలన సాగించలేక రాజ్యం త్యజించి వెళ్ళిపోవడం తప్పనిసరి. ఆ కారణంచేతనే ప్రజామోదం పొందవలెనని రాజు కాంక్షించేవాడు.

ప్రజాశక్తి రూపొందినసభ ఎలా వ్యవహరించేదో మనకు విపులంగా తెలియదు. అయితే సంహితల్లో అక్కడక్కడా సభాప్రస్తి వస్తున్నది. రాజకీయ సాంఘిక కార్యకలాపాలకై సభాసమావేశమయ్యేది. స్త్రీలుమాత్రం సమావిష్టులయ్యేవారుకారు. అనగా రాజకీయాల్లో వారు పాల్గొనేవారుకారు. ఈ విషయం మైత్రాయణీయ సంహితవల్ల తెలుస్తున్నది. సభకుహాజరై, వ్యవహారాల్లో పాల్గొన్నవారు సభాసదులు. 'సభాచార' మనే శబ్దంవల్ల సభకు సభ్యుడు న్యాయనిష్కారంకోసం వెళ్లడమన్నమాట. యజుస్సంహితలో 'సభాపతి' అనే శబ్దానికి సభాధ్యక్షుడన్నమాట. తైత్తిరీయ బ్రాహ్మణంలో 'సభాపాల' శబ్దంవల్ల సభాసంరక్షకుడని అర్థము. ఏతావతా సభావ్యవహారం ముఖ్యంగా రాజకీయం; గౌణంగా సాంఘికం. సమితికీ సభకూ విశేషంగా తేడాలేదు. రాజ్యతంత్రచర్చలు, పరిష్కారాలు ప్రధానంగా చట్ట నిర్ణయాలు సమితి అధికారంలోవి.

ప్రజాశక్తి రూపమైన సభ ఉన్నప్పటికీ స్వాధికారం రాజు చలాయిస్తూనే ఉండేవాడు. ప్రజారక్షణం రాజ్య రక్షణం అతని విధ్యుక్తధర్మం. అతనికి వుండవలసిన లక్షణాలనుగురించి అథర్వణం ఇలా చెబుతున్నది:—"నీవు పర్వతంలాగ దృఢంగా ఉండాలి. దగజారిపోకు. ఇక్కడ ఇంద్రుడిలాగ దృఢంగా ఉండాలి. ఇక్కడుండి దీన్ని భరించు. ద్యావాపృథివీ విశ్వములు పర్వతాలూ దృఢములు. ప్రజాపతి అయిన రాజుకూడా దృఢంగా ఉండుగాక! దృఢంగా శత్రువుల్ని జయించు. నాశనంచెయ్యకు. శత్రువులవలె వుండే వాళ్ళను కాలికింద రాచిపెట్టు. అన్నిదిక్కులవారూ నిన్ను గౌరవిస్తారు. నీద్రఢిమవల్ల సభ నిన్ను రాజును చేస్తున్నది."*

రాజకీయమైన అత్యవసర పరిస్థితులవల్ల రాజుకుగల అధికారం విస్తృతంగా పరిణమించేది. ఈ రాజ్యాధికారం అభ్యుదయం చెందడానికి రాజు 'దైవసముడనే' సిద్ధాంతం ప్రోద్బలం ఇచ్చింది. శతపథం ఈ సిద్ధాంతాన్ని విపులంగా వ్యాఖ్యానించింది. దైవసముడని రాజును అనడంచేత తన రాజధర్మాన్ని పవిత్రంగా ఆచరించి లక్ష్యప్రాయంగా ఉండవలసిందేకాని విశృంఖలంగా ప్రవర్తించే అధికారంలేదు. ధర్మాతిక్రమణం రాజు చేయడానికి వీలులేదు. కనక దైవసమతాసిద్ధాంతంవల్ల రాజు దురహంకారుడై పోకూడదు.

---

* ఇటువంటివే అథర్వణంలో 12—100 పుటలో చూడుడు.

అలా నిరంకుశంగా ప్రవర్తిస్తే సభాసమితులనే ప్రజాశక్తి అతనికి ఉద్వాసన చెబుతుంది. "ధర్మమే ప్రజలను దేశాన్ని పాలిస్తుందికాని రాజుకాదు." రాజు ధర్మరక్షణకై ప్రజా రక్షణార్థం నియుక్తుడైన సేవకుడు. ఈ ధర్మం అంటే ఏమిటని ప్రశ్నవస్తుంది. ధర్మమంటే దండము. దండభీతివల్ల మానవుడు విచ్చలవిడిగా ప్రవర్తించడు. సర్వానైతిక సాంఘిక రాజకీయ శ్రేయస్సుకూ దండము అవసరము. ధర్మమే దండ మనేభావం సూత్రకాలంనాటి రాజనీతివేత్తలమతం. మొత్తం మీద ఏసిద్ధాంతాలు ప్రచారితాలైనా రాజు నిరంకుశము కావడానికి వీలులేని బందోబస్తుల్ని సభాసమితులు పర్పరచినవి.

పరిపాలన పట్టాభిషేక సమయూన రాజపరివారము హాజ రయ్యేది. ఈ పరివారంలో సేనాని, గ్రామణి, శిస్తువసూలు చేసే భాగదుహుడు ముఖ్యపాలకులు. గ్రామణి గ్రామానికి పెద్ద. ఈ కాలపు పటేలువంటివాడు. గ్రామాల వైశాల్యాన్ని బట్టి గ్రామణులలో వ్యత్యాసం ఉండేది. రాజుతరఫున స్థానిక పాలన అతనిచేతుల్లో ఉండేది. అయితే గ్రామణికి సివిల్ అధికారమేకాని సైనికాధికారంలేదు. ఈ ముగ్గురేకాక పురోహితుడు, మతాధిపతి రాజుకు మంత్రాలోచనలు చెప్పేవాడు. సూతుడు రథచోదకుడేకాక రాజ్యరథాన్ని కూడా నడిపించేవాడు; సంగ్రహీత అనేవాడు కోశాధికారి. అశ్వవాపుడు ద్యూతక్రీడాది వినోదాలను అజమాయిషీ

చేసేవాడు. గోవికర్తనుడనే మృగయానిపుణుడు, పాలాగలుడు, రథకారుడుకూడా పాలకవర్గంలోవారే. ఈ రాజమండలిని 'రత్నా' లని పిలిచేవారు. పట్టాభిషేక సమయంలో రాజసూయ సందర్భంలో ఈ రత్నాలుండవలసినవారు. రాజసూయానికి వీరు హాజరయినప్పుడు 'రత్నహవిస్సు' లని పిలువబడినారు. వీరినిబట్టి పరిపాలనాచక్రం ఎంత సుప్రతిష్ఠితంగా ఉండేదో గ్రహించవచ్చును.

సూతగ్రామణులు అధికారవర్గంలో పలుకుబడి విశేషంగా ఉన్నవారని, వారు రాజకృత్తులనీ అనగా రాజును చేయగల శక్తిసామర్థ్యాలు కలవారనీ, శతపథ బ్రాహ్మణం చెబుతుంది. ఈ రాజకృత్తులలో రాణి, యువరాజు, సోదరుడు కూడా ఉండేవారు.

ఆనంతర సంహితా బ్రాహ్మణాలలో రాజసూయ వర్ణనవల్ల రాజు ప్రజారక్షకుడనీ అలా రక్షచేసినందుకుగాను విశులనే ప్రజలనుంచి పన్నులు వసూలుచేసేవాడు. రాజుకు వెన్నెముక ప్రజానీకమని బ్రాహ్మణాలు చెబుతున్నవి.

ఉపనిషత్కాల ము

<u>ఉపనిషత్సాహిత్యము</u> ఉపనిషద్ అనగా ఎవరో ఒకరి సమీపాన కూర్చోడమని అర్థము. శిష్యుడు గురు 'సమీపా' నికి విద్యకై వెళ్ళడమనేభావం వస్తున్నది. క్రమేణ ఉపనిషచ్ఛబ్దం వల్ల గురువు శిష్యునికి ఆధ్యాత్మిక రహస్యోపదేశం వ్యక్తం

చేయడమనేభావం వచ్చింది. బ్రహ్మతత్త్వముగల వైదిక గ్రంథాంత భాగములను ఉపనిషత్తులని అంటారు. ఉప నిషత్తులు వేదాంత సంజ్ఞను పొందినవి. వేదముయొక్క తుది భాగము వేదాంతము. కర్మానుష్ఠానానంతరం జ్ఞానకాండకు సంబంధించినది కనుక వేదాన్తమనవచ్చును. లేదా వేదా ధ్యయనానంతరం కేవల జ్ఞానప్రాప్తికై వేదాంతములైన ఉపనిషత్తులు ముముక్షువుల కేర్పడినవి.

కొన్ని ఉపనిషద్భాగాలు బ్రాహ్మణానుబంధ భాగ ములు. అవి ఐతరేయ, కౌషీతకి, తైత్తిరీయ, మహా నారాయణ, బృహదారణ్యక, ఛాందోగ్య కేనోషనిత్తులు. మహానారాయణోపనిషత్తును మినహాయించగా తక్కిన ఉప నిషత్తులు ఆదికాలంనాటివి. ఆ ఉపనిషద్రచన బ్రాహ్మ ణాలలో గద్యవలె ఉంటుంది. అవన్నీ బుద్ధుడికీ పాణినికీ పూర్వకాలీనములు.

ఆదికాలానంతరం ప్రవర్తిల్లిన ఉపనిషత్తులుకూడా బౌద్ధమునకు పూర్వపువి. ఈ ఉపనిషత్తులు బ్రాహ్మణాను బంధాలుకాని స్వతంత్రగ్రంథాలు. ఇవి కఠ, శ్వేతాశ్వతర, మహానారాయణ, ఈశ, ముండక ప్రశ్నోపనిషత్తులు. ఇవన్నీ వేదాంతాన్ని ప్రతిపాదించినా, సాంఖ్యయోగమతాలనూ సూచిస్తున్నవి.

బౌద్ధయుగానంతరం విరాజిల్లిన ఉపనిషత్తులు కృష్ణ యజుర్వేదాంతర్గత మైత్రాయణీయోపనిషత్, అథర్వాంతర్గత మాండూక్యోపనిషత్తులు.

పైన చెప్పబడినవికాక మరికొన్ని ఉపనిషత్తులు స్వతంత్రాలైనా అవైదికములు. ఈ ఉపనిషత్తులను షడ్భాగాలుగా విషయ ప్రయోజనాలనుబట్టి విభజించవచ్చును. 1. వేదాంత ప్రతిపాదకాలు, 2. యోగ ప్రతిపాదకాలు, 3. సన్యాస ప్రశంసకలవి, 4. విష్ణువును పరదైవతంగా ప్రసంసించేవి, 5. శివుని పరదైవతంగా ప్రస్తుతించేవి. 6. శాక్తేయాదులకు సంబంధించినవి. మొత్తం ఉపనిషత్తులన్నీ నూటఎనిమిది.

కర్మానుష్ఠానంతో వేసారిన తరువాత మానవుడు జ్ఞానమార్గంచేపట్టి పరతత్త్వమునకు పరితపిస్తాడు. కర్మలన్నింటినీ తోసిరాజని ఆత్మానుసంధానంకోసం జ్ఞానమార్గం అవలంబించక తప్పదు. పురోహితులవల్ల కర్మకలాపం జటిలమై విఫలమై ఆత్మానుసంధానానికి దూరదూరమై పోయింది.

దాసదస్యులను జయించినతరువాత క్షత్రియులు జ్ఞాన సాధనలో మగ్నులైనారు. బ్రాహ్మణులు వైదికకర్మ పరతంత్రులై పరతత్త్వచింత లేనివారు కావడంవల్ల క్షత్రియులు జ్ఞానపిపాసువులైనారు. ఉపనిషత్తులలో బ్రాహ్మణ క్షత్రియులకు వాదోపవాదాలు జరిగినట్లు స్పష్టము. ఛాందోగ్యములోని వైశ్వానర వర్ణంవల్ల బ్రాహ్మణుడు కాకపోయినా, జ్ఞానంవల్ల బ్రాహ్మణుడై రాజైన జనశ్రుతికి తత్త్వోపదేశం చేసినాడు. సత్యకాముడు ఏవర్ణానికి చెందినవాడో తెలియదు.

అగ్రవర్ణంలో చేరకపోయినా అతడు జ్ఞానసాధనకు అధికారి కాగలిగినాడు. ఛాందోగ్యములో ప్రవాహణరాజు బ్రాహ్మణ గౌతమునికి దేహాంతరప్రాప్తికై ఆత్మసంచారం గురించి ఉపదేశించినాడు.

ఉపనిషత్తులు ముముక్షువుల కుద్దేశింపబడినవి. వీటి ప్రయోజనము జీవుడు బ్రహ్మత్వమును పొందడమే. 'తత్ త్వం అసి' అనే మహావాక్యం జీవపరబ్రహ్మల ఐక్యాను సంధానం వ్యక్తంచేస్తున్నది. ఇదే ఉపనిషత్తులలోని విషయం. ఉపనిషద్రుషులు సృష్టికి ఆధారభూతమైన సత్పదార్థాన్వేష ణకు పూనుకొన్నారనేది విశదమవుతున్నది.

ఉద్దాలకారుణి కుమార శ్వేతకేతువుకు బ్రహ్మజ్ఞానం లేనిదే వేదాధ్యయనం నిష్ప్రయోజనమని చెప్పి బ్రహ్మోప దేశము చేసినాడు. అదే 'తత్త్వమసి' అనే ప్రసిద్ధ మహా వాక్యము. అనగా ఆ పరబ్రహ్మ నీవు. జీవపరబ్రహ్మలకు చైతన్యమునుబట్టి విచారించగా భేదంలేదు అని అద్వైత సిద్ధాంతం అనుభవపూర్వకంగా తండ్రి కుమారునకు ద్యోతకం చేసినాడు. ఉపన్యాసాల్లును నీటిలోకలపగా అదికనబడదు. అయితే అది ఉన్నట్లు రుచిచూస్తే అనుభవంవల్ల తెలుస్తుంది. అదే రీతిగా సత్పదార్థం లౌకికదృష్టికి కనబడకపోయినా 'తత్త్వ మసి' మహావాక్యం మననంచేయగా అనుభవగోచరమైంది.

కర్మసిద్ధాంతం బృహదారణ్యకములో సొగసుగా వర్ణిత మైంది. ఛాందోగ్యములో చెప్పినట్లు జలబిందువు తామ

రాకును అంటదు. అలాగే ఆత్మను సంధానంచేసినవాణ్ణి దుష్కర్మలేవీ అంటవు. అంటే జ్ఞాని అసలు దుర్మార్గా చరణానికే అసమర్థుడని తేలుతుంది.

నిజమైన జిజ్ఞాస ఋషులలో స్పష్టంగా కనబడుతుంది. పరతత్త్వాన్వేషణకై సాధకుని తపన బృహదారణ్యకంలో చూడండి. "అసత్యమునుండి నన్ను సత్యమునకు చేర్చుము. అంధకారమునుండి తేజమునకు చేర్చుము. మృత్యువునుండి అమృతత్త్వమునకు తీసికొనిపొమ్ము" ఉత్తమోత్తమ జ్ఞాన ప్రాప్తికై తపించేవాడు వర్ణాశ్రమధర్మాలను తోసిరాజని అంటాడు. అలాఅనకపోతే సమస్తభేదాలు జ్ఞానప్రాప్తికి ఆటంకాలే. కఠోపనిషత్తులో నచికేతుడికి యముడు దీర్ఘాయువు ధనకనక వస్తువాహనాలు ఇస్తానన్నా, శక్తులు ప్రసాదిస్తా నన్నా వినలేదు. "నాకు బ్రహ్మతత్త్వం ఉపదేశంచెయ్యి. ఇతరము లేవీ అవసరంలేదు" అని అహోరాత్రములు తపిస్తాడు. ఆత్మదర్శనంతప్ప అన్యమేమీకోరని సత్యనిష్ఠ ఉపనిషత్కాలంలో ప్రత్యక్షమవుతున్నది.

ఈ సత్యనిష్ఠవల్ల ప్రాపంచిక విషయాలు దోష దృష్టితో చూడబడుతూనే వుంటవి. ఇలా ప్రపంచాన్ని నిరసించడంలో మానవత్వం పోతున్నదని ఎంతమాత్రం అనుకోరాదు. జీవబ్రహ్మానుసంధానమే మహోన్నత మాన వానుభూతికాని జడపాషాణతుల్యంకాదు. ఋషుల సత్యనిష్ఠ మానవతారహితంకాదు.

సూత్రములు అల్పాక్షరములతో అసందిగ్ధమై విశ్వతోముఖార్థ గాంభీర్యముగల వాక్యములు సూత్రములు. విపుల విషయమును సూత్రరూపముగా నిబద్ధముచేసి చెప్పడముచేత విద్యార్థి సులభముగా ముఖస్థము చేసికోగలడు. జ్ఞాపకము చేసికోగలడు. ఈ సూత్రవాఙ్మయం వైదిక సాహిత్యములోని భాగముకాక స్వతంత్రమైనది. అందుచేత దీనికి వేదాంగమని వ్యవహారము. వేదాంగములారు. 1. శిక్షా, 2. వ్యాకరణము, 3. ఛందము, 4. కల్పము, 5. నిరుక్తము, 6. జ్యోతిషము.

ఉపనిషత్తులు - సూత్రములు

*భాషావిశేషాలు ఉపనిషత్కాలీనభాష వైదిక సంస్కృతానికి కొంతదూరమై లౌకిక సంస్కృతానికి చేరువగా ఉంటుంది. కొన్ని భాషావిశేషాలు గమనార్హములు. దార్శనిక భావాలు తేటతెల్లము చేయడానికి ఋషులు అవలంబించిన పద్ధతులు చూడండి.

1. గృహజీవితానికి సంబంధించిన సరళమైన ఉపమా రూపకాలంకారాలు విరివిగా ఉపయోగించినారు.

2. ఒకభావాన్ని తెలియజేసే శబ్దాలను ధారణచేయడానికివీలుగా పునరుక్తి చేసినారు.

3. ప్రహేళికలవంటి కొన్ని వాక్యప్రయోగాలు సాధకుడు అహంకృతితో స్వాయత్తం చేసుకోడానికి ఏర్పడినవి.

---

* Vedic Age-Ed. Munshi Vol I పుట 478—479.

4. కొన్నివిషయాలు అతిగా వివరించడం ఔత్సుక్యం కలిగించుటకే.

5. కథానికలనంటివి దార్శనిక సిద్ధాంతములు బోధ చేసేనిమిత్తం ఉదాహరణలుగా ఇవ్వడం గమనించాలి.

6. ఆధ్యాత్మికభావం సామాన్యజాతుల విశ్వాసం, ఔత్సుక్యం ఆధారంచేసుకొని ఉట్టంకించినారు.

సూత్రగ్రంథాలలో సంస్కృతము కొంతజటిలమై బ్రాహ్మణాలలో గద్యవలె దీర్ఘ సమాస సమన్వితమై పాణినీయభాషకు సమీపముగా నుండును. *

ఉపనిషత్తులు - మతతత్త్వము బ్రాహ్మణములకు పూర్వమే పురోహితులలో బహుదేవతా విశ్వాసం ఋగ్వేదములో •దశమ మండలములో తగ్గిపోవడం ఆరంభమైంది. దార్శనికభావన సంహితలో అస్పష్టమై, ఉపనిషత్తులలో పరాంకోటిలో విలసిల్లింది. బ్రాహ్మణేతరులైన క్షత్రియులు కర్మమార్గ వ్యతిరేకులై జ్ఞానమార్గమును అవలంబించినారు. బౌద్ధము బ్రాహ్మణుల కర్మకాండపై విప్లవము తెచ్చినట్లు స్పష్టము. మేధాసంపత్తి విశేషంగాగల బ్రాహ్మణులు, భావవైరుధ్యము ఏర్పడినప్పుడు సమన్వయము చేసేటందుకు యత్నించి కృత

---

* Vedic Age-Ed. Munshi Vol I పుటలు 480—481.

• R. Veda X 119.

కృత్యులైనారు. కర్మ జ్ఞానకాండలకు వైరుధ్యముగా వాను ఆశ్రమధర్మ సమన్వయు కృషిచేసినారు.

ఈ ఆశ్రమ సిద్ధాంతప్రకారం ఆర్యునిజీవితము మూడు దశలుగా విభక్తమైంది. ప్రథమదశ బ్రహ్మచర్యము. బ్రహ్మచర్యంచేసి గురుశుశ్రూషలో విద్యాసంస్కారం పొందుతాడు విద్యార్థి. గురుకులవాసానంతరం రెండవదశలో గృహస్థుడై సంతానంపొంది గృహ్యశ్రౌతకర్మలు యథావిధిగా అనుష్ఠిస్తాడు. మూడోదశలో దంపతులు వయసు చెల్లినవారుకాగా, గేస్తు వనవాసంచేస్తూ అనగా వానప్రస్థుడై కించిన్మాత్రంగా కర్మాచరణంసాగిస్తూ, యజ్ఞం జ్ఞాన యజ్ఞంగా భావనచేస్తూ తాత్త్విక రహస్యాలను మననంచేసి ధ్యానమగ్నుడౌతాడు. వానప్రస్థుల కుపకరించేవి ఆరణ్యకములు. ప్రాచీనోపనిషత్తులు ఆశ్రమవ్యవస్థను జీవితదశలుగా చెప్పినవేకాని అనుష్ఠించవలసిన క్రమభూమికలుగా ప్రవచించ లేదు. ఆనంతరోపనిషత్తులూ, మహాభారతమూ, ధర్మశాస్త్ర గ్రంథాలూ, క్రమబద్ధమైన ఆశ్రమ జీవిత విధానాన్ని భారతీయునికి విధించినవి. ఆశ్రమత్రయమేకాక తురీఆశ్రమం అనగా సన్యాసము నాలుగవదశగా మానవునికి ఉద్దేశింప బడింది. తురీయాశ్రమంలో మానవుడు యాగాది సమస్త కర్మలనూ పరిత్యజించి సన్యాసి అవుతాడు. విషయ ప్రపంచాన్ని భావమాత్రంగా విడిచిపెట్టి బ్రహ్మనిష్ఠుడౌతాడు. ఈ ఆశ్రమ జీవితవిధానంలో వానప్రస్థ సన్యాసాశ్రమముల

వల్ల, జ్ఞానసాధనకే ప్రాధాన్యం ఇవ్వడం సంభవించింది. బ్రహ్మచర్య గార్హస్థ్యములలో కర్మానుష్ఠాన విధించడం జరిగింది. ఏతావతా ఆశ్రమ చతుష్టయంవల్ల కర్మజ్ఞాన మార్గాలకు సరససమన్వయం జరిగింది.

ఒక్కమాటలో ప్రాచీనోపనిషత్ సిద్ధాంతం ఈవిశ్వం 'ఈశావాస్యమనీ', అయితే బ్రహ్మమే ఆత్మఅనీ చెప్పవలెను. విశ్వాత్మభావన మొదట సగుణరూపుడైన సృష్టికర్త ప్రజాపతినుంచి ఆరంభమై ఉపనిషత్తులలో నిరాకారబ్రహ్మగా పరిణమించింది. ఋగ్వేదంలో ఆత్మ 'నిశ్వాసము' గానూ, బ్రాహ్మణాలలో 'ఆత్మ' గానూ ఆర్యఋషులు తలచినారు. ప్రాణాన్నీ దేవతలనూ అభేదంగా భావించినారు. ప్రాణానికి ఆధారంలేక అధిష్ఠానం ఆత్మ. ఈ ఆత్మ విశ్వమంతటా వ్యాపకమైనదని *శతపథ బ్రాహ్మణవచనం. మరొకిపట్టంలో ఋగ్వేదంలో స్త్రీపురుషుడూకాని 'బ్రహ్మ' ధ్యానమనీ, ప్రాచీన బ్రాహ్మణాలలో 'బ్రహ్మ', ధ్యానము, పురోహితుడు, యాగాలలోని 'విశ్వజనీన పవిత్రత' గా ఋషుల అభిమతము. ఈ కర్మానుష్ఠానగతమైన పవిత్రతనుంచి ఒకే సా విశ్వవ్యాప్త బ్రహ్మభావన అనగా జగత్తుయావత్తూ బ్రహ్మమయంగా తలచడమంటే, కర్మానుష్ఠానంనుంచి జ్ఞాన పర్యవసానం పొందడం అవుతుంది. బ్రహ్మభావన భారతీయ

---

* శతపథం XI 2.3 (ఎగ్లింగ్‌ప్రతి)

మతతాత్త్విక పారమ్యము ! జీవవిశ్వాత్మల అభేదతాదాత్మ్య మును 'తత్త్వమసి' అనే మహావాక్యము నిర్దేశిస్తున్నది. విశ్వాత్మ భావానుభూతిని బోధపరచవలెనని ఉపనిషత్తులలో ఋషులు అనేక రూపకాలంకారాలను ఉపయోగించినారు. అజాతశత్రువు బలాకిగార్గ్యునకు పరబ్రహ్మను జీవునిలోనే అన్వేషించాలని బోధించినాడు. బృహదారణ్యకోపనిషత్తులోని యాజ్ఞవల్క్య మైత్రేయుల మధ్యనడచిన గోష్ఠిలో పిండాండమూ బ్రహ్మాండమూ ఒక్కటేననీ, తనఆత్మఅనగా తన ఉనికినిబట్టి సమస్తముయొక్క ఉనికి అనేసిద్ధాంతము వచ్చినది. *శ్వేతాశ్వతరోపనిషత్తులో జగత్తు మాయఅనీ అది బ్రహ్మమునుండి వచ్చినదనీ, ఆ బ్రహ్మయే గారడీ వాడనీ చెప్పడం జరిగింది. ఈ వాదం ఆనంతర వేదాంతంలో ప్రముఖసిద్ధాంతమైంది.

ఉపనిషత్తులలోని మనస్తత్వరీత్యా, దార్శనికదృష్ట్యా ప్రాణం ముఖ్యమైంది. ప్రాణం జీవసూత్రం. దాన్ని ఏకవచనంగా తీసికొన్నప్పుడు ఆత్మధర్మము అవుతుంది. తరుచుగా ఉపనిషత్తులు ప్రాణవర్ణన విపులంగాచేసి, ప్రాణాసికీ ఆత్మకూ అభేదాన్ని ప్రతిపాదించినవి.

---

* శ్వే. ఉ:—" మాయాం తు ప్రకృతి విద్యాత్
మాయినం తు మహేశ్వరమ్
తస్యావయవ భూతైస్తు
వ్యాప్తం సర్వమిదం జగత్॥

ఉపనిషత్ప్రతిపాదితమైన ఆత్మతత్త్వంలో నైతికోన్నతి గోచరిస్తుంది. ఇది సహేతుకంగా సుందరంగా ప్రతిపాదితమైంది, ఏతత్ ప్రతిపాదనమే విశ్వాజనీనమైన ఆత్మను వ్యక్తులందరిలో దర్శించడమూ ప్రేమించడమునూ. ఈఅనుభూతి కలిగినప్పుడు సమస్తజీవరాశిని ప్రేమించగలము. ఉపనిషత్తుల్లోని కర్మసిద్ధాంతం నైతికోన్నతిగలది. తైత్తిరీయోపనిషత్తులో (1·II); బృహదారణ్యకములో (V·2) సూటిగా నీతిబోధ గోచరిస్తున్నది. కర్మసిద్ధాంతమును ఎంత నైతికమని ప్రశంసించినా జీవబ్రహ్మైక్యతకు అది ఆటంకమే. ఈ జీవబ్రహ్మానుసంధానమునకు సర్వకర్మలూ అనగా యాగాదిసత్కర్మలూ దుష్కర్మలూ అవరోధము కలిగిస్తవి. కర్మాచరణవల్ల ఫలానుభవం తప్పదు. అనగా జననమరణాది పునరావృతివల్ల జీవునికి బ్రహ్మైక్యత సంభవించదు. జనన మరణ ప్రవాహరూప సంసారమే జీవునికి బంధము. ఈబంధం ఆత్మజ్ఞానంవల్ల తొలగిపోతుంది. సర్వకల్పితబంధాలూ జ్ఞాన పరశువుతో భేధించక తప్పదు. విషయప్రపంచాన్ని దోష దృష్టితో చూడమని మైత్రాయణీ యోపనిషత్తు చెబుతున్నది. దోషదృష్టితో చూడడమంటే జగత్తు నిస్సారమని తోచడమన్నమాట. దీనిని నిరాశావాదమంటారు. ఈ నైరాశ్యదృష్టి బౌద్ధదర్శనంలో ఆనంతర కాలీన సంస్కృత సారస్వతంలో గోచరమవుతున్నది. "అత్యాశా పరమం దుఃఖం, నిరాశా పరమం సుఖం" అనే భావమే నైరాశ్యం.

అయితే ఈ దృక్పథం ప్రాచీనోపనిషత్తులలో ప్రతిపాదితం కాలేదు. సాధకుడు ఆత్మానుసంధానంచేసి ఆనందస్వరూపుడు తానని గుర్తించినా, ప్రపంచం కల్పితమనే అతని రూఢ విశ్వాసం విరక్తికి దారితీస్తుంది. అప్పుడిది నిరాశాదృష్టి అవుతున్నది.

<u>ఉపనిషత్తులలోని మూలసిద్ధాంతములు</u> 1. ఆత్మ జ్ఞాతయేకాని మనకు జ్ఞేయపదార్థంగాకాదు. అందుచేత అది తెలియబడనిది. నేతి నేతి వాక్యములవల్ల అనగా 'ఇదికాదు, ఇదికాదు' అని అనాత్మధర్మాలను తొలగిస్తూ, దానిలక్షణం చెప్పవలసి ఉంటుంది.

2. ఆత్మజ్ఞానంవల్ల ఆధ్యాత్మైక్యత ఏర్పడుతుంది. ఏకత్వము చైతన్యైకతము. ఆత్మజ్ఞానంవల్ల సమస్తమూ తెలియబడుతుంది. (ఏకేన విజ్ఞానేన, సర్వం విజ్ఞాతం భవతి) పరిణామము కేవలము వాచారంభణమే.

ఆనంతర వేదాంతము బ్రహ్మలక్షణము సచ్చిదానంద మని చెప్పినది. సత్ అనగా ఉనికి ; అసత్తుకానిది. చిత్ అనగా చైతన్యం. ఆనందము దుఃఖరహితమైనది.

3. ఉపనిషత్ప్రతిపాదితమైన **Pantheism** (సర్వాస్తిక వాదము) రెండు విరుద్ధ దృక్పథాల సామరస్యమే. దార్శనిక దృష్టిప్రకారం ఆత్మకానిది అనగా చైతన్యముకాని ఇతరమేదీ సత్యముకాదు. రెండవ దృక్పథాన్నిబట్టి స్థూలంగాకనబడే

వ్యవహారికప్రపంచ సత్యత్వము ఆత్మచైతన్యముగా విశ్వము ఏకైకసత్యము, స్థూలజగత్తు వాస్తవంగా ఉన్నాసరే.

4. విశ్వము చైతన్యమేఅని నిర్ణయించవలెనంటే విశ్వ చైతన్యముల అభేదతాదాత్మ్యం అయోమయంగా ఉంటుంది. ఈ అయోమయం తొలగించే నిమిత్తం, ఆత్మకారణంగా జగత్తు కార్యరూపంగా చెప్పవలసివచ్చింది.

సూత్రములు ఉపనిషత్తులు జ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వగా శ్రౌతగృహ్యసూత్రాలు బ్రాహ్మణాలనాటి ప్రాచీన కర్మ కాండకే ప్రోద్బలం ఇచ్చినవి. సూత్రవాఙ్మయము కర్మానుష్ఠానాన్ని మానవుని శ్రేయస్సుకై పురుషార్థ చతుష్టయాన్ని (అనగా ధర్మార్థ కామమోక్షములు) జీవితలక్ష్యంగా ప్రతిపాదించింది.

సాంఘికస్థితి

గృహజీవనము సంఘవ్యవస్థకు గృహము ఆధారం. గృహస్థ కర్తవ్యాలను కర్మానుష్ఠానాన్ని గృహ్యసూత్రాలు వివరించినవి. ఆనంతర సంహితా బ్రాహ్మణకాలంలో సర్వసామాన్యంగా అవిభక్త కుటుంబ జీవనము సాగిపోతూఉండేది. గృహ్య సూత్రకాలానికి కుటుంబము చీలిపోయినది. కుటుంబము విభక్తమవుతున్నప్పుడు ఆచరించవలసిన కర్మకలాపాలను గృహ్యసూత్రాలు వివరించినవి. గృహాయజమాని కాలధర్మం పొందినప్పుడు అంత్యక్రియలు జ్యేష్ఠకుమారుడు చేయవలసి

ఉంటుంది. అనగా కర్మాధికారం జ్యేష్ఠుడికి సంక్రమించింది. గృహాయజమానియెడల ఇంటిల్లిపాదీ గౌరవము చూపేవాసు.

వర్ణవ్యవస్థ సూత్రకాలంలో వ్యర్ణవ్యవస్థ అతిసంకుచితమైంది. నైశ్యనిస్థితి అధోగతికి వచ్చింది. వర్ణవ్యత్యాసం ఎక్కువ కాగా బ్రాహ్మణాధికారం వృద్ధికాజొచ్చింది. రాజులు యావన్మందికీ పన్ను విధించినారు. కాని బ్రాహ్మణులమీద పన్ను లేదు. పురోహితుని ప్రభావము రాష్ట్రంలో అధిక మైంది. పాణినిమహర్షి చేసిన నిర్వాసిత, అనిర్వాసిత శూద్ర విభజననుబట్టి పారిశుధ్యం ఎరుగని కొందరు శూద్రులకు నిషాదులవలె గ్రామాల పొలిమేరల్లో నివాసం విధింపబడింది. కర్మసన్యాసం చేయడానికి శూద్రునికి అధికారంలేదు. రాష్ట్రంలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు అగ్రవర్ణాలు.

మతలౌకిక వ్యవహారాల్లో చాతుర్వర్ణం ఆచరించ వలసిన విధులు, కులాచారములు, బాధ్యతలు, అధికారాలు భిన్నంగా ఏర్పడినవి. బ్రాహ్మణవర్ణంలో పురోహితమండలి సుప్రతిష్ఠితమైంది. వేదాధ్యయనం, యజనయాజనం, దాన స్వీకారాది అధికారాలు బ్రాహ్మణునికి సంక్రమించినవి. అతని కిచ్చిన సావకాశాలు చాలాఉన్నవి. వాటిని గృహ్య సూత్రాలు వివరిస్తున్నవి.

అధికార గౌరవాల్లో క్షత్రియులు విపులవలెనే ఉన్నతికివచ్చినారు. వైశ్యులుమాత్రం క్షీణదశలో ఉన్నారు.

శూద్రునికీ అగ్రవర్ణానికీ వ్యత్యాసం ప్రబలమైంది. ఆర్యేతర సంపర్కంవల్ల శూద్రులకు సమాజంలో అధికార సదుపాయాలు లేకపోయినవి. వేదాధ్యయనాదులకు వారికి అర్హతలేకపోయింది. మూడుతరాలపాటు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు ఉపనయనం చేసికోకపోతే వారూ బహిష్కార్హులు. వారిదర్శనమే అమంగళకరమట! వ్రాత్యస్తోమం అనే కర్మనల్ల భ్రష్టులను సంస్కరించి ఆర్యవర్గంలో చేర్చుకొనే సావకాశం కల్పించబడింది.

వర్ణవ్యత్యాసం అధికమై జటిలమైపోగా, అగ్రవర్ణునికి దోషదండనం అతిస్వల్పంగానో లేదా దండనే తీసివేయడం ధర్మసూత్రాలవల్ల తేలుతున్నది. సివిలు క్రిమినలు శిక్షా స్మృతులుకూడా అగ్రవర్ణాలయెడల పక్షపాతం చూపుతున్నవి. ఆర్య శూద్ర సంపర్కం వర్ణాంతర వివాహంవల్ల ఏర్పడగా మిశ్రమ వర్ణాల సంఖ్య పెరిగింది. అగ్రవర్ణుడు సవర్ణకన్యనేకాక, అవర్ణకన్యలనుకూడా వివాహము చేసుకోవచ్చును. దీనిని అనులోమ వివాహమంటారు. ఈ అనులోమ వివాహాలవల్ల నూతన వర్ణభేదాలు అధికమైనవి. అనులోమ వివాహంవల్ల జన్మించినవాడు, తండ్రి వర్ణానికి చెందుతాడు, అధమవర్ణుడు అగ్రవర్ణకన్యను పెళ్ళాడితే ఆ వివాహాన్ని ప్రతిలోమం అంటారు. అనగా తండ్రి శూద్రుడై తల్లి బ్రాహ్మణస్త్రీ అయినప్పుడు, కుమారుడు చండాలుడని వాసిష్ఠ ధర్మసూత్రవచనం. (వా. ధ. XVIII.1) ప్రతిలోమ

వివాహంవల్ల జన్మించిన కుమారునికి కర్మాధికారంలేదు. రథకార కులోద్భవునికీ మిగిలిన మిశ్రమవర్ణాలవారికీ కర్మాధికారం ధర్మశాస్త్రోక్తాలేదు.

పారిశుధ్యంలేని మానవకూటమితో సంపర్కం అనారోగ్యహేతువు. వాళ్ళు అస్పృశ్యులని ధర్మశాస్త్ర పరిగణనము. హీనవర్ణస్పర్శవల్ల అపవిత్రత అనారోగ్యం మిగిలిన అగ్రవర్ణులకు సంక్రమిస్తుందనే భావము సూత్రకాలములో గాఢమైంది. అందుచేతనే అగ్రవర్ణులకూ శూద్రులకూ పంక్తి భోజనాదికము నిషిద్ధమయింది. ఈ విషయం వాసిష్ఠ గౌతమ ఆపస్తంబులు ఉల్లేఖించినారు.

<u>వివాహము - స్త్రీ</u> అనులోమ వివాహంవల్ల శూద్రభార్యకు సమాజములో గౌరవంలేదు. శ్రౌతసూత్రాలీవిషయం తెలియ జేస్తున్నవి.

గృహ్యసూత్రాల్లో ఆశ్వలాయనాది ధర్మశాస్త్ర కారులు అష్టవిధవివాహాలు వివరించినారు. పైశాచ రాక్షస వివాహాలనుకూడా అష్టవివాహాల్లో చేర్చినారంటే కారణం ఏమైఉంటుంది ?

పైశాచక పద్ధతిప్రకారం కన్యను వరుడు ఎత్తుకొని పోతాడు. రాక్షసవివాహములో వరుడు వధూ బంధువులతో పోరాడి వధువును స్వీకరిస్తాడు. ఈ పద్ధతులనుకూడా వివాహాలుగా అంగీకరించి, ఆ దురదృష్టవంతులకుకూడా సమాజములో ధర్మశాస్త్రకారులు స్థానమీయదలచినారు.

వివాహానికి నియమములు ధర్మశాస్త్రరీత్యా ఏర్పడినవి. వధువు వరునితల్లికి సపిండ, సగోత్ర సంబంధం ఉండకూడదు. అప్పుడే ఆ వివాహం యోగ్యం. వధూవరులు ఆర్యేయ పౌరుషేయాలుగల వంశీయులై ఉండాలి.

వివాహవిధానం - ద్వాదశఘట్టాలు 1. సంబంధము చేసుకోదలచిన వాడు కన్యాగృహానికివెళ్ళడం.

2. కన్యాదాతయొక్క ఆమోదాన్ని లాంఛనంగా పొందిన వరుడు హోమంచేస్తాడు.

3. వివాహం తొలినాటి ఉదయాన్నే వధువు మంగళస్నాన విశుద్ధగాత్రి కావాలి.

4. వధువుయొక్క పురోహితుడు హోమంచేయిస్తాడు. సువాసినులు ఇంద్రాణీకర్మలో అవాంతరభాగంగా నాట్యం చేస్తారు.

5. వరుడు వధూగృహానికి తరలివెళ్ళుతాడు. మంగళస్నాన శుద్ధఅయిన పెళ్ళికుమార్తెకు చీర, అద్దంవంటివి చదివిస్తారు.

6. కన్యాప్రధానం లాంచనప్రాయంగా ఇప్పుడు జరుగుతుంది.

7. ఆతరువాత వరుడు వధూపాణిని గ్రహిస్తాడు.

8. అశ్వారోహణం.

9. వరుడు వధూకరముగ్రహించి అగ్నిప్రదక్షిణం చేస్తాడు.

10. అనంతరం లాజహోమం.

11. అన్నింటికన్న ముఖ్యం నిరంతర సఖ్యంకోసం వధూవరులు సప్తపది.

12. వధువు వరుని గృహానికివెళ్ళడం.

వివాహాలు ప్రౌఢావివాహాలేకాక బాల్యవివాహాలు కావు. పెళ్ళయినవెంటనే చతుర్థీకర్మ జరుగుతుంది. దీనిని గురించి గృహ్యసూత్రాలు చెప్పడంవల్ల రజస్వలానంతర వివాహాలు జరిగేవని స్పష్టంగా చెప్పాలి. ప్రాచీన నవీన గృహ్యసూత్రాలూ, ధర్మసూత్రాలూ వధువు 'నాగ్నిక' అయివుండాలని విధించినవి. నాగ్నిక అనగా రజస్వల మాసంలోగాఅయినది, లేదా స్తనవృద్ధికానిది.

బహుభార్యాత్వం అనులోమ వివాహంవల్ల తట స్థించేది. అసురవివాహంలో కన్యాశుల్కం గోచరిస్తున్నది. కన్యాదాతకు కట్నంచదివిస్తేగాని కుమార్తెను వరునకివ్వడు. బ్రహ్మ దైవవివాహాల్లో వరశుల్కాలుండేవని సూచనలు కనబడుతున్నవి.

స్త్రీలకు ఉపనయనాధికారం సూత్రకాలంలోపోయింది. స్త్రీ గృహిణీపదం నిర్వహించి గృహాలక్ష్మిగా ఉండేది.

వాసిష్ఠ ధర్మసూత్రాలనుబట్టి వితంతువివాహాన్ని ఆర్యులంగీకరించినారు. పునర్వివాహిత సుతులు పన్నెండు రకాలుగా ధర్మశాస్త్రకారులు నిర్వచించినారు. బోధాయనుని బట్టి మేనరికం చేసుకోడం కేవలం దాక్షిణాత్యుల ఆచారం. ప్రత్యేక పరిస్థితుల్లో అనగా వంశాంకురం లేనప్పుడు స్త్రీ 'నియోగ' పద్ధతిగా సంతానం పొందవచ్చును. అయితే కొందరు ధర్మశాస్త్రకారులు ఈ 'నియోగ' విధానం అంగీకరించలేదు.

ఆనంతర స్మృతికారులకన్న ధర్మశాస్త్రకారులదృష్టి స్త్రీవిషయంలో కఠినంకాదు. "సంతానవతికాని గొడ్రాలిని పదోసంవత్సరంలో విడిచిపెట్టాలి. కుమార్తెలున్న స్త్రీ అయితే పన్నెండేళ్ళతరువాత ఆమెను విడిచిపెట్టాలి. సంతానం గతించినప్పుడు పిల్లలులేనిదాన్ని పదిహేనవయేట విడిచి పెట్టాలి" అని ఇలాగ బోధాయనుడు (II 2.4.6), మనువు (9.81) విధించినారు. వాసిష్ఠ ధర్మసూత్రాలనుబట్టి భర్త భార్యను విడిచిపెట్టరాదు. "గయ్యాళిఅయినా, పాపంచేసినా, ఇల్లువిడిచిపెట్టినా, దొంగలపాలయినాసరే." *భార్యలను అన్యాయంగా విడిచిపెట్టిన భర్తలకు కఠినదండన విధించినాడు ఆపస్తంబుడు. భర్తను విడిచిపెట్టిన భార్య హోమంచేస్తే తిరిగి భర్త స్వీకరించవచ్చునని ఆపస్తంబుడు చెప్పినాడు.

---

*వాసిష్ఠ ధర్మసూత్రం 1—2.

ఇలాగ స్త్రీలవిషయంలో ధర్మనిర్ణాయకులు కొంత జాలి చూపినారు. అందరూ అంగీకరించిన విషయంఏమంటే తల్లి దండ్రులు కన్యకు సకాలం పెళ్ళిచేయని పక్షంలో ఆ కన్య మూడేళ్లునూచి భర్తను వరించవచ్చును. అయితే స్త్రీకి సమాజంలో కుటుంబంలో ఎంతగౌరవంఇచ్చినా ఆనంతర ధర్మశాస్త్రకారులుమాత్రం వారికి స్వాతంత్ర్యం పనికిరాదని చెప్పినారు. * "న స్త్రీస్వాతంత్ర్య మర్హతి."

విద్య ఉపనిషత్తులవల్ల విద్యాసంబంధమైన మహోన్నతా దర్శాలు తెలియవస్తున్నవి. గురుకులవాసానంతరం శిష్యులకు గురువు అనుశాసనం చేసేవాడు. • శ్వేతకేతు ఆరుణేయ, సత్యకామ జాబాలుల వృత్తాంతాలవల్ల గురువులిచ్చే సందేశాలు విశదమవుతున్నవి.

జనకుడు క్షత్రియుడైనా ఆధ్యాత్మిక విద్యాధికారి. క్షత్రియులు జ్ఞానార్జనకై తత్వచింతచేసేవారు. బృహదారణ్యకములో ఆరుణికధవల్ల వృద్ధశిష్యులు యువగురువుకడ విద్యాభ్యాసంచేసేవారు. స్త్రీలుకూడా ఆధ్యాత్మిక విద్యాసంపన్నులై ఉండేవారు, మైత్రేయిగార్గివంటి జిజ్ఞాసువులు ప్రాచీన భారత వర్షంలో మేలుబంతులు.

విద్యారంగంలో పఠనీయ విషయాలు :—వేదము, ఇతిహాస పురాణములు, బ్రహ్మవిద్య, శబ్దశాస్త్రము, గణితం,

---

* బోధ ధర్మసూత్రం 2.3, 44, 45.

• తైత్తిరీ ఉపనిషత్తు 1.11.

వాక్యోవాక్య, ఏకాయన, ఖగోళవిజ్ఞానం, సైనికతంత్రం, సర్పశాస్త్రం, పితృదేవ, దేవజనవిధులు. ఇవికాక వేదాంగాలు పఠనీయాలు.

సూత్రకారులవల్ల విద్యార్థులజీవితం కొంతవరకు తెలుసుకోవచ్చును. బ్రాహ్మణ క్షత్రియులు విద్యాగురువు లుగా ఉండేవారు. ఉపనయనంతో విద్యార్థి జీవితారంభం. విద్యావిధానంలో నైతికవర్తనం అవశ్యకమని గురుశాసనం. గురువుదగ్గర శిష్యుడు శుద్ధవర్తనుడై ఉండాలి. దినదినమూ భిక్షాటనం. సమిధలు తీసుకొనిరావడమూ, గృహంలో హోమరక్షణమూ, ఇల్లుభద్రపరచడమూ, విద్యాభ్యాసం, నియమవ్రతాచరణం శిష్యులకు విధింపబడినవి. "సరళజీవనం, ఉదాత్త గంభీరయోచన" విద్యార్థి అలవరుచుకొనేవాడు. గురువు మహోన్నతవ్యక్తి. జ్ఞానమూర్తి. కరుణాళువు. గురు వాత్సల్యంలో, అనురాగంలో శిష్యహృదయాలు ప్లావితములు కాగా జ్ఞానాంకురాలు మొలకలెత్తేవి!

రాజకీయం ధర్మసూత్రాలవల్ల రాజకీయ భావాలు ఉపనిష త్కాలనాటివి స్పష్టంగా గ్రహించవచ్చును. అయితే రాజనీతి శాస్త్రీయపద్ధతులలో ఉల్లేఖింపబడలేదు; ధర్మ శాస్త్ర అర్థశాస్త్రములలో ఆనంతరకాలంలో మాత్రము శాస్త్రీయపద్ధతిగా రాజనీతి ఉద్దిష్టమైనది. జీవితం ఏకమై సమగ్రమైనది. వ్యష్టికన్న సమిష్టి ప్రధానం. అందుచేతనే

సమాజము సమిష్టికే ప్రాధాన్యం ఇస్తున్నది. వ్యక్తి విధ్యుక్త ధర్మాలు ఆచరించాలి. కర్తవ్యాలు బాధ్యతలు తెలుసు కోవాలి. ఇరవయ్యో శతాబ్దంలోవలె వ్యక్తులు హక్కుల కోసం నినాదాలుచేయక బాధ్యతాయుతమై విధ్యుక్త ధర్మాలు నిర్వర్తించడం సూత్రకాలంనాటి ఆదర్శం. విధులను ఆచరించడంలో రాజకీయ సంకుచిత లక్ష్యాలుకాక, మానవ శ్రేయోదాయకధర్మమే పరమాదర్శం.

ప్రభువులు ప్రజలు ఎలావ్యవహరించాలో ధర్మ సూత్రాలు శ్రేయోదాయకమైన శాసనాలు చేసినవి. ప్రభు నిరంకుశవర్తనాన్ని అణచివేసే పద్ధతులు, ప్రజల హక్కులను గురించి ధర్మసూత్రాలు ఏమీ చెప్పలేదు. వైదిక కాలీన సభాసమితులు సూత్రకాలానికి లేకపోవడంచేత ప్రభువు యొక్క నిరంకుశాధికారం అణచిపెట్టే సమిష్టిశక్తి ఏదీలేదు.

రాజధర్మాన్నిగురించి విశేషంగా ధర్మశాస్త్రకారులు వివరించినారు. రాజు ప్రజలకు లక్ష్యప్రాయంగా ఉండవలసిన జీవితవిధానము, అతనికర్తవ్యాలు, వాసిష్ఠ, బోధాయన, ఆపస్తంబాదులు ఉల్లేఖించినారు. ఉత్తమ సంస్కారంతోపాటు స్వచ్ఛమైన ప్రవర్తన, దానికితోడు సైనికశిక్షణ రాజుకు ఆవశ్యకం. అతనికి త్రయీవిద్య, అన్వీక్షకి అనే తర్కశాస్త్రాలు, రథకోనండశిక్షణ, త్రికరణశుద్ధి అవసరం. వర్ణాశ్రమ ధర్మరక్షణ, బ్రాహ్మణ పండితపోషణ, అనాధరక్షణ, ఆశ్రిత పోషణం రాజధర్మాలు. అతడు ప్రజాశ్రేయం పరమలక్ష్యంగా

పరిపాలనచేయాలి. అలా ప్రజారక్షణ చేయవలసిన అవసరం ఉన్నదికనక పంటలో ఆరోవంతు పన్నుక్రింద వసూలు చేస్తాడు రాజు. "చోరభయంలేకుండా ప్రజల ఆస్తిపాస్తుల భద్రత చేకూరుస్తాడు. అలా ఆస్తి భద్రత కలిగించలేనప్పుడు చోరులవల్ల పోయిన సొత్తువిలువ రాజకోశమునుంచి ఇచ్చివేయాలి."

సమాజములో బ్రాహ్మణాధికారం అధికమని ధర్మశాస్త్రంవల్ల గ్రహించవచ్చును. "రాజు, విప్రుడూ, వేదవిద్యాప్రవీణులైన వీరిద్దరూ ప్రపంచంలో ధర్మము నిలుపగలవారు" అని గౌతమ వచనం. విద్వాంసులైన బ్రాహ్మణులు పన్ను చెల్లించవలసిన అగత్యంలేదు. *పురోహితుడు రాజుకు మంత్రాలోచన చెప్పేవాడు. రాజకార్య నిర్వహణాలో ముఖ్యుడు.

బ్రాహ్మణ పరిషత్తులుండేవి. ధర్మనిర్ణయం చేయడమేకాక, రాజకీయ ధార్మిక వ్యవహార విషయ పరిష్కారం కూడా పరిషత్కర్తవ్యం. పరిషత్తులో కనీసం పదిమంది బ్రాహ్మణులుంటారు. నలుగురు వేదపండితులు, ఒకవిద్యార్థి, ఒక జ్యేస్తు, ఒకయతి, ఒకమీమాంసకుడు, షడంగప్రవీణుడు, ధర్మశాస్త్ర పారగుడునూ సభ్యులు.

ఉపనిషత్కాలంలో పరిషత్తు ఆధ్యాత్మిక శాస్త్ర చర్చలుచేసే పండితమండలి. ధర్మసూత్రకాలంలో రాజుకు సలహాలివ్వడానికి పండిత పరిషత్తు మార్పుచెందినది.

---

* సాంఘిక గృహ్యసూత్రాలు III.

రాజు రాష్ట్రప్రతినిధిగా వ్యవహరిస్తాడు. రాష్ట్రాధికారం అతనివల్లనే వస్తుంది.

సూత్రకాలంలో సామాన్యంగా రాజరికం వంశపారంపర్యంగా సంక్రమించేది. రాజును ఎన్నుకొనేపద్ధతి వ్యవహారంలో ఉన్నట్లు నిరుక్తం చెబుతున్నది. రాజన్యులు రాజును ఎన్నుకొనేవారు అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు.

పరిపాలన పరిపాలన సాగించేనిమిత్తం రాజు ఉద్యోగులను నియమించేవాడు. పాలకవర్గానికి శీలసంపద, న్యాయదృష్టి అవసరమని ఆపస్తంబుడు వ్రాశాడు. అధిష్ఠాన పాలకవర్గానికి సహాయంగా పట్టణ జనపదాల శ్రేయమునకై ఉపపాలకవర్గం ఉండేది.

పరిపాలనకు పన్నువసూలు ముఖ్యము. వసూళ్ళకు ప్రత్యేకపు సిబ్బంది ఉండేది. ఏ వస్తువులమీద పన్నులు వేయాలో ఎంతవేయాలో అదిపట్టీగా తయారుచేయబడేది. పండితులు, యతులు, బ్రహ్మచారులు, పసివాళ్ళు, వృద్ధులు. గుడ్డిమూగ చెవిటివాళ్ళకు రోగులకూ భృత్యులకూ పన్ను లేదు.

రాజు నిత్యమూ యుద్ధసన్నద్ధుడై ఉండాలి. యుద్ధధర్మంఅంటూ ఉండడంచేత రాజు విషదిగ్ధమైన ఆయుధాలుపయోగించరాదు. శరణార్థులను వధించరాదు. శరణార్థుడు గడ్డికరుస్తూ కనబడగా అతనిని రాజు తప్పక రక్షించాలి.

గ్రామపాలనము రాష్ట్రపాలనకు నాంది. గ్రామీణులను నాలుగువర్ణాలుగా గణించవచ్చును. 1. బ్రాహ్మణ క్షత్రియులు, 2. భూస్వాములు అనగా వైశ్యులు, 3. కర్మకారులు, రథకారాదులు, 4. శూద్రులు, శ్రమజీవులు, గ్రామణి గ్రామాధికారి. యుద్ధకాలంలో సివిలు సైనిక విధులుకూడా నిర్వహించేవాడు. గ్రామణి పదవి వంశపారంపర్యంగానో లేదా రాజు ఎన్నుకొనేవాడో, గ్రామసభ ఎన్నుకొనేదో స్పష్టంగా చెప్పలేము.

స్థపతి అనే ముఖ్య న్యాయాధిపతి **Executive Judicial** వ్యవహారాలు చూచేవాడని శ్రౌతసూత్రాలు చెబుతున్నవి.

వైదికయుగ రచనకు సహాయపడిన గ్రంథాలు

1 ఐతరేయ బ్రాహ్మణము—కీత్, హార్వర్టు ఓరియంటల్ సీరీస్ 25 వాల్యూము.

2. ఆపస్తంబ ధర్మసూత్రములు—బుహ్లర్, **Bombay Sanskrit Series.**

3. అథర్వణవేదము—విట్నీ, బ్లూంఫీల్డుల ప్రతులు.

4. బృహదారణ్యకోపనిషత్.

5. ఛాందోగ్యోపనిషత్.

6. గౌతమ ధర్మసూత్రములు.

7. మైత్రాయణీయ సంహిత—ష్రోడర్.

8. ఋగ్వేదసంహిత—గీఫిత్, కాశీ, మాక్సుముల్లర్, ఓల్డెన్‌బర్గ్.

9. శతపథ బ్రాహ్మణము—Eggling. Sacred Books of the East 12, 26, XLI, XLIII, XLIV ఆక్సఫర్డ్.

10. తైత్తిరీయ బ్రాహ్మణము—Rajendralal Mitra ప్రతి.

11. తైత్తిరీయ సంహిత—వీబర్.

12. తైత్తిరీయోపనిషత్—శంకరభాష్యముతో.

13. వాజసనేయ సంహిత—వీబర్.

14. గృహ్యసూత్రములు-ఓల్డెన్‌బర్గ్ Sacred Books of the East Vols 29, 30.

15. ధర్మసూత్రములు—బుహ్లర్ S. B. E. II, XIV

ఆధునిక రచనలు

1. Macdonell–Vedic Mythology (Strassburg)

2. Macdonell—Vedic Reader (Oxford.)

3. Keith—Vedic Religion & Philosophy 2 Volumes.

4. Atharvanic Religion—Shinde.

5. History of Hindu Political Theories by Dr. U. Ghosal.

6. Vedic Age—edited by Munshi Muzundar Vol I.

7. Political History of Ancient India—Roy Chowdari, Calcutta.

8. Winternity's History of Indian literature, Cal 27.

9. History of Dharma Sastra Literature by P. V. Kane Volumes 1,2,3.

10. Marshal's Mohenjadaro 2 Volumes.

11. C. L. Wolley's "The Sumerians"

12. F. E. Pargiter-Ancient Indian Historical Traditions Oxford.

13. F. E. Pargiter-Dynastics of the Kali Age

14. Indian Paleography Dr. R. B. Pandey D. L. H. Benares Hindu University.

15. South Indian Scripts and Indian Epigraphy—C. Siva Rama Murty.

16. Indian Culture Through the Ages-R. L. Vidyarthi—Kanpoor.

17. Ancient India by Dr. R. C. Muzundar Published by Motilal Banarasidas—Benares.

మౌర్య యుగము

సామ్రాజ్యము - ఏకత్వము

క్రీ. పూ. 600 నుండి క్రీ. శ. 320.

తొలిపలుకు భారతేతిహాసంలో తొలిసారిగా రాష్ట్రమునకు రాజకీయంగా ఏకత్వము చేకూరింది. మగధ (ప్రస్తుతపు దక్షిణబీహార్) రాజ్యము రెండుశతాబ్దములపాటు మౌర్యుల ఛత్రచ్ఛాయకింద (క్రమక్రమంగా హిందూఖుష్ కొండల ఆవలనుండి తూర్పు దెస అస్సాము, ఉత్తరదిశ కశ్మీరమునుండి దక్షిణాన మైసూరుదాకా విస్తరిల్లింది.

మగధ మహాసామ్రాజ్య రాజకీయ చారిత్రక పరిణామ గతులను తిలకించినప్పుడు మహాకావ్యమువలె ఉదాత్తమైనది. ఆధ్యాత్మికశక్తి, సాత్త్వికాదర్శములు చక్రవర్తిని రక్తసిక్త హింసాపథమునుండి మరలించి మహోన్నత సామ్రాజ్యమును నిలవబెట్టగలిగినవి ! అనంతర దురాశ, మహాకాంక్ష, రాజ్య తృష్ణలు రాష్ట్రసారాన్ని పీల్చివేసినవి ! మగధసామ్రాజ్య సేనాపతి పుష్యమిత్రుడు సమయాన్నికనిపెట్టి తనప్రభువును వధించినాడు. కాని అతడు తలదాల్చినది కంటకకిరీటాన్నే ! పశ్చిమదిక్తటాన దూరాన వైదేశిక దండయాత్రల రూపంలో

కర్మఫలం గోచరమైంది. యవన, పహ్లావ, శక, కుషాణులు భారత రాజకీయ చతురంగపాళిపై పావులై కదలినవేకాని వానిజాడలు శాశ్వతంగా శేషించలేదు !

దక్షిణాపథాన ఆంధ్ర శాతవాహనీశులు వైదేశిక సేనావాహినిని రానీయలేదు. ఆర్యావర్తాన కొన్ని గణతంత్ర రాజ్యములు వైదేశికులను ప్రతిఘటించి స్వేచ్ఛా జయ పతాకలను ఎగరవేసినవి. ఈ క్లిష్టసమయములోనే మరొక్క మహాసామ్రాజ్యస్థాపనకు పునాదులు వేయడంకూడా సంభవించింది.

ఈ ద్వితీయ ఖండంలో మగధసామ్రాజ్య భానూదయాస్తమయాలు సహృదయాలను కదలించివేసే నాటక సన్నివేశాలు ! అశోకమహీవల్లభుని మానవతామాధుర్యము, యుద్ధపరాఙ్ముఖత్వంవల్ల మానవహృత్తంత్రులు మూర్ఛనలు పోయినవి !

మౌర్యసామ్రాజ్యంవల్ల భారత రాష్ట్రైక్యత లభ్యమైంది. సామ్రాజ్యం బూడిదపాలైనా సంస్కృతిమాత్రం మిగిలింది !

మౌర్యులవల్ల ప్రాప్తమైన రాజకీయైక్యత సాంస్కృతిక మైన ఏకత్వానికి కారణమైంది. యావద్భారతదేశంలో సాహిత్యాది లలితకళలలో మతములో సాంస్కృతికమైన ఏకత్వం గోచరిస్తుంది.

భరతఖండం ప్రపంచ నాగరకతకు ప్రసాదించింది షడ్దర్శనాలు, జైనబౌద్ధాది విజ్ఞానమణులను.

ఈ మౌర్యయుగంలో భాషాసాహిత్యాలూ, లలిత కళలూ వర్ధిల్లినవి. లౌకిక సంస్కృతము, ప్రాకృత భాషా భేదాలు బయలుదేరినవి. పాణిని, కాత్యాయన, పతంజలులు శబ్దశాస్త్రానికిచేసిన నిరుపమానసేవ ఏ వైదేశిక వైయాకరణులూ చేయలేదు! భారతీయ సంస్కృతికి పెన్నిధులైన రామాయణ మహాభారతములీయుగంలో ప్రసాదింపబడినవి. కౌటిల్యుని అర్థశాస్త్రము మౌర్యయుగంలో పేరెన్నికగన్నది.

మౌర్యయుగములో భారతీయ కళాచరిత్రారంభమైంది. తొలిసారిగా శిలామయ వాస్తుశిల్పము, బయలుదేరింది. కళాసృష్టిలో భారతీయ జీవన సంస్కృతులు ప్రతిఫలించినవి.

ఈ యుగములో భారతదేశానికి ఖండాంతరాలతో ముఖ్యంగా ఆసియా, సిరియా, చైనా, ఆఫ్రికా, ఐరోపా, ఇండోచైనా, తూర్పుఇండియా ద్వీపాలతో సాంస్కృతిక సంబంధం ఏర్పడి, క్రమంగా మనదేశము భరతవర్షమైంది.

భారతభూమిలో యవన పహ్లవ శక కుషాణాది వైదేశికు లవతరించినా కాలక్రమేణ భారతీయులైనారు. దీనినిబట్టి హిందూసమాజానికి ఎంత సహనశీలమున్నదో తెలుస్తున్నది. వర్ణాశ్రమ ధర్మమనే సంకుచిత దృక్పథం తొక

పోవడంచేత భిన్నసంస్కారంగల వైదేశికులనుగూడా భారతీయులు తమలో చేర్చుకొన్నారు. ఈ సహనశీలము, సమన్వయ దృష్టిగలవాళ్ళు భారతీయులు కావడంవల్ల, అనాటి హైందవ సమాజవ్యవస్థ సజీవమై, కాలగతివచ్చిన నూతన పరిస్థితులను అనుసరించి అభ్యుదయ పరంపరాభివృద్ధి పొందుతూవచ్చింది! ప్రాచీన వైదిక విశ్వాసాన్ని ప్రతిష్ఠ టిస్తూ బౌద్ధజైనాలు తెచ్చిన విప్లవంవల్ల సనాతనమతంలో ఆస్తిక వైష్ణవశైవాలుకూడా చేరినవి. అప్పుడేర్పడిన విశాల బ్రాహ్మణమతము నవీన హైందవధర్మానికి ప్రాతిపదికఅయిన దీయుగంలోనే!

క్రీ. పూ. 6 వ శతాబ్దినాటి ఉత్తర భారతదేశము

షోడశ మహాజనపదాలు

ఉత్తర భారతదేశములో క్రీ. పూ. ఆరవ శతాబ్దములో ఏకచ్ఛత్రాధిపత్యంగల ప్రభువులేదు. దేశము స్వతంత్ర రాష్ట్రాలుగా విభక్తమైంది. అంగుత్తర నికాయమనే బౌద్ధ గ్రంథమునుబట్టి బుద్ధజననానికి పూర్వం "షోలస మహాజన పద" ములుండేవని తెలుస్తున్నది. అంగ, మగధ, కాశీ, కోసల, వజ్జి, మల్ల, చేది, వత్స, కురు, పాంచాల, మత్స్య, శూరసేన, అశ్మక, అవంతి, గాంధార, కాంభోజములు పద హారు జనపదములు. ప్రజలపేర్లనుబట్టి దేశనామం ఏర్పడింది. కాంభోజప్రజలదేశము కాంభోజము. దీఘనికాయమనే

బౌద్ధగ్రంథమువల్ల కొన్ని జనపదాలు జంటలై ఉండేవని గ్రహించవచ్చును. జంటలైన జనపదాలు :—1. కాశీ కోసలములు, 2. వజ్జి మల్ల, 3. చేది వత్స, 4. కురు పాంచాలములు, 5. మత్స్య శూరసేనములు.

రాజరికములేని గణరాజ్యాలుండేవి. పురాణములు గణరాజ్యములనుగురించి సూచించలేదు. సూచించక పోయినప్పటికి క్రీ. పూ. 6 వ శతాబ్దములో గణరాజ్యములు భారత రాజకీయ చరిత్రలో విశిష్టమైనవి. అటువంటి గణ రాజ్యాలు :—

1. కపిలవస్తు రాజధానిగాగల శాక్యులు.
2. పావా కుసీనర రాజధానులుగల మల్లులు.
3. వైశాలి రాజధానిగల లిచ్ఛవులు.
4. మిథిల రాజధానిగాగల విదేహులు.
5. రామగ్రామము రాజధానిగల కోలీయులు.
6. ఆలకప్పములోని బులులు.
7. కేసపుత్తలోని కాలములు.
8. పిప్పలీవనములోని మోరియులు.
9. శింశుమార పర్వత ప్రాంతీయులైన భగ్గులు.

బౌద్ధగ్రంథము లుదహరించిన అంశాలు పాణిని తన 'అష్టాధ్యాయి' లో గణ లేక సంఘరాజ్యాలను, జన పదాలను పేర్కొన్నాడు. పాణిని ఉల్లేఖించిన ప్రముఖ గణ

రాజ్యాలు :—1. క్షుద్రకులు, 2. మాళవులు, 3. అంబష్ఠులు, 4. హస్తినాయనులు, 5. ప్రకణ్వులు, 6. మద్రులు, 7. మధుమంతులు, 8. అగ్రీతులు, 9. వసాతులు, 10. భగ్గులు, 11. శిబులు, 12. ఆశ్వాయనులు, 13. ఆశ్వకాయనులు.

పాణినిపేర్కొన్న జనపదాలు 1. గాంధారము, 2. అవంతి. 3. కోసలము, 4. ఉసీనరము, 5. విదేహము, 6. మగధ, 7. అంగ, 8. వంగ.

గణజనపదాలప్రస క్తి మెగాస్తనీసు 'ఇండికా' అనే గ్రంథములోనూ, కౌటిల్యుడు తన అర్థశాస్త్రములోనూ, క్రీ. శ. 4 వ నాటి శిలాలేఖనాల్లోనూ కనబడుతున్నది. బౌద్ధులు ఈ రాజ్యాల విషయము సందర్భవశాత్తు తమ గ్రంథాల్లో ఉల్లేఖించినారు. అయితే ఆ గ్రంథాలు మగధ రాజ్యవిషయం మినహాయిస్తే తక్కినరాజ్యాలచరిత్ర సమగ్రముగా ఇవ్వడంలేదు.

అంగరాజ్యము నేటి భాగల్‌పూర్, మాంఘీరులున్నప్రాంతం ప్రాచీన అంగరాజ్యము. దాని ముఖ్యపట్టణం చంపానగరం. ఇది వాణిజ్యకేంద్రంగా ప్రసిద్ధం. వణిజులు చంపానగరంనుంచి సువర్ణభూమికి (నేటి సుమత్రా) నౌకాయానం చేసేవారు. మగధరాజ్యానికీ అంగరాజ్యానికీ వైరంఉండేది తరతరాలుగా. చివరకు అంగరాజ్యం ఓడిపోయి మగధరాజ్యంలో లీనమై పోయింది.

కాశీరాజ్యము దీని రాజధాని వారణాసి. వరుణ – అసి అనే రెండునదుల మధ్యప్రదేశమే కాశి. కాశీరాజుకూ కోసల ప్రభువుకూ వైరముండేది, ఒకరినిమించి ఒకరు విజేతలు కావాలని. కాశీ అంగరాజ్యాలమధ్య పొత్తులేదు. తుదకు బుద్ధునికి పూర్వమే కాశీరాజ్యం కోసలనరపతికి వశమై పోయింది.

కోసలము నేటి ఔధ్ ప్రాచీన కోసలము. ఈ ప్రాంతములో శ్రావస్తి, సాకేత, అయోధ్యానగరాలున్నవి. కోసలరాజు కాశీని జయించడంవల్ల బలవంతుడైనాడు. రాష్ట్రము సుప్రతిష్ఠితమైంది. ప్రసేనజిత్తుడనే కోసలప్రభువు, బుద్ధునికి సమకాలికుడూ కోసలీయులు శాక్యులపై ఆధిపత్యం వహించి నారు. కోసలేశ్వరుడు మగధరాజైన అజాతశత్రువుతో పోరు సాగించినాడు. ప్రసేనజిత్తుకు బుద్ధునిమీద ప్రీతిఎక్కువ. వీరిద్దరిమధ్య జరిగిన ప్రసంగాలు బౌద్ధగ్రంథాల్లో నిక్షిప్తమైనవి. బుద్ధబోధామృతం స్వీకరించి బౌద్ధుడైన కోసలరాజు ప్రజాశత్రువైనాడు. అతడు అజాతశత్రుని సాహాయ్యం అర్థించినాడు. చివరకు అతనిబతుకు బద్దలై పోయింది. బౌద్ధ గ్రంథాల్లో ప్రసేనుడు ప్రముఖుడుగా ఉన్నాడు.

వజ్జులు (లిచ్ఛవులు) వీరి రాజధాని వైశాలి. ఇది ఉత్తర బిహార్‌లోని బసారా. ఈ నగరం మహాసంపన్నమైనది. లిచ్ఛవులు వైదేశికులని కొందరిమతం. కాని అది సరియైనది

కాదు. వారు క్షత్రియులు. కోసలీయులకూ లిచ్ఛవులకూ నేస్తండుండేది. కాని మగధకూ లిచ్ఛవులకూమధ్య వైరాగ్ని ప్రజ్వరిల్లుతూ ఉండేది. మహావీర, బుద్ధులకాలములో లిచ్ఛవులు తమ ప్రాభవము నెలకొల్పుకొన్నారు.

మొదట లిచ్ఛవులకు రాజరికం ఉండేది. తరువాత వారు గణరాజ్యం ఏర్పాటుచేసికొని, ఆర్యావర్తములోని రాజ్యాలకు తలమానికమైనారు. లిచ్ఛవులు తక్కిన గణ రాజ్యాలను ఏకముచేసి మగధసామ్రాజ్యాన్ని ప్రతిఘటించ డానికి రాజకీయ సంయుక్త సమాఖ్యను సమాయత్త పరచి నారు. మొదట లిచ్ఛవులు మల్లులతోకలిసి, మగధరాజైన బింబిసారుని ఎదిరించగా అతడు లిచ్ఛవులతో శాంతిసంధి చేసికొన్నాడు; లిచ్ఛవీ రాజపుత్రిని వివాహము చేసి కొన్నాడు. ఈ వైవాహిక సంబంధంవల్ల క్రమంగా లిచ్ఛ వులు క్షీణించి నశించినారు. బౌద్ధసాహిత్యంలో లిచ్ఛవీ గణరాజ్యోపన్యాసం వస్తున్నది.

మల్లులు వీరిలో తొమ్మిది వంశాలవారున్నారు. బౌద్ధ మత మవలంబించినప్పుడు మల్లులు శక్తివంతులైనారు. వారిరాజధానులు కుశీనరము, పావానగరము. మనుస్మృతి ప్రకారము మల్లులు వ్రాత్య క్షత్రియులు. వీరిది మొదటరాజరిక ప్రభుత్వము. తరువాత గణతంత్రరాజ్య మేర్పాటు చేసికొన్నారు. వీరి సంఘములో సభ్యులందరినీ రాజులని పిలిచేవారు. మల్లులు లిచ్ఛవులతోకలిసి ఏకకుటుంబమైనారు. ఆత్మరక్షణకోసం

అలాఅయినారు. మల్లులు బుద్ధనిర్వాణందాకా స్వతంత్రులుగా ఉండేవారు. అందరూ బౌద్ధులే. బుద్ధనిర్వాణానంతరం మల్లులరాజ్యం మగధసామ్రాజ్యంలో లీనమైపోయింది.

చేది ఈనాటి బుందేలుఖండమే చేదిరాజ్యము. చేది వంశీయ శాఖ కళింగములో వేరేరాజ్యము స్థాపించుకొన్నారు. ఈ విషయము ఖారవేలుని హత్తిగుంఫా శాసనంవల్ల విదితం.

వత్సరాజ్యము దీనికి రాజధాని కౌశాంబి. (నేటికోసం, అలహాబాదు ప్రాంతము) బుద్ధుని సమకాలికుడైన ఉదయనుడు రాజు. అతని కుమారుడు బోధి. సంస్కృత సాహిత్యంలో వత్సరాజు ప్రసిద్ధుడు.

కురురాజ్యము దీనిరాజధాని ఇంద్రప్రస్థము. కురులు ఆధ్యాత్మిక విజ్ఞానసంపన్నులని ఉపనిషత్తులవల్ల తెలుస్తున్నది. కురులు పాంచాలురతోకలిసి ఏకకూటమైనారు. మొదట వీరికి రాజరిక ప్రభుత్వం ఉండేది; తరువాత గణతంత్ర రాజ్యమైనది.

పాంచాలము ఢిల్లీకి ఈశాన్యదిశలో ఉండేది. దీని రాజధాని అహిచ్ఛత్రము. దక్షిణపాంచాలమునకు రాజధాని కాంపిల్యం. కాన్యకుబ్జము పాంచాలములోనిదే. తొలుత రాజరికం, అనంతరం గణతంత్రరాజ్యమైంది.

మత్స్యరాజ్యము ప్రస్తుతపు జయపూర్, ఆళ్వార్, భరతపూర్ ప్రాంతం మత్స్యరాజ్యం. దీనిరాజధాని విరాటనగరం (నేటి బైరాట్). మత్స్యులకు రాజకీయ ప్రాభవం చెప్పదగినంతలేదు.

శూరసేనము దీని రాజధాని యమునాతీరస్థమైన మధుర. పాణిని అష్టాధ్యాయిలో మధురపాలకులయిన అంధక వృష్ణులను గురించి ప్రస్తి తెచ్చినాడు. వృష్ణులు తనుసంఘము స్థాపించారు. వాసుదేవకృష్ణుడు 'సంఘముఖ్యుడు.' వీరికి వేరేనాణెములుండేవి. మధుర కృష్ణారాధనకు కేంద్రంగా ఉండేది. మగధరాజ్యంలో శూరసేనము కలిసిపోయింది.

అశ్మకరాజ్యము హైదరాబాద్ ప్రాంతంలో గోదావరీతీరాన ఉన్నది. 'సుత్తనిపాత' నుబట్టి అశ్మక మూలక పట్టణాలు ఆంధ్రదేశంలోనివే.

అవంతి పాళీగ్రంథాలనుబట్టి బుద్ధుని సమకాలికుడైన చండ ప్రద్యోతు డుజ్జయినీప్రభువు. ఉజ్జయినీ మాహిష్మతులు రాజధానులు. ప్రద్యోతునికాలములో వత్స, మగధ, కోసల రాజ్యములమధ్య స్పర్ధ రగులుతూ ఉండేది. అవంతీ ప్రభువులలో కడసారివాణ్ణి శిశునాగుడోడించినాడు. మగధలో అవంతిరాజ్యము లీనమైపోయింది. ఉజ్జయిని బౌద్ధానికి ఆటపట్టుగా కొంతకాలం ఉండేది.

గాంధారము ప్రస్తుతపు పెషావరు రావల్‌పిండి మండలాలు ప్రాచీన గాంధారము. దాని ముఖ్యపట్టణము తక్షశిల. మగధ రాజైన బింబిసారుని సమకాలీనుడైన పుష్కరసాది క్రీ. పూ. 6 వ శతాబ్దములో గాంధారపాలకుడు. అత డవంతీరాజుతో కయ్యానికి కాలుదువ్వినాడు.

కాంభోజము వాఙ్మయములోనూ అశోక శాసనాల్లోనూ సర్వ సామాన్యంగా కాంభోజాన్ని గాంధారంతో జతపరుస్తూ ఉల్లేఖించినారు. పాకీస్తానంలో వాయువ్యసరిహద్దుప్రాంతంలో హజరామండలమే కాంభోజము. మొదట ఆ రాజ్యంలో రాజరికం ప్రచలితమైంది. కౌటిల్యునికాలానికి కాంభోజంలో సంఘప్రభుత్వము ప్రతిష్ఠితమైనది.

స్వతంత్ర గణరాజ్యాలు 1. శాక్యరాజ్యానికి కపిలవస్తు రాజధాని. శాక్యులు భారతీయేతరులని వైదేశిక పండితాభిప్రాయము. జయస్వాలు పండితుడు వారిని భారతీయ క్షత్రియులని "Hindu Polity" అనే గ్రంథములో సోపపత్తికముగా నిరూపించినాము. రాజకీయంగా యీ రాజ్యానికి విశిష్టతలేదు. కోసలపాలకుని ఆధిపత్యాన్ని శాక్యులంగీకరించారు. వీరు సూర్యవంశీయులైన ఇక్ష్వాకులు.

2. కోలీయులు శాక్యులకు పొరుగున ఉండేవారు. వీరి రాజధాని పిప్పలీవనము. కోలీయుల చరిత్ర విశేషంగా తెలియదు. మోరియులే మౌర్యులు. వీరు మగధను పాలించిన వారు. రాజధాని కుసీనగరానికి పశ్చిమదిశలో ఉండేది.

లిచ్ఛవ శాక్యుల గణరాజ్య పరిపాలనా విశేషాలు మున్ముందు వివరణచేస్తాను. కొద్దిమాటల్లో చెబితే ఈ రెండు గణాలకూ కేంద్ర ప్రజాసభ అధిష్ఠాన పాలకవర్గం. రాజ్య వ్యవహారాలు చర్చించేనిమిత్తం పిన్నపెద్దలు పాల్గొనేవారు.

ఈ గణరాజ్యాలకు మొదట్ రాజరిక ప్రభుత్వము ఉండేది. మెగాస్తనీసు వచనాన్నిబట్టి "రాజరికంపోగా ప్రజాస్వామికం నగరాల్లో స్థాపితమైంది." రాజరికంమారి ప్రజాప్రభుత్వము రూపొందడము గ్రీసుదేశములో ఉండేది.

రాజరికం తొలగిపోవడానికి కారణము పాలకుల నిరంకుశత్వము. రాజులు దేవాంశసంభూతులు. వారి అధికారం. దైవదత్తమనే తత్వాన్ని ప్రజలు ప్రతిఘటించి, స్వయంగా పరిపాలన చేసికోగలిగినారు.

జైన బౌద్ధాలు ప్రజాస్వామిక రాజకీయ తత్వాన్ని సంపూర్ణముగా సమర్థించినవి. ఆ మతాలకు అభ్యుదయం గణరాజ్యాల్లోనే సంభవమైంది. జైన బౌద్ధ సంఘనిర్మాణము కూడా ప్రజాస్వామిక తత్త్వంమీదనే జరిగింది. ఆ మతాభ్యుదయానికీ, స్వతంత్రయోచనకూ గణరాజ్యాలు దోహదము చేసినవి. దురదృష్టవశాన మగధసామ్రాజ్యంవల్ల ప్రజాస్వామికం క్షీణించిపోయింది. సామ్రాజ్యం గణరాజ్యాలను కబళించింది.

మగధ సామ్రాజ్యోదయము

పురాణములు - బౌద్ధసాహిత్యము క్రీ. పూ. 6 వ శతాబ్దములోఉన్న రాజ్యాలలో మగధమాత్రమే సర్వాధిపత్యం వహించి, ఏకచ్ఛత్రంక్రిందికి తక్కినరాజ్యాలను తీసికొనరాగలిగింది. మగధ రాజ్య ప్రాభవాన్నిగురించి ఏకాభిమతాన్ని ఇస్తున్నవి బౌద్ధ

ైన పురాణాదులు. మగధరాజ్యచరిత్ర కొంత విశదంగా అనగా పాలకుమ, అతనిపాలనాకాలము, అతని విజయ పరం పర మొదలైనవి పురాణ బౌద్ధగ్రంథాలు తేట తెల్లము చేస్తున్నవి. తక్కిన రాజ్యములనుగురించి ఈ గ్రంథాలు విశేషంగా చెప్పలేదు.

పురాణాలలో ఉల్లేఖింపబడిన చారిత్రక విషయాలు బౌద్ధగంథాలను, ముఖ్యంగా మహావంసోను ఆధారంచేసి వ్రాస్తున్నాను.

నందులకు పూర్వం రాజనామావళి బింబిసారుమ, అజాతశత్రువు, ఉదయభద్రుడు, అనురుద్ధుమ, ముండుమ, నాగదాసకుడు, శిశునాగుడు, కాలాశోకుమ (కాకవర్ణుడని అశోకావదానము) కాలాశోకుని పదిమంది కుమాళ్ళు.

పురాణాలనుబట్టి రాజనామావళి 1. శిశునాగుడు, 2. కాకవర్ణుడు, 3. క్షేమధర్ముడు, 4. క్షత్రౌజుడు, 5. బింబిసారుడు, 6. అజాతశత్రువు, 7. దర్శకుడు, 8. ఉదాయినుడు, 9. నంది వర్ధనుడు, 10. మహానంది.

బింబిసారుడు క్రీ. పూ. 544—493. మహావంసోనుబట్టి బింబి సారుడు పట్టాభిషిక్తు డయ్యేసరికి పదిహేనేళ్ళవాడు. దీనివల్ల అతను వంశస్థాపకుడు కాడని తెలుస్తున్నది. డాక్టర్ భండార్కర్ మతాన్నిబట్టి బింబిసారుడు సేనియ లేదా శ్రేణిక బింబిసారుడు. వజ్జులకు బింబిసారుడు సేనాపతిగా

ఉండవచ్చును. మగధ వజ్జుల హస్తగతమై ఉండేది. అయితే మహావంసోలో చెప్పినదానికీ, భండార్కరు మతానికీ వైరుధ్యంఉంది. భండార్కరు ఉద్దేశ్యము బింబిసారుడు శిశు నాగవంశీయుడు. బుద్ధచరిత్రనుబట్టి అతడు హర్యంక కులోద్భవుడు.

అతని కుటుంబము 'మహావగ్గ'నుబట్టి అతనికి అయిదువందల మంది భార్యలుండేవారు. సంఖ్యకేమిగాని అతని రాజకీయ జీవితానికి దోహదమిచ్చినవి. వైవాహిక సంబంధాలన్నది నిజం. అతని పట్టమహిషి కోసలేశ్వరపుత్రిక. అల్లుడికి అరణంగా ఆయన కాశీపట్టణపు శిస్తు వసూలుచేసికొని, ఆ రాజ్యం అనుభవించమని ఇచ్చినాడు. ఆయన ద్వితీయ భార్య లిచ్ఛవీరాజపుత్రిక. తృతీయభార్య విదేహరాజపుత్రి. చతుర్థభార్య మద్రరాజపుత్రి ఖేమాదేవి.

బింబిసారునికి చాలామంది పుత్రులుండేవారు. మాతా మహుల ప్రోద్బలంచేత రాజకుమారులు తరుచుగా రాజ కీయంగా చిక్కులు తెస్తూఉండేవారు.

బింబిసారుని రాజధానీనగరం గిరివ్రజం. అనగా రాజగృహం. మహాగోవిందుడనే ఇంజనీయరు నగరనిర్మాణం చేసినాడు. రాజప్రాసాదాన్ని కట్టించినాడు.

బింబిసారుడు సంపన్నమైన అంగరాజ్యం జయించి మగధరాజ్యాన్ని విస్తరింపజేసినాడు. చంపానగరంలో తన

కుమారుణ్ణి కుణికుణ్ణి రాజప్రతినిధిగా చేసినాడు. అతడు అంగకాశీరాజ్యాలు సంపాదించిన పిమ్మట మగధ విస్తృతమై భావి మహాసామ్రాజ్య నిర్మాణానికి అవకాశము కలిగింది. గాంధార మద్రరాజ్యాలతో సంబంధం ఏర్పడింది. అవంతీ పాలకుడైన ప్రద్యోతునితో నేస్తంకలిగింది. వైవాహిక బాంధవ్యంవల్ల అతని రాజ్యతంత్రానికి ప్రోద్బలంకలిగింది.

అతని పరిపాలన - బౌద్ధగ్రంథాలు వినయపిటకంలో (7.3వ) బింబిసారుని పరిపాలనాపద్ధతి కనబడుతున్నది. గ్రామసభలు గ్రామాలను పరిపాలించేవి. గ్రామసభకు ముఖ్యుడు గ్రామకుడు. మహావగ్గనుబట్టి గ్రామీణసభలో 80,000 సభ్యులుండేవారు. మహామాత్రులనే మూడురకాల ఉద్యోగులుండేవారు. 1. సబ్బాత్థకుడు. సమస్త వ్యవహారాలూ చూచేవాడు. 2. న్యాయనిబంధనలు, చట్టవిషయాలను చూచేవాడు. వోహారికుడు. 3. సేనాధిపతి. ఆనాటి శిక్షాస్మృతినిబట్టి దోషికి కారాగారవాసము, అంగచ్ఛేదము మొదలైన దండనలు విధింపబడేవి. బింబిసారుడు పరిపాలనా సామర్థ్యం కలవాడని బౌద్ధగ్రంథాలవల్ల తెలుస్తుంది.

బింబిసారుడు - బౌద్ధము జైన బౌద్ధగ్రంథాలు బింబిసారుని తమ తమ మతానుయాయిగా చెబుతున్నవి. అతడు మహావీరుని దర్శనార్థం సకుటుంబ సపరివారంగా వెళ్ళినట్లు "ఉత్తరాధ్యయన సూత్ర"ములో ఉల్లేఖింపబడింది. సుత్తనిపాతలో (408) బింబిసారుడు బౌద్ధుడని ఉన్నది.

బింబిసారుని బుద్ధదర్శనం తొలిసారిగా అతడు గౌతముని గిరివ్రజంలో సమావేశమైనాడు. అప్పటికింకా బుద్ధత్వము రాలేదు గౌతమునికి. రెండోసారి మగధేశ్వరుడు జ్ఞానోదయం కలిగిన బుద్ధుణ్ణి రాజగృహానగరంలో సందర్శించినాడు. బుద్ధునివెంట బ్రాహ్మణసన్యాసులు, కాశ్యపులూ జటిలులు వేయిమంది వెళ్ళుతూ తమగురువుగా ఉచ్చైర్నినాదాలు చేసినారు. వెంటనే బింబిసారుడు బౌద్ధం స్వీకరించినాడు. రాజు బుద్ధుణ్ణే ఆయన శిష్యకోటినీ రాజప్రాసాదంలో విందుకు పిలిచినాడు. తానే స్వయంగా అందరికీ వడ్డించినాడు. వినయ పిటకంలో (1.39) భాగాన్నిబట్టి ప్రభువు బౌద్ధసంఘానికి వేణువనం కానుకగా సమర్పించినాడు. మహిషిఖేమాదేవి బౌద్ధ ధర్మనిష్ణాతకావడంచేత ఆమె రాజుకు ధర్మోపదేశం చేసిందని "సంయుత్త నికాయము" చెబుతున్నది.

బింబిసారుని అవసానం - బౌద్ధగ్రంథాలు బౌద్ధ సంప్రదాయాన్నిబట్టి బింబిసారుడు కుమారుడైన అజాతశత్రుని చేతుల్లో అసువులు కోలుపోయినట్లు తెలుస్తున్నది. బుద్ధుని జ్ఞాతి, దేవదత్తుడనే వాడు దుర్మార్గుడు, ఈర్ష్యాళువు. అతడజాతశత్రువును ప్రోద్బలంచేయగా తండ్రిని అతడు వధించినాడని ఉల్లేఖింపబడింది. అజాతశత్రువు "రాజ్యంకోసం త్వరపడి తండ్రిని వధించాను. ఘోరపాపుణ్ణి" అని బుద్ధదేవుణ్ణి వేడుకొన్నట్లు వినయపిటకము, దీఘనికాయము, సుమంగళ విలాసినీ వ్యాఖ్యలవల్ల విదితమవుతున్నది.

జైనగ్రంథాలు - అతని జీవితాంతము జైనసంప్రదాయాన్నిబట్టి అజాత శత్రువు తండ్రినివధించలేదు. సింహాసనంకోసం తపించి తండ్రిని చెరలో పెట్టినాడు. అయితే అంతఃపూర్వమే బింబిసారుడు కుణికుణ్ణి యువరాజుగా ప్రకటించినాడు. అజాతశత్రువు గదా ప్రహారంతో జనకుని శృంఖలాలు ఛేదించబోగా కుమారుడు తనను చంపవస్తున్నాడనితలచి బింబిసారుడు విషపానంచేసి శరీరం చాలించినాడు. జైన ఆవశ్యక సూత్రాలవల్ల ఈ విషయము తెలుస్తున్నది.

అజాతశత్రువు క్రీ. పూ. 493—462. అజాతశత్రువు నిజ విజయ పరంపరలవల్ల మగధసామ్రాజ్యమును విస్తరింప చేసినాడు. కోసలేశ్వరునితో యుద్ధము చేసినాడు. చివర కతడు కోసలాధిపతితో సంధిచేసికొని కాశీగ్రామాన్ని తిరిగి సంపాదించినాడు. ప్రసేనజిత్తు కుమారిని తజిరాను అజాత శత్రువుకిచ్చి పెళ్లి చేసినాడు.

సామ్రాజ్యము - గణతంత్ర సంయుక్త ప్రతిఘటనము జైన భగవతీ సూత్రాలవల్ల అజాతశత్రువు విజేతగా తెలియవస్తున్నది. ప్రాగ్భారతదేశంలో సమాయత్తమైన వివి గణతంత్రరాజ్యాల రాజకీయ సంయుక్త ప్రతిఘటనను మగధరాజు అజాతశత్రువు విచ్ఛేదము చేయగలిగిన రాజతంత్రజ్ఞుడు. ఈ గణతంత్ర రాజ్యకూటంలో ఉన్న రాజ్యాలు :—9 మల్లులు, 9 లిచ్ఛవీ గణాలు, 18 కోసల కాశీగణాలు.

ప్రజాశక్తి ఉత్తర భారతదేశంలో మగధ సామ్రాజ్యాధిపత్యాన్ని ప్రతిఘటించడానికి ప్రజాశక్తులు ఏకోన్ముఖమైనవి. గణరాజ్యాలన్నింటిలో లిచ్ఛవులు పటిష్ఠులు. వారు ప్రజాశక్తులను సంఘటితంచేసి మగధసామ్రాజ్య వినాశనం చేయడానికి మహోయత్నం చేసినారు. సామ్రాజ్య వ్యతిరేకత, ప్రజాశక్తి విజృంభణం క్రీ. పూ. 493—462 లో కాన వస్తున్నది. అజాతశత్రువు గణరాజ్యాల నాయకత్వం వహించిన లిచ్ఛవులను జయించడంచేత గణతంత్రరాజ్యాల సంయుక్తప్రతిఘటనం విచ్ఛిన్నమైపోయింది.

బుద్ధునిపాత్ర - ప్రజాశక్తి ప్రజాశక్తిని అజాతశత్రువు ఎలానాశనం చేసినాడో ఏరాజకీయతంత్రం ప్రయోగించినాడో గమనించవలసి వుంటుంది. గణరాజ్యాలలో బలిష్ఠమైన లిచ్ఛవీరాజ్యమును జయించడం అసాధ్యమని మగధచక్రవర్తి గ్రహించినాడు. లిచ్ఛవులేకాక కాశీ కోసల నరపతులుకూడా శత్రువులైనారు. యావద్భారతదేశాన్ని పాలించేది సామ్రాజ్యశక్తి లేదా ప్రజాశక్తి అవుతుందా అనే సమస్య బయలుదేరింది. దేశంలో ప్రజాస్వామికం నాశనోన్ముఖమైనప్పుడు బుద్ధదేవుని వంటి నిర్లిప్తజ్ఞానమూర్తికూడా తటస్థంగా ఉండక, దేశసేవ విధ్యుక్తధర్మంగా భావించి రాజకీయాల్లో పాల్గొన్నాడు.

బుద్ధుడు ప్రజాతంత్రరాజ్యంలో జన్మించి, గణతంత్ర రాజ్యాలకు అగ్రగామిగావున్న లిచ్ఛవీ ప్రజారాజ్యానికి తన సహాయసంపత్తి నిచ్చినాడు. "తరుచుగా సంపూర్ణ సమా

వేశాలు జరుగుతూ, ప్రజాసభలో సభ్యులు సామరస్యంతో మెలగుతూ పరిపాలన సాగిస్తున్నప్పుడు, విప్లవవిధానాలు పాటించనప్పుడు, ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరిస్తూ, గణములో పెద్దలనూ, ప్రాచీన సంస్థలనూ, భక్తులనూ, స్త్రీలనూ గౌరవిస్తున్నప్పుడు" గణతంత్ర రాజ్యప్రతిష్ఠతను అజాతశత్రువువంటి చక్రవర్తికూడా నాశనం చేయలేడని బుద్ధుడు మాగధుడైన ఉద్యోగితో చెప్పినాడు.

ప్రజాశక్తి విచ్ఛేదన - భేదోపాయము లిచ్ఛవులను పరాజితులను చేసే నిమిత్తం వారి అంతరాంతరైక్యమును పాడుచేయదలచినాడు అజాతశత్రువు. ఇందునిమిత్తం వర్షాకరుడనే మంత్రిని వైశాలికి పంపి లిచ్ఛవులలో భేదంపుట్టించే విషబీజాలు చల్లించినాడు. వారిఐక్యము విచ్ఛిన్నంకావడానికి మూడేళ్ళు పట్టింది. లిచ్ఛవులలో ధనిక దరిద్రభేదం, బలవంతులు బలహీనులనే తారతమ్యం, వర్ణభేదం, అసహనం, ఈర్ష్యాది దుస్వభావాలు పెరిగిపోయినవి. శత్రునాశనానికి అనువైన కార్యరంగం అజాతశత్రువు ఏర్పాటు చేసుకొన్నాడు.

పాటలీపుత్ర నిర్మాణము నిశ్శేషంగా శత్రునిర్మూలనం చేయ దలచుకోలేదు చక్రవర్తి. అటువంటి ప్రయత్నంవల్ల తనకే ముప్పువస్తుందని తెలుసును. అందుకుగాను కావలసిన సేనను సమాయత్తం చేయించినాడు. యుద్ధరంగానికి రాజగృహం అనుకూలంగాలేదు ; శత్రురాజధానియైన వైశాలికి దూర

మైంది. అందుకోసం గంగా శోణానదుల చేరికవద్ద పాటలీ పుత్రమనే నూతన రాజధానీనగరం నిర్మించినాడు అజాత శత్రువు. నగర నిర్మాణం పూర్తి అయినతదుపరి, మగధ చక్రవర్తి బుద్ధుణ్ణి విందు కాహ్వానించినాడు. రాజమందిర ద్వారమునకు "గౌతమ హజార" మని పేరుపెట్టినాడు.

పాటలీపుత్రములో కోటకట్టడం ముగిసిన వెంటనే అతడు వైశాలిపై దండయాత్ర చేసినాడు. ఆ సైనికఘాటిలో విశేషాలు జైనగ్రంథాల్లో ఉన్నవి. మాగధులకూ లిచ్ఛవులకూమధ్య పదహారేళ్ళు సమరం సాగింది క్రీ. పూ. 484 నుంచి క్రీ. పూ. 463 దాకా. మగధసామ్రాజ్యశక్తికి ఘన విజయము లభించింది! ప్రజాశక్తి రూపుమాసింది!

అజాతశత్రువు - బౌద్ధధర్మము అజాతశత్రువు బుద్ధునికి మొదట శత్రువై, అంతంలో బౌద్ధుడైనాడు. దేవదత్తుని ప్రేరేపణవల్ల అతడు బుద్ధదర్శనం చేసిన వెంటనే బౌద్ధస్వీకారము చేసినాడు. ఈ సన్నివేశం క్రీ. పూ. 2 వ శతాబ్దినాటి భార్హత్ శిల్పాలలో చిత్రింపబడింది. "అజాతశత్రువు బుద్ధునకు నమస్కరిస్తున్నాడు" అనే శాసనంకూడాఉంది.

చైత్రనిర్మాణము అజాతశత్రువు పితృహంతకనుక అతని అంతరాత్మ వేగిపోయింది. నిగ్గంధనట పుత్రుడైన మహావీరునిబోధ ఆయనకు తృప్తినీయలేదు. ఆయన బుద్ధుణ్ణి అర్థించగా మనసులో పరివర్తన కలిగింది. అజాతశత్రువు బుద్ధనిర్వాణ

వార్తవిని చెమ్మగిల్లిన నయనాలతో వడివడిగా కుసీనర గ్రామం బుద్ధాస్తికలకోసం ప్రతినిధిని పంపినాడు. "ప్రభువు క్షత్రియుడు. నేను క్షత్రియుణ్ణి. అస్తికలను పంచు నానిమిత్తం. నేనూ అర్హుణ్ణి. ఆయన చైత్రనిర్మాణంచేసి వించు చేస్తాను." బుద్ధుని ప్రధానశిష్యుడైన మహాకాశ్యపుడు మొదట బుద్ధధాతువులూ అస్తికలూ ఎనిమిదివందలమందికి పంచిపెట్ట వలెనని అనుకొన్నాడు. అయితే మనసుమార్చుకొని అజాత శత్రువు బుద్ధారాధకులలో అగ్రేసరుడనితలచి, ధాతువులలో అస్తికలలో ఎక్కువపాలు ఆయనకిచ్చివేసినాడు. అజాత శత్రువు రాజగృహానగరంలో ధాతునిక్షిప్తంచేసి చైత్య నిర్మాణము కావించినట్లు "మహాపరి ..నిబ్బానసుత్త" వ్యాఖ్యవల్ల తెలుస్తున్నది.

అజాతశత్రుని తరువాతివారు క్రీ. పూ. 462–430. బౌద్ధగ్రంథాలవల్ల అజాతశత్రుని తరువాత మగధసింహాసనం అధిష్ఠించిన నలుగురు రాజులూ పితృహంతలని తెలుస్తున్నది. యాభై ఆరేళ్లపాటుపితృ ఘాతలపరిపాటనతో ప్రజలు విసిగి వేసారి, మంత్రి శిశునాగుని ప్రభువుగా ఎన్నుకొన్నారని 'కనాకోశము' చెబుతున్నది. జైనపరిశిష్ట పర్వాన్నిబట్టి 'అజాతశత్రువు తరువాత' ఉదయ భద్రుడు రాజైనాడు. రాజుకాకపూర్వం చంపానగరంలో రాజప్రతినిధిగాఉండి, తండ్రిమెడల భక్తిగౌరవాలు చూపే వాడు. మంత్రిమండలి ఉదయభద్రుని ఎన్నుకొన్నతరువాత అతడు కుసుమపురం నిర్మించినాడట. అతడు జైనుడనీ, జైన

చైత్యనిర్మాణముచేశాడనీ అవశ్యక సూత్రాలవల్ల తెలుస్తున్నది. అతనిని అవంతీ ప్రభువైన ప్రద్యోతుడు చంపించినట్లు కథాసరిత్సాగరం (II, 484) వల్ల గ్రహించుకోవచ్చును. ఉదయభద్రుని అనంతరం అనురుద్ధుడు, అతని తరువాత ముండుడు సింహాసనం అధిష్ఠించినవారు. ముండుని తరువాత నాగదాసకుడు (పురాణములలో దర్శకుడు) మగధ రాజైనాడు. దర్శకుడు భాస మహా కవికృత స్వప్న వాసవదత్త నాటికలోని ఉదయనుని సమకాలికుడు. ఇది పౌరాణిక కథనంతో సరిపోతున్నది. బౌద్ధగ్రంథాలనుబట్టి శిశునాగుడు రాజైనాడు. అతడు గిరివ్రజనగరం రాజధానిగాచేసి కుమార్రుణి వారణాసిలో తన ప్రతినిధిగా నియోగించినాడు. అవన్తీప్రభువులు అజాతశత్రుని కాలమునుంచీ శత్రుకోటిలో వారుకనుక శిశునాగుని కాలంలోకూడా ప్రద్యోతునివల్ల గిరివ్రజానికి ముప్పువాటిల్లింది. అతడానగరాన్ని శత్రునిర్ముక్తం చేసి, ప్రద్యోతులను జయించి అవన్తిని మగధసామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. బహుశ వత్స కోసలరాజ్యాలుకూడా మగధ రాజ్యంలో చేరిఉంటవి. ఉత్తర భారతదేశములో బుద్ధుని కాలములోఉన్న రాజ్యాలన్నీ మహామగధ సామ్రాజ్యములో లీనమైపోయినవి.

శిశునాగుని అనంతరం కాలాశోకుడు (పురాణముల లోని కాకవర్ణుడు) మగధరాజైనాడు. కాలాశోకుని పాలనా కాలములో ద్వితీయ బౌద్ధపరిషత్తు సమావేశమైంది. కాలా

శోకున్ని నందవంశ స్థాపకుడైన రాజు వధించినట్లు **Curtius** అనే చరిత్రకారుని రచనవల్ల విశదమవుతున్నది. శిశునాగ వంశనాశనానికి రాజప్రాసాదంలో విశ్వాసఘాతకీఅయిన రాణి చేయించిన కుట్ర కారణమని చరిత్రకారులు వ్రాసినారు.

నందులు

క్రీ. పూ. 364 — 324.

నందవంశస్థాపకుని వర్ణమేమిటి? శిశునాగ వంశానంతరం నూతన వంశీయులు మగధేశ్వరులైనారు. నవ్య వంశస్థాపకుడు హీన కులజుడని 'కర్టియస్' అనే చరిత్రకారుని మతము. జైన పరిశిష్టపర్వాన్నిబట్టి అతడు మంగలివాని కుమారుడనీ, వేశ్యకు జన్మించాడనీ తేలింది. ఆవశ్యక సూత్రాలవల్ల అతడు 'నాపితదాసుడు' అనగా మంగలివాని దాసుడు. పురాణాలు నందవంశస్థాపకుడు మహానందునికీ శూద్రస్త్రీకిన్ని పుట్టినాడనీ, నందరాజులు అధార్మికులనీ తెలుస్తున్నది. 'మహావంశ టీకా' అనే గ్రంధము నందులు 'అజాతకుల' సంభవులని వర్ణించింది.

నందవంశానికి అపఖ్యాతి ఉన్నట్లు అన్నిగ్రంధాలూ అంగీకరించినవి. పురాణములు నందవంశస్థాపకుని తల్లి శూద్ర స్త్రీఅనీ, యవన చరిత్రకారులు తండ్రిమాత్రమే శూద్రుడు అనగా మంగలివాడనీ వ్రాసినారు. తండ్రి వర్ణాన్నిబట్టి కుమారునికులం నిర్ణయమౌతుంది. అందుచేత నందులు శూద్రజనకుని సంతానంగా అంగీకరించవచ్చును.

నందునిపేరు - భిన్నాభిప్రాయాలు నందవంశస్థాపకుని నామ విషయంలో భిన్నాభిప్రాయాలు కనబడుతున్నవి. పురాణముల వల్ల అతడు మహాపద్మడవుతాడు. ధనమో సైనికబలమో 100,000 మిలియనుల సంఖ్య అనగా మహాపద్మ సంఖ్య కల వాడు కనుక మహాపద్మడై ఉండవచ్చును. మహాబోధివంశ మనే గ్రంథంవల్ల నందవంశస్థాపకుడు ఉగ్రసేనుడు. అలెగ్జాండరుకు సమకాలికుడయిన నందరాజుయొక్క యవన జ నామము ఔగ్రసేనియ లేదా ఉగ్రసేనపుత్రుడు. పురాణములు మొదటినందుని తండ్రిగా, మిగతా ఎనిమిదిమందినీ అతనికుమార్తెలుగా చెబుతున్నవి. బౌద్ధగ్రంథాల తాత్పర్యం నవనందులు సోదరులు. ఆవశ్యకసూత్రాలు నవనందులని ఉల్లేఖించింది. ఈ పైజెప్పబడిన గ్రంథాలవల్ల ప్రాచీన సిద్ధాంతనుయిన నవనందులు అనగా నవశబ్దానికి కొత్తఅని అర్థం చెప్పడం సబబుకాదు. పౌరాణిక శిశునాగవంశీయులలో చివరరాజులు నందివర్ధనుడు, మహానంది అనేవాళ్ళు పాతనందులనీ, వాళ్ళను కొత్తనందులు సింహాసనంనుండి తొలగించి రాజ్యాధికారానికి వచ్చారనేవాదం అసంగతం. నందవంశ స్థాపకుడయిన ఉగ్రసేనుడు చోరులవశమై చోర నాయకుడైనాడు. ఇరుగుపొరుగు రాజ్యాలపై దాడిచేసినాడు. మహావంశటీకవల్ల అతని మగధరాజ్య విజయం వాని అభ్యుదయ జీవితాన్ని తెలియచేస్తుంది. బౌద్ధసంప్రదాయాన్ని బట్టి నందులు స్వశక్తిమూలంగా, బాహాటంగా మగధ

రాజ్యమును జయించినారేకాని కుట్రవల్లనో, పరిపాలిస్తున్న రాజునో రాణినో హతమార్చికాదు.

పురాణములు - నందవంశము - నందులు క్షత్రియులా? పురాణములవల్ల నందవంశస్థాపకుడు మహాపద్మడు. అతడు సర్వక్షత్రియ నాయకుడు, ఏకచ్ఛత్రప్రభువు. అతడు సమూలంగా నాశనంచేసిన క్షత్రియ వంశములు :—ఇక్ష్వాకు, పాంచాల, కాశీ, హైహయ, కళింగ, అశ్మక, కురు, మైథిల, శౌరసేన, వీతిహోత్రులు. కథాసరిత్సాగరాన్నిబట్టి నందరాజు అయోధ్యలో మకాముచేసినట్లున్నది. అనగా కోసలముకూడా నందుని రాజ్యభాగము కావచ్చును. ఖారవేలుడు హత్తిగుంఫాశాసనంలో కళింగరాజ్యం నందరాజుకు వశమైందని వ్రాయించినాడు. మైసూరులో ప్రాచీన శాసనావళినిబట్టి నందులు కుంతలదేశమును (అనగా బొంబాయికి దక్షిణ భాగాన్ని, మైసూరుకు వాయువ్యభాగాన్ని) పరిపాలించినారు. ఈ నిరూపణవల్ల పురాణోక్తవిషయం నిజమని తేలుతున్నది. అనగా మహాపద్మనందుడు నందరాజ్యకారకుడనీ సకల క్షత్రియ హంతకుడనీ తేలుతున్నది. ఇది చారిత్రక సత్యము.

చారిత్రకంగా ఉత్తరాపథానికి ప్రప్రథమ ప్రభువు మహాపద్మనందుడు. అతనిని హీనకులజుడని అనడానికికారణం క్షత్రియుల రాజకీయప్రాభవం క్షీణప్రాయంకావడం.

మగధసామ్రాజ్యము -- సింహావలోకనము నందునివల్లనే ఉత్తరభారత దేశంలో తొలిసారిగా మహాసామ్రాజ్యస్థాపన సంభవించింది.

బింబిసారుడు అజాతశత్రువువేసిన పునాదులమీద నందులు సామ్రాజ్యస్థాపన చేసినారు. క్రమంగా మగధసామ్రాజ్యం యావదాభరతదేశంలో* విస్తరిల్లింది. సామ్రాజ్యం నశించి పోయినా సంస్కృతిమాత్రం శేషించింది. అయిదుశతాబ్దాల తరువాత రెండవసామ్రాజ్యం మౌర్యసామ్రాజ్యం చితా భస్మరాశిపై వెలసింది!

రాజకీయంగా మగధకు మహోన్నతి రావడానికి కారణం ఏమిటి అనేప్రశ్నవస్తుంది.

విశ్వజనీనత* సంకుచిత సనాతనత్వములేని భిన్నసంస్కృతీసమ్మేళనమువల్ల మగధ అభ్యుదయంపొందింది. మగధాది ప్రాగ్దేశాలు సనాతన వైదిక సంస్కృతికి దూరమైపోయినవి. ఆర్యప్రాభవానికి దూరమై ప్రాగ్దేశీయులు తమ స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సంస్కృతినీ నిలవబెట్టి దలచుకొన్నారు. క్షత్రియుల ఔన్నత్యము శూద్రప్రభువువల్ల పతనమైందని పురాణములు గగ్గోలు పెట్టినవి. వైదిక సంస్కృతివల్ల ఏర్పడిన జటిల నియమాలకు బాహ్యమైన విశ్వజనీనములైన జైనబౌద్ధాలు విలసిల్లడానికి మగధలో సావకాశం లభించింది. రాజకీయదృష్టి ప్రాగ్దేశంలో సంకుచితం కానందుచేత మహాసామ్రాజ్యస్థాపన బలిష్ఠంగా జరిగింది.

---

* ఈ అభిప్రాయం ఆర్. సి. మజుందారుగారిది. Age of Imperia Unity, Vol II పుట 35 చూడు.

వైదేశిక దండయాత్రలు

పారశీక దండయాత్ర భారతదేశంలో రాజకీయంగా ఏకత్వము మగధలో ఏర్పడుతున్నప్పుడు వాయవ్యసీమలో సామ్రాజ్యమునకు సౌష్ఠవరక్షణం లేకపోయింది. ఆ కారణంచేత పారశీకులు భారతదేశంమీద దాడిచేసినారు.

మనకూ పారశీకులకూ సంబంధము అనంతర వైదిక కాలంలో ఉండేది. అవేస్తాపంక్తులవల్ల పారశీకులకు రాజకీయాధికారం ఉత్తర భారతదేశంలో ఉండేదని కొందరి పండితుల మతం.

సైరస్ క్రీ. పూ. 6 వ శతాబ్దమునుంచీ స్పష్టమైన చారిత్రకాధారం కనబడుతున్నది. పశ్చిమాసియాలోని పారశీక రాజ్యానికీ భారతదేశానికీ సంబంధం సైరస్ (క్రీ. పూ. 558—530) చక్రవర్తిచేసిన దండయాత్రవల్ల ఏర్పడింది. ఈ విషయము హెరోడోటస్, జెనోఫాన్, స్ట్రాబో, ఆరియనుల రచనలవల్ల తెలిసికోవచ్చును. సైరస్ జయించిన తూర్పు దేశాలలో గ్రాంగియానా (శీస్తాన్), సట్టగిడియ (గజనీ), గండరిటిస్ (గాంధార) మండలాలు చేరినవి. అనగా ఈ ప్రదేశము భారతదేశానికీ ఇరానుకూ మధ్యఉన్నది.

అలెగ్జాండరు దండయాత్రలగురించి రచించిన యవన చరిత్రకారులు సైరస్‌యొక్క ప్రాగ్దేశవిజయం అంగీకరించలేదు. మెగాస్తనీస్, ఆరియనులు అలెగ్జాండరుకుపూర్వం భారతదేశంమీద ఎవరూ దండయాత్ర చేయలేదనిన్రాశారు.

డెరయస్ క్రీ. పూ. 522—486. 'హిందు' బేహిస్తన్ శాసనంవల్ల (క్రీ. పూ. 521) డెరయస్ రాజ్యంలో 23 రాష్ట్రాలున్నవని తెలుస్తున్నది. ఆ రాష్ట్రాల పట్టికలో భారత దేశనామము పేర్కొనబడలేదు. పెర్సిపోలిస్, నక్షీ రుస్తం శాసనాలుమాత్రం 'హిందు' అనగా ఉత్తర పంజాబు డెరయసురాజ్యంలో భాగమని చెబుతున్నవి. శాసనాధారాన్ని బట్టి అతడు క్రీ. పూ. 518 లో ఉత్తర పంజాబు జయించి నాడని స్పష్టమవుతున్నది.

శాసనం బేహిస్తన్ శాసనాన్నిబట్టి గడార, (గాంధారము, రావల్‌పిండి పెషావర్ మండలాలు) సోగ్డియానా, శక, బక్త్రిశ్ (బాహ్లికము) లతోపాటు పేర్కొనబడింది. డెరయస్ అనంతరంవచ్చిన సైరసురాజ్యంలో గాంధారం ఉండడంచేత డెరయసు జయించినరాజ్యంలో భారతభూభాగం ఉందని తేలుతున్నది. సైరసు సింధునదిదాకా రాజ్యాక్రమణ చేసి నాడు. హందన్ శాసనం సింధుదేశము సైరస్ రాజ్యభాగ మని వ్రాయబడింది.

హెరొడోటసు హెరొడోటసు చరిత్రకారుడు. హిందూదేశము నుంచి డెరయసుకు 1/3 వంతు రాష్ట్రపుశిస్తు వసూలు అయ్యేదని వ్రాసినాడు. క్రీ. పూ. 517 సైలాక్సు ఆధి పత్యాన, డెరయస్ నౌకాసైన్యాన్ని సింధుప్రాంతం పరిశీ లించమని పంపినాడట. ఈ సంగతి హెరొడోటసు తన గంధములో లిఖించినాడు. అయితే శాసనాలుకానీ వైదేశి

కులవాతలుకాని బింబిసారుని మగధరాజ్యప్రస క్తి ఎక్కడా తీసుకునిరాలేదు.

జర్జస్ ప్రథమ డెరయసు తరువాత క్రీ. పూ. 468—465 లో జర్జస్ రాజ్యానికి వచ్చినాడు. అతనిరాజ్యంలో హిందూదేశ భాగం ఉన్నట్లు తెలుస్తున్నది. యవనదేశంలో యుద్ధం చేయ వలసినప్పుడు హైంగనసేనాసాహాయ్యం తీసుకొన్నాడు. ఇదే మొదటిసారి మనసేనలు విదేశయుద్ధంలో పాల్గొనడం! మన సేనకు పారశీకులు "గాంధారీయులు హిందువుల" ని పేరు పెట్టినారు.

మూడవ డెరయసు అనగా పారశీక ప్రభువులలో కడసారివాడు అలెగ్జాండరు దండయాత్రను నిరోధించే నిమిత్తం భారతసేనలను పిలిపించినారు. పారశీకుల ఆధిపత్యం మన దేశంమీద క్రీ. పూ. 330 దాకా ఉండేదని చెప్పవచ్చును.

అలెగ్జాండరు దండయాత్ర

సింధునదీ ప్రాంతంవరకు తరలిట సైరస్ దండయాత్రానంతరం రెండుశతాబ్దములకు భారతదేశం యవనభాటికి గురికావలసి వచ్చింది. అలెగ్జాండరనే యవనయోధుడు ప్రపంచజిగీషతో దేశాలన్నింటిని జయించి చుట్టివేయదలచినాడు. ప్రాగ్దేశాలవైపు దృష్టిమరల్చినాడు. మొదట పారశీకాన్ని జయించినాడు. పారశీకప్రభువైన మూడవ డెరయసును ఓడించి, అతని రాజధానీనగరాన్ని పెర్సిపాలిసును క్రీ. పూ. 330 లో భస్మ సాత్కృతం చేసినాడు.

పారశీకరాజ్యాని కేంద్రీకృతమూలగాఉన్న రాష్ట్రాలలో అలెగ్జాండరు తరలి కాబూలులోయద్వారా ఉత్తరదిశనున్న పంజ్‌షీర్‌లోయ చేరినాడు. క్రీ. పూ. 327 లో అతడు ఇరాన్ దేశం పూర్తిగా జయించినాడు. క్రీ. పూ. 327 మేనెలలో భారతదేశంమీద యవనధాటి చూపినాడు.

దేశద్రోహి - అంభి అలెగ్జాండరు కుషాన్‌లోయనుండి అలెగ్జాండ్రియాకుచేరి, అచ్చట పాలకుణ్ణి పదచ్యుతుణ్ణి చేసినాడు. అక్కడనుండి నికేయాకు తరలినాడు. అతడు తక్షశిలాధీశునికీ, సింధుదేశానికి పశ్చిమంగాఉన్న రాజ్యాలవారికీ తాను దండయాత్రకు వస్తున్నాననీ, సంధిషరతులు అంగీకార మయితే, దండయాత్రచేయననీ తెలియబరచినాడు. వార్త చేరేచేరడంతోనే తక్షశిలాధీశుని పుత్రుడైన అంభి అలెగ్జాండరుకు "65 ఏనుగులు, గొఱ్ఱెలు, 3000 వృషభాలు" కానుకగాపంపి తనరాజ్యంమీద పడవద్దని కోరినాడు. భారతీయ రాజులలో ప్రప్రథమ దేశద్రోహిగా అంభికి అప్రతిష్ఠ వచ్చింది ! అంభికీ పోరస్‌అనే పురుషోత్తమరాజుకూ వైరం ఉండడంచేత అలెగ్జాండరు అంభి ఆహ్వానం అందుకొని భారత దేశం హస్తగతం చేసికోదలచినాడు.

దేశద్రోహి - శశిగుప్తుడు అంబిలాగ మరొక దేశద్రోహి అలెగ్జాండరుకు లొంగిపోయినాడు. పార్వతీయుల అధిపతిగాఉన్న శశిగుప్తుని లొంగుబాటువల్ల అలెగ్జాండరు దండయాత్ర

సాగించినాడు. అదివరకు అలెగ్జాండరుకు శత్రువై పారశీక పక్షంవహించిన శశిగుప్తుడు యవనపక్షం చేరినాడు.

భారతదేశాన్ని జయించేందుకు అలెగ్జాండరుమార్గం నిష్కంటకం అయింది. 30,000 సేనానీకం సమాయత్తపరచినాడు. సేనలో వివిధజాతులవారున్నారు. వారిలో జాతీయైక్యముండే సావకాశంలేదు. ఇది సైనిక నిర్మాణములో గమనించవలసినలోటు. అలెగ్జాండరు సైనికులను రెండు భాగాలుగా చేయవచ్చును. ఒక సైనిక నిచయానికి తానే స్వయంగా నాయకత్వంవహించి చిత్రాల్‌నదిదాకా ఉత్తర తూర్పుభాగాల్లోఉన్న పర్వతప్రాంతానికి తరలివెళ్ళినాడు. రెండవ సైనిక నికాయం. కాబూలునదికి దక్షిణతీరాన, హెపాస్టియన్, పెర్డికసుల నాయకత్వాన సాగిపోయి ఖైబర్ కనుమద్వారా సింధుదేశపుదిశగామరలి పెషావరు ప్రాంత మైదానం చేరుకొన్నది. ఈ రెండో సేనానీకానికి సాహాయ్యముగా తక్షశిలాధీశుడు వెంటనంటేఉన్నాడు.

అష్టకరాజు అష్టకరాజు తనరాజధానిఅయిన పుష్కలావతివద్ద యవనసేనను ఎదుర్కొన్నాడు. నెలరోజులపాటు యవనసేన రాజధానిని ముట్టడించింది. అతడు యుద్ధముచేస్తూ పడిపోయినాడు. దేశద్రోహిగామారిన శశిగుప్తుడు అలెగ్జాండరువల్ల పుష్కలావతిని కానుకగా స్వీకరించినాడు!

ఆశ్వకాయనులదాటి అలెగ్జాండరు నాయకత్వాన బయలుదేరిన యవనసేన చిత్రాల్, పంజ్‌కోరా, స్వాట్‌నదీప్రాంతాలలో

అశ్వకాయనులధాటిని ఎదుర్కొ–వలసివచ్చింది. అశ్వకాయనులను అశ్వకులనీ, అశ్వాయనులనీ అంటారు. పాణినిచెప్పిన అశ్మకులే యీ అశ్వకులు. వీరిరాజధాని మశకావతి. వీరు పార్వతీయులు కనుక బలిష్ఠులు శూరులు. ఈ సార్వత యోధులను ఎదుర్కొనే సందర్భంలో అలెగ్జాండరు బురుజు నెక్కుతూ చావుదెబ్బలితిన్నాడు. తనకసి తీర్చుకోదలచి మశకావతీ ప్రజలందరినీ యవనవీరుడు చిత్రవధ చేయించి నాడు! అండక పట్టణంలో పార్వతీయులు అతనిని నిరోధించి నారు. నలభైవేలమంది అశ్వకులు యవనుల ఖైదీలైనారు. పాడిపంటలు నాశనమైపోయినవి.

అశ్వకరాజిశౌర్యము అశ్వకులు తూర్పుదిశ (ప్రస్తుతపు కాఫిరిస్తాన్) అలెగ్జాండరును ప్రతిఘటించినారు. మహారాణి స్వయంగా సైన్యాధిపత్యం వహించి ప్రత్యేకంగా స్త్రీసేన సమాయత్త పరిచి యవనులతో పోరాడింది. అశ్వకాధిపతి గణతంత్ర రాజయినా ఇరుగుపొరుగునఉన్న అభిసారుడనే రాజుతో మైత్రిచేసి సేనాసాహాయ్యము పొందినాడు. అశ్వకిమహారాణి ఆమెపుత్రిక క్షతగాత్రలై శత్రువులకు చిక్కినారు. 7000 సైనికులు అలెగాండరువల నిహతులైనారు.

ఆయన పర్వతప్రాంతంలో తనకు వశమైన రాజ్యాల్లో రాజప్రతినిధులను పరిపాలనాసౌకర్యార్థం నియోగించినాడు. అనంతరం అతడు పుష్కలావతీనగరానికివెళ్ళి, యవనసేనను సుస్థాపితంచేసి సింధు, కాబూలు దిగువలోయను ఆక్రమించ

గలిగినాడు. వరణమర్గమును ముట్టడించినాడు. శశిగుప్తుని యవనసేనాభద్రతకు వియోగించినాడు. సింధునదము తరించి, ఓహింద్ వద్ద విడిసిన తన యవనసేనతో కలిసినాడు.

సింధునదినుండి బియాసువరకు క్రీ. పూ. 326 వసంతకాలంలో అలెగ్జాండరు భారత భూభాగములో అడుగు పెట్టినాడు. అతనిసేన సింధునది కవ్వలితీరానికి వెళ్ళింది. అంభిసేన అయిను వేలు యవనసేనకు సహాయంగాడుంది.

అలెగ్జాండరు తక్షశిలలో దర్బారు తీర్చినాడు. సామంతులు నజరానాలు వెండిబంగారాలు పడవలనిండా తెచ్చి అతనికి సమర్పించారు.

పురుషోత్తముని దేశభక్తి జీలం చీనాబుల మధ్యదేశానికి పురుషోత్తముడు రాజు. ఆయనకూ తక్షశిలాధిపతికీ వైరంఉన్నది. పురుషోత్తముడు అలెగ్జాండరుకు అడ్డుగులొత్తక, మాతృదేశ రక్షణార్థం బద్ధకంకణుడై అభిసారరాజును తనపక్షం చేర్చుకొన్నాడు. అయితే అభిసారుడు పరమద్రోహిగామారి యవనులపక్షము తిరిగిపోయినాడు. తాను నమ్మినవాళ్లెందరో దేశద్రోహులైపోగా, పరిస్థితులు విషమించినా, అణువణువునా తనశరీరంలో దేశభక్తి తాండవించగా, పురుషోత్తముడు అలెగ్జాండరుకు అమ్ముడుపోకల్లుకోలేదు.

యుద్ధము ఆ మరణం యుద్ధంచేయ నిశ్చయించుకొని, అలెగ్జాండర్ ఆహ్వానం తిరస్కరించినాడు. యుద్ధం తప్పనిసరి

అయింది. వర్షాలు రోకళ్ళలావున కురిసివెలిసినై. కోటలు బురుజులు బాగుచేసికొనే సావకాశంకూడా అలెగ్జాండరు ఇవ్వకుండానే పురుషోత్తమునిమీద యుద్ధం ప్రకటించినాడు. మళ్ళీ వర్షాలు ఆరంభమైనవి. పురుషోత్తముని రథాలు బురదలో కూరుకొనిపోయినవి. ఆశ్వికులైన యవనసైనికులు శరసంధానం చేయడంతో భారతీయసేనలు చిందరవందరై పోయినవి. పురుషోత్తముని సేనాధిపతులు హతులైనారు. శరీరాన రక్తమోడుతున్న గాయాలతో పురుషోత్తముడు సంగ్రామరంగం విడిచినాడు. అలెగ్జాండరు రాయబారి గుట్టపుడొక్కల సవ్వడితో రివ్వునవచ్చినాడు. ఆ వచ్చినవాడు తక్షశిలాధిపతి, దేశద్రోహి! వెంటనే పురుషోత్తముడు బలెమును వానిమీద విసిరినాడు. అనంతరం యవనదూత వచ్చినాడు. అతడు పురుషోత్తముని అలెగ్జాండరు సన్నిధికి తీసికొనివెళ్ళినాడు. భారతవీరుని శౌర్యానికి మెచ్చుకొన్న యవనవిజేత "నిన్నెలా చూడమంటావు?" అని ప్రశ్నించగా "రాజుగా" తనను చూడమని వీరోచితంగా సమాధానం ఇచ్చినాడు. "అంటే స్పష్టంగా చెప్పాలి" అని అడిగితే భారతవీరుడు "రాజు అని చెప్పిన సమాధానంలో అర్థమంతా ఇమిడేవుంది" అని పలికినాడు. అలెగ్జాండరు పురుషోత్తమునికి తిరిగి రాజ్యప్రదానంచేసి తూర్పుదిశనున్న కొన్నిరాష్ట్రాలుకూడా దానితో కలిపినాడు.

ప్రజారాజ్యాల తిరుగుబాటు అలెగ్జాండరు గ్లచ్చుకాయనుల ప్రజాతంత్ర రాజ్యంమీద తనధాటి చూపినాడు. ఈ రాజ్యంకూడా

అతడు పురుషోత్తమునకే ఇచ్చివేసినాడు. కాండహార్‌లోను, అశ్వకరాజ్యంలోను తిరుగుబాట్లు బయలుదేరినట్లు వార్తలు చేరినవి. అదృష్టవశాన సకాలానికి ఇరాన్ దేశంనుండివచ్చిన సేనానీకం విప్లవాన్ని అణచివేసింది. చీనాబు రావీనదీ మధ్యప్రాంతం పురుషోత్తమునికి ప్రాప్తమైంది.

అరాష్ట్రిక రాజ్యంలో విప్లవం రగులుకొన్నది. అలెగ్జాండర్ విప్లవాగ్నిని ఆర్పివేసినాడు. జాండియాలలో కఠులు అనే శూరప్రజానీకం యవనుల్ని ప్రతిఘటించి పరాజితమైంది. సౌభూతి, భాగలుడునూ లొంగిపోవలసివచ్చింది. అలెగ్జాండరు విజయోన్మాదంలో జీయూసునది చేరినాడు.

తిరోగమనం క్రీ. పూ. 326 లో యవనవీరుని సైనికులు పురోగమించమని ఇంటిమొగం పట్టినారు. సైనికులంతా యవనులు కాకపోవడంచేత, జాతీయాభిమాన ప్రేరితులు. కానందువల్ల, కేవలం ద్రవ్యాపేక్షతో సైనికవృత్తికి దిగిన వారుకనుక తిరుగబడినారు. తప్పనివిగా అలెగ్జాండరు తిరోగమనం చేయవలసివచ్చింది.

బియాసు జీలంనదీ మధ్యప్రాంతమూ, పదిహేను ప్రజాతంత్ర రాజ్యాలు, 5000 నగరాలూ పురుషోత్తమునికి స్వాధీనంచేశాడు అలెగ్జాండరు. అతడు అభిసారరాజుకు కాశ్మీరం ఉరసారాజ్యాలు పాలించడానికి ఇచ్చినాడు.

గణరాజ్యాల సంయుక్త ప్రతిఘటన క్రీ. పూ. 326 నవంబరులో అలెగ్జాండరు నౌకాయానంచేసి, జీలం చీనాబు నదీసంగమం

చేరేసరికి మాళవ క్షుద్రక గణరాజ్యాలు సంయుక్తమై అతన్ని ప్రతిఘటించినాయి. 90,000 కాల్బలం, 10,000 అశ్వికదళం, 900 రథసైన్యంతో ప్రజారాజ్యాలు ఏకోన్ముఖంగా అతన్ని ఎదుర్కొన్నవి. 5000 మంది బ్రాహ్మణులు వేదాధ్యయనం విడిచి కదనరంగంలోదుమికి పోరాడినారు. మాళవులు మర దృష్టవశాత్తు పరాజితులుకాగా విధలేక క్షుద్రకులు యవనులకు లొంగిపోవలసివచ్చింది.

మరికొన్ని ప్రజాతంత్రరాజ్యాలు యవనవీరుణ్ణి ఎదుర్కొన్నవి. శిబులు లొంగిపోయినా, అర్జునాయనులు 40,000 కాల్బలం, 3000 అశ్వికదళంతో సమరం సలిపినారు. వారి దారాపుత్రాదులు పరాజయం భరించలేక చితాగ్నిలో జోహారు చేసినారు.

అంబష్ఠులు 60,000 పదాతులు, 6000 అశ్వికదళం, 500 రథసైన్యంతో యవనులతో పోరుసలిపినారు, ఓడిపోయినారు.

గణతంత్రరాజ్యాల అపజయం క్రీ. పూ. 325 లో అలెగ్జాండరు సింధునదిలో పయనించి శూద్రదేశం చేరినాడు. అక్కడ బ్రాహ్మణప్రాభవం అధికం. స్వధర్మంగా భావించి, మాతృ రక్షణార్థం ప్రజారాజ్యాలను ప్రోత్సహించి బ్రాహ్మణులు ఏకధాటిగా యవనసేనను ఎదుర్కొడానికి పూనికచేసినారు. కొందరు రాజులు దేశద్రోహులు కావడంచేత ప్రతిఘటన నిష్ఫలమైపోయింది. బ్రాహ్మణవీరులు యవనుల కత్తులకు

బలిఅయినారు. అలెగ్జాండరు పటలనగరంచేినాము. అనగరా ధీశులిద్దరు. వారిద్దరూ పెద్దల సలహాతీసికొని పాలిస్తున్నారు. యవనసేనలు కనుచూపుమేరలోఉండగా పటల్రపజలు పారి పోయినారు. అలెగ్జాండరు పటలనుంచి గెడోసియాద్వారా బాబిలోనుకు ప్రయాణమైనాడు.

యవన దండయాత్ర - సింహావలోకనం

యవనప్రభావం ఎంతవరకు : అలెగ్జాండరు దండయాత్రవల్ల భారత దేశంమీద యవనప్రభావం అమితంగాఉన్నదనే అతిశయోక్తి పై దేశికుల వ్రాతల్లో గోచరిస్తున్నది. అలెగ్జాండరు యవన వీరుడు. మహాసాహసి. మహావిజేత. ఈ విషయంలో ఏమీ శంకించవలసినదిలేదు. అయితే భారతదేశంలో అతడు సాధించింది మహోజ్జ్వల సైనిక విజయమనడానికి వీలులేదు. హిందూస్థానంలోఉన్న బలిష్ఠమైన అగ్రరాజ్యాలతో అతడు సలిపిన సమరం ఒక్కటికూడాలేదు. "The triumphant progress of Alexander from the Himalaya to the sea demonstrated the inherent weakness of the greatest Asiatic armies when confronted with the European skill and discipline" * విన్‌స్మెంట్ స్మిత్తుగారి వ్రాతలో అతిశయోక్తి హాస్యాస్పదం. పోనీ అలెగ్జాండరు దండయాత్రవల్ల రాజకీయంగా ఘనవిజయమనడానికీవీలేదు. శాశ్వతంగా పంజాబుదేశాన్ని ఆక్రమించ

* Early History of India by Vincent Smith 112 పుట.

లేదు కనుక ఘనవిజయంకాదు. పోనీ అతనిధాటివల్ల భారతీయ సంస్కృతి అనగా సాహిత్యం భారతీయ జీవనం, పరిపాలనంమీద యవనప్రభావం ఉన్నదాఅంటే అదీలేదు. అలెగ్జాండరు క్రీ. పూ. 323 లో భారతదేశంనుంచి తిరోగమనం చేసినతదుపరి మౌర్యచంద్రగుప్తుని నాయకత్వంకింద దేశస్వాతంత్ర్యసమరం జరిగింది. ఆ సంగ్రామంలో యవనులాక్రమించిన రాజ్యాలు భారతీయుల వశమైనవి. అనగా పంజాబుకు మౌర్యచంద్రగుప్తుడు రాజైనాడు.

అలెగ్జాండరు విజయసాధనకు సైనికసహకారం రాను రాను సన్నగిల్లింది. సైనికులంతా యవనులు కాకపోవడమూ, నాయకునియందు భక్తిశ్రద్ధాదరాలు లేకపోవడం, జాతీయ భావం అభావం కావడంవల్లనూ అతడు విజయపరంపరను సాధించలేకపోయినాడు. సైనికుల మనస్సులు ఇళ్ళవైపు మళ్ళినవి.

అతని దండయాత్రకు సావకాశం దేశద్రోహులైన రాజులు కలిగించినారు. దుర్మార్గులు స్వలాభంకోసం దేశానికి అపచారంచేసినా పురుషోత్తమునివంటి మహావీరుడూ, పంజాబులో గణరాజ్యాలూ, స్వేచ్ఛకోసం యవనులతో యుద్ధం చేసినారు. ఈ ప్రజారాజ్యాలన్నీ ఏకమై సుసంఘటితమై నవీన సైనికవిధానాలు యుద్ధతంత్రాలూనేర్చి, యవనులతో పోరినట్లయితే విజయం సాధించేవే. కాని అలాజరగలేదు. ప్రజాతంత్రరాజ్యాలు సంయుక్త ప్రతిఘటనకు పూనుకొనే సమ

యూను ఒక్కొక్క రాజ్యాన్నే యవనులు విచ్ఛిన్నంచేసినారు. మాళవులు, క్షుద్రకులూ సంయుక్తంగా నిరోధించినారు. కాని కాలాతీతమైపోయింది ; అలెగ్జాండరును జయించలేక పోయినారు.

అలెగ్జాండరుయొక్క సామ్రాజ్యకాంక్ష స్వప్నమై పోయింది. తనవిజయాన్ని చూడలేకపోయినాడు ; హతాశుడైనాడు. ఆయన స్వప్ననీమలో పంజాబు సింధుదేశాక్రమణము తాత్కాలికంగా నిలిచినవి. జయించిన రాజ్యాలను అతడు సుప్రతిష్ఠితం చేసికోలేకపోయినాడు.

అయితే అతని దండయాత్రవల్ల భారతీయులు రాజకీయైక్యము సాధించినారు. చిన్నచిన్న రాజ్యాలుకలిసి క్రమేణా మౌర్యచంద్రగుప్త సమ్రాట్టువల్ల ఏకసామ్రాజ్యమైనది. యవనఘాటివల్ల శాశ్వతఫలితం ఒక్కటే కినబడుతుంది. మనకూ యవనులకూ గమనాగమనాలు ఏర్పడినవి. దీనివల్ల లాభంకన్న నష్టమే అధికం. సుల్తాన్‌మహమ్మదు, తామర్లేన్ నాదిర్‌షాలవంటి క్రూరులు భారతదేశంలో అడుగుపెట్టే వీలు కలిగింది. అలెగ్జాండరుచుట్టూ చరిత్రకారులు చిత్రించే కీర్తి ప్రభామండలం అదికీర్తికాక, మానవత్వంలేని రాక్షస దండయాత్రకు అప్రతిష్ఠగా చెప్పకతప్పదు.

చంద్రగుప్తుడు - మౌర్యసామ్రాజ్యము

చంద్రగుప్తుని జీవితం క్రీ. పూ. 324—300. అలెగ్జాండరు పంజాబులో దండయాత్ర చేస్తున్నప్పుడు ధనానందచక్రవర్తి భారతదేశం పరిపాలిస్తున్నాడు. యవనాక్రమణాన్ని ఎదుర్కొడానికి

ఏమేమి సన్నాహాలు చేశాడో మనకు తెలియరావు. అలె జ్జాండరు పంజాబు సింధుప్రాంతాల్లో గణతంత్ర రాజ్యాలను చిన్నచిన్నవాటిని నాశనం చేయగలిగిననాడేకాని మగధ రాజ్యంలో అలుగు పెట్టలేదు. నందరాజ్య నిర్మూలనం చేయ లేదు. పంజాబులో యవన విజృంభణంవల్ల మగధలో ఏలాటిమార్పులూ రాలేదు.

చంద్రగుప్తుని ఆదర్శాలు భారతదేశమునుండి అలెగ్జాండరు తిరో గమనం చేసినతరువాత మౌర్యచంద్రగుప్తుడు యవనరాజ్య విచ్ఛేదనకై భారత స్వాతంత్ర్య సంపాదనకై, రాజకీయైక్యమే ఆదర్శంగా సంగ్రామం సాగించినాడు. సామాన్య పరిస్థితులలో జన్మించిన చంద్రగుప్తుడు మగధ సింహాసనారోహణంచేసి, చక్రవర్తికాగలిగి విదేశికులను భారతదేశమునుండి పారదోలి స్వేచ్ఛాపతాకను ఎగరవేసినాడు. అతడు భారతేతిహాసములో చిరస్మరణీయుడు! అతని జీవిత చరిత్రమే అద్భుతావహం! మహోజ్జ్వలం!

జీవితారంభము - జైనబ్రాహ్మణ సంప్రదాయాలు మహిమోపేతుల పూర్వచరిత్ర అగమ్యగోచరంగా ఉండడం సహజం. మహానదీ జన్మస్థానంకూడా పర్వతకందరాల్లో అల్పంగా ఉంటుంది. యవన చరిత్రకారుల రచనలనుబట్టి చంద్రగుప్తుడు హీన కులజుడు. జైన సంప్రదాయరీత్యా అతడు గ్రామణికి దౌహిత్రుడు. మౌర్యశబ్దం అతనికి రావడానికి కారణం మయూర పోషకుల నివాసస్థానం అతనిదని అంటారు.

ఈ యవన జైనగ్రంథాలవల్ల చంద్రగుప్తుని జీవితారంభదశ సరిగా తెలిసికోలేము. బ్రాహ్మణ బౌద్ధసంప్రదాయాలవల్ల అతని జీవితవిశేషాలు గ్రహించగలము. అయితే ఈ రెండు సంప్రదాయాలూ ఏకాభిమతాన్ని తెలియజేయడములేదు. ఒకమతాన్నిబట్టి అతడు హీనకులజుడు; మరొక అభిమతాన్ని బట్టి క్షత్రియ కులోద్భవుడూ.

బ్రాహ్మణ సంప్రదాయం పరిశీలనచేదాము. బ్రాహ్మణ సంప్రదాయ గ్రంథాలు పురాణములు. పురాణములవల్ల చంద్రగుప్తుడు బ్రాహ్మణ కౌటిల్యునివల్ల పట్టాభిషిక్తుడైనాడనీ, కౌటిల్యునివల్లనే నందవంశ నిర్మూలనమైందనీ తెలుస్తున్నది.

విష్ణుపురాణ వ్యాఖ్యాత మతాన్నిబట్టి చంద్రగుప్తుడు హీనకులజుడు. తల్లి మురకనుక అతడు మౌర్యుడు.

మౌర్యశబ్దము: మురాశబ్దమునుండి తద్ధితం మాచేయం అవుతుంది. అయితే మౌర్యశబ్దం సాధించే నిమిత్తం పుంలింగ శబ్దమైన మురగోత్రోద్భవుడు కావాలి. విష్ణుపురాణవ్యాఖ్యాత చంద్రగుప్తునికి తల్లిని ఏర్పాటుచేయాలని తహతహ లాడినాడేకాని వ్యాకరణ సూత్రాలను పాటించలేదు! అతడు మురను శూద్రస్త్రీగా చెప్పలేదు.

వృషలశబ్దము ముద్రారాక్షసాన్నిబట్టి చంద్రగుప్తుడు హీన కులజుడనే కథఅల్లడం జరిగింది. ఆ నాటకంలో చంద్ర

గుప్తుణ్ణి వృషలుడనీ కులహీనుడనీ అనడంచేత హీనకులజుడని ప్రచారం జరిగింది. వృషలుడంటే రాజుల్లో అధిపతి అని అర్థం. కులహీనుడనగా సామాన్యకులంలో జన్మించినవాడని అర్థము.

విష్ణుపురాణముమీద నవీన వ్యాఖ్యాత నూతన సిద్ధాంతము ప్రచారంచేసినాడు. నందునిభార్య శూద్రస్త్రీ. ఆమె పేరు ముర. చంద్రగుప్తుడు మురాపుత్రుడు.

చంద్రగుప్తుడికీ తండ్రికీ రక్తసంబంధం ఉందని విష్ణు పురాణ వ్యాఖ్యాత మతంవల్ల దృఢమవుతున్నది.

బౌద్ధసంప్రదాయాన్నిబట్టి దివ్యావదానంవల్ల చంద్రగుప్త సుతుడైన బిందుసారుడు పట్టాభిషిక్తుడైన క్షత్రియుడు. 'మహా వంశము' నుబట్టి అతడు క్షత్రియుడు. 'మహాపరి నిర్వాణ సూత్రము' నుబట్టి గౌతమబుద్ధుని కాలంలోకూడా మౌర్య క్షత్రియవంశమున్నట్లు తెలుస్తున్నది. మోరియలు పిప్పలీవన వాసులనీ, రాజ్యపాలనచేస్తున్న క్షత్రియులనీ ఉల్లేఖింపబడింది. చంద్రగుప్తుడు మౌర్య క్షత్రియ వంశసంజాతుడని తేలిన సారాంశము.

బౌద్ధసంప్రదాయగాథ చంద్రగుప్తుని జనకుడు మౌర్యకులాధిపతి. అతడు సరిహద్దు తగాదాలో జీవితం కోల్పోయినాడు. అతని భార్య, పిల్లవాడు దిక్కులేనివాళ్ళయినారు. ఆమె తల దాచుకొనేనిమిత్తం పుష్పవరం అనగా పాటలీపుత్రం వెళ్ళింది.

అక్కడ చంద్రగుప్తుణ్ణి కన్నది. మొదట గొల్లవాడు పిల్లవాణ్ణి పెంచినాడు. అనంతరం ఒక వేటకాడు అతన్ని సాకినాడు. పిల్లవాడు పెరిగి తోటిపిల్లల్లో ఆటపాటల్లో మిన్నగా ఆధిపత్యం చలాయించేవాడు. చాణక్యుడు క్రూర వాణ్ణిచూచి మెచ్చి తక్షశిలకు తీసికొనివెళ్లి చదువుసంధ్యలు చెప్పించినాడు. కూలంకషంగా శాస్త్రాధ్యాపనం చేసినాడు.

స్వాతంత్ర్యసాధన దేశమును యవనశృంఖలాలనుండి విచ్ఛేదం చేయడము, చాణక్యుని అవమానించిన నందరాజ నిరంకుశత్వాన్ని నిర్మూలించడం చంద్రగుప్తుని మహదాశయం. ఈ ఆశయాన్ని సఫలీకృతం చేసికోడం అంత తేలికైన పని కాదు. ప్రజాసీకంలో స్వేచ్ఛ రగులుకొలిపి, జాతీయతను రేకెత్తించి, అలెగ్జాండరు నిర్మించిన యవన పాలనకు హస్తోదకం ఇప్పించడం సులభంకాదు. చంద్రగుప్తుడు అలెగ్జాండరును ఎదుర్కొన్న ప్రజాతంత్ర శక్తులను గమనించి, ఆ రాజ్యాలకు తగిన నాయకత్వంలేదని గ్రహించినాడు. మహావంశ టీక, జైనగ్రంథాలనుబట్టి అతడు ప్రజానీకంలో అన్నివర్ణాలనుంచీ సేనాసమీకరణం చేసినట్లు తెలుస్తున్నది. మ్లేచ్ఛులు అనగా కిరాతాదులు, ఆటవికులు, శాస్త్రోపజీవిశ్రేణులు చంద్రగుప్తుని సేనలో చేరినవి. ముద్రారాక్షస నాటకాన్నిబట్టి అతడు హిమవన్నగప్రాంత పర్వతునితో నేస్తంచేసినాడు. ఈ మైత్రివల్ల చంద్రగుప్తునకి శక యవన కిరాత కాంభోజ పారశీక బాహ్లికాదుల సాహాయ్యము లభించింది.

చంద్రగుప్తుడు సుమారు క్రీ. పూ. 323 లో డిగుణ సింధునదీ ప్రాంతంలో సమరశంఖం పూరించినాడు. జిప్సీల్ వ్రాతనుబట్టి అతడు యవనపాలకులను సేనలనూ చీల్చి చెండాడినాడు. పంజాబు సింధుదేశాలపై ఆధిపత్యం సంపాదించినాడు.

నందవధ నందనిరంకుశత్వం రూపుమాపడానికి అలెగ్జాండరును చంద్రగుప్తుడు ప్రోత్సహించినట్లుగా కథ చెబుతారు. ఇందు కాధారాలు లేవు. చాణక్యునకు నందరాజుమీద ద్వేషంవల్ల చంద్రగుప్తునికి రాజ్యప్రాప్తి లేనందువల్ల, చాణక్య చంద్రగుప్తులకు నందుడు శత్రువైనాడు. శత్రువులను రూపుమాపి మగధరాజ్య సింహాసనారోహణము చేయడం చంద్రగుప్తుని లక్ష్యం. ఈ లక్ష్యసిద్ధికిగాను చాణక్యుడు యావచ్ఛక్తినీ రాజనీతిని ప్రయోగించినాడు.

చంద్రగుప్తుడు మగధసామ్రాజ్యసీమలనుండి బయలుదేరి రాష్ట్రాలూ జనపదాలూ జయిస్తూ వెళ్ళినాడు. పాటలీపుత్రం ముట్టడించి ధననందుణ్ణి వధించినాడు. పాటలీపుత్రాక్రమణమూ, చంద్రగుప్తుని సేనాసంహారాన్నిగురించి 'ముళింద ప్రశ్న' అతిశయోక్తిగా వర్ణనచేసింది.

నందవధకు చాణక్యుడు (కౌటిల్యుడు) ముఖ్యకారణముగా పురాణాలు చెబుతున్నవి. కౌటిల్యుడు నందనాశనంచేసి, మగధ సింహాసనంమీద చంద్రగుప్తునికి పట్టము కట్టినాడు. ఈ అభిప్రాయాన్ని కౌటిల్యుని అర్థశాస్త్రం

తెలియజేస్తున్నది. ముద్రారాక్షసంలో చాణక్యుని ఉజ్వల పాత్ర చిత్రణంపక్కనే చంద్రగుప్తపాత్ర అప్రధానమైంది.

సెల్యూకసు-సంధి చంద్రగుప్తుడు సామ్రాజ్య నిర్మాణానికి పునాదులు వేస్తున్నప్పుడు యువరాజైన సెల్యూకసు భారత దేశంవైపు తరలినాడు. అలెగ్జాండరు జయించినరాజ్యాలు అతని తిరోగమనానంతరం చంద్రగుప్తుడు జయించడంవల్ల, వాటిని తిరిగి సంపాదించవలెననే జిగీషతో సెల్యూకసు సన్నద్ధుడైనాడు. కాని సెల్యూకసు సుశిక్షిత భారతసేనలను, సేనాధిపతులను, నాయకులను ఎదుర్కోవలసివచ్చింది. క్రీ.పూ. 305లో అతడు సింధుదేశంచేరి చంద్రగుప్తునితోసంధిచేసికోవలసివచ్చింది చంద్రగుప్తునికి ఆరియా, అరకోసియా, పరోపనిసదాయి, గెడ్రోసియా (బెలూచిస్తాన్‌లో భాగము) లు సంధిషరతుల ప్రకారం సంక్రమించినై. దానికి బదులుగా చంద్రగుప్తుడు 500 ఏనుగలు కానుకగా సెల్యూకసుకు ఇచ్చినాడు. అంతే కాక చంద్రగుప్తుడు అతనికుమార్తెను పెళ్ళాడినాడని ప్రతీతి. కాని దీనికి చరిత్రాధారంలేదు. అప్పటినుంచీ యవనులకూ భారతీయులకూ సౌహార్దరాజ్యంలో మైత్రిఏర్పడింది. మెగాస్తనీసు అనే యవనదూత పాటలీపుత్రానికివచ్చి చాలాకాలం ఉండి భారతదేశాన్నిగురించి 'ఇండికా' అనే గ్రంథరచన చేసినాడు.

జీవనసంధ్య చంద్రగుప్తుని ఆనంతర జీవితవిశేషాలు తెలియవు. విశాల సామ్రాజ్యనిర్మాణంవల్ల అతడు జీవితం, సైనిక

విజయ పరంపరతో, శాత్రవకోటిని సమరాంగణంలో చెండాడుతూ గడిపిఉండవచ్చును. జైన సంప్రదాయాన్ని బట్టి అతడు జీవితసంధ్యలో విరక్తితో భద్రబాహుని జైన పరివారంతోకలిసి మైసూరులోని శ్రావణ బెల్గోలాలో జైన పద్ధతిలో శరీరం చాలించినాడని తెలుస్తున్నది. (సల్లేఖనా) ఇప్పటికీ అక్కడ దేవాలయమూ, తత్సమీపంలో చంద్ర గుప్త బస్తీఉన్నవి.

రాజ్యవిస్తీర్ణము చంద్రగుప్తుడు నిస్సందేహంగా సువిశాల సామ్రాజ్యం పరిపాలించినాడు. అశోకశాసనాలనుబట్టిచూస్తే కళింగరాజ్యంమాత్రమే అశోకుడు జయించినది. అందుచేత కళింగాన్ని మినహాయిస్తే మిగతా సామ్రాజ్యం యావత్తూ చంద్రగుప్తుని అవక్రవిక్రమంవల్ల సంప్రాప్తం. అశోక శాసనాలున్న తావులనుబట్టిచూడగా అతని సామ్రాజ్యం దక్షిణాపథంలో మైసూరుదాకా, వాయువ్యభాగంలో పారశీక సీమలదాకా వ్యాపించింది.

రుద్రదమనుని జునాగఢ శాసనంవల్ల సౌరాష్ట్రం మౌర్యసామ్రాజ్యభాగమని స్పష్టమవుతున్నది. దానిని రాష్ట్రీయపాలకుడయిన పుష్యగుప్తుడు పరిపాలన చేస్తూఉండే వాడనీ; అతని అనంతరం అశోకునికాలంలో యవన తుషాస్పుడు సౌరాష్ట్రాన్ని ఆనర్తదేశాన్ని కలిపి రాష్ట్రీ పాలన చేసినాడు. అశోకశాసనం సోప్రా (శూర్పారక) లో ఉండడంచేత అదికూడా చంద్రగుప్తుని రాజ్యభాగమే.

పరిపాలనావిధానం - వికేంద్రీకరణం

పాటలీపుత్రపు పొలిమేరలనుండి దక్షిణాపథంలో మైసూరు దాకా సుసంఘాల సామ్రాజ్య పరిపాలనం సులభంకాదు. రాకపోకలకు తగిన సౌకర్యాలు లేనప్పుడు పాటలీపుత్రంనుండి రాష్ట్రాలన్నీ అతిదూరంలో ఉన్నప్పుడు, రాజధానీ కేంద్రం నుంచి సామ్రాజ్యపాలనం సాగించడానికి చంద్రగుప్తుని రాజనీతిని ప్రదర్శించినాము. రాష్ట్రాలు సుదూరంలో ఉండడంచేత, గమనాగమన సమపాయాలు లేకపోవడంవల్ల వికేంద్రీకరణ ప్రవేశపెట్టినాము. అనగా పరిపాలన కేంద్రంనుంచి గ్రామందాకా విభక్తమైంది. గ్రామపాలన స్వతంత్ర పరిపాలనవలె గణతంత్రమువలె ఉండేది. గ్రామీణులకు గ్రామపాలనాబాధ్యతలుండేవి. అనగా ఆనాటిపాలనం ప్రజాతంత్ర సూత్రాలపై ఆధారపడింది.

మెగాస్తనీసు రచించిన 'ఇండికా' అనే గ్రంథమువల్ల మౌర్యులనాటి సాంఘిక రాజకీయ పరిస్థితులు విశదమవుతున్నవి. దేశాధిపతి రాజు. సైనిక న్యాయచట్ట నిర్మాణాధికారాలు రాజువే. "రాజు పగలు నిద్రపోడు. పగలల్లా సభలోఉండి న్యాయవిచారణ జరుపుతాడు. అతను దుస్తులు వేసికొను సమయము వచ్చినపుడు రాయబారులతో మాట్లాడుతాడు."

సామ్రాజ్యం రాష్ట్రాలుగా విభక్తమైంది. రాష్ట్రము నకు గవర్నరువంటి రాష్ట్రపాలకుడు ఉంటాడు. ఈ రాష్ట్రపాలకులను రాజకుటుంబాలనుంచి కొన్నిసమయాల్లో నియో

గించడముంటుంది. కేంద్రరాష్ట్రాన్ని తూర్పురాష్ట్రాన్ని చక్రవర్తి స్వయంగా పాలించేవాడు. ఆయనకు సహాయంగా సభ్యమండలి ఉంటుంది. వారిసంఖ్య తక్కువైనా పలుకుబడి ఎక్కువ. ఈ విషయాన్ని ఆరియను, స్ట్రాబో మొదలైన యవన చరిత్రకారులు వ్రాశారు. సలహాదారులైన సభ్యులు, గవర్నర్లను, డెప్యూటీగవర్నర్లను, కోశాధికారులను, సేనాధిపతులను, నౌకాదళాధిపతులను, ప్రాడ్వివాకులను, ప్రాశ్నికులనూ, వ్యవసాయాధికారినీ, ఇతర అధికారులనూ ఎన్నుకొనేకొనేవారు

రాష్ట్రంలో నలుమూలలా విషయసేకరణకోసం చారులు తిరిగేవారు. నగర సైనిక విషయాలనుగురించి చారులు చక్రవర్తితో రహస్యంగా సంభాషించేవారు.

మౌర్యుల స్థానిక పరిపాలనము మెగాస్తనీసు స్థానిక పరిపాలనమును వర్ణించినాడు. తనగ్రంథములో. పురపాలకోద్యోగులు **Astynomoi** అనీ, వారి విధ్యుక్తధర్మాలు ఇండికా గ్రంథములో లిఖించినాడు. పురపాలకోద్యోగులు ఆరువర్గాలు. ఒక్కొక్కవర్గానికి అయిదేసి సభ్యులు. మొదటివర్గములో సభ్యులు వాణిజ్యపరిశ్రమశాఖ పరిశీలిస్తారు. రెండోవర్గం విదేశీయులకు వినోదాలు కల్పిస్తారు. మూడవవర్గం జనన మరణలెఖలు తయారుచేస్తారు. నాలుగోవర్గం తెప్పడు తూనికలు తూయనీయకుండా పరిశీలిస్తుంది. యైదోవర్గం వస్తూత్పత్తి వినిమయాలు చూచేవారు. ఆరవవర్గం విక్రయమైన వస్తువుల ధరలో పదోవంతు వసూలుచేసేవారు.

మండల పరిపాలనము మండల పరిపాలకోద్యోగులను Agronomoi అని మెగాస్తసిసు పేరుపెట్టినాడు. నదీనదాల పరిశీలనం, భూమిమానం, కాలవనీరుపోయే నాళికలను తనిఖీచేయడం, అనగా అందరికీ నీటివనరు అమరేట్లు చూడడం. వ్యవసాయం, ఆటవీసంపద, పరిశ్రమలు, నిధులు, పథములు పరిశీలించడానికి రకరకాల ఉద్యోగులు నియమితులైనారు.

సైనికనిర్మాణము నూతన సామ్రాజ్య భద్రతకై సైనిక వ్యవస్థ సౌష్ఠవంగా ఏర్పాటయింది. చంద్రగుప్తుడు 600,000 సేనను తయారు చేయించినాడు. యుద్ధకాంక్షోద్యోగులు 6 వర్గాలుగా ఏర్పడి ఒక్కొక్కవర్గానికి 5 గురు సభ్యులుండేవారు. ఈ కార్యాలయం అజమాయిషీకింద సేన ఉండేది. ఆరువర్గాల్లో ఒకవర్గం నౌకాదళాధిపతితో సహకరించి ఉండాలి. మిగిలిన అయిదువర్గాలకూ ప్రత్యేక కర్తవ్యాలున్నవి. ఈ వర్గాలు పదాతి, ఆశ్విక, యుద్ధ, రథ, గజ, వస్తువులసరఫరా, సేనా సహాయాదులను పరిశీలించి సాహాయ్యమిచ్చేవి.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో పరిపాలనాపద్ధతి విశదంగా ఉంది. కొందరిమతం చంద్రగుప్తసనాటిదే అర్థశాస్త్రమనీ, అది చాణక్య కృతమనీ. చాలామంది విద్వాంసులు అర్థశాస్త్రం మౌర్యకాలానంతరానికి చెందినదని వ్రాసినారు. అంచేత అర్థశాస్త్రంలో వర్ణితమయిన పరిపాలనా విధానం మౌర్యకాలీనమని నిర్ణయించడానికి వీలులేదు.

మౌర్యకాలిక ప్రజాజీవితం మెగాస్తనీసు ప్రాతనుబట్టి మౌర్య సామ్రాజ్యంలో ప్రజలు శాంతిభద్రతను అనుభవించారని తెలుస్తున్నది. ప్రజలకు జీవనోపాధులు అనేకముండుటవల్ల వారు హాయిగా ఉండేవారు. మనుష్యులు ఎప్పుడూ గంభీర ముద్రవహించి కనపడేవాగు. భూసారం బాగా ఉండడంచేత పంటలూ పండ్లతోటలూ విస్తారం. భూగర్భంలో వెండి బంగారాలు, రాగి ఇనుము దొరికేవి. వెండిబంగారాలతో ఆభరణాలు చేయించుకొని శరీరాలంకరణం చేసికొనేవారు.

భూసారాన్నిగురించి 'ఇండికా' లో విశేషాలు కన బడతవి. భూసారానికి కారణం సమృద్ధిగా నీటిపారుదల ఆహారానికి కావలసిన ధాన్యాదులను పండించేవాళ్ళు. రెండు సార్లు వర్షపాతం ఉండడంవల్ల రెండుసార్లు సాలీనాపంటలు పండించేవారు. పళ్ళాఫలాలూ నిత్యమూ లభ్యము కావడం చేత అవి ఆహారంగా ఉపయోగపడేవి. కరువు కాటకమూ దేశంలోలేదు. దానికి కారణాలు లేకపోలేదు. యుద్ధం చెల రేగుతున్నప్పటికీ రైతు పొలం పోట్ల, ఉన్న ఊరు విడిచి పోడు. జనపదాల్లో శాంతి సమృద్ధిగా ఉండేది. రైతుల జీవితంలో ఒడిదుడుకులులేవు. వ్యవసాయం సవ్యంగాసాగేది. యుద్ధకాలంలో రైతు క్షేమం యావన్మంది శ్రేయస్సుగా అందరూ భావించేవారు కనుక హాళికుడు భద్రంగా జీవించ గలిగేవాడు. ఈ విషయము బౌద్ధగ్రంథాలుకూడా చెబు తున్నవి.

సమాజంలో పాళికులసంఖ్య ఎక్కువ. వ్యవసాయమే అన్నివృత్తుల్లో అధికం. పట్టణాలలో నగరాలలో నాగరకుల సంఖ్య ఎక్కువ. సామాన్యంగా పట్టణాలు నదీతీరాల్లోనే, సముద్రతీరాన్నో నిర్మింపబడేవి.

చంద్రగుప్తుడు ప్రజాశాంతి చూడడంచేత ఆర్థిక స్థాపవం ఏర్పడింది. చౌర్యం అన్నమాటలేదు. పౌరులు అలంకార ప్రియులు. నాజూకుగా సన్నని వలువలు ధరించే వాగు కనుక నూలునేతపరిశ్రమకు ప్రోత్సాహం ఉండేది. లలితకళలకు ప్రభుత్వము దోహదమిచ్చేది. మెగాస్తనీసు రచన వల్ల కర్మకారులందరూకలిసి శ్రేణిగా ఉండేవారని తెలు స్తున్నది. యుద్ధపరికరాలను, నౌకలను గొంగరు నిర్మించేవారు. ప్రభుత్వము వీరికి పోషణ ఇచ్చేది. నౌకాదళాధిపతి నౌకలను వస్తువినిమయానికీ రాకపోకలకూ అద్దెకిచ్చేవాడు. నదులపై నావలునడిపే సరంగులకు ప్రభుత్వం జీతాలిచ్చేది.

బిందుసారుడు

క్రీ. పూ. 300 — 273.

స్ట్రాబో చరిత్రకారుని రచననుబట్టి చంద్రగుప్తుని కుమారుడు అమిత్రఘాతుడు. రాజావళీఅనే జైనగ్రంథం అతన్ని సింహసేనుడని చెబుతున్నది. పురాణాలవల్ల బింబుసారుడనే నామం విదితమవుతున్నది. అతని పరిపాలనావిశేషాలు మనకు తెలియవు. ఆనంతర కాలిక సాహిత్యంవల్ల చాణక్యుడు కొంత

కాలంపాటు బిందుసారుని మంత్రిగా ఉండేవాడని తెలుస్తున్నది. టిబెట్ చరిత్రకారుడైన తారానాథుని గ్రంథాన్ని బట్టి చాణక్యుడు "పదహారు పట్టణాల్లోఉండే నరపతుల సంహారానికి తనప్రభువుకు తోడనీడై ప్రాక్ పశ్చిమ సముద్ర మధ్యస్థ రాజ్యాధిపతిని" చేసినాడు. దీనినిబట్టి కొందరు విద్వాంసులు బిందుసారుడు దక్షిణాపథాన్నికూడా జయించాడన్నారు. అయితే తగిన ఆధారాలులేవు. పదహారు పట్టణాలు బహుశ షోడశ మహాజన పదముల రాజధానులు కావచ్చునేమో.

*దివ్యావదానం - తక్షశిలలో విప్లవం బిందుసారుడు షోడశ మహాజన పదములలోని పట్టణాలను జయించినా జయించకపోయినా దివ్యావదానాన్నిబట్టి తక్షశిలలో విప్లవంరేకెత్తగా కుమారుణ్ణి అశోకుణ్ణి రాజప్రతినిధిగా పంపినాడని స్పష్టమవుతున్నది. అశోకుడు తక్షశిలచేరగానే ప్రజానీకం అతనికి ఎదురుగావచ్చి "మేము మీకుగానీ, బిందుసారునికిగానీ వ్యతిరేకులముకాము. కాని మమ్మల్ని అవమానపరచే 'దుష్టామాత్యుణ్ణి' ఇష్టపడం" అన్నది. తక్షశిల అశోకునికి స్వాధీనమైంది.

బిందుసారుడు తండ్రిద్వారా సంక్రమించిన మహా సామ్రాజ్యం సంరక్షించినాడు. యవనపాలకులతో స్నేహం చేసినాడు.

* Cowel and Neil's edition పుట 371.

సైదేశకులతో సంబంధం పాటలీపుత్రంలో మెగాస్తనీసు అనంతరం డిమోకస్ రాయబారిగా బిందుసారుని ఆస్థానంలో ఉన్నాడు. డిమోకస్ సిరియారాజప్రతినిధిగా పాటలీపుత్రం వచ్చినాడు. బిందుసారుడికీ సిరియారాజైన అంటియోకస్ సోటరుకూ స్నేహపూర్వకంగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచినవి. బిందుసారుడు సిరియారాజుకు మధురమాధ్వీకరసాన్ని, అత్తి పళ్ళనూ తార్కిక్షుణ్ణే క్రయంచేసి పంపమని వార్తపంపినాడు.

బిందుసారుని కుటుంబము బిందుసారుని అనంతరం అశోకుడు రాజ్యానికి వచ్చినాడు. బిందుసారునికి అశోకుడేకాక ఇంకా పుత్రులున్నారు. ధర్మమహామాత్రుల కర్తవ్యాలనుగురించి అశోకుడు ప్రవాయించిన అయిదవగిరి శిలాలేఖనంలోని పంక్తులను బట్టి అతనికి చాలామంది సోదరులు, అక్కచెల్లెళ్ళూ ఉన్నారని తెలుస్తున్నది. దివ్యావదానంలో అశోకుని సోదరులపేర్లు సుసీమ, విగతాశోకులని విశదమైంది, మహావంశమనే సింహళచరిత్రకూడా పైవానిని వేరేపేళ్ళతో చెబుతున్నది. సుసీముని మరొకపేరు సుమనుడు ; విగతాశోకుని అన్య నామము తిష్యుడు. ఈ విగతాశోక తిష్యుడు బిందుసారుని కడసారి కుమారుడు. హ్యూయాన్‌సాంగ్ అశోకునిసోదరుడు మహేంద్రుడని ప్రవాశాడు. విగతాశోకుడే మహేంద్రుడు. హ్యూయాన్‌సాంగ్ తికమక పడిఉంటాడు.

అవసానం పురాణ వచనాన్నిబట్టి పాతికేళ్ళు ప్రభుత్వము చేసినతదుపరి బిందుసారుడు చనిపోయినాడు. 'సమంతపసాదిక'

'మహావంశము' లనుబట్టి అతని పరిపాలన 28 సంవత్సరాలని తెలుస్తున్నది. చంద్రగుప్తుడు క్రీ. పూ. 324 లో రాజైనట్లు భావిస్తే, బిందుసారుని పరిపాలన క్రీ. పూ. 300 —273 అంతరంలో ఉండవచ్చును.

అశోకుడు

క్రీ. పూ. 273 — 236.

మహోన్నతుడు బిందుసారుని తరువాత అశోకుడు మగధరాజ్య సింహాసనం అధిష్ఠించినాడు. **H. G. Wells** ఆయనను "రాజులందరిలో మహోన్నతుడు" అని ప్రశంసించినాడు. సువిశాల సామ్రాజ్యమును పరిపాలించడంచేత ఆయన మహోన్నతుడు కాలేదు. మహోలక్ష్యసిద్ధికై జీవితమర్పించినవాడు కనుక గొప్పవాడు. అవతార పురుషునివలె అశోకుడు విశ్వజనీన ధర్మమును మానవకోటి శ్రేయస్సుకై వ్యాప్తి చేసి ధర్మ సామ్రాజ్య స్థాపకుడైనాడు. పరిపాలనారంభకాలంలో కళింగ యుద్ధంచేసి రక్తపాతం, మానవనాశనం కళ్ళారా చూచిన తరువాత అశోకుని అంతరంగములో అంతులేని పరివర్తన కలిగింది. తత్ఫలితంగా యుద్ధఘోషకు స్వస్తిచెప్పి ధర్మ ఘోషకు వీనులొగ్గినాడు.

ధర్మశాసనాలు యావద్భారతదేశంలో ధర్మశాసనాలు ఏక శిలలపై చెక్కించి స్థాపింపజేసినాడు. ధర్మలిపులు అశోకుని ఆదర్శాలనూ జీవితదృక్పథాన్ని తెలియజేస్తున్నవి. శిలలపై

గిరిపార్శ్వములపై శాసనాలు గండరించిన భారతీయులలో అశోకుడే మొదటివాడు.

శాసనాలను మూడుతరగతులుగా విభజింపవచ్చును.

1. పథ్నాలుగు శిలాశాసనములు—ఎనిమిదిచోట్ల ఇవి స్థాపింపబడినవి. సామాన్యంగా వీటిని కళింగశాసనాలని అంటారు.

2. అల్పగిరి శిలాశాసనాలు—ఇవి రెండురకాల శాసనాలు. ఒకశాసనపాఠం పదితావుల్లో కనబడుతున్నది.

3. స్తంభశాసనాలు—ఏడుశాసనములు. ఢిల్లీసమీపములో తోప్రాలో స్తంభంమీద చెక్కబడినవి. 6 శాసన పాఠాలు అయిదుచోట్ల ఉన్నవి.

మిగిలిన శాసనాలు స్తంభాలమీద, గుహాకుడ్యాల మీద చెక్కబడినవి.

గిరిశిలాశాసనాల్లో అశోకుని జీవితానికి సంబంధించిన విశేషాలు లభ్యమవుతున్నవి. అతడు మహోన్నతాదర్శాల వల్ల ప్రేరేపితుడై లోకంకోసంచేసిన మంగళాశాసనాల్లో స్వీయవ్యక్తిత్వము గోచరిస్తున్నది.

జీవితారంభము అయితే దురదృష్టవశాత్తు ఆయన జీవితారంభం శాసనాలవల్ల ఏమీతెలియదు. అందుచేత మనకు బౌద్ధ గ్రంథాలే ఆధారాలు. దివ్యావదానం, మహావంశమనే సింహళచరిత్రలవల్ల, అతడు క్రూరుడనీ, తండ్రి మరణా

నంతరం భ్రాతృవధకు కారకుడనీ అనగా తొంభైతొమ్మిది మంది సోదరులను నిశ్శేషంచేసి, రక్తసిక్తమైన రాజ్యదండం స్వీకరించాడనీ తెలియవస్తున్నది.

క్రూరుడా : బౌద్ధసాహిత్యంకాక ఇతరగ్రంథాలు అశోకుణ్ణి క్రూరుణ్ణిగా చిత్రించలేదు. అందుచేత మొదట అతడు దుష్టుడనే విషయం అంగీకారయోగ్యంకాదు. ఆరంభంలో అపరిమితమైన అతిసాహసకార్యం బౌద్ధస్వీకారానంతరం మహా కారుణ్యంగా సాత్త్విక సుధాపేశలమైన అహింసగా పరిణమించిందనీ, సద్ధర్మం ఎంత మహోన్నతమైనదో మానవుల్లో పాశవప్రకృతిని తొలగించి సతోద్రేకం ఎలాకలిగిస్తోందో చూపడానికి కొంతకథ ఎవరో అల్లి ఉండవచ్చును. రాజ్యానికి ఆయనవచ్చిన నాలుగేళ్ళకు పట్టాభిషేకం చేసికొన్నాడని మహావంశం * చెబుతున్నది. శిలాలేఖనాల్లో అతని పట్టాభిషేకప్రస్తి ఉండడంచేత అది చారిత్రకసత్యము. నాలుగేళ్ళ తరువాత అతని పట్టాభిషేకం ఎందుకు జరగాలి? ఈ లోపున ఎందుకు పట్టాభిషిక్తుడు కాలేదు? ఇలాప్రశ్నలు బయలు దేరుతవి. సింహాసనంకోసం రక్తపాతంచేసి నాలుగేళ్ళతరువాత రాజైనాడని • స్మిత్ గారి మతం. సింహాసనారోహణానికీ పట్టాభిషేకానికీ నాలుగేళ్ళవ్యవధి అంగీకారయోగ్యంకాదు. భండార్కర్ తప్ప తక్కినవారు వ్యవధిని ఆమోదించినవారే.

---

* మహావంసో—Geiger's Translation పుట 28

• Oxford History of India పుట 93

అయితే బౌద్ధగ్రంథాలలో ఉల్లేఖింపబడిన అశోకుని క్రౌర్యోదంతం సత్యదూరమని తోసివేయడానికీ వీలులేదు. సోదరులందరూ సింహాసనంకోసం యుద్ధంచేసిన మాటనిజం. అశోకుడు తన సవతిసోదరుడైన సుషీమున్ని మోసిరాజని, మహామంత్రి రాధాగుప్తుని సాహాయ్యముతో రాజ్యానికి రాగలిగినాడని చెప్పవలసివస్తుంది. 4, 5 శిలాలేఖనాల్లో బంధుప్రసక్తి వచ్చినప్పుడు ఒక వ్యాఖ్యనుబట్టి అతనికి బంధుప్రీతి అధికమని తెలుస్తున్నది. ఇదినిజమయితే అతడు భ్రాతృవధచేసి ఉండడు. ఈవ్యాఖ్య సరియైనది కానిపక్షంలో సోదరులను వధించి రుధిరస్రవంతిలో ఈదులాడి రాజదండం స్వీకరించి ఉంటాడు.

* దేవానంపియ మాసీక్-శిలాలేఖనంలోతప్ప తక్కిన శాసనాల్లో అశోకుడు "పియదశి" "దేవానంపియ" (ఘనప్రభువు) అనే బిరుదనామాలతో పేర్కొనబడినాడు. ఈశబ్దాలకు విశేషార్థంలేదు. సామాన్యంగా రాజపరంగా వాడే శబ్దాలివి. "పియదర్శన" అనేదాన్ని అశోకునితాత ఉపయోగించినాడు. అనగా హృదయము గలవాడని అర్థం • కొందరు చెప్పినారు.

గవర్నరు యువరాజుగా ఉండగా అశోకుడు యోధుడు పరిపాలనా సామర్థ్యంగలవాడు. కొన్నాళ్ళు ఉజ్జయినికి,

---

* Barua's edi. .Asokan Inscriptions—2 R. Edict

• Dr. Kern Vincent Smith ది చెప్పిన అర్థం.

కొంతకాలం తక్షశిలకూ రాష్ట్రపాలకుడుగా ఉన్నాడు. తక్షశిలలో అతడు తిరుగుబాటు అంచివేసినట్లు దివ్యదానం చెబుతున్నది. తాతగారైన చంద్రగుప్తునివలెనే అశోకునికీ సామ్రాజ్యకాంక్ష ప్రబలం. దివ్యావదానాన్నిబట్టి అతడు స్వదేశం జయించినాడు. ఈవిజయప్రసక్తి శాసనాల్లోలేదు. ఒక్కకళింగ విజయమే శాసనాల్లో ఉల్లేఖింపబడింది.

కళింగ యుద్ధం రాజ్యాభిషిక్తుడైన తొమ్మిదవయేట అతడు కళింగమును జయించినాడని 13 శిలాలేఖనంవల్ల తెలుస్తున్నది. * కాళింగులు సామ్రాజ్యశక్తిని ప్రతిఘటించి వేలాదివేలు రణరంగంలో సహాతులైనారని విశదమవుతున్నది.

పరివర్తనం కళింగయుద్ధానంతరం జీవకోటినాశనం కళ్ళారా చూచినప్పుడు అశోకుని సామ్రాజ్యతృష్ణ శాశ్వతంగా ప్రేలిపోయింది. యుద్ధవిముఖుడై సాత్వికమూర్తియైనాడు. కరుణా శీతలమాధుర్యం, పశ్చాత్తాపంలో వేగిపోయిన హృదయం ఆయన పొందుపరిచిన శిలాక్షరాలవల్ల తెలుస్తున్నది.

" సోయమ్మతజనోతదా కళింగేహతోచ ముటోచ
అపవుఢచ తతోశతభగేన సహస్రభగవ అజగురు
మతంవో దేవనంప్రియస " •

• బారువా edition-Asokan Inscriptions-కలకత్తాయూనివర్సిటీ 2 vols షాబాజ్‌ఘడీ చూడుడు.

• Barua's edi Asokan Inscri. 2 R. Edict గిర్నార్‌పాఠం.

ప్రపంచచరిత్రలో ఏచక్రవర్తయినా విజయానంతరం విజయోన్మాదం పొందడమేకాని అశోకునివలె పశ్చాత్తాపంలో వేగి హృదయభావాలను సువ్యక్తంచేసిన వాడులేడు. ఏవం గుణ విశిష్టుడైన సమ్రాట్టు, నభూతోన భవిష్యతి. తాను మనసార విశ్వసించిన ధర్మసూత్రాన్ని, అంతరంగములో చేసికొన్న నైతికనిర్ణయాలను అనుష్ఠించడానికి యావజ్జీవం, యావత్ సామ్రాజ్యశక్తినీ ధారపోసిన మహాధార్మికుడు అశోకుడు.

యుద్ధ ఘోషస్థానే ధర్మఘోష మానవకోటిని మరణహోమం చేసే యుద్ధోన్మాదంనుంచి విడిపడిన మహాసాత్వికుడు అశోకుడు. మానవ హృదయ రాజ్యాలను జయించేనిమిత్తం ధర్మవిజయం అనలంబించి, నిజరాజ్యానికి సరిహద్దులో వుండే ఆటవికులకు ధర్మోపదేశం చేసినాడు. ధర్మోపదేశకు తన ప్రజలకేకాక వైదేశికులకూ వినిపించినాడు " అహింస ఇంద్రియనిగ్రహం, సమవర్తన, వినయశీలా " మానవులు అలవరచుకోవలసిన గుణాలని ధర్మశాసనాలలో తెలియజెప్పినాడు. ఆయన శుష్కధర్మోపదేష్టకాడు. అందుచేతనే ధర్మాచరణ పద్ధతులు శిలాలేఖనాల్లో ఉల్లేఖించినాడు. ధర్మవిజయమే ఆయన జీవితాదర్శం. మైత్రి మానవకోటిని ఏకముచేస్తుంది. కత్తి చేయలేని పని కారుణ్యం అమోఘంగా చేస్తుంది. భేరీ ఘోషకుస్వస్తిచెప్పి ధర్మఘోషకు నాంది పలికించినాడు.

మానవత ఆయన తాత్వికుడుకాడు. బౌద్ధంలో నైతిక సూత్రాలనే ఆయన అనుష్ఠించి లోకానికి ఉజ్వలాదర్శం

చూపినాడు. భక్తి; దయ, అహింస ఇవే మానవలక్షణాలు. ఈ మానవధర్మాన్నే ప్రచారము చేసినాడు. కొన్నాళ్ళు బౌద్ధసంఘములో * ఉన్నాడు. సంవత్సరాంతములో ధర్మ ప్రచారకుడైనాడు. మహావంశమును బట్టి ఆయన బౌద్ధుడై నట్లు స్పష్టము. ఇత్సింగ్ అశోకభిక్షురూప చిత్రితమైన శిల్పాన్ని చూచానని వ్రాసినాడు. బౌద్ధసంఘంతో పరిచయాన్నికలిగి కేవల బౌద్ధము కాకపోవచ్చునని కొందరి మతము.

ప్రజాశ్రేయము భిన్నమతాలు ఎన్నిఉన్నప్పటికీ ఆయన అచంచల విశ్వాసంతో బౌద్ధధర్మాన్ని విశ్వజనీన మానవ శ్రేయోదాయక ధర్మంగాతలచి ప్రచారం చేసినమాట వాస్తవము. ధర్మాభిరతి ఎంత గాఢంకాకపోతే దేశదేశాంత రాలకుకూడా మతప్రచారకులను పంపుతాడు. ధర్మనిష్ఠ గాఢమైనా, సాత్వికుడయినా రాజ్యపాలనలో ఉదాసీనుడు కాడు. రాజధర్మం ప్రజాశ్రేయమూ సౌష్ఠవ పరిపాలనం కనుక పాలకుడై 'రాజధర్మం అనుష్ఠించినాడు. తనప్రజలపై ఎంత ప్రీతిలేకపోతే ఇలాశిలలమీద ఉల్లేఖిస్తాడు? "అందరూ నా బిడ్డలు. నా పిల్లల యోగక్షేమం నేను కోరినట్లు, ప్రజల ఇహమూ పరమూ కూడా నేను కోరుతాను." ఆరోశిలా లేఖనంలో "లోకమంతటి శ్రేయము నా విధ్యుక్తధర్మము. ఈ ధర్మసాధనకు ఉద్యోగులను ఏర్పాటుచేశాను. సర్వకాల

* "సంఘే ఉప్తేతే" అన్నపంక్తి వివాదభూయిష్ఠము.

సర్వావస్థల్లో అనగా నేను పేరోలగంలోఉన్నా, అంతఃపురంలో ఉన్నా, స్త్రీకక్ష్యలో ఉన్నా, ఆలశ్వప్రస్థానఉన్నా ఆరామవాటిలోఉన్నా ప్రజల యోగక్షేమం నాకు చాదులు చెప్పవలసి ఉంటుంది.

అశోకుని ఆదర్శాలు, రాజధర్మం, జీవితం సింహావలోకన చేశాము.

ఆయన కుటుంబము ఆయన బంధుప్రీతిగలవాడు. ఠీ గిరిశిలా లేఖనంలో అతడు బంధుజనుల శ్రేయము కోరేవాడని తెలియ వస్తున్నది. ఆయన బంధువులు కొందరు పాటలీపుత్రంలోనూ, రాష్ట్రరాజధానులలోనూ ఉండేవారని గ్రహించవచ్చును. సప్తమ స్తంభశాసనాన్నిబట్టి ఆయనకు రాణువ చాలా ఉండేదని స్పష్టపడుతుంది. **Minor Pillar Edicts** వల్ల ఆయన రెండోరాణిపేరు కారువాకి, ఆమెసుతుడు తీవరుడు. బౌద్ధసాహిత్యాన్నిబట్టి ఆయన భార్యలు ఇంకానలుగురు. జ్యేష్ఠకుమారుడు మహేంద్రుడు. పెద్దకుమార్తె సంఘమిత్ర. వీరిద్దరూ ప్రథమ కళత్రమయిన శాక్యకుమారివల్ల జన్మించిన వారు. అశోకుడు సంఘమిత్ర మహేంద్రులను బౌద్ధధర్మ వ్యాప్తికై సింహళము పంపినాడు. కొన్నిబౌద్ధగ్రంథాలను బట్టి మహేంద్రుడు అశోకుని సోదరుడు అనగా తిష్యుడన్న మాట.

సాంచీ, సారనాథ శిలాలేఖనాలు చక్రవర్తికి బౌద్ధ సంఘాధిపత్యం ఉండేదని చెబుతున్నవి.

రాజ్యవిస్తీర్ణము చంద్రగుప్తుని కాలంలో మౌర్యసామ్రాజ్య విస్తీర్ణం స్థూలంగా తెలిసికొన్నాము. అశోకునికాలంలో ఆయన జయించిన కళింగరాజ్యాన్నికూడా కలుపుకోగా సామ్రాజ్య సీమలను సరిగా తెలిసికోడానికి వీలున్నది. ఆయన ధర్మశాసనాలున్న తావులనుబట్టి రాజ్యసీమలను నిస్సందేహంగా చెప్పవచ్చును. పశ్చిమోత్తర భారతసీమలో షాబాజ్‌గఢీ, మన్సేరాలోనూ; ఉత్తరానకాల్సీ; కథియవాడులో అనగాసౌరాష్ట్రంలో గిర్నారు, అయిదోశాసనం సోపారా (శూర్పారక) (పస్తుత బొంబాయి రాష్ట్రంలో; ఆరవశాసనం థాలీ ఒరిస్సాలో గంజాముజిల్లాలో, ఎనిమిదవది యర్రగుడి (కర్నూలు జిల్లా) లో ఉన్నవి. దక్షిణసీమలు తెలియడానికి రూపనాథ్ (జబల్‌పూర్ జిల్లా) బైరాత్ (రాజస్థాన్), ససరాం (బిహార్), మాస్కీ (రాయచూర్) గవిమఠ్, పులుగుండు (నిజాం), యర్రగుడి (కర్నూలు) అశోకుడు బౌద్ధక్షేత్రాటనం చేసినట్లు లౌరియా, అరరాజ్, రాంపుర్వా, నందన్‌ఘర్, నిగ్లీవా, లుంబినీ శాసనాలు తెలియ చేస్తున్నవి.

భారతదేశపు 14° అక్షాంశ దక్షిణభాగం మాత్రం అశోకసామ్రాజ్యంలో చేరదు. పశ్చిమోత్తరసీమ 14° అక్షాంశము దక్షిణమువరకూ ఉన్నది. 14° అక్షాంశమని చెప్పడానికి కారణం ఆయన సామ్రాజ్యసీమల్లో ఉన్న ప్రత్యంతదేశాల పేర్లు **2 Rock Edict** లో పేర్కొనబడినవి. ఆయన రాజ్యపు

పొలిమేరలలో ఉన్నవారు * చోళులు, పాండ్యులు కేరల పుత్ర, సాతియపుత్ర, దక్షిణానతాంబ్రపర్ణి, పశ్చినూన యవన రాజైన రెండవ • ఆంటియోకసురాజ్యం. సతియపుత్ర ఎక్కడున్నదో నిర్ధారణకాలేదు. చోళ, పాండ్య, కేరళపుత్రల వల్ల దక్షిణసీమ తెలుస్తున్నది.

పరిపాలన పదమూడవ శిలాలేఖనములోని పంక్తులవల్ల అశోక సామ్రాజ్యంలో కొన్నికూటాలు చక్రవర్తిపాలనలో ఉన్నట్లు, లేదా కొంతస్వాతంత్ర్యాన్ని అనుభవిస్తున్నట్లు విద్వాంసులు కొందరభిప్రాయపడుతున్నారు. "ఇక్కడే రాజు రాజ్యంలో యవన, కాంభోజ, నాభక, నాభపంక్తులు పారంపర్యంగా పాలకులైన భోజ ఆంధ్రపుళిండులూ ప్రతిచోటా దేవానాం ప్రియుని ఉపదేశాలను అనుసరిస్తూ ధర్మబద్ధులైనారు" అనగా ఈ రాజ్యాలు అశోకునిపాలనలో లేకపోవాలి; లేదా ఆయన సామ్రాజ్యంలోనైనా ఉండాలి. ఆయన రాజ్యంలో ఉన్న రాజ్యాలను వేర్వేరుగా ఎందుకు చెప్పినాడో అది అస్పష్టము.

యవన కాంభోజ రాష్ట్రాలు భారతదేశానికి పశ్చిమోత్తర సీమలో ఉన్నవి. సామ్రాజ్యంలో యవనరాష్ట్రం

---

* చోళ = తంజావూరు, తిరుచ్చిప్రాంతం
పాండ్య = మధుర, రామనాధ, తిన్నవెల్లి
సత్యపుత్ర = ఉత్తరమలబారు (?)
కేరళపుత్ర = దక్షిణ మలబారు
• సిరియారాజు 261–46 క్రీ. పూ.

ఉండడం గమనించవలసిన విషయము. భోజులు బీరారులోవారు. ఆంధ్రులు కృష్ణా గోదావరీ ప్రాంతీయులు. ఆటవికులు కళింగరాజ్య సమీపంలో కొంతస్వేచ్ఛ అనుభవిస్తున్నారు. రాష్ట్రికులు * పితినికులుకూడా అటువంటివారే.

పై జెప్పబడిన రాష్ట్రాలను మినహాయించినప్పటికీ సామ్రాజ్యం సువిశాలం. ఇంతవిస్తార సామ్రాజ్యాన్ని సౌష్ఠవంగా పాలించడం సులువైన పనికాదు. చంద్రగుప్త చక్రవర్తికాలంలో వలెనే ప్రభుత్వాధికారం వికేంద్రీకృతం చేయబడింది. కౌటిల్యుని అర్థశాస్త్రంలో చెప్పినరీతిగా అశోకునికాలంలో మంత్రి పరిషత్తు వ్యవహారంలో ఉండేది. ఇతా చెప్పడానికి కారణం ఆయశాసనాల్లో "పరిషత్" అనే శబ్దం ప్రయోగింపబడింది. ♦

తాను ప్రకటించిన ఆదేశాలన్నింటినీ తన ఉద్యోగులు ఆయామండలాల్లో సభలుచేసి ధర్మవ్యాప్తి చేయాలి. ఈ సూచనవల్ల అశోకుడు ఏకేశ్వర ప్రభుత్వాన్ని అంగీకరించడని నమ్మవలసి ఉన్నది. శాసనాలలోని సూచనలనుబట్టి ప్రాచీన రాష్ట్రీయ ప్రభుత్వ విధానమునుకూడా ఆయన ఆదరించేవాడని తెలుస్తున్నది. తోసలి, సువర్ణగిరి, ఉజ్జయిని, తక్షశిలా రాష్ట్రములు రాకుమారుల అధ్యక్షతనో, ఆర్యపుత్రుల అధ్యక్షతనో పరిపాలింపబడేవని శాసనాలు చెబుతున్నవి.

---

* రాష్ట్రికూటుల పూర్వులు
♦ జయస్వాల్ మతం

ఈనాలుగు నలుదెసలా ఉన్న ముఖ్యరాష్ట్రాలు. మధ్యరాష్ట్రమయిన పాటలీపుత్రాన్ని చక్రవర్తి స్వయంగా పరిపాలించే వాడని ఊహ చేయాలి. రాష్ట్రపాలకులలోనై ఆయారాష్ట్రాల్లో ఇతర అధికారులున్నట్లు శాసనాల్లో ఉన్నది. మహామాత్రులు రజ్జుకులు, ప్రాదేశికులు, యుక్తులు లేదా యుక్తులు, రాజపురుషులు, ముఖ్యులు, ప్రతివేదకులు అనువారు అధికారులు.

(ఎ) మహామాత్రులు * సామ్రాజ్యములో ముఖ్యమండలాలలో నగరాలలో వీరు నియమితులైనారు. కోసంబి, తోసలి, సమాపసువర్ణగిరి, ఇసిల. స్థానాలలో మహామాత్రులు శాసనాల్లో సూచింపబడినారు. కళింగ శిలాలేఖనాలలో నగర వ్యవహారకులను మహామాత్రులుగా పేర్కొనబడినారు. కౌటిల్యుని అర్థశాస్త్రములోని • పౌరవ్యవహారాలవలె, ఈనగర వ్యవహారకులు ఆయానగరాల్లో న్యాయపాలనం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రథమ స్తంభశాసనంవల్ల "అంత మహామాత్రులు" అనే ప్రత్యేకోద్యోగులున్నట్లు గ్రహించవచ్చును. వీరు సరిహద్దు ప్రాంతాలమీద అధికారులు కావచ్చును. అంతపాలురకు విశేషాధికారం ఉన్నట్లు, పౌర వ్యవహారకులకుగానీ, కుమారరాజులకుగానీ, రాష్ట్రపాలురకు గాని ఇస్తున్న వేతనము వారికిన్నీ ఇస్తున్నట్లు కౌటిల్యుని వచనం. ఎందుకంటే పరరాజ్యాలకు హద్దుల్లో ఉన్న

---

* city judiciaries

• కౌ. అర్థ—20 పుట

మండలాలను రక్షణచేయడం సులభసాధ్యంకాదు. అందుకే అంతమహామాత్రుల విషయం చెబుతూ "ధర్మపరిపాలనం, ధర్మవిధానం, ధర్మమార్గంవల్ల సుఖాన్నికల్పించడం, ధర్మానుసారంగా ఆజ్ఞాపించినాడు. విప్రులు అజీవకుల వ్యవహారాలుచూచే నిమిత్తం మరికొందరు మహామాత్రులు నియోగింపబడినారు.

(ఎ) రజ్జుకులు రజ్జుకులెవరనే విషయంలో భిన్నభిప్రాయాలున్నవి. విన్‌సెంట్‌స్మిత్తుగారి మతప్రకారం రజ్జుకుడు ఒక రాష్ట్రంలో రాజప్రతినిధిగాఉన్న కుమారరాజుకన్న తక్కువ హోదాలోవుండే పరిపాలకుడు. ఈ రజ్జుకులు "లక్షలాది జనులతో సంబంధం అనగా బాధ్యత కలిగిఉన్నారు" జానపదులకు "బహుమానం ఇవ్వడం, దండనలు విధించడం విధ్యుక్తధర్మం. రజ్జుకులుకు మరణదండన ఇచ్చే అధికారం ఉంది.

(ఇ) ప్రాదేశికులు వీరు మండలాధికారులు. వీరివిధులు :— పన్నులు వసూలుచేయడం, దుర్మార్గులైన ప్రజానాయకులను అణచివేయడం, కంటకశోధనం అనగా నేరములు శోధించి విచారించడం, చోరులజాడలు తీయడం, మండలాల్లో చిన్న ఉద్యోగులూ, చిన్నఅధిపతులూ, వారిప్రజలుచేసేపనులు పరిశీలించడమునూ.

(ఈ) యుతులు లేక యుక్తులు ప్రాదేశికులవలె వీరుకూడా అయిదేళ్ళకొకసారి తమతను ప్రదేశాల్లో సంచారంచేసి ధర్మప్రబోధం

చేయాలి. వీరి రాజకీయవిధులేవో తెలియరావు. మనుస్మృతిని బట్టి యుక్తులనేవారు. "ప్రనష్టాధిగతద్రవ్యము" ను అనగా పోగొట్టుకోబడిన ఆస్తిపాస్తులను భద్రం చేయవలసినవారు.

(౫) రాజపురుషులు కౌటిల్యుని అర్థశాస్త్రంలోకూడా పురుషులు లేదా రాజపురుషులు పేర్కొనబడినారు. స్మిత్తుగారి వ్యాఖ్యానాన్ని బట్టి వీరు వార్తాహరులై ఉంటారు.

(౬) ప్రతివేదకులు ప్రభువుచే నియోగింపబడిన చారులు. అర్థశాస్త్రంలో వీరికర్తవ్యాలు (అర్థ-Bk I - అధ్యా 11, 12, 16) చర్చ చేయబడినవి. * అశోకుని ఆకోశిలాలేఖనంలో "నేను భోజనం చేస్తున్నా, అంతఃపురంలోవున్నా, గర్భాగారంలో ఉన్నా, పల్లకీలోఉన్నా, ఉద్యానంలోఉన్నా ఎక్కడైనా సరే, ఏకాలమునందైనా ప్రజావృత్తాంతం నా ప్రతివేదకులు నాకు తెలియుచేయాలి" అని ఉన్నది.

(౭) ముఖ్యులు వీరు ధర్మాదాయాలపై అధికారులు. (7 స్తంభ శాసనం)

(౮) ప్రత్యక్ష మహామాత్రులు స్త్రీల బాగోగులను చూచేనిమిత్తం ఏర్పడిన అధికారి.

(౯) ప్రజభూమికులు ప్రజాసంస్థలను పరిశీలించే ప్రత్యేకాధికారికి ప్రజభూమికు • డనిపేరు. కూప, ఉదపాన, ఉద్యానములను, పాంథుల విశ్రాంతిగృహాలను, జనపథాలను సంరక్షించేవాడు.

---

* R. Edict 13

• R. Edict 12

రాష్ట్రసీమల్లో అటవీజనుల విషయంలో అశోకుడు చాకచక్యంగా వ్యవహరించినాడు.

పరిపాలనలో నూతనవిధానం అతడు ప్రవేశపెట్టినాడు. ప్రాదేశికులు, రజ్జుకులు, యుతులు, మహామాత్రులు తమ తమ మండలాల్లో అయిదేళ్ళకోసారి, రాజకీయ కార్యకలాపాలతోపాటు, "ధర్మానుశిష్టి" కోసం ప్రయాణం చేయవలసి ఉండేది. ఈ ప్రయాణాన్ని "అనుసంయానం" అని శాసనాలలో పేర్కొనబడింది.

పదునాలుగు శిలా లేఖనాలలోని సారము

1. శాసనంలో జంతుప్రాణ పావిత్ర్యమును గురించి విశదీకరిస్తున్నది. ఇది తనరాజనగరులో భోజనార్థం కావింపబడే జంతుహింసా నిషేధవిషయమును స్పష్టము చేస్తున్నది.

2. శాసనంలో మానవుల్ల్ శ్రేయము, జంతుతతిసౌఖ్యం కోరి అశోకుడు అనేకప్రదేశాలలో సలిపిన చికిత్సలు వివరింపబడినవి.

3. శాసనంలో అశోకుడు రాజకీయోద్యోగులు అన్నిప్రాంతాలలో అయిదేళ్ళకొకసారి సభలుచేసి మాతాపిత్రుశుశ్రూష వృద్ధులయందు గౌరవము, సత్ప్రవర్తనమూ, జీవహింసా నిరసనంవంటి ధర్మాలు ప్రకటించమని ఆజ్ఞచేసినాడు.

4. శాసనంలో ఈ ధర్మాలు పునశ్చరణ చేయమనీ, రాజాడంబరాలు విసర్జనీయాలనీ చెప్పబడినవి.

5. శాసనంలో అశోకుడు ధర్మమహామాత్రులను నియమించిన విషయం, వారికర్తవ్యాలూ వివరింపబడినవి.

6. శాసనంలో ప్రతివేదకుల కర్తవ్యాలు చెప్పబడినవి.

7. శాసనంలో మానవులలోని యోగ్యతను హెచ్చించే మన శుద్ధి, కృతజ్ఞత అనేగుణప్రశంస ఉన్నది.

8. శాసనంలో అశోకుడు వేటనువిసర్జించి ధర్మయాత్రచేసే విషయం లిఖింపబడింది.

9. శాసనంలో ప్రజలు కులధర్మాలు విడవక ధర్మజీవనం గడిపితే సంకల్పసిద్ధులు కాగలరని ఉన్నది.

10. శాసనంలో ధర్మానుష్ఠానంవల్ల ఆముష్మికపుణ్యం కలుగు తుందని ఉల్లేఖింపబడింది.

11. శాసనంలో ధర్మానుష్ఠానం విశదీకరింపబడింది.

12. శాసనంలో పరమత సహిష్ణుత ఆవశ్యకమనీ, ధర్మవిజయము కన్న అన్యవిజయంలేదనీ, సర్వభూతహితం ఆవశ్యకమనీ, కళింగయుద్ధానంతరం కలిగిన అశోకమహీవల్లభుని అనంత సంతాపమున్నూ, తత్ఫలితంగా మానసిక పరివర్తనమున్నూ, దేశాంతరాలలో విదేశీయులుకూడా ధర్మానుష్ఠానంచేస్తూ, ధర్మచరణంచేస్తూ ఉన్నారనీ, అశోకుడు దేశాంతరాలకు ధర్మప్రచారకులను పంపినట్టు విశదమవుతున్నవి.

13, 14 శాసనాల్లో ఇతరశాసనాలలో ఉల్లేఖింపబడిన వానికి ఉపసంహార వాక్యాలు కనబడతవి.

ధర్మప్రచారం - మహావంశము మహావంశమనే బౌద్ధగ్రంథాన్ని బట్టి అశోకునికాలంలో పాటలీపుత్రనగరంలో ద్వితీయ బౌద్ధ సంగీతి జరిగింది. మొగ్గలిపుత్రతిస్స, (మౌద్గల్యపుత్ర తిష్యుడు) సమావేశానికి అధ్యక్షుడు. అశోకుని అనతిప్రకారం ఈక్రింది ప్రచారకులను దేశదేశాలకు పంపడం సంభవించింది.

ప్రచారకునినామము	దేశము
1 మధ్యంతికుడు	కాశ్మీర గాంధారములు
2 మహారక్షితుడు	యవనదేశము
3 మధ్యముడు	హిమాలయప్రాంతము
4 ధర్మరక్షితుడు (యవనుడు)	అపరాంతకము
5 మహాధర్మరక్షితుడు	మహారాష్ట్ర
6 మహాదేవుడు	మహిషమండలము (మైసూరు, మాంధాత)
7 రక్షితుడు	వనవాసి
8 సోణోత్తరుడు	సువర్ణభూమి (బర్మా)
9 మహేంద్రుడు మొదలైనవారు	సింహళము

అశోకుని కాలము అశోకుని సింహాసనారోహణము క్రీ. పూ. 273 లో జరిగిందని బౌద్ధసాహిత్యంవల్ల సంప్రదాయంవల్ల, శిలాలేఖనాలనుబట్టి తెలియవస్తున్నది. ఆయనపరిపాలనాంతం క్రీ. పూ. 236 తో * సరి.

అశోపని అనుయాయులు అశోకుని అనంతరం మగధసింహాసనం అధిష్ఠించినవారు బలహీనులు. వారిమూలంగానే మౌర్య

* వివరాలు చూడు :- Age of Imperial unity-edited by Munshi, పుటలు 88, 89

సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. వారనామకులు. అశోకుని తరువాత చరిత్ర కొంతవరకు అయోమయం.

శిలాలేఖనాలనుబట్టి తీవరుడు అశోకపుత్రుడు సాహితీ సంప్రదాయంవల్ల మహేంద్రుడు, కుణాలుడు, జలౌకుడు అనే ముగ్గురుకుమార్తు చక్రవర్తికి. వాయుపురాణాన్నిబట్టి కుణాలుడు ఎనిమిదేళ్లు పరిపాలించినాడు. అతసి అనంతరం అయిదుగురే పాలకులనీ, వారిలో కడసారివాడు, బృహద్రథుడని తెలుస్తున్నది. మత్స్యపురాణ వచనాన్నిబట్టి అశోకుని అనుయాయులు :- దశరథుడు, సంప్రతి, శతధన్వుడు బృహద్రథుడు. దివ్యావదానం పైన జెప్పబడిన పేర్లలో పాటు సంప్రతి పుష్యమిత్రనామములు కూడాచేర్చింది. రాజతరంగిణి వల్ల కాశ్మీరపాలకుడు, జలౌకుడు. అతడు అశోకుని తరువాత వాడు.

భిన్నాభిప్రాయాలు ఇలాఉండగా నిజమైనచరిత్ర, నిర్ధారణచేయడం కష్టం. పురాణములు, బౌద్ధగ్రంథాలు జైనగ్రంథాలూ కుణాలుని విషయము అంగీకరించినవి. దశరథుడు అశోకునిపౌత్రుడని * శాసనాధారం ఉంది.

జైనగ్రంథాలవల్ల సంప్రతి జైనుడనీ పాటలీపుత్ర పాలకుడనీ తెలుస్తున్నది.

మౌర్యులలో చివరవాడు బృహద్రథుడని పురాణము లన్నీ అంగీకరించినవి. అతడు సేనాని పుష్యమిత్రునివల్ల నిహతుడైనాడని హర్షచరిత్రలో బాణుడు లిఖించినాడు.

---

* దశరథుని దానశాసనాలు నాగార్జుని కొండలమీద

కాశ్మీరములో జలౌకుడు పాటలీపుత్రముపై పడడానికి సన్నాహాలుచేసి కాన్యకుబ్జముదాకా విజయయాత్ర చేసినాడు. తోవలో మ్లేచ్ఛులను అనగా బాక్ట్రియన్ గ్రీకులను ఓడించినాడు. కాళిదాసుని "మాళవికాగ్నిమిత్ర" నాటకమునుబట్టి విదర్భకూడా మౌర్యరాజ్యమునుండి విడిపడి స్వాతంత్ర్యం ప్రకటించింది. క్రీ. పూ. 206 లో నాయవ్యసీమలో సుభగసేనుడనే మౌర్యరాష్ట్రపాలకుడు (అనగా నేటికాలపుగవర్నరు) స్వతంత్రుడైనాడు. ఇలామౌర్యరాజ్యం విచ్ఛిన్నంకావడం మొదలుపెట్టగా యవనులుకూడా తన్నాశనానికి తోడ్పడినారు. ఈ విషయం గార్గీసంహిత, పాతంజల మహాభాష్యం వల్ల తెలుస్తున్నది. సేనాని పుష్యమిత్రుడు, మౌర్యులలో కడసారిరాజైన బృహద్రథుని, సేనాసన్నాహ పర్యవేక్షణ సందర్భంలో కత్తితోపొడిచి చంపినాడు. వెంటనే సింహాసనం అధిష్ఠించినాడు.

మౌర్యసామ్రాజ్య పతనం

సుంగుల - 187—75 క్రీ. పూ. మౌర్యసేనాపతి అయిన పుష్యమిత్రుడు సామ్రాజ్యసేనానీకాన్ని అంతటినీ సమాయత్తం చేయించినాడు. మగధప్రభువు బృహద్రథుడు సేనను పర్యవేక్షణ చేస్తున్నప్పుడు పుష్యమిత్రుడతనిని వధించినాడు. సేనలు తిరుగుబాటు చేయలేదు. అనగా మౌర్యసామ్రాజ్యంలో

సేనను తన చెప్పుచేతల్లో పెట్టుకోగలిగి సామ్రాజ్య విచ్ఛిన్నమునకు కారకుడైనాడు.

పురాణములవల్ల పుష్యమిత్రుడు సుంగవంశీయుడని తెలియవస్తున్నది. సుంగులు బ్రాహ్మణులని పాణినికృతమైన "అష్టాధ్యాయి" (4-1-117) వల్ల విశదమవుతున్నది, కాని కాళిదాసుని మాళవికాగ్నిమిత్ర నాటికవల్ల అగ్ని మిత్రుడు పుష్యమిత్రుడూ "బైంబిక" వంశీయులని ఉన్నది.

(పాచీన మౌర్యసామ్రాజ్య మధ్యభాగములో పుష్య మిత్రుని రాజ్యం ఏర్పడింది. సుంగరాజ్యమునకు దక్షిణంగా, ఆగ్నేయంగా ఆంధ్రకళింగరాజ్యాలూ, ఉత్తరానఉన్న రాజ్యమూ స్వాతంత్ర్యం ప్రకటించినవి. పుష్యమిత్రుని రాజ్యంలో పాటలీపుత్రం, అయోధ్య, విదిశ, పంజాబులోని జలంధర్, శాకల నగరాలు చేరినవి.

మాళవికాగ్నిమిత్రం వల్ల తెలియవచ్చేచరిత్ర

పుష్యమిత్రుని కుమారుడు అగ్నిమిత్రుడు రాజప్రతినిధిగా విదిశానగరంలో (నేటి **Besnagar**) ఉండేవాడు. అప్పుడు అగ్నిమిత్రుడి బావమరిది అయిన వీరసేనుడు నర్మదాతీరస్థ దుర్గాధ్యక్షుడు. విదర్భను సుంగులు జయించినట్లు నాటికలో స్పష్టంగాఉంది.

<u>యవనధాటి</u> పుష్యమిత్రుడు యవనధాటిని ఎదుర్కొన్నాడు. ఈ విషయం పాతంజల మహాభాష్యంవల్ల విశదమవుతున్నది.

సాకేతము అనగా అయోధ్య, మాధ్యమికము (చిత్తూరు ప్రాంతం) ను యవనులాక్రమించినట్లు పతంజలి స్మరణలో ఉన్నది. అందుచేత ఆయన భాష్యంలో భూతకాలానికి ఉదాహరణంగా

"అరుణాద్యవనఃసాకేతమ్, అరుణాద్యవనో మాధ్యమికమ్"

అని ఇచ్చినాడు. ఎప్పుడు? యవనులధాటి జరిగిఉండవచ్చును? పుష్యమిత్రుడు మేర్యసేనాధిపతిగాఉండగా యవనుల దండయాత్ర జరిగిఉంటుంది. యవనులనోడించిన తరువాత అతనికి బలంచేకూరింది. తనవిజయోత్సాహంతో మౌర్యసింహాసన ప్రాప్తికి అతడు నిర్వ్యాజమకృషి చేసినాడు.

పుష్యమిత్రుడు సింహాసనారోహణం చేసినతదుపరి రెండోసారి యవనధాటిని ఎదుర్కొనవలసి వచ్చింది. మాళవికాగ్నిమిత్రములో అగ్నిమిత్రుని కుమారుడు, వసుమిత్రుడూ సేనాని పుష్యమిత్రుడునూ కలిసి కాళీ సింధు ప్రాంతములో యవనులతో పోరాడినట్లున్నది. పుష్యమిత్రుడశ్వమేధయాగం చేస్తున్నప్పుడు, కుమార వసుమిత్రుడు యాగాశ్వమును రక్షించబోయినాడు. యవనులోడిపోయి పారిపోయినారు.

ఓడిపోయిన యవనుడెవరు? ఈ పరాజితులయిన యవనులు బాక్ట్రియన్ యవనరాజులు. రెండుసార్లు పుష్యమిత్రుడు అశ్వమేధం ఆచరించాడంటే రెండుపర్యాయములు యవనులను ఓడించినట్లు

స్పష్టము. మొదటిసారి డెమిట్రియస్ అనేవాని నాయ కత్వాన, రెండోసారి మినాండరు లేక యూక్రటైడిస్ నాయ కత్వాన యవనులు మగధసామ్రాజ్యం విచ్ఛిన్నం చేయ బోయినారు.

వుష్యమిత్రుడు 36 ఏళ్ళు పరిపాలించినాడు. క్రీ. పూ. 187—151 వరకు. అతని తరువాత అగ్నిమిత్రుడు రాజ్యా నికి వచ్చినాడు. ఇతడే మహాకవి కాళిదాసుని మాళవికాగ్ని మిత్ర నాటకములోని నాయకుడు. అగ్నిమిత్రుని అనంతరం వసుజ్యేష్ఠుడు రాజైనాడేకాని అతని విషయం మనకు తెలి యడంలేదు. వసుమిత్రుడు తాతగారి యాగాశ్వమును యవ నుల బారినుండి రక్షించినాడు. వసుమిత్రుడన్నా సుమిత్రు డన్నా ఒకరే.

<u>యవనుడు వైష్ణవుడైనాడు:</u> ప్రయాగ ప్రాంతములో ఆషాఢసేనుని ప్రభాస గుహాశాసనములో 'ఉదాక' అనే పేరు కనబడు తున్నది. ఉదాకుడనగా అంధ్రక, అన్తక, ఆర్ద్రిక, ఓడ్రుక లేదా భద్రకుడనే అయిదో సుంగరాజుగా పరిశోధకులు తేల్చినారు. ఆషాఢసేనుడు సుంగుల సామంతుడని కొంద రన్నారు. కాని అందరూ అంగీకరించలేదు.

భిలాస్సాశాసనంలో హీలియడోటస్ అనే తక్షశిలావాసి అయిన యవనుడు భాగవత సంప్రదాయం స్వీకరించి గరుడ ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేసినట్లున్నా యవనరాజయిన ఆంటి యాల్సిడసు హీలియడోరసును కాశీపుత్ర భాగభద్రుని

దగ్గరకు రాయబారం పంపినాడు. భాగభద్రుడు బహుశ భద్రకుడనే అయిదో సుంగరాజు కావచ్చును.

సుంగనాశనం - కుట్ర సుంగులలో పదోరాజు, చివరవాడు పురాణాలనుబట్టి దేవభూతి. బాణుని హర్షచరిత్రవల్ల ఈ దేవభూతి బ్రాహ్మణమంత్రిగాడున్న వసుదేవుని కుట్రవల్ల చంపబడినట్లు తెలుస్తున్నది. దాసీకన్య మహారాణీ వేషంలో అతని దగ్గరికి చేరి చంపివేసింది. ఏతావతా పదిమంది సుంగవంశరాజులు 112 సంవత్సరాలపాటు పరిపాలించినారు. (క్రీ. పూ. 187 నుంచి క్రీ. పూ. 75 వరకు.)

భారతేతిహాసంలో సుంగుల చరిత్ర ముఖ్యం సుంగరాజ చరిత్ర మనకు విపులంగా లభ్యంకాకపోయినా ఆ ఘట్టము భారతేతిహాసములో ముఖ్యమైనది. పుష్యమిత్రుడు వైదేశికధాటిని ప్రతిఘటించి విశాల సామ్రాజ్యాధినేత కాగలిగినాడు. తాత్కాలికంగా మౌర్యసామ్రాజ్యము చిన్నాభిన్నంకాకుండా సుంగరాజులు రక్షణ చేయగలిగినారు. యవనులతో స్నేహసంబంధము నెరపినారు. మతచరిత్రలో సుంగుల పరిపాలనా కాలం గణనీయం. సుంగులు భాగవత మత సంప్రదాయాన్ని పోషించి, బ్రాహ్మణ ధర్మదీక్షా పరతంత్రులైనారు. యవనులుకూడా పరమభాగవతులై బ్రాహ్మణ ధర్మస్వీకారం చేసినట్లు భిల్సాశాసనం తెలియచేస్తున్నది. లలితకళలకు సుంగులు దోహదమిచ్చి పోషకులైనారు. పుష్యమిత్రునికి బహుశ సమకాలీనుడైన పతంజలి మహర్షి వ్యాకరణ మహా

భాష్య రచన చేసినాడు. విదిశానగరంలో విశిష్టమైన లలిత కళా సంప్రదాయం విలసిల్లినట్లు విజ్ఞులైన కొందరిమతం. అశోకచక్రవర్తి నిర్మించిన సాంచీస్తూపాలచుట్టూ సుందర ద్వారతోరణాలు సుంగరాజులు కల్పించి రసికావతంసులైనారు.

కాణ్వులు లేక కాణ్వాయనులు క్రీ. పూ. 75 నుండి క్రీ. పూ. 30 లో మంత్రిఅయిన వసుదేవ కాణ్వుడు తనప్రభువును దేవభూతిని కుట్రమూలముగా చంపించి మగధసింహాసనం అధిష్ఠించి నాడు. అతడు కాణ్వ వంశస్థాపకుడైనాడు. వసుదేవుడు యామిత్రుడు 14 ఏళ్ళు, నారాయణుడు 12 ఏళ్ళు, సుశర్మ 10 సంవత్సరాలు పరిపాలించినారు.

కాణ్వ వంశమును నాశనంచేసి ఆంధ్రభృత్యులు లేదా ఆంధ్రులు మగధకు పాలకులైనారు. విదిశానగర ప్రాంతంలోఉన్న చిన్నచిన్న సుంగరాజవంశాలను కణ్వులతోపాటు రూపుమాపి, ఆంధ్రులు సామ్రాజ్యాధిపత్యం వహించినారు.

కాణ్వుల అనంతరం పురాణాలనుబట్టి కాణ్వుల అనంతరము ఆంధ్రులు సింహాసనానికి వచ్చినారు. మగధను కొంతకాలం ఆంధ్రులు పరిపాలించినారు. కాణ్వుల పరిపాలనానంతరము నుండి గుప్తసామ్రాజ్యోదయంలోగా మగధ రాజ్యచరిత్ర అస్పష్టంగా ఉంది. రోహిల్ ఖండములో లభ్యమయిన

నాణెములు అగ్నిమిత్ర భద్రఘోష జ్యేష్ఠమిత్ర భూమిత్రులనే సుంగరాజులవి. పాంచాల ప్రాంతములో, అయోధ్యలో, బస్తర్ జిల్లాలో, పాటలీపుత్రంలో దొరికిన మిత్తరాజైన బ్రహ్మమిత్ర, ఇంద్రమిత్రాదుల నాణెములవల్ల మగధ రాజ్యాన్ని పాంచాల దేశీయులైన మిత్తరాజులు కొంత కాలం, కాణ్వులతరువాత పరిపాలన చేసిఉండవచ్చును.

భారతదేశంలో యవనులు

యవనులెవరు? భారతదేశపు పశ్చిమోత్తరభాగాన యవన దురాక్రమణవల్ల మౌర్యసామ్రాజ్యభాను డస్తమించినాడు. మౌర్యుల అనంతరం భారతేతిహాసంలో ఉత్తరాపథంలో అపరాంతములో* మధ్యదేశములో వైదేశికులు అధికార స్థాపన చేసికొన్నారు. ఆ వైదేశికుల్లో యవనులు ముఖ్యులు. మనభారతీయులు వైదేశికులను 'మ్లేచ్ఛ' లని వ్యవహరించినారు. యవనులు చినాసియాలోని గ్రీకులు. పాణిని అష్టాధ్యాయిలో 'యవన' శబ్దము గోచరిస్తున్నది. యవన శబ్దానికి ప్రాకృతరూపము 'యోన'. అశోకుని శాసనాలలో ఈ శబ్దం కనబడుతున్నది.

యవనుల హీనక్షత్రియులు మౌర్యులు భారతదేశపు వాయవ్య సీమను ఆక్రమించి అలెగ్జాండరు ఆశలను అడియాసలు చేసినారు. క్రీ. పూ. 305 లో సెల్యూకసు చంద్రగుప్త మౌర్యునితో యుద్ధము చేసినప్పటినుంచి క్రీ. పూ. 206

వరకు భారతదేశానికి, సెల్యూకసు తరువాతవచ్చిన యవన రాజులకూ మైత్రిఏర్పడింది. అశోకసామ్రాజ్యంలో యవన ప్రజలుండేవారు. అశోకుడు సౌరాష్ట్రంలో యవనతుషాస్పుణ్ణి రాష్ట్రపాలకుణ్ణిగా చేసినాడని శాసనాలవల్ల తెలుస్తున్నది. పతంజలి కృత వ్యాకరణ మహాభాష్యంవల్ల యవనులకూ, శకులకూ, అనిర్వాసిత శూద్రులుగా భారతసమాజములో స్థానము లభించిందని గ్రహించవచ్చును. మనుసంహితరీత్యా యవనులు హీనక్షత్రియులు. మహాభాష్యం మనుసంహిత బాక్ట్రియన్ గ్రీకులనుగురించి ప్రస్తావించినమాట వాస్తవం. క్రమేణా యవనులు భారతీయులు కాగలిగినారు.

బాక్ట్రియన్ గ్రీకులు

సెల్యూకసు రాజవంశముపై తిరుగుబాటు పార్థియా (ఖొరాసాన్, కాస్పియన్ సముద్రపు టాగ్నేయ ప్రాంతం) బాక్ట్రియా (ఉత్తర ఆఫ్ఘున్‌స్తాన్-ప్రాచీన బాహ్లీకము) అనే రెండు మండలాలు సెల్యూకసు రాజ్యంలోనివి. సుమారు క్రీ. పూ. 250 లో ఈ మండలాలు తమపై ఆధిపత్యం చలాయించిన సెల్యూకసు రాజవంశానికి చెందిన రెండవ ఆంటియోకసుపై (క్రీ. పూ. 261-246) ఎదురు తిరిగినవి. పార్థియాలో ఆర్సేకస్, బాక్ట్రియాలో రాష్ట్రపాలకుడుగావున్న డైడోటస్ సెల్యూకీయ రాజవంశాధిపత్యాన్ని ప్రతిఘటించినారు. సెల్యూకసు పాలకవంశీయులైన రెండవ ఆంటియోకసు,

రెండో సెల్యూకసు, మూడో సెల్యూకసుగాని పార్థియా బాక్ట్రియా రాష్ట్రాల్లో విప్లవాలు అణచలేక పోయినారు. మూడో ఆంటియోకసు (క్రీ. పూ. 223–187) పార్థియా బాక్ట్రియా పాలకులతో పోరాటం చేసినాడు. చివరకు ఆంటియోకసు రెండురాష్ట్రాల స్వాతంత్ర్యం అంగీకరించక తప్పలేదు.

మొదటి డైడోటస్ బాక్ట్రియాలో అనగా ప్రాచీన బాహ్లీక దేశంలో స్వతంత్ర యవన రాజ్యస్థాపన చేసినాడు. అతడు మొదట సెల్యూకిస్ రాజవంశీయుల పక్షమున రాష్ట్ర పాలకుడై కొంతకాలము పాలన చేసినాడు. తరువాత స్వతంత్రుడైనాడు.

నాణెములనుబట్టి రెండవ డైడోటస్ బాక్ట్రియా సింహాసనం అధిష్ఠించినాడు. అతడు పార్థియారాజుతో సంధి చేసికొని, సెల్యూకీయ వంశరాజైన రెండవ సెల్యూకసు మీద దాడిచేసినాడు. రెండో సెల్యూకసు పార్థియాను ఆక్రమించినాడు. రెండవ డైడోటసు పార్థియా బాక్ట్రియా రాజ్యాలను భద్రము చేయగలిగినాడు. పోలీబియసు ప్రకారము బట్టి మూడో ఆంటియోకస్ క్రీ. పూ. 212 లో యుద్ధ సన్నాహాలుచేయగా, యుథిడిమసు బాక్ట్రియా సింహాసనం అధిష్ఠించినాడు. యుథిడిమసు ఆంటియోకసును ఎదిరించక పోవటంవల్ల యుద్ధం జరగలేదు. దీనివల్ల తేలిన సారాంశం:— రెండవ డైడోటసు సెల్యూకీయ రాజవంశాన్ని ప్రతిఘటించి యుథిడిమసు చేతుల్లో పరాజయంపొంది రాజ్యభ్రష్టుడైనాడు.

యుధిడిమస్ పార్థియారాజుతో వైరం ఉపశమించిన తదుపరి మూడో ఆంటియోకసు క్రీ. పూ. 208 లో బాక్ట్రియాపై బడి యుధిడిమసును చెరగొన్నాడు. ఈ ముట్టడి రెండు సంవత్సరాలు పట్టింది. క్రీ. పూ. 206 లో సంధి జరిగింది. యుధిడిమస్ కుమారుడు, డెమిట్రియసు రాయబారము చేశాడు. సంధిప్రకారం యుధిడిమసు రాజలాంఛనం, బిరుదమూ వహించినాడు. డెమిట్రియసు ఆంటియోకసు కుమార్తెను పెళ్ళాడినాడు. ఆంటియోకసు సంధి అనంతరం కాబూల్‌నదీ ప్రాంతానికివచ్చి సుభగసేనుని రాజ్యములో ప్రవేశించినాడు. సుభగసేనుడు మౌర్యుల రాష్ట్రపాలకుడు. అతడు ఆంటియోకసుకులొంగి యుద్ధగజాలను కొంతధనాన్ని అర్పించినాడు. యుధిడిమసు నాణెములు రకరకాలుగా లభ్యమవుతున్నవి. కనుక అతడు విశాలరాజ్యం బహుకాలం పరిపాలించాడని అర్థం. ఆయన క్రీ. పూ. 197 లో దక్షిణ ఆఫ్ఘనిస్తాన్, దానిప్రక్కనేవున్న ఇరాన్ రాజ్యభాగం, భారతదేశపు వాయవ్యభాగమునూ ఆక్రమించినాడు. మూడవ ఆంటియోకసు యుద్ధములు చేయుటలో నిమగ్నుడైఉండగా యుధిడిమసుకు రాజ్యవిస్తరణావకాశం లభించింది. అయితే యవనాధిపత్యం భారతదేశపు నడిగడ్డమీద స్థాపించినవాడు యుధిడిమసు అని అనడంకన్న అతని కుమారుడు, డెమిట్రియస్ అని అనడం సముచితం.

డెమిట్రియస్ అలెగ్జాండరుకన్న నిజానికి విజయ పరంపర సాధించి జయలక్ష్మి సనాథులైనవాళ్ళు డెమిట్రియసు, మినాండరులనే

యవనవీరులు. యుధిడీమసు అనంతరం బాక్ట్రియా సింహాసనం డెమిట్రియస్ అధిష్ఠించినాడు. భారతీయ సారస్వతములో బాక్ట్రియా యవనుల ప్రస క్తి కనబడుతున్నది. క్రీ. పూ. 2 వ శతాబ్దారంభాన యవన సేనలు సాకేతము (అయోధ్యప్రాంతం), పాంచాలా (రోహిల్‌ఖండ్), మధురాపురాలమీద దండ యాత్ర చేసినట్లు యుగపురాణమునల్ల తెలియవస్తున్నది. డెమిట్రియసు యవన సేనలను మగధ సామ్రాజ్యముపై నడిపినాడు.

పాతంజల మహాభాష్యములో ఉల్లేఖింపబడిన యవన విజృంభణం పుష్యమిత్రుని కాలంలో సంభవించింది. మౌర్య లలో కడసారిరాజైన బృహద్రథుడు పుష్యమిత్రునివల్ల నిహతుడైపోవడంవల్ల, ఆ అవకాశం తీసుకొని యవనులు మౌర్యులపై విజృంభించినారు. గార్గీ సంహితప్రకారం యవ నులు పుష్పపురంలో (పాటలీపుత్రం) ఎక్కువకాలం నిలవ లేదు. దానికి కారణం వారిదేశంలో అంతర్యుద్ధాలు చెల రేగినవట. యవనులు మధ్యదేశం పోగొట్టుకొన్నారు. కొంత కాలంపాటు పంజాబు దిగువ సింధులోయ పుష్యమిత్రునివల్ల పోగొట్టుకొన్నారు.

భారతీయ సారస్వత పురాతత్వరీత్యా డెమిట్రియసుకూ మనకూ సంబంధం ఉన్నది. మహాభారతంలోని దత్తమిత్రుడే డెమిట్రియస్. నూధ్యమికంనుంచి డెమిట్రియసు వెనకుఁ మరలిపోయిన తరువాత అతని రాజ్యవైశాల్యం ఎంతఉన్నదో

ఇదమిత్థమని చెప్పలేము. బహుశ ఉత్తరాపథం, అపరాంతం, శాకలప్రాంతం అతని రాజ్యం కావచ్చు.

<u>యూక్రటైడిస్</u> డెమిట్రియసు భారత రాజ్యాలకోసం యుద్ధాలు చేస్తున్నప్పుడు బాక్ట్రియాకు దూరంకావడం తటస్థించింది. చాలాకాలం యుద్ధకార్యమగ్నుడు కావడంవల్ల స్వస్థానమైన బాక్ట్రియాలో యుక్రటైడిసు విప్లవనాయకుడై క్రీ. పూ. 173 లో సింహాసనం అధిష్ఠించినాడు.

నాణెములవల్ల అతని అనంతరం హీలియోకల్సు రాజ్యానికి వచ్చినట్లు చెప్పవచ్చును.

<u>హీలియోకల్సు</u> బాక్ట్రియన్ యవన రాజులలో తుదివాడు. బాక్ట్రియాను పార్థియనులు, ఉత్తరదేశీయులైన దేశద్రిమ్మరులు ఆక్రమించినారు. చైనీయ చరిత్రకారులనుబట్టి బాక్ట్రియాలో యవనరాజ్యాన్ని కొంతమేర శకులనే తెగవారు ఆక్రమించినారు. స్వరాజ్యం పోయినతమపరి హీలియోకల్సు కాబూలులోయ, భారత రాజ్యభాగాలమీద ఆధారపడవలసి వచ్చింది. అతనికి భారతదేశంలో విజయప్రాప్తి కలిగినట్లు నాణెములవల్ల చెప్పవచ్చును.*

<u>హైందవ యవన పాలకులు</u> యవనులు స్వరాష్ట్రమైన బాక్ట్రియాను పోగొట్టుకొన్న తమపరి ఆఫ్ఘనిస్తాన్‌లో కొంతభాగాన్ని

---

* అగాథొక్లియోయి, ప్రథమస్ట్రాటోలు కలిసి ప్రచురించిన నాణెములు లిపీయోకల్సువల్ల పునఃప్రచురితములు.

భారతదేశపు వాయవ్యప్రాంతాన్ని పరిపాలిస్తూవచ్చినాడు, ఈ ప్రదేశంలో డెమిట్రియసు రాజవంశ పట్టమూ యుక్రైడిసు రాజపట్టమువారూ తరతరాలుగా సమరాలు సలుపుకొంటూ వచ్చినారు. ఇదే యవన పరిపాలనా చరిత్ర. హైందవ బౌద్ధీయను యావన పాలకనామములు ముప్పై దాకా కేవలం నాణెములవల్లనే తెలియవస్తున్నది. ఈ ముప్పదిమంది పాలకులూ రెండు శతాబ్దాలకన్న ఎక్కువ కాలం పాలించలేదు.

మినాండర్ క్రీ. పూ. 115—90. యవనరాజులలో గొప్ప వాడు. బౌద్ధసంప్రదాయంలో మినాండరు బౌద్ధధర్మ పరిపోషకుడుగా కనబడుతున్నాడు. పాళీభాషలో ఉల్లేఖింపబడిన 'మిళిందపన్హో' అనే గ్రంథంలో మిళిందుడూ మినాండరూ ఒకరేనని విద్వాంసుల నిర్ణయం. మిళిన్దుడనే నామాంతరం క్షేమేంద్రకవికృత 'అవదాన కల్పలత' లో గోచరిస్తున్నది. మిళిందప్రశ్ననుబట్టి ఆయన జన్మస్థానం కలశీగ్రామం, కాబూలు సమీపాన. మినాండరు రాజధాని శాకలనగరం (నేటి సయాల్‌కోట). నిజరాజ్యం అర్హతులకర్పించి తాను బౌద్ధధర్మదీక్ష స్వీకరించినాడట! ఇదంతా చారిత్రికంకాదు. మినాండర్ విజాతీయుడైనా భారతీయ హృదయానికి సన్నిహితుడు కాగలిగినాడుకనుక అతనిచుట్టూ ఎన్నో గాథలు పెరిగినవి.

ప్లూటార్కు రచయిత మినాండరును ధర్మప్రభువుగా ప్రజాదరణకు పాత్రుడైనవాడని వ్రాసినాడు.

డెమిట్రియసు మరణానంతరం క్రీ. పూ. 165 లో మినాండరు పరిపాలనారంభకాలమని చరిత్రవేత్తలందరూ అంగీకరించారు. అందుచేత పుష్యమిత్ర సుంగుని పరిపాలనా మధ్యకాలంలో మినాండరు సమకాలికుడు కావడానికి వీలున్నది. అనగా క్రీ. పూ. 2 లో పుష్యమిత్రుడు, మొదటి డెమిట్రియసు నాయకత్వాన వచ్చిన యవనసేనను, సింహాసనం అధిష్ఠించిన తదుపరి రెండోసారి యవనులను ఎదుర్కొన్నాడు. రెండోసారివచ్చిన యవనసేనకు నాయకుడు మినాండరు.

భారతీయ సంప్రదాయరీత్యా పుష్యమిత్రుని ఆనంతర కాలీనుడిగా మినాండరు కనబడతాడు.

ఇతర మతాలనుబట్టి యూక్రటైడిసు పరిపాలనా మధ్య కాలంలో మినాండరు సమకాలికుడని నాణెములవల్ల విదితము.

మినాండరు రాజ్యంలో ఆఫ్ఘనిస్తాన్ మధ్యభాగం, వాయవ్య భారతసీమ, పంజాబు, సింధు, రాజస్థాన్, కథియవాడ్ చేరిఉండాలి.

ఆంటియాల్సిడిస్ ఇతనిపేరు భిల్సాశాసనమువల్ల భారతీయ చరిత్రలో ప్రసిద్ధము. ఆంటియాల్సిడిస్ యొక్క పథ్నాలుగో సంవత్సర పాలనాకాలంలో, ఆయన తక్షశిలావాసిఅయిన హీలియోడోరసుఅనే రాయబారిని సుంగరాజైన కాశీపుత్ర భాగభద్రుని దగ్గరకు పంపినాడు. హీలియోడోరసు రాయ

బారిగా సుంగరాజధానిఅయిన విదిశానగరంవచ్చి క్రీ. పూ. 113 లో భాగవత వైష్ణవం స్వీకరించి గరుడధ్వజ ప్రతిష్ఠ చేయించినాడు. ఆంటియాల్సిడిస్ సుంగరాజు స్నేహం కోరి ఉండవచ్చును. అందుకే నాయబారిని పంపినాడు. యుధిడిమసు రాజవంశీయుడైన మినాండరును ప్రతిఘటించేనిమిత్తం భారత ప్రభుని స్నేహం కోరి ఉండవచ్చును.

భరతదేశంలో యవనుల ప్రాభవం క్షీణమగుట మినాండరు మరణానంతరము అతని అనుయాయులు గాంధారంలో, ఆఫ్ఘనిస్తాన్ లోనూ ఆధిపత్యం పోగొట్టుకొని ఉంటారు. పంజాబు తూర్పు భాగాన్ని అగ్రోధాక్షియాయి ప్రథమస్ట్రాటోలు పరిపాలించినట్లు నాణెములవల్ల తెలుస్తున్నది. మొదట ప్రథమస్ట్రాటో మైనరుగా పరిపాలన చేశాడు. ఆతని వృద్ధక్షీణరూపంగల నాణెములవల్ల అతని పరిపాలనాకాలం దీర్ఘమని గ్రహించవచ్చును.

యవన ప్రాభవం బాక్ట్రియా, పశ్చిమోత్తర భారత దేశం ఆఫ్ఘనిస్తానులలో క్షీణించిపోయింది. అయితే మనకూ యవనులకూ రాజకీయ సంబంధం విడిపోలేదు, శక పహ్లవ కుషాణుల ఆధిపత్యం వచ్చినప్పటికీ.

శక పహ్లవ కుషాణులకింద చిన్నచిన్న రాజ్యాలు ఏలుతూ కొందరు యవను లుండేవారు. క్రీ. పూ. 106-130 క్రీ. శ. లో ఆంధ్ర శాతవాహన ప్రభువైన గౌతమీపుత్ర

సాతకర్ణి తాను శక, యవన, పహ్లావులతో ఘర్షణ తెచ్చు కొన్నాడు, కధియవాడు, మాళవములకు సమీపంలో శక స్థావరాలు అనగా గౌతమీపుత్రుని రాజ్యానికి ఉత్తరంగా ఉండేవి.

Bibiliography

Cambridge History of India Vol I–17,22

Ancient India by E. J. Rapson.

Greeks in Bactria and India by W. W. Tarus.

Age of Imperial unity—general editor K. M. Munshi Vol 2.

Malavikagnimitram by Kalidasa.

Early History of India by Vincent Smith.

Mudra Rakshasam by Visekhadatta.

Artha Sastra by Kautilya — Shamasastri's edition.

Divyavadana—Cowel and Neil's edition.

Asoka—Vincent smith.

Asoka—Radhakumud Mukharjee.

Asoka—Bhandarker.

Mahavamso—Geiger's translation.

Asokan Inscriptions—Barma–2 Vols. Calcutta University.

Ancient India—R. C. Mazumdar. Published by Banarasidas, Benares.

శకపహ్లవులు

శకులు భారతదేశంలో ఆదిశకులలో శక పహ్లవ ఇరానీయ రక్తసాంకర్యమున్నది. భారతదేశంలో అవతరించకిపూర్వం శకులు బహుకాలం పార్థియారాజుల పాలనలో ఇరానీయ శకస్థానములో ఉండేవారు. అప్పుడే రక్తసాంకర్యం సంభవించింది. హిందూదేశంలో అనతరించిన తదుపరి శకులు క్రమంగా భారతీయ సమాజంలో ఇమిడిపోయి భారతీయులతో వైవాహిక సంబంధాలుకూడా చేసికొన్నారు. పతంజలికృత మహాభాష్య కాలానికే యవనులవలె శకులూ అనిరవసిత శూద్రులుగా పరిగణింపబడినారు. మనుసంహిత యవన శక పహ్లవులను హీనక్షత్రియులని అంగీకరించింది.

హోనోన్స క్రీ. పూ. 18—1. వోనోన్సు అనే ప్రపథమ పార్థీయ పాలకుడు తూర్పు ఇరానుదేశపురాజు. అతని పారశీకనామము 'వనాన'. 'రాజాధిరాజ' బిరుదాంకితుడు. డ్రాంగియానాలో రెండవ మైత్రడేటుస్ తరఫున రాజప్రతినిధిగాఉండి, క్రీ. పూ. 18 లో ప్రభుమరణానంతరం స్వతంత్రుడైనాడు. అతని సవతిసోదరులలో పారశీక శక సాంకర్యమున్నట్లు కనబడుతుంది. దక్షిణ ఆఫ్ఘనిస్తాన్, తూర్పు రాష్ట్రాలనూ రాజప్రతినిధులమూలంగా పరిపాలించినట్లున్నది.

వోనోన్సు సోదరుడైన స్పాలహోరునితో, మేనల్లుడైన స్పాలగడమునితోకలిసి రాజ్యపాలన మొదట చేసినట్లు

నాణెములవల్ల ఊహించవచ్చును. స్పాలిరీషుడనేవాడు ఎోనోన్నుకు సోదరుడో సవతిసోదరుడో కావచ్చును. అతడన్నగారి తరఫున *రాజప్రతినిధిగా దక్షిణ ఆఫ్ఘనిస్తాను పరిపాలించినాడు, స్పాలిరీషుడు ఏజెస్సూ కలిసి మహారాజ బిరుదం వహించి (రాష్ట్రపాలక బిరుదము) ఎోనోన్నుకు సామంతులుగా పరిపాలన చేసిఉండవచ్చునని నాణెములవల్ల చెప్పవలసి ఉంటుంది. ఎోనోన్ను అనంతరం కొంతకాలానికి స్పాలిరీషుడు రాజ్యానికి వచ్చినాడు. •అతడు ఎోనోన్ను యొక్క నాణెములను పునఃప్రచురించినాడు. దీనినిబట్టి ఇలా ఊహ చేయవచ్చును. ఎోనోన్నుకు వార్ధక్యములో రాజ్యం పోయింది. సోదరుడు స్పాలిరీషుడు సింహాసనం ఆక్రమణ చేసి ఉంటాడు. స్పాలహోర స్పాలగడములుకలిసి ప్రచురించిన నాణెములను స్పాలిరీషుడు పునఃప్రచురణ చేసినాడు. అనగా బహుశ స్పాలిరీషుడు వారిద్దరినీ సింహాసన చ్యుతులను చేసి ఉంటాడు. అలా వారిని రాజ్యభ్రష్టుల్ని చేయడానికి కారణం ఎోనోన్ను పక్షమువారై ఉండడంవల్ల. ఎోనోన్ను రాజ్యం అపహరింప బడుతున్నప్పుడు అతని విశ్వాసపాత్రులుచూస్తూ ఎలా ఊరుకోగలరు ?

అందుచేత శకరాజైన మోగ (Mauses) స్పాలిరీషుని వ్యతిరేకించి స్వతంత్రుడైనాడు. ఈ విషయము నాణెముల

---

* Zeus standing Cointype of Heliocles వల్ల.

• Zeus enthroned నాణెమువల్ల.

వల్ల, 78 శకసంవత్సరపు తక్షశిలాశాసనంవల్ల తెలుస్తున్నది. వోనోన్స శకస్థాపకుడని కొందరిమతం. అయితే అంతగా విశ్వసించడానికి ఆధారాలులేవు.

మోగ (Mauses or Maues) అతని అనుయాయులు క్రీ. పూ. 20 క్రీ. శ. 22. స్పాలిరీషుడు వోనోన్సునుయొక్క సింహాసనాన్ని దురాక్రమణ చేసినప్పుడు మోగ *'రాజాధిరాజ' బిరుదం వహించి శకప్రాభవాన్ని పశ్చిమోత్తర భారతసీమలో స్థాపించినాడు. మోగుడు గాంధారము ఆక్రమించాడని తక్షశిలా • శాసనంవల్ల తెలుస్తున్నది. మోగుని తరువాతి నాణెములవల్ల మొదటి ఏజెస్ (అయుడు) రాజ్యానికి వచ్చినాడు.

1 ఏజెస్ క్రీ. పూ. 5—30 క్రీ. శ. మొదటి ఏజెస్ స్పాలీరీషునితో కలిసి దక్షిణ ఆఫ్ఘనిస్తాన్ గవర్నర్లుగా, వోనోన్సుయొక్క సర్వాధికారంక్రింద ఉండేవారు. శకపాలనలో* విశేషం రాజు ఒకసామంతరాజున్నూ లేక పాలకుడూ ఉప పాలకుడున్నూకలిసి పాలించడం గమనించదగినది. రాజుతండ్రి కావడమూ, కుమారుడు ఉపరాజుగా వుండడమున్నూ గమనించాలి. ఏజెసు స్పాలిరీషుని కుమారుడని ఒక అభిమతం. ఇది నిజమైతే అతడు మోగుని అనంతరం భారతదేశంలో

---

* "రాజాధిరాజ. మహతమోఅస"—మోగుని నాణెమునకు పెడవైపు.

• 78 శక సంవత్సరం అనగా క్రీ. శ. 21.

శకస్థానాలమీద ఆధిపత్యం వహించి 'రాజాధిరాజ' బిరుదము వహించాడని అర్థం. మోగునికీ ఏజెసుకూ బాంధవ్యం కూడా ఉండిఉండాలి. బహుశ స్పాలిరీష పుత్రుడైన ఏజెసు మోగుని అల్లుడు కావచ్చును. *నాణెములనుబట్టి పరిశోధకులు ఏజెసు మోగుని రాజ్యమే పాలనచేయడంకాక, యుధిడిమియసు యనన రాజవంశీయుల పాలనకు స్వస్తిచెప్పాడని తేల్చినారు.

ఏజిలైసెస్ (ఐలీషుడు) క్రీ. శ. 28-40. మొదటి ఏజెసు కుమారుడైన ఏజిలైసెస్ లేక ఐలీషుడు రాజైనాడు. తండ్రి రెండు కులూకలిసి రెండున్నాళ్ళు పరిపాలించినారు.

2 ఏజెస్ (అయుడు) క్రీ. శ. 35-79. ఐలీషుని కుమారుడైన (?) 2 వ ఏజెసు రాజైనాడు. హైందవ శక రాజవంశ వృక్షము ఈ తీరుగా నాణెములనుబట్టి ఏర్పరచవచ్చును.

1. మోగుడు (Maues) క్రీ. పూ. 20—22 క్రీ. శ.

2. 1 వ ఏజెస్ (అయుడు) క్రీ. పూ. 5—30 క్రీ. శ. స్పాలిరీషపుత్రుడు.

3. ఏజిలైసెస్ (ఐలీషుడు) క్రీ. శ. 28—40. ఏజెస్ పుత్రుడు.

4. 2 వ ఏజెస్ (అయుడు) క్రీ. శ. 35—79. ఐలీష పుత్రుడు.

---

* "Athene Promachos" అని గాధవున్న మొదటి ఏజెసుయొక్క నాణెమునకుపెద.

గండోఫర్నిస్ క్రీ.శ. 21-46. స్పాలిరీషునిఅనంతరం వ్యాత్రఘ్ను డు ద్రాంగియానా, రాజ్యసింహాసనంఅధిష్ఠించినాడు. ఆర్కోసియాకు అతని ప్రతినిధిగా గండోఫర్నిస్ (విందవర్ణుడు) పరిపాలన చేసినాడు. అతడు క్రమేణ స్వతంత్రుడై చక్రవర్తి కాగలిగినాడు. ఈ విషయం నాణెములవల్ల తెలుస్తున్నది. ఉత్తర భాగంలో కాబూలులోయలో ఆఖరు యవనరాజయిన 'హెర్మాయిసు'ను ఓడించినాడు. ఈ విజయం ఎక్కువ కాలం మనలేదు. ప్రథమ శతాబ్దమధ్యములో కుజులకాడ్ ఫిసెస్ ప్రథమ కుషాణరాజు. అతడు కాబూలులోయ ఆక్రమించినాడు. నాణెములనుబట్టి అతడు దక్షిణ ఆఫ్ఘనిస్తాను కూడా వశముచేసికొన్నాడు. భారతదేశంలో గండోఫర్నిసు శకుల నోడించడం చాలా ముఖ్యవిషయం. ఆతడు గాంధారాన్ని ఆక్రమించినట్లు తఖ్తీబాహి శాసనంవల్ల తెలుస్తున్నది.

నాణెములవల్ల గండోఫర్నిసు తన గవర్నరయిన అల్డ గీసెసుతో కలిసి పరిపాలన చేసినట్లున్నారు. అతనికింద అస్పవర్మ (అశ్వవర్మ) సేనాపతిగా ఉండేవాడు. ఇతడూ రెండవ ఏజెసుఉన్న కొన్ని నాణెములు లభించినవి. వీటినిబట్టి పశ్చిమోత్తర భారతసీమలను అశ్వవర్మ శకరాజయిన రెండవ ఏజెసుకింద రాజప్రతినిధిగా పరిపాలించినాడు. అనంతరం పహ్లావచక్రవర్తిఅయిన గండోఫర్నిసుకు ప్రతినిధిగాకూడా పని చేసినాడు. అయితే రెండోఏజెసు పాలనలోవున్న రాజ్యమంతటినీ గండోఫర్నిసు జయించాడని అనడానికి వీలులేదు.

విషమ పరిస్థితుల్లో శకరాజు బహుశ కుషాణుల అండ జేరిఉంటాడు. కుషాణులు క్రమంగా పహ్లావులను గాంధారం నుంచి తరిమివేసినారు. పశ్చిమోత్తర భారతదేశాన్ని కుషాణులు భద్రపరచుకొన్నారు. శక పహ్లావుల భారతదేశ రాజ్యాలను కుషాణు లాక్రమించినారు.

తక్ష్తీబాహి శాసనాన్నిబట్టి గండోఫర్నీసు క్రీ. శ. 21 నుండి 49 దాకా పరిపాలించినాడు. ఈ శాసనాల్లో 'గుడుహవర' అని పేర్కొనబడ్డ నామమే గండోఫర్నీసుగా విద్వాంసులు చెప్పినారు. కుషాణులు పహ్లావులను పారదోలి గాంధారాన్ని జయించినట్లు పంజిటర్ 136 వ సంవత్సరం తక్షశిలా శిలాలేఖనాలవల్ల తెలుస్తున్నది. అయితే ఈ శాస నాలు కుషాణ్రప్రభుని నామము సూటిగా చెప్పలేదు. పంజిటరు శాసనంలో 'మహారాజగుషణ' అని ఉన్నది. తక్షశిలా శాసనంలో రాజ్రప్రతినిధి నామము 'మహారజ రజతిరజ దేవపుత్రకుషణ' అని ఉన్నది.

తక్షశిలలో గండోఫర్నీసు నాణెములు లభించినై. ఈ నాణెములనుబట్టి తక్షశిలాప్రాంతంలో పహ్లావులు పరిపాల నను కుషాణులు అంతమొందించినట్లు స్పష్టమవుతున్నది. *

---

* Age of Imperial unity Vol II of Bharateeya Vidya Bhavan పుటలు 131—132 వివరాలు చూడు.

క్షత్రిపకుటుంబాలు

క్షత్రపులనే శబ్దానికి ప్రాకృతరూపం ఛత్రవ లేక ఛత్రప. క్షత్రపుడు అనగా రాష్ట్రీయపాలకుడు. అనగా ఈనాటి గవర్నరువంటివాడు. రాజన్, మహారాజ శబ్దాలకు సమానార్థకంగా మహాక్షత్రప బిరుదంవచ్చింది. హైందవ శక పాలనలో ఇద్దరు క్షత్రపులు లేదా ఒక మహాక్షత్రపుడు క్షత్రపుడూ కలిసికానీ, పరిపాలనచేసే ఆచారం ఉండేది. సేనాని ప్రతినిధి క్షత్రపుడు 'స్ట్రాటెగ' అనే యవన బిరుదం వహించేవాడు.

తక్షశిలా ప్రాంతంలో క్షత్రప ఆస్పవర్మ, ఇంద్రవర్మ కుమారుడు 2 వ ఏజెసు, గండోఫర్నిసులకు ప్రతినిధిగా ఉండేవాడు. శశుడనేవాడు ఆస్పవర్మకు మేనల్లుడు. అతడు గండోఫర్నిసు పాకోరెసులకు రాజప్రతినిధిగా పనిచేసినాడు.

తక్షశిలా ప్రాంతంలోనే బహుళ క్షహరాట వంశీయుడైన లయక కుసులకుడు అనే క్షత్రపుడు మోగుని రాజప్రతినిధిగా క్రీ. శ. 21 లో ఉండేవాడు. అతనిసుతుడు మహాదానపతి పతితుడు. మహాక్షత్ర పరాన్‌జువులుడూ అతని కుమారుడైన శోణదాసుని కాలాల్లో *కుసులాపాదిక, మేవకీకులనే క్షత్రపులు పాలించినారు. రెండవ ఏజెసుకు సమకాలికుడైన క్షత్రప మణిగులుని సుతుడైన జిహూనియుడు

---

* Mathura Lion Capital కాసనం.

పశ్చిమ పంజాబుకు సంబంధించిన క్షాత్రపుడు. పంజాబులో కుషాణులు రాజప్రతినిధులుగా చాలామంది క్షాత్రపు లుండే వారని నాణేములవల్ల ఊహాచేయవచ్చును.

శకపహ్లావులను కుషాణులు జయించినాకేకాని సంపూర్ణముగా రూపుమాపలేకపోయినారు. అందుచేతనే చాలా శక కుటుంబాలు సామంతులుగా రాష్ట్రపాలకులుగా ఉండడం సంభవించింది. శకస్థానాలు పశ్చిమ భారతదేశంలో అనగా దిగువసింధులోయలోనూ, కథియవాడులోనూ ఉండేవని తెలుస్తున్నది. శకక్షాత్రపులు కుషాణులకు దాస్యంచేస్తూ కుషాణపతనానంతరం స్వతంత్రులు కాగలిగినారు.

కుషాణులు

భారతేతిహాసంలో ప్రముఖపాత్ర నిర్వహించిన కుషాణులు 'యోచీ' అనే తెగకు చెందినవారు. ఈ తెగ తున్‌హుయాన్గ్, తియన్‌షాన్ కొండలమధ్యనున్న చైనీయ తుర్కిస్థానంలో మొదటఉండేది. క్రీ. పూ. 165 లో పోరుగునున్న తెగవల్ల యోచీలు పరాజితులైనారు. శత్రువులు వారినాయకుని చంపి అతని కపాలముతో పానపాత్ర చేసినారు. అతని భార్య యోచీతెగకు నాయకురాలుకాగా పడమటిదిశకు తరలివెళ్ళినారు. వీరిలో ఒకశాఖ టిబెట్ ప్రాంతానికివెళ్ళి చిన్న యోచీతెగగా పరిగణింపబడింది. పెద్దయోచీతెగ పశ్చిమదిశగావెళ్ళగా సర్ డేరియానదికి ఉత్తరతీరాన శక జాతివారిని కలిసినారు.

పెద్దయోచీతెగ శకులనోడించి అక్కడ స్థానరం ఏర్పరచుకొన్నది. అయితే ఎక్కువకాలం వారక్కడ ఉండ లేదు. ఆక్సస్‌నదీతీరాన తిరిగి శకుల్నోడించి బాక్ట్రియా స్థావరం చేసికొన్నారు. సోగ్డియానా (నేటి బొఖారా ప్రాంతం) రాజధానిగా చేసికొన్నారు.

యోచీలదేశం 5 రాజ్యాలుగా విభక్తమైంది. వాటిలో ఒక రాజ్యం కుషాణరాజ్యం. ఈ రాజ్యానికి పేరుప్రతిష్ఠలు వచ్చినవి. కుషాణులు కుజులకర కాడ్‌ఫిసెస్ అనేవాని నాయకత్వాన ప్రముఖులైనారు. అతనిని చరిత్రకారులు మొదట కాడ్‌ఫిసెస్ అని వ్యవహరించినారు.

ప్రథమ కాడ్‌ఫిసెస్ క్రీ. శ. 40—64. కుషాణులు హిందూకుష్ పర్వతాలుదాటి కాబూలులోయలో ఆరోకోసియా అనే పశ్చిమ సింధుదేశంలో ప్రవేశించి ఆ ప్రాంతానికి ఆధిపత్యం వహించినారు. అతని నాణెములలో రోమక నాణెముల ప్రభావము కనబడుతున్నది. * కాడిఫిసెస్ బిరుదనులు 'మహారాజమహాన్త', 'మహారాజాధిరాజ', 'సత్యధర్మస్థిత'.

ద్వితీయ కాడ్‌ఫిసెస్ – బంగారు నాణెముల చలామణీ నాణెములవల్ల రెండవ కాడ్‌ఫిసెస్ కుషాణరాజైనాడు. చైనీయ చరిత్రకారులనుబట్టి సింధుదేశం దాటించి తక్షశిల, పంజాబు రాష్ట్రా

---

* ప్రథమ కాడ్‌ఫిసెస్ నాణెములు ఆగస్టస్, టైబీరియస్, క్లాడియసు నాణెములవలె ఉంటవి.

లను జయించినాడు. అతడు బహుశ మధురదాకా విజయ యాత్రచేసి ఉండవచ్చును. చైనాసామ్రాజ్యానికి, రోమక రాజ్యాకోమధ్య కాడ్ఫిసెస్ సామ్రాజ్యం సువిశాలంగా ఉండడంచేత వాణిజ్యాభివృద్ధి బాగాసాగింది. బంగారు నాణెములు విరివిగా వాడకములో ఉండేవి. కాడ్ఫిసెసు అమలులో ఉంచిన బంగారు ముద్రలను అతని అనుయాయులుకూడా వాడకములో ఉంచినారు. కుషాణుల అనంతరం గుప్తులు కుషాణుల పద్ధతిలో సువర్ణముద్రలు ప్రచురించి వ్యవహారములో ఉంచినారు. రోమకరాజ్యమునుంచి విరివిగా బంగారము లభ్యము కావడముచేత కుషాణులు బంగారునాణెములు చలామణీ చేయగలిగినారు.

మొదటశైవుడు కాడ్ఫిసెస్ బహుశ శైవుడై ఉండవచ్చును. అతని నాణెములమీద శివుడు వృషభవాహనుడుగా, వాహనములేకుండానూ, త్రిశూలధారిగా కనబడుతున్నాడు. అతని నాణెములమీద గాథ 'మహరజస రజదిరజస సర్వలోగ ఈశ్వరస మహేశ్వరస వీమకటఫిసస త్రతరస' * అనేదానిని బట్టి అతడు శైవుడు. తండ్రివలె బౌద్ధుడుకాడు.

పేరులేని రాజుగారి నాణెము: (Soter Megas) పంజాబులోనూ, కాందహారులోనూ చాలాముద్రలు ప్రత్యేక చిహ్నాములతోనూ,

* అనగా "of Wema Kathphisa, the great king, the king of kings, the lord of the whole world, the Mahisvara, the saviour.

తరుచుగా ఖరోష్ఠీలిపిలో ఈ గాధతో "మహారజస రజది రజస మహతస త్రతరస" "Besileus Basilerion Soter Megas" అనగా "రాజాధిరాజ, మహాత్రాత" అనే బిరుదులున్నవి ఎక్కువగా లభ్యమైనవి. ఈ ముద్రలను ప్రకటించినవాడు వీమకాడ్ ఫిసెసుతోటి పాలకుడని నాణెముల మీది గాధవల్ల చరిత్రవేత్తలు నిర్ణయించినారు. ఈ 'పేరు లేని రాజు', వీమకాడ్ ఫిసెసుయొక్క చరమ జీవితంలో స్వతంత్రుడై కాబూలు కాందహారు ప్రాంతాల్లో పరిపాలన చేసి ఉండవచ్చును.

కనిష్కుడు

కుషాణులలో కనిష్కుడు గొప్పవాడు. అతనికీ కుజులకర లీమకాడ్ ఫిసెసులకూ గలబాంధవ్యం తెలియడములేదు. కొంతకాలందాకా చరిత్రకారులు కనిష్కుడు కాడ్ఫిసెసులకు పూర్వుడా తరువాతవాడా అనే విషయంలో వివాదపడినాము. కాడ్ఫిసెసుల తరువాతనే కనిష్కుడు రాజ్యానికి వచ్చినట్లు నాణెములవల్లనూ, నాణెములు లభ్యమైన ప్రదేశాన్నిబట్టి నిర్ణయము చేయబడింది.

శకకర్త అవుతాడా: కనిష్కుడు శకకర్త అనే విషయం వివాదభూయిష్టము. క్రీ.శ 78లో కనిష్కశకం ఆరంభమైంది. దీనినే శకకాలమని వ్యవహరిస్తారు. కొందరు విద్వాంసులు క్రీ. శ. 125 లో కనిష్కుని పరిపాలనారంభమసి నిర్ణయంచేసినారు.

అయితే ఆయన శకకర్తకదా ? ఆల్‌బరూనీ అనే ముసల్మాను చరిత్రకారుడు తన గ్రంథంలో క్రీ. శ. 2 వ శతాబ్దిలో నూతన శకారంభమైనట్లు ఉల్లేఖించలేదు.

కనిష్కుని రాజధాని పురుషపురము. ఇది ప్రస్తుతపు పెషావరు. ఇది గాంధారంలోనిది. కాశ్మీరం, పంజాబు గంగానదిలోయ, పాటాలీపుత్రకూడా అతని శాసనం ప్రజలు శిరసావహించేవారు. ఆయన పశ్చిమాన పహ్లవులతో సమరం సాగించినాడు. తుర్కిస్థానంలో ఘోటాన్, యార్‌కండ్ కాష్గర్‌లో దేశదిమ్మరులైన నాయకులను అణచివేసేనిమిత్తం శిస్తు వసూలుచేయడానికి సేనానీకాన్ని పామీరులమీదుగా పంపినాడు. దక్షిణాన అతనిశాసనం ఎగువసింధు, బహుశ మాళవందాకా వ్యాప్తమైంది. కనిష్కుని ప్రాభవం మధ్యాసియాలో చైనీయ ప్రభువుయొక్క సర్వసేనాపతి, పన్‌చోఅనే వానివల్ల తగ్గిపోయింది.

అవసానం శయ్యాలో రుజాపీడితుడై కనిష్కుడు నిద్రిస్తూ ఉండగా అతని సైనికోద్యోగులు యుద్ధయాత్రలవల్ల వేసారి పోయి చక్రవర్తిని వధించినారని ఒకగాథ ప్రచలితమైంది.

కనిష్కుడు - బౌద్ధము కనిష్కుడు బౌద్ధుడనే విషయం సాంప్రదాయకంగానేకాక శిలాలేఖనాలవల్ల, ముద్రలవల్ల నిరూపణ చేయబడింది. పురుషపురంలో ఆయన నిర్మించిన బౌద్ధ స్తూపాన్నిగురించి హ్యూన్‌సాంగ్ ఆల్‌బరూనీలు ఉల్లేఖించి

నారు. 9 వ శతాబ్దినాటి శిలాలేఖనంవల్ల పురుషపురం బౌద్ధ సంస్కృతీకేంద్రమని విదితమవుతున్నది.

బౌద్ధపరిషత్తు ఒక సంప్రదాయాన్నిబట్టి బౌద్ధపరిషత్తు కాశ్మీరంలో జరిగిందనీ, మరో గాథనుబట్టి గాంధారంలోనో జలంధరులోనో సమావేశమై ఉంటుందని చరిత్రకారుల ఊహ చేస్తున్నారు. కుండల వనవిహారం అనేచోట బౌద్ధపండితులు బౌద్ధమతగ్రంథప్రతులు సేకరించి వ్యాఖ్యానాలు వ్రాసే నిమిత్తం సమావేశమైనారు. వసుమిత్రుడనే మహావిద్వాంసుడు పరిషధ్యక్షుడు, అశ్వఘోషుడు ఉపాధ్యక్షుడు.

సంస్కృతి కనిష్కుడు సంస్కృతికి దోహదం ఇచ్చినాడు. అశ్వఘోషుడు, వసుమిత్రుడు, సంఘరక్షుడు కనిష్కుని ఆస్థాన పండితులు. "మాధ్యమిక శూన్యవాద" మనే బౌద్ధ దార్శనిక సిద్ధాంత ప్రోక్తలయిన నాగార్జునాచార్యులు, చరకుడనే విఖ్యాత వైద్యుడు కనిష్కుని ఆస్థానంలోవారే. మాతరుడు కనిష్కుని మహామంత్రి. బౌద్ధపండితులాయన ఆస్థానంలో ఉన్నంతమాత్రాన బౌద్ధపరిషత్తు కనిష్కుని యజమాన్యాన జరిగిందని అనడానికి వీలులేదు. కనిష్కనామము గల అనుయాయులెవరో జరిపించి ఉంటారు.

కనిష్కనాణెములపై దేవతాకోటి కనిష్కుడు బౌద్ధుడని అంగీకరించినా అతనినాణెముల మీదవైపు యవన, సుమేరియ, ఇలమైట్, పారశీక భారతీయ దేవతలు చిత్రింపబడినారు. శివుడు, శాక్య

ముని, వాయుదేవుడు (Oado), అగ్ని (Atash), చంద్రుడు, మిత్రుడు, నైనాదేవి, బ్రహ్మ *(యుద్ధదేవత) పారశీకుల అగ్నిదేవుడు, యవనసూర్యుడు (Helios) మొదలైన భిన్న దేవతామూర్తులు ముద్రలపై గోచరిస్తున్నారు. చాలా మతాలు కనిష్క-రాజ్యంలో ఉండకపోతే, అన్నిమతాలనూ ఆదరంతో చూడకపోతే, భిన్నదేవతాకోటిని నాణెముల మీద ముద్రించడం సంభవించదు. సర్వమత సమాదరణ ఉదారభావమూ ప్రకటిత మవుతున్నది. అంతేకాక అతనికి గల సర్వసమత్వదృష్టివల్ల బౌద్ధదేవతలనేకాక అన్యమత దేవతలనుకూడా పూజ్యభావముతో చూచినాము.

కుషాణులు తురుష్క-జాతివారా? కల్హణి పండితుని 'రాజతరంగిణి' అనే చారిత్రక గద్యకావ్యాన్నిబట్టి కుషాణులు తురుష్కులేమోనని సందేహము గాఢమవుతున్నది. కాశ్మీరాన్ని ముగ్గురు రాజులుకలిసి పరిపాలన చేశారట. వారు తురుష్క-జాతీయులని, హుష్కుడనేవాడు (హువిష్కుడు కావచ్చును), జుష్కుడు, (వసిష్కుడు) లేక (వాసిష్కుడు), కనిష్కుడునూ హుష్కపురం, జుష్కపురం, కనిష్కపురం క్రమంగా కట్టించినారని తెలుస్తున్నది. కుషాణులు తుషుష్కుల సంతతివారనే విషయాన్ని అల్‌బరూనీ తన గ్రంథంలో ఉల్లేఖించినాడు. భారతీయ వాఙ్మయంలో కుషాణులను తుఖారు లని వ్యవహ

* వృత్రఘ్న.

రించినారు. దానికి కారణం వారు కొంతకాలం తుఖార దేశంలో అనగా ఉత్తర బాక్ట్రియాలో ఉన్నారు.

వాసిష్కుడు క్రీ. శ. 21—28. కనిష్కుని తరువాత వాసిష్కుడు కుషాణసింహాసనం అధిష్ఠించినాడు. ఇతడూ వశిష్కుడూ ఒకడేనని కొందరి అభిప్రాయము. వాసిష్కుడు హువిష్కునితో కలిసి క్రీ. శ. 106—138 అంతరంలో పరిపాలన చేసినాడు. వశిష్కుని తండ్రి రెండో కనిష్కుడు పశ్చిమోత్తర భారత దేశం పరిపాలించినాడు. అతని బిరుదములు 'మహారాజ', 'రాజాధిరాజ', 'దేవపుత్ర', 'కైసర'. అయితే వాసిష్కుని అనంతరం వెంటనే రాజ్యానికి వచ్చినవాడు హువిష్కుడు.

హువిష్కుడు క్రీ. శ. 107—138. హువిష్కుని నాణెములు చాలా లభ్యమవుతున్నవి. మథురలో లభ్యమైన శాసనాన్ని బట్టి అతడు బౌద్ధులకు విహారము కల్పించినాడు. దాని పేరు మహారాజాధిరాజ దేవపుత్ర విహారము. అతడు బౌద్ధాన్ని పోషించిన హైందవచక్రవర్తి. అన్నదాత. ధర్మబుద్ధిగలవాడు. ఈ విషయం మథురాపురీ శాసనంవల్ల తెలుస్తుంది.

ఆయన ముద్రలమీద విశాతీయ దేవతాకోటితోపాటు విష్ణు, మహాసేనుడు, స్కంధ, కుమారస్వామి, విశాఖుడు గోచరిస్తున్నారు. ఒక ముద్రవల్ల హువిష్కుడు వైష్ణవుడని తేలు తెల్లమవుతున్నది.

రెండవ కనిష్కుడు రెండవ కనిష్కుడు చాలాకాలం హువిష్కునితో కలిసి పరిపాలించినాడు. అతడు 'కైసర' అనగా 'సీజరు' అనే రోమకవీరుని బిరుదము వహించినాడు.

వాసుదేవుడు క్రీ. శ. 145—176. వాసుదేవుడనే పేరువల్లనే కుషాణులు ఎలా భారతీయులైనారో తెలుస్తున్నది. వాసుదేవుని నాణెములమీద విజాతీయ దేవతలకన్న భారతీయ దేవతాకోటి ఎక్కువగా ముద్రితమైంది. నందివాహనారూఢుడైన శివుడు నాణెములమీద కనబడుతున్నాడు. వాసుదేవుడు వైష్ణవుడైనా శివభక్తి అపారంగా కలవాడు.

వాసుదేవుని అనంతరం కుషాణుల చరిత్ర విశదంగా తెలియరాదు. ముందలనుబట్టి తృతీయ కనిష్కుడు (?), రెండవ వాసుదేవుడు పాలించినట్లు తెలుస్తున్నది.

వాసుదేవుని కాలంలోనే అనగా క్రీ. శ. 145—176 అంతరంలోనే కుషాణుల ప్రాభవం తగ్గిపోయింది.

కుషాణుల క్షీణించుట ప్రథమ కనిష్కునికింద రాష్ట్రపాలకులుగా వున్న శకక్షత్రపులు పశ్చిమ మధ్యభారతదేశాలను స్వతంత్రంగా పరిపాలన చేయడం సాగించినారు. ఉత్తరప్రదేశంలోనూ రాజస్థానంలోనూ కుషాణు లంతరించగా మధురా ప్రాంతంలోకూడా వారిశక్తి తగ్గిపోగా నాగవంశం తలయెత్తింది. కుషాణులు విచ్ఛిన్నమైపోగా చాలారాజ్యాలు తలయెత్తినవి.

సంస్కృతి మౌర్యుల అనంతరం కుషాణులు సువిశాల సామ్రాజ్యమునేలి భారతదేశానికి అన్యప్రపంచంతో రాజకీయ సాంస్కృతిక సంబంధాలు ఏర్పాటుచేశారు. వాఙ్మయము,

మహాయాన బౌద్ధమూ, తొలిసారి బుద్ధమూర్తి చిత్రణమూ, గాంధారశిల్పమూ చెప్పుకోదగిన కుషాణసంస్కృతి. అశ్వఘోష నాగార్జునాచార్యులవంటి కవిపండితులవల్ల సాహిత్యాభివృద్ధి కలిగింది. శైవమతాభివృద్ధితోపాటు కార్తికేయారాధన ప్రభలమైంది. వాసుదేవ కృష్ణభక్తి నెలకొన్నది. కాశ్యప మాతంగుడు క్రీ. శ. 61—67 లో మహాయాన బౌద్ధప్రచారం చేసినాడు. కుషాణులవల్ల తూర్పు, మధ్యాసియాప్రాంతాలలో భారతీయనాగరకత విస్తృతమైంది.

కుషాణుల తరువాత గణరాజ్యాలు

క్రీ. శ. ప్రథమ శతాబ్దానంతరం లభ్యమైన నాణెములవల్ల పశ్చిమ, మధ్య భారతదేశములో గణరాజ్యాలు రాజరిక రాజ్యాలుండేవి. రాజస్థానంలోను, తత్సమీప ప్రాంతంలో అర్జునాయనులు, మూళవులు, శిబులు, యౌధేయులు, ఉత్తర భద్రులు అనే తెగలు శకుల తరువాత వచ్చిన కుషాణులకు లొంగిపోయినట్లు తెలుస్తున్నది. కుషాణ ప్రాభవం క్షీణిస్తున్న పిమ్మట అర్జునాయనులు, మూళవులు, యౌధేయులు మూడవ శతాబ్దారంభంలో విజృంభించినారు. క్రీ. శ. 4 వ శతాబ్ది మధ్యంలో గుప్తులవల్ల ఈ తెగలు తలెత్తడానికి వీలులేక పోయింది.

అర్జునాయనులు రాజస్థానంలో భరతపూర్, ఆళ్వార్, మధుర, ఆగ్రా ప్రాంతాలలో అర్జునాయను లుండేవారు. ప్రథమ

శతాబ్దాంతములో గణరాజ్య నాణెములమీద 'అర్జునాయనాం జయః' అని గాధ కనబడుతున్నది. అర్జునాయనులు తమ పొరుగునున్న యౌధేయులవలె క్రీ. పూ. ప్రథమ శతాబ్ది మధ్యంలో హైందవ యవనరాజ్యాలు అంతరించిన తరువాత శక్తివంతులైనారు. చివరకు వారు క్రీ. శ. 4వ శతాబ్ది మధ్యంతో గుప్తచక్రవర్తులకు లొంగిపోయినారు.

మాళవులు జయపుర ప్రాంతంలో మాళవగణానికి చెందిన ముద్రలు లభ్యమైనవి. నాణెములమీదగాథ "మాళవ జనపదస" అని ఉన్నది. మాళవులు ఆదిలో పంజాబులో రావిచీనాబుల మధ్యలో ఉండేవారు. అలెగ్జాండరువంటి యవనవీరుణ్ణి ప్రతిఘటించిన శూరులు మాళవులు. వీరు ఆయుధజీవులు. రాజస్థానమునకు తరలివెళ్ళినారు. మాళవ రాజధాని (నగర్) కరోకోట నగరం.

యౌధేయులు యౌధేయులు ఆయుధజీవులైన వీరక్షత్రియ గణము. ముల్తాను ప్రాంతంలో నాణెముద్రలు కనబడినవి. మహాభారతములో పాణినికృత అష్టాధ్యాయిలో యౌధేయుల ప్రస్తి కనబడుతున్నది. వారిరాజ్యం తూర్పుపంజాబు, రాజస్థానంలో వ్యాప్తమైంది.

హైందవ యవనరాజ్యాలు క్షీణిస్తున్న సమయంలో యౌధేయులు విజృంభించినారు. శకకుషాణులకు కొంతకాలం లొంగినారు. కనిష్కుని అనుయాయులు బలిష్ఠులు కాకపోవడం

చేత యౌధేయులు క్రీ. శ. 3 వ శతాబ్దంలో స్వతంత్రులై, నాలుగో శతాబ్దంలో గుప్తులకు వశ్యులైనారు.

యౌధేయులు మహావీరులు. "యౌధేయానాం జయ మంత్ర ధారాణామ్" అనే నాణెములపైగల గాధవల్ల వారిది గణరాజ్యమనీ, పరిపాలనకు మంత్రాలోచనచేసే మంత్రి మండలి ఉండేదని స్పష్టమవుతున్నది. వారి ఆరాధ్యదైవం స్కంధ కార్తికేయుడు. ఈ విషయం ముద్రలపైగల గాధవల్ల తెలుస్తున్నది :—

"భగవతః స్వామినో బ్రహ్మణ్య
దేవస్య కుమారస్య యౌధేయానామ్."

కొందరు విద్వాంసులు కుషాణుల నాశనం యౌధేయులవల్లనే జరిగిందని అంటున్నారు.

గణరాజ్యాలుకాక నాగుల రాజరిక రాజ్యాలు * పద్మావతి, అహిచ్ఛత్రము, అయోధ్య, కౌశాంబి ప్రాంతాల్లో కుషాణ పతనానంతరం వర్ధిల్లినవి.

పశ్చిమ భారతదేశాన శక క్షత్రపులు

క్రీ. పూ. 2 వ శతాబ్దములో హైందవ యవనులు. సింధు, కథియవాడ్, రాజస్థానభాగాలు జయించారని చెప్పుకొన్నాం.

---

* వివరములకు Age of Imperial unity Vol II edited by Munshi పుటలు 168—177 చూడు.

తూర్పు ఇరాక్‌లోని శకులు దిగువ సింధులోయలో క్రీ. పూ. ప్రథమ శతాబ్దంలో స్థిరపడి క్రమంగా పశ్చిమ భారత దేశంలో చాలాప్రాంతాలు కైవసం చేసికొన్నారు.

క్షహరాట క్షత్రపులు క్షహరాటులనే ఈ క్షత్రపులు కనిష్కుడికి అతని అనుయాయులకూ రాష్ట్రపాలకులు అనగా గవర్నరులుగా ఉంటూ స్వతంత్రులైనారు. ఈ క్షత్రపులు శక సంతతివారు.

భూమకుడు భూమకుని కుషాణుల గవర్నరుగా నైఋతిభాగాన పాలనచేసేవాడు. అతని నాణెములు గుజరాతు, కథియవాడు, మాళవము, అజ్‌మీరు ప్రాంతాల్లో లభిస్తున్నవి. క్షహరాట భూమకుడు తననాణెములు, కనిష్కుడు సజీవుడై ఉండగానే ప్రకటించాడో తరువాతనే ప్రచురించాడో తెలియదు. భూమకుని చరిత్ర విశదముగా తెలియదు.

నహపానుడు భూమకుని తరువాత నహపానుడు ప్రభువైనాడు. భూమక నహపాణుల బాంధవ్యం తెలియరాదు. నహపానుడు బహుశ క్రీ. శ. 119—125 దాకా పరిపాలనచేసి ఉండవచ్చును. అతని ముద్రలపూర్వ రాజన్ శబ్దము కనబడింది. కనుక కుషాణులకు లొంగిపోక స్వతంత్రుడై ఉంటూడని చెప్పవచ్చును. క్షహరాటుల అనంతరం రాజ్యానికివచ్చిన కార్దమక వంశీయులుకూడా రాజన్ మహారాజ బిరుదాలు వహించారు.

నహపానుడు రజత తామ్రనాణెములు ప్రచురించినాడు. ఈ ముద్రల పరిమాణము, భారమూ, తీరూ గుప్తులూ త్రైకూటక వంశీయులు అనుసరించినారు

ఋషభదత్తుడు నహపానుని అల్లుడు ఋషభదత్తుడు గవర్నరు. హిందూధర్మానుసారంగా సత్ప్రాత్ర దానధర్మాలుచేసి, దానశాసనాలు నాసిక్‌కార్లే, గుహాకుడ్యాలమీద చెక్కించి నాడు. అతడు నహపానుని దక్షిణరాష్ట్రాలకు పాలకుడుగా ఉండేవాడు. అనగా అతనిపాలనలో గోవర్ధనం (నాసిక్), మామాల (పూనా) ఉండేవి. అంతేకాక బహుశ కొంకణం నుంచి సోప్రా అనే శూర్పారకందాకా అతనిపాలన ఉండి ఉండవచ్చును. నహపానుడు బహుశ ప్రతిష్ఠానపుర సాత వాహన ప్రభువులను ఓడించి నాసిక పూనామండలాలు సంపాదించి ఉండవచ్చును. లేదా పశ్చిమతీరంలో ప్రాచీన శకాధిపతిఅయినా ఉత్తర కొంకణందాకా విజయయాత్ర చేసి ఉండవచ్చును.

పరాజయం 46 వ శక సంవత్సరానంతరం అనగా క్రీ. శ. 124—125 లో నహపానుడు గౌతమీపుత్ర సాతకర్ణినల్ల పరాజితుడై రాజ్యభ్రష్టుడై నిహతుడైనాడు. ఋషభదాట రాష్ట్రాలు దక్షిణాన సాతకర్ణి తనరాజ్యంలో కలుపు కొన్నాడు. నాసిక శాసనాన్నిబట్టి గౌతమీపుత్రుడు ఋషభ దాట వంశనిర్మూలనం చేయడమేకాక శక, యవన, పహ్లావు లను రూపుమాపినాడు. అతడు సురాష్ట్ర (కథియవాడు), కుకుర (గుజరాతు, కథియవాడ్) అనూప (ఉత్తర కొంకణం), ఆకర (తూర్పు మాళవం), ఆవంతి (పశ్చిమ మాళవం) దేశాలకు ప్రభువని శాసనంలో వర్ణింపబడినాడు. నాసిక

పూనా మండలాల్లో గౌతమీపుత్రుని శాసనాలవల్ల నహపానుని గవర్నరయిన ఋషభదత్తుని అధికారం గౌతమీపుత్రునివల్ల పోయిందనిస్పష్టం. అనగా క్షహరాతుల ఆధిపత్యంపోయి ఆంధ్రప్రభుత్వం వచ్చిందని తెలుస్తున్నది. నాసికవద్ద జోగల్‌తంబిలో లభ్యమైన నహపానుని నాణెముల వల్ల శాతవాహన ప్రభువు త్రైపుల సంపద కొల్లగొట్టి, నహపానుని నాణెములు పునఃప్రచురించినాడు. నహపానుని అవసానంతో క్షహరాటవంశం నిర్మూలితమైంది. అనంతరం కార్దమకవంశం పరిపాలన చేసింది.

కార్దమకులు పశ్చిమ భారతదేశంలో చష్టనునివల్ల కార్దమకులు రాజ్యపాలకులైనారు. చష్టనుడు యశోమతిక పుత్రుడు. ముద్రలనుబట్టి అతడు త్రైపుడు. ఆనంతర నాణెములమీద ఘుహూత్రైపనామం కనబడుతున్నది. 'రాజ' అనే బిరుదం కూడా అతనికి ఉన్నది. అతడు కుషాణుల గవర్నరుగా సింధు ప్రాంతంలో పరిపాలన చేస్తుండేవాడు. నహపానుని మరణానంతరం కుషాణులు చష్టనున్ని గవర్నరుగావేసి, సాతవాహనులమూలంగా తాము పోగొట్టుకొన్న మండలాలను పునఃస్వాధీనం చేసుకోమని అధికారం ఇచ్చినారు.

చష్టనుడు శకకుషాణ రాజ్యాల్లో రాష్ట్రపాలకులకూ మహాత్రైపులనే బిరుదముండేది. వయసుముదిరినప్పుడు చష్టనుడు మహాత్రైపుడై ఉంటాడు. ఆయనపుత్రుడు జయదమనుడు త్రైపుడు. చిన్నవయసులో జయదమనుడు చనిపోగా అతని

కొడుకు ప్రథమ రుద్రదమనుడు పాలకుడైనాడు. 52 వ శక వర్ష (క్రీ. శ. 130.) శిలాలేఖనాన్నిబట్టి చష్టనుడూ అతని పౌత్రుడూ కలిసి పరిపాలించినారు. కార్దమకులు గౌతమీ పుత్ర సాతకర్ణియొక్క విస్తృతరాజ్యసీమల్లో ఉండేవారు.

చష్టన రుద్రదమనుల అధ్వర్యాన శకులు శాత వాహన ప్రభువును నిర్జించి, నహపానుడు పోగొట్టిన మండలాలు తిరిగి సంపాదించినాడు. ఇందు కొధారాలు టాలెమీ భూగోళమూ, రుద్రదమనుని జునాగఢ్ శాసనమునూ. శాసనంలో రుద్రదమనుని రాజ్యంలో ఆకర, అవంతి, అనూప, అపరాంత, సురాష్ట్ర, ఆనర్తరాష్ట్రాలు చేరినట్లు అని గౌతమీ పుత్రుణ్ణి జయించి సంపాదించినట్లున్నవి. అంతేకాక రుద్రదమనుడు రెండుసార్లు దక్షిణాపథ ప్రభువైనట్టిన్ని శాతకర్ణిని* జయించి, తనకు సమీపబంధువు కావడంచేత చంపలేదట. ఈ శాతకర్ణి గౌతమీపుత్రుడై ఉంటాడు. రుద్రదమనునికీ శాతకర్ణికీగల బాంధవ్యం కన్హేరీ శిలాలేఖనంవల్ల విశదమవుతుంది. దాన్నిబట్టి కార్దమక రాజకుమారి మహాక్షత్రప రుద్రదమనుని కుమార్తె. ఆమె వాసిష్ఠీపుత్ర శాతకర్ణి భార్య అనీ తెలుస్తున్నది. రుద్రదమనుడు గౌతమీపుత్రునివల్ల పోగొట్టుకొన్న శకరాష్ట్రాలను సంపాదించి భ్రష్టులైన సామంతులను తిరిగి నిలిపినాడు.

---

* రుద్రదమనుని శాసనం 150 A. D—"దక్షిణాపథ పతేః సాతకర్ణేః ద్విరపి నిర్వ్యాజ మవజిత్యా, అవజిత్య సంబంధావిదూర తయానుత్పాదనాత్."

రుద్రదమనుడు

గిరినగర శాసనం - సుదర్శన తటాకం - రుద్రదమన ప్రశస్తి చక్రవర్తి

తరువాత అతనిపౌత్రుడు, రుద్రదమనుడు క్రీ. శ. 130 లో రాజ్యాసికి వచ్చినాడు. 72 వ శకసంవత్సరం అనగా క్రీ. శ. 150 నాటి రుద్రదమనుని గిరినగర శిలాలేఖనంవల్ల అతని జీవితము విజయపరంపరాదికము సమగ్రముగా విశద మవు తున్నవి. శాసనములో రుద్రదమన ప్రశస్తిఉన్నది. (ప్రస్తుతపు గిర్నార్) లేక ఊర్జయత్పర్వతమునుండి సురాష్ట్రంలో సువర్ణసికతా పలాశినీ ప్రవంతీజలం నిలవచేసి సుదర్శనమనే తటాకమును బాగుచేయించినాడు రుద్రదమనుడు. ఈసుదర్శన తటాకం నవీన జునాగడ్ సమీపంలో ఉండేది. చంద్రగుప్త మౌర్యునికాలంలో సురాష్ట్రమునకు గవర్నరైన పుష్య గుప్తుడు నదీజలాన్ని ఆపివేసి వ్యవసాయానికి ఉపకరించేట్లు చేసినాడు. అశోకచక్రవర్తి పాలనలో యవన తుషాస్పుడు సుదర్శనాన్ని బాగుచేయించినాడు. అశోకుని అనంతరం బహుకాలం తటాకం తుపానువల్ల శిక్షస్థయిపోగా రుద్ర దమనుడు తిరిగి మరమ్మత్తు చేయించి వ్యవసాయాభివృద్ధి చేసినాడు. ఆయన పన్లోవులైన ఉద్యోగుల సహకారంతో మహత్కార్యం సాధించి ప్రజలకు మహోపకారం చేసినాడు.

రుద్రదమనుడు దక్షిణాపథపతి అయిన శాతకర్ణిని (వాసిష్ఠీపుత్ర శాతకర్ణిని) జయించి మాళవ, కధియవాడ్, గుజరాత్, ఉత్తర కొంకణం, మాహిష్మతి (మాంధాత)

స్వాధీనం చేసికొన్నాడని లోగడ చెప్పినాను. మహాక్షత్రప రుద్రదమనునిరాజ్యంలో కచ్ఛ, శ్వభ్ర (సబర్మతీలోయ), మరు (మార్వార్), సింధు (పశ్చిమ, దిగువ సింధులోయ), సౌవీర (తూర్పు సింధులోయ), నిషాదం (పశ్చిమ వింధ్య - అరావళి) కూడా ఉన్నవి. అతడు నాసిక పునఃమండలాలు తప్ప, యీహారాట రాజ్యంయావత్తూ పరిపాలించినట్లున్నది. ఇది యావత్తూ నిజశౌర్యంవల్ల సముపార్జించినది.

గిరినగర ప్రశస్తినిబట్టి రుద్రదమనుడు దక్షిణ పంజాబులో యౌధేయ గణతంత్ర రాజ్యాన్ని జయించినట్లు తెలుస్తున్నది. కుషాణ ప్రభువుల పక్షాన ఆయుధజీవులై శౌర్యధనులైన యౌధేయులను నిర్జించినాడు. కుషాణుల ప్రాబల్యం శాసనంలో లేకపోవడంచేత స్వశక్తివల్ల రాజ్య సంపాదన చేసినవాడు కనుకనూ, మహాక్షత్రప బిరుదాంచితుడు కనుకనూ రుద్రదమనుడు స్వతంత్ర ప్రభువని తేటతెల్లమవుతుంది.

<u>సంస్కృతి</u> రుద్రదమనుడు మహావిజేత, మహాపాలకుడేకాక గీర్వాణ కవితాపోషకుడు. ఆయన స్వయంగా వ్యాకరణం, తర్కం, రాజనీతి, సంగీతం, గద్య పద్య కవితా రచనలోనూ దిట్ట. కార్దమకుల ప్రాభవంలో ఉజ్జయినీనగరం సంస్కృతీ కేంద్రమై విలసిల్లింది.

అనేక స్వయంవరాల్లో రుద్రదమనుడు రాజకన్యలను చేబట్టినాడు. అనగా భారతీయ సమాజములో శకులు క్రమ

క్రమంగా కలిసిపోయి భారతీయులైనారన్నమాట. శకులకూ ఆంధ్రశాతవాహనులకూ, ఇక్ష్వాకుప్రభువులకూ, లిచ్ఛవులకూ వైవాహికబంధాలేర్పడినవి.

రుద్రదమనుని అనుయాయులు రుద్రదమనుని జీవితకాలంలోనే అతని సుతుడు 1వ దామజదసిరి నాణెములు ప్రచురించినాడు. శకుల ఆచారప్రకారం తండ్రి కుమారుడూ కలిసి పరిపాలన చేసి ఉంటారు. దామజుని కుమారుడు, జీవదమనుడు శక రాజైనాడు. ఆతని ముద్రలేవీ కనపడవు. జీవదమనుడు సింహాసనం అధిష్ఠించగానే, మాతులుడు, *ప్రథమ రుద్రసింహుడు అతన్ని రాజ్యభ్రష్టుణ్ణి చేసినాడు. వార్షకంలో రుద్రసింహుడు రాజ్యపాలన చేసినాడు.

సుమారు క్రీ. శ. 2వ శతాబ్దపు తుదిభాగములో శాతవాహనప్రభువైన యజ్ఞశ్రీ శాతకర్ణి కార్దమకరాజ్యంలో కొన్ని దక్షిణరాష్ట్రాలు జయించినాడు. జీవదమన రుద్ర సింహుల వైరకారణంగా యజ్ఞశ్రీకి అవకాశం లభించింది. ఆంధ్రరాజు విజయలక్ష్మి సనాథుడైనాడు.

రుద్రసింహుని అనంతరం జీవదమనుడు రాజైనాడు. అతని తరువాత కుమారుడు, ప్రథమ రుద్రసేనుడు శక సింహాసనం అధిష్ఠించినాడు. రుద్రసింహుని కుమార్తెను

---

* ఇతని నాణెములను గురించి Age of Imperial unity Vol II పుట 186 చూడు..

లిచ్ఛలీప్రభువు పెళ్లాడినాడు. రుద్రసేనుని సోదరుడు సంఘదమనుడు శకరాజైనాడు. అతని సోదరుడు, దామసేనుడు అనగా రుద్రసింహుని మూడోకుమారుడు రాజైనాడు. మహాక్షత్రప దామసేనుడు మేనల్లుడైన రుద్రసేన పుత్రునితో రెండవ దామజ దసిరితోకలిసి రాజ్యపాలన చేసినాడు. అనంతరం ద్వితీయ దామజదసిరి పరిపాలన చేసినాడు. అతని తరువాత దామసేనపుత్రుడు వీరదమనుడు శకప్రభువైనాడు.

ముద్రలనుబట్టి క్షత్రప వీరదమనుడు క్రీ. శ. 238 లో చనిపోగా అతనిసోదరుడు, యశోదామడు మహాక్షత్రపుడైనాడు. అతనిసోదరుడు విజయసేనుడు క్షత్రపుడై శక రాజ్యం ఏలినాడు. అతని తరువాత సోదరుడైన తృతీయ దామజదసిరి ప్రభువైనాడు. అతని నాణెములు ఎక్కువగా లభ్యమైనవి. అతనికి ఆంధ్ర ఇక్ష్వాకుప్రభువైన వీరపురుషదత్తుకూ వియ్యము కుదిరింది. క్రీ. శ. 273 లో రుద్రసేన సుతుడు విశ్వసింహుడు మహాక్షత్రపుడైనాడు. క్రీ. శ. 304 చష్టన కుటుంబంలో అతడే కడసారివాడు,

ఆంధ్ర సాతవాహనులు

దక్షిణాపథం యావత్తూ, (మైసూరుకు దక్షిణభాగం మినహాయించగా) అశోకచక్రవర్తి సామ్రాజ్యంలోదే. అశోకుని అనుయాయులకూ దక్షిణాపథ ప్రజలకూ ఎటువంటి సంబంధం ఉండేదో నిర్ణయించేందుకు ఆధారాలులేవు. అశోకుని

అనంతరం మగధరాజులు నీరసులు కావడంవల్ల మౌర్య సామ్రాజ్యపు దక్షిణసీమల్లోవున్న స్థానికరాజులు స్వతంత్రులైనారు. గుంటూరు మండలములోని భట్టిప్రోలులో దొరికిన క్రీ. పూ. 200 నాటి కలశశాసనమునుబట్టి కుబేరకుడనేరాజు మౌర్యులకు లొంగక స్వతంత్రుడై పరిపాలించినాడని తోస్తున్నది. మౌర్యులలో కడసారివాడైన జయద్రథుని రాష్ట్రపాలకుడు విదర్భలో సుంగరాజాధిపత్యం అంగీకరించినాడు. క్రీ. పూ. ప్రథమ శతాబ్దిలో వింధ్యాద్రికి దక్షిణాన రెండు రాజ్యాలు పటిష్ఠంగా ఏర్పడినవి. ఆ రెండు రాజ్యాలూ, ఆంధ్ర సాతవాహనరాజ్యం దక్కనులో, కళింగంలో, చేది రాజ్యమూ ఎక్కువకాలం నిలవలేదు. శాతవాహన ప్రాభవం మూడుశతాబ్దాలపైగా విలసిల్లింది.

దక్షిణాపథచరిత్ర శాతవాహనులతో ఆరంభమైంది. వారికి పూర్వం దక్కనుచరిత్ర అయోమయం. శాతవాహనీశులు దక్షిణాపథపతులై దక్షిణాపథానికి విశిష్టరాజకీయ వ్యక్తిత్వమునూ, ఔన్నత్యమునూ ప్రసాదించినారు. ఆర్యావర్తంలో మౌర్యకాలంనుంచీ గుప్తపాలనదాకా ఎన్నెన్నో వైదేశిక దండయాత్రలు, ఎన్నో రాజకీయ సంక్షోభాలు చెలరేగినవి. దక్కనులో శాతవాహన చక్రవర్తులవల్ల శాంతి సమృద్ధమై విరాజిల్లినది.

శాతవాహనయుగము బౌద్ధసంస్కృతీ వికాసకారణమైంది. సాంచీద్వారతోరణాలు, అమరావతీ మహాచైత్య

శిల్పమూ ఆంధ్ర శాతవాహన నాగరకతా సంస్కృతులకు సాక్ష్యములుగాఉన్నవి. భారతీయ శిల్పము అమరావతీ మహాచైత్యములో పరాకాష్ఠను ప్రాపించింది. కన్హేరీ కార్లే నాసిక గుహాలయాలు ఆంధ్రశాతవాహన శిల్పకళాసికేతనాలై శోభిల్లినై. శాతవాహనయుగంలో ప్రాకృత సాహిత్యం భావ బంధురమై ఆంధ్రుల రాసిక్యానికి అమూల్యనిధి అయింది. ఆంధ్ర శాతవాహన మహోజ్జ్వలచరిత్ర ప్రాచీన భారతేతి హాసంలో వైశిష్ట్యమును గడించుకొన్నది.

ఆది శాతవాహనుల రాష్ట్రాలు శాతవాహన ప్రభువులు "దక్షిణా పథ పతు" లని శిలాలేఖనాల్లో ఉల్లేఖింపబడినారు. దక్షిణా పథమనగా వింధ్యకు దక్షిణభాగం. అనగా ప్రదేశం నిర్దిష్టం కాలేదు. మహారాష్ట్రదేశము, దానితోపాటు ప్రాక్ పశ్చిమ ప్రాంతాలూకలిసి దక్షిణాపథమని కొందరన్నారు. ఈభాగము ఆదిశాతవాహనరాజ్యం. హైదరాబాదురాష్ట్రంలో ఔరంగ బాదు మండలంలో గోదావరీ తీరస్థమైన ప్రకృతపు 'పైఠాన్' శాతవాహనుల 'ప్రతిష్ఠానం'. అదిరాజధాని. శాతవాహ నీశుల్లో మహోన్నతుడైన గౌతమీపుత్ర శాతకర్ణి నిజ పరాక్రమ విశేషంవల్ల వింధ్యాద్రికి దక్షిణభాగమేకాక, ఉత్తరాన కధియవాడు, మాళవాదిరాజ్యాలు జయించినారు. ఆంధ్ర శాతవాహను లుత్తరాపథంలో రాజ్యాలుజయించి పాటలీపుత్రం వశంచేసికొని ఏకచ్ఛత్రాధిపత్యం వహించారు.

నివాసం శాతవాహనుల నివాసస్థానవిషయంలో అభిప్రాయ భేదాలున్నవి. వారి ఆదినివాసం "శాతవాహనీయరాష్ట్రం"

అనబడే ప్రస్తుతపు, బళ్ళారిమండలప్రాంతం. 'ఆంధ్రపథ' మనబడే కృష్ణానదీ ముఖద్వార ప్రాంతమని పండితులమతం. అయితే యీ ప్రాంతాలు గౌతమీపుత్ర శాతకర్ణి సామ్రాజ్యంలోలేవు. కళింగరాజ్యాధిపతిఅయిన ఖారవేలుడు శాత వాహనునికి సమకాలికుడు. ఖారవేలుని హత్తిగుంపా శాసనంలో శాతవాహనరాజ్యం కళింగానికి పశ్చిమంగా ఉన్న దేశాని దక్షిణంగా ఉన్నదని చెప్పబడలేదు. అందుచేత దక్షిణరాష్ట్రాలు క్రీ. శ. 2 వ శతాబ్దమధ్యంలో శాతవాహన రాజ్యంలో చేర్చబడినవని చెప్పవచ్చును. విదర్భ (బీరారు) శాతవాహనుల తొల్లింటి నివాసమనేవాదం అసంగతం. అందుకు తగిన ఆధారాలులేవు. అశోకశాసనంలోని 'సత్య పుత్ర' దేశము శాతవాహనులకు సంబంధించినదని అనడం కూడా అసంగతమే.

వంశనామము వంశనామము ఎలావచ్చిందో ఊహచేయవలసిందే కాని ఆధారాలులేవు. భిన్నాభిప్రాయాలు చాలాఉన్నవి. సరికొత్తగా చేసినఊహ గమనార్హము సనాతనమతంలో సూర్యోపాసన ఉన్నది. సూర్యుడు సప్తవాహనుడు. సూర్యోపాసకుడు తనమనస్సును కర్ణికార పుష్పాకారంగావున్న హృదయంమీద లగ్నము చేయవలెనట. సూర్యుడమృత పానం చేస్తూవుండగా కొన్నిశీకరాలు రాలినవట. తన్మూలంగా శాలిధాన్యం మొలకూ ఉద్భవించినవట. శాలికర్ణిశబ్దాలు శాతవాహనుల బిరుదాలు. వారిపేర్లు మాతృసంబంధ ద్యోత

కాలు. ఉదాహరణగా చూడండి:—గౌతమీపుత్ర వాసిష్ఠీ పుత్ర ఇత్యాదులు. గౌతమ, వసిష్ఠ, మాఠరులు వైదికగోత్ర ఋషులు. సూర్యవంశీయుల పురోహితులు వసిష్ఠ గౌతములు. మాఠరుడు సూర్యోపాసన చేయించేవాడు. మాతృసంబంధ విశిష్టమైన నామములవల్ల శాతవాహనులు సూర్యవంశీయులు కావచ్చును. అంతేకాక శాతవాహన నాణెములమీద



ఈఆకృతిగల అనగా ఉజ్జయినీ సంకేతం గోచరిస్తున్నది.



ఇది సూర్యునికి సంకేతం. *శాతవాహన, శాతకర్ణి పదాలు సప్తవాహన, సప్తకర్ణికి పర్యాయపదాలుగా కొందరన్నారు. అందుచేత శాతవాహనులు సూర్యవంశీయులు కావచ్చును.

శాతవాహనోదయము

కాలనిర్ణయం శాతవాహన కాలనిర్ణయ విషయంలో అభిప్రాయ భేదాలు అనేకం. పురాణములు కొంతవరకు నిర్ణయానికి ఉపకరిస్తవి. అయితే పురాణాలు మనకాధారాలు కనక కాల నిర్ణయం జాగ్రత్తగా చేయవలసివుంటుంది. పురాణోక్తమైన సుంగవంశీయరాజులు చంద్రగుప్త మౌర్యుని అనంతరం 137 సంవత్సరాలకు అనగా క్రీ. పూ. 324 నుంచి 112 సంవత్సరాలు పరిపాలించినారు. సుంగదేవభూతి వాసుదేవుడనే

---

* శాతవాహనకులము కశ్మీర లోహర వంశము (రాజతరం 6. 367. 7.) లోహరులు శాతవాహనసంతతి—Stein's రాజతరం. II 79 పుట.

అమాత్యునివల్ల రాజ్యం కోల్పోయినాడు. వాసుదేవుడు కాణ్వాయన వంశస్థాపకుడు. నలుగురు కాణ్వరాజులూ మొత్తం నలభై అయిదు సంవత్సరాలు ఏలినారు. చివరవాడు సుశర్మ. శాసనంలో చెప్పబడిన సిముఖుడనే ఆంధ్రవంశ స్థాపకునివల్ల రాజ్యం పోగొట్టుకొన్నాడు. శాసనంలో సిముఖుడు, పురాణాల్లో శ్రీశుకుడు, శ్రీపకుడు, సింధుకుడు ఇత్యాది నామాలతో వ్యవహరింపబడినాడు. పురాణకథనం విశ్వసించినపక్షాన ఆంధ్రరాజైన సిముఖునివల్ల సుశర్మ కాణ్వాయనుడు రాజ్యం కోల్పోయినకాలం 137 + 112 + 45=294 సంవత్సరాలు. క్రీ. పూ. 324 తరవాత 294 సంవత్సరాలు అనగా క్రీ. పూ. 30. శిముఖుడు పురాణాలనుబట్టి 23 సంవత్సరాలు పరిపాలించినాడు. అనగా క్రీ. పూ. ప్రథమ శతాబ్దపు మూడవభాగంలో కాణ్వులను తన పరిపాలనాంతములో జయించిఉంటాడు. ఈ కాలనిర్ణయానికి నానాఘాట్ నాశిక్, సాంచీ శాసన లిపులు ఆధారం. శాసనాలు శిముఖుణ్ణి అతని అనుయాయులనూ కృష్ణుణ్ణి, శాతకర్ణినిగూర్చి ప్రస్తావించినవి. ఆనంతర శాతవాహన కాలనిర్ణయం పశ్చిమభారత పాలకులైన శకక్షాత్రపులతో వారికిగల సంబంధాలనుబట్టి చేయవచ్చును.

పురాణాలు పురాణాలన్నీ కాణ్వాయనులను నిర్మూలించి శిముఖుడనే ఆంధ్రుడు లేదా ఆంధ్రజాతీయుడు పరిపాలించాడని చెబుతున్నవి. అయితే రెండు విషయాలు నిర్ధారణ

చేయడంలో పురాణా లస్పష్టంగా ఉన్నవి. మొదటివిషయం ఆంధ్ర శాతవాహనోదయం. రెండవది కాణ్వవంశానంతరం మగధలో రాజ్యస్థాపనం. శిముఖుడికీ, పోనీ అతని అనుయాయులకూ మగధతో సంబంధం ఉన్నట్లు ఏఆధారాలూ కనబడవు. అసలు సుశర్మకాణ్వుడూ సిముఖుడూ సమకాలికులుకారు. దానికి కారణం వారిద్దరికీ అంతరం రెండుశతాబ్దాలుండడం. మత్స్యపురాణము "కాణ్వుల అనంతరం రాజ్యం ఆంధ్రులు పరిపాలిస్తా" రని చెబుతున్నది.

ఆంధ్రులు - ఆరంభ వికాసములు

ఆంధ్రుల ఆరంభ వికాసాల విషయంలో భిన్నాభిప్రాయాలున్నవి. పురాణాల్లో ఆంధ్రులు ఆంధ్రభృత్యులని ఉన్నది. వారు మౌర్యభృత్యులట. మౌర్యప్రభువుల ఆజ్ఞాప్రకారం సామ్రాజ్య పశ్చిమ భాగపాలకులుగా నియమింపబడినారు. అశోకచక్రవర్తి మరణానంతరం వారు స్వతంత్రులైనారు. పురాణాల ప్రమాణప్రతుల ప్రకారం శిముఖు డాంధ్రుడు. కాణ్వాయన భృత్యుడేకాని మౌర్యభృత్యుడుకాడు. అశోక శాసనాల్లోని అనేక కూటాలుండే ప్రదేశాలెక్కడని విచారించినప్పుడు ఆంధ్రులు క్రీ. పూ. 4 వ శతాబ్దంలో పశ్చిమ భారతప్రాంతానికి దూరమై ఉంటారు, మగధకు దూరంగా ఉన్నట్లే.

శిముఖుడు క్రీ. పూ. 221—198. రాజాశిముఖ శాతవాహనుడని నానాఘాట్ శాసనం చెబుతున్నది. శాతవాహననామం

ఉపనామం. అనగా శాతవాహన కులోద్భవుడనీ అనగా శాతవాహనుని కుమారుడో, మనుమడో అయిఉండవచ్చును. శాతివాహనప్రభువు వృషలుడని సంప్రదాయవచనం. వృషల శబ్దానికి శూద్రుడనే అర్థమేకాక ఆర్యదాసుడనీ లేదా ఆర్యవిజాతీయుడనీ అర్థం.

హీనక్షత్రియులా: వైదిక ధర్మానుష్ఠానం చేయకపోవడంచేత ఆర్యత్వం పోయింది ఆంధ్రులకు. ఇతరేయ బ్రాహ్మణ వచనాన్ని బట్టి ఆంధ్రులుదస్యులు. ద్వాత్రింశత్ పుత్తళికలో శాలివాహనుడు నాగకులోద్భవుడనీ, శుద్ధ బ్రాహ్మణుడుకాడనీ ఉన్నది. శాతవాహనప్రభువులకూ, నాగులకూ విజాతీయులైనశకులకూ వైవాహిక సంబంధాలుండేవని శిలాలేఖినాలవల్ల తెలుస్తున్నది. అందుచేత అనార్యులైన శాతవాహనులు ఆర్యత్వం కోసం పాకులాడినారని చెప్పవచ్చును. అలాంటివాళ్ళను హీనక్షత్రియులని మనువు నిర్ణయించినాడు.

సామ్రాజ్యస్థాపనం మౌర్యసామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతోనే దక్కనులో సాతవ సామ్రాజ్యాధికారం స్థాపించినారు. దక్కనుకు పశ్చిమదిశ దాడిచేసినాడు. రాష్ట్రకులనే తెగవారు అతనివల్ల ఓడిపోయినవాళ్ళతో వైవాహిక సంబంధం ఏర్పరచుకొన్నారు. శిముఖుని కుమార్తెను నాగనికను వివాహంచేసికొన్నాడు. పాటలీపుత్ర సింహాసనం అధిష్ఠించిన మౌర్యశాలిశుకుడు సురాష్ట్రంమీద దండయాత్ర సలిపినాడు. ఈ కారణంచేత శిముఖుడు మనసు కల్లోలమైంది.

యవనులదాడి ఆంటియోకసు అనే యవనరాజు సాకేతము మధురాప్రాంతమూ ఆక్రమించి పాటలీపుత్రం పట్టుకోడానికి సంసిద్ధుడైనాడు. మౌర్యులు యవనచ్ఛాటిని ఎదుర్కోలేని స్థితిలోఉన్నారు. ఈ ప్రమాదాన్నిచూచి శిముఖుడు పశ్చిమ దక్షిణాపథంలో వుండవలసి వచ్చింది.

కృష్ణుడు క్రీ. పూ. 198—180. నాసిక శాసనంవల్ల కృష్ణుని పేరు తెలుస్తున్నది. నాన్‌ఘాట్ గుహాకుడ్యాలమీద ఆంధ్ర శాతవాహనమూర్తులున్నవి. కాని కృష్ణుని ఆకృతిలేదు. అతడు విదిశ విదర్భల సమీపప్రాంతమునూ నాసికనూ జయించినాడు.

ప్రథమ శాతకర్ణి - నానాఘాట్ శాసనం క్రీ. పూ. 180—170. ప్రథమ శాతకర్ణి శాతవాహనులలో మేటి. అతనిభార్య వ్రాయించిన నానాఘాట్ శాసనంవల్ల ప్రథమ శాతకర్ణియొక్క పరిపాలనా సామర్థ్యం తెలియవస్తున్నది. కొన్ని నాణెములవల్ల హత్తి గుంఫా శిలాలేఖనంవల్ల అతనిపేరు విదితము.

దక్షిణాపథపతి నానాఘాట్ శాసనం అతన్ని 'దక్షిణాపథపతి'గా స్తుతిచేసింది. వేనచోదితమైన క్రతువు లాచరించినాడు శాతకర్ణి. మగధరాజైన పుష్యమిత్ర సుంగుడునూ, కళింగాధీశ్వరుడైన ఖారవేలుడునూ సామ్రాజ్య విస్తరకాంక్షతో యుద్ధసన్నాహాలతో సేనలు నడిపినారు. వాయవ్యదిశ యవనులు దాడిచేసినారు.

అశ్వమేధము శాతకర్ణి మహారాజు పూర్వోత్తరభాగాల్లో శాత్రవకోటిని ఎదుర్కొవలసి వచ్చింది. ప్రథమ శాతకర్ణి నాణెముల నిర్మాణాన్నిబట్టి, వాటిపైనున్న ఉజ్జయినీ చిహ్నాన్నిబట్టి మాళవమును శాతకర్ణి తనరాజ్యంలో కలుపు కొన్న సూచన కనబడుతున్నది. మాళవమునూ దక్షిణ విదర్భనూ జయించిన సందర్భంలో అశ్వమేధము చేసినాడు. ఖారవేలుడు శాతకర్ణి రాజ్యంలో సేనతో మూషికనగరం మీదుగా బెదిరింపుగా వెళ్ళినట్లు హత్తిగుంఫా శాసనంలో ఉన్నది.

ప్రథమ శాతకర్ణి నష్టాలుకూడ తీసికొని నిజప్రాభవం నెలకొల్పినాడు. రాజసూయం చేసినాడు. ఇందువల్ల వైదిక ధర్మంలో ప్రీతిగలవాడని తేలింది. ఆయన భార్యపేరు నాగనిక. ఆమె కుమార్తె నలుగురు. వారిపేర్లు కుమార హాకుసిరి, కుమార సాతవాహన, సతిసిరిమత, వేదసిరి.

పూర్ణోత్సంగుడు క్రీ. పూ. 170–152. పూర్ణోత్సంగుని కాలంలో పుష్యమిత్రసుంగుని మరణం సంభవించింది. (క్రీ. పూ. 149.) ఖారవేలుడుకూడా చనిపోయినాడు.

ద్వితీయశాతకర్ణి క్రీ. పూ. 152—96 సాంచీద్వార శాసనంవల్ల ద్వితీయ శాతకర్ణి పేరు తెలుస్తున్నది. ఆయన ఖారవేలుని మరణానంతరం కళింగాన్ని జయించినాడు. యుగపురాణాన్ని బట్టి అతడు శకాధిపతిని జయించి పదేళ్ళపాటు పాటలీపుత్రాన్ని పరిపాలించినాడు. ఆయన ముద్రలు పశ్చిమంగా దక్షిణాపథంలో లభ్యమవుతున్నవి.

అపీలకుడు క్రీ. పూ. 78—66. పురాణాలవల్ల ఇతనిపేరు విదితము. మధ్యరాష్ట్రాల్లో ఇతని నాణెము దొరికింది. ఇతని కాలంలో వాసుదేవ కాణ్వునివల్ల దేవభూతి హతుడైనాడు. పాటలీపుత్ర సింహాసనం వాసుదేవకాణ్వుడు అధిష్ఠించినాడు.

మగధలో ఆంధ్రులు క్రీ. శ. 78 వరకు చండశ్రీ పాటలీపుత్ర సింహాసనారోహణం చేసినట్లు పురాణములు, సిలప్పదికారం, కలియుగ రాజవృత్తాంత గ్రంథాలవల్ల తెలుస్తున్నది. ప్రాచీన పాటలీపుత్రప్రాంతంలో ప్రత్నకాల్లో కుమారహర్ వద్ద శాత వాహన ముద్రలు లభించినవి. కథాసరిత్సాగరంలో సోమదేవ భట్టు కుంతల శాతకర్ణి ప్రభువుకు చాలామంది సామంతు లున్నట్లు రచించినాడు. ఈ ఉపపత్తులవల్ల ఆంధ్రులు పాటలీ పుత్రాన్ని ఏలినట్లు స్పష్టము.

కుంతలశాతకర్ణి క్రీ. పూ. 38—30. కథాసరిత్సాగరంలో ఉల్లే ఖింపబడిన ఆంధ్ర. శాతవాహన ప్రభువు కుంతల శాతకర్ణి. ఇతనిని విక్రమాదిత్యు డనవచ్చును. కథాసరిత్సాగరంవల్ల కుంతలుడు కాణ్వసుశర్మను ఓడించినాడు.

1 వ పులోమావి క్రీ. పూ. 30—6. ప్రథమ పులోమావి పాటలీపుత్రముఖాద దాడిచేసినాడు. సుశర్మనుచంపి మగ ధను తనరాజ్యములో కలుపుకొన్నాడు.

హాలశాతవాహనుడు క్రీ. శ. 19—24. హాలశాతవాహనుని నామము ప్రాకృతభాషలోని 'గాథాసప్తశతి' అనే ముక్తక

కావ్యసందోహ సంగ్రథనకర్తగా విఖ్యాతుడు. 'లీలావతి' అనే ప్రాకృతకావ్యములో ఇతడే నాయకుడు.

శాతవాహనులు — శకులు శకులు తక్షశిల, మథుర, ఉజ్జయిని, పశ్చిమదక్కను ప్రాంతాల్లో రాజ్యాలు స్థాపించుకొన్నారు. శాతవాహన వంశీయులు చాలమంది దక్కనులోనూ, ఉజ్జయినీ శకులతోనూ సంఘర్షణ పడినారు. శకులతో పోరాటం చేసిన ప్రథమాంధ్రరాజు ద్వితీయ శాతకర్ణి. అతని అనుయాయులు శకులతో సమరంచేస్తూ సంప్రదాయం నిలవ బెట్టినారు.

ఆనంతర శాతవాహనులు — గౌతమీపుత్ర శాతకర్ణి — నాశిక గుహాశాసనము

క్రీ. శ. 78—102. గౌతమీపుత్ర శాతకర్ణి ఆంధ్ర శాతవాహనులలో మేటిప్రభువు. నాసిక గుహాశాసనాన్నిబట్టి గౌతమీపుత్రుని మహోన్నత వ్యక్తిత్వము, అతని విజయపరంపర, రాజ్యవిస్తీర్ణం మొదలైన విషయాలు తెలుస్తున్నవి.

పరిస్థితులు శాతకర్ణి గౌతమీ బాలశ్రీ శివస్వాముల పుత్రుడు. అతడు సింహాసనం అధిష్ఠించేసరికి దేశపరిస్థితులు అల్లకల్లోలముగాఉన్నవి. ఉత్తరాపథంలో గంగా సింధు మైదానాల్లో కుషాణులు త్వరితముగా సామంత క్షత్రప వంశాలను స్థాపిస్తున్నారు. దక్షిణాపథానికి పశ్చిమభాగము 'క్షహరాటు' ల హస్తగతమైఉన్నది. దక్కనులో శక, యవన, పహ్లవులు అనే విజాతీయులు వర్ణాశ్రమధర్మాలు పాడుచేసి

శాంతికి భంగము కలిగించినారు. ఎక్కువగా విజాతీయులు హిందూధర్మ స్వీకారం చేశారు.

యశఃప్రతిష్ఠ ఒకప్పుడు శాతవాహనులు దక్షిణాపథపతులై, మగధేశ్వరులైనవారు ప్రస్తుతము యశోహీనులయినారు. అటువంటి సమయంలో శక యవన పహ్లవ క్షహరాట వంశ నిర్మూలనముచేసి, చాతుర్వర్ణ్య రక్షణచేసి, శాతవాహన కుల యశఃప్రతిష్ఠాపనం చేసినాడు శాతకర్ణి. ఆయన అసిక, అసక, ములక, సురథ, కుకుర, అపరాంత, అనూప, విదర్భ, ఆకరావంతి రాజ్యాలకు చక్రవర్తి. ఇవిగాక వింధ్య, ఛవట, పారియాత్ర, సహ్య, కృష్ణగిరి, మచ్ఛ, సిరిథన, మలయ, మహేంద్ర, సేతగిరి, చకోర పర్వత ప్రాంతాలకు ప్రభువు.

పైనచెప్పబడిన రాజ్యాలు గౌతమీపుత్రుడు సింహాసనము అధిష్ఠించకపూర్వమే 'క్షహరాటుల' వంశంలో ఉండేవి. గౌతమీపుత్రుని తొలిశాసనం అతని 18 వ రాజ్య పాలనావత్సరంనాటిది. గౌతమీపుత్రుడు దక్కను పశ్చిమ భాగంలో వైజయంతీపుర స్కంధావారంనుంచి దానశాసనం ప్రకటించినాడు. దానశాసన ప్రచురణకుముందుగా అతడు దక్కనులో పశ్చిమభాగం జయించి, విజయానంతరం విశ్రాంతి తీసికొంటూ ఉండవచ్చును. నాసిక శాసనాన్నిబట్టి అతడు విజయలక్ష్మీసనాథుడైన సూచన కనబడుతున్నది. తత్పూర్వము గా ములక, అసిక, అసక, విదర్భ, ఆకరావంతి, అనూప, కుకురరాజ్యాలను నిజరాజ్యంలో కలుపుకొన్నాడు. ద్వితీయ

దిగ్విజయానంతరం సురధ, అపరాంత, వైజయంతీరాష్ట్రాలు సంపాదించినాడు. అతనికుమారుడైన పులోమావియొక్క నాణెములు కడలూరు, మదరాసుతీర ప్రాంతాల్లో లభ్యమవుతున్నవి. కనుక ముద్రలు దొరికిన ప్రదేశాలనుబట్టి దక్షిణ భారతదేశంలో కొంతభాగం గౌతమీపుత్రుడు కలుపుకొని ఉంటాడని ఊహచేయవచ్చును. ఈ విషయము మ్యాకడోని శాసనం బుజువుచేస్తున్నది. గౌతమీపుత్రుడు తూర్పు రాజస్థానంనుంచి కడలూరుదాకా, ఈశాన్యదిశ బుషికుల్యా నదినుంచి నైఋతిదిశ వైజయింతిదాకా రాజ్యపాలన చేసినాడు.

వ్యక్తిత్వం నాసిక శాసనంలో గౌతమీపుత్రుని ప్రతిభావిశేషాలు వర్ణింపబడినవి. అత 'డాగమనిలయు' డట. 'సత్పురుషాశ్రయుడు', 'ఏకశూరుడు'. 'ఏకబ్రాహ్మణుడు'. 'రామకేశవార్జున భీమసేన తుల్యపరాక్రముడు'. 'నహుష జనమేజయ సగర యయాతి రామాంబరీష సమతేజుడు'. 'సదాచార సలపన్నుడు'. 'మాతృసేవాధురీణుడు'.

2 వశిష్ఠీపుత్ర పులోమావి క్రీ. శ. 102—130. గౌతమీపుత్ర శాతకర్ణి అనంతరం ద్వితీయ వాసిష్ఠీపుత్ర పులోమావి శాతవాహన సింహాసనారోహణం చేసినాడు. అతని నాణెములు ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యరాష్ట్ర, కర్ణాటకతీరాల్లో లభించినవి. తండ్రివల్ల సంక్రమించినరాజ్యం భద్రంగా పాలించినాడు. అతని పరిపాలనాంతంలో కుషాణులు దక్షిణాపథ రాజకీయాల్లో

జోక్యం కలిగించుకోదలచి, చష్టనున్నిపంపి శాతవాహనాభ్యుదయాన్ని నిరోధించమన్నారు. చష్టనుడు శాతవాహన రాజ్యపుటుత్తరభాగం, వాయవ్యప్రాంతాలనూ జయించి, ఉజ్జయినిని రాజధానిగా చేసికొన్నాడు. చష్టనుని పురోగమనం ఆపలేకపోయినాడు పులోమావి.

శాతకర్ణి క్రీ. శ. 130—154. శకక్షత్రపరాజు చనిపోయిన వెంటనే శకసింహాసనంకోసం వారసులు పోరాటంచేసినారు. వారిలో రుద్రదమనుడు ముఖ్యుడు. అతడు తక్కినవారసులను జయించినాడు. ఈ వారసత్వపుతగాదా ఆసరగాతీసుకొని శాతకర్ణి చష్టనుడు జయించిన తమరాజ్యాలను తిరిగి జయించినాడు. రుద్రదమనుడు శాతకర్ణితో చెలిమిచేసి తనకుమార్తెనిచ్చి పెళ్ళిచేసినాడు. శాతకర్ణి మరికొంతరాజ్యం తిరిగి జయించబోయినాడు. సింహాసనం అధిష్ఠించిన తదుపరి రుద్రదమనుడు శాతకర్ణినిఓడించి కొంత శాతవాహనరాజ్యం తమరాజ్యంలో కలుపుకొన్నాడు.

గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శకులను జయించుట క్రీ. శ. 174—203. శాతవాహన చక్రవర్తులలో తుదివారిలో గొప్పవాడు. ఆయన నాణెములూ శాసనాలూ ఆంధ్ర మహారాష్ట్ర గుజరాత్, కథియవాడు, మాళవము, బరోడాప్రాంతాల్లో దొరికినై. రుద్రదామని అనంతరం ఉజ్జయినిలో శకరాజులు నీరసులు కావడంచేత శకరాష్ట్రాలమీదికి యజ్ఞశ్రీ దండువెళ్ళినాడు.

దక్కనుకు పశ్చిమభాగం, మధ్యభారతం, ఆంధ్రరాజ్యంలో కలుపుకొన్నాము.

మహాచైత్యనిర్మాణం యజ్ఞశ్రీ ఆస్థానంలో నాగార్జునాచార్యులవారుండేవారు. ఆయన మహాయాన బౌద్ధాచార్యుడు. ఆయన ప్రోత్సాహాన్ని పురస్కరించుకొని యజ్ఞశ్రీ అమరావతిలో మహాచైత్యంచుట్టూ సుందరావరణం కల్పించినాము.

శాతవాహన ప్రాభవం క్షీణించుట యజ్ఞశ్రీ తరువాత వచ్చినవారు పురాణాలనుబట్టి విజయశ్రీ (క్రీ శ. 203—209), చంద్రశ్రీ లేదా చండశ్రీ (209—219), పులోమా (219—227) విజయుడు విజయశాతకర్ణి కావచ్చునేమో నాణెములనుబట్టి. చండశ్రీ చంద్రశ్రీ శాతకర్ణి కావచ్చును. పురాణాల్లో పులోముడు మైకడోని శిలాలేఖనంలోని పులోమావిస్సి ఒక్కడే. అతడు యజ్ఞశ్రీ పాలించిన రాష్ట్రాలుకాక ఇతర ప్రదేశాలు ఏవేవి పరిపాలించాడో తెలియదు. రుద్రశాతకర్ణి అనేపేరు నాణెములవల్ల తెలుస్తుంది. క్రీ. శ. 3 వ శతాబ్ది మధ్యంలో ఆంధ్రపథము ఇక్ష్వాకువంశీయుల హస్తగతమైంది. కాంచీపురీపల్లవులు ఆంధ్ర శాతవాహనీయరాష్ట్రాలు నాలుగో శతాబ్దములోగా స్వాధీనము చేసికొన్నారు. కన్హేరీ శాసనం వల్ల మాఠరీపుత్ర శకసేనుడనే రాజనామం కనబడింది. అతడు శక శాతకర్ణికాడు. ఈ శకసేనునిపేరు పురాణాల్లో లేదు. శకసంబంధముపేరులో కనబడుతున్నది.

శాతవాహన వంశశాఖలు - రాజప్రతినిధి కుటుంబాలు రాజశేఖరుడనే సంస్కృతాలంకారికుని కావ్యమీమాంసలో కుంతలప్రభువు సాతవాహనుడని ఉన్నది. పురాణములు కామసూత్రాలు కుంతల శాతకర్ణిని పేర్కొన్నవి. పురాణాలనుబట్టి గౌతమీ శాతకర్ణికి కుంతలశాతకర్ణి పూర్వుడు.

హాలుడనే శాతవాహన ప్రభువుకూడా కుంతలేశ్వరుడే. అతడు ప్రాకృత 'గాథాసప్తశతి' అనే ముక్తకకావ్యాన్ని సంతరించినవాడు. బహుశ హాలుడు కుంతల శాతకర్ణి కావచ్చును. అయితే ఎప్పుడు కుంతలరాష్ట్రం శాతవాహన పాలనకిందికి వచ్చిందో చెప్పలేము.

దక్షిణాపథ నైఋతిప్రాంతంలో 'చూతకులము' నకు చెందినవారు పాలించినట్లు శాసనాధారం ఉన్నది. వారు మహారథులు, మహాభోజులకు బంధువులు. శాతవాహనులకు సామంతులై ఉండవచ్చును.

పశ్చిమతీరంలో కార్వార్‌లో 'ముడానంద', 'చూతుకడానంద' అనే రాజనామములుగల ముద్రలు దొరికినవి. ఈ ముద్రలు మైసూరులో శాతవాహన రాజప్రతినిధిఅయిన "సడకనకలాలయ మహారథి" యొక్క నాణెములవలెఉన్నవి. యజ్ఞశ్రీ అనంతరం శాతవాహన ప్రాభవం క్షీణించినపుడు కుంతలదేశంలో శాతవాహన రాజప్రతినిధులు ముడానందుని వల్ల రాజ్యభ్రష్టులై ఉండవచ్చును. అనగా చూతుకడానంద వంశము రాజ్యాధిపత్యం వహించినదనవలెను.

క్రీ. శ. 2 బనవాసిలోని శాసనంవల్ల 'మహాభోజ' అనే ఆమెకుమారుడు శివస్కంద నాగశ్రీ అనేనామము తెలుస్తున్నది. **Rapson** పండితుడు శివస్కంద నాగశ్రీయే స్కందనాగ శాతకర్ణిగా చెప్పినాడు. అయితే ఊహామాత్రమే.

చాందాజిల్లాలో శాతకర్ణి, పులుమావి, యజ్ఞ శాతకర్ణి, కృష్ణశాతకర్ణి నాణెములు లభించినవి. అయితే ఈపేర్లలో మాతృనామం విశదం కాకపోవడంవల్ల పై వారిలో శాతకర్ణి గౌతమీపుత్ర శాతకర్ణిగా, పులుమావి వాసిష్ఠీపుత్ర పులుమావిగా చెప్పడానికి వీలులేదు. కేవలం శాసనలిపినిబట్టి కాల నిర్ణయం చేయడం యోగ్యంకాదు.

బీరారులో అకోలానద్ద 1525 నాణెములు శాతవాహనులవి దొరికినవి. వీటిలో శివశ్రీ పులుమావి, పులుహామావి అనేవారి ముద్రలున్నవి. బహుశ వాసిష్ఠీపుత్ర పులుమావి అతనిపేరింటివాడు కావచ్చును. యజ్ఞశ్రీ తరువాత రాజ్యానికివచ్చినవారు శాతవాహన రాజ్యము స్థిరణంచేయగా, బీరారు మధ్యప్రదేశాల్లో వారిముద్రలు లభిస్తున్నవి. ఈశాతవాహనశాఖ క్రీ. శ. 3 దాకా పరిపాలనచేసినట్టున్నది. వాకాటకులవల్ల శాతవాహనీయశాఖ నిర్మూలితమైంది.

దక్షిణకోసలం శాతవాహన పాలనలోనిది. శివశ్రీ అపీలకుడు, యజ్ఞశ్రీ అనంతరపాలకుడై దక్షిణకోసలంలో ఉండేవాడు. అందుచేత అపీలకుడు ఆనంతర శాతవాహనులలోవాడేకాని కొందరన్నట్లు గౌతమీపుత్ర శాతకర్ణికి పూర్వుడుకాడు.

దక్షిణ మహారాష్ట్రంలో కోల్హాపూరులో లభించిన కొన్ని శాతవాహన నాణెములవల్ల మూడు పేర్లు తెలుస్తున్నవి.

1. వాసిష్ఠీపుత్ర విలివాయకుర.
2. మాఠరీపుత్ర శివలకుర.
3. గౌతమీపుత్ర విలివాయకుర.

వీరంతా కోల్హాపుర శాతవాహన వంశశాఖలోవారు. వీరిని ఆంధ్ర శాతవాహన వంశీయులని చెప్పడానికి వీలులేదు. వీరు కోల్హాపుర రాష్ట్రపాలకులై ఉంటారు.*

కళింగములో చేది (మహామేఘవాహన) వంశం

కళింగము ప్రస్తుతపు పూరీ, గంజాం, కటకమండలాలున్నూ దాన్ప్రక్కనే ఉత్తర, వాయవ్యభాగాలూ, దక్షిణాన పిఠాపురమువరకూ ప్రాచీన కళింగరాజ్య మవుతుంది.

కళింగచరిత్ర అశోకయుద్ధానంతరం అంతగా తెలియదు. మగధ సామ్రాజ్యాధిపత్యంనుంచి కళింగవాసులు ఎప్పుడు విముక్తిపొందినారో చెప్పలేము.

ఖారవేలుడు చేదిరాజ వంశవర్ధనుడు, మహామేఘవాహన సంతతివాడున్నూ అయిన మహారాజ ఖారవేలుడు •ప్రాచీన

---

* శాతవాహన చరిత్రాధారం ముఖ్యంగా డా. మారేమండ రామారావుగారి శాతవాహనసంచిక శాసనాదులుకాక.

• ఇలవంశము—అసలు ఖారవేలునిది. అతని బిరుదము మహారాజ చేదిరాజ వంశవర్ధనుడు.

భారతేతిహాసంలో ఉజ్వలమూర్తి. ఓడ్రదేశంలో ఉదయగిరి పర్వతంలో మంచాపురీ గుహాకుడ్యంమీద వ్రాయించిన హత్తిగుంఫా శిలాలేఖనంలో ఖారవేలుని జీవితఘట్టాలు, సమకాలికవిషయాలూ మనకు లభ్యమవుతున్నవి.

జీవితారంభము ఖారవేలుని జీవితంలో తొలి పదిహేనేళ్లు 'లేఖరూపగణనా వ్యవహార విధాన మీసూంసా' ది విద్యలు నేర్చినాడు. పదహారవయేట అతడు యువరాజైనాడు. 24 సంవత్సరాల వయసులో కళింగాధిరాజైనాడు. జైనుడై భిక్షురాజనిపించుకొన్నాడు. జైనాభిమానంవున్నా పరమత సహనంకలవాడు.

దిగ్విజయయాత్ర ఖారవేలుడు కళింగాధిరాజైనతరువాత దిగ్విజయయాత్ర ఆరంభించినాడు. రెండవసంవత్సరంలో తనకు పశ్చిమంగా శాతకర్ణి ఉన్నాడనే సంగతికూడా ఆలోచించక సేనను పంపినాడు. విజయయాత్రా సందర్భంలో ఖారవేలుని సేనాసీకం కృష్ణవేణీ తటానవున్న అసికనగరాన్ని దాడి చేసింది. అసికనగరం శాతకర్ణి రాజ్యంలోది. ఆంధ్రులు కళింగులూ యుద్ధంచేసికొన్నట్లు ఆధారాలులేవు. ఈ శాతకర్ణి మొదటి శాతకర్ణి అనే ఆంధ్రశాతవాహనుడు. ఖారవేలుడు తన నాలుగోసంవత్సర పరిపాలనాకాలంలో విద్యాధర రాజధానిని ఆక్రమించినాడు. ఎవరో విద్యాధరరాజు తెలియదు. బహుశ విదర్భలో రాష్ట్రిక భోజకులను జయించినాడు. ఎనిమిదోయేట ఖారవేలుడు బర్బరాకొండలలో గోరథగిరి

అనే దుర్గమును ముట్టడించినాడు. కొందరు గోరధగిరిని దుర్గమని చెప్పక ఎవరోరాజని భావించారు. రాజగృహానగరిని పట్టుకొన్నాడు. ఈ విజయ పరంపరకు యవనరాజు గుండేలు అదరగా మధురకు పారిపోయినాడు. ఈ యవన, (యోన) రాజు బహుశ డిమితలేక డిమిట్రియస్ అనే పంజాబులోని హైందవ యవనరాజై ఉండవచ్చును.

అతడు పదకొండో పరిపాలనా సంవత్సరంలో 'పిథుండ' నగరమును నాశనంచేసినాడు. ఈ నగరము మచిలీపట్టణానికి సమీపాన ఉండేది. పన్నెండో సంవత్సరంలో ఖారవేలుడు ఉత్తరాపథరాజన్యాన్ని ఎదిరించి గంగాతీరాన మగధరాజును నిర్జించినాడు. ఆ మగధరాజు బృహస్పతి మిత్రుడని చరిత్రకారనిర్ణయము. ఖారవేలుడు నందులవల్ల కళింగరాజ్యానికి కలిగిన అపకీర్తిని తొలగించుకొనేనిమిత్తం, కసితీర్చుకొనేనిమిత్తం, కత్తులు నూరినాడు. అంగమగధ రాజ్యాలను కొల్లగొట్టినాడు. పూర్వం కళింగంనుంచి నంద రాజు అపహరించిన జైనవిగ్రహాన్ని అతడు తిరిగి తెచ్చుకొనాడు. దక్షిణాత్యుడైన పాండ్యరాజును జయించినాడు.

ప్రజానురంజనంగా పరిపాలనచేసినాడు ఖారవేలుడు. ప్రజానందంకోసం ఉత్సవవినోదాలు, సంగీత నాట్యప్రదర్శనాలూ ఏర్పాటు చేయించేవాడు. మూడుశతాబ్దాలకిందట నందరాజ నిర్మితమైన పంటకాలువ పెద్దదిచేసి ఎక్కువ దూరము కృషినిమిత్తం తవ్వించినాడు. అనేక మందిరాలు

కట్టించినాడు. కళింగరాజధానిలో మహావిజయ ప్రాసాదమును నిర్మింపజేసినాడు. ఒకసారి పెనుతుపానులో నగరము పాడై పోగా తిరిగి కట్టించినాడు. ఆరామవాటికలు ఏర్పరిచినాడు. కుమారీపర్వతం తొలిపించి జైన సన్యాసులకోసం గుహావాసములు ఏర్పాటు చేయించినాడు.

ఖారవేలునికాలము ఖారవేలుని కాలనిర్ణయ విషయంలో వాదోపవాదాలు చెలరేగినవి. కొందరు పండితులు క్రీ. పూ. ద్వితీయ శతాబ్దపు ప్రథమార్ధములోనివాడనీ మరికొందరు తరువాత వాడనీ తేల్చినారు. ఈ చర్చ గ్రంథవిస్తరభీతినల్ల వదలి వేస్తున్నాను.*

శాతవాహనుల అనంతరం దక్షిణాపథ రాజ్యాలు

వాకాటకులు యజ్ఞశ్రీ శాతకర్ణి మరణానంతరం క్రీ. శ. 3 వ శతాబ్దారంభములో శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిన్నము కావడం జరిగింది. బీరారు మధ్యప్రదేశప్రాంతాల్లోవున్న శాతవాహనుల గవర్నర్లు స్వతంత్రులైనారు. అలా స్వతంత్రులైనవారిలో వాకాటకులున్నారు. వాకాటకులు చాళుక్యులు తలెత్తకపూర్వం దక్కను పరిపాలించినారు.

వింధ్యశక్తి వాకాటకులలో వింధ్యాశక్తి గొప్పవాడు. అతను వాకాటక వంశస్థాపకుడు. విష్ణు వృద్ధసగోత్ర బ్రాహ్మణుడు.

---

* కాలనిర్ణయచర్చ–The Age of Imperial unity Edited by K. M. Munshi Vol II 215—216 పుటలు చూడు.

పరాక్రమశాలి. పురాణములనుబట్టి అతడు 96 సంవత్సరాలు జీవించినాడేకాని అది పరిపాలనాకాలంకాదు.

ప్రథమ ప్రవరసేనుడు వింధ్యాశక్తి కుమారుడు మహారాజ హారీతిపుత్ర ప్రథమ ప్రవరసేనుడు రాజైనాడు. ప్రవరసేనుడు సమాట్టని వర్ణింపబడినాడు. పురాణములనుబట్టి అతడు 60 సంవత్సరాలు పరిపాలన చేసినాడు. బ్రాహ్మణ ధర్మపోషకుడు. స్వయంగా ఆయన వాజపేయమునే అశ్వమేధము ఆచరించి నాడు. అవేకాక అగ్నిష్టోమము, ఆప్తోర్యామము, జ్యోతి ష్టోమము, బృహస్పతిసవము, ఉక్థ్యషోడశి, అతిరాత్రాదులు ఆచరించినాడు. శాతవాహన సామ్రాజ్యానంతరం వాకాటకులు సామ్రాజ్యం స్థాపించినారు కనుక అశ్వమేధయాగము చేసినారు. వారికి భారశివులు ఎక్కువగా తోడ్పడినారు. క్రీ. శ. నాలుగోశతాబ్దపు ప్రథమభాగంలో గతించినాడు ప్రవరసేనుడు.

ఆభీరులు ఆభీరులు శకులతోనో, వారికన్న ముందుగానో తూర్పుఇరానుదేశమునుంచి భారతదేశం వచ్చారని కొందరి మతం. వారు పురాణాలనుబట్టి ఉత్తరకొంకణం లేదా అప రాంతవాసులు. ఆభీరులు శాతవాహనుల అనంతరం పరిపాలన చేసినారు. పాతంజల మహాభాష్యాన్నిబట్టి ఆభీరులు శూద్రులతో సమంగా వ్యవహరింపబడినారు. టాలెమీ భూగోళ శాస్త్రాన్నిబట్టి వారు దగువసింధులోయ, కథియవాడ నివాసులై ఉంటారు. పశ్చిమ భారతతీరంలో శక మహాక్షత్రప

సేనాపతులుగా ఆభీరులు నియోగింపబడేవారు. మహాక్షత్రప ఈశ్వరదత్తుని నాణెములు లభిస్తున్నవి.

ఈశ్వరసేనుడు శాతవాహనుల అనంతరం పాలించినవాడు మాఠరీపుత్ర ఈశ్వరసేనుడని నాసికశాసనం చెబుతున్నది. అతడే ఆభీరవంశస్థాపకుడు. పురాణాలవల్ల ఆభీరుల పరిపాలనం 67 సంవత్సరాలని తెలుస్తున్నది. వారు క్రీ. శ. 4 వ శతాబ్ది మధ్యభాగందాకా పరిపాలన చేసినారు. అనంతరం కదంబ వంశీయుడైన మయూరశర్మతో ఘర్షణపడినారు ఆభీరులు. సముద్రగుప్త సమాట్టుకాలంలోనూ ఆభీరు లుండేవారు.

బోధివంశము బహుశ క్రీ. శ. 3 వ శతాబ్దములో బోధిపంశీయులు దక్కనుకు వాయవ్యదిశలో పరిపాలించినట్లు నాణెముల వల్ల ఊహచేయవచ్చును. ముద్రలవల్ల తెలుస్తున్న బోధి రాజుల పేర్లు :—1. శివబోధి. 2. చంద్రబోధి లేక శ్రీచంద్ర బోధి. 3. వీరబోధిదత్తు. బోధివంశం ఎలా అంతరించిందో తెలియదు.

ఇక్ష్వాకులు

శాతవాహన సామ్రాజ్యపతనం యజ్ఞశ్రీ తరువాత రాజ్యపాలకులు బలహీనులు కావడంవల్ల మహాక్షత్రపుల ప్రయోగమనాన్ని నివారించలేకపోయినారు. శాతవాహనులలో చివరమున్గురూ విజయ, చంద్రశ్రీ, IV పులుమావ్రులు పతనమవుతున్న సామ్రాజ్య ఛత్రదండాన్ని నిపపలేకపోయినారు. వారిలో

వారికి అంతఃకలహాలు, ఈర్ష్యా ద్వేషాలు ప్రజ్వరిల్లినై. అగ్నిలో ఆజ్యంపోసినతీరుగా శాతవాహన సామంతులు విజృంభించినారు. వనవాస అపరాన్తములలో రాష్ట్రికులకుల వల్లనే సామ్రాజ్యపతనం త్వరితమైంది. ఉజ్జయినిలో ప్రథమ రుద్రసింహుని విజయంవల్ల వనవాసములోని చూతుకుల రాజులకు ప్రోత్సాహం కలిగింది. ఆంధ్రదేశంలో శ్రీ పర్వతీయులైన ఇక్ష్వాకులు అదనుచూచి శాతవాహనులమీద కత్తులు దూసినారు. అపరాంతంలో ఆభీరులు, మాళవంలో శకక్షత్రపులూ శాతవాహనుల పశ్చిమోత్తరరాష్ట్రాలు ఆక్రమించినారు. అంతటితో ఆంధ్రశాతవాహన సామ్రాజ్య భానుడస్తమించాడు.*

1 వాసిష్ఠీపుత్ర శ్రీ శాంతమూలుడు క్రీ. శ. 200—218. యజ్ఞశ్రీ అనంతరం శాతవాహన సామ్రాజ్యం పతనోన్ముఖి మవు తున్నప్పుడు అవకాశంచూచి వాసిష్ఠీపుత్ర శ్రీ శాంత మూలుడు ఇక్ష్వాకురాజ్యం స్థాపించినాడు. ఆయన శాత వాహనులను జయించి రాజ్యస్థాపన చేసినందువల్ల అశ్వమేధ యాగము ఆచరించినాడు.

పురాణములలో ఇక్ష్వాకులు శ్రీ పర్వతీ యాంధ్రులని ఉల్లేఖింపబడినారు. వారిరాజధాని విజయపురి. ఈ పురము నాగార్జున కొండలోయలో ఉండేదని పురాతత్త్వ శోధనవల్ల

---

* భావరాజు కృష్ణరావుగారి Early Dynastics Andhradesa 30 పుట.

స్పష్టమవుతున్నది. పర్వతనామము శ్రీపర్వతము దానికి ప్రస్తుతము నల్లమలకొండలని వ్యవహరిస్తున్నారు. శాంత మూలుడు సనాతనబ్రాహ్మణ మతాభిమాని. అశ్వమేధమే కాక వాజపేయమువంటి వైదికక్రతువు లాచరించినాడు.

శాసనాల్లో శాంతమూలునికి ఇద్దరు సోదరీమణు లున్నారని తెలుస్తున్నది. పూకీయ వంశీయ మహాసేనాపతి మహాతలవరునికి శాంతమూలుని సోదరినిచ్చినారు. పూకీయ వంశీయులు నెల్లూరుమండలవాసులు. శాంతమూలుని రెండో కుమార్తెను, అటవి శాంతిశ్రీని ధనవంశీయుడైన మహా సేనాపతి మహాదండనాయకుని కిచ్చినారు. ఇక్ష్వాకులకూ నెల్లూరు, కడపప్రాంతాల్లో హిరణ్యకులకూ బాంధవ్యముంది.

శాంతమూలుని రాజ్యంలో దక్షిణకోసలంతోసహా దక్షినులో పూర్వార్ధభాగం యావత్తూ ఉండేదని చెప్పవచ్చును.*

నాగార్జునకొండలో ప్రాకృత శాసనాలవల్ల వాసిష్ఠీ పుత్ర శాంతిమూలుడు ఇక్ష్వాకువంశస్థాపకుడు. 'ఇక్ష్వాకు స్వామి' అని పేర్కొనబడినాడు శాంతమూలుడు.

శాంతమూలుని విజయాలు - గుణగణాలు శాంతిమూలుని ఉజ్వలజీవితం అతని పుత్రపౌత్రుల శిలాలేఖనాలవల్ల తెలుస్తున్నది. దక్షిణా పథంలో అతడు అప్రతిహత పరాక్రముడని గ్రహించవచ్చును.

---

* B. V. K's Early Dynastics 34 పుట.

శాంతమూలుము 'హిరణ్యకోటి, గోశత సహస్ర, హాలశత సహస్ర' ములు దానముచేసిన వితరణశీలుడు. గోశతసహస్రాన్ని, వేయినాగళ్ళనూ, సువర్ణమునూ పంచిపెట్టినాడనడం వల్ల దేశం సుభిక్షంగా ఉండేదని చెప్పకతప్పదు. విప్రులకు అగ్రహారాలు దానంచేసినాడు. శివారాధన తత్పరుడు. స్కంద కార్తికేయారాధకుడు. వాసిష్ఠీపుత్రుడనే మాతృ సంబంధంవల్ల మాఠరగోత్రానికిచెందిన బ్రాహ్మణస్త్రీని అతడు వివాహము చేసుకోడంవల్ల బ్రాహ్మణుడన్నమాట. అందుచేత ఇక్ష్వాకులు బ్రాహ్మణులు.

2 మాఠరీపుత్ర వీరపురుషదత్తుడు క్రీ. శ. 218-239. క్రీ. శ. 218 లో వీరపురుషదత్తుడు రాజైనాడు. అతడు పరిపాలన చేస్తున్నప్పుడు తెలుగుదేశం తృణకాష్ఠజల సమృద్ధంగాఉండేది. *జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లెలోని శాసనాలన్నీ బౌద్ధమత ప్రాబల్యాన్ని తెలియజేస్తున్నవి.

అతనికుటుంబము వీరపురుషదత్తుడు మేనగోడళ్ళను పెళ్ళాడినాడు. మేనరికం దక్షిణదేశంలో ఇప్పటికీఉంది. క్రీ. పూ. 5 వ శతాబ్దమునుంచి బోధాయనుడు అనే ధర్మసూత్రకారుడు మేనరికం అంగీకరించినాడు. వీరపురుషదత్తుని రాణి, ఉజ్జయినీ రాజకుమారి, మహాదేవి రుద్రధర భట్టారిక. ఆమెకూ శక మహాక్షత్రపుడైన ద్వితీయ రుద్రసేనునికీ బాంధవ్యం ఉండేది.

---

* 6, 14, 15, 18, 20 రాజ్యపాలననాటి నాగార్జునకొండ శాసనాలు.

వీరపురుషదత్తుడు కుమార్తెను వనవాసరాజైన, చూతుకుల శాతకర్ణులలో ఒకనికిచ్చి వెళ్ళిచేసినాడు. ఈ వైవాహిక సంబంధంవల్ల, ఉజ్జయినీ వనవాసరాజుల స్నేహమువల్ల ఇక్ష్వాకులకు బలంచేకూరింది.

రాజుల దానధర్మాలు - బుద్ధభక్తి అమరావతి, జగ్గయ్యపేట, నాగార్జున కొండప్రాంతాలలో వీరపురుషదత్తుని శిలాలేఖనాలవల్ల ఇక్ష్వాకురాణులకు బుద్ధభక్తి అపారమని తేటతెల్లమవుతున్నది. వీరపురుషదత్తుని రాణులు, స్త్రీబంధుజనులు విజయపురిలో మహాచైత్యమునకు చేసిన దానధర్మాలు ఉల్లేఖింపబడినవి.

శిల్పాలు - వీరపురుషదత్తుడు - శైవము - బౌద్ధము వీరపురుషదత్తుడు మొదట సనాతనమతావలంబి, తరువాత కొంతకాలానికి బౌద్ధుడైనాడని నాగార్జున కొండవద్దనున్న శిల్పాలవల్ల తెలుస్తున్నది. ఆరవసంవత్సర పరిపాలనలో బౌద్ధుడైనట్లు తోస్తుంది. అప్పుడే శ్రీ పర్వతముమీద శిథిలమైన మహాచైత్యాన్ని సముద్ధరించినట్లు శాసనాల్లో ఉన్నది. మహావిహారాలు చైత్యగృహాలు, చతుశ్శాలలు, మంటపాలు నిర్మింపబడినవి. ఒకస్తూపఫలకంమీద మాతరీపుత్ర వీరపురుషదత్తుడు నాగఫణముమీది లింగప్రతీకాన్ని పాదములతో తొక్కుతున్నట్లు కనబడుతున్నది. బ్రాహ్మణమత ప్రతీతమైన శివలింగమును తొక్కడమంటే సనాతనమతం త్యజించినాడన్న మాట. అయితే శివలింగ ప్రతీకాన్ని తొక్కుతున్నమూర్తి

యజ్ఞుడని లాంగ్‌హర్స్ట్ చెప్పినాడు. అనగా యజ్ఞుడు బౌద్ధస్వీకారం చేస్తున్నాడన్నమాట. ఇది సరియైన వ్యాఖ్యఅయితే వీరపురుషుడు బౌద్ధస్వీకారం చేశాడని చెప్పడంకష్టం. రాణుల వల్లనే బౌద్ధంప్రబలింది.

3 బాహుబల ద్వితీయ శాంతమూలుడు క్రీ. శ. 239–252. వీరపురుషుని అనంతరం ఇక్ష్వాకు సింహాసనం ద్వితీయ శాంతమూలుడు అధిష్ఠించినాడు. అప్పుడు వైజయంతిని పరిపాలిస్తున్న పల్లవ రాజైన వీరకూర్చవర్మ, కదంబరాజైన శివస్కందవర్మను ఓడించినాడు. శివస్కందుడు అడవులపాలై తల దాచుకొంటున్నాడు. అతడు శాంతమూలునికి బావమఱది. వీర కూర్చవర్మ శివస్కందవర్మనూ, అతనికి సహాయంచేసిన ఇక్ష్వాకుసేననూ ఓడించినాడు. అపరాంతములో స్థిరపడినాడు. శాంతమూలుడు ఇక్ష్వాక రాజ్యశ్రీ సనాథుడు కావడంవల్ల కదంబుల అదృష్టము పండిందని చెప్పవలసి వుంటుంది. బాహుబల శాంతమూలుడు వీరకూర్చవర్మను నిర్జించి వైజయంతీనాథుడైనాడు. శివస్కందునికి సాహాయ్యం చేసి కదంబరాజ్యము నిలిపినాడు.*

శిల్పదానాలు శ్రీ బాహుబలుని రాజకీయ జీవితం అంతగా తెలియదు. అతనికాలంలో బౌద్ధంప్రబలంగా ఉండేవని చెప్ప

---

* వివరములకు Early Dynastics Andhradesa by B. V. K. Book II 134—167 పుటలు చూడు.

డానికి శాసనాధారాలున్నవి. ఒకశాసనంవల్ల బహుశ్రుతీ యులు మహిశాసకులనే రెండు బౌద్ధకూటాలున్నట్లు తెలు స్తున్నది. మహారాణిమాత, మహాదేవి వాసిష్ఠీభట్టి దేవి విహారాన్ని ఒకస్తూపాన్ని, ఒకచైత్యగృహాన్ని, మంటపాన్ని భాహుబలుని రాజ్యపాలనలో రెండోసంవత్సరం నిర్మించినట్లు శాసనంలోఉంది. రెండోశాసనంలో మహాదేవి కుందవల్లిశ్రీ, వాసిష్ఠీపుత్ర శ్రీ శాంతమూలుని మనుమరాలు, విహారం, ఆయకస్తంభం, చైత్యగృహం, మండపం, చతుశ్శాలా నిర్మాణంచేయించి మహిశాసకాచార్యులకు అంకితంచేసింది.

ఇక్ష్వాకులపతనం భాహుబలుని కాలంలో ఇక్ష్వాకురాజ్యం పత నోన్ముఖమైంది. క్రీ. శ. 3వ శతాబ్దాంతములో రాజ్యం అస్తమించినదని పల్లవ శివస్కందవర్మని మైదవోలుశాసనం ఆధారం. క్రీ. శ. మూడవశతాబ్దము తుదిభాగంలో పల్లవు లాంధ్రదేశమును ఆక్రమించినారు. ఇక్ష్వాకులచరిత్ర కొంత వరకు సూచనగా కన్నడభాషలోని 'ధర్మామృత' కావ్యం వల్ల తెలిసికోవచ్చును.

బృహత్పాలాయనులు క్రీ. శ. 3వ శతాబ్దాంతములో మచిలీపట్టణ సమీపములో బృహత్పాలాయన రాజధానిఉండేది. అది కుడూర అనగా గూడూరు లేదా ఘంటసాల సమీపములో నోడూరు కావచ్చును.

జయవర్మ క్రీ. శ. 270—285. బృహత్పాలాయనులలో జయ వర్మ గొప్పవాడు. కొండమూడి దానశాసనంవల్ల అతను

రాజనీ మహేశ్వరారాధకుడనీ తెలుస్తున్నది. ఆయనతరువాత రాజుల పేర్లు తెలియవు. బృహత్ఫాలాయనులలో పూర్వులు శాతవాహనాధిపత్యం అంగీకరించి ఉండవచ్చును. క్రీ. శ. 3వ శతాబ్దాంతములో జయవర్మ ఇక్ష్వాకుల ఆధిపత్యంతోసి రాజని స్వతంత్రుడైనాడు. ఇక్ష్వాకులూ బృహత్ఫాలాయనులూ కాంచీనగర పల్లవరాజులవల్ల పరాజితులైనారు. ఆంధ్ర ఇక్ష్వాక సామ్రాజ్యం కథామాత్ర శేషమైంది.

సంస్కృతభాష - వాఙ్మయము

ఉపనిషత్పూర్వ కాలానంతరం యావద్భారత దేశములో వాఙ్మయసృష్టి బహుముఖాల విస్తరిల్లింది. దక్షిణాపథంలో ద్రావిడ వాఙ్మయసృష్టి జరిగింది. ప్రాంతీయ ప్రాకృత భాషల్లో విశిష్టమైన సాహిత్యం ఉద్భవించింది. మొత్తంమీద భారతదేశంలో మతవిషయక, దార్శనిక, సాహిత్యరచన బహుళమైంది. బౌద్ధ జైన మతానుయాయులు మతదార్శనిక సృష్టి చేసికొన్నారు. బ్రాహ్మణ మతధర్మ ప్రతిపాదకాలైన రామాయణ మహాభారతములూ, ధర్మశాస్త్రములూ, పురాణములూ, తంత్రములూ, మహాకావ్యములూ, నాటకములూ వాఙ్మయశ్రేణిలోనివి. వ్యాకరణం, ధర్మశాస్త్రం, రాజనీతి, వైద్యశాస్త్రగ్రంథాలు విరివిగా ప్రవాయబడినవి.

వాఙ్మయము-మహాభారతము మహాభారతము భారతీయ విజ్ఞాన కోశము. ఇది పంచమవేదమని ప్రఖ్యాతి పొందినది.

మనకు లభ్యమవుతున్న మహాభారతములో గ్రంథ బాహుళ్యమున్నది. అసలు కథకు బ్రాహ్మణ ధర్మ ప్రతిపాదకాలైన గాథలు, మతతత్త్వాలు, పురాణములవలె విశ్వసృష్టి, మన్వంతర చరిత్రలూ, శైవ వైష్ణవ మతోపాఖ్యానములూ, నీతికథలూ అమితంగా చేర్చగా మహాభారతగ్రంథం పెరిగింది. 'జయ' మనే మూలగ్రంథము 8800 శ్లోకాలు కలవి. మహాభారతము 24000 శ్లోకాలతో వున్నది.

వ్యాసుడు మొదట తనశిష్యుడైన వైశంపాయనునకి భారతం విపించినాడు. జనమేజయునికి సర్పయాగ సమయములో వైశంపాయనుడు వినిపించినాడు. అప్పుడు సూత ఉగ్రశ్రవుడు విన్నాడు. శౌనకుని యాగానికివచ్చిన ఋషులు ప్రార్థించగా సూతుడు నైమిశారణ్యంలో శౌనకాదిమునులకు భారతం శ్రవణం చేయించినాడు. ఇలా ఆనాడు మూడుసార్లు భారతశ్రవణం జరగగా గ్రంథము విస్తారమై ప్రస్తుతం మహాభారతము లభ్యమవుతున్నది.

మహాభారతరచన ఒకవ్యక్తి చేయలేదు. భిన్నభిన్న కాలాల్లో చాలామంది రచనచేసి మూలగ్రంథం పెంచినారు. గ్రంథం సంతరించినవాడు వ్యాసుడైనాడు.

మూలభారతకథ యావన్మందికీ తెలిసిఉంటుంది. కనుక గ్రంథము ఎలా పెరిగిందో స్థూలంగా గమనించుదాము. మూలకథతో సన్నిహితసంబంధములేని రాజుల చరిత్రలు, గాథలు మహాభారతంలో చేరినవి. శకుంతలోపాఖ్యానం

నలోపాఖ్యానం అటువంటివి. జనమేజయ సర్పయాగ సంబంధ గాథలెన్నో బ్రాహ్మణ కర్మపరతంత్రులు భారతంలో కూర్చినారు. చ్యవనునికథ శతపథ, జైమినీయ బ్రాహ్మణాల్లోది బ్రాహ్మణాధిక్యతకోసం మూలకథతో చేర్చబడింది. ఉపాఖ్యానాల్లో సావిత్రికథ గొప్పది.

ముఖ్యంగా భగవద్గీత భాగవతత్త్వ ప్రతిపాదనకై భారతములో క్రీ. పూ. రెండవశతాబ్దంలో చేర్చబడింది. హరివంశము మహాభారతంలో ఖిలభాగము. అది వైష్ణవ తత్త్వస్థాపనకు ఉద్దేశింపబడింది. భారతంవలె హరివంశం కూడా చాలామార్పులు చేర్పులుపొందింది.

ఔత్తరాహ దాక్షిణాత్య భారతప్రతుల్లో దక్షిణాత్య ప్రతి గొప్పది. సుక్తంకర్ పండితుడు ఆదిపర్వమునుగూర్చి చెప్పిన వాక్యాలు మహాభారతం అంతకూ *వర్తిస్తున్నవి. భండార్కరు పరిశోధన మండలివారి మహాభారతప్రతి విమర్శనాత్మకమై పాఠభేదాలతో ముద్రితమైంది.

మహాభారతయుద్ధము క్రీ. పూ. 1400—1000. జరిగి వుంటుందని చాలామంది పండితులు అంగీకరించారు. మూల భారతగ్రంథము బ్రాహ్మణాల కాలంనాటిది. వేదములు మహాభారతప్రస్తి తీసుకురాలేదు కనుక మహాభారతము అతిప్రాచీనమనడానికి వీలుండదు.

---

* వివరాలకు వి. యస్. సుక్తంకర పండితుని స్మారకసంచిక వాల్యం 1 4 8 వ పుట చూడు.

రామాయణము రామాయణము ఆదికావ్యము. వాల్మీకి ఆదికవి. సంస్కృత మహాకావ్య లక్షణాలన్నీ రామాయణానికి సరిపోతాయి. మహాకావ్యాలకు రామాయణము ఒరవడి దిద్దినది. అందులో ప్రకృతివర్ణనలు, భావోద్వేగము పాత్రచిత్రణమూ సహృదయులకు ఆమోదము కలిగిస్తాయి. భారతీయాదర్శాలు రామాయణంలో గోచరిస్తున్నవి. ఇది జాతీయ మహాకావ్యం. రామాయణగాథలను భారతీయ కవులు కవితావస్తువులుగా స్వీకరించి కావ్యాలు ప్రాంతీయభాషల్లో రచించినారు.

రామాయణములో 24000 శ్లోకాలున్నవి. మహా భారతంవలె రామాయణము యథాతథంగా మనకు లభ్యము కాదు. గ్రంథం విస్తారమైంది. ప్రథమ సప్తమకాండములు ఆనంతర కాలికములు. ద్వితీయ షష్ఠమకాండల్లో శ్రీరాముడు విష్ణ్వవతారంగా గోచరిస్తాడు. పురుషోత్తముడు మానవ వీరుడుగా తెక్కినకాండల్లో కనబడతాడు. అనుబంధభాగాలు అన్యకవికృతాలు.

రామాయణాన్ని చరిత్రగానే భావనచేయక మహా కావ్యంగా భారతజాతీయ కావ్యంగా దర్శించాలి. పురుషులకు ఆదర్శమూర్తి శ్రీరాముడయితే స్త్రీజాతికి సీతాదేవి లక్ష్య ప్రాయము.

ధర్మశాస్త్రములు గడచిన రెండువేలయేళ్ళనుంచీ ధర్మశాస్త్రము లనబడే స్మృతులు భారతీయ జీవితపథాన్ని తీర్చిదిద్దినవి.

ధర్మానికి మూలము వేదము. అయితే దైనందిన జీవిత వ్యవహారాన్ని తీర్చిదిద్దేవి స్మృతులు. అందరికీ శిష్టాచారం లక్ష్యప్రాయం. ఆ శిష్టాచారమే స్మృతిగ్రంథాలలో నిబద్ధమైనది.

సూత్రాలవలె గద్యంలో కాక శ్లోకరూపములో స్మృతులున్నవి. స్మృతుల్లో అతిప్రాచీనము మనుస్మృతి దీనిని మానవ ధర్మశాస్త్రమని అంటారు. ఆసేతుహిమాచలం ఈ స్మృతిగ్రంథం శిష్టులకు ప్రమాణభూతమై గౌరవస్థాయిని అందుకొన్నది. వి వి. కాణే మహోదయుల అభిప్రాయాన్ని బట్టి క్రీ. పూ. 200 క్రీ. శ. 200 లో మనుసంహిత రచింప బడింది. ఈ స్మృతిలో వర్ణాశ్రమవ్యవస్థ, రాజధర్మం, రాజోద్యోగధర్మం, భార్యాభర్తల కర్తవ్యాలు, సివిలు క్రిమినలు చట్టము, వర్ణవ్యవస్థ, తపోనియమాలు, జీవిత తత్త్వాలు అనే విషయాలున్నవి. మేధాతిథి, కుల్లూకభట్టుల వ్యాఖ్యలు ప్రసిద్ధాలు.

సంస్కృతరూపకము సంస్కృత రూపకోత్పత్తి ఋగ్వేదములో సంవాదసూక్తాల్లో గోచరిస్తుంది. వైదిక మహోత్సవ విధానములో నాట్యము, ఉక్తిప్రత్యుక్తితో సంభాషణమూ ఉండడంవల్ల రూపకావిర్భావం కనబడుతున్నది. సౌష్ఠవమైన రూపకం క్రీ. పూ. 2 వ శతాబ్దిలో పతంజలినాటికి ఏర్పడింది. 'కంసవధ' ప్రదర్శననుగురించి పాతంజల మహాభాష్యములో ప్రస్తుతిఉన్నది. భరతుని నాట్యశాస్త్రము కావ్యనాటక

సాహిత్య లక్షణాలు వివరించే శాస్త్రగ్రంథము. భరతుని కాలనిర్ణయం సరిగా చెప్పలేము. రూపకభేదాలు లక్షణాలని గురించి ధనంజయుడు సాకల్యంగా 'దశరూపకము' లో నివరించినాడు.

అశ్వఘోషుడు అశ్వఘోషుడు కనిష్కుని ఆస్థానకవీశ్వరుడు. బౌద్ధుడు, దార్శనికుడు, నాటకకర్త. మధ్యాసియాలో తుర్కిస్థానంలో అతని బౌద్ధనాటకాలు లభ్యమైనవి. అశ్వఘోషుని శారీపుత్ర ప్రకరణము మొమ్మిది అంకములుగల రూపకము. రూపకనిర్మాణంలో నాట్యశాస్త్ర లక్షణాలను పాటించినాడు. ఇందులో ఇతివృత్తము మౌద్గల్యాయన శారీపుత్రుల బౌద్ధధర్మస్వీకారం. రూపకములో దార్శనికత గోచరిస్తుంది.

భాసుడు కాళిదాసుని మాళవికాగ్నిమిత్ర నాటికా ప్రస్తావనలో భాససౌమిల్లక కవిపుత్రులనేవారు నాటకకర్తలనీ, కాళిదాసు కన్న ప్రతిభావంతులనీ, వారినాటకాలు విడిచిపెట్టి నవ్యుడైన కాళిదాసుని నాటకం ప్రయోగించడమా అన్న ప్రశ్న నస్తుంది. అంబుచేత భాసుడు ప్రసిద్ధ నాటకకర్త అనేది సర్వావారవిషయం. ఆయన నాటకాలన్నీ ఒకరే వ్రాసినట్లు రచనవల్ల స్పష్టం. చారుదత్త నాటకాన్ని మినహాయిస్తే మొత్తం పదమూడున్నవి. ఇటీవల 'యజ్ఞఫల' మనే నాటకము భాసునిదనిఅన్నారు. నాటకంలో సౌష్ఠవమూ, రుచీ మృగ్యంకావడంచేత అలాంటిపుస్తకము భాసుడు

వాయలేము ! నాటకాలన్నింటిలో స్వప్నవాసవదత్తమూ, ప్రతిమానాటకమో రసపోషణలో పాత్రపోషణలో శిల్పములో విశ్వజనీనమైనవి. భాసుదభాష లలితసుందరము.

శూద్రకుడు 'మృచ్ఛకటిక' అనే ప్రసిద్ధ ప్రకరణము రచించినాడు శూద్రకుడు. రచననుబట్టి చూచినప్పుడు దండి కవి కృతము కావచ్చును. మహారాజ శూద్రకుడు చరిత్రలోలేడు ! మృచ్ఛకటికలో చారుదత్త వసంతసేనల ప్రణయముతోపాటు తత్కాలీన సాంఘిక రాజకీయ మతజీవితం గ్రహించగలం. నాటకములో సన్నివేశములు ఒకదానినొకటి తరుముకొనిరాగా నాటకగమనం అధికంగా ఉంటుంది. అన్ని విధాలా మృచ్ఛకటిక సంస్కృత సారస్వతంలో గొప్పది. మానవతామాధుర్యం ఇందులో పరాకాష్ఠకు వెళ్ళింది !

సంస్కృత కావ్యములు సంస్కృత కావ్యారంభమునకు ప్రాకృత కవిత్వమనే సిద్ధాంతము అసంగతము. ఋగ్వేదీయ దాన స్తుతుల్లో ఉషస్సూక్తాలల్లో కావ్యత్వంఉంది. వాల్మీకి రామాయణమునుండి సంస్కృతకావ్య పరిణామం సంభవించింది. ఆదిసంస్కృత శాసనాలవల్ల రామాయణమువలె సహజసుందరకావ్యానికీ అలంకార భూయిష్ఠమయిన కావ్యానికీగల అంతరం గ్రహించవచ్చును.

అశ్వఘోషుని సౌందరనందము, బుద్ధచరిత్రలు మహాకావ్యాలు. బౌద్ధధర్మ ప్రబోధం క్వాచిత్కంగాఉన్నా కావ్యత్వం పుష్కలం. వాల్మీకి రామాయణానికీ బుద్ధచరితకూ చాలాపోలికలున్నవి.

అశ్వఘోషుడు నాటకరచయిత, మహాకవేకాక మహా దార్శనికుడు. 'మహాయాన శ్రద్ధోత్పాదము' లో మహా యాన సిద్ధాంతము వివరించినాడు. 'వజ్రసూచిక' అనే ఆయనగ్రంథం వర్ణవ్యవస్థను గూర్చినచర్చ. 'సూత్రాలం కార' మనే గ్రంథము అశ్వఘోషునిదికాదు.

ఆర్యశూరుని 'జాతకమాల' గద్యపద్యమయము. భాష సరళము. ఈ గ్రంథమును పంచమ శతాబ్దిలో చీనా భాషలో అనువదింపబడింది.

నాగార్జునాచార్యులవారు (క్రీ. శ. 2) మహాయాన సిద్ధాంత ప్రవర్తకులు, సూత్రకారులు. 'సుహృల్లేఖ' అనే లేఖారూపంలో బౌద్ధదర్శనసారం ఉల్లేఖించినాడు.

ఆర్యదేవుని 'చతుశ్శతికా' (క్రీ. శ. 7) అనేగ్రంథము బ్రాహ్మణధర్మమును విమర్శించింది.

అసంగుని 'మహాయాన సూత్రాలంకారము' సంస్కృత ములోగల బౌద్ధదర్శన గ్రంథాలలో ఘనమైనది. భాషపై అసంగుని అధికారం అపరిమితం.

అవదాన వాఙ్మయము పాళీభాషలో అవదానమని వ్యవహరిస్తారు. అపదానమని సంస్కృతములో అంటారు. క్రీ. శ. 2వ శతాబ్దినాటి అవదానశతకము అతిప్రాచీనము. క్రీ. శ. 3 లో చీనాభాషలో అనువదింపబడింది. అవదానములో ఎన్నో గాథలుంటవి. సధర్మోపదేశం గ్రంథప్రయోజనం. దివ్యావదానములో గద్య సరళంగా ఉంటుంది.

శాస్త్రములు - వ్యాకరణము బ్రాహ్మణాల రచనాకాలంలో యాస్కాచార్యులు నిరుక్తము రచించినారు. వైదికశబ్ద వ్యుత్పత్తులీ గ్రంథములో సాధింపబడినవి. నిరుక్తము వేదాంగములో చేరినది. ఇదే శబ్దశాస్త్ర ప్రథమయత్నము. క్రీ. పూ. 5 లో పాణిన్యాచార్యులు తత్కాలీన వ్యావహారిక భాషకు ఎనిమిది అధ్యాయాలలో వ్యాకరణం రచించినారు. ఇందులో 4000 సూత్రాలున్నవి. పాణిని పశ్చిమోత్తర ప్రాంతంలో శాలాతుర గ్రామవాసి. కాత్యాయనుడు తనవార్తికాలలో వ్యావహారిక భాషలో మార్పులను వ్రాసినాడు. పాణినిసూత్రాలపై వ్యాఖ్యానము రచించినాడు. క్రీ. పూ. 2 లో పతంజలి పాణిని సూత్రాలపై వ్యాఖ్యచేస్తూ కొన్నిసూత్రములలో లోపములు దిద్దినాడు. కొన్నిసందర్భాలలో పాణినికి వ్యతిరేకముగా కాత్యాయనుని అభిమతమును సమర్థించినాడు. పతంజలికృత మహాభాష్యమువల్ల వ్యావహారిక భాషాస్వరూపము కొంతవరకూ తెలుస్తున్నది. తత్కాలీన సాంఘిక రాజకీయ వైజ్ఞానిక విషయాలు ఎన్నో తెలుస్తున్నవి.

భరతనాట్యశాస్త్రము ఇందులో 36 అధ్యాయాలున్నవి. భరతముని వ్రాసినాడు. దీని కాలనిర్ణయము చేయడము కష్టము. నాట్యరూపక కవిత్వ లక్షణాలను విశదముచేసే శాస్త్ర గ్రంథము.

పింగళుని ఛందశ్శాస్త్రము ప్రసిద్ధము. జయదేవుడను వాడు ఛందో గ్రంథరచన చేసినాడు.

రాజనీతి - కౌటిల్యుని అర్థశాస్త్రము అర్థశాస్త్రానికి దండనీతి, నీతి శాస్త్రానికి రాజనీతి అనే ప్రత్యేక పదాలున్నవి. విష్ణుగుప్తుడనే కౌటిల్యుడు అర్థశాస్త్రమును రచించినాడు. విష్ణుగుప్తునికే చాణిక్యుడని పేరున్నది. చాణక్యుడు మౌర్యచంద్రగుప్తుని మహామంత్రి. అందుచేత క్రీ. పూ. 4 వ శతాబ్దానికి సంబంధించిన గ్రంథమిది. కాలనిర్ణయములో చాలా భిన్నాభిప్రాయాలున్నవి. మెగాస్తనీసు 'ఇండికా' లో వ్రాసిన దానికీ కౌటిల్యుని అర్థశాస్త్రములో ఉల్లేఖింపబడిన సివిలు **Constitutional** చట్టములకు పోలికలున్నవి. మను యాజ్ఞవల్క్య స్మృతులలోని సాంఘిక చిత్రణము కౌటిల్యుని తరువాత కాలానికి సంబంధించినది.

అర్థశాస్త్రములో ఎక్కడా చంద్రగుప్తనామముకానీ పాటలీపుత్ర ప్రస్తికానీలేదు. అర్థశాస్త్రములో ఉల్లేఖింపబడిన పరిపాలనా సూత్రములు చంద్రగుప్త మహాసామ్రాజ్యమునకు వర్తించవు. అవి రాష్ట్రపరిపాలనకు సరిపోతవి. అర్థశాస్త్రమును రచించినట ఎవరో పండితుడై ఉంటాడు కాని రాజ్యతంత్రజ్ఞుడై ఉండడు. ఈఅభిప్రాయాలన్నిటినీబట్టి క్రీ శ. 3 వ శతాబ్దినాటి గ్రంథమై ఉండవచ్చును.*

అర్థశాస్త్రము 15 అధికరణాల గ్రంథము. సూత్ర రచనాపద్ధతి, భాష్యవిధానము గ్రంథములో కలిసిపోయినవి.

---

* అర్థశాస్త్ర కాలనిర్ణయచర్చ—Age of Imperial unity Vol II Edited by K. M. Munshi 285—287 పుటలు చూడు.

ప్రథమాధికరణంలో యువరాజుకు ఇవ్వవలసిన విద్యాశిక్షణము, మంత్రుల యోగ్యతలు, చారులలో భేదములు, నృపుసైనందిన చర్యలనుగురించిన విషయాలున్నవి. ద్వితీయాధికరణంలో వివిధశాఖల పర్యవేక్షణము, పరిపాలనాశాఖలు, పురపాలనము, పారిశ్రామికసంస్థలు, గణికావృత్తి నియమములు తృతీయాధికరణములో పౌరులకైచట్టము, చతుర్థాధికరణములో క్రిమినలు చట్టములో ప్రమాదజనకమయిన అంతములను తొలగించుట, పంచమ షష్ఠమాధికరణములలో రాష్ట్రశత్రువులను తొలగించే విధానము, రాష్ట్రకోశ పూరణ మార్గములు, ప్రభుత్వోద్యోగుల జీతనులు, రాజుకుండవలసిన సప్తాంగములూ, రాజనీతిలోని పాండ్యగుణ్యమూ అష్టమాధి కరణములో రాజుల వ్యసనములు, రాష్ట్రమునకుగల ప్రమాదములు నవమ దశమాధి కరణములలో సైనిక విన్యాస భేదములు, ఏకాదశములో శ్రేణులు వాణిజ్య సంఘములు, ద్వాదశ త్రయోదశాధి కరణాల్లో యుద్ధనిజయోపాయములు, జయించిన దేశములలో విజేత ప్రజాభీష్టమును పొందేపద్ధతులు వివరింపబడినవి.

<u>వైద్యశాస్త్రము</u> సంప్రదాయరీత్యా చరకుడు కనిష్కుని ఆస్థాన ములోవాడని తెలుస్తున్నది. చరకసంహిత వైద్యశాస్త్రంలో ప్రసిద్ధగ్రంథము. ఈ గ్రంథములో ముఖ్యమైన అష్టవ్యాధులు, పద్యములు, రోగ ప్రతిక్రియాసాధనాలు, **Pathology Anatomy, Embryology** విషయములు. చరకసంహిత

పారశీక అరబ్బీ భాషలలో అనువదింప బడినదంటే, గ్రంథ ప్రాశస్త్యము వెల్లడిఅవుతున్నది.

మధ్యాసియాలో లభ్యమైన **Bower** ప్రాతప్రతినిబట్టి ఆత్రేయ, శూలపాణి, జయాకర్ణ, పరాశరహారీత స్మృతుల వేర్లు తెలుస్తున్నవి. తూర్పుతుర్కిస్థానములో వైద్య శాస్త్ర సంబంధమైన భూర్జపత్రగ్రంథాలు లభించినవి.

రాజనీతి - పరిపాలనము రాజనీతి విషయము మహాభారతములో శాంతిపర్వములో విపులముగా ఉన్నది. రాజధర్మములను గురించి కౌటిల్యుని అర్థశాస్త్రములో, మను యాజ్ఞవల్క్య నారద బృహస్పతి స్మృతులలో విశదముగా విస్తారముగా గ్రహించవచ్చును. పరిపాలనా విధానమునుగురించి యవన గ్రంథములు, అర్థశాస్త్రము, స్మృతులు తోడ్పడ్డాయి.

రాజనీతికి కౌటిల్యుని అర్థశాస్త్రము కామందక నీతి సారము ప్రమాణ గ్రంథములు.

రాజనీతి సిద్ధాంతము పృథివీపతినిమించిన విష్ణువు లేడనేసూక్తి ప్రసిద్ధము. అనగా రాజరికం దైవాంశసంభూతమనేభావం మహాభారతంలో మన్వాది స్మృతుల్లో చూడవచ్చును. *దైవాంశసిద్ధాంతం బ్రాహ్మణాలకాలంలోనూ ఉండేది. †"రాజు ప్రజారక్షణచేయాలి. అందునిమిత్తం పంటలో

---

* మనుస్మృతి VII 3. 4. 8.

† మహాభారతం 1-18-1.

ఆరోపాలు పన్నుగా తీసుకొంటాము." అర్థశాస్త్రం ఇలా అంటున్నది:—"అరాజకంవల్ల ప్రజలు అగచాట్లుపడి రాజును పాలకునిగా ఎన్నుకొన్నారు. అనగా సమాజం తన శ్రేయం కోసం రాజును ఏర్పాటుచేసుకొని, పరిపాలన ఆయన చేస్తున్నందుకుగాను పన్ను చెల్లించడము, **Social Contract** వల్ల రాజరికం ఉద్భవమైంది.

అరాజకం నివారించాలి కనక రాజరికం రాజరికం దైవాంశసంభూత మనీ, ప్రజల సాంఘిక శ్రేయంకోసం రాజును ఏర్పాటుచేసు కొన్నారనే రెండుసిద్ధాంతాలూ అరాజకంవల్లవచ్చే అనర్థ కాలు నివారించడానికే. అరాజకంగానూ విచ్చలవిడిగానూ ప్రవర్తించేప్రకృతి మానవునిలో ఉన్నది. అటువంటి సమ యంలో అరాజకం పొడచూపకుండా సమాజము సుశిక్షితంగా సక్రమంగా ఉండేనిమిత్తం దండం రాజు ప్రయోగించాలి. కౌటిల్యుడు చెప్పినట్లు "దండంమీదనే మానవశ్రేయము, వైజ్ఞానికాభ్యుదయమూ ఆధారపడినవి."

రాజు ధర్మానికి దాసుడు - అధికారం పరిమితం రాజరికం దైవాంశ సంభూతమని అన్నప్పటికీ రాజుకుగల అధికారం పరిమితం. యథేచ్ఛగా అతడు ప్రవర్తించడానికి రాజధర్మమే అంగీక రించదు. ప్రజలను పాలించేది దండము.

దండములేనిదే సమాజము నిలవదు దండములేనిదే సంఘము నిలవ లేదు. అందుచేతనే రాజనీతివేత్తలు దండమునే ధర్మముగా చెప్పినారు. అనగా ధర్మమే పరిపాలించేశక్తి. రాజు ధర్మ

దాసుడేకాని ధర్మాతిక్రమణం చేయకూడదు. ధర్మాన్ని తోసి రాజని యథేచ్ఛగా వ్యవరించేపక్షంలో రాజు రాక్షసుడని కామందకవచనం. కౌటిల్యమతమూ అంతే.

రాజ్యశరీరములో రాజు ఒకఅంగము రాష్ట్రము రాజుకాదు. అందులో ఒకఅంశ అవుతాడు. రాజు, రాష్ట్రం, కోశం, మంత్రి, దుర్గం, సేన, మిత్రము అనే సప్తాంగములున్న శరీరమే రాజ్యమవుతుంది. రాజ్యశరీరంలో రాజు ఒకఅంగము. ప్రత్యంగమూ శరీరసౌష్ఠవానికి తోడ్పడినట్లు, సప్తాంగములూ రాజ్యశ్రేయోదాయకాలు కావాలి.

రాష్ట్రప్రయోజనము : రాష్ట్రప్రయోజనం ప్రజాక్షేమం. రాష్ట్రాన్ని శత్రునిర్ముక్తంచేసి, అన్యాయాన్ని అరాజకాన్ని తలెత్తకుండాచేసి రాజ్యపాలనచేయాలి రాజు. సమాజవికాసానికి రాజు దండమును సవ్యంగా ఉపయోగించాలి. ఏతావతా రాష్ట్రప్రయోజనం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ఆర్థిక సంక్షేమమని మన ప్రాచీన రాజనీతివేత్తలమతం.

ప్రభుత్వాలు గణతంత్రరాజ్యాల్లో ప్రజాస్వామికం ఉండేది. *ముఖ్యంగా గ్రామసభలో ప్రజాతంత్రం ఉండేది. అయితే భారతదేశంలో రాజరికం సర్వసామాన్యంగా ఉండేది. రోమన్ సామ్రాజ్యంలో రాజరికంవంటిది మనదికాదు.

---

* లిచ్ఛవీ ప్రజాస్వామికాన్ని గూర్చిన విశేషాలు—Age of Imperial unity Voll 131—134 పుటలు చూడు.

హిందూరాజ్యంలో కేంద్రీకరణంకన్న వికేంద్రీకరణమే పరిపాలనా విధానం.

మంత్రిపరిషత్తు రాజుకు పరిపాలనలో సలహాయిప్పడానికి మంత్రి పరిషత్తు మౌర్యులకాలంలో ఉండేది. మాళవికాగ్నిమిత్రములో అగ్నిమిత్ర చక్రవర్తి పరిషత్తు సలహా తీసికొన్నట్లు స్పష్టంగా కనబడుతున్నది. అత్యవసరపరిస్థితుల్లో కౌటిల్యుడు చెప్పినట్లు రాజు మంత్రి పరిషత్తునుపిలిచి, వాదోపవాదాలు చేసి, అధికసంఖ్యాకుల అభిమతం పాటించేవాడు. అయితే రాజు పౌరపాటుగా నిర్ణయంచేసినప్పుడు సరిదిద్దే అధికారం మంత్రిమండలికి ఉన్నది. సామాన్యంగా మంత్రులు ఏడెనిమిది మంది ఉంటారు. రాజు ఒక్కొక్కరి సలహాతీసుకొని తరువాత అందరిసలహా వెరశితీసుకోడంజరుగుతున్నది. కౌటిల్యుని అర్థశాస్త్రం వల్ల సౌష్ఠవ రాజ్యాంగ నిర్మాణం రాజ్యవ్యవహారంలో గోచరిస్తున్నది.

మతము - తత్త్వము

బౌద్ధధర్మం - బౌద్ధసాహిత్యం బౌద్ధధర్మోపదేశసారం పాళీభాషలో 'సుత్తపిటకము' అనగా ఆగ్రంథములోని దీఘ, మజ్ఝిమ, సంయుత్త, అంగుత్తర, ఖుద్దక నికాయములవల్ల తెలుసుకోవచ్చును.

ఆర్యసత్యాలు సామాన్యమానవులు వ్యావహారికమైన సరళమార్గములో సత్యదర్శనం చేయడం ముఖ్యం. అవ్యక్తమైన పరతత్త్వచింత, చర్చ అనవసరమని బుద్ధుడు చెప్పినాడు.

ఆర్యసత్యాలు అనగా ప్రపంచం దుఃఖభూష్ఠమనీ, 2. తృష్ణ వల్ల ప్రాపంచిక సముదయమనీ, 3. ఈ ప్రాపంచిత సముదయ నిరోధానికి తృష్ణావినాశం కావాలనీ, 4. తృష్ణాక్షయానికి ఒక మార్గంఉన్నదనీ ప్రతివాదూ గ్రహించాలి. ఈ మార్గాన్ని అష్టాంగమార్గం అంటారు.

అష్టాంగమార్గం 1. సమ్యక్ వాక్కు, 2. శమ్యక్కర్మ, 3. సమ్యక్ జీవనము, 4. సమ్యక్ వ్యాయామము, 5. సమ్యక్స్మృతి, 6. సమ్యక్సమాధి, 7. సమ్యక్సంకల్పము, 8. సమ్యక్దృష్టి. వీటిని అనుష్ఠానం చేయడంవల్ల శీలమేర్పడుతుంది. చిత్త వృత్తి సాధకుని వశంలోకి వస్తుంది. ప్రజ్ఞ ఏర్పడుతుంది.

ప్రతీత్యాసముత్పాదనం దృశ్యమానమైన భౌతిక జగత్తుకు అసలైన ఉసికిలేదు. హేతుప్రత్యయంవల్ల ఒకవిషయం ఉన్నట్టు కన బడుతుంది సముద్రతరంగాలవలె. నిజానికి సముద్రానికీ తరం గానికీ భేదంలేదు. అయితే సామాన్య మానవదృష్టికి భేదం కనబడుతుంది. *ప్రతీత్యాసముత్పాదనంవల్ల నానాజీవు లున్నట్లు తోస్తారు.

నిర్వాణము బౌద్ధుల నిర్వాణము సమాధివంటిది. తృష్ణ అత్యంత క్షయమైనప్పుడు తత్ఫలితమే నిర్వాణము. అనగా సనాతన మతంలోని అమనస్కయోగముతో సమము. తృష్ణలేనప్పుడు సర్వప్రపంచోశమము తప్పదు. జీవుడు, నిర్వాణము అనే

---

* Dependent Origination అని పారిభాషికపదం ఆంగ్లంలో.

విషయాలనుగురించి బుద్ధుడు విస్తారంగా చర్చచేయలేదు. అది సామాన్యులకు అనవసరమనే ఆయనమతం. నైతికజీవితం ముఖ్యముకాని తాత్త్వికచర్చ నిష్ప్రయోజనమని ఆయన నమ్మకము.

ధర్మచక్ర ప్రవర్తన ఆర్యఅష్టాంగమార్గాన్ని విపులంగా ధర్మ చక్ర ప్రవర్తన సూత్రంలో అనగా బుద్ధుడు ప్రథమ ధర్మోపదేశంలో తెలియజేసినాడు. దానినే మధ్యమమార్గమని అంటాడు. మధ్యమమార్గమని అనడానికి కారణము భౌతిక సుఖలాలసకూ, తీవ్రనిష్టామయ జీవితానికీ మధ్యేమార్గం. బౌద్ధభిక్షువు తగుమాత్రంగా సుఖంగావుంటూ, సముచితాహారం, సముచిత నివాసం అవలంబించి మనసు జీవితలక్ష్యం వదలకుండా ఉండడం అవసరం.

ధర్మసారం బుద్ధుని ద్వితీయ ధర్మప్రసంగంలో బౌద్ధధర్మసారం ఉన్నది. సుఖదుఃఖాతీతుడు విముక్తుడు. వాడర్హుడు. ప్రతి వ్యక్తీ అర్హుడు కావచ్చును.

ప్రపంచము దుఃఖమయం. ఈ దుఃఖం పోగొట్టుకోడానికి సమ్యక్‌వర్తన సమ్యక్‌చింతనముఖ్యం. *కర్మపరిత్యాగం వల్ల శ్రేయస్సు కలుగుతుందని అంటాడు బుద్ధుడు.

యానములు బ్రాహ్మణమతంతో బౌద్ధము రాజీపడి, తనఉనికి కోసం ఆదిబౌద్ధం విడిచిపెట్టి, మహాయానం అనేపేర వ్యవ

---

* వివరములకు—Rhys Davids—What is Original Buddism ? 1938 వ ప్రతిచూడు.

హారంలో ఉండేది. ఆదిబౌద్ధాన్ని హీనయానం, ఆనంతర బౌద్ధాన్ని మహాయానమనీ అంటారు. హీనయానంలో వ్యక్తి తాను నిర్వాణం పొందడమే లక్ష్యం. మహాయానంలో యావన్మంది నిర్వాణసుఖమూ జీవునిలక్ష్యం. మహాయాన లక్ష్యంకన్న హీనయానలక్ష్యం అల్పముకనుక హీనయానమని పేరువచ్చింది. ప్రాకృతభాషలమూలంగా హీనయానధర్మం ప్రజలభాషల్లో ప్రచలితమైంది. మహాయాన ధర్మమునకు సంస్కృతభాషలో ప్రచారం జరిగింది.

ఆదిబౌద్ధులు ఆత్మయొక్క అస్తిత్వం అంగీకరించక ఉపనిషత్ప్రతిపాదితమైన కర్మసిద్ధాంతం అంగీకరించింది. ప్రపంచము దుఃఖమయమనీ, తన్నాశనంకోసం సాధనచేయాలనీ, పునరావృత్తి రహితస్థితిని పొందవలెననే తత్త్వచింత బౌద్ధులు సనాతన బ్రాహ్మణ మతానుయాయులనుంచి గ్రహించినదే.

సంఘము ఆరంభదశలో బుద్ధునిశిష్యులు స్థిరనివాసం కల్పించుకోకుండా కొండల్లో కోనల్లోఉంటూ తిరిపెమెత్తుకొని జీవించే వారు. వారిని భిక్షువులని పిలిచేవారు ప్రజలు. బుద్ధుడు తన శిష్యకోటిని విహారాలలో ఉండడానికి, వినయపిటకంలోని విధులను నిర్వర్తించడానికి ఏర్పాటుచేసినాడు. బౌద్ధులు అనుష్ఠించవలసిన విధులు వినయపిటకంలో వివరింపబడినవి.*

* వివరములకు—Age of Imperial unity Vol II 374—377 పుటలు చూడు.

బౌద్ధమత చరిత్ర

ప్రథమ పరిషత్తు బుద్ధుని నిర్వాణానంతరం అజాతశత్రుని ఆధిపత్యంకింద ప్రథమ పరిషత్తు జరిగింది. మహాకాశ్యపుడనే బౌద్ధ స్థవిరులసభను ఏర్పాటు చేసినాడు. ధర్మానికీ వినయానికీ సంబంధించిన బుద్ధోపదేశాలను క్రోడీకరించడానికి ఆ సభ సమాయత్తమైంది. మహాకాశ్యపుడు సభాధ్యక్షుడుకాగా 'ఉపాలి' వినయసంపద పఠించినాడు. అప్పటినుంచి వినయసూత్ర పిటకాలు కంఠస్థముచేసే ఆచారం ఏర్పడింది. బౌద్ధధర్మము, తత్వమూ విహారనిర్మాణమూ ప్రథమ పరిషత్తుకుపూర్వం బుద్ధుడు సజీవుడై ఉండగా ఎంత వరకు వృద్ధిపొందిందో నిర్ణయించడము సులభముకాదు. పాళీపిటకములోని అంశాలు ఒకతావునచేరిస్తే ఈ విషయం నిర్ణయించవచ్చును. బహుశ ప్రథమ పరిషత్తులో ఈ పని జరిగిఉంటుంది.

రెండవదశ బుద్ధనిర్వాణానంతరం ఒకశతాబ్దము గడిచిన తరువాత వైశాలిలో కాలాశోకుని అధ్వర్యాన ద్వితీయ బౌద్ధ పరిషత్తు జరిగింది. బౌద్ధభిక్షువులలో ప్రాగ్దేశీయులకు పశ్చిమ దేశీయులకూ వినయ ధర్మానుష్ఠాన సందర్భంలో వివాదం వచ్చింది. పెద్దలైన స్థవిరులు చేసిన నిర్ణయాన్ని తోసిరాజని ప్రాగ్దేశీయులైన వజ్జిపుత్రకులు సభానిష్క్రమణంచేసి ప్రత్యేకంగా మహాసంగీతి జరిపినారు.

ప్రాగ్శైలీయులు మహాసాంఘికులు. తేరవాదులు ఆచార్యవాదులు. ఆచార్యవాదులలో 11 చీలికలు, మహాసాంఘికులలో 7 చీలికలూ మొత్తము *18 శాఖలూ హీనయానంలో చేరినవి. మహాసాంఘికులలో ప్రసిద్ధులు పూర్వశైలీయులు, అపరశైలీయులు, ఉత్తరశైలీయులు చైత్యకులు.•

మహాయానోత్పత్తి లక్షణాలు విజ్ఞానవాదం లేదా యోగాచార వాదంలో పొడసూపినవి.

మూడవదశ బుద్ధనిర్వాణానంతరం బౌద్ధధర్మప్రచారం ఒకే విహారము ఒకేసంస్థమూలంగా జరగక, స్వతంత్రంగా చాలా సంస్థలు బయలుదేరి పలుతావుల్లో ధర్మవ్యాప్తి చేసినవి.

స్థవిరవాదం అనుసరించనివారిని సంఘమునుంచి అశోకుడు పంపివేసినాడు. స్థవిరులు మొగ్గలిపుత్త (మౌద్గల్యపుత్రుడు), తిస్స (తిష్యుడు) అనేవారి అధ్వర్యాన సమావేశమై స్థవిరేతరవాదులను చెండాడినాడు. ఈ పరిషత్తు నిజంగా జరిగిందో లేదో చెప్పలేము. ఈదశలో అశోకునివల్ల ఖండాంతరాల్లో బౌద్ధం వ్యాప్తమైంది. కొన్నిదేశాల్లో బౌద్ధంనిల్చింది.

నాలుగవదశ అశోకునికిగల సధర్మాభిమానం అతని అనుయాయులకులేదు. పుష్యమిత్రసుంగుడు బౌద్ధధర్మవిరోధిగా బ్రాహ్మణ ధర్మధ్వజం లేవనెత్తినాడు. స్తూపాలవల్ల మధుర,

---

* శాఖల వివరాలు-Age of Imperial unity Vol II 380-381-383 పుటలు చూడు.

• ఈ పేర్లు అమరావతి శాసనాలలోవి.

సాంచి బార్హాతు, గయలు సద్ధర్మకేంద్రాలని తెలుసుకో వచ్చును. కనిష్కుని అధ్వర్యాన చతుర్థపరిషత్తు పురుష పురంలో జరిగింది. అయితే పాళీ సాంప్రదాయంలో ఆ పరిష త్సమ్మేళనమే కనపడదు. అది సర్వాస్తివాదులు ప్రత్యేకంగా జరుపుకొన్న పరిషత్తు.

మహాయానము లక్షణాలు 1. ధర్మశూన్యత (**Non reality of Phenomenal objects**), 2. పుద్గలశూన్యత (**Absence of soul**), 3. అనేకబుద్ధులు బోధిసత్త్వులు, 4. బహుదేవతారాధన-భక్తి, 5. మంత్రతంత్రాలు.

ఆంధ్రబ్రాహ్మణుడైన నాగార్జునుడు మహాపండితుడు. ఆయన మహాయాన స్థాపకుడు; నలందాలో సంఘాధ్యక్షుడు. పురుషపురము, నాగార్జునకొండ, అమరావతి, మహాయాన కేంద్రాలు. పశ్చిమక్షత్రపులు, శాతవాహనులు, ఇక్ష్వాకులు బౌద్ధపోషకులు. నాగార్జునకొండలో మహాచైత్యము మహాయాన మతానుసారులకు పుణ్యక్షేత్రము. ప్రపంచంలో బౌద్ధులెక్కడఉన్నా నాగార్జునకొండకు బుద్ధభక్తి ప్రేరేపితులై వచ్చేవారు. కొందరు బౌద్ధదర్శనాలు అధ్యయనంచేసి కూలంకషవైదుష్యం సంపాదించేవారు.

క్రీ. శ. 210 నుంచి మూడుశతాబ్దాలపాటు బౌద్ధం ఆసియాఅంతటా వ్యాపించింది.

పాళీసాంప్రదాయం - వాఙ్మయము బౌద్ధుల పవిత్ర వాఙ్మయంపాళీ, మాగధీ, అన్యప్రాంతీయ ప్రాకృతాల్లోఉన్నది. పాళీభాషలో

బౌద్ధవాఙ్మయము సంపూర్ణముగా లభ్యమవుతున్నది. పాళీ సాంప్రదాయంలో బౌద్ధుల మతసాహిత్యాన్ని *త్రిపిటకము లని అంటారు. అవి వినయ, సుత్త, అభిదమ్మ పిటకములు. వినయపిటకంలో బౌద్ధుల నిత్యజీవితానికి సంబంధించిన విధి నిషేధములూ, కర్తవ్య కర్తవాలూ విపులీకరింపబడినవి. వినయపిటకంలో పాతిమోఖ, సుత్తవిభంగ, ఖండక, పరి వారములనే భాగాలున్నవి. సుత్తపిటకములో దీఘ, మజ్ఝిమ, సంయుత్త, అంగుత్తర, ఖుద్దకములనే పంచనికాయములున్నవి. సుత్తపిటకంలో బుద్ధుడు శిష్యులతో చేసిన ప్రసంగాలూ సంభా షణలూఉన్నవి. సంభాషణ గద్యపద్యమయం. ఖుద్దక (క్షుద్రక) నికాయంలో దమ్మపదం (ధర్మపథం) బౌద్ధులకు 'గీత' వంటి గ్రంథము ప్రసిద్ధము. ఖుద్దకనికాయంలో ఖుద్దకపాఠం దమ్మ పదం, ఉదాన ఇతివుత్తక, సుత్తనిపాత (సూత్రనిపాతము), విమానవత్తు, పేతవత్తు, తేరీగాథ (స్థవిరీగాథ), తేరగాథ (స్థవిరగాథ), జాతకము, నిద్దేశ, పాతిసంభిదామగ్గ, అపదాన (అవదానము), బుద్ధవంశ, చరియ పిటకాలున్నవి.

ఖుద్దకనికాయం మంత్రములవంటి స్తోత్రకదంబము బౌద్ధుల నిత్యపారాయణగ్రంథం. ఉదానంలో బుద్ధుని ఉద్దీపిత ప్రవచనాలున్నవి. అటువంటిదే ఇతివుత్తకం. సుత్తనిపాతలో

---

* తెలుగుభాషలో మొదటిసారిగా స్వామి శివశంకరులు, నేనూకలిసి జాతక వాఙ్మయం యావత్తూ అనువదించాము, పాళీభాషనుంచి. సుమారు 20 సంపు టాలుగా ప్రకటిస్తున్నాము.

బ్రాహ్మణ ధర్మఖండనఉన్నది. బ్రాహ్మణత్వం జన్మతః రాలేదనీ, రాదనీ, నడవడివల్ల వస్తుందనీ నిరూపితమైంది. విమానవత్తులో సత్కర్మఫలాలుగా దివ్యసుఖాలు దేవతలు ఎలా అనుభవిస్తారో లిఖింపబడినవి. కర్మసిద్ధాంత వివరణ మాత్రం అయోమయంగాఉంది.

థేరీథేరగాథలు బౌద్ధభిక్షుణీ భిక్షుకుల అనుభూతి కవితా మయంగా వ్యక్తమైంది. థేరీగాథల్లో రసాన్విత కవితాధోరణి ప్రత్యక్షం.

*జాతకాలు బౌద్ధవాఙ్మయంలో జాతకథలు ప్రసిద్ధాలు. బుద్ధుని పూర్వజన్మగాథలు జాతకాలు. ప్రతికథలో నాలుగుభాగా లుంటవి :—1. ప్రత్యుత్పన్నవస్తువు అనగా ప్రస్తుతకథ. 2. అతీతవస్తువు (గతకథ). 3. గాథలు (పద్యాలు). 4. వేయ్యా కరణం గాథలపై లఘువ్యాఖ్య. ఏ. బుద్ధుడూ కథలోవ్యక్తి ఒకరేనని తెలియజెప్పడం. జాతకాలు మొత్తము 500. వీటివల్ల బౌద్ధకాలిక సాంఘికార్థిక రాజకీయ వృత్తాంతమూ, సంస్కృతీ తెలుసుకోవచ్చును. నిద్దేశము సుత్తనిపాతలో తుదిరెండువర్గాలమీద వివరణము. పతిసంభిదామార్గ బౌద్ధ ధర్మ వివరణము. అపాదానములో స్వార్థత్యాగంవంటి మహా వీరోచిత కృత్యప్రశంస నీతికథారూపంలో ఉంటుంది. బుద్ధ వంశములో 24 బుద్ధులగాథలు కవితారీతిలో విరచితాలు.

---

* చూడు మా సంపూర్ణానువాదము.

చరియపిటకంలో కొన్ని జాతకాలు కవితారూపములో కమనీయముగా ఉంటవి.

త్రిపిటకంలో అభిదమ్మములో సప్తప్రకరణాలున్నవి. ఇందులో మతధర్మవివరణము, మనస్తత్వ విశ్లేషణమూ ప్రధానములు.

త్రిపిటకాల్లోచేరని 'మిళిందపన్హో' (మిళిందప్రశ్న) ప్రసిద్ధం. యవనరాజైన మిళిందునికీ (మినాండరు), నాగసేన స్థవిరభిక్షువుకూ జరిగిన మతచర్చ మిళిందప్రశ్నలో చూడ వచ్చును. ఈ చర్చ ఎక్కువగా వివాదాంశాలమీదనే ఉంటుంది.

బౌద్ధసాహిత్యాన్ని గురించి విపులంగా వ్రాయడానికి ఇది సాహిత్యచరిత్ర కాదుకనక స్థూలంగా పరామర్శచేశాను.

శిల్పము

<u>ద్రావిడార్యము</u> క్రీ. పూ. 2000 సంవత్సరాలకిందట ద్రావిడులు, యావదార్భరతదేశంలో ఉండేవారు. వారు లింగయోని ప్రతీకములను, యక్షనాగాదులను ప్రాకృతిక దేవతలను భక్తి తాత్పర్యములవల్ల పూజచేసేవారు. ఆర్యులు ద్రావిడులను జయించినారు. జయించినప్పటికీ వారు ద్రావిడ సంస్కారాన్ని స్వీకరించినారు. ప్రకృతిశక్తులకు అస్పష్టమైన సంకేతాలను భావించిన ఆర్యులు ద్రావిడులవల్ల సగుణోపాసన నేర్చినారు. మొత్తముమీద ద్రావిడార్య సమన్వయంవల్ల సగుణోపాసన తత్ఫలితంగా ప్రతిమాశిల్పమూ ఆవిర్భవించినవి.

గృహవాస్తు శిల్పానికికూడా ద్రావిడులే కారకులు. తోడాలు వెదుళ్ళతో గుడిసెలు కట్టుకొనేవారు. వేణు కుటీరమే ఆనంతరకాల వాస్తుశిల్పానికి ప్రాతిపదికగా ఎఱ్ఱులు భావించినారు.

వైదికార్యులు వ్రడంగములో, వాస్తుశిల్పములో, రథ నిర్మాణ చోదనములో, లోహవస్తునిర్మాణములో నిపుణులు. గృహకృత్యాలకు తామ్రవస్తువు లుపయోగించేవారు. బంగారునగలు పెట్టుకొనేవారు. ఆర్యులు విగ్రహనిర్మాణము చేసినట్లు ఆధారాలు కనపడవు. వైదికశిల్పం దారుమయం కావడంచేత కాలగర్భంలో కలిసిపోయి ఉండవచ్చును.

బహుశ తొల్లింటి ఆర్యశిల్పము అలంకారశోభితము, అవ్యక్తమూ సాంకేతికమూ కావచ్చును. భారతీయ శిల్పమని అన్నప్పుడు ద్రావిడార్య సమన్వయము లేకుండా ఉండదు. సాంచీలో బార్హత్‌లో ఆర్యుల సాంకేతికశిల్పము సామ యికమూ, అలంకార సంవలితమూ కావడం ఆరంభించింది. కుషాణశిల్పము భక్త్యుద్రేకభావచిత్రణవల్ల ద్రావిడ మైంది. బుద్ధగయలో ఇంద్ర శాంతిమూర్తి చిత్రణములో ద్రావిడకళా వ్యక్తీకరణపై ఆర్యప్రభావము గోచరిస్తుంది. గుప్తకాలీన బుద్ధమూర్తులు, ఎలిఫెంటాలో మహేశ్వరుడు, పల్లవలింగములు, ఆనంతరకాల నటరాజ విగ్రహాలలో ఆర్య ద్రావిడ శిల్పతత్త్వ సామరస్యము ప్రత్యక్షము.*

---

* ఆనందకుమారస్వామిగారి History of Art in India and Indonesia చూడు.

శైశునాగ నందకాలము - శిల్పము క్రీ. పూ. 642—320. ఆనంతర సంహితలవల్ల లోహాదులకు సంబంధించిన విజ్ఞానము శిల్పుల కున్నట్లు తెలుస్తున్నది. పట్టు, నూలుబట్ట లుపయోగించే వారు. బుక్ సంహితలో అంశస్తులున్న ప్రాసాద ప్రస్తి వస్తుంది. వర్తుల చతురస్ర కుటీరనిర్మాణము, ఇటుకలు, పళ్ళేరాలు, పానచషకాలు, బంగారుచెంచాలు, వెండిఅద్దాలు, శయ్యలు, సింహాసనాలు, నిషణ్ణకాలు, జంత్రవాద్యాలూ, ఉష్ణీషాలు, జవాహిరీ, యానపాత్రలు వాడుకొనేవాగు నాగరకులు. జాతకకథలు 18 రకాల శ్రేణులను చేర్కొన్నవి.

ప్రాక్ మౌర్యకాలిక శిల్పాలు క్రీ. పూ. 400. ప్రాక్ మౌర్యకాలిక శిల్పాలు కొద్దిగా శేషించినవి. రాజగృహ నగర కుడ్యాలు, లౌరియానందన్‌ఘర్‌లో దిగంబర దేవతామూర్తి విలసిత స్వర్ణకణాభరణం, వర్తులాకారసమాధి, తక్షశిలలో గాజు వాడకం, శిలలను స్నిగ్ధముచేసి మెరుపు తీసుకురానడమూ మౌర్యులకు పూర్వమున్న శిల్పతారతమ్యాలు. రాజగృహ నగరకుడ్య నిర్మాణంతో శిలావస్తువు ఆరంభమైంది. శిలా వాస్తు శిల్పనిర్మాణమునకు దారుకర్మ నమూనాగా ఉండేది.

మౌర్యకాలము - శిల్పము క్రీ. పూ. 320—185. అశోకునితోనే భారతీయ శిల్పారంభమని చెప్పనలసి ఉంటుంది. బౌద్ధధర్మ ప్రచారానికి ఆయన శిల్పమును సాధనగా చేసికొన్నాడు. ధర్మమే ప్రయోజనం. శిల్పము తత్ సాధనమైంది. అధికారం గల వ్యక్తి ప్రోదల్బలంవల్ల ప్రభవించిన శిల్పముకావడంచేత

ఆనంతరకాలంలో మౌర్యశిల్ప ప్రభావం అంతగా శేషించ లేదు. ఆసియాఖండానికి బౌద్ధం తనధర్మాన్ని, సాంకేతికాన్ని, శిల్పాన్నీ శాసించింది.

అశోకకాలీన శిల్పఖండాలు

1. గిరిపార్శ్వములమీద చెక్కబడిన ధర్మలిపులు.
2. సుమారు 80,000 స్తూపాలు.
3. ఏకశిలా స్తంభాలు.
4. బౌద్ధస్తూపాలకు ఏకశిలామయ అనుబంధాలు.
5. పాటలీపుత్రములోని ప్రాసాదశేషము.
6. గుహావాసములు.

వాస్తుశిల్ప పరిణామానికి స్తూపము, నిర్మాణ విశేషం వల్ల ముఖ్యకారణమైనది. ఏకశిలా స్తంభాలు శిల్పకళా లక్షణాలనుబట్టి ప్రశస్తమైనవి. కొండలను తొలవగా ఏర్పడిన గుహామందిరాలు వాస్తుశిల్ప సంవిధానానికీ, అశోకప్రాసాదం గృహవాస్తువుకూ మూలకారణాలు.

ఏకశిలా స్తంభాలు పదిమాత్రం శిల్పకళాశోభితాలు. సింహాలున్న స్తంభాగ్రాలు :—సారనాథ్, రాంపూర్వా, లౌరియా అరరాజ్, లౌరియా నందనఘర్‌లోవి. ఈ స్తంభాలకు సాంకేతికార్థం ఉన్నది. ఇవి ప్రాచీన వృత్తారాధనలో విశ్వాసాన్ని వ్యక్తంచేస్తవి. సారనాథ స్తంభాగ్రము ధర్మప్రవర్తనను వ్యక్తంచేస్తుంది. సారనాథ స్తంభాగ్ర ఫలకోపరి

భాగానవున్న జంతుశిల్పం భావసమృద్ధం. వైదికుల పౌరాణికభావన బౌద్ధశిల్పంలో ధారావాహికంగా వచ్చింది. జంతువులన్నీ విశ్వముయొక్క నాలుగు దిక్కులనూ తెలియ చేస్తవి. ఏనుగు ప్రాగ్దిశనూ, అశ్వము దక్షిణదిశనూ, వృషభం పశ్చిమాన్ని, సింహం ఉత్తరదిశనూ సూచిస్తవి.

సారనాథ స్తంభాగ్ర సింహాలభంగిమలు, అవయవాల తీరు తెన్నులూ, ప్రముఖకళాకారుని నైపుణ్యాము విశదం చేస్తున్నది. సింహాలజూలు వాయుకంపితంకావడం, రేఖా విన్యాసంలో ధీరత్వం, శిలను గండరించడంలో నిర్దుష్టమైన విశ్వాసం అద్భుతం.

సాంకేతికత్వం (Symbolism), భావసౌందర్యం, ఆధ్యాత్మికసందేశం భారతీయ కళాకారులసొమ్ము. నిర్మాణ చాతుర్యము వైదేశిక ప్రభావ సంజనితమని కొందరిమతం. హావెలుపండితుడు మౌర్యశిల్పంలో వైదేశిక ప్రభావంలేదని భారతీయ హృదయం గ్రహించి చెప్పినాడు.

పాటలీపుత్రంలో అశోకప్రాసాదం దారునిర్మితం. అందుచేతనే అది కలకాలంమనలేక దగ్ధమైపోయింది. ప్రాసాద నిర్మాణ విధానంలో యవన ప్రభావం ఉన్నదని అంటారు కొందరు.

బర్బరాగుహాగారాలు కొండరాతిని గండరించగా ఏర్పడినవి. గుహామందిర నిర్మాణానికి బర్బరా గుహానిర్మాణ విధానమే మూలము. గుహాశిల్పము రెండురకాలు. సరళమైనరీతిలో

కొండరాతిని చతురస్రముగానో, దీర్ఘచతురంగానో గండరించి, చదునుగా కప్పుపర్చరచి, దానిచుట్టూ బౌద్ధభిక్షుకావాసములు శిల్పాలు కల్పించినారు. రెండవపద్ధతి గుహాసింహద్వారంపైన కొయ్యతో Arch అమర్చడం. అగ్రభాగము అశ్వపులాడమువంటి Arch తో అలంకరించడం. ఇందుకుతారాక్షణం 26 సంఖ్యగల అజంతాగుహా. దారుకర్మకు నకలుగా శిలావాస్తునిర్మాణం గోచరిస్తుంది.

స్తంభాలు అశోకుడు స్తంభానికి వాస్తుశిల్ప ప్రాధాన్యం ఇచ్చినాడు. స్తంభాగ్ర నిర్మాణంలో ఎన్నోతీరులు వెలసినవి. స్తంభశిల్ప పరిణామానికి అశోక స్తంభాకృతి ఆధారమైంది. స్తంభాగ్రాన అధోముఖంగామలచబడిన పద్మాకార అలంకార విధానం అనంతరకాల దేవాలయ శిఖరాలమీద ప్రముఖంగా గోచరిస్తుంది. ఏవంవిధ శిల్పసంవిధానం చైత్యవిహారదేవమందిరాలలో కనబడుతుంది. ఇదే గుప్తకాలీన దేవాలయంలో 'కలశ' మైంది.

ఇంతవరకూ మౌర్యపోషణలోవున్న శిల్పమును గురించి ప్రస్తావించాను. ప్రభుత్వాదరణతో నిమిత్తంలేకుండా దేశీయశిల్పం రమణీయంగా నిలవగలిగింది. ఈ దేశీయ శిల్పంలో స్వతంత్ర భావన అధికం. మధురలో ఆసీనమూర్తి అయిన మానసాదేవి, దీదర్‌గంజిలో దొరికిన చామర గ్రాహిణి, విదిశానగరంలో కల్పవృక్షము, యక్షిణీ యక్ష మూర్తులు (విదిశ, పరఖాన్) తారాక్షణాలు. యక్షమూర్తి

లలో భక్తికన్న ఓజస్సు గోచరిస్తుంది. ఈ ఓజస్సే తొల్లింటి కుషాణ బుద్ధమూర్తుల్లో కనబడుతుంది.

మౌర్యకాలిక *మృణ్మయమూర్తి నిర్మాణంలో ప్రత్యేకత, వైవిధ్యమూ ఉన్నవి.

సాంచీస్తూపంలో ద్వారానికో, వాతాయనానికో ఉపరి భాగాన గుఱ్ఱపులాడమువంటి •దారుమయ వితాన పుర్ భాగము దేశీయము. గమనింపదగినదిది.

అలంకృతి శిల్పాలంకృతిలో దేశీయరీతి సొగసుగా ఉంటుంది. క్రీ. పూ. 2 న శతాబ్దమునాటి అలంకృతి బార్హత్ స్తూపం మీద చూడవచ్చును. పద్మాలూ కలువలూ జలసంబంధ జీవవర్గముతో చెక్కబడినవి. లతాలంకరణం జీవనైక్యమును సూచిస్తూ స్తూపశిలాఫలకాలమీద, తోరణాలమీద చక్కగా ఉన్నది.

సుంగులు - ఆంధ్రులు - శిల్పము క్రీ. పూ. 185 క్రీ. శ. 150. బౌద్ధసంఘానికీ, రాష్ట్రానికీ అశోకుడు స్థాపించిన సామరస్యము అతని మరణానంతరం (క్రీ. పూ. 232) నిలవలేదు. క్రీ. శ. 485 లో మౌర్యసామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. సామ్రాజ్యంలో చాలారాష్ట్రాలు బ్రాహ్మణ ధర్మానలంబులైన ప్రభువులకు వశమైపోయినవి. మౌర్యుల అనంతరం సుంగులు క్రీ. పూ. 70

---

* Terracottas.

• Wooden facade of horse-shoe shape over the door or window.

దాకా మగధేశ్వరులైనారు. తరువాత ఆంధ్రులవల్ల సుంగ వంశం క్షీణించింది. ఆంధ్రులు దక్షిణాపథపతులై పశ్చిమ దక్షిణభాగాలు ఆక్రమించినారు. క్రీ. శ. 150 లో ఆంధ్ర ప్రాభవం అంతరించింది. బ్రాహ్మణధర్మము రాష్ట్రీములో సుప్రతిష్ఠితమైనా బౌద్ధానికి ఆదరణ లేకపోలేదు. అందుచేతనే స్తూపాది బౌద్ధశిల్పాలు ఎన్నో విలసిల్లినై. మూడుశతాబ్దాల పాటు క్రీ. పూ. క్రీ. అనంతరం ప్రథమశతాబ్దిలో బౌద్ధకళా సంపద విరాజిల్లింది. బౌద్ధధర్మము రాజమందిరం విడిచి పురోహితుల పరమైంది. మతపరిణామాన్నిబట్టి శిల్పముకూడా మార్పుచెందింది.

స్తూపము బౌద్ధులు స్తూపమును బుద్ధునికి సంకేతముగా భావించి భక్తిపరవశులై ఆరాధించేవారు. అర్ధగోళాకారంగా 70 అడుగులవ్యాసము, సుమారు 35 అడుగులఎత్తున పెద్దపెద్ద పచ్చిఇటుకలతో స్తూపనిర్మాణం చేసేవారు. అర్ధగోళాకృతిగా ఉన్న స్తూపకేంద్రములో బుద్ధధాతువులనో అస్థిశేషాలనో నిక్షిప్తం చేసేవారు. దారునిర్మితమైన ఛత్రయష్టిని స్తూప కేంద్రంలో స్థాపించేవారు. ఈ ఛత్రయష్టిని శిలతో చేసేవారు. అండాకారంగల స్తూపోపరిభాగం, గిలాబా చేయబడనందువల్ల సున్నపుపనిచేసి, పండుగకో పబ్బానికో ఉపకరించేలాగ దీపాలు పెట్టుకోడానికి అనువుగా గూళ్ళుంచినారు. గిలాబా చేసిన స్తూపమునకు రంగువేసి దానిచుట్టూ అలంకారాలు చేసేవారు. స్తూపముచుట్టూ బుద్ధభక్తులు ప్రదక్షిణం చేయ

డానికి ప్రదక్షిణమార్గం ఏర్పాటయింది. ప్రదక్షిణ పథానికి శిలాఫలకమయ ప్రాకారం కల్పింపబడింది. ప్రదక్షిణానంతరం భక్తులు దిగి వెళ్ళడానికి సోపాన పరంపర కట్టినారు. భక్తి భావోద్వేగంవల్ల భక్తులు స్తూపపరిమాణం వృద్ధిచేసినారు. పూర్వం దారునిర్మిత స్తూపభాగాలను తీసివేసి వాటిస్థానంలో శిలామయ శిల్పభాగాలు అమర్చినారు. సాంచీ, బార్హత్, బుద్ధగయలలో శిల్పావశేషాలు సుంగాంధ్రకాలంలో బౌద్ధ కళా పరిణామాన్ని తెలియజేస్తున్నవి.

క్రీ. పూ. 150 లో సాంచీస్తూప పునర్నిర్మాణం ఆరంభమైంది. సుంగులు అశోక కాలీన స్తూప పరిమాణమును ద్విగుణీకృతము చేసినారు. ఇటుకలతో నిర్మితమైన ఆది స్తూపాన్ని అలాగేఉంచి, ఉపరితలాన శిలాపలకాలతో తాపటంచేస్తూ స్తూపపరిమాణం పెంచినారు. స్తూపపు మూల మట్టమునుంచి 16 అడుగుల ఎత్తునమేధి, స్తూపంచుట్టూ కట్ట బడింది. దానికి సోపానమార్గాలు రెండు దక్షిణదిశ కల్పింప బడినవి. స్తూపకేంద్రములో శిలానిర్మిత హార్మిక, ఛత్రత్ర యానికి ఆధారంగా ఉంచబడింది. స్తూపనిర్మాణారంభదశలో ఇలాంటి హార్మికారూపశిఖరం గోచరిస్తుంది.

అశోకకాలీన ప్రదక్షిణ మార్గమునకు రక్షణగాఉన్న దారుమయ ప్రాకారాన్ని సుంగశిల్పులు తీసివేసి, శిలా నిర్మిత ప్రాకారాన్ని కట్టినారు. పవిత్రమైన బుద్ధ ధాతు నిక్షిప్త పేటికారక్షణకై చిన్నప్రకారం శిల్ప, మత, నిర్మాణ

ప్రయోజనాలకై కట్టినారు. సాంచీలో ప్రాకార శిలా ఫలకములు, అధికప్రమాణ సంవిధానదృష్టితో చూచినప్పుడు ముఖ్యమైనవి. ప్రాకారములో నిలువుకమ్మలు, అడ్డకమ్మలు, కమ్మలనుకలిపే సంధిబంధాలూ ఉష్ణీషాలూ కొయ్యనమూనానుబట్టి శిల్పినిర్మించినవి.

సాంచీ స్తూప ద్వారతోరణాలు - ఆంధ్రశిల్పము ప్రాచీన భారతీయ శిల్ప శాస్త్రాలలో సాంచీ చాలా ముఖ్యమైనది. అశోకునికాలంలో ఆరంభమైన ముగ్ధవాస్తుశిల్పాలనుండి క్రీ. శ. 11 వ శతాబ్ది నాటి అన్హిల్వాడ్ చాళుక్యుల స్తబ్ధ శిల్పాలవరకుగల వాస్తు శిల్పవిన్యాసము ఇక్కడ కనబడుతున్నది. ఎన్నిరకార వాస్తువులూ శిల్పాలున్నా, ప్రాచీనాంధ్ర శిల్పుల అసమాన కళా కౌశలానికి ప్రబలసాక్ష్యంగా సాంచీద్వారములు భావనా వైచిత్రితో వెల్లివిరిసినవి. సాంచీగ్రామం ఈనాటి భోపాలు పరగణాలోని భిల్సాస్టేషనుకు 5 మైళ్ళదూరంలోఉంది. దీని సమీపంలో విదిశానగరం సుంగుల రాజధానిగా కళా కేంద్రమై ఉండేది. సుంగులప్రతిభ అస్తమించినతరువాత ఆంధ్రసాతవాహనులు ఆకరరాజ్యానికి (తూర్పు మాళవము) రాజులైనారు. రెండవసాతకర్ణి పరిపాలనాకాలంలో ప్రాచీన భారతీయ శిల్పము పరాకాష్ఠను పొందినది. సాంచీలో మహా చైత్యద్వారాలు నాలుగు నిర్మితాలైనవి. మౌర్య సుంగ శిల్పాలను మించిపోయిన కళావికాసం ఆంధ్రశిల్పంలో గోచరిస్తుంది. "ఈ సాంచీ ద్వారాలమీదగల శిల్పవైవిధ్యము,

కళానైపుణ్యాన్ని వాటినిర్మాతలు సిద్ధహస్తులైన శిల్పాచార్యులని వేనోళ్ళచాటుతున్నవి." ఇంతకుపూర్వం శిల్పంలోఉన్న అభిముఖదృష్టి ప్రాధాన్యత, స్మృతిచిత్రణమూ ఈశిల్పంలోకనబడవు. ఆంధ్రశిల్పులు ప్రకృతి పరిశీలనచేసి మానవుల అంగవిన్యాసాలనూ తత్సంబంధంగా ఏర్పడే రేఖావలయసంపదనూ సూక్ష్మముగా గమనించి వ్యక్తులను నిసర్గస్థితులలో చిత్రించి, సాముదాయక చిత్రణంలో ఒకతూకమునుకుదర్చి, దృశ్యాలకు కొత్తలోతులనూ వైశాల్యాన్నీ ఘటించి, శిల్పానికి నవ్యత, చైతన్యము కల్పించినారు. వైదేశిక సాంప్రదాయ చ్ఛాయలు కనబడుతున్నవి. అయితే వాటిని దేశీయ శిల్ప సాంప్రదాయాలతో సమరసపరచినారు. ఆంధ్రశిల్పంలో మతవిశ్వాసాలు ప్రకృతి పరిజ్ఞానము ప్రతిబింబిస్తున్నవి. పరంపరాగత నియమాలకు దాసులై ఆంధ్రులు అనుకరణసృష్టి చేయలేదు. కథావస్తువు అన్యమైనా తదీయ చిత్రణంలో శిల్పికిగల ఉపజ్ఞ కనబడుతున్నది. ఇది సాంచీద్వార శిల్పాలలో ప్రత్యేకత.

సాంచీలో ప్రధానమైనది మహాచైత్యము. దీనిచుట్టూవున్న ప్రాకారానికిగల నాలుగుద్వారాలు నలుదిక్కుల నిర్మింపబడినవి. దక్షిణద్వారము మొదట నిర్మితమైంది. అనంతరం ఉత్తర ప్రాక్ పశ్చిమద్వారాలు ఏర్పాటైనవి. ద్వారాలన్నీ ఏకశిల్ప సాంప్రదాయానికి సంబంధించినవే.

ద్వారాలన్నీ ఒకేవిధ నిర్మాణము తెలియజేస్తున్నవి. వీటిలో రెండు సమగ్రస్తంభాలు, వీటిపైన శీర్షికలు, శీర్షికల

పైన ఒకదానిమీద ఒకటిగా మూడు అడ్డకమ్మీలు, ఈ కమ్మీలమధ్య చతురస్రబంధాలు, మూడునిలువుకమ్మీలు, కమ్మీల చివరల సింహాలు, మధ్యలో ఏనుగులు, గుర్రములు, పైకమ్మీమీద రెండువైపులా ధర్మచక్ర త్రిరత్నములు, మధ్యలో ధర్మచక్రము ప్రతిద్వారంలో కనబడుతున్నవి. మిగిలిన భాగమంతా బౌద్ధజాతక కథాదృశ్యాలతో నిండి ఉన్నది. అడ్డదూలాలకొసల జంతువులున్నూ, స్తంభశీర్షికల పైన ఏనుగులున్నూ, వానికి ఐదూలగ పైదూలమును మోస్తున్నట్లున్న యక్షిణీ విగ్రహాలున్నూ రమణీయాలు. శిల్పాల్లో రేఖాచిత్రాలు అద్భుతాలు. బుద్ధుని జీవితంలో ముఖ్యఘట్టాలు—జననం, మహాభినిష్క్రమణం, మారధర్షణం, మహాసంబుద్ధి, ధర్మచక్ర ప్రవర్తనం, మహాపరినిర్వాణం ప్రాయికంగా ఈ ద్వారశిల్పాలలో గోచరిస్తున్నవి. జననాన్ని-ఏనుగులు తొండములెత్తి భద్రఘటంకమలంతో, మాయాదేవికి స్నానము చేయించే సంకేతంవల్ల గ్రహించవచ్చును. మృగదావన సందేశమును ధర్మచక్రము రెండువైపులా లేళ్ళు తెలియజేస్తవి. బుద్ధుని సంబోధి అనే జ్ఞానోదయాన్ని అశ్వత్థవృక్ష సింహాసనం లేదా ఛత్రంవల్ల గ్రహించగలం. స్తూపము మహాపరినిర్వాణ సూచకము. బుద్ధరూపం సాంచీ తోరణ కాలానికి చిత్రితంకాలేదు. మహాపురుషులను నర రూపంలో చిత్రించే సాంప్రదాయం లేకపోవడమే దానికి కారణం. మహాపురుష నిర్దేశానికి తగిన లక్షణయుక్తరూపాలు

నాటిశిల్పులు కల్పించకపోవడం కారణం. స్తూపతోరణాల మీది 'కల్పలత'లో మానవజీవిత లయగతులున్నవి. దీనికి పాశ్చాత్యులు **Tree of life** పేరు పెట్టినారు. ఈ కల్పలత ఒకొక్కప్పుడు బుద్ధపాద చిహ్నాల్లో, భద్రఘటంలో అంకురమై భావగర్భితంగా ఉంది.

నాలుగు ద్వారతోరణాలమీదవున్న దృశ్యాలనూ *వర్ణిస్తే గ్రంథము విస్తారమవుతుంది. అందుచేత దక్షిణ ద్వారముమీదగల దృశ్యాలుమాత్రం వర్ణించతలచినాను.

దక్షిణ ద్వారము

<u>మొదటి అడ్డదూలము - ముందువైపు</u> బుద్ధజననం చిత్రితమైంది. దృశ్య మధ్యంలో తామరపువ్వుమీద మాయాదేవి నిలిచింది. ఆమెకు రెండువైపులా రెండుఏనుగులు తొండాలుపైకెత్తి కుంభోదకం ఆమెమీద పోస్తున్నవి. దూలముమీద తక్కిన భాగమంతా తామరతీగె అల్లికఉన్నది. ఆకులకూ పువ్వులకూ మధ్య రకరకాల పక్షులు వివిధగతుల్లో రూపించబడినవి.

<u>మొదటి అడ్డదూలము - వెనుకవైపు</u> ఈ దూలము మధ్యవయసగా నాలుగువృత్తులు, మూడుచైత్యాలు కనబడతవి. ప్రతిదానికీ ముందు ఒక శూన్యసింహాసనం ఉన్నది. వీనిచుట్టూ భక్తులూ దేవతలూ ఉన్నారు. ఈ వృత్తులూ చైత్యాలూకలిసి

---

* డాక్టర్ మారేమండ రామారావుగారి శాతవాహన సంచికలో విపుల వర్ణన 287-301 పుటలూ, డాక్టర్ మార్షలుగారి సాంచీసంపుటాలు చూడండి.

బుద్ధుణ్ణీ, అతనికి పూర్వంఉన్న ఆరుగురు మానుషీబుద్ధుల్నీ సూచిస్తున్నవి. బుద్ధుల్లో ఒకొక్కరు ఒకొక్కవృక్షము కింద జ్ఞానోదయం (సంబోధి) పొందిసారు క్రకుచ్ఛందుడు శిరీష వృక్షమూలంలో, కనకముని ఉదుంబర వృక్షముక్రింద, కాశ్యపుడు మర్రిచెట్టుక్రింద, శాక్యముని బోధివృక్షమూలంలో బుద్ధులైనారు. ఈ శిల్పంలో నాలుగుచెట్లూ ఇవే. రెండేసి చెట్లకూమధ్య ఒకచైత్యంఉంది. వీనిలో మధ్యనున్న చైత్యం యొక్క అండముమీద మూడుపంక్తుల్లో 1. రాజోసిరి సాత కణిస, 2. ఆవెసణిస వాసిఠీపుతస, 3. ఆనందసదానం అనే బ్రహ్మలిపిలో శాసనం కనబడుతున్నది. ఈ దూలము రెండు చివరలా సముచిత పరివారముతో, శ్వేతచ్ఛత్రముతో ఒక అశ్వము నగరద్వారం దాటిపోతున్న దృశ్యంఉంది. ఇది గౌతముడు కపిలవస్తునగరం విడిచి అశ్వముమీద మహాభి నిష్క్రమణ చేసేఘట్టం.

మధ్యదూలము - ముందువైపు మొదటి బుద్ధదేవుని అవశేషాలను ఎనిమిదిభాగాలుచేసి నిక్షేపించారట. అశోకుడు ఏడుభాగాలు తీసుకొని మళ్ళీ విభాగంచేసి వాటిమీద 84000 స్తూపాలు కట్టించాడట! ఎనిమిదోభాగం రామగ్రామంలో ఉండేది. దానిని రక్షిస్తున్న నాగులు దానిని కదల్చనీయలేదు. అందు చేత అశోకుడు స్వయంగా రామగ్రామయాత్రచేసి అక్కడ వున్న అవశేషచైత్యాన్ని ఆరాధించివచ్చినాడు. ఇది అడ్డ దూలమునమధ్య కనబడుతున్నది. మధ్యలో ఒకచైత్యంఉంది.

దానిపై భాగాన రెండువైపులా పుష్పమాలికాహస్తులైన కిన్నరులున్నారు. చైత్యమునకు కుడివైపున గజ తురగ పదాతివర్గము వెంటరాగా, రథారూఢుడై వస్తున్న అశోక చక్రవర్తి, ఎడమవైపున చైత్యారాధకులు కొందరు, ఫల పుష్పాదులు తెచ్చేవారుకొందరు, పక్కనేవున్న సరస్సునుండి పైకివస్తున్నవారు కొందరు, మరికొందరు నాగనాగినులున్నారు. ఈ దూలపు రెండుకొసలా ఏనుగలున్నవి. అంద మైన కమలాలతోవున్న పుష్కరిణిలో నడిచివస్తున్న గజము మీద ఒకపురుషుడు ఇద్దరుస్త్రీలు కూర్చున్నారు. మరొకస్త్రీ వెనకనుంచి ఏనుగమీదికి పాకుతున్నది. దూరాన చాలా మంది స్త్రీలు ఒకమంటపంలోనిలిచి ఈ దృశ్యాన్ని వేడుకతో చూస్తున్నారు.

<u>మధ్యదూలము - వెనుకవైపు</u> ఇక్కడ ఛదంతజాతకకథ చిత్రింప బడింది. ఒకప్పుడు బోధిసత్త్వుడు ఆరుదంతములు కలిగిన మహా బలిష్ఠమైన గజరాజుగా జన్మించినాము. ఈ గజరాజు హిమవత్పర్వతప్రాంతములో ఛదంతమనే సరస్సుగట్టున ఒక వట వృక్షమూలంలో నివసిస్తూఉన్నాము. అతనికి మహాసుభద్ర, చూళసుభద్ర అనే భార్యలిద్దరున్నారు. భర్తకు పెద్దభార్య మీద అనురక్తి అధికము. రెండవభార్య అందుచేత అసూయతో తపిస్తూ ఉత్తరజన్మలో తాను కాశీరాజుకు దేవేరికావలెననీ, అప్పుడు కసితీర్చుకోవలెననీ తలచింది. ఆమె కోరిక ఈడేరింది. కాశీరాజమహిషి అయిన తరువాత ఆమె

చాలామంది వేటవాళ్ళను సమకూర్చి సోనుత్తరుడనేవాణ్ణి వాళ్ళకు నాయకుణ్ణిచేసి భదంతసరస్సుకువెళ్ళి గజరాజును చంపిరమ్మని పంపింది. ఈ కథ శిల్పమున రూపింపబడింది. ఇక్కడ ఎడమవైపు సరస్సులో గజరాజునిలిచి పద్మాలతో ఆడుకొంటున్నాడు. రెండువైపులా రెండేనుగులు శ్వేత చ్ఛత్రాన్ని, వింజామరను ఎత్తిపట్టినవి. మధ్యలోవున్న వట తరువుకిందనుండి ఈ గజరాజు కుడివైపుకు నడిచిపోతున్నాడు. సమీపాన రాతివెనుక సోనుత్తరుడుసిలిచి శరసంధానం చేస్తున్నాడు.

క్రిందిదూలము - ముందువైపు కుంభొండులనే మరుగుజ్జులు చేతు లత్తో పూలదండలు పట్టుకొనిఉన్నారు. వారినోటినుండి అందమైన తామరతీగె వెలుపలికివచ్చి అటూఇటూ అలము కొంటున్నది. ఈ దూలము కొసలను కొండలకున్నూ, లతల కున్నూ ముందు రీవిగా మయూరములు నిలిచినవి.

క్రిందిదూలము - వెనుకవైపు బుద్ధాస్తికలకై జరిగిన కలహము ఇక్కడ చిత్రింపబడింది. కుశీనగరంలో బుద్ధుడు నిర్వాణము పొంది నాడు. ఆ గ్రామీణులైన మల్లులు అనేతెగనాగు బుద్ధావ శేషాలు తమకు రావలెనని చెప్పినారు. మరోమేడు తెగల వారు తమకూ కావలెనన్నారు. అంతటితో వారికీ వీరికీ తగాదావచ్చింది. ఈ శిల్ప మధ్యభాగాన కుశీనగర దుర్గ మున్నది. దుర్గద్వారమును సాయుధుడు రక్షిస్తున్నాడు. దాని ప్రక్క-గోడక్రింద ఇద్దరు యోధులు పోరాడుతున్నారు. మరో

ఇద్దరు ద్వారములవైపు వెడుతున్నారు. కోటలోపలనుంచి కొందరు ఆయుధాలు విసరుతున్నారు. దుర్గానికి కుడివైపు కిందివరసలో గజతురగారూఢులైన యోధులు, పదాతులునూ ద్వారంవైపుకు వస్తున్నారు. ఇది కుశీనగర ముట్టడికి సంబంధించిన దృశ్యము. ఎడమవైపు పైవరసలో ఏనుగుల మీదా, క్రిందివరసలో గజ తురగ రథాలమీదనూ, కుడివైపు పైవరసలో గజారోహణంచేసి చాలామంది యోధులు మరలిపోతున్నారు. ఇక్కడ ఒకఏనుగుపైన ఛత్రంక్రింద బుద్ధావశేషపేటిక ఉన్నది. ఇది ఏడు తెగలవారునూ యుద్ధంలో గెలిచి అవశేషాలను తీసుకొనివెళ్ళే దృశ్యము.

ఎడమవైపు స్తంభము - పురోభాగము ఇది మూడుభాగాలుగా ఉన్నది. పైభాగానమధ్యలో వేదికమీద పొడవైన స్తంభమున్నది. స్తంభాగ్రాన ముప్పదిరెండాకులుగల ధర్మచక్రమున్నది. ఈ చక్రము వెలుపలిఅంచున ముప్పదిరెండు త్రిరత్న చిహ్నాలున్నవి. స్తంభము క్రిందిభాగాన రెండువైపులా స్త్రీజన పరివృతుడైన రాజునూ భక్తులునూ నిలిచిఉన్నారు. వీరు లోకపాలకులు కావచ్చును. ఈ వరుసక్రింద అటూ ఇటూ లేళ్ళున్నవి. స్తంభాగ్రానికి రెండువైపులా చేతుల్లో పూలదండలున్న యక్షులున్నారు. ఇది బుద్ధుడు జేతవనంలోచేసిన ధర్మచక్రప్రవర్తన చిహ్నము. రెండోభాగంలో మంత్రులు గజారోహణముచేసి అనుసరించగా రథారూఢుడై వెడుతున్న సిద్ధార్థుడు చిత్రింపబడినాడు. ఇది సిద్ధార్థుని కపిలవస్తునగర

సందర్శనం కావచ్చును మిక్కిలి అద్భుతమైన మానవ భాగాన సిద్ధార్థుని శిరోజములు స్వర్గానికి తీసికొనిపోబడుతూ వుండగా వాటిని దేవతలారాధించే దృశ్యమున్నది. వీరిలో గజారూఢుడైన ఇంద్రుడు శచీదేవి ఉన్నారు. అందమైన ఈ దృశ్యాన్ని విదిశానగర వ్యాస్తవ్యుడైన ఒకదంతకారుడు చెక్కినాడని శాసనంవల్ల తెలుస్తున్నది.

<u>ఎడమవైపు స్తంభము - వెనుకభాగము</u> ఇందులో మొదటిభాగాన పైయెత్తున ఒక ఆలయమున్నది. దీనిలో ఒకసింహాసనం, దాని మీద మూడు త్రిరత్నచిహ్నాలున్నవి. దీనిప్రక్కనే బోధి వృక్షమున్నది. దానిమీద ఛత్రాలు, పూలదండలున్నవి. దీనిక్రిందిభాగంలో సపరివారంగా ఆలయానికి వెళ్ళుతున్న రాజు కనబడుతున్నాడు. దీనిక్రింద అట్టడుగుభాగంలో త్రయస్త్రింశస్వర్గము చిత్రింపబడింది. మధ్యలో సిద్ధార్థుని శిరోజాలూ, ఉష్ణీషమూ ఉన్నవి. చుట్టూ ఆరాధించే దేవతలున్నారు.

<u>కుడివైపు స్తంభము - లోవైపు</u> స్తంభాగ్రభాగంలో విపశ్యీబుద్ధుని జ్ఞానోదయకథ చూస్తాము. దానిక్రిందభాగంలో బుద్ధుడు జ్ఞానోదయంకలిగిన నాలుగోవారము నివాసం చేసేందుకు దేవతలు రత్నగృహము నిర్మించారు. దానిమధ్య శూన్యసింహాసనం ఉన్నది. దీనిక్రిందిభాగంలో బుద్ధుని సంబుద్ధి చిత్రింపబడింది. కుడివైపు స్వస్తికుడను కూలివాడు గడ్డి కోస్తున్నదృశ్యము. ఎడమవైపు అతడు గడ్డిని ఆసనముగా

బుద్ధునికై వేర్పరస్తున్నాము. మధ్యలో సింహాసనము. నాలుగో భాగంలో ఇదేఘట్టము. చుట్టూ స్త్రీపురుష భక్తులున్నారు. అట్టమగుభాగాన బుద్ధగయలో ప్రదక్షిణదృశ్యము. మధ్యలో బుద్ధుడుచుట్టూ ఆరాధకులు, పైన నాగదంతాలనుండి వేలాడుతున్న పూలదండలు

కుడివైపు స్తంభము - పురోభాగము దీనిపై భాగాన బోధివృక్షము క్రింద శూన్యసింహాసనమున్నది. దీనిముందు నాగరాజైన ముచిలిందుడూ అతని నలుగురు భార్యలున్నారు. స్తంభ మధ్యభాగమున బోధిపృక్షమున్నది. దీనిక్రింద బుద్ధుడున్నట్లు భావన. ఇతనికి ఇరువైపుల లోకపాలకులు నిలువబడి భిక్షా పాత్రలు సమర్పిస్తున్నారు. వారివెనక పరివారమున్నది. ఒకడు వీణావాదనము చేస్తున్నాడు. అట్టమగుభాగంలో బుద్ధుడు వృక్షముక్రిందఉండగా ఆయనకు రొట్టెలు, తేనెను సమర్పించిన తపుస్స భల్లుకులనేవర్తకులు ఎద్దులబండిలో పోవుచున్న దృశ్యమున్నది.

భారతీయ శిల్పములో సాంచీతోరణాలకు ముఖ్య స్థానం ఉన్నది. శిల్పాలను సజీవముచేసే లావణ్యము, రేఖా విన్యాసమూ ముఖ్యాంగములని ఆంధ్రశిల్పులు తెలియ జేసినారు.

• కుషాణశిల్పము కుషాణ చక్రవర్తులు మహాయాన బౌద్ధమును పోషించినారు. ప్రజలు బుద్ధభక్తివల్ల ఉజ్జ్వలులుగినారు. భక్తుని దృతచిత్తానికి ఆలంబనంగా సగుణమైన ప్రతీకారాధ

నము కావలసివస్తుంది. బుద్ధుణ్ణి సాంకేతికంగా శిల్పులు చూపక, మహాపురుషలక్షణాలతో ఆయనను భావనచేసి, రూపకల్పన కావించినారు. ప్రాచీన బుద్ధమూర్తి కల్పనలో యవన రోమక బౌద్ధ ప్రభావ సమ్మేళనం గోచరిస్తుంది. అపోలోవలె బుద్ధుడు కనబడతాడు. ఈ యవన బౌద్ధశిల్పాన్ని గాంధారశిల్పమంటారు. ఆఫ్ఘన్ స్తాన్, కశ్మీరం, మధుర, విదిశ, అమరావతీ ప్రాంతాల్లో వ్యాప్తమైన గాంధార శిల్పరీతిలో యవనప్రభావము కొంత కనబడుతుంది. భావము భారతీయము ; రీతి యవనమూ. శిల్పానికి జీవము భావచైతన్యం. శిల్పము భావచైతన్యము విలసితము కానప్పుడు నిర్జీవము.

గాంధారశిల్పములో కేవల బౌద్ధప్రభావమేకాక శైవం కూడా గోచరిస్తుంది. చార్యడాలోని మహేశ్వర, త్రిమూర్తులు, మాణిక్యాల, మిర్‌పూర్ ఖాసులలో ప్రతీకా లిందుకు తార్కాణాలు.

ఆది కుషాణ బుద్ధ, బోధిసత్త్వ ప్రతిమల ప్రత్యేకత

1. ఎట్టని సైకతశిలపై ఉన్నత పృష్ఠభూమిపై శిల్పులు గండరిస్తారు.

2. శిరసుముండితము. కుటిలకేశాలుండవు. శిరముపై ప్రత్యేకమైన ఉష్ణీషముండును.

3. ఊర్ణము, మీసములున్నూ ఉండవు. దక్షిణ హస్తము అభయముద్రలో ఉంటుంది. ఆసీనమూర్తి అంకంపై

వామహస్తం ఉంటుంది. ఉత్థితమూర్తియొక్క వస్త్రపుమడత లను వామహస్తము వహిస్తుంది. మోచేయి శరీరానికి దూరంలో ఉంటుంది.

4. పురుషమూర్తిఅయినా వక్షోలు సమున్నతాలు ; భుజాలు అతివిశాలములు.

5. కుడిభుజముమాత్రం ఉత్తరీయంలేకుండా నగ్నంగా ఉంటుంది. వస్త్రం శరీరాన్ని అంటుకొని ఉంటుంది.

6. పద్మాసనంకాక సింహాసనం ఉంటుంది. ఆసన సమీపంగా చిన్నచిన్న మూర్తులుండవు. మూర్తిలో సాత్వికమాధుర్యంకన్న, లావణ్యస్ఫూర్తికన్న ఓజస్సు అమితంగా గోచరిస్తుంది.

ఈ లక్షణాలు కుషాణ కాలీన జైనవిగ్రహాలకూ సరిపోతవి.

కుషాణ కాలీన విహార వాస్తువులో ప్రత్యేకత గమనించాలి. నీలాకాశంక్రింద విహారములు స్తూపసమీపంలో నిర్మించేవారు. కుషాణులు స్తూపావరణం కోటవలె కట్టేవారు. కోటలో పట్టణంవలె స్తూపవిహారాలు కనబడవు. చతుష్కోణాకారంగల స్తూపావరణలో మూడుదిక్కుల భిక్షుకనివాసములు రెండంతస్తుల వరసలో ఏర్పాటుచేసినారు.

మధురాకల్పము మధురలో భారతీయ యవన సంస్కృతుల సమ్మేళనము జరిగినది. భిన్నసంస్కృతీ ప్రవంతుల సాగర

సంగమము మధురానగరము. ఇచ్చట కుషాణశిల్పము ప్రాచీన విదిశ, బార్హాతు కళాసాంప్రదాయములను అనుసరించింది. మధురలో బుద్ధప్రతిమాశిల్పములో కేవల భారతీయత నిలిచినది ; వైదేశికప్రభావము లవలేశములేదని విన్‌సెంట్‌స్మిత్తు వక్కాణించినాడు. మధురాశిల్పరీతిని చాల మంది అనుకరించినారు. ముఖ్యముగా గుప్తకాలీన శిల్పమునకు మధురాశిల్పము ప్రోద్బలం ఇచ్చింది. బుద్ధమూర్తులే కాక శివుడు. దేవీ, గోవర్ధనధారియైన కృష్ణుడు, స్కందుడు, విశాఖుడు, అగ్ని, వాయువు, నాగమూర్తులు, ప్రాకార శిలాఫలక శిల్పములు రమణీయములు. గ్రంథవిస్తర భీతివల్ల ఈ శిల్పాదులను గురించి విమర్శచేయను.

ఆనంధ్రశిల్పము ఆంధ్రశిల్పము సర్వభారత శిల్పానికే నవ్యగతులు సూచించింది. సాంచీ ద్వారతోరణాల ఆంధ్రశిల్పము క్రీ. శ. 2, 3 శతాబ్దాల్లో అమరావతిలో మహోత్కృష్టమై దేశదేశాంతరాలు వ్యాపించింది. కాని క్రమంగా ఈ కళా స్వరూపం రూపగతుల్లో క్షీణప్రాయమైనై చివరకు తానే అంకురింపచేసిన ఇతర కళాప్రసవంతుల్లో కలిసి అంతరించింది. ఉండవల్లి గుహాల్లో నిర్ణీతమైన వాస్తురూపం క్రీ. శ. 6, 7 శతాబ్దాలలో పల్లవకళగారూపొంది, చివరకు ద్రవిడశిల్పంలో అంతర్ధానమైంది. పల్లవ వాస్తురూపాల్లోనే, ఎల్లోరాలో కైలాసగుహాలో రాష్ట్రకూటకళగా రూపొంది, తుదకు పశ్చిమ చాళుక్య కళాస్వరూపమైంది. జావాబలి ద్వీపాల్లో

ఆంధ్ర శిల్పకళ క్రీ. శ. 6, 7 లో బొరొబొదూరు స్తూపంలో, అజంతాలో క్షీణదశయైన ఆంధ్రశైలిని, ఘంటసాల స్తూపనిర్మాణక్రమాన్ని, పల్లవ వాస్తు రూపాలనూ ధరించి తుదకు జావాకళలో అంతరానమొంది.

* ఆంధ్ర శిల్పవాహిని తెలిసికోడానికి కొన్నిగుహలు గమనిస్తే చాలును. 1. కార్లే చైత్యగుహ, 2. నాసిక్, 3. అజంతా, 4. కన్హేరీగుహలు, 5. అమరావతి.

సుమారు నాలుగుశతాబ్దాలపాటు మహారాష్ట్రము సాతవాహనుల యేలుబడిలో ఉండేది. బౌద్ధసంఘాలకోసం పర్వతాలలో చైత్యగుహలు, విహారాలూ, సమావేశ భవనాలూ త్రొలవబడినవి. నాసికలో గుహలు చాలాముఖ్యమైనవి. ఇక్కడ సాతవాహన రాజులలో రెండవవాడైన కృష్ణుని కాలమునుంచి యజ్ఞశ్రీ కాలముదాకా త్రొలవబడిన గుహలున్నవి. వీటిని పరిశీలిస్తే గుహావాస్తు పరిణామం విశదమవుతుంది. ఆంధ్రశిల్పము అమరావతిలో పరమావధి పొందింది కనక అమరావతి స్తూపశిల్ప విశేషాలు తెలిసికోడం ముఖ్యము.

అమరావతి మహాస్తూపము-శిల్పపరిణామము గుంటూరుజిల్లాలో సత్తైన పల్లితాలూకాలో కృష్ణవేణీతీరాన అమరావతి విశ్వవిఖ్యాతి

---

* పురాతత్త్వశాఖవారి 4, 5, 6 సంపుటాలు, Cave Temples of Western India చూడుము.

చెందినది. ఇప్పటికి రెండువేల సంవత్సరాలక్రిందట అమరావతిలో బుద్ధుని శరీరావశేషములమీద నిర్మితమైన ఒక మహాచైత్యము, తదనుబంధముగా ఒకవిద్యాపీఠము, శిల్ప విద్యాకేంద్రమున్నూ ఉండేవి. అమరావతీ స్తూపమువంటి విస్తృతిని సౌందర్యమున్నూగల నిర్మాణము మరెక్కడ ఉండలేదని కళాభిజ్ఞులు ప్రశంసించినారు. **"It could hardly be possible to exaggerate the luxurious beauty or the technical proficiency of the Amaravati reliefs: this is the most voluptuous and the most delicate flower of Indian sculpture"** అని ఆనంద కుమారస్వామి మహోదయులు అమరావతి శిల్పమునుగూర్చి ప్రశంస చేసినారు.

మహాచైత్యము అమరావతిలో ముఖ్యనిర్మాణము మహాచైత్యం. అన్ని చైత్యాలలో ముఖ్యమైన చైత్యానికి మహాచైత్యమని అంటారు. చైత్యాలు శారీరకములనీ, ఉద్దేశికములనీ, పారిభోగికములనీ మూడువిధాలు. శరీరావశేషములమీద నిర్మితమైన మహాచైత్యము కనుక ఇది శారీరకము. చైత్యము శిక్షస్థయినా చైత్యఫలకాలనుబట్టి మహాచైత్యము ఎలా ఉండేదో ఊహచేయవచ్చును. స్తూపవేదిక 6 అడుగులయెత్తు; చుట్టుకొలత 521 అడుగులు. అండమువొక్క వ్యాసము 192 అడుగులు; 800 అడుగుల ప్రాకారము; 16,800 అడుగుల వైశాల్యముగల సుందరశిల్పాలతో మహాచైత్యము విలసిల్లినది.

అమరావతీ మహాచైత్యము, అక్కడ లభ్యమైన శాసనములవల్ల, ఆ శిల్పాలలో వ్యత్యాసాలవల్ల, ఇతరశిల్పాలతో పోలికవల్లనూ నాలుగుదశలలో నిర్మింపబడిందని స్పష్టమవుతున్నది. మూడవదశలోని శిల్పసృష్టి ఉత్తమోత్తమము. ఆచార్య నాగార్జునుని పర్యవేక్షణలో చైత్యప్రాకారము శాతవాహనచక్రవర్తి పోషణవల్ల నిర్మింపబడిందని ఐతిహ్యం.

మొదటిదశ క్రీ. పూ. 200—100. ఈ కాలపు శిల్పాలను ఆనంతర శిల్పాలతో పోల్చిచూస్తే చాలావ్యత్యాసం కన బడుతుంది. మానవమూర్తులు సజీవంగాలేవు. చిత్రణంలో వంపులు భంగిమలు సహజంగాలేవు. ముఖములు కాంతి హీనాలు. ఆభరణాలు అవయవాలకు అతికించినట్లుంటవి. మానవశిల్పములోవలెనే జంతుశిల్పాల్లోనూ మోటుతనం కనబడుతుంది. గణపతి లక్ష్మిచిత్రాలు ప్రాథమిక స్థితిలోనివి.

విడిపలకలమీదనో, స్తంభాలమీదనో. ఉష్ణీషము మీదనో మహాభినిష్క్రమణము, మారధర్షణము, సిద్ధార్థుని అస్త్రవిద్యా ప్రదర్శనము, జటిలగర్వభంగము, అంగుళిమాలునికథ, బుద్ధాస్తికలకై కలహామునూ చిత్రింపబడినవి.

ఈ కథాశిల్పాలేకాక యక్ష, వామన, కుబ్జ, యక్షకిన్నర, వృక్షచైత్య, బుద్ధపాద, హంసనరసింహా, గజ వృషభ జంతుచిత్రాలు, పూలమాలలూ, త్రిరత్నాలూ చైత్య ప్రాచీన ప్రాకార భాగాలమీద గండరింపబడినవి.

రెండవదశ క్రీ. శ. 100. ఈ దశలో శిల్పములు పూర్వశిల్పాల కన్న పరిణతాలైనవి. మానవమూర్తులు సహజముగా వేష భూషలతో ఉన్నారు. స్త్రీమూర్తులుకూడా పరిణతములే. మాయాదేవి అభిషేకము మారప్రలోభనము, బుద్ధకథ, మారధర్షణము (సాంకేతికశిల్పము) లలో భావప్రకటనత్వం కనబడుతుంది.

సాంకేతికశిల్పాలు ధర్మచక్రము, బోధివృక్షము, శూన్యసింహాసనము, త్రిరత్నచిహ్నము, జ్వాలాస్తంభములున్న వేదికా ఫలకాలు దొరికినవి

ఇతరశిల్పాలు వివిధసంతుష్టులున్న స్తంభాలు, ఉష్ణీషశేకలాలు ఫలకాలమీద పూర్ణకలశములు, పూలమాలికలు రమణీయాలు, అనేక నాట్యభంగిమలలో యక్షులు కనబడతారు.

మూడవదశ క్రీ. శ. 150. భారతీయ శిల్పకళాచరిత్రలో స్వర్ణయుగాన్ని ఈ దశలో చూడవచ్చును. శిల్పికిగల భావనాపాటవము, విన్యాసకౌశలము, కళావైదగ్ధ్యము మహోత్కృష్టముగా గోచరిస్తవి. సాతవాహనాంధ్రయుగము చిరస్మరణీయం చేయడానికి ఏతత్కాలీనశిల్పాలుచాలు. రూపాకృతులలో జీవచైతన్యము ప్రత్యంగుళములో భాసిస్తున్నది. అంగవిన్యాసము మనోహరము. దృశ్యములో అంతరువులు చెక్కడంలో నేర్పు కనబడుతుంది. లేత ముదురు రంగులతో శిల్ప దూరసామీప్యాలు చూపుతాము. అలాగే అమరావతీ

శిల్పి మెరకపల్లాలతో ఈ భావము కలిగించినాడు. ఉష్ణీషము మీద పూలమాలను వామనులు కుబ్జులుకాక సుందరులైన యువతీయువకులు లీలాప్రాయంగా భుజాలమీద వహిస్తున్నట్లు చిత్రించబడింది. వామనులు మకరములు, జంతువులు చక్కగా ఉన్నవి. బృందశిల్పంలో ప్రత్యేకంగా ఒకొక్కవ్యక్తి సొగసుగా ఉన్నాడు. సాముదాయికంగా బృందమంతా మనోహరము. అమరావతిశిల్పి చూపిన భావశబలత పరమావధికి ప్రాపించింది. ఈ కాలపు శిల్పాలు స్థూలంగా విభజన చేయవచ్చును. 1. అవదాన కథాశిల్పము, 2. బుద్ధశిల్పము, 3. ప్రకీర్ణకము. మాయాదేవిస్వప్నము, శుద్ధోదనుడు అశోకవనానికి వెళ్ళడం, బోధిసత్త్వావతరణం, భిక్షాపాత్రారోహణం, బుద్ధజీవితఘట్టాలున్న దృశ్యాలు రమణీయములు.

దక్షిణాపథములో ఆంధ్రశిల్పులు సాంచీ ధాన్యకటకాలలో ఉపజ్ఞతో ప్రత్యేక శిల్పసాంప్రదాయమును, వాస్తవికతకు దూరంకాని పద్ధతిలో అదర్శకత్వ స్ఫోరకత్వ సమ్మేళనచేసి, చైతన్యముతో విలసిల్లే అమరసృష్టిచేసినాడు.

గ్రంథరచనకు పరిశీలించిన గ్రంథాలు

---

1. Rapson's Indian Coins of the British Museum.

2. Rapson's Andhra Coins.

3. The Age of Imperial unity Vol II ed. K. M- Munshi.

4. Political History of Ancient India.H. Raya chowdari (Calcutta)

5. శాతవాహన సంచికలు (ఇంగ్లీషు, తెలుగు) సంపాదకుడు డాక్టర్ మారేమండ రామారావు. ఆంధ్రేతిహాస సంశోధకమండలి.

6. Early Dynastics of Andhra Desa by B. V. Krishna Rao, Vavilla press, Madras.

7. Select Inscriptions—D. C. Sarkar Vol I Calcutta University.

8. Indian Coins—by Cunningham,

9. History of Art in India and Indonesia by Ananda Kumara Swamy.

10. History of fine arts in India and Ceylon V. Smith.

11. Indian architecture by Percy Brown.

12. ఆంధ్రశిల్ప దర్పణము (భారతీవ్యాసాలు) ఆముంచర్ల గోపాలరావుగారు.

13. Mauryan Art--Nihar Ranjan Roy-Calcutta.

14. Gudi to Sanchi—Marshell.

15. Archaeological Survey Volumes 4,5,6-Cave temples of Western India.

16. History of Eastern Architecture-Fergooson.

17. What is original Buddism-by Rhys Davids.

18. History of Sanskrit Literature—Keith.

19. History of Sanskrit Literature—M. Krishnamachari.

20. History of Sanskrit Literature—S. K. De.

21. History of Pali literature 2 Vols—Bimal-charan Law.

22. మనుస్మృతి.

23. కౌటిల్యుని అర్థశాస్త్రము—శ్యామశాస్త్రి.

24. Indian Culture through the ages Vidyarthi Cawnpore.

25. Rajatarangini by Kalhana--Stein's edition.

26. The Age of Nandas and Mauryas—Prof. Neelakanta Sastry—published by Motilal Banarsidas.

గుప్తయుగము

కుషాణరాజ్యం విచ్ఛిన్నం కావడంవల్ల తలెత్తిన రాజకీయ నైక్యము క్రీ. శ. 4 వ శతాబ్దారంభందాకా ఉంటూనే వచ్చింది. కుషాణులు పశ్చిమపంజాబు పాలకులైవున్నా, తూర్పుదిశవారి ఆధిపత్యం అంతమైంది. శకులు గుజరాతు, మాళవంలో కొంతమేర పరిపాలిస్తున్నప్పటికీ వారిప్రాభవం శీఘ్రంగా నాశనోన్ముఖమైంది. ఉత్తర భారతదేశంలో చిన్న చిన్న రాజ్యాలు స్వతంత్రకూటాలు చాలాఉన్నవి. మహా నాయకు డుద్భవించి సామ్రాజ్యస్థాపనచేసే సావకాశం ఏర్పడింది. గుప్తవంశీయులలో ఒకరాజు నాయకుడై సామ్రాజ్యస్థాపన చేసినాడు.

గుప్తవంశ శాసనాదులనుబట్టి పాలకులు మహారాజశ్రీ గుప్తుడు, అతనికుమారుడు మహారాజశ్రీ ఘటోత్కచ గుప్తుడు, ఆయనసుతుడు మహారాజాధిరాజశ్రీ చంద్ర గుప్తుడని తెలుస్తున్నది.

చంద్రగుప్తుడు మహారాజాధిరాజ బిరుదమువల్ల చంద్రగుప్తుడు తన పితృ పితామహులకన్న పరిపాలనా సామర్థ్యంకలవాడనీ, రాజ్యవిస్తరణం చేసినాడనీ భావించవచ్చును. శ్రీగుప్త

ఘటోత్కచులు మహారాజ బిరుదాంకితులైనప్పటికీ వారు స్వతంత్రులుకారు. సామంతులుకూడా మహారాజబిరుదము వహించేవారు. శ్రీగుప్త ఘటోత్కచులు వీ ప్రభువుకో సామంతులై ఉంటారు. కొందరి మతప్రకారం వారిరాజ్యం చిన్నదైనా పెరుస్వతంత్రులు.

రాజ్యారంభం: వీరిరాజ్యం మొదట ఎక్కడఉన్నదని ప్రశ్న వస్తుంది. సప్తమ శతాబ్దారంభములో ఇత్సింగ్ అనే చీనా యాత్రికుడు భారతదేశపర్యటనంచేస్తూ, యాదృచ్ఛికంగా చూచినది గ్రంథంలో లిఖించినాడు. అతని వ్రాతనుబట్టి శ్రీగుప్తుడనేవాడు చీనాపురోహితులకు దేవాలయం నలం దాకు నలభై యోజనాల్లో కట్టించి, 24 గ్రామాల ధర్మా దాయం కల్పించినాడనీ తెలియవస్తున్నది. ఈ శ్రీగుప్తుడే గుప్తవంశస్థాపకుడని కొందరన్నారు. ఇదినిజమైతే వంగదేశం కూడా అతని రాజ్యంలోనిదై ఉంటుంది.

శ్రీగుప్తుని కుమారుడైన ఘటోత్కచుని విషయం మనకేమీ లభ్యంకావడంలేదు.

ప్రథమ చంద్రగుప్తుడు ఘటోత్కచుని పుత్రుడు. చంద్రగుప్తుడు గుప్తరాజ్యసింహాసనం అధిష్ఠించినాడు. అతని హయాములోనే గుప్తవంశము మహోన్నతికి వచ్చింది. అతడు మహారాజాధిరాజ బిరుదము వహించినాడు. బంగారు నాణెములు ప్రచురించినాడు. నాణెములకు ఒకవైపు. తన పేరునూ మహారాజ్ఞి కుమారదేవిపేరు రెండోవైపు లిచ్చి

వులుఅసీ, అంబికా సింహావాహన ప్రతిమతో కానవస్తున్నవి. ఆయన బిరుదమూ, నాణెములనుబట్టీ, వంశము ఉన్నతస్థితికి వచ్చిందని చెప్పవచ్చును.

లిచ్ఛవులతో సంబంధం కుమారదేవి లిచ్ఛవీరాజపుత్రి. చంద్రగుప్తుడు లిచ్ఛవీరాజికన్యను వివాహంచేసుకోడంలో విశేషం ఉన్నది. చంద్రగుప్తుని నాణెముల విషయం దూరంగావుంచి, ఆయనకుమారుడిసంగతి చూదాము. సముద్రగుప్తుడు లిచ్ఛవీ దౌహిత్రుణ్ణి అని చెప్పుకొన్నాడు. స్మిత్తుగారు చెప్పినట్లు చంద్రగుప్తుడు లిచ్ఛవులతో వైవాహికబంధం ఏర్పరచుకోడంవల్ల మగధకు చుట్టుపక్కల రాజ్యాలపై ఆధిపత్యం వచ్చింది. ఈ ఆధిపత్యం సాంఘికమైందికాదు. లిచ్ఛవులు ప్రాత్యక్షత్రియులైనప్పుడు తత్సంబంధం సాంఘికంగా ఘనమైందని చెప్పడం అసంగతం. రాజనైతికదృష్టితో ఆలోచిస్తే, గుప్తవంశం నిలవడానికి, చుట్టుపక్కల రాజ్యాలను ఆయత్తం చేసికోడానికీ, చంద్రగుప్తుడు లిచ్ఛవులతో చేసికొన్న వైవాహిక సంబంధమే కారణమని చెప్పకతప్పదు.

పురాణ వచనాన్నిబట్టి చంద్రగుప్తుడు సాకేతము, ప్రయాగ, మగధను పరిపాలించినట్లు తెలుస్తున్నది. అనగా ప్రస్తుతపు బిహార్, వంగదేశంలో కొంతమేర, అయోధ్యనూ పాలించాడన్నమాట.

కాలనిర్ణయం ప్రథమ చంద్రగుప్తునివల్ల గుప్తశకారంభమైందని కొందరు భావిస్తున్నారు. అనగా గుప్తశకం క్రీ. శ. 320

ఫిబ్రవరి 26. చంద్రగుప్తుని సింహాసనారోహణం క్రీ. శ. 320
అయితే, శ్రీగుప్త ఘటోత్కచుల పరిపాలనలు 320—270
అంతరంలో ఉండాలి. అదిగాక క్రీ. శ. 320 సముద్రగుప్తుని
సింహాసనారోహణం అయితే శ్రీగుప్తాదుల పాలనాకాలం
వెనుకకు తోసివేయాలి. అనగా క్రీ. శ. 250 దాకా. ఇలా
కాలనిర్ణయంచేయడానికి ఇత్సింగ్ తనకు పూర్వం 500
ఏళ్ళక్రితం శ్రీగుప్తునికాలం ఉల్లేఖించినాడు.

గుప్తసామ్రాజ్యస్థాపన - సముద్రగుప్తుడు ప్రథమ చంద్రగుప్తసుతుడు సముద్రగుప్తుడు గుప్తసామ్రాజ్య ప్రతిస్థాపకుడై యశశ్చంద్రచందిక లు శోభిల్లచేసినాడు. రాజనీతిలో దక్షుడు. లలిత విజ్ఞాన క్షేత్రాల్లో ఆమహనీయునికృషి, దోహదంలు చిరస్మరణీయాలు. సముద్రగుప్తుని మహోజ్జ్వలచరిత్ర సాకల్యంగా గ్రహించడానికి హరిసేన కలీశ్వరకృత ప్రయాగ ప్రశస్తి ఎంతయినా ఉపయోగపడుతుంది. ప్రయాగశాసనంవల్ల గుప్త మహీవల్లభుని విజయపరంపర, సామ్రాజ్యప్రతిష్ఠ విశదమవుతున్నవి.

సముద్రగుప్తుని సింహాసనారోహణము ప్రథమ చంద్రగుప్తుడు సిందు పేరోలగంలో కుమారుణ్ణి ఆలింగనంచేసికొని, హర్షపులకిత స్వరంతో "నీవు సమర్థుడవు. ఈ భూభారం వహించ" మని పలికినాడు. అనగా కుమారునికి సముద్రునికి పట్టముకట్టినాడని తేటతెల్లమవుతున్నది.

తక్కిన కుమారులుండగా వాళ్ళను తోసిరాజని, సముద్రగుప్తుడే పాలనార్హుడని తండ్రి ఎన్నికచేసినాడు. గుప్త

సింహాసనంకోసం సముద్రుని దాయాదులెవరో యత్నించి విఫలులై ఉంటారు. సింహాసనం అధిష్ఠించినవెంటనే సోదరులకూ సముద్రునికీ మధ్య వైరం జ్వలించింది. సోదరులతో పోరాటం చేసినాడు. 'కాచు' డనే సోదరుడు సముద్రునికి ఉండవచ్చుననేది అందరూ అంగీకరించలేదు. కాచుడే సముద్రుని నిజనామమని కొందరిమతం. శత్రువులను చెండాడి అతడు సింహాసనం భద్రంచేసికొన్నాడు.

సముద్రుని విజయపరంపర సముద్రగుప్తుడు అహిచ్ఛత్ర పాలకుడైన అచ్యుతుణ్ణి, పద్మావతిలో నాగజాతిప్రభువైన నాగసేనుణ్ణి ఉన్మూలించినాడు. ఎగువ గంగామైదానంలో కోట కులజుణ్ణి ఎదురొక్కనాడు. అచ్యుత నాగసేనులతోపాటు ఆర్యావర్తంలో గణపతినాగ, చండవర్మ, రుద్రదేవ, మతిల, నాగదత్త, నందిబలవర్మల రాజ్యాలు గుప్తరాజ్యంలో కలుపుకొన్నాడు. వీరిపేర్లేతప్ప రాజ్యనామములు ప్రయాగ శాసనములో పేరొక్కనబడలేదు. ఉత్తరప్రదేశ్ యావత్తూ, మధ్య భారతంలో కొంతమేర, వంగదేశంలో నైఋతిభాగం, సముద్రగుప్త సామ్రాజ్యంలో చేరుతవి. సామ్రాజ్యవిస్తీర్ణం ఇలానిర్ణయించడానికి ఉపపత్తులున్నవి. సామ్రాజ్యసీమలో వున్న పంచరాజ్యపాలకుల నామములూ, తొమ్మిది రాజ్య కూటాలవారు పన్నులుచెల్లించి, గుప్తప్రభుశాసనం ఔదల ధరించడమూ, వాళ్ళు వ్యక్తిగతంగావచ్చి చక్రవర్తిని సేవించడమూ శాసనంలో ఉల్లేఖింపబడింది. ప్రత్యంతదేశాలు

మూడున్నూ అనగా సమతత, కామరూప, నేపాళములు క్రమంగా ఆగ్నేయ వంగదేశం, ఉత్తరఅస్సాం నేపాళములు. దవాకరాజ్యం అస్సాములో నౌగంగమండలం, కర్తరీపురము నేటికర్తార్‌పూర్ జలంధరులో. సామ్రాజ్యపు సరిహద్దుల్లో వున్న గణతంత్రరాజ్యాలు మాళవులు, *అర్జునాయనులు, యౌధేయులు, ♦మద్రకులు, ●ఆభీకులు, శనకానీకులు (భిల్సాసమీపం), ఖార్పరికులు (మధ్యప్రదేశం), పార్జునులు (భిల్సాసమీపం). సముద్రగుప్తుని పరిపాలనంక్రిందవున్న రాజ్యంలో వంగదేశం (ఆగ్నేయభాగంతప్ప); ఉత్తరాన హిమాలయ పర్వతపాదమువరకూ; పశ్చిమాన పంజాబు (తూర్పుమండలాలతోసహా); ఇరాన్‌నుండి జబల్‌పూర్, అక్కడనుండి వింధ్యపర్వతశ్రేణిని అనుసరించిన ఆటవిక రాజ్యాలూ చేరినవని ప్రయాగ శాసనాన్నిబట్టి చెప్పవలసి ఉంటుంది.

దక్షిణ దిగ్విజయయాత్ర సముద్ర సామ్రాట్ దక్షిణాపథంలో పన్నెండుమంది రాజులను ఓడించి బంధించి విముక్తుల్ని చేసినాడు. ఆ రాజులు దక్షిణ కోసలాధీశ్వరుడైన మహేంద్రుడు (బిలాస్‌పూర్, రాయపూర్, శంబలపురమండలాలు);

---

* రాజస్థానంలో జయపూర్, భాగల్‌పూర్ ప్రాంతీయులు.

♦ రావి చీనాబు నదీమధ్యప్రాంతాన శాకల అనే సయాల్‌కోట.

● పశ్చిమరాజస్థాన్, ఉత్తరమహారాష్ట్రంలోవారు. (భిల్సా, ఝాన్సీ మధ్యప్రాంతం)

మహాకాంతారం అనబడే ఓడ్రదేశంలో జయపుర ప్రాంత అటవీ పాలకుడైన వ్యాఘ్రరాజు ; కౌరాల అనబడే కొల్లేరు సరో ప్రాంతాధీశుడైన మంతరాజు ; పిష్టపుర (ప్రస్తుతం పిఠాపురం) రాజైన మహేంద్రగిరి ; కొట్టూరు (తునిదగ్గర) రాజైన స్వామిదత్తుడు ; ఏరండపల్లిలో (శ్రీకాకుళం మండలంలోని ఆముదాలవలస) దమనరాజు ; కాంచీపుర ప్రభువైన విష్ణు గోపుడనే పల్లవరాజు ; అవముక్తపాలకుడైన నీలరాజు ; వేంగీరాజైన పాలంకాయన హస్తివర్మ ; నెల్లూరు ప్రాంతంలో పలక్కరాజైన ఉగ్రసేనుడు (బహుశ పల్లవుల సామంతుడు) ; దేవరాష్ట్ర (యలమంచిలి, విశాఖపట్టణము) రాజైన కుబేరుడు ; కౌస్థలపుర ప్రభువైన ధనంజయుడునూ సముద్రగుప్తునివల్ల పరాజితులైనారు.

మధ్యప్రదేశమునకు తూర్పు దక్షిణదిశలుగా, ఓడ్ర దేశపు తూర్పుతీరాన దిగ్విజయయాత్ర చేసినారు.

కాంచీ పల్లవరాజును సముద్రుడోడించినాడనే విషయము చింత్యము. ఏతావతా నిజప్రాభవ ప్రదర్శనకోసం అతడు విజయయాత్ర చేసినాడేకాని దక్షిణాపథంలో రాజ్యాలు గుప్తసామ్రాజ్యంలో కలుపుకోలేదు.

ప్రయాగప్రశస్తివల్ల విశదమయ్యే విషయంచూడండి. కొందరు రాజులు స్వయంగా సముద్రునికి "కన్యోపాయన దానము" లవల్ల సేవాధర్మం నెరపుకొంటూ, తమరాజ్యాలను తాము పాలించుకొనే హక్కుభుక్తముల నిమిత్తం

చక్రవర్తి ఆమోదపత్రాలకై ఎదురుచూచేవారు. ఈ వర్గానికి చెందిన పశ్చిమమాళవము, కతియవాడు పాలకులైన శకులు పశ్చిమపడమూబు, ఆఫ్ఘన్స్తాన్ రాజులైన కుషాణులు* సింహళరాజునుకూడా ఈ వర్గంలో చేర్చవచ్చునా అనే సందేహం రావచ్చును.

సింహళముతో సంబంధము చైనీయగ్రంథాలవల్ల ఈ విషయం తెలుస్తున్నది. క్రీ. శ. 352—379 లో సింహళరాజైన మేఘువర్ణుడు సముద్రగుప్తునిదగ్గరకు రాయబారిని బహు మూల్యాభరణాలతోపంపి, బోధగయలో సింహళదేశపు బౌద్ధయాత్రికుల సౌకర్యంనిమిత్తం విహార విశ్రాంతి భవన నిర్మాణానికి అంగీకారము కోరినాడట. చక్రవర్తి వెంటనే సమ్మతించి బోధివృక్షానికి ఉత్తరాన దివ్యవిహారం స్థపిచులకు కట్టించినాడట. క్రీ. శ. 7 వ శతాబ్దిలో హ్యూన్సాంగ్ దానిని దర్శించినాడు. ఒకరకమైన కుషాణ ముద్రలమీద సముద్ర, చంద్ర నామములుండడంవల్ల వారిమీద గుప్తుల ఆధిపత్యం ఉండేదని విశదమవుతున్నది. గుప్తచక్రవర్తితో మైత్రి నెరపవలెనని పశ్చిమక్షత్రపులు అభిలషించినారు. సింహళరాజుకూడా పై వారివలెనే గుప్తచక్రవర్తితో స్నేహ సంబంధము కోరినాడా? గుప్తసామ్రాజ్యసీమలకు సమీపంలో వుండే రాజ్యాలు సముద్రగుప్త చక్రవర్తితో రాజ్యతంత్ర

---

* "దైవపుత్ర, షాహి, షాహాను షాహి, శకమురుండ"—ప్రయాగ శాసనం సముద్రగుప్త ప్రశస్తిలో.

సహితసంబంధం ఏర్పరచుకొన్నారు. సింహళప్రభువు అలాగే చేసిఉండవచ్చును.

సామ్రాజ్యభద్రత సముద్రగుప్తుని రాజ్యతంత్రజ్ఞతవల్ల సామ్రాజ్యము సుప్రతిష్ఠితమైంది. యావదాభరతం ఏకైక సామ్రాజ్యచ్ఛత్రంకిందికి తీసుకురావలెననే దృక్పథం ఆయనకున్నది. అయితే ఆసేతుహిమాచలం స్వయంగా పరిపాలనచేయడం అసాధ్యంకనుక నిర్దాక్షిణ్యంగా స్వతంత్రరాజ్యాలను ,అణిచివేసి, సామ్రాజ్య మధ్యభాగంలో స్వయంగా పరిపాలన సాగించినాడు. చిన్నచిన్న రాజ్యకూటాలు తలెత్తడానికి వీలులేకుండా చక్రవర్తి కనిపెట్టిచూస్తూ సామ్రాజ్య శాంతి భద్రతలు కాపాడినాడు. సామ్రాజ్యంలోఉన్న అల్ప రాజ్యాలమీద అధికారం నూటిగా చలాయించలేదు. రాజనీతిలో దక్షత కలవాడని పరిపాలనవల్ల తెలుస్తుంది.

వ్యక్తిత్వము సముద్రగుప్తుడు అశ్వమేధం ఆచరించి సమ్రాట్టు నని సామ్రాజ్యస్థితి తెలియబరచినాడు. యాగవేదికకు ముందున్న అశ్వచిహ్నపు సువర్ణముద్రలు ఈ విషయాన్ని స్పష్టంచేస్తున్నవి. ఆయన రాజధర్మాన్నిబట్టి విజిగీషువై ఆదర్శం సాధించినాడు. తూర్పున బ్రహ్మపుత్రమొదలు, పశ్చిమదిశ చర్మణ్వతి (చంబల్) యమునానదులవరకూ అతని రాజ్యం విస్తరించింది. ఖండఖండాంతరాలుకూడా అతని రాజనీతిజ్ఞతను అంగీకరించినవి. సముద్రుని బంగారునాణెములలో

ఆనాటి ముద్రానిర్మాణనైపుణి తేట తెల్లమవుతున్నది. నాణె ములమీద మూర్తినిబట్టి, చక్రవర్తి దీర్ఘకాయుడనీ, సమున్నతవక్షుడనీ, దేహసౌష్ఠవము, సుందరరూపముకలవాడనీ గ్రహించవచ్చును. ఆయన బహుప్రజ్ఞలు కలవాడు. ఒక పసిడినాణెములో చక్రవర్తి సింహాసనోపవిష్టుడై వీణావాదనం చేస్తున్నాడు. సర్వతోముఖ ప్రజ్ఞాశాలికి కవితా పాటవం కూడా వున్నట్లు ప్రయాగశాసనం చెబుతున్నది. ఆయనకు విద్వద్గోష్ఠి ప్రీతిపాత్రము. సనాతన ధర్మానుష్ఠానంచేసినా చక్రవర్తి సహానశీలా కలవాడుకనుక బౌద్ధాన్ని ఆదరించి నాడు. ఆయనమంత్రి వసుబంధువు బౌద్ధపండితుడు.

మరణం సముద్రుడు గతించినకాలం ఇతమిత్థమని చెప్పలేము. ఆయనకుమారుడు, ద్వితీయ చంద్రగుప్తుని తొలినాణెము క్రీ. శ. 380 నాటిది కనబడింది. కాబట్టి సముద్రునిమరణం బహుశ క్రీ. శ. 375 న సంభవమై ఉండవచ్చును.

ఆయన ప్రాచీన భారతేతిహాసంలో స్వర్ణయుగ సమారంభంచేసి, తనకు తీసిపోని పుత్రరత్నానికి రాజ్యం కట్ట బెట్టగా, ద్వితీయ చంద్రగుప్తుడు స్వర్ణయుగమును మహో జ్జ్వలముచేసి విక్రమాదిత్యుడై, గుప్తకులాలంకారమణియై భారతీయుల హృదయాన్ని చూరగొన్నాడు.

రామగుప్తుడు సముద్రగుప్తుని మరణానంతరం విచిత్రమైనగాధ జరిగినట్లు కొందరిమతం. విశాఖదత్తుని "దేవీ చంద్రగుప్త" మనే సంస్కృతనాటకంలో ఇతివృత్తమే చిత్రగాధ.

దేవీచంద్రగుప్తముల కథ సముద్రగుప్తుని అనంతరము అతని కుమారుడైన రామగుప్తుడు గుప్తరాజ్యానికి వచ్చినాడు. రామగుప్తునిభార్య ధృవాదేవి. శకరాజులతో తటస్థించిన యుద్ధంలో అతడు పట్టుబడినాడు. ప్రజలనుద్ధరించేనిమిత్తం శకరాజుతో ఒడంబడిక చేసికొన్నాడు. సంధిప్రకారం రామగుప్తుడు తనభార్యను శకరాజుకు సమర్పించవలసి వచ్చింది. అప్రతిష్టాకరమైన సంధినియమాన్ని చంద్రగుప్తుడు అంగీకరించక ధృవాదేవివలె వేషంవేసికొని అనగా "కామినీవేషగుప్తుడై". శత్రుశిబిరానికివెళ్ళి శత్రువధచేసినాడు. రామగుప్తునికీ చంద్రగుప్తునికీ వైరం ఏర్పడింది. రామగుప్తుడు తనను చంపదలచినట్లు తెలిసి భయపడి ఉన్మాదునివలె నటించాడట. ఏవోపద్ధతులు అవలంబించి, చంద్రగుప్తుడు అగ్రసోదరుడైన రామగుప్తుణ్ణి వధించి అతని రాజ్యలక్ష్మితో పాటు విగతభర్తృక అయిన ధృవాదేవిని వివాహమాడినాడు.

చరిత్రాధారంలేదు ఈ కథకు చరిత్రాధారంలేదు. సముద్రుని మరణానంతరం ద్వితీయ చంద్రగుప్తుడు రాజ్యానికి వచ్చినట్టు సమకాలికములైన ఆధారాలున్నవి. గుప్తకాలికనాణెములు చాలాలభ్యమైనవి. *ఎందరి చక్రవర్తుల నాణెములలో దొరికినవికాని రామగుప్తునిపేరుగల ఒక్కనాణెముకూడా లభ్యంకాలేదు. అసలు రామగుప్తుడనే రాజుగారి ఉనికి సంశయాస్పదమైంది. రాజ్యప్రాప్తికి భ్రాతృవధ చేయడానికి సాహ

---

* Altekar రచించిన Bayan Hoard of Gupta Coins చూడు.

సించే దుర్మార్గుడుకాడు చంద్రగుప్తుడు. అన్నభార్యను వివాహమాడడం హైందవధర్మశాస్త్రం సుతరాం అంగీకరించదు. ఏనీతీ ఏధర్మమూకూడా ఆమోదించదు. ఈ ఉపపత్తులవల్ల దేవీచంద్రగాథకు చారిత్రకాధారంలేదని చెప్పాలి.

రామగుప్తుని చారిత్రక సత్యత్వమును గురించి సిల్వెన్ లెవీ. ఆర్. సరస్వతి, ఆల్టేకర్, ఆర్. డి. బెనర్జీ, డాక్టరు డి. ఆర్. భండార్కరు, కె. పి. జయస్వాలు, వింటర్‌నిజ్, మిరాషీ, దాస్‌గుప్తవంటి చరిత్రకారులు విపులంగా చర్చించినారు.

ద్వితీయ చంద్రగుప్తుడు - సింహాసనారోహణం క్రీ. శ. 376—415.

సముద్రుని పుత్రులూ పౌత్రులూ ఎందరున్నా దత్తాదేవివల్ల జన్మించిన ద్వితీయ చంద్రగుప్తునినామము స్పష్టముగా చరిత్రలో తెలియవస్తున్నది. అతని నిజనామము దేవగుప్తుడు, దేవరాజు లేదా దేవశ్రీ చంద్రగుప్తుని రాణులు ధృవాదేవి, కుబేరనాగదేవీ నామములు సర్వజన విదితములు. చంద్రగుప్తునికి పరమభాగవత బిరుదం ఉండడంచేత వైష్ణవాభిమాని అని మనం తెలిసికోవచ్చును.

చంద్రగుప్తుడు పితృమరణానంతరం వెంటనే సింహాసనము అధిష్ఠించినాడు. సింహాసనారోహణం బహుశ క్రీ. శ. 380 లేదా క్రీ. శ. 376 కావచ్చును. 33 సంవత్సరాలు పరిపాలన చేసినాడు.

రాజనీతిజ్ఞత చంద్రగుప్తునికి సైనికతంత్రములో ప్రావీణ్యం తండ్రిద్వారా సంక్రమించింది. పశ్చిమదిశ ఆయన విజయ సన్నాహం చేసినాడు. శకరాజులు ఘూర్జరంలో, కథియవాడులో పరిపాలిస్తున్నారు. ఆయన, మంత్రిపరిషత్తూ బహుకాలం మాళవంలో మకాముచేసినట్లు, పశ్చిమరాజ్యాలతో సమరం చేసినట్లూ శాసనాలవల్ల తెలుస్తున్నది. భిల్సా సమీపంలో ఉదయగిరిశాసనం, శనకానీక మహారాజుగారి శిలాలేఖనం, ఆమ్రకార్దవుని సాంచీశాసనంవల్ల గ్రహించ గలము. శకాధిపతిఅయిన తృతీయ రుద్రసింహుడు చంద్రగుప్తునివల్ల *పరాజితుడై నిజరాజ్యం వదలుకొన్నాడు. క్రీ. శ. 5వ శతాబ్దంలో ప్రథమాబ్దంలో పశ్చిమ భారత దేశాన శకక్షత్రపులు పూర్తిగా చంద్రగుప్తునివల్ల ఓడి పోయినారు. మనదేశంలో వైదేశిక శత్రువులు నామరూపాలు లేకుండా పోయినారు.

ఘూర్జర సౌరాష్ట్రాలు గుప్తసామ్రాజ్యంలో విలీనం కావడంచేత గుప్తులు పశ్చిమఖండాలతో వాణిజ్యంచేసినారు.

నవరత్నాలు అనేక ఉపపత్తులవల్ల కాళిదాసాది నవరత్నములు ద్వితీయ చంద్రగుప్తుని ఆస్థానంలో విలసిల్లినట్లు చెప్పనలసి ఉంటుంది. గుప్తకాలిక సాహిత్యాన్ని గూర్చి ప్రత్యేక ప్రకరణంలో చూడండి.

---

* 310—319 శకవత్సర చంద్రగుప్త ముద్రలవల్ల.

మెహరాలీ శాసనంలో 'చంద్రుడు' చంద్రగుప్తుడా : ఢిల్లీలో కుతుబ్ మినారువద్ద మెహరాలీ శాసనం ఉన్నది. ఆ శిలాలేఖనంలో చంద్రుడనేరాజు అనేక సైనికవిజయాలు చేసిన మహా పరాక్రమశాలిఅని ఉన్నది. శాసనంలోని *చంద్రుడే చంద్రగుప్తుడని చాలామంది చరిత్రవేత్తలమతం. చంద్రుడూ చంద్రగుప్తుడూ ఒకడేఅయితే ద్వితీయ చంద్రగుప్తుడు పశ్చిమదిశలలో విజయపరంపరలు సాధించినవాడని చెప్పవలెను. మెహరాలీ శాసనాన్నిబట్టి వంగదేశంలో శత్రువులు చంద్రునివల్ల 'ఆహవనిర్జితులై' నారు. వంగదేశమనగా తూర్పు బంగాళమన్నమాట. అనగా సమతత ప్రాంతము. బంగాళములో శత్రువులు తిరుగుబాటు జరిగినట్లు, గుప్త చక్రవర్తి విప్లవాన్ని అణిచివేసినట్లు చరిత్రలో కనపడదు.

చంద్రుడు సింధునదీముఖాలనుదాటి ♦బాహ్లీకదేశమును జయించినాడు. బాహ్లీకమనగా హిందూకుష్ పర్వతాల వెనకవున్న బాల్ఖ్అనే ప్రాచీన బాక్ట్రియాదేశం. చంద్రగుప్తుడు బాహ్లీకదేశంలో కుషాణులను జయించి శత్రునిశ్శేషం చేసినాడని చెప్పవలెను. పశ్చిమమాళవం, ఘూర్జర సౌరాష్ట్రములు శకశాత్రవులను ఉన్మూలించి గుప్త

---

* "చంద్రాహ్వేన సమగ్రచంద్ర సదృశీ వక్త్రశ్రియం....." మెహరాలీ శాసనం. *

♦ "తీర్త్వా సప్తముఖాని యేన సమరే సింధోర్జితాః బాహ్లీకాః....." మెహరాలీ శాసనం.

సామ్రాజ్యములో కలుపుకొన్నాడు. సముద్రగుప్తుని ఏక చ్ఛత్రాధిపత్యవాంఛ ద్వితీయచంద్రగుప్తునివల్ల సఫలమైంది.

రాజనీతిజ్ఞత-వైవాహిక సంబంధాలు చంద్రగుప్త సమ్రాట్టు బలదర్పాలుగల పాలక రాజకుటుంబాలతో వైవాహిక సంబంధాలు నెరపినాడు. నాగకుటుంబానికిచెందిన కుబేర నాగాదేవిని అతడు పరిణయము చేసికొన్నాడు. వారిద్దరికీ జన్మించిన ప్రభావతీ గుప్తాదేవి. నాగజాతికీ గుప్తులకూ సఖ్యత యేర్పడ్డది. చంద్రగుప్తుడు ప్రభావతిని వాకాటకరాజైన ద్వితీయ రుద్రసేనుడికిచ్చి వివాహముచేసినాడు. నాగ ప్రాంతమూ, వాకాటకరాజ్యమూ చంద్రగుప్తునికి సాహాయ్యము చేయడంవల్ల శకకుషాణులను ఓడించగలిగినాము. వైవాహిక సంబంధాలు అతని రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తున్నవి.

కుంతలప్రభువైన కదంబవంశీయ కాకుత్థ్సవర్మ తన కుమార్తెలను గుప్తరాజులకిచ్చి పెళ్ళిచేసినాడని కదంబ శాసనం చెబుతున్నది. అయితే ద్వితీయ చంద్రగుప్తుడు కానీ అతనికుమారుడో కుమార్తెకానీ కదంబకన్యలను వివాహం చేసికొన్నాడని చెప్పడానికి ఆధారాలులేవు. గుప్త వంశీయులు ఎవరైనా కదంబులతో వియ్యమొంది ఉండవచ్చును.

బంగారునాణెములు - అతని వ్యక్తిత్వము ద్వితీయ చంద్రగుప్తుడు తండ్రికి తీసిపోకుండా సుందరాకృతి విశేషంగల బంగారు నాణెములను ప్రచురించినాడు. ఈ ముద్రలవల్ల అతని

సామ్రాజ్యవైభవం, శక్తిసంపన్నత విశదమవుతున్నవి. సింహవిక్రమ బిరుదముతోవున్న పసిడినాణెములు గమనార్హాములు. అతడు సింహాసమును వధిస్తున్నట్లు నాణెముపై ఉన్నది. సింహాలున్న గుజరాతును జయించాడని అది దాని భావమని కొందరంటారు. ఒకముద్దపై ఆసనోపవిష్టుడై చేతిలో కుసుమము ధరించినాడు. 'రూపాకృతి' అనేగాధ నాణెము మీద గోచరిస్తున్నది. ఈ నాణెములవల్ల అతడు రసికుడని సూచన.

కొత్తనాణెములు చంద్రగుప్తుడు ప్రవేశపెట్టినాడు. ఒకనాణెముపై అతడు నిలవబడినట్టున్నాడు. ఎడమచేయి కత్తిపిడిపై ఉన్నది. అతనిప్రక్కనే కుబ్జపరిచారకుడు ప్రభు శిరస్సునుమీద ఛత్రముపట్టినాడు. ఈ ఛత్రం అతని సార్వభౌమత్వానికి సంకేతం కావచ్చును.

ఫాహియాన్ప్రశంస క్రీ. శ. 400—411 వరకూ ఫాహియాన్ అనే చీనాయాత్రికుడు భారతదేశం పర్యటించి గ్రంథము చేసినాడు. ఆ గ్రంథములో రాజకీయవిషయాలులేవు. చంద్రగుప్తునిపేరేన కనపడదు. ఫాహియాన్ 'మధ్యదేశము'ను గురించి వ్రాసినాడు. ప్రజలు సుఖజీవనం గడుపుతున్నారనీ, న్యాయస్థానాలకు వెళ్ళవలసిన ఆవశ్యకత ఉండదోకాదనీ, మరణదండన శిక్షాస్మృతిలో లేదనీ వ్రాసినాడు. మధ్యదేశము చంద్రగుప్తుని రాజ్యమే కనక తత్కాలీన ప్రజాజీవితం సుఖమయమని తెలుస్తున్నది.

ద్వితీయ చంద్రగుప్తుడు తండ్రివలె లలితకళాసంస్కృతీ రంగములో చేసినకృషి నిరుపమానము.

ప్రథమ కుమారగుప్తుడు క్రీ. శ. 415—455. ప్రథమ కుమార గుప్తుడు చంద్రగుప్తసుతుడు. అతడు నలభై యేళ్ళు పరిపాలన చేసినాడు. కుమారగుప్తునికాలంలో గుప్తసామ్రాజ్యం మహోన్నతస్థితిలో ఉన్నది. అతడు ఘనసైనిక విజయాలు చేయకపోయినా, పితృపితామహ సంపాదిత సామ్రాజ్యమును సుష్ఠవంగా పరిపాలించినాడు. అశ్వమేధం ఆచరించి "మహేంద్రాదిత్య" బిరుదమును వహించినాడు. కుమారుని ఆదర్శవీరుడు కార్తికేయుడనే కుమారస్వామి.

కుమారగుప్తుని బంగారునాణెములు కుమారగుప్త మహేవల్లభుని బంగారునాణెములు మహారమణీయములై భిన్నరీతులలో ప్రచురింపబడినవి. ముద్రణ కళాసౌష్ఠవం నాణెములలో కన బడుతున్నది. కుమారగుప్త సమ్రాట్ ధనుర్ధారిగా, ఖడ్గ పాణిగా, అశ్వమేధ మహేంద్రుడై, ఆశ్వికుడై, సింహ విక్రముడై, వ్యాఘ్రపరాక్రముడై, మయూరవాహనుడై, *కార్తికేయుణ్ణి తలపింపచేసే మూర్తిసౌందర్యంతో, గజ వాహనుడై, ఛత్రధారిగా, వీణాపాణిగా, రాజ్ఞీసమేతుడై,

---

* శిఖివాహనుడైన కుమారునినాణెము. రఘువంశ శ్లోకాన్ని జ్ఞాపకం చేస్తున్నది. కాళిదాసునిమనసులో కుమారగుప్తుని మూర్తి స్మరణ వుండవచ్చును. "భూయిష్ఠమాసీత్ ఉపమేయకాంతిః మయూర పృష్ఠాశ్రయిణా గుహేన."—డాక్టర్. సి. శివరామమూర్తిగారి Numismatic Parallels in Kalidasa చూడు.

ఖడ్గహస్తుడై ఖడ్గమృగాన్ని వేటాడుతూ పన్నెండుతీరులుగా కనబడుతున్నాడు. ఈ ముద్రలవల్ల సామ్రాజ్యసంపద అమిత మనీ, శిల్పమూ చిత్రకళా పరమావధి ప్రాపించినవనీ చెప్పవచ్చును.

హూణధాటి శాసనాధారాలవల్ల కుమారగుప్తుని రాష్ట్ర పాలకులు సామంతాదుల పేర్లు తెలియవస్తున్నవి. పరిపాలనా సౌష్ఠవం ఉండేదని శిలాలేఖనాలవల్ల చెప్పవలసివుంటుంది.

కుమారుని పరిపాలనాంతంలో సామ్రాజ్యంలో శాంతి శత్రువుల దండయాత్రలవల్ల భంగమైంది. భీతరీ స్తంభ శాసనంవల్ల ఒకరిమతాన్నిబట్టి, వింధ్యప్రాంతీయ ఆటవికులు పుష్యమిత్రుడనేవాడి నాయకత్వాన సామ్రాజ్యం భిన్నా భిన్నంచేయడానికి దండయాత్ర చేసినారు. మరొకరి అభి ప్రాయాన్నిబట్టి హూణులనేపేరు శాసనంలో లేకపోయినా గుప్తసామ్రాజ్య వినాశనమునకు పూనుకొన్న శత్రువులు హూణులైఉంటారు. యువరాజైన స్కందగుప్తుడు శత్రు సంహారం చేయాలని "ఒకరాత్రల్లా కరుకురానేలమీద పరున్నాడ"నీ, చితికిన వంశాన్ని నిలవబెట్టినాడనీ, సమ కాలిక శిలాలేఖనంలో ఉన్నది. క్రీ. శ. 425 లో శ్వేత హూణులు కుషాణ ప్రాభవం నిశ్శేషంచేసి, కాబూలు కాపిశ మండలాలుదాటి, గాంధారం ప్రవేశించి, క్రీ. శ. 450 లో కుమారగుప్త మహీపతి వృద్ధుడైఉండగా, సామ్రాజ్య విచ్ఛేద నకు యత్నించినారు. స్కందగుప్తుని నాయకత్వాన గుప్తసేన

హూణులతో పోరాటంచేసింది. స్కందుడు గుప్తవంశాన్ని నిలవబెట్టినవాడైనాడు. అతడు రణావనిలో అవక్రవిక్రముడై ఉండగా రాజధానిలో వృద్ధకుమారగుప్తుడు శరీరం చాలించినాడు. విజయలక్ష్మీసనాథుడై స్కందుడు మాతృసన్నిధికి కృష్ణుడు దేవకివలె యశోగాధ చెప్పవచ్చినాడు. కుమారగుప్తుని మరణానంతరం స్కందగుప్తుడు సింహాసనం అధిష్ఠించినాడు.

కుమారుడే శక్రాదిత్యుడు హ్యూన్‌సాంగ్, ఇత్‌సింగులు నాలందా విద్యాపీఠస్థాపన శక్రాదిత్యుడనే గుప్తమహీపతికి ఆపాదించినాడు. శక్రాదిత్యుడు మహేంద్రాదిత్యునికి మరోపేరు. అనగా ప్రథమ కుమారగుప్త చక్రవర్తి నాలందా విద్యాలయ విహారానికి ప్రపథమ పోషకుడని తేలుతుంది.

స్కందగుప్త విక్రమాదిత్యుడు (క్రమాదిత్యుడు) సింహాసనారోహణం } క్రీ. శ. 455–467. స్కందగుప్తుడు గుప్తసింహాసనం అవలీలగా అధిష్ఠించలేదు. వారసులెవరో రాజ్యంకోసం కత్తులు దూసినారు. వారసులెవరో తెలియదు. జునాగఢ శాసనాన్నిబట్టి సామ్రాజ్యలక్ష్మి అన్యరాజకుమారులను తోసిరాజని స్కందుణ్ణి స్వయంగా వరించింది. అంతేకాక స్కందుని బంగారునాణెముమీద చక్రవర్తి ధానుష్కుడై ఉండగా, తనఅగ్రభాగాన గరుడధ్వజంఉండగా, కుడివైపు గజలక్ష్మి, తనవామహస్తాన పద్మమూ పాశమూ (రాజ్యచిహ్నాలు) కలిగి ప్రభువును వీక్షిస్తున్నది.

రాష్ట్రపాలన - సుదర్శనతటాకం స్కందుడు రాజుకాగానే రాష్ట్రాలకు పాలకులను నియమించినాడు. సురాష్ట్రంలో పాలకుడు పర్ణదత్తుడు నియోగింపబడినాడు. అతడు చక్రపాలితుడనే గిరినగర పురాధ్యక్షుని పుత్రుడు. ఈ ఇద్దరిపేర్లు సురాష్ట్రంలో గిర్నారుప్రాంత సుదర్శనతటాక పునర్నిర్మాణంవల్ల చిర స్థాయిగా నిలిచినవి. సుదర్శనతటాకం బాగుచేయించడంవల్ల వ్యవసాయానికి అమితంగా ఉపయోగపడింది. గుప్త మహీ పతి స్కందగుప్తుడు ప్రత్యేకశ్రద్ధ తీసికొన్నాడని తెలుస్తుంది.

నాణెములు సింహాసనం అధిష్ఠించిన వెంటనే స్కందుడు హూణులతో ఘోరంగా పోరవలసివచ్చింది. యుద్ధాలవల్ల కోశం క్రమంగా ఖాళీకావడం మొదలుపెట్టింది. అందుచేతనే విరివిగా బంగారునాణెములు, తండ్రినాటనలె ప్రచురించలేక పోయినాడు. నాణెములు కొన్ని చలామణీఅయినా వాటిలో సువర్ణం శుద్ధమైందికాదు. రజతనాణెములుమాత్రం విరివిగా చలామణీ చేసినాడు.

మాళవము వాకాటక నరేంద్రసేనుడు, మాళవప్రభువు గుప్త శాసనం శిరసావహించినాడని శాసనంవల్ల తెలియచేయ బడింది. అందుచేత మాళవం కుమారగుప్త సామ్రాజ్యంలో భాగంగా ఉన్నదా లేదా అనే విచికిత్స కలుగుతుంది. హూణులతోటి పోరాటాలున్నా మాళవం గుప్తసామ్రాజ్యం నుంచి విడిపడినా. సామ్రాజ్యం స్కందగుప్తుని పరిపాలనాంతం దాకా సుప్రతిష్ఠితంగానేఉంది. హూణులబారినుంచి సామ్రాజ్య

రక్షణ ఎలాచేసినాడో స్కందుడు? దీనికి సమాధానం *భీతరీలో విష్ణుధ్వజస్తంభశాసనం ఇస్తున్నది.

గుప్తసామ్రాజ్య పతనము స్కందగుప్తుని మరణానంతరం గుప్త సామ్రాజ్యచరిత కల్లోలంగాఉన్నది. హూణులధాటి అధిక మైనది. వైదేశికులయిన హూణులు భారతదేశంలో స్థావరం ఏర్పరచుకోగలిగినారు. వైదేశిక శాత్రవ సంక్షోభం గుప్త సామ్రాజ్య పతనకారణమని చెప్పవలసిఉంటుంది. ఇక్కడ పొందుపరిచిన వంశవృక్షమునుబట్టి గుప్త పతనగాథ గ్రహించ డానికి వీలవుతుంది.

ప్రథమ కుమారగుప్తుడు

స్కందగుప్తుడు — పూరుగుప్తుడు (పురగుప్తుడు)

స్కందగుప్తుడు — ద్వితీయ కుమారగుప్తుడు 473

పూరుగుప్తుడు — బుధగుప్తుడు, నరసింహగుప్తుడు

నరసింహగుప్తుడు — తృతీయ కుమారగుప్తుడు

తృతీయ కుమారగుప్తుడు — విష్ణుగుప్తుడు

పూరుగుప్తుడు స్కందగుప్తుడు సింహాసనం అధిష్ఠించడానికి ఆటం కంగావున్న శత్రువులలో పూరుగుప్తుడు ఒకడై ఉండ వచ్చును. స్కందుని సమకాలికుడై మగధను పూరుగుప్తుడు

* బెనారసుకు తూర్పున గాజీపూర్ మండలంలోది భీతరి.

పరిపాలించాడో లేదో స్పష్టంగా చెప్పలేము. స్కందుని అనంతరం పూరుడు రాజైనాడని చెప్పడం సమంజసం. క్రీ. శ. 473 లో ఒక కుమారగుప్తుడున్నాడు. అతడు స్కందుని పుత్రుడై ఉండవచ్చును. అతనిని పూరగుప్తుడు రాజ్య భ్రష్టునిచేసి ఉండవచ్చును. ఏదిఎలాఉన్నా వారిరాజ్య పాలనాకాలము మొత్తము పదేళ్ళుమించదు. అనగా క్రీ. శ. 477 వరకు. గుప్తసామ్రాజ్య విచ్ఛిన్నం ఆరంభమైందని చెప్పడానికి మాళవము గుప్తపాలననుంచి విడిపడడమేచాలు. బుధగుప్తుడు తిరిగి మాళవం గెల్చుకొన్నాడు.

బుధగుప్తుడు బుధగుప్తుని సామ్రాజ్యం మాళవంనుంచి బంగాళము వరకూ విస్తరించింది. సురాష్ట్రంలో మైత్రకులు స్వేచ్ఛా ప్రియులైనా క్రీ. శ. 545 దాకా గుప్తాధిపత్యం అంగీకరిస్తూ ఉన్నారు. సామ్రాజ్యంలో సామంతులు మండలేశ్వరులూ ప్రబలమైనారు. సామ్రాజ్యం నామమాత్రావశిష్టంగా ఉన్నది.

క్రీ. శ. 475—517 వరకూ హస్తి, సంక్షోభ నామకులైన పరివ్రాజక మహారాజులు గుప్తాధిపత్యం కొంతవరకు అంగీకరించినారు. క్రీ. శ. 500 లో బుధగుప్తుని అవసానం వల్ల గుప్తసింహాసనంకోసం పోరాటాలు ఆరంభమైనవి. క్రీ. శ. 506 లో వైశ్యగుప్తుడనేవాడు సమతత (తూర్పు బంగాళము), నాలందాలోనూ, క్రీ. శ. 510 లో భానుగుప్తుడు ఇరన్‌లోనూ సామ్రాజ్యకాంక్షితులైనారు. వైశ్యగుప్తుడు సామ్రాజ్యబిరుదము వహించి బంగారునాణెములు ప్రచురించినాడు. అతడు బుధగుప్తసుతుడు కావచ్చును.

వైశ్యగుప్త భానుగుప్తులు సామ్రాజ్యపు పశ్చిమభాగమును పరిపాలిస్తున్న భానుగుప్తుని ప్రబలయుద్ధంచేయగా, ఆ సంఘర్షణంలో గోపరాజనే సర్వసేనాధిపతి మరణించినాడు. అతని పత్ని సహగమనం చేసింది. ఈ యుద్ధం బహుశ హూణ రాజైన తోరమాణునితో సలిపినది కావచ్చును. యుద్ధ ఫలితంగా ఇరన్, మాళవములు హూణులబారినుండి విడిపడి స్వాతంత్ర్యం పొందినవి. అయితే భానుగుప్తుడిపేరు గుప్త రాజవంశావళిలో కానరాదు.

నరసింహగుప్త బాలాదిత్యుడు? క్రీ. శ. 500—550. భానుగుప్తుని కుమారుడూ, మనుమడూ పాలించినకాలము క్రీ. శ. 500-550 అంతరంలో భానుగుప్తకుమారుడు మరణించిన అనంతరం నరసింహగుప్తుడు పరిపాలించాడో లేదో, లేదా భానుగుప్తుని తరువాత పరిపాలనకు వచ్చినాడో స్పష్టంగా చెప్పలేము.

నరసింహగుప్తుడు బాలాదిత్యబిరుదము దాల్చినాడని నాణెములవల్ల తెలుస్తుంది. బాలాదిత్యుడు బౌద్ధధర్మ పోషకుడై నాలందాలో సంఘారామ నిర్మాణం చేసినాడు: హూణనాయకుడైన మిహిరకులుని పరాజితుణ్ణి చేసినాడు.

తోరమాణ, మిహిరకులులు హూణులు: ఇరణ్, కురప్రాంతాల్లో మహారాజ తోరమాణుని రెండు శిలాలేఖనాలు లభ్యమైనవి. తోరమాణపుత్రుడైన మిహిరకులుని శాసనం గ్వాలియరు దగ్గర దొరికింది. మిహిరకులునికి మిహిరగుల, మిహిరదత్త

నామాంతరాలున్నవి. తోరమాణుని ప్రస్తి క్రీ. శ. 778 నాటి జైనసాహిత్యం 'కువలయమాల' లో ఉత్తరాపథ పాలకుడని ఉన్నది. అతన్నిగురించి హ్యూన్‌సాంగ్ విపులంగా రచించినాడు. మిహిరకులుమ పరమక్రూరుడనీ, ప్రజలను పీడించాడనీ, బాలాదిత్యునివల్ల రాజ్యభ్రష్టుడైనాడనీ, రాజధాని శాకల (సయాల్‌కోట) నగరమనీ వ్రాసినాడు. కల్హణుని రాజతరంగిణి అనే కాశ్మీర రాజవంశచరితంలో తోరమాణ మిహిరకుల నామములు నస్తవి. అయితే రాజతరంగిణిలో చారిత్రక యూదార్థ్యము చాలాతక్కువ. కొన్నికారణాలవల్ల కొందరిమతప్రకారం తోరమాణ మిహిరకులులు హూణులు కారనీ వారు కుషాణాధిపతులనీ, హూణసేనలను నడిపించి నారనీ చెప్పవలసిఉంటుంది.

క్రీ. శ. 500 తరువాత తోరమాణుడు గాంధారం నుంచి బయలుదేరి మాళవందాకా విజయయాత్ర చేసినాడు. భానుగుప్తునివల్ల అతడు పరాజయం పొందడంవల్ల విజయం చిరస్థాయి కాలేదు. మిహిరకులుడు తండ్రివలె సామ్రాజ్య సంపాదనేచ్ఛతో విజయం సాధించినట్లు గ్వాలియర్ శాసనం వల్ల తెలుస్తున్నది. దీనికి ఆధారంగా హ్యూన్‌సాంగ్ వ్రాసిన (530 A. D.) గ్రంథంకూడా ఉన్నది. మిహిరకులుడు పారంపర్యంగా శైవుడు ; బౌద్ధద్వేషి. కొంతకాలంపాటు నరసింహగుప్త బాలాదిత్య ప్రభువునుకూడా సామంతుణ్ణి చేసికొన్నాడు. మౌఖరుల శాసనాలవల్ల ఆనంతర కాలీన గుప్త

శాసనాలవల్లా గుప్తసామ్రాజ్యం త్వరితంగా విచ్ఛిన్నం కావడం జరిగిందని తేలుతున్నది.

యశోధర్ముడు క్రీ. శ. 530—540. మాళవప్రభువునూ, బౌళికర వంశీయుడునూ అయిన యశోధర్ముని మందసోరు ప్రాంత సంస్కృత శాసనంవల్ల, ఆయన గుప్తహూణాదులుకూడా జయించనిరాజ్యాలు జయించిన మహావిజేతగా తెలుసుకో వచ్చును. (లౌహిత్య) బ్రహ్మపుత్రమొదలు పశ్చిమసముద్రం దాకా, హిమాలయాలనుండి మహేంద్రపర్వతందాకా సామంతులు యశోధర్ముని పాదారవిందాలకడ మోకరిల్లే వారట. అతడు మిహిరకులుని శక్తిహీనుణ్ణి చేసినాడు. 533—534 నాటి మందసోర్ శాసనంవల్ల యశోధర్ముడు మిహిరకులుని రూపుమాపినాడని తెలుస్తున్నది. హ్యూన్ సాంగ్ వ్రాతవల్ల మిహిరకులుణ్ణి నాశనంచేసినవాడు బాలాదిత్యుడు. మౌఖరులుకూడా హూణరాజనాశనానికి తోడ్పడ్డారు. బహుశ యశోధర్ముడూ బాలాదిత్యుడూ మౌఖరులూ కూటంగాఏర్పడి హూణప్రభువును ఉచ్ఛాలించి ఉండవచ్చును.

మిహిరకులుడు పరాజితుడుకాగానే శాకలరాజధానిలో అతనిసోదరుడు హూణసింహాసనం ఆక్రమించినాడు. మిహిరకులుడు కాశ్మీరంవెళ్ళి రాజసన్నిధిలో తలదాచుకొని కొన్నాళ్ళకు అతనిమీద ఎదురుతిరిగి కాశ్మీర సింహాసనం అధిష్ఠించినాడు. గాంధారం వశంచేసికొని, అక్కడ హూణ

రాజును వధించినాము. అన్యాయార్జితమైన రాజ్యసుఖం కల కాలం అతడు అనుభవించలేదు. క్రీ. శ. 542 లో చని పోయినాడు.

యశోధర్మ్మడు మహావిజేతగా మహారథుడై ఉత్తరా పథంలో గుప్తసామ్రాజ్యశక్తిని క్షీణింపచేసినాడు. అతని జీవితం సమగ్రంగా తెలియదు. క్రీ. శ. 550 దాకా గుప్త రాజ్యం ఉంటూనేఉన్నది. గుప్తాధిపత్యం వలభి (గుజరాత్) వంగదేశంలో ఇంకా సామంతులు అంగీకరిస్తూనే ఉన్నారు. గుప్తరాజుల్లో చివర ముగ్గురు రాజుల ప్రాభవం మగధకు తూర్పుభాగానే శేషించింది.

అనంతర గుప్తవంశాలు ఆనంతర గుప్తులు గుప్తసామ్రాట్టులకు సామంతులు. క్రమంగా వారు ప్రముఖులై మౌఖరులవలెనే స్వతంత్రులైనారు. గయాప్రాంతంలోని అఫ్‌సాఢ్ శిలా శాసనంవల్ల ఆనంతర గుప్త రాజవంశావళి విశదమవుతున్నది.

1. కృష్ణగుప్తుడు, 2. హర్షగుప్తుడు, 3. జీవితగుప్తుడు, 4. కుమారగుప్తుడు, 5. దామోదరగుప్తుడు, 6. మహాసేన గుప్తుడు, 7. మాధవగుప్తుడు, 8. ఆదిత్యసేనుడు.

గుప్తసామ్రాజ్యం క్షీణించగానే క్రీ. శ. 550 లో ఆనంతర గుప్తవంశీయులు స్వతంత్రులైనారు. ఈ రాజుల పేర్లలో 'గుప్త' శబ్దం సామాన్యంగా ఉన్నంతమాత్రాన వీరికీ గుప్తరాజులకూ రక్తసంబంధం ఉందని చెప్పడానికి వీలు లేదు. గుప్తులవంశమే ఆనంతర గుప్తవంశనామంగా పరిణ

మించినదని అనడానికి ఏఆధారమూలేదు. ఆనంతర గుప్తులకూ మౌఖరులకూ తరుచుగా యుద్ధాలు చెలరేగేవి. మొదటి రాజులిద్దరూ, కృష్ణ హర్ష గుప్తులు కేవలం మూలపురుషులుగా చెప్పవలసిందేకాని విశేషాలు వారినిగురించి తెలియవు. మూడవరాజు జీవితగుప్తుడు హిమవత్పర్వతప్రాంతంలో, సముద్రతీరభాగంలోనూ సమరాలు సలిపినాడు. బహుశః జీవితగుప్తుడు గుప్తసామంతుడై యుద్ధాలు చేసిఉండవచ్చును. అతని అనంతరం కుమారగుప్తుడు మౌఖరులలో నాలుగోరాజైన (క్రీ. శ. 554) ఈశానవర్మతో పోరి గెలిచినాడు. చితికిపోతున్న గుప్తసామ్రాజ్యం తరపున కాక పోయినా, తానుగానే సమరంసాగించి ఉండవచ్చును. అతడు ప్రయాగదాకా విజయయాత్రచేసి అక్కడ శరీరం చాలించినాడు. అనంతర గుప్తపంక్తి ప్రాభవం క్రీ. శ. సప్తమ శతాబ్దాంతందాకా అనగా హర్షవర్ధనునితరం చివరదాకా సాగింది. బహుశ కుమారగుప్తునికాలంలో మగధకు చైనీయ బౌద్ధపరివ్రాజకమండలి వచ్చినట్టున్నది. అనగా క్రీ. శ. 539 లో ప్రథమ లియాంగ్ చక్రవర్తి బౌద్ధుడు కావడంవల్ల పండిత పరివ్రాజకమండలిని భారతదేశానికి మహాయాన గ్రంథ సేకరణకై పంపినాడు. నాలందా బౌద్ధ సంస్కృతీకేంద్రంగా విరాజిల్లింది.

మౌఖరులు గుప్తరాజుల కాలంలో మౌఖరులలో రెండుశాఖలుండేవి. ప్రథమశాఖ గయాప్రాంతానికి చెందింది. తక్కిన

నిర్ణయం అస్పష్టం. ఉత్తరప్రదేశంలో గంగా గోగ్రానదీ మధ్యప్రాంతంలో అనగా జాన్‌పూర్, బారాబంకి మండలాల్లో ప్రాచీన మౌఖరవంశం వెలసింది. మౌఖరరాజులు మొదటిముగ్గురూ ఆనంతరగుప్త రాజకన్యలను పరిణయము చేసికొన్నారు. మహారాజబిరుదం వహించినారు. నాలుగోరాజు ఈశానవర్మ మహారాజాధిరాజ బిరుదం వహించినాడు. హూణరాజైన మిహిరకులనాశనంలో ఈశానవర్మకూడా కొంతవరకూ కారణభూతుడు. ఇతని నాణెములు తోరమాణుని ముద్రలవలె ఉంటవి.

మైత్రకవంశము భటార్కుడనేవాడు మైత్రకవంశ స్థాపకుడు. ఈ వంశీయులు సూర్యోపాసకులు కావడంచేత మైత్రకులైనారు. వారు సురాష్ట్రంలో ప్రాగ్దిశలో రాజ్యస్థాపన చేసినారు. వారిరాజధాని వలభీనగరం. గుప్తసామ్రాజ్యం పతనమవుతున్నప్పుడు మైత్రకులు స్వతంత్రులైనారు. క్రీ. శ. 770 వరకూ వారు పరిపాలించినారు. చివరకు సింధుప్రాంతం నుంచి అరబ్బులు దండయాత్రచేసి వలభీ నగరాన్ని భస్మ సాత్కృతం చేసినారు.

దక్షిణాపథ రాజకీయ చరిత్ర

శాతవాహన పరిపాలనానంతరం ఆభీరులు దక్షిణాపథ వాయవ్యభాగాన్ని, చూతులు దక్షిణాన్ని, ఇక్ష్వాకులూ, శాతవాహన వంశశాఖలు మధ్యభాగమునూ, పల్లవులు ఆగ్నేయదిశనూ విభజించుకొన్నారు.

పాతంజల మహాభాష్యాన్ని బట్టి ఆభీరులు వైదేశికులు. పురాణములనుబట్టి పదిమంది ఆభీరులు 67 సంవత్సరాలు ఆంధ్రుల తరువాత పరిపాలిస్తారని ఉన్నది.*

పశ్చిమ భారతదేశంలో ఆభీరులు శకసేనాధిపతులై ఉండేవారు. ఈశ్వరసేనుడనే ఆభీరుడు క్రీ. శ. 235–240 లో వంశస్థాపకుడు.

మహారాష్ట్ర కుంతలదేశాల్లో 'చూతులు' పాలించినారు. వారినాణెములూ, శిలాలేఖనాలూ ఉత్తరకన్నడంలో, చితాల్‌దుర్గ్, అనంతపురం, కడప, కాన్హేరీలలో లభ్యమైనవి. కొందరిమతం చూతులు సాతవాహనీయులని; మరొకమతం నాగజాతివారని, చూతులను పల్లవులు ఉన్మూలించినారు. ఇక్ష్వాకులు కృష్ణా గుంటూరు మండలభాగాలు ఏలినారు.

పల్లవులు పల్లవులు ఎక్కడివారని తర్జనభర్జనలు చెలరేగినవి. ప్రాచీన సిద్ధాంతాలు శ్రీ భావరాజు వేంకటకృష్ణారావుగారి **Early Dynastics of Andhra Desa** •అన్నగ్రంథమును పాఠకులు చూడండి. చరిత్రకారులలో భావరాజువారు పల్లవుల తొల్లింటి నివాసమును గురించి ప్రతిపాదించిన సిద్ధాంతము శాసనాలమీద ఆధారపడినది.

---

* మత్స్యపురాణము—(వేంకటేశ్వరప్రెస్)—

"సప్తషష్టిస్తు వర్షాణి, దషభీతాః తథైవచ
తేషూత్సన్నేషు కాలేన, తతః కిలకిలాన్నృపాః"

• పుటలు 135—147.

భవరాజు వేంకటకృష్ణరావుగారి సిద్ధాంతము లూయీ రైస్, రాయబహదూర్ వి. వెంకయ్య, డాక్టర్ కృష్ణస్వామి అయ్యంగారు, సి. రసనాయగం మొదలియార్, విన్‌సెంట్‌స్మిత్తు, డాక్టర్ కె. పి. జయస్వాలు, డాక్టర్ దుబ్రాయిల్ పండితులమతాలు *అసంగతాలుకాగా కృష్ణరావుగారిమతమే సహేతుకము ప్రమాణబద్ధము.

కాంచీపల్లవులు ఒక తెగ ఒకకూటముకాదు. వారిది వీరబ్రాహ్మణ కుటుంబము. క్షత్రజీవితము గడిపిన పల్లవ సువిశాఖుని సంతతివారు పల్లవులు కావచ్చును. భారద్వాజస గోత్రుడైన శూరబ్రాహ్మణునికీ నాగ లేక పల్లవస్త్రీకిన్ని సంభవించినవారు పల్లవులని చెప్పవచ్చును. స్కందశిష్యుని రాయకోట శాసనాదులనుబట్టి ♦మదనిఅనే అప్సరసకూ అశ్వత్థామకూ సంబంధము ఏర్పడిందని తెలుస్తున్నది. అశ్వత్థామ అవివాహితుడన్న విషయం అందరికీ తెలుసును. ఆయనకూ నాగకన్యకూ సంభవించిన గాంధర్వంవల్ల పల్లవ వంశారంభమైన దన్నమాట. భారద్వాజుడైన అశ్వత్థామ గోత్రమే అతనికుమారునికీ సంక్రమించడంవల్ల అతడు భారద్వాజ పల్లవుడైనాడు. ఈ పల్లవులు బ్రాహ్మణులనే విషయం కాశా కుడిశాసనంవల్ల తెలుస్తున్నది.

---

* E. I. V. పుట 49.

♦ అమరావతీ స్తంభశాసనం S. I. I. I 32. పుట 27. 6 వ శ్లోకము.

కొంకణ, ఆనర్తవాసులు పల్లవులు దక్షిణాపథంలో కొంకణము ఆనర్తములో నివాసం ఏర్పరచుకొన్నారు. వారు దక్షిణా పథానికి కుంతలము లేదా వనవాసిద్వారా వచ్చినారు. వారి భాష శాతవాహనులవలె సంస్కృత ప్రాకృతాలు. వనవాసికి వారు తరలివెళ్ళి వైజయంతీపురంలో స్థావరం ఏర్పరచు కోడానికిపూర్వం వారు బ్రాహ్మణులని అందరూ అంగీక రించినారు.

తొల్లింటి పల్లవరాజు, సింహవర్మ. గుంటూరు మండలంలో పల్నాడుతాలూకాలో అతని ప్రాకృత శాసనం దొరికింది. శాసనలిపి ఇక్ష్వాకుల శాసనలిపివలె ఉన్నది. సింహవర్మ తనసంతతి వారివలెనే భారద్వాజసగోత్రుడు. తరువాత రాజు స్కందవర్మ. మొదట అతడు యువరాజు, తరువాత 'ధర్మమహారాజాధిరాజై' నాడు. అగ్నిష్టోమ. వాజపేయ అశ్వమేధక్రతువు లాచరించినవాడు. కాంచీపురిని రాజధానిగా చేసికొన్నాడు. అతనిరాజ్యం ఉత్తరాన కృష్ణా నది, పశ్చిమాన అరేబియా సముద్రముదాకా విస్తరించింది.

ఆనంతర సాంప్రదాయాన్నిబట్టి వీరకూర్చుడనే తొల్లింటి పల్లవరాజూ, అతని నాగరాణీ రాజదండం స్వీక రించినారు. అనగా చూతులను జయించినారని చెప్పవలెను. స్కందవర్మకుమారుడు బుద్ధవర్మ. అతడు యువరాజు. అతనికీ, రాణిచారుదేవికీ బుధ్యంకురుడు జన్మించాడు. యువరాజైన బుద్ధవర్మ తండ్రికి చేదోడుగా పరిపాలనచేసినాడు. స్కందవర్మ

పరిపాలనాకాలం బహుశ క్రీ. శ. తివ శతాబ్దపు తుది భాగము. అప్పటికింకా ప్రాకృతం, రాజశాసనా ల్లేఖించ డానికి దక్షిణాపథంలో ఉపయోగించేవారు.

తరువాత పల్లవరాజు విష్ణుగోపునిపేరు సముద్రగుప్తుని దక్షిణ దిగ్విజయ యాత్రాసందర్భంలో వింటాము. సముద్రుము విజయయాత్ర చేసేపప్పుడు, విష్ణుగోపుడు కాంచీనగరంలో సామంతుడైన ఉగ్రసేనుడితోకలిసి, గుప్తచక్రవర్తిని ఎదిరించినాడు. విష్ణుగోపుడికి సమకాలికుమునూ్నా, సన్నిహిత బంధువునూ్నా అయిన కుమారవిష్ణువు (క్రీ. శ. 325—350) వంశారంభకారకుడైనాడు. అతనివంశీయులు క్రీ. శ. 500 దాకా పరిపాలించినారు. వారి శిలాశాసనాలన్నీ తామ్ర శాసనాలునూ్నా సంస్కృతంలో ఉల్లేఖింపబడినవి. ఈపల్లవరాజ వంశకాలనిర్ణయం సందేహాస్పదము. పల్లవులకు సమకాలీను లైన గాంగులవల్ల సుమారుగా కాలనిర్ణయం చేయవచ్చును.

(సంస్కృత శాసనాలు) పల్లవ వంశవృక్షము



శాసనాలన్నీ కాంచీపురినుండికాక ఇతర-చోట్లనుండి ప్రకటింపబడినవి. కొందరి అభిప్రాయాన్నిబట్టి కాంచీనగరం మీద పల్లవాధికారం పోయింది. ఇంకోమతాన్నిబట్టి పల్లవ వంశశాఖలు అన్యప్రాంతాల్లో పరిపాలిస్తున్నారని.

సాలంకాయనులు సముద్రగుప్త చక్రవర్తి ఆంధ్రదేశంలో విజయయాత్ర చేసేసందర్భంలో, వేంగీప్రభువైన సాలంకాయన హస్తివర్మ సామంతరాజన్యాన్ని సమాయత్తపరిచి, గుప్త సమ్రాట్టునునిరోధించినాడు. సాలంకాయన గోత్రజుడుకావడం వల్ల హస్తివర్మవంశం సాలంకాయన వంశమని పేరువచ్చింది. బృహత్ఫాలాయనులు పల్లవులు క్షీణిస్తున్నప్పుడు సాలంకాయనులు' లున్నతస్థితికి వచ్చినారు. వీరిమూలపురుషుడు దేవవర్మ. అతనికి ' భట్టారక ' బిరుదము ఉండడంచేత అతడు స్వతంత్రుడై ఉండవలెను. అతడు అశ్వమేధం ఆచరించినాడు. బ్రాహ్మణ ధర్మపోషణ చేసినాడు. అతనికీ హస్తివర్మకుగల బాంధవ్యం ఎలాంటిదో తెలియదు. వీరిది వృషభలాంఛనం.

హస్తివర్మ "అనేక సమరావాప్త విజయి" భూపరాజువారి మతాన్ని బట్టిచూస్తే, హస్తివర్మ సామంతకూటాన్ని సమాయత్తంచేసి *సముద్రగుప్తుణ్ణి ఎదుర్కొన్నాడు. దక్షిణాపథంలో కాంచీనగరపాలకుడు, విష్ణుగోపవర్మ, వేంగీపాలకుడైన హస్తివర్మలు

---

* వివరములకు Early Dynastics of Andhradesa by B. V. K. 372 వ పుట చూడుడు.

గుప్తచక్రవర్తిని నిరోధించగల వీరులు. ఏచోట గుప్తచక్ర వర్తిని దక్షిణాపథ రాజకూటం ఎదుర్కొన్నదో చెప్పలేము. డాక్టర్ జయస్వాల్ అనుకొన్నట్లు కొల్లేరుప్రాంతంలో లేదా వేంగీపురికి సమీపంలో సమరం జరగలేదు. జరిగిందని చెప్పడానికి ఆధారాలు లేవు.

హస్తివర్మ. అనుయాయులు

|

నందివర్మ I క్రీ. శ. 350-380

|

చండవర్మ 380—395

|

విజయనందివర్మ (లేక) వందివర్మ II 395—410.

|

విజయస్కందవర్మ 410—420

సాలంకాయనవంశంలో తుదివాడు విజయస్కందవర్మ. సాలంకాయన ప్రాభవం క్షీణించగా విష్ణుకుండిన రాజ వంశము తలయెత్తినది. విష్ణుకుండినులు బలవంతులు కావడం చేత సాలంకాయనులు క్షీణించినారు. సాలంకాయనులు బౌద్ధధర్మపోషకులు.*

* వివరములకు Early Dynastics of Andhradesa by B. V. K. 380—383 పుటలు చూడుము.

కళింగములో మాతర రాజవంశము 350—440

—: మాతర కులము :—

శక్తివర్మ I క్రీ. శ. 350-365

|

అనంతవర్మ 365

|

అనంతశక్తివర్మ (లేక) II శక్తివర్మ 365—394

|

చంటవర్మ 394—400

|

ఉమవర్మ 400—430

|

విశాఖవర్మ 430—440

క్రీ. శ. 1 వ శతాబ్దినుండి క్రీ. శ. నాలుగవ శతాబ్ది మధ్యభాగంవరకూ కళింగదేశచరిత్ర ఏమీ తెలియదు. సాతవాహనకాలంలో ఇక్ష్వాకుల కాలంలోనూ ఆంధ్రసామ్రాజ్యములో కళింగము ఒకభాగమై ఉండవచ్చును. ఇక్ష్వాకవంశపతనానంతరం కళింగరాజ్యంకోసం రాజులు ఘర్షణపడినారు. పముద్రగుప్తుని అలహాబాదు ప్రశస్తినిబట్టి కళింగరాజుల పేర్లు తెలుస్తున్నవి. వీరు గుప్తచక్రవర్తికి సమకాలికులు :—

1. పిష్టపురపాలకుడైన మహేంద్రుడు, 2. గిరికొట్టూరులోని స్వామిదత్తుడు, 3. ఏరండపల్లి (ఆముదాలవలస) లో దమనుడు, 4. దేవరాష్ట్రంలో కుబేరుడునూ వేంగీప్రభుడైన హస్తివర్మకు సామంతులు కావచ్చును. రాగోలు శాసనాలవల్ల శక్తివర్ముడనే మాతరగోత్రజుడు పిష్ఠపుర మహేంద్రుని

ఉన్మూలించి యావత్కళింగప్రభువైనాడు నాలుగవశతాబ్ది మధ్యంలో. ఇతని అనంతరం 5 గురు రాజులు క్రీ. శ. 440 దాకా పరిపాలించినారు.

మాఠరవంశం ఒక్కటే యావత్కళింగంమీద ఆధిపత్యం చలాయించగలిగింది. సాలంకాయన పతనంతోపాటు మాఠరులు విష్ణుకుండినులకు లొంగిపోయి క్షీణించినారు. విష్ణుకుండినసామ్రాజ్యంలో ప్రప్రథమం దక్షిణకళింగము చేరిపోయింది; అనగా ఆంధ్రరాజ్యంలో ఒకభాగంఅయింది.

విష్ణుకుండిన రాజవంశము

క్రీ. శ. 420 - 620.

ఆంధ్ర ఇక్ష్వాక సామ్రాజ్య పతనానంతరం క్రీ. శ. 5, 6 శతాబ్దాలలో యావదాంధ్రదేశాన్ని కళింగాన్ని విష్ణుకుండినులు సౌష్ఠవంగా పరిపాలించినారు. కె. వి. లక్ష్మణరావు గారు, డాక్టర్ కీల్‌హారన్, డాక్టర్ హుల్ట్‌‌‌

—• వంశవృక్షము •—

I మహామాధవవర్మ క్రీ. శ. 420-455

దేవవర్మ 455—458

రెండవమాధవవర్మ 458—488

బహుళ రాజ్యంఅపహరించినవాడు 495-500

(వాకాటకరాణివల్ల) I విక్రమేంద్రవర్మ 488-493

ఇంద్రవర్మ (లేక) ఇంద్రభట్టారకవర్మ 500-530

పేర్లుతెలియనికుమార్తె

విక్రమేంద్రవర్మ (లేక) II విక్రమేంద్రవర్మ 530-540

పేర్లుతెలియనికుమార్తె

గోవిందవర్మ 'విక్రమాశ్రయ' 540—546

III మాధవవర్మ 'జనాశ్రయ' 546—611

మంచణ్ణ భట్టారక

(భావరాజువారు పర్వసమ్మతంగా నిర్ణయించిన కాలనిర్ణయం.)

మొదటి మాధవవర్మ - వంశస్థాపకుడు క్రీ. శ. 420—455. మాధవ వర్మ రాజ్యానికి వచ్చేసరికి వాకాటక సింహాసనం *నరేంద్ర సేనుడనే చిన్నవాడధిష్ఠించినాడు. మాధవవర్మ వైదిక ధర్మ కర్మ దీక్షాపరతంత్రుడు. చక్రవర్తిగా రాజసూయాది మహా యాగాలు చేసినాడు. ♦ఆంధ్రదేశంలో పల్లవులను నాశనం చేసి, సాలంకాయన వంశనిర్మూలనం గావించి, ఆంధ్ర కళింగ రాజ్యాల్లో బలవంతులైన సామంతుల్ని వశం చేసికొని, రాజకీయంగా ఏకప్రభుత స్థాపించినవాడు కనుకనే రాజసూయం ఆచరించినాడు.

స్వర్ణయుగకారకుడు విష్ణుకుండినులకాలములో ప్రథమ మాధవ వర్మ స్వర్ణయుగకారకుడని చెప్పకతప్పదు. దక్షిణాపథాన ఏకచ్ఛత్రాధిపత్యం వహించి, ధర్మసంస్థాపనచేసిన మహా నీయుడు. అనంతకాలంలో అతడేచక్రవర్తి, మహోన్నతుడు. వాకాటకరాజులతో వైవాహిక సంబంధాలు చేసుకోడంవల్ల ఆంధ్రదేశానికీ ఉత్తరాపథ రాజవంశాలతో పొత్తుకుదిరింది. అనగా వాకాటక, విష్ణుకుండిన, కదంబ, గుప్తరాజ వంశాలు కలిసి పంచమశతాబ్ద మధ్యంలో హూణధాటిని నిరోధించ గలిగినవి.

---

* నరేంద్రసేనుడు ప్రభావతీ గుప్తాదేవికి మనుమడు.

♦ "ఊర్జితశ్రీ విష్ణుకుండి పార్థివోదితాన్వయతిలక సముద్భూత ఏకాదశ అశ్వమేధ ఆహవ భృతావభృత, జగత్కల్మషస్య, సహస్ర క్రతుయాజినః"— Ramatirtha Inscription.

వాస్తుశిల్పంలో "పల్లవశైలి" గా మారిన "ఆంధ్రశైలి" మాధవవర్మ పరిపాలనాకాలములో పల్లవశైలి వాస్తుశిల్పంలో ఏర్పడింది. నిజానికి ఇది విష్ణుకుండిన శైలి అనడం మంచిది. ఉండవల్లిలో గుహాదేవళములు, మొగలిరాజపురములో గుహాలయములు, నెల్లూరిమండలములో భైరవునికొండలో వాస్తునిర్మాణములలో విష్ణుకుండినశైలి గోచరిస్తున్నది. ఈ శిల్పశైలినే పల్లవులు అనుకరించినారు.

దేవవర్మ క్రీ. శ. 455-458 మాధవవర్మ అనంతరం దేవవర్మ విష్ణుకుండినరాజైనాడు. అప్పుడు పల్లవరాజైన మూడవ నరసింహవర్మ విష్ణుకుండినులమీద కసితీర్చుకోవలెనని దక్షిణాంధ్రముమీద దండయాత్ర చేసినారు. దేవవర్మ యుద్ధంలో పరాజితుడై హతుడైనాడు. కృష్ణాతీరంవరకూ దక్షిణాంధ్రదేశము పల్లవహస్తగతమైంది. సింహవర్మ కుమారుడైన త్రిలోచనపల్లవుణ్ణి దక్షిణాంధ్ర పాలకుణ్ణిగా నియోగించినారు. త్రిలోచనుడు అమరావతీ ధాన్యకటకములు ఆక్రమించినాడు. క్రీ. శ. 458 లో అప్పటినుండి ఆంధ్రదేశములో పల్లవరాజ్యం సుస్థాపితం చేయడానికి యత్నించినారు.

ద్వితీయ మాధవవర్మ క్రీ. శ. 458-488 పల్లవులు దక్షిణాంధ్రం ఆక్రమించి విష్ణుకుండిన రాజ్యనాశనానికి పూనుకొన్నప్పుడు మాధవవర్మ రాజైనాడు. పల్లనరాజు ఆకస్మికంగా చని పోవడంచేత మాధవవర్మ శక్తికూడ తీసికోగలిగినాడు. అదే అదను చూచుకొని పూర్వం కళింగంలో (దేవరాష్ట్రంలో)

సామంతులుగావున్న మాఠరులు స్వతంత్రులైనారు. మాధవ వర్మ తన పరిపాలనాంతంలో మాఠర రాజైన అనంతవర్మ్ణిని ఓడించి ఆధిపత్యం 480 లో పోగొట్టినాడు. క్రీ. శ. 470–485 లో వాకాటక విష్ణుకుండిన ప్రభుకూటము ఏర్పడి శత్రువులను ఎదుర్కొన్నారు. అదేసమయములో మాధవవర్మ దక్షిణాంధ్రంలో పల్లవుల ప్రాభవము పూర్తిగా పోగొట్టినాడు. పల్లవులకూ కదంబులకూ మధ్యయుద్ధాగ్ని ప్రజ్వరిల్లిన కారణంవల్ల, విష్ణుకుండినులు దక్షిణాంధ్రంతిరిగి జయించి, సుప్రతిష్ఠితం చేసికోగలిగినారు.

ప్రథమ విక్రమేంద్రవర్మ క్రీ. శ. 488—493. ద్వితీయ మాధవ వర్మ జనకుని సవతిసోదరుడైన ప్రథమ విక్రమేంద్రవర్మకు విష్ణుకుండినరాజ్యం సంక్రమించింది. *అనగా ప్రథమ మాధవ వర్మభార్య వాకాటక వంశసంజాత. వారిపుత్రుడు విక్రమేంద్రుడు. ఇతని అవసానంవల్ల వాకాటక విష్ణుకుండిన రాజవంశాలమధ్య ఘర్షణవచ్చింది. వాకాటక హరిసేనుడు యువకుడూ శక్తివంతుడూ కనుక మధ్యరాష్ట్రంలో కొంత, లాట, కుంతల, కళింగ, ఆంధ్రదేశాలలో వాకాటకాధిపత్యం క్రీ. శ. 492—502 మధ్యకాలంలో స్థాపించినాడు.

ఇంద్రభట్టారకవర్మ - వాకాటకరాజ్య
క్షీణదశ - విష్ణుకుండిన ప్రాభవం
} క్రీ. శ. 500–530. క్రీ. శ. 6వ శతాబ్దారంభంలో హరిసేనుని వాకాటకరాజ్యం క్షీణం క్షీణం కావచ్చింది. సామం

* వివరములకు Early Dynastics of Andhradesa by B. V. K. 483—484 పుటలు చూడుము.

తులు రాజ్యసీమల్లో స్వాతంత్ర్యులైనారు. ప్రథమ విక్రమేంద్ర పుత్రుడు, ఇంద్రభట్టారకవర్మడు మహాశక్తివంతుడై ఆంధ్ర దేశం మీద ఆధిపత్యం చలాయించిన వాకాటక హరిసేనుణ్ణి వధించి విష్ణుకుండిన సింహాసనం అధిష్ఠించినాడు. చిక్కుల శాసనాలవల్ల ఇంద్రభట్టారకవర్మడు అనేకవిక్రముడై శత్రు హస్తగతమైన విష్ణుకుండిన రాజ్యభాగం శౌర్యంవల్ల సము పార్జించినాడు.

అనేక సమర విజయుడు దీర్ఘకాలం పరిపాలనం చేసినాడు. అయితే యుద్ధక్రీడలో అతనికి విశ్రాంతిలేదు. అందుకే శాసనం ఇలా చెబుతున్నది !–" అనేక చతుర్దంత సమర సంఘట్ట ద్విరదగణ విపులవిజయస్య, చతురుదధి నృపతిమకుట మణిమయూఖ విచ్ఛురిత పాదాంబురుహ : " ఆయన పరమమాహేశ్వరుడు. ఆయన గొప్పతనం తెలిసికోడానికి పృథ్వీమూలుని గోదావరీ శాసనం ఉపకరిస్తుంది.

కళింగరాజైన ఇంద్రవర్మ రాజకూటాన్ని ఆయత్త పరచి విష్ణుకుండినులతో పోరాటంచేసినాడు. ఇంద్రభట్టారకుడు పరాజితుడైనాడు.

ద్వితీయ విక్రమేంద్రవర్మ క్రీ. శ. 530–540 ఇంద్రభట్టారకుని జ్యేష్ఠ కుమారుడు విక్రమేంద్రుడు రాజ్యస్వీకారం చేసిన వెంటనే గాంగరాజైన ఇంద్రవర్మనూ, తమకుసామంతుడై శాత్రవ కూటంలో చేరిన పృథ్వీమూలుణ్ణీ సమరంలో సంహరించి నాడు. కళింగదేశంలో తూర్పుగాంగవంశం కూలిపోయింది.

విక్రమేంద్రవర్మ చిన్నతనంలోనే రాజ్యభారం వహించి సక్రమంగా పాలించాడని చిక్కుళ్ళ శాసనం చెబుతున్నది.

విక్రముడుకూడా పరమమాహేశ్వరుడు.

గోవిందవర్మ–"విక్రమాశ్రయ" క్రీ. శ. 540–546 ఇతనికాలంలో విష్ణుకుండినరాజ్యం సుభిక్షంగా శాంతిసమృద్ధంగా ఉన్నది. ఈ పూరుశాసనాలవల్ల గోవిందవర్మ "శ్రీపర్వతస్వామి పాదానుధ్యాతుడు, పరమధార్మికుడు" అని తెలుస్తున్నది. గోహిరణ్యభూదానములు విరివిగాచేసిన కీలెరగనిచేయి గోవిందునిది! పొలమూరు శాసనంలోకూడా ఇతనిగుణకీర్తనం కనబడుతున్నది.

మౌఖరులతో ఘర్షణ క్రీ. శ. 6వ శతాబ్దిలో ఉత్తరాపథం, హూణులవల్ల సంక్షోభిస్తున్నప్పుడు, మౌఖరులు ఉత్తరభారత దేశంలోనూ, దక్షిణాపథంలో విష్ణుకుండినులూ విజృంభించినారు. విష్ణుకుండినులు తమ సామ్రాజ్యస్థైర్యం కూర్చుకొని. వ్యక్తిత్వం నిలుపుకోడానికి మౌఖరులతో ఘర్షణ పడవలసి వచ్చింది. క్రీ. శ. 544 లో మౌఖరరాజైన ఈశ్వరవర్మ గతించినాడు. విష్ణుకుండినులు మౌఖరులపై కత్తులు దూయడానికి సావకాశం లభించింది. జాన్‌పూర్ శాసనంలో మౌఖరులకు ఆంధ్రప్రభువుతో జరిగినసమరం ఉల్లేఖింపబడింది.

హరాహా, జాన్‌పూర్ శాసనాలు : విశేషాలు ఆంధ్రప్రభువు, అతని మిత్రులయిన శూలికరాజు, గౌడరాజు ఒకప్రబలకూటంగాచేసి,

కాబోయే మౌఖరరాజును, ఈశానవర్మను ఎదిరించినారు. శత్రువులను జయించేదాకా అతడు పైతృకమైన సింహాసనం అధిష్ఠించ లేకపోయినాడు. ఈశానవర్మ జయించిన 'ఆంధ్ర పతి' గోవిందవర్మడే! గోవిందుడు హతుడుకాలేదు. అత డాకస్మికంగా చనిపోయినాడు.

తృతీయ మాధవవర్మ "జనాశ్రయ" క్రీ శ.546-611 తృతీయమాధవ వర్మ చిన్నతనంలోపితృమరణానంతరం, విష్ణుకుండినసింహాసనా రోహణము చేసినాడు. పొలమూరు దానశాసనంవల్ల ఇలా తెలుస్తున్నది :- పశ్చిమచాళుక్య ద్వితీయపులకేశి, ఆంధ్ర రాజ్యాన్ని హస్తగతం చేసికొనేపర్యంతం, తృతీయ మాధవ వర్మ ఏలికగా ఉన్నాడు. ఇంతదీర్ఘకాల పరిపాలన సాగించిన విష్ణుకూడినప్రభువు ఇతడే. విష్ణుకుండిన కీర్తిచంద్రికలు వ్యాప్తి చేసిన వాడితడే.

గొప్పతనము క్రీ. శ. ఆరవశతాబ్దములో తృతీయ మాధవవర్మ సాటిలేని మేటిప్రభువు దక్షిణాపథంలో. సమకాలికుల్లో సర్వ శక్తివంతుడు, ప్రజ్ఞాశాలి, విపశ్చిన్మణి, విశేషధీమంతుడు రాజ్యతంత్రజ్ఞుడు, పొలమూరు తామ్రశాసనంలో చెప్పినట్లు "ఉశనసమాన రాజనీతివేత్త," పండితబ్రాహ్మణ, వృద్ధగురు యోగి 'జనాశ్రయుడు!

ఆంధ్రదేశంలోనేకాక ఉత్తరాపథంలోకూడా అతనిని ఎదిరించగల ఏలిక లేడు!

మహాకోసలరాజైన చంద్రగుప్తుడు తనకుమార్తెను మాధవవర్మకిచ్చి వివాహంచేసి, తన్మూలంగా కోసలాంధ్ర సంబంధం దృఢంచేసికొన్నాడు.

కళింగ యుద్ధము క్రీ. శ. 538 నాటి ఈపూరుశాసనాలను బట్టి క్రీ. శ. 594 పొలమూరు దానశాసనాన్నిబట్టి తృతీయ మాధవవర్మ కళింగయుద్ధంచేసి సమరాలలో నిమగ్నుడైనట్లు తెలుస్తున్నది. గాంగవంశరాజులు ఎప్పటికప్పుడు విష్ణుకుండిన రాజ్యనాశనం చేయాలని ప్రబలప్రయత్నాలు చేస్తూనే వచ్చినారు. ఆంధ్రసామ్రాజ్య విస్తరణం చూచి సహించలేక పోయినారు గాంగులు. ఇంద్రవర్మ నాటినుంచీ విష్ణుకుండిన గాంగరాజుల మధ్య వైరాగ్ని జ్వలిస్తూనేవచ్చింది. యావత్కళింగాన్నీ మాధవవర్మ హస్తగతం చేసికోదలచినాడు. ఇదేతరుణంలో శైలోద్భవరాజుకూడా కళింగంమీద కత్తులు దూసేసరికి, మాధవవర్మ కళింగాక్రమణకై యుద్ధసన్నద్ధుడైనాడు. క్రీ. శ. 611 లో మాధవవర్మ తూర్పు గాంగ రాజును రూపుమాపినాడు. కళింగం ఆంధ్రులకు వశమైంది.

మాధవవర్మ కీర్తి ఆంధ్రసాహిత్యంలో గోచరిస్తుంది. దూబగుంట నారాయణకవి, దగ్గుపల్లి దుగ్గనల ప్రబంధావతారికల్లో మాధవుని గొప్పతనం కీర్తింపబడింది.

విష్ణుకుండిన రాజ్యపతనం క్రీ. శ. 624 లో కుబ్జ విష్ణువర్ధన చాళుక్యుని పాలనతో విష్ణుకుండినరాజ్యం అంతరించింది. ఆ వంశములో చివరవాడు మంచణభట్టారకుడు. విష్ణుకుండినుల

పతనం, చాళుక్యుల సార్వభౌమత్వం యలమంచిలి తామ్ర శాసనంలో విశదమవుతున్నవి.

ఆంధ్రులచరిత్రలో గుప్తులకు సాటియైన విష్ణుకుండిన చక్రవర్తుల సముజ్జ్వలఘట్టం ముగిసింది.

వాకాటకులు

క్రీ. శ. నాలుగైదు శతాబ్దాల్లో బీరారు, మధ్యప్రదేశాల్లో రాజకీయంగా సాంస్కృతికంగా వాకాటక రాజవంశం ఔన్నత్యాన్ని గడించుకొన్నది. వాకాటులకూ గుప్తమహీపతులకూ విష్ణుకుండినులకూ కదంబులకూ సంబంధ బాంధవ్యాలు చాలా కలిసినవి. అజంతా గుహాకుడ్య చిత్రావళి, గుహాలయాలూ, వాకాటకుల కళాపోషణవల్ల ఆవిర్భవించినై. బీరారులోనూ మధ్యరాష్ట్రాల్లోనూ అనంతర శాతవాహన వంశీయుల పరిపాలన ముగిసినప్పుడు, ఔత్రపులు నిర్వీర్యులైనప్పుడు, అదనుచూచి వాకాటకులు విజృంభించినారు. పురాణమతరీత్యా వింధ్యశక్తి వంశస్థాపకుడు. అతని రాజధాని బీరారులో పురిక. అతని రాజ్యం వింధ్యాద్రిదాటి విదిశదాకా విస్తరించింది.

ప్రథమ ప్రవరసేనుడు క్రీ. శ. 280—340. ప్రథమ ప్రవరసేనుడు, వింధ్యాశక్తి సుతుడు రాజైనాడు. ఆ వంశంలో అతడొక్కడే చక్రవర్తి కాగలిగినవాడు. ఆయన నలుగురుకుమార్తెల నేల నాలుగుచెరగులా విజయపరంపరలు సాధించినదిట్టలు. మధ్య

రాష్ట్రాలూ, పశ్చిమాన పశ్చిమ క్షత్రపరాజ్యమూ వాకాటక రాజ్యంలో కలిసిపోయినవి. అతడు అశ్వమేధ మొదలైన యజ్ఞములు ఆచరించినాడు. కుమార్తెను రాజప్రతినిధులను చేయడంవల్ల చిక్కులు వచ్చినవి. దాయాదులకు కన్నెఱ్ఱగా ఉన్నది. అతని మనుమడు :

ప్రథమరుద్రసేనుడు క్రీ. శ. 340—365. కల్లోలపరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చింది. అతడు దాయాదుల కుతంత్రాలు విచ్ఛేదం చేసినాడు. భావనాగుడనేవాడు భారశివనాగ వంశీయునివల్ల రుద్రసేనుని మాతామహుడు. సర్వసేనుడనే మరొక దాయాదుడు వత్సగుల్మములో వాకాటక వంశ శాఖకు మూలపురుషుడైనాడు. రుద్రసేనసుతుడైన :

ప్రథమ పృథ్వీసేనుడు క్రీ. శ. 365—390. ద్వితీయ వింధ్యా శక్తికి, కుంతలదేశ విజయసందర్భములో సాహాయ్య మిచ్చి నాడు. పృథ్వీసేనపుత్రుడు, ద్వితీయ రుద్రసేనుడు గుప్త చక్రవర్తిఅయిన రెండవచంద్రగుప్తుని కుమార్తెను వివాహ మాడినాడు. రాణి ప్రభావతీగుప్త పరిపాలిస్తూవుండగా భర్త గతించినాడు. ఆమెతండ్రిఅయిన చంద్రగుప్త విక్రమాదిత్యు నికి మాళవ, ఘూర్జరదేశ సమరాల్లో సాహాయ్యం చేసింది. క్రీ. శ. 410 లో ఆమె ప్రథమపుత్రుడు చనిపోయినాడు. రెండవకుమారుడు, దామోదరసేనుడనే :

ద్వితీయ ప్రవరసేనుడు క్రీ. శ. 410—445 సింహాసనం అధిష్ఠించి నాడు. అతడు శాంతిప్రియుడూ, సాహిత్యోపాసకుడూ

కావడంవల్ల 'సేతుబంధ' మనే ప్రాకృతకావ్యరచన చేసినాడు. ప్రవరపురనిర్మాణం చేసినాడు. వైష్ణవమతాభిమాని. నందివర్ధనము ఆయన మొదటి రాజధానీనగరము.

నరేంద్రసేనుడు క్రీ. శ. 445—465. కదంబ రాజ్యకన్యను అజిత భట్టారికను పెళ్ళాడినాడు. నరేంద్రుడు రాజుకాగానే, నల వంశీయ నరపతిఅయిన భవదత్తవర్మ నందివర్ధనంమీద దాడి చేసి దుర్గాక్రమణం కావించినాడు. నరేంద్రుడు శత్రువును పారదోలినాడు. హూణులవల్ల గుప్తసామ్రాజ్యం కకావిక లవుతున్నప్పుడు, అవకాశంతీసికొని వాకాటకులు మాళవంలో కొంతమేర ఆక్రమించినారు. నరేంద్రపుత్రుడైన :

ద్వితీయ పృథ్వీసేనుడు ప్రధాన వాకాటక వంశశాఖలో చివర వాడు. అతడు నల, త్రైకూటక వంశీయులైన శాత్రవుల ధాటి నుంచి తలయెత్తుకొని, వాకాటక రాజ్యశ్రీని, సుస్థిరగా చేయయత్నించినాడు. అతని అనంతరం :

హరిసేనుడు క్రీ. శ. 480—515 అనే వత్స గుల్మ వాకాటక ప్రభువు ప్రబలుడైనాడు. ఆయన సామ్రాజ్యంలో ఘూర్జరం, మాళవము, దక్షిణకోసలము, కుంతలము విదర్భరాజ్యములు చేరినవి. క్రీ. శ. 515—550 అంతరములో వాకాటకులు క్షీణించినారు. చివరకు క్రీ. శ. 550 లో బాదామి చాళుక్యుల వల్ల వాకాటక రాజ్యశ్రీ శోభాదరిద్రాణ అయిపోయింది.

కదంబులు



సముద్రగుప్తుని విజయయాత్రానంతరం క్రీ. శ. 4 వ శతాబ్దిమధ్యలో పల్లవులు ఉద్భవించడానికి కదంబవంశము తలెత్తింది. ఆదికాలంలో శాసనాలు ప్రాకృతములోనూ,

ఆనంతరకాలిక శాసనాలు సంస్కృతములోనూ కనబడు తున్నవి. మానవ్యగోత్రజుడైన :

మయూరశర్మ కదంబకుల స్థాపకుడు. బ్రాహ్మణుడైనా శస్త్ర మునుచూపిన శూరుడు. పశ్చిమతీరంలో వైజయంతి ప్రాంతాల్లో క్రీ. శ. 345 లో ప్రభువైనాడు. అతనిసుతుడు కాంగవర్మ వాకాటకరాజైన ద్వితీయ వింధ్యాశక్తి ధాటికి నిలవగలిగినాడు. అయితే రాజ్యభాగం పోగొట్టుకొన్నాడు. కాదంబుల రెండవరాజధాని పాలాశికనగరం. కదంబులలో కాకుత్స్నవర్మ ప్రసిద్ధుడు. గుప్తవాకాటక పశ్చిమ గాంగ రాజవంశాలతో వియ్యమొందినాడు. క్రీ. శ. 450—475 అతనికుమారుడు శాంతివర్మ పల్లవులధాటిని ఎదిరించినాడు. అతనిసోదరుడు కృష్ణవర్మ పల్లవులతో సమరంలో ప్రాణాలు కోల్పోయినాడు. శాంతివర్మ సుతుడు మృగేశ్వరవర్మ పల్ల వులతోనూ, గాంగులతోనూ పోరాడి విజయులయ్యేసనాధు డైనాడు. అతనికుమారుడు, రవివర్మ కదంబుల సమైక్యతకు కారణభూతుడైనాడు. అతనికుమారుడు క్రీ. శ. 538 లో హరివర్మ బాదామి చాళుక్యప్రభువైన మొదటిపులకేశి దాడు లను ఎదుర్కొనవలసివచ్చింది. మొదటి పులకేశిపుత్రుడు, మొదటికీర్తివర్మ కదంబ వంశనాశనం చేసినాడు.

త్రైకూటకవంశము

ఉత్తరకొంకణములో అనగా అపరాంతములో త్రికూట పర్వతవాసులు కావడంవల్ల త్రైకూటకవంశనామం ఏర్పడింది.

శాసనాలనుబట్టి పశ్చిమతీరంలో కన్హేరీనుండి ఉత్తరాన సూరతు (శూర్పారక) వరకూ వీరు పరిపాలించినారు. వీరి నాణెముల శైలికూడా శ్రీ్రతపనాణెములను అనుకరించి నట్లున్నది. శ్రీకూటులు ఆభీరులపు ఆడిలో లోబడి ఉండేవారు.

చంద్రావళి శాసనాన్నిబట్టి ఆభీరులు శ్రీకూటులతో కదంబకుల మయూరశర్మతో ఘర్షణపడినారు.

శాసనాలు నాణెములవల్ల పంచమ శతాబ్దమధ్యలో ఇంద్రభట్టూ, అతనికుమారుడు ధారాసేనుడూ, అతనికొడుకు వ్యాఘ్రసేనుడునూ పాలకులని తెలుస్తున్నది.

మహారాజ ఇంద్రదత్తుడు క్రీ. శ. 5 మధ్యలో

|

మహారాజ ధారాసేనుడు 455

|

మహారాజ వ్యాఘ్రసేనుడు 489 (సూరత్ శాసనం)

కాలచుర్యులు కాలచుర్యులు హూణులవలె నై దేశికులు. క్రీ. శ. 6 వ శతాబ్దమధ్యమంలో వారు బలపంతులై ఉత్తర మహా రాష్ట్రము ఘూర్జర మాళవములను ఆక్రమించినారు. ఆరో శతాబ్ది తుదిభాగములో బాదామి చాళుక్యులు కాలచుర్యుల మీద ధాటిచూపినారు. క్రమంగా క్రీ. శ. 9 వ శతాబ్దిలో జబల్‌పుర ప్రాంతములో కాలచుర్యులు తలయెత్తినారు.

కృష్ణరాజు - శంకరగణ శిలా లేఖనాలవల్ల కృష్ణరాజు శంకర గణుడు, బుద్ధరాజుల విషయం తెలుస్తున్నది. అందరూ మాహేశ్వరులు. చాళుక్యరాజైన మంగళేశుడు క్రీ. శ.

597—610 కాలచుర్య బుద్ధరాజును జయించినాడు. క్రీ. శ. 681—696 లో చాళుక్య వినయాదిత్యుడు కాలచుర్యులను పరాజితులను చేసినాడు.

తూర్పుగాంగులు క్రీ. శ. 5 వ శతాబ్దములో కళింగచరిత్రలో పిష్ఠపుర రాజులకూ మధ్యకళింగప్రభువులకూ కళింగాధిపత్యం కోసం వైరం ఉండేది. దక్షిణ, మధ్యకళింగాధిపతులు ఆధిపత్యంకోసం కత్తులు నూరుకొంటున్నతరుణంలో, శ్రీకాకుళ మండలంలో తూర్పు గాంగరాజవంశం ప్రాదుర్భవించింది. ఆదిగాంగవంశము మైసూరును పాలించింది. తూర్పుగాంగులు బహుశ ప్రాచీన గాంగశాఖయులే కావచ్చును. తూర్పు గాంగరాజధాని ప్రస్తుతం శ్రీకాకుళమండలంలోని ముఖలింగము. ముఖలింగానికే కళింగనగరమని ప్రాచీననామము. గాంగుల రెండవరాజధాని దంతపురము. వారు గోకర్ణేశ్వరారాధకులు.

తూర్పు గాంగవంశస్థాపకుడు మొదటిఇంద్రవర్మ క్రీ. శ. 496—535. అతడు త్రికళింగాధిపతి అని శాసనములు చెబుతున్నవి. అనగా వేంగీ కళింగరాజ్యాధిపతి కావచ్చును. రాజసింహ రణభీత బిరుదాంచితుడైన హస్తివర్మ మహారాజుగా క్రీ శ. 575 లో వచ్చినాడు. అతనిసుతుడు రెండవ ఇంద్రవర్మ రాజైనాడు. అతడు పరమ మాహేశ్వరుడు. అతని అనంతరం క్రీ. శ. 624 లో మూడవ ఇంద్రవర్మ కళింగరాజైనాడు. ఇంద్రవర్మ విష్ణుకుండినరాజైన ఇంద్ర

వర్మను జయించినాడు. నాల్గవ ఇంద్రవర్మ క్రీ. శ. 650 లో కళింగాధిపతి అయినాడు.

తరువాత పరమ మాహేశ్వర, మహారాజ దేవేంద్ర వర్మ నిజశౌర్యంవల్ల ప్రతికళింగాధిపతి కాగలిగినాడు. ఆయన కుమారుడు అనంతవర్మ క్రీ. శ. 700 లో ప్రభువైనాడు. అనంతవర్మసుతుడు నందవర్మ క్రీ. శ. 717 లో కళింగేశ్వరుడైనాడు.

తూర్పు గాంగుల చరిత్ర క్రీ. శ. 11 వ శతాబ్దాంతం దాకా శాసనాలవల్ల తెలియవస్తున్నది.*

బాదామి చాళుక్యులు సాతవాహన సామ్రాజ్య పతనమైన అనంతరం, దక్షిణాపథంలో రెండుశతాబ్దాలపాటు అనగా క్రీ. శ. 8 వ శతాబ్ది మధ్యకాలందాకా బాదామి చాళుక్యులు తమ సామ్రాజ్యము నిలుపుకోగలిగినారు. చాళుక్యపతనంతో హైదరాబాద్ ప్రాంతంలో మాన్యఖేట . రాష్ట్రకూటులు మహోన్నతికి వచ్చినారు.

చాళుక్యవంశస్థాపకుడు, ప్రథమపులకేశి క్రీ. శ. 543-541 లో అశ్వమేధము చేసినాడు. ఆయన కుమారుడైన ప్రథమకీర్తివర్మ వనవాసిలో కదంబులతో, కొంకణములోని మౌర్యులతో, నలవంశీయులతో యుద్ధాలు ఉధృతంగా సాగించి, చాళుక్యరాజ్యాన్ని విస్తృతము చేసినాడు. కొంకణ

* వివరములకు Age of Imperial Kanoaj—Edited by K. M. Munshi Vol IV 139—144 పుటలు చూడు.

(గోవా) విజయంవల్ల రేవతీ ద్వీపం లభించింది. క్రీ శ. 597-598లో కీర్తివర్మ గతించగా ఆయనకుమారుడు, ద్వితీయ పులకేశి పసివాడు కావడంచేత మంగళీశుడు బాలరాజుకు రక్షకుడై పరిపాలన చేసినాడు. పులకేశి పెద్దవాడైనాడు. అతనికి మంగళేశుడు రాజ్యం అప్పగించలేదు. క్రీ శ. 609-610 లో పులకేశి వాణ్ణివధించి ప్రభువైనాడు.

రెండవ పులకేశి విజయపరంపరలూ, బాదామి చాళుక్యవంశ చరిత్ర సమగ్రంగా ఐహోలుశాసనంవల్ల తెలుస్తున్నది. పులకేశి దక్షిణకన్నడంలోని "ఆలుపు"లను, వనవాసిలో కదంబులను, తలకాడలోని గాంగులును, లొంగదీసికొన్నాడు. గాంగరాజైన దుర్వినీతుని పుత్రికను వివాహము చేసికొన్నాడు. ఉత్తరకొంకణాన్ని, ఎలిఫెంటా ద్వీపాన్ని వశంచేసికొన్నాడు. చాళుక్యరాజ్యపు ఉత్తరసీమ మాహీనదీతీరందాకా వ్యాప్తమైంది. లాట, ఘూర్జర మాళవులు స్వయంగా పులకేశికి వశం వదులైనారు. హర్షవర్ధనచక్రవర్తి దక్షిణాపథ జిగీషతో నర్మదాతీరానికి విచ్చేసినాడు. పులకేశి హర్షుని పరాజితునిచేసి గజయూథాన్ని వశంచేసికొన్నాడు. నర్మదానది హర్ష సామ్రాజ్యానికీ, చాళుక్యరాజ్యానికీ సీమగా ఏర్పడింది. పులకేశి ప్రాగ్దిశదిగ్విజయ యాత్రచేసినాడు. దక్షిణకోసలము కళింగము, పిఠాపురమునూ అతని హస్తగతమైనవి. కొల్లేరు సరస్సు సమీపంలో పులకేశి విష్ణుకుండినులతో మహాయుద్ధం చేసి జయలక్ష్మి సనాథుడైనాడు.

విష్ణుకుండిన రాజ్యానికి దక్షిణంగా పల్లవరాజ్యం క్రమంగా బలిష్ఠమవుతున్నది. పల్లవరాజైన ప్రథమమహేంద్ర వర్మ, రెండవ పులకేశి సమరధాటిని ఎదురోక్కవలసివచ్చింది. కాంచీపురి సమీపంలో సమరం జరిగింది. పల్లవుల ఉత్తర రాష్ట్రాలు పులకేశివశమైనవి.

క్రీ. శ. 631 లో విష్ణువర్ధనుడనే సోదరుణ్ణి ఆంధ్ర దేశానికి తనతరఫున రాజప్రతినిధిని చేసినాడు. ఈ యేర్పాటు వల్ల వేంగీచాళుక్య రాజవంశం ప్రాదుర్భవించింది. తూర్పు చాళుక్యులకు ఏలూరు ప్రాంతంలో వేంగిరాజధానిగా ఏర్పడింది. అయిదు శతాబ్దాలపాటు వారు పరిపాలించినారు. క్రీ. శ. 625-626 లో పులకేశి పారసీకప్రభులైన రెండవ ఖుస్రూ దగ్గరకు రాయబారం పంపినాడు. అతడు పల్లవుల మీద రెండోపర్యాయం సమరధాటి చూపినాడు. మహేంద్ర వర్మ కుమారుడు ప్రథమనరసింహవర్మ పల్లవరాజుగానున్నాడు. నరసింహవర్మ తరుణము చూచి చాళుక్యరాజ్యంమీద సమరం సాగించి బాదామిపురీకాంతను పట్టుకొన్నాడు. క్రీ. శ. 642 లో పులకేశి రణావనిలో కర్మఫలం అనుభవించి గతించినాడు. బాదామినగరీ పురంధ్రి పల్లవనాథునకు చిక్కింది: చాళుక్య రాజ్యం విచ్ఛిన్నంకాకుండా పులకేశి కుమారుడైన ప్రథమ విక్రమాదిత్యుడు రణవ్యవసాయం చేసినాడు. విక్రమునికి సాహాయ్యంగా గాంగదుర్వినీతుడు నిలవబడినాడు. విక్రముడు సోదరులతో పోరాటంచేసి విజయం సాధించినాడు. పులకేశికి

సామంతులైనవారిని లొంగదీసికొని చాళుక్యరాజ్య సమైక్యత క్రీ. శ. 655 లో స్థాపించినాడు. అతనిసోదరుడు జయసింహుడు లాటదేశంలో రాజప్రతినిధిగా నియమింపబడినాడు.

వినయాదిత్య విజయాదిత్యులు విక్రమాదిత్యుని అనంతరం క్రీ.శ. 681-696 లో వినయాదిత్యుడు చాళుక్య మహీవల్లభుడైనాడు. అతని బిరుదములు 'శ్రీపృథ్వీవల్లభుడు', 'సత్యాశ్రయుడు', 'యుద్ధమల్లుడు'. అతడు పల్లవ, కలభ్ర, కేరళ, హైహాయ, విల, మాళవ, చోళ, పాండ్య, అలూప, గాంగరాజులను జయించినట్లు శాసనాలవల్ల తెలుస్తున్నది. కుమార విజయాదిత్యుడు ఉత్తరాపథ జిగీషతో సేనానీకంతో సమరయాత్ర చేసినాడు. కాని అతడు శత్రుకోటికి చిక్కినపుడు వినయాదిత్యుడు చనిపోయినాడు.

విజయాదిత్యుని పాలన శాంతంగా సాగింది. బీజపుర మండలంలో పట్టాడకక్కళంలో శిల్పకళాశోభితంగా సంగమేశ్వరాలయం నిర్మించినాడు. జైనాభిమానిగా కనబడుతున్నాడు.

ద్వితీయ విక్రమాదిత్యుడు క్రీ. శ. 734-745. విజయాదిత్యసుతుడు, విక్రమాదిత్య ద్వితీయుడు చాళుక్య మహీపాలుడైనాడు. అతడు సత్యాశ్రయ, పృథ్వీవల్లభ బిరుదావళీ విరాజితుడు. ఆయన పట్టపుదేవి, లోకమహాదేవి పట్టాడకక్కళములో శిల్పకళాసౌష్ఠవంగా విరూపాక్షాలయం కట్టించింది. ఇలాఉండగా పల్లవులతో వైరం తిరిగి జాజ్వల్యమైంది. విక్రమాదిత్యుడు

సారకనాముడై పల్లవరాజైన ద్వితీయ నందివర్మను పార
దోలి, కాంచీపురిని గ్రహించి, రసికుడు కావడంచేత నగరిని
అనుగ్రహించి, లభ్యమైన సువర్ణరాశిని రాజసింహేశ్వరాది
దేవాలయాలకు భక్తిపూర్వకంగా బహూకరించినాడు!
అతడు పాండ్యులప్రాభవం క్షీణింపచేసినాడు. పల్లవరాజ్యశ్రీని
హరించడంలో చాళుక్యప్రభువుకు అండగా కుమారుడు,
యువరాజైన ద్వితీయ కీర్తివర్మకూడా ఉన్నాడు. విక్ర
మాదిత్యునికాలంలో మ్లేచ్ఛులు సమరనాటికూపగా వారిని
ఉత్తరరాష్ట్ర రాజప్రతినిధి పారదోలినాడు.

కీర్తివర్మ (క్రీ. శ. 745—757. కీర్తివర్మ సత్యాశ్రయ, నృప
సింహవల్లభ బిరుదావళీ భూషితుడు. అతని పాలనాకాలంలో
చాళుక్యరాజ్యము చెల్లాచెదరైనది. రాష్ట్రికూటరాజు, దంతి
దుర్గుడు క్రీ. శ. 742 వరకు చాళుక్యసామంతుడై, క్రీ. శ.
754 నాటికి చాళుక్య రాజ్యలక్ష్మిని హరించినాడు. దంతి
దుర్గుని మరణానంతరం శత్రుహస్తాల్లోచిక్కిన చాళుక్య
రాజ్యలక్ష్మిని బంధముక్తనుచేయ యత్నించినాడు. రాష్ట్ర
కూటకృష్ణుడు I చాళుక్యరాజును పరాజితుని చేసినాడు.

తూర్పుచాళుక్యులు బాదామి చాళుక్య ప్రభువైన రెండవపులకేశి
క్రీ. శ. 631 లో సోదరుడైన కుబ్జ విష్ణువర్ధనునితోకలిసి
తూర్పుతీరానఉన్న రాష్ట్రములు జయించినాడు. క్రీ. శ.
617 లో కుబ్జ విష్ణువర్ధనుడు రాజప్రతినిధిగా సతారా నాశిక
మండలాల కుండేవాడు. పులకేశి తనరాజధానికి వెళ్ళిన

తరువాత విష్ణువర్ధనుడు స్వతంత్రుడైనాడు.* అనగా విశాఖ మండలము మొదలు నెల్లూరిసీమదాకా తూర్పుతీరప్రాంతం వరకున్న తూర్పు చాళుక్యరాజ్యానికి అధిపతిఅయినాడు. ఆయన పట్టపురాణి అయ్యనమహాదేవి విజయవాడలో జైనాలయానికి దానంచేసింది. వేంగీరాజ్యాన్ని విష్ణువర్ధనుడు 18 ఏళ్లు పరిపాలించినాడు. మొదట .అతని రాజధాని పిష్ఠపురము (పిఠాపురము); అనంతరం అతని రాజధాని వేంగి.

మొదటి విష్ణువర్ధనుని పుత్రుడు మొదటి జయసింహుడు క్రీ. శ. 633 లో రాజైనాడు; ముప్పదేళ్లు పాలించినాడు. పల్లవులు రెండవ పులకేశిని ఓడించి అతని దక్షిణరాష్ట్రాలు క్రీ. శ. 642 లో ఆక్రమించినారు. జయసింహుడు తనవాళ్ళకు సాహాయ్యము చేసినట్లు కనబడదు. అతనికుమారుడు ఇంద్రవర్మ క్రీ. శ. 663 లో ప్రభువైనాడు. అతని తరువాత కుమారుడు రెండవవిష్ణువర్ధనుడు క్రీ. శ. 663—72 దాకా చాళుక్య సింహాసనం అధిష్ఠించినాడు. అతని తరువాత అతనిపుత్రుడు విజయసిద్ధి అనే మంగి యువరాజు సర్వలోకాశ్రయ బిరుదాంచితుడు. క్రీ. శ. 672—96 దాకా పరిపాలించినాడు. అతనిపిమ్మట రెండవ జయసింహుడు క్రీ శ. 696—709 దాకా పాలించినాడు. అతని మరణానంతరం కొక్కిలి విక్రమాదిత్యుడు రాజ్యం హరించి

---

* కొప్పరందా వకాసన.

నాడు. అతన్ని తోసిరాజని మూడో విష్ణువర్ధనుడు రాజై క్రీ. శ. 709—16 వాకా రాజ్యంచేసినాడు. అతని అనంతరం ప్రథమ విజయాదిత్యుడు క్రీ. శ. 716 నుండి 764 దాకా రాజ్యమేలినాడు. ఆయన పాలిస్తున్నప్పుడు రాజకీయంగా దక్షిణాపథంలో మార్పులు వచ్చినవి. అష్టమశతాబ్దమధ్యంలో బాదామి చాళుక్య రాజవంశమును రాష్ట్రికూటులు క్షీణ ప్రాయంచేసినారు. తూర్పు చాళుక్య రాజవంశ ప్రాబల్యం కూడా వాళ్ళవల్లనే తగ్గిపోయింది. చాళుక్యులకూ రాష్ట్రికూటులకూ తరతరాలపాటు యుద్ధాలుసాగినవి.*

హర్షవర్ధనుడు - స్థానేశ్వరరాజ్యము స్థానేశ్వరరాజ్యారంభము గూడ ముగా ఉన్నదేకాని విశదముగాలేదు. మహాకవి భట్టబాణుని హర్షచరిత్రనుబట్టి శ్రీకంఠదేశంలో స్థాణ్వీశ్వరము పట్టణమూ మండలమూ కావచ్చును. తన్నగరరాజ్యస్థాపకుడు, పుష్ప భూతి. అతని విషయం పుక్కిటి పురాణంగా హర్షచరితంలో కానవస్తున్నది. స్థానేశ్వరచరిత్ర ప్రభాకరవర్ధనుడితో ఆరంభ మవుతుంది. రాజముద్రికలవల్ల శిలాలేఖనాల మూలముగా వంశవృక్షము తెలియవస్తున్నది.

---

* వివరములకు Age of Imperial Kanoaj Edited by K. M. Munshi 132—138 పుటలు చూడు.



భట్టబాణుని హర్షచరిత్రనుబట్టి బాణుసి హర్ష చరిత్రవల్ల ప్రభాకర వర్ధనునికి ప్రతాపశీలుడనే నామాంతరమున్నది. ఆయనకు కృష్ణుడనీ, రాజ్యశ్రీ అనేకుమారుడూ కుమార్తె ఉన్నారని తెలుస్తున్నది. హర్షునికి సమకాలికుడైన బాణభట్టరచనలో ప్రభాకరవర్ధనుని సింహాసనారోహణంతో స్ఫుటంగా స్థాణ్వీశ్వరచరిత్ర విశదమవుతున్నది. అతడు "హూణ హరిణ కేసరి, సింధురాజజ్వరము, ఘూర్జర ప్రజాగరుడు, గాంధార్ధిపగంధద్విప కూటపాకలుడు, లాట పాటవపాటచరుడు, మాళవ లక్ష్మీలతా పరశువు" అనే బాణుని కవితారూప వర్ణనవల్ల ప్రభాకరుడు హూణులనూ, సింధు, ఘూర్జర, గాంధార, లాట మాళవ రాజులను పరాజితులను చేసినాడని గాని భేదించినాడనిగాని చెప్పవలసి ఉంటుంది. హూణులను జయించేనిమిత్తం అతడు జ్యేష్ఠుణ్ణి రాజ్యవర్ధనుణ్ణి ఉత్తరాపథానికి పంపినాడు. ఫలితం తెలియరాదు. హూణులకూ అతనికీ స్థాణ్వీశ్వరప్రాంతంలో పోరుజరగలేదు. తండ్రి మరణశయ్యలో

ఉన్నాడనివినినిజరాజధానికివచ్చినాడు రాజ్యవర్ధనుడు. బాణుడు 'హూణ హరిణకేసరి' గా ప్రభాకరవర్ధనుణ్ణి చిత్రించడంచేత, ప్రభాకరుడు హూణులతో పూర్వంపడిన ఘర్షణను ఉల్లేఖించి నాడనవచ్చును. హర్షచరితములో పేర్కొనబడిన సింధు గాంధార లాట మాళవదేశాలు ప్రసిద్ధాలే. మాళవాన్ని మైత్రకులు, కాలచుర్యులు లేదా దేవగుప్తుడు పరిపాలించాడో స్పష్టంకావడంలేదు. ఘూర్జరులనడంవల్ల రాజస్థానంఅవుతుంది.

ప్రభాకరుడు విజేత బాణుడుల్లేఖించిన శాత్రవరాజ్యాలను రెండు భాగాలుగా విభజన చేయవచ్చును. హూణ గాంధార సింధు రాజ్యాలు ఉత్తరంగా పశ్చిమంగాఉన్నవి. రెండోవిభాగం లోవి లాట, మాళవ, ఘూర్జరులు దక్షిణంగాఉన్నారు. ప్రభాకరుడు స్వయంగా ఈ రాజ్యాలన్నీ జయించినాడా? బాణుని వాక్కు కవితామయం అయినప్పటికీ చారిత్రక సత్యం కూడా కొంతలేకపోలేదు. ప్రభాకరుణ్ణి విజేతగా అంగీకరించాలి. అంగీకరించినపక్షంలో అతని రాజ్యసీమలు తూర్పున యమునానది, పశ్చిమాన బీయాసునది, ఉత్తరాన హిమాలయ పర్వతములు, దక్షిణాన రాజస్థానాలు.

హర్షునకు రాజ్యప్రదానం రాజ్యవర్ధనుడు, హూణజిగీషతో వెళ్ళినప్పుడు పితృమరణవార్తవిని రాజధానికి హఠాత్తుగా వచ్చివాడు. అతనిజనని యశోమతీదేవి సరస్వతీనదీతీరాన వైధవ్యం పొగొట్టుకొనేనిమిత్తం సహగమనం చేసింది. దుఃఖభారంవల్ల రాజ్యవర్ధనుడు సోదరుడు హర్షునికి రాజ్యప్రదానంచేసి, తాను

పరివ్రాజకుడై పోవలెనని స్థిరసంకల్పము చేసికొన్నాడు. హర్షుడు రాజ్యభారం వహించడానికి అంగీకరించక అన్నగారి వెంట తపోవృత్తిలో ఉండదలచినాడు.

కన్యాకుబ్జంనుంచి దూత ఆకస్మికంగా రావడంచేత క్షణంలో పరిస్థితులు మారిపోయినవి. ప్రభాకరుని మరణ వార్త కర్ణాకర్ణిగా తెలియగా, మాళవరాజు గ్రహవర్మను వధించినాడు. కన్యాకుబ్జములో అతడు రాణి రాజ్యశ్రీని చెరబెట్టినాడు; స్థాణ్వీశ్వరముపై సైనికధాటి చూపదలచి నాడు. దూతచెప్పిన వార్తవిని రాజ్యవర్ధనుడు చిన్నతిమ్మ్మడికి హర్షుడికి రాజ్యంఅప్పగించి, మాళివముమీద దండయాత్ర చేసినాడు. గౌడరాజైన శశాంకుడు రాజ్యవర్ధనుని వధించి నాడు. శశాంకుడు ద్రోహముచేసినాడని బాణభట్ట హర్ష్యాన్ సాంగుల అభిప్రాయము. ద్రోహకారణాలు విశదంగా చెప్పలేము.

హర్షుడు - కాన్యకుబ్జము భ్రాతృవధ విన్నంతనే హర్షుడుగ్రుడై శశాంకుని హతమార్చి, గౌడరాజ్యం నిజరాజ్యంలో కలుపు కోకతప్పదని శపథం *పట్టినాడు. భట్టబాణుని రచననుబట్టి హర్షుడు దిగ్విజయయాత్రా సన్నాహాలుచేసికొని యావ ద్భారతదేశం ప్రకటించినాడు. జిగీషతో తరలినాడు.† అతడు కొంతదూరం సాగిపోగా ప్రాగ్జ్యోతిష ప్రభువయిన కుమార

---

* హర్షచరితము 187 వ పుట. Cowel and Thomas ప్రతి చూడు.

† Ibid 197 వ పుట చూడు.

భాస్కరవర్మ హర్షునితో సంధికి వస్తానన్నాడు. గౌడేశుడైన శశాంకుణ్ణి ఎలాగైనా తీసికోడానికి భాస్కరవర్మతో హర్షుడు సమాధానం చేసికొన్నాడు.

రాజ్యశ్రీ భండిఅనేవాడువచ్చి హర్షునికి చెప్పినాడు. రాజ్యశ్రీ కారాగార ముక్తురాలై వింధ్యారణ్యం ప్రవేశించిందని. హర్షుడు భండునికి సేనానాయకత్వం అప్పగించి వింధ్యాటవికి వెళ్ళగా, రాజ్యశ్రీ చితాగ్నిజ్వాలలో శరీరం అర్పించ బోతున్నది. అతడు చెల్లెల్ని రక్షించి ఆమెను తీసికొని గంగా తీరాని పిడిసినాడు. భట్టబాణునిరచన ఇంతటితో ఆగి పోయింది, హర్షుని ఆనంతరజీవితం హ్యూన్‌సాంగ్ రచనవల్ల తెలిసికోవచ్చును.

మౌఖరసింహాసనం ప్రభవర్మ మరణానంతరం కాన్యకుబ్జంలో మౌఖర రాజవంశవారసుడు లేడు. అందుచేత వెంటనే హర్షుడు మౌఖరసింహాసనం అధిష్ఠించాడని అంటున్నారు కొందరు చరిత్రకారులు. ఇది అసంగతం. హర్షుడు మొదట చెల్లెలి తరఫున కాన్యకుబ్జ పాలనం సాగించగా శత్రువులకు కన్నెట్టి నైండి. అనంతరం క్రీ. శ. 612 లో ఆయన సార్వభౌముడైనాడు. మౌఖర రాజ్యలక్ష్మి సనాథుడైన హర్షునికి దిగ్విజయయాత్ర అవలీలకదా!

సైనికవిజయాలు-అపజయము హర్షునికీ వలభీ ఘూర్జరప్రభువులతో నర్మదాతీరాన చాళుక్యరాజైన రెండవపులకేశితో, సింధు,

మగధ, గౌడ, ఓడ్ర, కొంగోడ రాజులతో యుద్ధాలు తటస్థించినవి. పులకేశి, తన ఐహోలు *శాసనంలో హర్షుని గజబృందం సమరంలో కూలిపోయిందనీ అంతటితో ఆయన భయభీతుడైనాడని చెక్కించినాడు. అనేక శాత్రవకోటిని చెండాడిన హర్షుడు పులకేశివల్ల పరాజితుడైనాడు. పులకేశి హర్షుని ఉత్తరాపథనాథుడని అంగీకరించినాడు ; విజయానంతరం పరమేశ్వర బిరుదమువహించినాడు. నర్మదాతీరము హర్షసామ్రాజ్యానికిపులకేశిరాజ్యానికీ సీమగాఏర్పడింది. అయితే ఇలాచెప్పడానికి అంతగావీలులేదు. హర్షరాజ్యం నర్మదానది దాకాలేదు. అందుచేత నర్మదకుత్తరంగా ఎక్కడో యుద్ధం జరిగింది.

హర్షరాజ్యవిస్తీర్ణము స్థాణ్వీశ్వర కాన్యకుబ్జములతోపాటు హర్షునికి ప్రాక్ పశ్చిమాల కొంతరాజ్యం కలిసిఉంటుంది ; అనగా ప్రస్తుతపు తూర్పుపంజాబు, ఉత్తరప్రదేశ్ అనాట్ హర్ష రాజ్యం. ఆయన జీవనసంధ్యాకాలంలో మగధను తన రాజ్యంలో కలుపుకొన్నాడు. అంతటితోఆగక ఓడ్ర కొంగోడులుకూడా జయించాడు. ఇంతకన్న ఉత్తరభారతంలో ఆయనరాజ్యం విస్తరించలేదని సహేతుకంగా డాక్టర్ ఆర్. సి. మజుందార్ విమర్శించినాడు.*

---

* వివరములకు Epigraphica Indica VI 10 వ పుట చూడుము.

* వివరములకు Classical Age Vol III Edited by R. C. Mazumdar 110—113 పుటలు చూడు.

చైనాతో సంబంధము హర్ష చక్రవర్తికీ, చీనా యాత్రికుడు, హ్యూన్ సాంగుకూ సన్నిహితసంబంధము ఏర్పడడంచేత కాబోలు, చీనారాజు ఘనతవిని భారతచక్రవర్తి క్రీ. శ. 641 లో రాయబారిని పంపినాడు. ఇలా రాయబారం పంపడమే సాహాయ్యం అర్థించికాదు, మైత్రికోసమే. చైనాకూ మగధకూమధ్య రాయబారాలు నడిచినట్లు చైనాభాషలో చారిత్రకగ్రంథాలు చెబుతున్నవి.

హర్షుని వ్యక్తిత్వము - సింహావలోకన థానేశ్వర సింహాసనం ఆయన అధిష్ఠించిన తరుణం మహోత్కృష్టమైనది. ఇరుగుపొరుగునున్న శత్రుకోటికిది

హైందవ సామ్రాజ్య నిర్మాతలలో శ్రీహర్షుడు తుదివాడని చాలామంది చరిత్రకారులు వ్రాసినారు. ఇది సత్యదూరమని ఇప్పటికైనా చరిత్రాభిరుచిగల విచక్షణులు గ్రహించాలి. హర్ష సామ్రాజ్యంతో హిందూ మహాయుగంలో రాజకీయైక్యత అంతమైందని చెప్పడం పొరపాటు. హర్షుని తరువాత ఐదుశతాబ్దాలలో ఆర్యావర్తంలో కొన్నిసామ్రాజ్యాలుదయించినై, అస్తమించినై. ఆ సామ్రాజ్యాలలో హర్ష రాజ్యంకన్న మిన్నగా ఎక్కువకాలం ప్రతీహార సామ్రాజ్యం విలసిల్లింది. ఇలా విమర్శించడంచేత హర్షుని యశస్సుకు లోటులేదు. ఆయన పాలకులలో ఘనుడు, సైనికవిధానాలెరిగినదిట్ట, లలితకళాప్రియంభావకుడు, ఉదాత్తగుణోపేతుడూ. ఏతాదృశుడైన వ్యక్తిలో విశిష్టత స్పష్టంగా భాసిస్తూనేఉంది.

కన్నెట్టిగాడున్నది. గుప్తసామ్రాజ్యం విచ్ఛిన్నమైన తదుపరి స్థాణ్వీశ్వరరాజ్యం సుప్రతిష్ఠితం చేయడానికి శత్రువులను ఎదురొక్కవలసివచ్చింది. నర్మదానదీప్రాంతంలో రెండవ పులకేశివల్ల అతను పరాజితుడైనా, 'సకలోత్తరాపథ నాథు' డైనట్లు ఐహోలు శాసనం చెబుతున్నది. సామంతు లెందరో ఆయన సాన్నిహిత్యం కోరినారు. ప్రత్యంత పాలకులు కూడా హర్షునితోడి స్నేహంకోసం ప్రతీక్షించినారు.

హర్షశకమున్నట్లు శాసనాల్లో 298, 562 శక సంవత్సరాలవల్ల ఊహచేసినారు కొందరు. ఆల్బరూనీ అనే చరిత్రకారుడు తన గ్రంథంలో ప్రాసినదాన్నిబట్టి హర్షశకం వ్యవహారంలో ఉండేదని చెప్పవలసివస్తుంది. స్థాణ్వీశ్వర సింహాసనం ఆయన అధిష్ఠించింది క్రీ. శ. 606 అనీ అప్పటినుంచీ శకారంభమనీ గట్టిగా చెప్పడానికి తగిన ఆధారాలులేవు.

హ్యూక్‌సాంగ్ హర్షుని సైనిక విజయపరంపరను గురించి ఏనోన్నసంగతులు ప్రాసినాడు. ఆయనకు అయిదువేల గజసైన్యం, రెండువేల అశ్వికదళం, యాభైవేల పదాతులూ ఉన్నట్లు తెలుస్తున్నది. అశ్వాలు పారశీకంనుంచి వచ్చేవని బాణునివచనం.

శాంతికాముడైన హర్షమహీవల్ల భుషు లలితకళలకు దోహదమిచ్చినాడు. ఆయన స్వయంగా సంస్కృతభాషలో రత్నావళి, ప్రియదర్శిక, నాగానందమనే రూపకత్రయం రచించిన సాహితీ ప్రపంచంలో చిరయశస్సు గడించినాడు.

భట్టబాణుడు, మయూరుడూ ఆస్థానంలో హాసికెక్కిన కవీశ్వరులు.

హ్యూన్‌సాంగ్ రచనవల్ల శ్రీహర్షుని సర్వమత సహిష్ణుత గ్రహించగలం. ప్రతి అయిదేళ్ళకూ ఒకసారి ప్రయాగలో సర్వమతోత్సవం జరిగేది. హర్షుడాదిలో శైవుడని ఊహచేయవచ్చును. ఆయనపూర్వులు సూర్యారాధకులు. హర్షునికి బౌద్ధాభిమానం అధికం. అందుచేతనే బోధిసత్త్వుడైన జీమూతవాహనగాథను ఇతివృత్తంగాచేసి నాగానంద నాటకము రచించినాడు. మతోత్సవంలో బుద్ధప్రతిమారాధనం జరిగేది. యతులకూ విద్వాంసులకూ సమ్మానం జరిగేది. అర్హులైనవారికి చక్రవర్తి దానధర్మాలు చేసేవాడు.

కాన్యకుబ్జంలో 21 రోజులు సర్వమతోత్సవం అద్భుతంగా జరుగుతున్నప్పుడు చీనాయాత్రికుడు స్వయంగా వీక్షించి హర్షపులకితుడై, గ్రంథములో కించిత్ అతిశయోక్తిగా వర్ణించినాడు. సుమారు ఇరవైమంది సామంతులూ, భాస్కరవర్మ సమావేశానికి వచ్చారట. అంబారీ వేసిన ఏనుగుమీద బుద్ధదేవుని సువర్ణప్రతిమ ఊరేగించినారట. ఏనుగకు ఎడమప్రక్కగా హర్షచక్రవర్తి పాదచారికాగా, భాస్కరవర్మ అతని దక్షిణపార్శ్వాన ఉన్నాడట. సభావేదికను సమీపించిన తదుపరి పన్నెండు బంగారు బుద్ధప్రతిమాను కడిగి, నిజభుజాన మోసికొని మందిర గోపురం దాకా ప్రభువు వెళ్ళినాడట. చక్రవర్తి పండితులకూ

శ్రమణులకూ చీనిచీనాంబరాలు, అమూల్యరత్నాలు, భూరి దక్షిణలిచ్చినతరువాత సంతర్పణ చేసినాడట. సమావిష్టులైన సభకు హ్యూన్‌సాంగ్ అధ్యక్షపీఠం అలంకరించినాడట. ఆయన తార్కికశిఖామణి కనుక ప్రతివాదులందరినీ చిత్తు చిత్తుగా ఓడించడానికి బద్ధకంకణుడైనాడు. హీనయాన బౌద్ధులు కుట్రపన్ని హ్యూన్‌సాంగును వధించాలని యత్నం చేశారట. సభాకార్యక్రమం తుదినాడు మందిరగోపురం ఆకస్మికంగా భస్మసాత్కృతమైంది. ఆ కల్లోలంలో ఒక అతతాయి కత్తిపూని హర్షునివైపు పరుగెత్తగా పట్టుబడినాడట. "నన్ను హీనయానులు ఆకతాయిపనికి ప్రేరేపించి పంపించారా" అని చెప్పినాడట. అప్పుడు హర్షుడు 500 బ్రాహ్మణులను భారతదేశపు సీమలకు వెళ్ళగొట్టినాడట.

ఈ సమావేశ వివరాలనుబట్టిచూస్తే హర్షుడు బౌద్ధాభిమాని అని తెలుస్తుంది. చీనాయాత్రికుని రచనలోగల యాదార్థ్యమెంతవరకో తెలియదు. బౌద్ధాభిమానంతో చేసిన రచనకనుక బౌద్ధేతర విషయ పరిశీలనలో దోషైకదృష్టి ఉండవచ్చును.

ఏతావతా భట్టబాణుని హర్షచరిత్రవల్ల హ్యూన్‌సాంగ్ రచనవల్లా శ్రీహర్షుని సముజ్వలవ్యక్తిత్వం, తత్కాలీన సంస్కృతీ మనకళ్ళకు కట్టినట్లుంటవి.

<u>గుప్తకాలీన సంస్కృతి</u> గుప్తులకాలములో ప్రాచీన భారతీయ సంస్కృతి నవనవోన్మేషంగా వికసించింది. మానవసంస్కృతి

సర్వతోముఖంగా విరాజిల్లింది. భౌతికాధ్యాత్మిక జీవిత మత తత్త్వశాస్త్రముల సరస సమన్వయం ఏర్పడింది. కర్మ భక్తి జ్ఞానములకు మహోదాత్త సామరస్యం సంఘటిల్లింది. శబ్దార్థముల సామరస్యం సాహిత్యంలో, శిల్పంలో బాహ్యాంతర సమన్వయం సిద్ధించినవి. సృజనాత్మక కళాప్రవృత్తి సర్వతోముఖమై భాసించింది. మానవప్రవృత్తిలో ధర్మార్థకామములు సమరసములైనవి. అందుచేతనే జీవనానందము సంఫుల్లమైనది. అదిస్వర్ణయుగము !

మతము - తత్త్వము ఆర్య ద్రావిడ సంస్కృతీ సమన్వయ ఫలితంగా సనాతన ధర్మమూలంగా ప్రజాబాహుళ్యంలో భక్తి విశ్వాసా లేర్పడినవి. సగుణారాధనము, శివవిష్ణు, దుర్గ కార్తికేయాది దేవీ దేవోపాసనము వ్యాప్తిలోకి వచ్చింది. ప్రజాదృష్టిలో ప్రాచీన వైదిక దేవతలు ఇంద్రాదులునంటివారు లేరు. సగుణోపాసనం ప్రజాసామాన్యం అవలంబించడంచేత ప్రతిమాశిల్పమూ, దేవాలయ వాస్తుశిల్పమూ పురోభివృద్ధి చెందినవి. ప్రతీకోపాసనవల్ల ఆగమాచారాలు వివులమైనవి. సుంగరాజులనాటి బ్రాహ్మణ ధర్మకర్మ తత్పరత గుప్త యుగంలో కర్మ భక్తి జ్ఞాన సామరస్యంగా పరిణమించింది.

భక్తి బ్రాహ్మణమతములో భక్తి ప్రధానమైంది. పరమేశ్వరుడు సర్వరక్షకుడనీ ఆర్తశరణ్యుడనీ, ఈశ్వర ప్రణిధానము ముఖ్యమనీ భగవద్గీత, శ్వేతాశ్వత దోపనిషత్తులు ప్రపంచించినవి. శైవవైష్ణవ సూర్యోపాసనలు ప్రబలమైనవి.

జీవేశ్వరుల మానవతాసంబంధము భక్తిలో ప్రధానము. భక్తుని అంతఃకరణము భగవదాకారము ధరించినప్పుడది పూర్ణభక్తి. ఆత్మయొక్క దేహాంతరసంచారము, కర్మనిర్వాణములందు తాత్పర్యమూ బౌద్ధప్రభావ పరిణామము. తాంత్రికోపాసనంకూడా వ్యాప్తిలోఉన్నది. అవతారవాదమూ, జ్ఞానంకన్న రసపర్యవసన్నంకాని భక్తినీ గుప్తయుగంనాటి బ్రాహ్మణమతంలో ప్రధానవిషయాలు.

శైవవైష్ణవాది శివరూప మహాదేవుడు ఉపాసకుల లక్ష్యము. లింగప్రతీకానికేకాక బహుదేవతాకృతులను ఆరాధన చేయడంవల్ల శైవవైష్ణవశాఖలు చాలావచ్చినవి. వైష్ణవంలో కృష్ణావతారం భక్తమానసాన్ని చూరగొన్నది. దేవాలయాలు మతసంస్కృతికి కేంద్రాలైనవి. భక్తి భావోద్రేకం వల్ల దేవాలయ వాస్తుశిల్పమూ, సంగీతనాట్యాలూ, పురాణపఠన పాఠనాలూ వృద్ధిపొందినవి.

తాంత్రికమతము తంత్రమనగా కర్తృనిష్ఠ కామనాసిద్ధి హేతుభూతమైన దేవతానుగ్రహాది సంపాదనకు అనుకూలమైన పురుషవ్యాపారము. *వ్యాపారభేదంవల్ల బహులోపాలు తంత్రోపాసనలో వచ్చినవి. వంగదేశమున చండిమొదలైన దేవతా సంబంధమైన శాక్తేయాగమాలు రచింపబడినవి.

---

* వివరములకు శ్రీగుణానికాదీధితిః Vol II by కల్యాణానంద భారతీ స్వామి 81 వ పుట చూడు.

పరమేశ్వర స్వరూపమును స్త్రీరూపంలో మాతగా భావనచేసి ఉపాసనచేస్తారు తంత్రంలో. నిజానికి పరమేశ్వరుణ్ణి స్త్రీ రూపంలోనో పురుషరూపంలోనో ఉపాసన చేయవచ్చును. ఏరూపమూకాక నిష్కలంగా ఉపాసనచేస్తే అది నిర్గుణం అవుతుంది. శ్రీ మాతృరూపంలో పరబ్రహ్మను ఉపాసించడము తాంత్రికమతం.* ఆత్మనే దేనిగా భావనచేస్తారు. శరీరమనే బ్రహ్మపురములో నిద్రాణమైన కుండలినీశక్తిని జాగరితంచేస్తే, అది షట్చక్రాలను భేదించి ఊర్ధ్వగమనం చేయగా ఆత్మేశ్వరీ సాక్షాత్కారం అవుతుంది.

తాంత్రికసాధనం ఉత్తమోత్తమం. దక్షిణాచారము సాత్త్వికము జ్ఞాన పర్యవసన్నము. వామాచారము తామసికము, శూద్రము. పండిత రాయు జగన్నాధుడు కౌళికమనే వామమార్గం అవలంబించి మ్లేచ్ఛత్వం పొందినాడు.♦ (“అథేదమవశ్యం జ్ఞాతవ్యం శ్రేయస్కామైః శ్రీయాగ విషయ వ్యాజేన ‘కులార్ణవా’ది కుతంత్రైః ప్రోక్తం పరమకావిమాయం ఇతి ఆడంబరీకృత కౌలిక చండాలసూత్రేణ ప్రతిపాదితం మ్లేచ్ఛత్వేన భ్రష్టంగతేన జగన్నాధ పండిత రాయేణ ‘నిత్యోత్సవ’ నామ్నా విపులీకృతం పంచమకార సంకేతితం, మద్య, మాంస, మత్స్య, ముద్రా, మైథున నిషేవణంతు మహాపాతకృత్యం సత్ చండాల కృత్యమితి

---

* వివరములకు యోగినీతంత్రము Part I Chapter X చూడు.

♦ వివరములకు శ్రీగుణనికాదీధితిః Vol I 100 వ పుట చూడు.

శ్రీవిద్యా పరంపరయా, సౌభాగ్య భాస్కర కళ్పలనామక సహస్ర దూషణ్యాచ బహుదా ఉద్ఘోషితత్వాత్ ..... ఇత్యాలమ్ కౌలిక చండాలకళ్పల కృత్యప్రసంగేవు. ")

దర్శనాలు షడ్దర్శనాలు గుప్తయుగంలో ఉద్భవించినవి. భారతీయ తత్త్వజిజ్ఞాసలో భిన్నభిన్నమార్గములే దర్శనములు. పూర్వోత్తర మీమాంసలు, న్యాయవైశేషికములు, సాంఖ్య యోగములూ షడ్దర్శనాలు.

పూర్వమీమాంస వేదాంగముల తరువాత ఉపాంగములలో పూర్వోత్తర మీమాంసలు ప్రధానమైనవి. మీమాంస అనగా సద్విషయ విచారణ. పూర్వమీమాంసా సూత్రకర్త జైమినిమహర్షి శబరస్వామి. కుమారిలభట్టూ సూత్రాలపై వేరువేరుగా భాష్యాలు రచించినారు. మీమాంసాసూత్రాలు వేయి అధికరణాల గ్రంథము.

సంహితా బ్రాహ్మణ కాండలున్న వేదభాగము పూర్వకాండ. కర్మాచరణము ప్రధానం ఇక్కడ. కర్మానుష్ఠానంవల్ల చిత్తసంస్కారం కలుగుతుంది. వేదచోదితకర్మలు ఎప్పుడాచరించాలో, వాటిప్రయోజనాదులు మీమాంసా విషయాలు. మీమాంసకులు పెట్టినభిక్ష ఉపక్రమోపసంహారాది షల్లింగాలు. శాస్త్రీయదృష్టికై మీమాంస అవసరం ప్రతివారికీ.

ఉత్తరమీమాంస వేదాంత భాగాలైన ఉపనిషత్తులు జ్ఞానకాండ విషయముగాకలవి. కర్మానుష్ఠానానంతరం జ్ఞానప్రసక్తినక

ఉత్తరమీమాంస అనిపేరువచ్చింది. బాదరాయణుని బ్రహ్మ సూత్రాలమీద, ఉపనిషత్తులూ భగవద్గీతమీద ఆచార్య శంకరులు భాష్యాలురచించి ఆసేతుహిమాచలం అద్వైత బ్రహ్మ సిద్ధాంతస్థాపనచేసిన మహనీయులు. తత్త్వవిచారణలో అద్వైతమే పరాకాష్ఠ. 'బ్రహ్మసత్యం, జగన్మిథ్యా; జీవోబ్రహ్మైవనాపరః' అని అద్వైతసారము.

<u>వైశేషిక దర్శనము</u> వైశేషిక సూత్రకారుడు కణాదమహర్షి. దార్శనికసూత్రాలలో వైశేషికసూత్రాలు చాలాప్రాచీనం. వైశేషికులు అణువాదులు. అణువులు నాలుగురకాలు. పృథివీపరమాణువులు గంధత్వముకలవి. జలపరమాణువులు రుచికలవి. అగ్నిపరమాణువులు వర్ణముకలవి. వాయుపరమాణువులు స్పర్శత్వంకలవి. వైశేషికులమోక్షము నిఃశ్రేయసము. అది సమస్త దుఃఖప్రధ్వంసాభావము. నిజానికి వైశేషికము న్యాయదర్శనానికి అనుబంధశాస్త్రమే. పదార్థము ప్రమితివిషయము. పదార్థజ్ఞానంవల్ల, తత్త్వంవల్ల సమస్తదోషనివృత్తి. పదార్థాలు ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయ, అభావ సప్తకము.

<u>న్యాయదర్శనము</u> గౌతముని న్యాయసూత్రాలు మొదటిగ్రంథం. ఇది తర్కశాస్త్రము. తర్కవివేచన అజ్ఞాననివృత్తిచేస్తుంది. జ్ఞానసాధనం ప్రమాణచతుష్టయం. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అసి ప్రమాణచతుష్టయం. అనుమానము అనగా **Inference** ఇలాఉంటుంది :—

1. పర్వతోవహ్నిమాన్ —(ప్రతిజ్ఞా=Assertion)
2. ధూమత్వాత్ —(హేతు లేక లింగ=Reason)
3 యత్రయత్రధూమః తత్రవహ్నిః, యథామహానసే (ఉదాహరణ=Example)
4. యత్రయత్రవహ్న్యభావః. తత్రతత్రధూమాభావః యథాహ్రదే (ఉదాహరణ=Negative Example)
5. పర్వతోవహ్నిమాన్ (నిగమనం=Result)

న్యాయవైశేషికాలు హేతుశాస్త్రములైనా పారమార్థికానికి ఉపకరిస్తవి. శుష్కతర్కం గమ్యంకాదు. నిశ్రేయసపథం నిష్కంటకం చేస్తుంది తర్కవిచారణ.

యోగదర్శనము పతంజలి మహర్షి రచించిన. యోగసూత్రాలు ప్రసిద్ధం. మహాభాష్యకారుడైన పతంజలి, యోగసూత్ర కర్త అయిన పతంజలిన్ని భిన్నులు. యోగసూత్రకారుడు క్రీ. శ. రెండవ శతాబ్దిలోనాడు. యమనియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానసమాధులు అష్టాంగ యోగ సాధనాభూమికలు. చిత్తవృత్తి నిరోధము యోగము. సమాధిప్రాప్యము.

సాంఖ్యదర్శనము సాంఖ్యము సిద్ధాంతభాగము, యోగము అనుభవభాగము. భారతీయుల పరిణామవాదము, సాంఖ్య ప్రతిపాదితము కపిలమహర్షి ఈశ్వరకృష్ణుడు, విజ్ఞానభిక్షువు, వాచస్పతి మిశ్రుడు సాంఖ్యశాస్త్రకారకులు భాష్యకారు

లున్నా, షడ్దర్శనాలపైన వాచస్పతిమిశ్రుని భాష్యవార్తిక టీకలు సర్వతోముఖ పాండిత్యప్రకర్ష కాలు. సాంఖ్యములో పురుషప్రకృతులు రెండుతత్త్వాలు. ఇది ద్వైతము.

సాంఘికస్థితి వర్ణాశ్రమధర్మము సాంఘికశ్రేయానికి వెన్నె ముకగా ఉంటూనేఉంది. అనులోమవివాహాలు ఎక్కువగా లేవు. జాత్యంతర వివాహాలు జరిగేవి. ఈ వివాహాలవల్ల నైదేశికులకు హైందవసమాజములో స్థానం లభించింది. లభించడమేకాక వారు పూర్తిగా భారతీయులుగా పరిగణింప బడినారు. కులాన్నిబట్టి వృత్తిని పాటించడంలేదు. తార్కాణం చూడండి :—బ్రాహ్మణుడు వాణిజ్యం, శిల్పం, ఉద్యోగం అవలంబించేవాడు. క్షత్రియులుకూడా వాణిజ్యములో పరిశ్రమలలో నిమగ్నులయ్యేవారు. గుప్తకాలిక శాసనాలలో కాయస్థులు లేఖకులుగా కనబడుతున్నారు. వైశ్యులవలె శూద్రులుకూడా వ్యాపారులు, వ్యవసాయదారులు కావచ్చును. ప్రధానస్థావరాలకు సీమల్లో అస్పృశ్యులుండేవారు. వారు వేటాడేవారు, చేపలుపట్టేవారు, సమ్మార్జనాదివృత్తులు అవలంబించేవారు.

బ్రాహ్మణులకు విశేషగౌరవం ఉండేది సమాజంలో వారికీ క్షత్రియులకూ సామరస్యం ఎక్కువ. అధ్యయనంచేసే వేదశాఖలనుబట్టి బ్రాహ్మణశాఖలు ఏర్పడగా, వారు ఓఢ్ర, తెలంగాణా, కోసల, మధ్యరాష్ట్రాల్లో యజుర్వేదులుండేవారు. ఉత్తరప్రదేశ్, కథియవాడులలో సామవేదులు ; మైసూరులో

అధర్వవేదులు (బెల్గాం, కాంగ్రా, వలభిలోకూడా); ఋగ్వేదులు అంతగా గుప్తకాలిక శాసనాల్లో కనబడరు.

బానిసత్వం నారదస్మృతినల్ల తెలుస్తుంది. యుద్ధఖైదీలగతి బానిసత్వమే. ఋణాలు తీర్చనిపక్షంలో కొంతకాలంపాటు ఎవరైనా బానిసకాక తప్పదు. అయితే దాస్యం నియమితకాలమే. హైందవ జీవితానికి మూలకందం అవిభక్త కుటుంబం. ఇంటికి పెద్దయిన తండ్రి జీవించిఉండగా భాగాల పంపకం అంగీకార యోగ్యంకాదు. తండ్రి ఆస్తిలో కుమార్తెకు హక్కులేదు. పురుషసంతానము లేనప్పుడు కుమార్తెకు ఆస్తిహక్కుండేది. దత్తత అంతగా అంగీకరించ లేదు ధర్మశాస్త్రకారులు. విధవలకి భృతినిచ్చేవారు. రజస్వలాత్పూర్వవివాహాలు సామాన్యంగాజరిగేవి. పన్నెండో యేట లేదా పదమూడో యేటనో కన్యకు పెళ్ళిచేసేవారు. స్త్రీలకు వేదాధ్యయనాధికారంలేదు. లలితకళలూ, ఇతర విద్యలూ స్త్రీ నేర్చుకోవచ్చును. స్త్రీ గృహరాజ్ఞి. ఆమె విధవకాలయితే పునర్వివాహయోగ్యత ఉండేది. సహగమనం అంతగా వ్యవహారంలోలేదు. గుప్తకాలంలో స్త్రీకి గృహిణీ పదంలో స్వాతంత్ర్యం గౌరవం ఆనందం ఉన్నమాటనిజం.

ఆర్థికస్థితిగతులు ప్రాచీనకాలంలోవలె శ్రేణులమూలంగా వర్తక వ్యాపారాలు జరుగుతూ ఉండేవి. శ్రేణీవ్యవహారాలు నిర్వహించేందుకు అధ్యక్షుడూ, అతనికి సహాయంగా కార్యనిర్వాహకవర్గసభ్యులు అయిదుగురుండేవారు. శ్రేణులు దేవాలయ ఆదాయాలను వ్యవహారాలను చూచేవి. బ్రోచ్ (భరుకచ్ఛ),

ఉజ్జయిని, పైఠాన్, విదిశ, ప్రయాగ, కాశీ, గయ, పాటలీపుత్రము, వైశాలి, తామ్రలిప్తి, కౌశాంబి, అహిచ్ఛత్రము, మధుర, పురుషపురములకు వర్తకమార్గములున్నవి. నదీమార్గాల వాణిజ్యం జరిగేది. తామ్రలిప్తిరేవునుండి చీనా, సింహళము, జావా, సువర్ణద్వీపాలతో వర్తకం సాగేది. ముత్యాలు, రత్నాలు, వస్త్రాలు, పరిమళద్రవ్యాలు, కర్పూరము, నీలిమందు, దంతవస్తువులు, సీసం, సిల్కుఎగుమతులు. వరి, చెఱకు, గోధుమ, నార, నూనెగింజలు, ప్రత్తి, జొన్న, ఆరణ్యకసంపద, ఖనిజాలు జాతీయధనము. పరిశ్రమల్లో వస్త్ర పరిశ్రమ ప్రధానం. జీవనప్రమాణం అధికంకాదు.

గుప్తకాలీన శిల్పసంస్కృతి గుప్తయుగ సంస్కృతిలో ప్రధానంగా బాహ్యాంతర సమన్వయం గోచరిస్తుంది. ఈ సమన్వయము మతసాహిత్యాది లలిత విజ్ఞానక్షేత్రాలలో ప్రతిదానిలో కనబడుతుంది. సాహిత్యంలో శబ్దార్థసమన్వయం అర్ధనారీశ్వర మూర్తివలె కాళిదాస కవిచంద్రుని కావ్యనాటకాల్లో అద్భుతంగా భాసిస్తుంది. శిల్పములో రూపభావ సామరస్యం సిద్ధించింది.

శిల్పము గుప్తకాలీన కళోపాసకుల సృజనాత్మక ప్రవృత్తి ఉదాత్తరమణీయము. శిల్పములో రమణీయకత భావ లావణ్యదీప్తివల్ల సిద్ధించింది. కుషాణమూర్తుల బాహ్యరూపము ఓజస్సుతోనిండి చూచేవారి ఇంద్రియవాసనలను రెచ్చగొట్టుతుంది. కుషాణ కాలీన శిల్పులకు ఇంద్రియ

లాలస అధికము. సంయమము వారిలో లేదు. గుప్తకాలీన శిల్పములో దేహాలాలిత్యానికి వెనుక ప్రాణవిలాసము లేదా ఆత్మీయసౌందర్యం ద్యోతకమవుతుంది. శరీరానికన్న చైతన్యానికే ప్రాధాన్యమిచ్చారు శిల్పులు. స్త్రీమూర్తుల అనయవ లావణ్యం వలిపెంపు అంశుకాచ్ఛాదనలో వ్యక్తావ్యక్తం చేసినారు.

సారనాథ బుద్ధమూర్తి - శిల్పపారమ్యము బాహ్యాంతస్సుల సమన్వయం సారనాథ బుద్ధప్రతిమలో ప్రస్ఫుటం. శిల్పి యోగి కావడం చేతనే యోగం శిలలో దర్శించి రూపించగలిగినాడు. బుద్ధ మూర్తిలోని ఆత్మీయసౌందర్య వ్యక్తీకరణము, సాత్వీసుధా మధుర మందహాసచంద్రిక, ప్రశాంతమాధురి భారతీయ శిల్పకళా పారమ్యానికి అద్భుతతారాకాణము. జ్ఞాన పరాకాష్ఠను శిల్పి శిలలో రూపొందించినయత్నము, అతనికిగల సంయమమూ నిర్లిప్తతా చిరస్మరణీయాలు! ఈసందర్భంలో జావాలో ప్రజ్ఞాపారమితామూర్తి శిల్ప దివ్యనైపుణి స్మృతికి వస్తున్నది! సారనాథ బుద్ధమూర్తి శిరస్సును ఆవరించిన ప్రభామండల విన్యాసములో లలితాలంకరణమేకాని 'అతి' కనబడదు. శిల్పి ప్రతీకానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వక, వాస్తుశిల్ప సముదాయములో ఒకఅంశము ఒకభాగము చేసినాము. ఇలా సముదాయములో ప్రతిమఅంశము కావడం చేత అందులో లాలిత్యమూ ప్రశాంతమాధుర్యమూ వ్యక్తమైనవి.

విశ్వజనీనమై సుస్పష్టమైన నిర్దిష్ట శిల్పసంవిధానం ఏర్పడడంవల్ల ప్రామాణిక ప్రతిమాశిల్పం ఉద్భవించింది.

గుప్తకాలిక శిల్పములో లాలిత్యమూ సంయమమూ, ప్రామాణిక రూపవిన్యాసం, ముద్రలవల్ల భంగిమలవల్ల భావ లావణ్య స్ఫోరకత్వం ముఖ్యలక్షణాలు.

హిందూమత పునరుజ్జీవనం - శిల్పం శిల్పాకృతులలో మత పునరుజ్జీవనం భక్తిరూపేణ ప్రతిఫలించింది. ప్రజలమతాలు శైవ వైష్ణవ తాంత్రికములు. భక్తి భావోద్రేకంవల్ల ప్రతిమా శిల్పమూ ప్రతిమలను నిక్షేపించడానికి ఆలయాలూ ఉద్భవించినవి. ఏతత్కాలీనశిల్పంలో ఏకముఖి చతుర్ముఖి శివ లింగములు, అర్ధనారీశ్వరమూర్తులు ఎన్నదగినవి. అవతారములందు ప్రజలకున్న విశ్వాసం దేవీదేవతామూర్తుల వల్ల గ్రహించవచ్చును. మధురలో ఆసీనవిష్ణువు, నృసింహ, వరాహమూర్తులు అష్టభుజామూర్తులు రమణీయాలు. కుషాణులకాలంలో విష్ణుసంబంధమైన శంఖచక్రాదులు గుప్తకాలిక ప్రతిమాశిల్పములో ఆయుధపురుషులై వామనులై ప్రధాన మూర్తికి పార్శ్వములందుంటాయి.

ఉదయగిరిలో "వరాహమూర్తి" వరాహమూర్తి ఉదయగిరిలో ఉన్నత ప్రమాణంలో గడరింపబడినాము. ఆమూర్తికి నేపథ్య శిల్పములో గంగాయమునా సంగమము రసబంధురము. ఆశిల్పదృశ్యము కాళిదాసకవీంద్రుని *గంగాయమునా

* వివరములకు రఘువంశము 13 వ సర్గ 58 వ శ్లోకము చూడుము.

సంగమవర్ణనము స్మృతికి తెస్తుంది. దేవాలయ వాస్తుశిల్పంలో తొలిసారిగా నదులను మూర్తిమంతము చేసి, ప్రధాన దేవ మూర్తికి అంగదేవతలనుగా చేసినారు గుప్తకాలికశిల్పులు. ఏతాదృశ శిల్పసంవిధానమును *కుమారసంభవములో కాళిదాసు సూచన చేస్తున్నాడు.

దేవఘర్‌లో దేవాలయపీఠంమీద రామాయణ కథా దృశ్యాలు ప్రతిమా శిల్పసౌందర్యాన్ని విరజిమ్మినవి.

ఉండవల్లి మొగలి రాజపురములలో వరాహ త్రివిక్రమ విష్ణు, గజేంద్ర, గోవర్ధన కృష్ణమూర్తులు విష్ణు కుండి నాంధ్రశిల్పములు సుందరములు. గుప్తశిల్పమని అంటున్నారేకాని అది ఆంధ్రశిల్ప పరిణామమేఅని చెప్ప వచ్చును.

అలంకరణము గుప్తకాలీన శిల్పమున మనోహరమైన అలంకార చిత్రణము సమృద్ధముగా ఉన్నది. దేవాలయద్వార లలాట, రథికబింబాలపై సుందరంగా లలితంగా తీర్చిదిద్దిన 'కల్పలతా' విన్యాసం, పత్రలత, పత్రాంగుళి, పత్రభంగరచన, కుటిల పత్రావళీరచన విశిష్టాలంకార విధానం. ఏవంవిధ సుందరాలంకార విధానాన్ని చాందేల రాజపుత్రకాలంలో శిల్పులు అనుసరించినారు.

---

* వివరములకు కుమారసంభవము 7 వ సర్గ 42 వ శ్లోకము చూడుము.

వాస్తుశిల్పము శేషించిన గుప్తకాలీన దేవాలయాలు: —

1. జబల్‌పూర్ మండలంలోని నిగ్‌వాలో విష్ణు దేవాలయం.

2. నగోడ్ మండలంలో భూమరలో శివాలయం.

3. నచ్‌నాలో పార్వతీమందిరం.

4. సాంచీ, బోధగయల్లో ఆలయాలు.

5. దేవఘర్‌లో దశావతార దేనళం.

6. అలహాబాద్ వస్తు ప్రదర్శనశాలలో ఏకముఖ లింగము.

7. భీతిర్‌గాంలో ఆలయం.

గుప్తకాలంనాటి దేవాలయాలు దేవతాప్రతిమలకై నిర్మింపబడినవేకాని భక్తబృందం సమావేశం కావడంకోసం కాదు. తొల్లింటి గుప్తకాలిక దేవాలయాలకు శిఖరాలుండవు. ఆనంతర గుప్తకాలిక దేవాలయాలమీద శిఖరాలు నిర్మితమైనవి. ఆరంభదశలో పైకప్పు బల్లపరుపుగా ఉంటుంది. శిలనూ శిలనూ అతకడానికి సున్నం ఉపయోగించలేదు. దశావతార దేవాలయం వాస్తుశిల్పానికి తార్కాణము. గర్భాలయము సమున్నతపీఠముపై నిర్మితమై, అనావృతమై, సోపానయుతమై చతురస్రాకార వేదికాకేంద్రములో ఉంటుంది. గర్భాలయంలోపల అలంకారము లేదు. గర్భాలయ ద్వారమునకు ముందు కురచగా వసారా (మంటపంవంటిది) ఉంటుంది.

ఆలయద్వారము అద్భుతమైన సుందరశిల్పాలంకార శోభితం. ఇదే గుప్తకాలీన దేవమందిర వాస్తుశిల్ప విశేషం. ఆలయ ద్వారం అత్యాకర్షణీయం. ద్వారలలాట బింబముమీద ప్రతీహారి, మాంగల్యవిహగాలు, శ్రీవృక్షము, స్వస్తిక చిహ్నము పూర్ణఘటము, మిథునము, పత్రావళి, ప్రమథులూ, శంఖపద్మాలూ లలితంగా రూపించబడినవి. ద్వారమునకు ముందున్న చిన్నవసారా స్తంభాగ్రాలు పూర్ణకలశాలంకార శోభితాలు.

ప్రాసాదశిల్పము ప్రాసాదశిల్పానికి ఆరంభదశ అమరావతిలో నాగార్జునకొండలో చూడవచ్చును. గుప్తులకాలంలో దాని పరిణామము కనబడుతుంది.

చిత్రశిల్పము సాహిత్యంలో చిత్రశాలల ప్రస్తి తరుచుగా వస్తుంది. సంస్కృతనాటకాల్లో విరహులు కాలక్షేపానికి ధాతురాగంతో ఆలేఖ్యరచన చేస్తారు. భాస కాళిదాస భవ భూతుల రూపకాల్లో చిత్రశాలలు, చిత్రశిల్ప విశేషా లున్నవి. మాళవికాగ్నిమిత్రంలో చిత్రశిల్ప సంవిధాన విషయం వస్తుంది. విష్ణుధర్మోత్తరం చిత్రశిల్పాన్నిగురించి చెప్పింది.

విష్ణుధర్మోత్తరం - కామసూత్రాలు దేవాలయాలకు ప్రాసాద హర్మ్యా లకూ, నివాసాలకూ తగిన చిత్రాలంకరణం ఉండాలి. చిత్రా లలో సత్య, వైనిక, నాగర మిశ్రమ భేదాలున్నవి. నాగర మనే రసచిత్రము రసధ్వనిగల కావ్యంవలె ఉత్తమోత్తమం.

చిత్రశిల్పాన్ని చూచి ఆనందించడానికి అలంకార శాస్త్ర జ్ఞానమూ, నాట్యాభినివేశమూ ఉండాలి.

వాత్స్యాయన కామసూత్ర గ్రంథములో నాగరక వృత్తములో చిత్రశిల్పవిషయం ఉన్నది. నాగరకులు చిత్ర శిల్పాను నేర్చేవారు. ధనవంతుల ఇళ్ళలో చిత్రశాలలుండేవి. యశోధరుడనే కామసూత్ర వ్యాఖ్యాత షడంగములనే శిల్ప సంవిధానాన్ని గురించి చెప్పినాడు. శిల్పికి 1. రూపభేద, 2. ప్రమాణ, 3. రసభావ, 4. లావణ్యయోజన, 5. సాదృశ్య, 6. వర్ణికాభంగజ్ఞానము పుష్కలంగా ఉండాలి.

గుప్తకాలీన చిత్రశిల్పము అజంతా విహార చైత్య మందిరాల్లో బాఘ్‌విహారంలో, పుదుకోట్టలో సిట్టన్‌వాసల్ దేవాలయంలో, సింహళంలో సిగీరియా గుహామందిర కుడ్యాలమీద వాసించింది.

ప్రస్తుతము చిత్రశిల్పము 1, 2, 9, 10, 16, 17, సంఖ్యగల అజంతాగుహా విహారాల్లోమాత్రం నిలిచింది. 9, 10 గుహలలోని ఆలేఖ్యములు క్రీ. పూ. ప్రథమ శతాబ్ది నాటివి. మూడుశతాబ్దాలు గడిచిన తరువాత చిత్రశిల్పం గోచరిస్తున్నది. 1, 2, 16, 17 సంఖ్యగల గుహాలలోని శిల్పము ఉత్తమోత్తమము.

శిల్పశైలి అజంతా శిల్పశైలురులు ప్రకృతిసౌందర్యములో ముగ్ధులై ధాతురాగముతో ఆలేఖ్యములు చిత్రించినారు. కుసుమిత వనీతరులతలు, శాంతవాహినులు, గజ వానర

హరిణశకములయెడల శిల్పికిగల కారుణ్యము అధికము. కేవలం జంతుచిత్రణ అందుకోసమేకాక, అనంత సృష్టివిలాసంలో అంశగా భాసిస్తున్నది. **Rothenstein** అనేశిల్పి చెప్పినట్లు శిల్పుల లావణ్య యోజనలో భౌతికాధ్యాత్మిక మూల్యములు ఓతప్రోతంగా వ్యక్తమైనవి.

చిత్రశిల్పములోని వృత్తము అలంకరణము, మూర్తి చిత్రణం, కథనం అనే మూడుపద్ధతులలో ఉన్నది.

అలంకరణవిధానం అలంకార విధానములో వైవిధ్యము ఎక్కువ. పునరుక్తిలేని కల్పనావైచిత్రి దర్శనీయము. పత్రావళీ, పత్ర భంగరచన, పశుపక్ష్యాదులునూ చికిలిచేసినట్లుంటని. కుడ్యం మీదనో కప్పుమీదనో ఎక్కడచోటుంటే అక్కడ శిల్పులు సువర్ణ గరుడాదులను అభూత కల్పనామయ పశుపక్ష్యాదులను చిత్రించినారు.

మూర్తిచిత్రణము అజంతాలో మొదటిగుహాలోని అవలోకితేశ్వర చిత్రము ఉన్నతస్థాయి నందుకొన్నది. సామాన్యంగా కేంద్ర ములో బుద్ధులూ బోధిసత్త్వులూ ఉంటారు. గౌతముని జీవిత ఘట్టాలే కథావస్తువు. అవలోకితేశ్వర పద్మపాణి బోధిసత్త్వ మూర్తులు భారతీయ చిత్రకళలో చిరస్థాయిగా ఉంటారు. భావోదాత్తతకు ఈ చిత్రాలు తారాణాలు.

కథనచిత్రాలు కథనచిత్రాలలో బుద్ధజీవితమే ప్రధానం. 16 వ గుహాకుడ్యంమీద షడంత జాతకకథ చిత్రింపబడింది. పూర్వ జన్మలో తనప్రియుడైన మహాగజదంతములను విలోకించిన

రాణి వేదనతో చనిపోతుంది. కరుణరస ప్రధానం. గ్రిఫిత్ బర్గెస్, ఫెర్గూసన్ మహోదయులు ప్రశంసించారు. "కరుణ రసాభివ్యక్తికి, నిర్దుష్ట కథావిధానానికీ ఈ చిత్రమును మించ గలది శిల్పచరిత్రలో సాధ్యంకాదని నా అభిమతం. ఫ్లారెన్సు చిత్రకారుడు ఇంతకన్న బాగా గీయవచ్చును. వెనిస్ చిత్ర కారుడు ఇంతకన్న వర్ణకాలేపనం చేయవచ్చును. కాని ఇటలీ దేశీయ, శిల్పులిద్దరూకూడా భారతీయశిల్పివలె భావాభి వ్యక్తీకరణం చేయలేరు."

17 వ గుహ - చిత్రశాల 17 వ గుహ యాత్తూ ఒక సుందర చిత్రశాల. గౌతముని జీవనోదయ సంధ్యలే ఇతివృత్తము. **Lady Herringham** 'మాతాశిశువులు' అనే చిత్రంలో వెలుగునీడలపొందిక, మూర్తుల సహజభంగిమలూచూచి ప్రశంసచేసింది.

మొదటి రెండుగుహల్లో మూర్తిచిత్రణలో శిల్పి క్లిష్ట నాట్యభంగిమలు చూపినాము. ద్వితీయ పులకేశి పారశీక ప్రభువునుండి వచ్చిన రాయబారిని సమ్మానించిన చిత్రములో కొంత పారసీక ప్రభావం ఉన్నది.

బాఘ్‌విహారం బాఘ్ (వ్యాఘ్ర) విహారంలో అజంతాశైలి కనబడుతుంది. అలంకార విధానంలో వైవిధ్యం ఉన్నది. ప్రతివిన్యాసమూ, భంగిమమూ చికిలిచేసినట్లుంటవి. ఈ విహా రాలు మాళవంలో ఇందూరు సమీపంలో ఉన్నవి. క్రీ. శ. 6, 7 శతాబ్ద మధ్యకాలమునాటివి.

వెట్టైన్‌వాసల్ పుదుక్కోట్టలో సిట్టైన్‌వాసల్ గుహాలయం పల్లవ మహేంద్రవర్మనాటివి. గుహాలయపు లోకప్పుపూత పద్మవనం, పూతులున్న సరస్సు, విచ్చీవిచ్చనిపద్మాలు, పద్మాకరంలో చేపలూ వృషభాలూ భావలాలిత్యంతో చిత్రింపబడినవి. రాజూ రాణీ ఉన్నచిత్రం, నృత్తమూర్తులున్నచిత్రమూ అందమైనవి.

సిగీరియా సింహళంలో సిగీరియాగుహాలో బుద్ధాలయానికి తరలిపోతున్న సర్వాభరణ భూషితలైన కులీనస్త్రీలదృశ్యము రమణీయం. క్రీ. శే. అడవి బాపిరాజుగారు సిగీరియా చిత్రాలకు ప్రతికృతులు తయారుచేసినారు.

అజంతా చిత్ర లక్షణాలు

1. రేఖావిన్యాసములో శిల్పికిగల ఆత్మవిశ్వాసము గ్రహించగలము. చిత్రణ పూర్తి అవ్వతున్నస్థితిలో రేఖ లలితంగా దృఢంగా సొంపుగా వాస్తవికంగా ఉంటుంది. మొత్తంమీద అజంతాచిత్రం మధ్యమ కాలిక ఇటలీదేశీయ చిత్రంవలె ఉంటుంది.

2. నాట్యముద్రలూ భంగిమలూ భావస్ఫోరకంగా ఉంటవి. శిల్పులకుగల నాట్యకళాపరిజ్ఞానం అధికం. ఎల్లోరాలో ఆంధ్రశిల్పులూ ఏతాదృశులే.

3. అలంకార సంవిధానం అద్భుతం.

4. భావవ్యక్తీకరణం నిరుపమానం. వ్యక్తీకరణంలో నాటకీయత గోచరిస్తుంది.

5. రేఖావిన్యాసంలో జీవచైతన్యం, గతి భాసిస్తవి.

6. లావణ్యయోజనం, వర్ణికాభంగ సౌందర్యము మనోహరం.

ఆనంద కుమారస్వామి మహోదయుల సమీక్ష అజంతా చిత్రశిల్పము పుష్కల భావనా విలసితమైనప్పటికీ సమాజ వ్యతిరేకతలేదు. శిల్పలాలిత్యము సమృద్ధమై ఆధ్యాత్మికతకు దూరముకాని రీతిలో జీవితవిలసనం ప్రకటితమైంది. జీవితమే కళగా భాసించింది. అయితే జీవిత తాత్పర్యమును విస్మరించలేదు శిల్పులు. సారనాథ బుద్ధమూర్తి అనలోకేశ్వర పద్మపాణులు అందుకు తార్కాణాలు. బాహ్యాంతర జీవనైక్యము పృథక్కరణామోగ్యమై మహోదాత్తమై విశ్వజనీనమైనది గుప్తకాలీనశిల్పము. యావదాసియాఖండ సంస్కృతిలోని ఆత్మచైతన్య ప్రభావిలసనకూ గుప్తకాలీన భరతఖండమే మూలము.

మృణ్మయమూర్తి (Terracotta) బాణభట్టు మృణ్మయమూర్తులు చేయడం గుప్తకాలీన శిల్పకళలో ఒక అవాంతరభాగం. మట్టి బొమ్మలైనా కోమలంగా సుందరంగా ఉంటవి భట్టబాణుడు కాదంబరిలో విరహావిహ్వలుడైన వైశంపాయనుణ్ణి చతుర్విధ శిల్పాకృతులలో పోల్చినాడు. అతడు మందిరస్తంభాకృతిగా, ఆలేఖ్యంలోమూర్తిగా గండరింపబడిన శిల్పప్రతీకవలె, మృణ్మయమూర్తిలాగ ఉన్నాడని అనడంచేత, తత్కాలీన శిల్పభేదాలు సాహిత్యంవల్లనూ తెలుస్తున్నవి. సామాన్యంగా

ఇళ్ళల్లో కుడ్యాలంకరణంగా దేవతామూర్తులు, కుజ్జలు, పశుపక్ష్యాది మృణ్మయమూర్తులనూ ఉపయోగించేవారు. దేవాలయాల్లోకూడా మృణ్మయప్రతిమలను విరివిగా వాడేవారు. హర్షచరితంలో భట్టబాణుడు చెప్పినాడు. రాజ్యశ్రీ పరిణయ సందర్భంలో శిల్పులు మృణ్మయ ప్రతీకాలు, మత్స్యములు, తాంబేళ్ళు నారికేళాదులు చేసినారట. శుభ సూచకంగా ఫలములుచేతనున్న స్త్రీమూర్తులను అనగా "అంజలీకారిక" లను వేదికాపార్శ్వములకు తగిలించినారట.

బ్రాహ్మణమతంలోని దేవతామూర్తులు కార్తికేయ విష్ణు సూర్య గంగా దుర్గ యమునా ప్రతీకాలు గంగానదీ మైదానంలో లభ్యమవుతున్నవి.

మృణ్మయమూర్తుల ముఖాల్లో లాలిత్యం ఉట్టిపడుతున్నది. ఎన్నోతీరుల్లో కేశాలంకరణం చూడవచ్చును. ఈ కాలంలో నాగరిక స్త్రీలకన్న మిన్నగా కేశాలంకృతిని మట్టిబొమ్మలలో చూడవచ్చును.

అహిచ్ఛత్రము, రాజఘాటులలో లభించిన మృణ్మయ మూర్తుల ధమ్మిల్లాలంకారరీతులు, కపోలాలపై పత్రరచనలూ వర్ణకాలేపనమూ సుందరములు. డాక్టర్ అగర్వాలు ఈ బొమ్మలనుచూచి ముగ్ధుడై "Lyrics in clay" అని ప్రశంసించినాడు.

విద్య పాటలీపుత్రము, వలభి, ఉజ్జయిని, పద్మావతి, తక్షశిల, అమరావతి, అయోధ్య, కాశి, మధుర, నాసిక, కాంచీ

నగరాలు ఉన్నతవిద్యాకేంద్రాలు. దక్షిణాపథములో విద్యాపీఠాలను ఘటికాస్థానము లనేవారు. బౌద్ధవిహారాలు ధర్మవ్యాప్తికేకాక విద్యాపీఠములై సంస్కృతీకేంద్రాలై నవి. ఈ విద్యాలయాలకూ ప్రజలకూ సన్నిహితసంబంధం ఉండేది. అంతేకాని ప్రస్తుతకాలపు విశ్వవిద్యాలయాలవలె కేవలం పరీక్షలకోసమేకాదు, సంస్కారంకోసం. గుప్తకాలానికి పూర్వం తక్షశిల, కాశీ, ఉజ్జయిని, అమరావతి ప్రధాన విద్యాపీఠాలు. గుప్తయుగంలో నాలంద విద్యాపీఠం ఖండఖండాంతరాలలో వాసికెక్కింది.

నాలంద. జ్ఞానప్రసారం ఎంతచేసినా . వొడిగట్టని దీపకళిక నాలంద. చీనా జపాన్, కొరియా, యవద్వీపం, సువర్ణద్వీపం, తిబెత్, మంగోలియా, బొఖారా మొదలైన యావదాసియా ఖండంనుంచీ విద్యార్థులు మగధలో నాలందకు వచ్చేవారు. అందుచేత అది విశ్వజనీన విజ్ఞానక్షేత్రమై విరాజిల్లింది. విశ్వవిద్యాలయంలో స్థావళంగా 10,000 విద్యార్థులుండేవారు. 1500 మంది అధ్యాపలుండేవారు. వాదహేతు ప్రధానంగా శాస్త్రాధ్యాపనం జరిగేది. కళలూ దర్శనాలు శాస్త్రములూ బోధించే విద్వాంసులూ, ఆదర్శమూర్తులైన ఛాత్రులవల్లా విద్యాపీఠం పేరెన్నికగన్నది. ప్రభుత్వము రమారమి నూరుగ్రామాలమీద వచ్చేఆదాయాన్ని విద్యాపీఠ నిర్వహణానికి సమర్పించేది. అధ్యాపకులూ తిష్యగోటి సమావేశమయ్యే కక్ష్యలు నూరుండేవి. అర్హులైన విద్యార్థి

లకు విద్యాపీఠము భృతిఇచ్చేది. జలఘటీయంత్రము కాల మానము తెలియచేసేది.

గుజరాతులో వలభి, బిహార్‌లో విక్రమశిల ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు.

క్రీ. శ. 11 వ శతాబ్దంలో మధ్యాసియానుంచి మ్లేచ్ఛులువచ్చి సంస్కారహీనులై సాంప్రదాయక విద్యా పీఠాలను భస్మంచేశారు.

(Pageant of Indian History 275—276 పుటలు)
"Night was to descend on all the great centres of traditional Indian learning, however, when the untutored Muslims of Central Asia poured into India with fire and sword at the beginning of the 11 A. D.")

సాహిత్యము భారతీయ సాహితీకిరీట కోటీరమణిగా కాళిదాస కవీంద్రుడు ప్రకాశించినాడు. ఋతుసంహారము రఘువంశము, కుమారసంభవము, మేఘదూత ఆయన కావ్యరత్నాలు. మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయము అభిజ్ఞాన శాకుంతలము నాటకత్రయము. "కావ్యేషు నాటకం రమ్యం, నాటకేషు శకుంతలా" అనే ఉక్తిప్రసిద్ధము. శాకుంతలములో స్వర్గ మర్త్యలోకాలూ, అమరత్వ మానవత్వములూ, ఇహపరాలూ అద్భుతంగా సమన్వయమైనవి. కాళిదాసుని రచన రసబంధురము. కొద్దిమాటల్లో రమణీయార్థము ద్యోతక మవుతుంది. విప్రలంభ శృంగారచిత్రంలో కవి అద్వితీయుడు.

మేఘదూతలో కవిచంద్రుడు యక్షుడై ప్రవాసవిరహార్తిని రమణీయంగా చెప్పినాడు. 'ఉపమా కాళిదాసస్య' అనే సూక్తి జగద్విదితము. ఉపమాలంకారములు కవితావధూటీ లావణ్య బంధురాలు. ఆమెను తలచినకొద్దీ కవితాసౌందర్యము ఉద్భుద్భవుతూ ఉంటుంది. కవీశ్వరుని శైలి సరళము; లాలిత్యసంపద అనంతము.

శకుంతలా పాత్రచిత్రణమునకు గెట్ జర్మన్ కవీశ్వరుడు ముగ్ధుడై కవిత చెప్పినాడు.

భట్టబాణుడు గద్యరచన తేలికపనికాదు. కవిప్రతిభకు గద్యరచన గీటురాయి. భట్టబాణుని కాదంబరీ హర్షచరిత్రలు గద్యరచనలైనా కవితామాధురీ విలసితాలు. బాణుడు చంపూ గద్యరచయితలకు ఒరవడి దిద్దినాడు. హర్షచరిత్రలో తత్కాలీన లోకవృత్తము కొంత ప్రతిఫలించింది. కాదంబరి కథ అత్యంతాకర్షణీయము. అందుకే బాణుడు అవతారికలో "రసేనశయ్యాం స్వయమభ్యుపాగతా కథా జనస్యాభినవావధూరివ" అని చెప్పినాడు! బాణుని వాక్కులో మాధుర్యం జాలువారుతుంది. సర్వజగత్తూ ఆయన వాగ్విలాసంలో భాసిస్తుంది.

భారవి కవికృతము కిరాతార్జునీయకావ్యము. ఈ కవీశ్వరునిలో అర్థగౌరవం అధికం.

మాఘుని 'శిశుపాలవధ'లో పదగుంపనం, అర్థగౌరవం, వర్ణనాచమత్కృతి, విదగ్ధ గోచరిస్తవి.

హరిసేనుడూ, యశోవర్మ ఆస్థానకవిగా వాసులుడూ, వత్సభట్టి గీర్వాణకవులుగా ప్రసిద్ధులు. శిలాలేఖనాల్లో ప్రశస్తిరూపంగా వారికవితాపాటవం కనబడుతుంది. గుప్త యుగంలో గీర్వాణ సాహితీ వధూటీలావణ్యం రసికులను ముగ్ధులనుచేస్తుంది.

శాస్త్రములు గణిత, ఖగోళ, ఆయుర్వేద, రసాయన, పదార్థ విజ్ఞాన, ఖనిజ విజ్ఞానశాస్త్రాలు వృద్ధిచెందినవి.

గణితశాస్త్రంలో దశాంశపద్ధతి (**Decimal System**) అద్భుత పరిశోధనం. రేఖాగణితం ఉన్నతికివచ్చింది. వృత్తము లకూ త్రికోణాలకూ సంబంధించిన అనేకసిద్ధాంతాలు ప్రకటింపబడినవి. క్రీ. శ. 449 లో ఆర్యభట్టుని ఆర్యభట్టీయం, గణితం, రేఖాగణితం, బీజగణితాలకు సంబంధించినగ్రంథం. త్రికోణమితికూడా అభివృద్ధిలోఉన్నది. యవనులకన్న భారతీయులు గణితంలో ముందడుగువేసినారు. భూచ్ఛాయలోకి గానీ భూమికీ సూర్యుడికీ మధ్యనో చంద్రుడు రావడంవల్ల గ్రహణాలు పర్వడతవనీ, భూమి తనకక్ష్యమీద భ్రమణం చేస్తుందనీ భారతీయులు కనుక్కొన్నారు. ఖగోళవిజ్ఞానంలో త్రికోణమితిని ప్రయోగించినారు. పాశ్చాత్య ఖగోళవేత్తల కన్న ఆర్యభట్టు అగ్రగామి. యవనసిద్ధాంతాలు మనవా రనుసరించారని అనుకోడం పొరపాటు.

ఆయుర్వేదము చరక సుశ్రుత సంహిత లుద్భవించినవి. చరక సుశ్రుతుల నిర్ణయాలు వాగ్భటుని అష్టాంగ సంగ్రహంలో

ఉన్నవి. వైద్యునికి ఉండవలసిన ఉన్నతాదర్శాలనుగూర్చి చరక సుశ్రుతులు* చెప్పినారు. "వైద్యుడు యోగి, చక్కని శీలసంపదకలవాడై మానవకోటికి సేవచేయడానికి సిద్ధపడాలి." శారీరక ధాతు, వస్తుగుణ విజ్ఞానం భారతీయులకు కూలంకషంగా తెలియును. సుశ్రుతుడు శస్త్రచికిత్సా నిపుణుడు. శస్త్రచికిత్సకు మనవారు సున్నితమైన సాధనాలు చేసినారు.

వరాహమిహిరుడు గణిత, రసాయన, వృక్షాయుర్వేద ఖగోళశాస్త్ర విజ్ఞానసంపన్నుడు. సర్వతోముఖ ప్రతిభావిలసితుడు.

కాన్యకుబ్జ యుగములో హర్షుని అనంతరం అయిదున్నర శతాబ్దాలలోగా ఉత్తరభారతదేశంలో రాజపుత్రరాజ్యాలుదయించి అస్తమించినవి. కాశ్మీరం, కాన్యకుబ్జం, వంగదేశములో పాలసేనవంశాలు, బుందేల్‌ఖండములో చాందేలులు, గుజరాత్, మాళవము, ఢిల్లీ, అజ్మీరులు ప్రధాన రాజపుత్రరాజ్యాలు పాలించినవి. దక్షిణదేశములో చాళుక్య, రాష్ట్రకూటాది రాజవంశములు ప్రసిద్ధములు.

---

* వీరిజీవితం, సిద్ధాంతాలూ సంపూర్ణంగా 'వృద్ధత్రయి' అనే గురుపాదహాల్ దారకృత సంస్కృతగ్రంధములో ఉన్నవి.

రాష్ట్రికూటులు

I మాల్కేడ్ రాష్ట్రికూటులు



2. రాష్ట్రకూటులు – గుజరాతశాఖ



చాళుక్యచక్రవర్తి, దంతిదుర్గుడనే సామంతునివల్ల క్రీ. శ. 752 లో రాజ్యభ్రష్టుడు కావడంతో చాళుక్యవంశం అంతరించింది. రాష్ట్రకూట వంశారంభమైనది. దంతిదుర్గుడు ఘూర్జరము, మధ్యప్రదేశము, బీరారులు జయించినాడు. మహారాజాధిరాజ పరమేశ్వర భట్టారక బిరుదము వహించినాడు.

కృష్ణుడు I రాజైనాడు. అతడు దక్షిణ కొంకణం జయించి శీలహార వంశీయుడైన శనఫుల్లునికి అప్పగించినాడు. అతడు క్రీ. శ. 760 లో చాళుక్యులతో పోరి తద్వంశమును రూపుమాపినాడు. అతని బిరుదములు :—శుభతుంగుడు, అకాలవర్షుడు. అతడు ఎల్లోరాకొండ తొలిపించి కైలాసనాథాల

యము శిల్పకళా శోభితంగా కట్టించినాడు. ఎల్లోరాశిల్పము అజంతాలోవలె భారతీయ కళాపారమ్యమును ప్రాపించింది.

II గోవిందుడు కృష్ణునికుమారుడు. అదివరకే అతడు యువ రాజుగాడుండి వేంగిలో IV విష్ణువర్ధనుని జయించినాడు. అతడు రాజ్యానికివచ్చి భోగలాలసుడై రాజ్యభారం ధృవుడనే సోదరుడికి ఇచ్చినాడు.

ధృవుడు క్రమంగా బలిష్ఠుడై సింహాసనం ఆక్రమించినాడు. దక్కనుకు ఏకచ్ఛత్రాధిపతి కాగలిగినాడు. ధృవుడు వింధ్య దాటి మాళవముజయించి కాన్యకుబ్జమును దాడిచేసినాడు. వత్సరాజు వెనుకకు తగ్గినాడు. అతడు యుద్ధంలో పారిపోయి రాజస్థానం చేరినాడు. ఈ విజయంతో ధృవుడు పాలవంశీయుడైన ధర్మపాలుని ఎదిరించినాడు. క్రీ. శ. 790 లో సింహాసనం వారసత్వపు తగాదాలో చిక్కుకోడంవల్ల అతడు దక్షిణాపథంలో ఉండవలసివచ్చింది. ధృవునికాలంలో రాష్ట్రకూటులు మహోన్నతస్థితిలో ఉన్నారు. ధృవుడు సమర్థులైన కుమారుల్లో మూడోవాడైన గోవిందుణ్ణి రాజుగా చేసినాడు.

తృతీయగోవిందుడు అతని బిరుదములు జగత్తుంగ, ప్రభూతవర్ష, శ్రీవల్లభ, జనవల్లభ, కీర్తినారాయణ, త్రిభువన ధవళ. గోవిందుడు జ్యేష్ఠుడై రాజ్యానికి రాలేదు. తండ్రి ఎన్నిక చేయడంవల్ల సింహాసనారోహణం చేసినాడు. అందుచేత అతనిసోదరులు రాజ్యంలో విప్లవం తెచ్చినారు. గోవిందుడు క్రాంతిజ్వాలలు ఆర్పివేసినాడు. అంతటితో అతని సోదరుడైన

స్తంభుడు అనుకూలుడైనాడు. క్రీ. శ. 795 లో గోవిందుడు దక్షిణాపథానికి ఏకచక్రవర్తికాగా ఉత్తరాపథంలో దిగ్విజయం చేయాలనే జిగీషతో ఉన్నాడు.

ఉత్తరాపథంలో ధర్మపాలుడు వత్సరాజుకన్న ముందుగా తేరుకొని శక్తిమంతుడై చక్రాయుధుడనేవాణ్ణి కాన్యకుబ్జ సింహాసనంమీద ఉంచినాడు. వత్సరాజు అనుయాయి II నాగభట్టు వెంటనే కాన్యకుబ్జము ఆక్రమించి చక్రాయుధుణ్ణి, ధర్మపాలుణ్ణి ఓడించినాడు.

విజయాలు గోవిందుడు ప్రతీహారరాజైన నాగభట్టునూ, పాల వంశీయుడైన ధర్మపాలుణ్ణి, బుందేలుఖండప్రాంతంలో క్రీ. శ. 800 లో నిర్జించినాడు. ఘూర్జర ప్రతీహార పాలరాజులను ఓడించడంతో రాష్ట్రికూట ప్రతాపం ఇతోధికమైంది. అతని విజయపరంపరను వర్ణించిన సంజాన్ శాసన శ్లోకమును ఉల్లేఖిస్తున్నాను.

"హిమవత్పర్వత నిర్ఝరాంబు తురగైః పీతం చ గంగాగజైః
ధ్వనితం మజ్జన తూర్యకైః ద్విగుణితం భూయోపి తత్కందరే
స్వయమే లోపనతే చ యస్య మహతస్తో ధర్మచక్రాయుధా
హిమవాన్కీర్తి సరూపతా ముపగతస్త తీక్ర్తినారాయణాః.

(S. Plates 23 వ శ్లోకము.)

వేంగీ చాళుక్యరాజు ద్వితీయ విజయాదిత్యుడు విప్లవ శంఖం ఫూరించగా, గోవిందు డతనిని నిర్జించి చాళుక్య భీమున్ని వేంగీసింహాసనంమీద ఉపవిష్టుని చేసినాడు.

రాష్ట్రికూట గోవిందుడు ఔత్తరాహులను జయించి విజయయాత్ర చేస్తున్నప్పుడు, దక్షిణాపథంగా గాంగ కేరళ పల్లవ పాండ్యులుకలిసి సంయుక్త ప్రతిఘటనచేయగా క్రీ. శ. 802 లో దానిని భేదించినాడు.

రాష్ట్రికూట చక్రవర్తి గోవిందుడు సార్వభౌము డైనాడు. అతనిసేనలు కన్యాకుమారిమొదలు గాన్యకుబ్జము వరకు శత్రుచ్ఛేదనచేసి విజయపతాకాలు ఎగురవేసినవి.

అమోఘవర్షుడు క్రీ. శ. 814 లో రాష్ట్రికూట సింహాసనం అధిష్ఠించినాడు. అతడు పదునాలుగేళ్ళవాడు కనుక పరిపాలన గుజరాతులో రాష్ట్రిపాలుడైన కరక్కునికి అప్పగించినాడు. అదిచూచి వేంగీరాజైన ద్వితీయ విజయాదిత్యుడు విప్లవము సాగించినాడు. క్రీ. శ. 821 లో కరకుడు సింహాసనంమీద అమోఘవర్షుణ్ణి ప్రతిష్ఠించి రాజ్యం నిలువబెట్టినాడు.

యుద్ధాలు క్రీ. శ. 830 లో అమోఘుడు వేంగిని ఆక్రమించి యుద్ధంచేసినాడు. ఇరువదేళ్ళపాటు కళింగ గాంగరాజులతో సమరం సాగించిన రణప్రియుడు అమోఘుడు. ఆయన తన కుమార్తిని గాంగరాజు కిచ్చినతరువాత వైరం చల్లారింది; స్నేహం మొలకెత్తింది.

సిర్పూర్ శిలాశాసనాలనుబట్టి అంగ, వంగ, మూళవ, మగధ వేంగీపాలకులు రాష్ట్రికూట ప్రభువుకు వశ్యులైనారు. అమోఘుడు మాన్యఖేట పురీనిర్మాణం చేసినాడు. అది రాష్ట్రికూటుల రాజధాని అయినది.

అతని జీవనసంధ్యలో కల్లోలం ఉద్భవించింది. ఘూర్జర ములో రాష్ట్రికూటశాఖకూ, మాన్యఖేట శాఖకూమధ్య వైరాగ్నిజ్వలించి పాతికేళ్ళపాటు చల్లారలేదు.

కృష్ణుడు II క్రీ. శ. 878 లో రాజైనాడు. ఆయన పరిపాలనలో యుద్ధాలు రేగినవి. ఆయన ఘూర్జరులను బెదరగొట్టినాడు. ద్వితీయకృష్ణుడు ప్రతీహారరాజులతో, తూర్పుచాళుక్యులతో సమరాలు సాగించినాడు. అతనిని జయలక్ష్మి వరించింది. వరించినా యుద్ధాలవల్ల నష్టమే సంభవించింది. తనపౌత్రుని రాజ్యం నిలపడంకోసం కృష్ణుడు యుద్ధంసాగించి పరాజితుడైనాడు.

III ఇంద్రుడు క్రీ. శ. 914 లో రాజైనాడు. తృతీయ గోవిందునివలె ఇంద్రుడు యుద్ధతంత్ర మెరిగినవాడు. ఘూర్జర ప్రతీహార ప్రభువైన మహీపాలునితో యుద్ధముచేసినాడు. కాన్యకుబ్జ సింహాసనం రాష్ట్రికూటులకు దక్కింది. మహీపాలుడు పారిపోయినాడు. రాష్ట్రికూట ప్రతాపము జాజ్వల్యమైంది. ఇంద్రుడు చాళుక్యసామంతుడైన వేములవాడ ద్వితీయ నరసింహునిపై సేనను పంపినాడు.

వేంగీపాలకులకూ రాష్ట్రకూటులకూమధ్య వైరానలం జ్వలిస్తూనే ఉన్నది. క్రీ. శ. 922 లో ఇంద్రుడు ఇహలీల చాలించినాడు.

II అమోఘవర్షుడు రాష్ట్రకూట సింహాసనం అధిష్ఠించినాడు. నాలుగవ గోవిందునివల్ల అమోఘుడు మరణించినాడు.

IV గోవిందుడు అమోఘుని వధించి రాజైనాడు. వ్యసనాలకు దాసుడై క్రూరుడై జనకంటకుడైనాడు. ప్రజలు వేసారి తృతీయ అమోఘవర్షుని రాజుగా ఆహ్వానించినారు. క్రీ. శ. 936 లో మూడేళ్లు పరిపాలనచేశాడు.

III కృష్ణుడు క్రీ. శ. 939 లో రాజైనాడు. కృష్ణుడూ, బావ మరదిఅయిన భూతగుడూకలిసి 943 లో కాంచీపురి, తంజాపురి చోళరాజ్యమునూ జయించి రామేశ్వరంలో విజయస్తంభ ప్రతిష్ఠచేసినాడు. బుందేలుఖండముమీద సమరధాటి చూపి నాడు. ఉజ్జయినిని ఆక్రమించడం జరిగింది. వేంగీచాళుక్యులు కృష్ణునికి వశ్యులైనారు. క్రీ. శ. 965 లో కృష్ణుడు దక్షిణా పథమునకు సార్వభౌముడు.

ఖొట్టిగుడు క్రీ. శ. 967 లో కృష్ణుని తమ్ముడు ఖొట్టిగుడు రాజైనాడు. పరమార వంశీయప్రభువు రాష్ట్రకూట రాజ ధానిని ముట్టడిచేసినాడు. క్రీ. శ. 972 లో ఖొట్టిగుడు మరణించినాడు.

కరకుడు II ఖొట్టిగుని మేనల్లుడు కరకుడు రాష్ట్రికూట సింహాసనము ఆరోహించినాడు. కరకు డశక్తుడు. కావడంచేత చాళుక్య వంశీయుడైన రెండవ తైలపుడు అదివరకల్లా రాష్ట్రికూటుల సామంతుడై ప్రస్తుతము ఎదురుతిరిగినాడు. కరకుడు పారిపోయినాడు. రాష్ట్రికూటు లింతటితో అస్తమించినారు.

రాష్ట్రికూటరాజ్యం నశించినా ఇప్పటికీ ఎల్లోరాలో కైలాసనాథాలయం అజంతావలె ఉత్కృష్ట శిల్పసౌందర్యోపేతమై రాష్ట్రికూటుల యశస్సునకు సాక్ష్యమైనది.

కాశ్మీరము కాశ్మీరమును మొదట కర్కోటవంశీయుల పరిపాలనానంతరం ఉత్పలులు పాలకులైనారు. వారిలో అవంతివర్మ (క్రీ. శ. 855—883) గొప్పవాడు. కల్హణుడు సంస్కృత భాషలో కాశ్మీర రాజచరిత్రను 'రాజతరంగిణీ' రచించినాడు క్రీ. శ. 12 వ శతాబ్దిలో. క్రీ. శ. 14 వరకూ హైందవ రాజులు పాలనచేసినారు. అనంతరం దేశం ముసల్మానుల హస్తగతమైంది.

కాన్యకుబ్జము హర్ష యశోవర్మల అనంతరం ఉత్తరాపథాన్ని ఘూర్జర ప్రతీహార రాజవంశము విస్తార యశోవైభవంతో సామ్రాజ్యస్థాపనచేసి పరిపాలించినది.


ప్రతీహారులు
నాగభట్టు I
తక్కుక
దేవరాజు
వత్సరాజు
నాగభట్టు II
రామభద్రుడు
మిహిరభోజుడు
దేవనాగాదేవి
మహేంద్రపాలుడు
మహాదేవి
ద్వితీయభోజుడు
వినాయకపాలుడు I
మహేంద్రపాలుడు II
దేవపాలుడు
వినాయకపాలుడు II
మహీపాలుడు II
విజయపాలుడు
రాజ్యపాలుడు
త్రిలోచనపాలుడు
యశపాలుడు

సింహావలోకనము సుమారొక శతాబ్దకాలము ఘూర్జర ప్రతీహార రాజవంశము ఉత్తరభారతదేశాన్ని ముసల్మానులు రాక పూర్వం ఏలిన తుదిసామ్రాజ్యము. వీర ప్రతీహారరాజులు ముసల్మానుల ధాటిని ప్రతాపముతో ఎదుర్కొన్నారు. జునయ్యాదునుంచి మహమ్మదుగజనీ కాలందాకా ప్రతీహారులు మ్లేచ్ఛులను నిరోధించి దేశస్వాతంత్ర్యం నిలిపి భారతీయ సంస్కృతికి పోషకులై కీర్తిగడించినారు.

క్రీ. శ. 750-850 దాకా ఒకశతాబ్దముపాటు ఉత్తరాపథంలో కాన్యకుబ్జ సామ్రాజ్యాధిపత్యంకోసం, పాల రాష్ట్రకూట, ఘూర్జర ప్రతీహారులు సమరములు సాగించినారు. చివరకు ప్రతీహార భోజరాజేంద్రుణ్ణి సామ్రాజ్యలక్ష్మి వరించింది. ఆయనకీర్తి గ్వాలియరు శాసనంవల్ల విశదమవుతున్నది. చక్రవర్తిగా, గీర్వాణ సాహితీ పోషకుడుగా, భారతీయ విజ్ఞాననిధిగా మిహిరభోజుడు చిరస్మరణీయుడు.

ప్రతీహారులలో నత్సరాజు, రెండవనాగభట్టు భోజ, మహేంద్రపాలురు మహోన్నతులు. 150 సంవత్సరాలు సామ్రాజ్య ఛత్రదండము నిలిపి, రణావనీ విహార విక్రమకేళి సలిపినారు. శత్రువులైన అరబ్బులుకూడా ప్రతీహారుల ఘనతను తమగ్రంథాల్లో ప్రశంసించినారు.*

---

* ప్రతీహారులచరిత్ర విపులంగా ఆర్. సి. మజుందార్‌గారి రచనచూడండి. గ్వాలియరు ప్రశస్తి (సంస్కృతము) ని చూడండి.

గహద్వాల రాజవంశము ప్రతీహారుల తరువాత గహద్వాల రాజవంశము కాన్యకుబ్జ సామ్రాజ్యం పాలించింది. పాలకులలో జయచంద్రుడు ప్రసిద్ధుడు. అతడు తనకుమార్తెను సంయుక్తను చౌహాణరాజ వంశీయుడైన పృథ్వీరాజుకిచ్చినాడు. అగాధ జగద్విదితము. మహమ్మదు గోరీవల్ల జయచంద్రుడు పరాజితుడైనాడు. కాన్యకుబ్జము మహమ్మదీయ హస్తగతమైంది.

వంగదేశము వంగదేశములో కొంతభాగమును ఆనంతర గుప్త వంశీయులు, మౌఖరులు పరిపాలించినారు. క్రీ. శ. 750 నుంచి పాలవంశీయులపాలన అరంభమైంది. క్రీ. శ. 13 వ శతాబ్దిలో ముసల్మాను పదాక్రాంతమైంది వంగభూమి.

బుందేల్‌ఖండ్ క్రీ. శ. 9 వ శతాబ్దములో చాందేల రాజపుత్ర వంశము ప్రసిద్ధము. ఘూర్జర ప్రతీహారులు చాందేలురను నిర్జించి బుందేలుఖండాన్ని కాన్యకుబ్జ సామ్రాజ్యంలో కలుపుకొన్నారు. చాందేలులు శిల్పకళాప్రియులు. దేవాలయ నిర్మాతలు. వారికీర్తికి ఖజురాహో దేవాలయ శిల్పాలే సాక్ష్యం.

ఘూర్జరమాళవములు ఘూర్జరదేశాన్ని సోలంకిరాజవంశం పాలించింది. మాళవమును పరమార రాజవంశం పాలనచేసింది. క్రీ. శ. 1018-1060 లో పరమారభోజుడు మహోన్నతుడు. గీర్వాణ వాఙ్మయ పోషకుడు. శిల్పకళాపోషకుడు. విద్వాంసుడు.

అజ్మీరు అజ్మీరులో చౌహాణ రాజవంశం ప్రసిద్ధము. చౌహాణులలో పృథ్వీరాజు గొప్పవాడు. దేశస్వాతంత్ర్య రక్షణకై బలిదానము చేసినవాడు. ఆయనకీర్తి 'పృథ్వీరాజరాసో' అనే చాంద్‌బర్దా యీ కృత ప్రాచీన హిందీకావ్యంవల్ల విశదమవుతున్నది.

కాన్యకుబ్జ యుగసంస్కృతి రాజపుత్రవంశములు గీర్వాణ సంస్కృతిని పోషించినవి. క్రీ. శ. 7 వ శతాబ్దిలో వామనాచార్యుల 'కాశికావృత్తి' అనే పాణినీయ వ్యాఖ్యానము ప్రసిద్ధ గ్రంథము. భర్తృహరి పాతంజల మహాభాష్యముపై వ్యాఖ్యానము చేసినాడు. ద్రావిడభాషా మూలకందమైన శరవర్మకృత 'కాతంత్ర వ్యాకరణము' దక్షిణాపథంనుంచీ మధ్యాసియా దాకా పఠనపాఠనాలలో ఉండేది.

హేమచంద్ర, పురుషోత్తమదేవ, యాదవభట్టుల నిఘంటువులు ప్రసిద్ధాలు.

న్యాయసూత్రాలపై ఉద్యోతకారుడు, మహాప్రతిభావంతుడైన వాచస్పతిమిశ్రుడు, ఉదయనాచార్యుల భాష్య రచనలు విద్వల్లోక విదితములు. జైనంమీద హేమచంద్రుని 'ప్రమాణమీమాంస', వాచస్పతిమిశ్రుల షడ్దర్శన భాష్యములూ వివరణలూ శాస్త్రరచనగా గొప్పవి. వాచస్పతిమిశ్రుడు తార్కికరసికుడు.

తత్వశాస్త్ర ప్రపంచమున ఆచార్య శంకరుల అద్వైత వేదాంత స్థాపనం చిరస్మరణీయం. ప్రస్థానత్రయంమీద శంకరుల భాష్యరచన తాత్త్వికంగానూ, సాహిత్యంగానూ లోకోత్తరం! రామానుజ మధ్వ నింబార్కాచార్యులు తమ తమ వాదాలను పురస్కరించుకొని భాష్యములు రచించినారు.

సాహిత్యము సాహిత్యశాస్త్రములో ఆనందవర్ధనాచార్యులవారి ధ్వన్యాలోకము విశిష్టగ్రంథము. కావ్యాత్మ రసధ్వనిగా చెప్పినాడు. వాచ్యార్థంకన్న ప్రతీయమానార్థము గొప్పది. శరీరంకన్న విలక్షణంగాభాసించే తరుణీ లావణ్యంవలె కావ్య శరీరంకన్న సహృదయ హృదయాహ్లాదం కలిగించే ధ్వని రమణీయం. ధ్వని సిద్ధాంతము సాహిత్యశాస్త్రంలో ఉత్తమోత్తమం. అభినవ గుప్తపాదులు ధ్వని సిద్ధాంతస్థాపన చేసినారు. రాజశేఖరుడు కావ్యమీమాంస అనే అలంకార శాస్త్రరచన చేసినాడు. అయితే ఆయన కవిగా చెప్పదగినవాడు. క్షేమేంద్రుడు 'ఔచిత్య విచారచర్చ' అనే చిన్న పుస్తకం వ్రాసినాడు. కావ్యాత్మ ఔచిత్యమని ఆయనమతం. అనౌచిత్యంవల్ల రసభంగం రసిక మానవులు తెలిసికోగలరు! అయితే సహృదయరసికుడు కావ్యనధూటీ విషయంలో ఔచిత్యం గ్రహించగలడు.

గద్యకావ్యములలో కాదంబరి మణిపూసవంటిది. భట్ట బాణుని అనుసరించిన కవులు చాలమంది ఉన్నారు. ధనపాలుని 'తిలకమంజరి' కాదంబరికి అనుకరణము. సరళమైన శైలిలో దండి దశకుమారచరితము రచించినాడు. పదలాలిత్యానికి బాణుని తరువాత దండి ప్రసిద్ధుడు. అవంతి సుందరీకథకూడా అతనిదే. దశకుమార చరితములో సమాజము బాగా ప్రతిఫలించింది. లోకవృత్తములోని మంచి చెడులు గ్రంథంలో ప్రస్ఫుటమైనవి. రచనలో వాస్తవికత ఉన్నది. సుబంధుని వాసవదత్త అనే గద్యకావ్యము చిన్నదైనా ప్రౌఢము. సుబంధువు 'ప్రత్యక్షరశ్లేష విన్యాస వైదగ్ధ్యనిధి' అని చెప్పకొన్నాడు. కొన్నిపుటలు చదివిన

మీాదట ఊపిరిసలపగా సూర్యోదయమో చంద్రోదయమో అవుతుంది. గుణాఢ్యుని బృహత్కథ ప్రసిద్ధము. మాతృక అలభ్యము. బుధస్వామి బృహత్కథాశ్లోక సంగ్రహము రచించినాడు. సోమదేవభట్ట 'కథాసరిత్సాగరము' అనే బృహత్గ్రంథము చేసినాడు. ఈ కథలలో నాటిసమాజము ప్రతిబింబించింది. కవులు చాలమంది ఇతివృత్తాలు కథా సరిత్సాగరమునుండి స్వీకరించినారు. నేనూ మాతండ్రిగారూ కలిసి కథాసరిత్సాగరమును సంపూర్ణంగా ఆంధ్రీకరించినాము. హితోపదేశము బాలసాహిత్యము.

కల్హణుని రాజతరంగిణి కాశ్మీర రాజచరిత్రము. చక్కనిశైలి కాని అతనిలో కవితాహృదయం ఉన్నది. అయితే కావ్యంగా రాజతరంగిణిని వాసికెక్కలేదు. కథనంలో నాటకీయత గోచరిస్తుంది.

కాన్యకుబ్జములో యశోవర్మ పేకోలగములో సంస్కృత కవిత వాసించింది. భవభూతి కరుణరస ప్రధానంగా ఉత్తర రామ చరితమనే నాటకమును రచించినాడు. మహావీర చరిత్రము, మాలతీమాధవములకన్న ఉత్తర రామచరిత్రలో కవీంద్రుని కవితాహృదయం అపారం. కాళిదాస భవభూతులే నిజానికి కవీశ్వరులు. వాల్మీకి తరువాత వీరిద్దరే మహా ప్రతిభానంతులు. ద్రష్టలు!

ఆత్మాశ్రయకవిత భర్తృహరి, బిల్హణుడు, అమరకుల రచనల్లో గోచరిస్తుంది. భర్తృహరి సుభాషిత త్రిశతి జగత్ప్రసిద్ధము. కవిత మధురము. విద్యాపతి బిరుదాంకితుడైన బిల్హణుడు చౌరీసురత పంచాశిక రచించినాడు. అనురాగ రసములోమునిగి మృత్యుభీతి మరచినకవి! కవితామాధు

ర్యమూ ప్రణయహృదయమూ రచనలో వాసించినవి. అమరుకుని శతకము ప్రసిద్ధము. అమరుకుని శ్లోకము ప్రబంధశతముతో సమానమని సూక్తికలదు. శృంగారరస వైచిత్రి అమరుశతకములో వెల్లివిరిసింది. అలంకారికులు ఉత్తమోత్తమ కవితకు తారకాణాలుగా అమరుకుని శ్లోకములు తమ శాస్త్రగ్రంథాలలో ఉట్టంకించినారు. శతకములో ధ్వని సౌందర్యము అపారము. తత్త్వదర్శిఅయిన సహృదయుడు అమరుకుని కవితాత్మను దర్శింపగలడు. దామోదరగుప్తుని కుట్టనీమతము ప్రసిద్ధముకాదు.

రూపకభేదాలైన భాణప్రహసనాలు కవులు రచించి నారు. నాటకమునకున్న పుష్టి వీనిలోలేదు.

కవితా శిల్పంతోపాటు దేవాలయశిల్పము కాన్యకుబ్జ యుగములో వాసికెక్కినది. ఖజరాహోలో మహాదేవ, విష్ణు, జగదంబాలయాలు దేహాలయ వాస్తుశిల్ప నైపుణికి తారకాణాలు. ఖజరాహోలో దేవమందిర శిఖర నిర్మాణములో ప్రత్యేకత దర్శనీయము. ఒరిస్సాలో దేవాలయశిల్పము విశిష్టమైనది. లింగరాజదేవళము రమణీయము. కోణార్కలో శిల్పి నైదిక భావనా ప్రేరితుడై సప్తాశ్వుడైన సూర్యుని రూపించి నాడు. శిల్పసౌందర్య మపారము. ఎల్లోరాలో ఆంధ్రశిల్పము మహోదాత్తము. వాస్తుశిల్పమును మించిపోయినది మూర్తి శిల్పము. తంజాపురిలో మధురలో దేవాలయ గోపుర నిర్మాణమున ప్రత్యేకతకలదు. దేవాలయ వాస్తుశిల్పము పరంకోటి ప్రాపించినది. ఎలిఫెంటాలో త్రిమూర్తిశిల్పములో అలౌకిక భావనాపారమ్యము, ఉదాత్తత గోచరమవుతవి.

సంపూర్ణము

HINDUYUGAM

BY

T. K. Thirthulu M.A., B.Ed.



Rs. 6-00

Check List

Book Number	NIPRO/Gr4/21	Date	14/04/23
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	Gr 1 477		
Missing Pages	NIL		
Prepared By	Hema	Cutting By	Hema
Scanned By	Swathi	Pages	489
Quality Checking	SWATHI		